సుందరకాండము

(తాత్పర్య సహితం)

శ్రీమద్వాల్మీకి రామాయణము

సుందరకాండము

[తాత్పర్య సహితం]

వ్యాఖ్యాత: **స్వామి జ్ఞానదానంద**

రామకృష్ణ మఠం

దోమలగూడ, హైదరాబాద్ – 500 029

© 2018 Ramakrishna Math, Hyderabad INDIA. All rights reserved.

Published by:

Adhyaksha

Ramakrishna Math

Domalguda, Hyderabad – 29

rkmath.org

e–Book

154v1.1.0

Date: 22 January, 2019

ISBN: 9789388512107

Created by: Sriranga Digital Software Technologies Private Limited

srirangadigital.com

ప్రకాశకుల విజ్ఞప్తి

ఆంధ్రుల ఆరాధ్య దైవం శ్రీరాముడు. ఆ శ్రీరాముని మహత్తర, పావన, ఆదర్శప్రాయమైన చరితాన్ని మహర్షి వాల్మీకి రామాయణం పేరిట అక్షరబద్ధం చేశారు. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధ కాండలుగా విభజింపబడిన ఇతిహాసం రామాయణం. ఏడవ కాండ అయిన ఉత్తరకాండ ప్రధాన ఇతిహాసానికి విడిగా అమరి ఉంది.

బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, యుద్ధ కాండలకు మహర్షి వాల్మీకి ఆ కాండల ఇతివృత్తాన్ని బట్టి లేదా ఆ కాండల ఇతివృత్తం జరిగిన ప్రదేశాన్ని బట్టి నామకరణం చేశారు. కాని సుందరకాండ విషయంలో ఆయన ఈ ధోరణిని పాటించినట్లు కనిపించడం లేదు. అదే ధోరణిలో ఈ సుందరకాండకు నామకరణం చేసి ఉంటే, దీనికి 'హనుమత్ కాండ' అని ఆయన పేరు పెట్టి ఉండాలి. అలా కాక 'సుందరకాండ' అని పేరు పెట్టడంలో ఆయన ఆంతర్యం ఏమిటో? ఆయన ఆంతర్యాన్ని మనం బహుశా ఇలా ఊహించుకోవచ్చు. 'సుందర' అంటే అందమైన అనేది ప్రధానమైన అర్థం. ఈ ఇతిహాస కావ్యంలో ప్రత్యేకించి ఈ కాండలో మహర్షి వాల్మీకి సాహితీ, కవితా వైదగ్ధ్యం పరాకాష్ఠను చేరినందున ఈ కాండకు రమ్యమైనది అనే అర్థం స్ఫురించే 'సుందరకాండ' అని పేరు పెట్టి ఉండవచ్చు అని మనం భావించవచ్చు.

సీతాదేవి శోకాలకు ఉపశమనం కలిగినందున కూడా ఈ కాండకు సుందర అనే నామం వర్తించడం సబబుగానే ఉంది. సుందర అంటే దూత అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. రామదూతగా హనుమంతుడు సీత వద్దకు

వెళ్ళడం ఈ అర్థాన్ని సమర్థిస్తుంది. సుందర అనే పదానికి వానరమనే అర్థం కూడా చెప్పుకోవచ్చు. వానరుడైన హనుమంతుని కార్యసాధన, కార్యసాఫల్యత ఈ కాండలో ఇమిడి ఉండడం వలన దీనిని 'సుందరకాండ' అని నామకరణ చేయడం సబబుగానే తోస్తున్నది. కొన్ని సందర్భాలలో కోల్పోయినది తిరిగి లభించడాన్ని కూడా సుందర అని అభివర్ణించడం కద్దు. ఈ కాండలో కనిపించకుండా పోయిన సీతాదేవి కనిపించడం ప్రధానాంశం కనుక ఆ పేరు సమంజసనీయం.

కేవలం సుందరకాండ పఠనాన్ని సమగ్ర రామాయణ పఠనంతో సమానంగా పరిగణిస్తారు. వేదాల సారాంశం ఉపనిషత్తులలో ఇమిడి ఉన్నట్లు, సుందరకాండ రామాయణానికి అంతరంగంగా అమరి ఉందని చెప్పవచ్చు.

హైందవుల విశ్వాసం ప్రకారం సుందరకాండ కేవలం ఒక రూపకం (కథా రూపక వివరణ) మాత్రమే కాదు; లౌకికపరమైన క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు సుందరకాండ పారాయణ ఆధ్యాత్మిక ఆలంబనం కల్పించి, మనశ్శాంతినిచ్చి పరిస్థితులను చక్కబరుస్తుందని గట్టి నమ్మకం. విశ్వాసంతో, చిత్తశుద్ధితో చేసే సుందరకాండ పారాయణ ఒక తపస్సాధన వంటిదనడంలో ఎటువంటి సందేహమూ లేదు. సుందరకాండ నిత్య పారాయణ ఫలితంగా మనిషి తను ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల నుండి ఉపశమనం పొందడమే కాక, ప్రాణాంతక వ్యాధుల నివారణకు, జీవితంలో అభ్యుదయం సాధించడానికి ఈ పారాయణ పరోక్షంగా దోహదం చేస్తుంది.

సుందరకాండ పఠించే ముందు సంప్రదాయ ప్రకారం బాలకాండలోని రామావతరణ ఘట్టాన్ని, తదుపరి సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని చదవడం ఆనవాయితీ; అట్లే సుందరకాండ పఠించడం పూర్తయ్యాక యుద్ధకాండలోని శ్రీరామపట్టాభిషేక ఘట్టాన్ని చదువుతారు. ఈ సంప్రదాయ పద్ధతికి తదనుగుణంగా రామావతార ఘట్టాన్ని, సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని

ప్రారంభంలోనూ, శ్రీరామపట్టాభిషేక ఘట్టాన్ని సుందరకాండ ముగింపులోను పొందుపరిచాము.

ఈ ఉద్గ్రంథ రచనలో, అచ్చు చిత్తుప్రతిని సరిదిద్దడంలో అంకితభావంతో సహకరించిన జె.సదాశివశర్మగారికి, నరేంద్రగారికి కృతజ్ఞతాపూర్వక అభివందనలు తెలుపుకొంటున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపాకటాక్షాలు వీరిపై వర్షించాలని ఆకాంక్షిస్తున్నాం.

శ్రీశారదాదేవి 160వ
జయంత్యుత్సవ పర్వదినం,
4–1–2013

ప్రార్థనా శ్లోకాలు

అదౌ శ్రీమహాగణపతిధ్యానమ్:

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్,
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే.

1

అగజాననపద్మార్కం గజానన మహర్నిశమ్,
అనేకదం తం భక్తానా మేకదంత ముపాస్మ హే.

2

వాగీశాద్యా స్సుమనస స్సర్వార్థనా ముపక్రమే,
యం నత్వా కృతకృత్యాః స్యు స్తం నమామి గజాననమ్.

3

సరస్వతీ ప్రార్థనా:

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే,
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి స్సన్నిధిం క్రియాత్.

యా కుందేందు తుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా,
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా

యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభి ర్దేవైః సదా పూజితా,
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా.

2

దోర్భి ర్యుక్తా చతుర్భి స్స్ఫటికమణిమయీ మక్షమాలాం దధానా
హస్తే నైకేన పద్మం సిత మపి చ శుకం పుస్తకం చాపరేణ,
భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభ ా భాసమానాఽసమానా

సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా.

3

వాల్మీకి నమస్క్రియా:

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.

1

వాల్మీకే ర్మునిసింహస్య కవితావనచారిణః,
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్.

2

యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్,
ఆతృప్త స్తం మునిం వందే ప్రాచేతస మకల్మషమ్.

3

ఆంజనేయ నమస్క్రియా:

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్,
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.

1

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్,
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరమ్.

2

అమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్,
తృణీకృతదశగ్రీవ మాంజనేయం నమా మ్యహమ్.

3

ఉల్లంఘ్య సింధో స్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః,
అదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్.

4

ఆంజనేయ మతిపాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహమ్,
పారిజాత తరుమూలవాసినం
భావయామి పవమాననందనమ్.

5

యత్ర యత్ర రఘునాథకీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్,
బాష్పవారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రాక్షసాంతకమ్.

6

మనోజవం మారుతతుల్య వేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్,
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి.

7

శ్రీరామాయణ ప్రార్థనా:

వాల్మీకిస్మృతిమందరేణ మథిత స్సీతారమాసంభవ
స్సుగ్రీవామరభూరుహోంగదగజ స్సౌమిత్రిచంద్రోదయః,
వాతోత్పన్నమణిర్విభీషణసుధః పౌలస్త్యహాలాహలః
శ్రీరామాయణ దుగ్ధసింధు రమలో భూయాత్సన శ్రేయసే.

1

యః కర్ణాంజలిసంపుటై రహ రహ స్సమ్య క్పిబ త్యాదరా
ద్వాల్మీకే ర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు,
జన్మవ్యాధిజరావిపత్తి మరణై రత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్.

2

తదుపగత సమాస సంధియోగం
సమ మధురోపనతార్థ వాక్యబద్ధమ్,
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్.

3

వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ
పునాతి భువనం పుణ్యా రామాయణమహానదీ.

4

శ్లోకసారసమాకీర్ణం సర్గ కల్లోల సంకులమ్,
కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్.

5

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా.

6

శ్రీరామధ్యానమ్:

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్,
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్.

1

వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రాసుతః
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదలయో ర్వాయ్వాదికోణేషు చ,
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవాన్
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్.

2

మాతా రామో మత్పితా రామభద్రో
భ్రాతా రామో మత్సఖా రాఘవేశః,

సర్వస్వం మే రామచంద్రో దయాళు
ర్నాన్యం దైవం నైవ జానే న జానే.

3

సాకేతే శరదిందుకుందధవళే సౌధే మహామండపే
పర్యస్తాగరుధూపదీపలలితే కర్పూరదీపోజ్జ్వలే,
సుగ్రీవాంగద జాంబవత్పరివృతం సౌమిత్రిణా సేవితం
లీలామానుషవిగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్.

4

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః.

5

శ్రీ గాయత్రీ రామాయణమ్

తప స్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరం,
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్.

1

స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః,
ఋషిభిః పూజితః సమ్య గ్యథేంద్రో విజయీ పురా.

2

విశ్వామిత్రస్స ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితం,
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవ మబ్రవీత్.

3

తుష్టావాస్య తదా వంశం ప్రవిశ్య స విశాంపతేః,
శయనీయం నరేంద్రస్య త దాసాద్య వ్యతిష్ఠత.

4

వనవాసం హి సంఖ్యాయ వాసాం స్యాభరణాని చ,
భర్తార మనుగచ్ఛంత్యై సీతాయై శ్వశురో దదౌ.

5

రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులం,
రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్.

6

నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుం,
ఉటజే రామ మాసీనం జటావల్కలధారిణమ్.

7

యది బుద్ధిః కృతా ద్రష్టు మగస్త్యం తం మహామునిం,
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహాయశః.

8

భరత స్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో,
మృగరూప మిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి.

9

గచ్ఛ శీఘ్ర మితో రామ సుగ్రీవం తం మహాబలమ్,
వయస్యం తం కురు క్షిప్ర మితో గత్వాఽద్య రాఘవ.

10

దేశకాలౌ ప్రతీక్షస్వ క్షమమాణః ప్రియాప్రియే,
సుఖదుఃఖసహః కాలే సుగ్రీవవశగో భవ.

11

వంద్యాస్తే తు తపస్సిద్ధా స్తపసా వీతకల్మషాః,
ప్రష్టవ్యా స్తేఽపి సీతాయాః ప్రవృత్తిం వినయాన్వితైః.

12

స విజిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్,
విక్రమేణ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః.

13

ధన్యా దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః,
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్.

14

మంగళాభిముఖీ తస్య సా తదాఽఽసీ న్మహాకపేః,
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్.

15

హితం మహార్థం మృదుహేతుసంహితం
వ్యతీతకాలాయతి సంప్రతి క్షమమ్,
నిశమ్య తద్వాక్య ముపస్థితజ్వరః
ప్రసంగవా నుత్తర మేత దబ్రవీత్.

16

ధర్మాత్మా రక్షసాం శ్రేష్ఠః సంప్రాప్తోఽయం విభీషణః,
లంకైశ్వర్యం ధ్రువం శ్రీమా నయం ప్రాప్నో త్యకంటకమ్.

17

యో వజ్రపాతాశనిసన్నిపాతా న్న చుక్షుభే నాపి చచాల రాజా,
స రామబాణాభిహతో భృశార్తశ్చాల చాపం చ ముమోచ వీరః.

18

యస్య విక్రమ మాసాద్య రాక్షసా నిధనం గతాః,
తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్.

19

న తే దదృశిరే రామం దహంత మరివాహినీం,
మోహితాః పరమాస్త్రేణ గాంధర్వేణ మహాత్మనా.

20

ప్రణమ్య దేవతాభ్యశ్చ బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ,
బద్ధాంజలిపుటా చేద మువా చాగ్ని సమీపతః.

21

చలనా త్పర్వతేంద్రస్య గణా దేవాశ్చ కంపితాః,
చచాల పార్వతీ చాపి తదాశ్లిష్టా మహేశ్వరమ్.

22

దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభాజనం,
సర్వమే వావిభక్తం నో భవిష్యతి హరీశ్వర.

23

యామేవ రాత్రిం శత్రుఘ్నుః పర్ణశాలాం సమావిశత్,
తామేవ రాత్రిం సీతాఒపి ప్రసూతా దారకద్వయమ్.

24

ఇదం రామాయణం కృత్స్నం గాయత్రీబీజసంయుతం,
త్రిసంధ్యం యః పఠే న్నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే.

25

యావ దావర్తతే చక్రం యావతీ చ వసుంధరా,
తావ ద్వర్షసహస్రాణి స్వామిత్వ మవధారయ.

26

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే,
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్.

శ్రీ గాయత్రీరామాయణం సంపూర్ణమ్

శ్రీరామావతార ఘట్టం

నిర్వృత్తే తు క్రతౌ తస్మిన్ హయమేధే మహాత్మనః
ప్రతిగృహ్య సురా భాగాన్ ప్రతిజగ్ము ర్యథాగతమ్.

1

సమాప్తదీక్షానియమః పత్నీగణసమన్వితః,
ప్రవివేశ పురీం రాజా సభృత్యబలవాహనః.

2

యథార్హం పూజితా స్తేన రాజ్ఞా వై పృథివీశ్వరాః,
ముదితాః ప్రయయు ర్దేశాన్ ప్రణమ్య మునిపుంగవమ్.

3

శ్రీమతాం గచ్ఛతాం తేషాం స్వపురాణి పురాత్తతః,
బలాని రాజ్ఞాం శుభ్రాణి ప్రహృష్టాని చకాశిరే.

4

గతేషు పృథివీశేషు రాజా దశరథ స్తదా,
ప్రవివేశ పురీం శ్రీమాన్ పురస్కృత్య ద్విజోత్తమాన్.

5

శాంతయా ప్రయాయౌ సార్ధ మృశ్యశృంగ స్సుపూజితః,
అన్వీయమానో రాజ్ఞాఽథ సానుయాత్రేణ ధీమతా.

6

ఏవం విసృజ్య తాన్ సర్వాన్ రాజా సంపూర్ణమానసః,
ఉవాస సుఖీత స్తత్ర పుత్రోత్పత్తిం విచింతయన్.

7

తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్ సమత్యయుః,
తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ.

8

నక్షత్రేఽదితిదై వత్యే స్వోచ్చసంస్థేషు పంచసు,
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ.

9

ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతమ్,
కౌసల్యాఽజనయ ద్రామం సర్వలక్షణసంయుతమ్.

10

విష్ణో ర్ధం మహాభాగం పుత్ర మైక్ష్వాకువర్ధనమ్,
కౌసల్యా శుశుభే తేన పుత్రే ణామితతేజసా.

11

యథా వరేణ దేవానా మదితి ర్వజ్రపాణినా,
భరతో నామ కైకేయ్యా జజ్ఞే సత్యపరాక్రమః.

12

సాక్షా ద్విష్ణో శ్చతుర్థాంశః సర్వైః సముదితో గుణైః,
అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాఽజనయత్ సుతౌ.

13

వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణో ర్ధసమన్వితౌ,
పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః.

14

సార్పే జాతౌ తు సౌమిత్రీ కులీరేఽభ్యుదితే రవౌ,
రాజ్ఞః పుత్రా మహాత్మాన శ్చత్వారో జజ్ఞిరే పృథక్.

15

గుణవంతోఽనురూపాశ్చ రుచ్యా ప్రోష్ఠపదోపమాః,
జగుః కలం చ గంధర్వా ననృతు శ్చాప్సరోగణాః.

16

దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖా చ్చ్యుతా,
ఉత్సవశ్చ మహా నాసీ దయోధ్యాయాం జనాకులః.

17

రథ్యాశ్చ జనసంబాధా నటనర్తకసంకులాః,

గాయనైశ్చ విరావిణ్యో వాదనైశ్చ తథాపరైః.

18

ప్రదేయాంశ్చ దదౌ రాజా సూతమాగధవందినామ్,
బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం గోధనాని సహస్రశః.

19

అతీ త్యైకాదశాహం తు నామకర్మ తథాఽకరోత్,
జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్.

20

సౌమిత్రిం లక్ష్మణ మితి శత్రుఘ్న మపరం తథా,
వసిష్ఠః పరమప్రీతో నామాని కృతవాం స్తదా.

21

బ్రాహ్మణాన్ భోజయామాస పౌరాన్ జానపదా నపి,
ఆదరాత్ బ్రాహ్మణానాం చ రత్నౌఘ మమితం బహు.

22

తేషాం జన్మక్రియాదీని సర్వకర్మా ణ్యకారయత్,
తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః.

23

బభూవ భూయో భూతానాం స్వయంభూ రివ సమ్మతః,
సర్వే వేదవిదః శూరాః సర్వే లోకహితే రతాః.

24

సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః,
తేషా మపి మహాతేజా రామ స్సత్యపరాక్రమః.

25

ఇష్ట స్సర్వస్య లోకస్య శశాంక ఇవ నిర్మలః,
గజస్కంధేఽశ్వపృష్ఠే చ రథచర్యాసు సమ్మతః.

26

ధనుర్వేదే చ నిరతః పితృశుశ్రూషణే రతః,
బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః.

27

రామస్య లోకరామస్య భ్రాతు ర్జ్యేష్ఠస్య నిత్యశః,
సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః.

28

లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః,
న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః.

29

మృష్ట మన్న ముపానీత మశ్నాతి న చ తం వినా,
యదా హి హయ మారూఢో మృగయాం యాతి రాఘవః.

30

తదైనం పృష్ఠతోఽన్వేతి సధనుః పరిపాలయన్,
భరత స్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః.

31

ప్రాణైః ప్రియతరో నిత్యం తస్య చాసీ త్తథా ప్రియః,
స చతుర్భి ర్మహాభాగైః పుత్రైర్దశరథః ప్రియైః.

32

బభూవ పరమప్రీతో దేవై రివ పితామహః,
తే యదా జ్ఞానసంపన్నాః సర్వైః సముదితా గుణైః.

33

హ్రీమంతః కీర్తిమంతశ్చ సర్వజ్ఞా దీర్ఘదర్శినః,
తేషా మేవంప్రభావానాం సర్వేషాం దీప్తతేజసామ్.

34

పితా దశరథో హృష్టో బ్రహ్మా లోకాధిపో యథా,
తే చాపి మనుజవ్యాఘ్రా వైదికాధ్యయనే రతాః.

35

పితృశుశ్రూషణరతా ధనుర్వేదే చ నిష్ఠితాః,
అథ రాజా దశరథ స్తేషాం దారక్రియాం ప్రతి.

36

చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాంధవః,
తస్య చింతయమానస్య మంత్రిమధ్యే మహాత్మనః.

37

అభ్యగచ్ఛ న్మహాతేజా విశ్వామిత్రో మహామునిః,
స రాజ్ఞో దర్శనాకాంక్షీ ద్వారాధ్యక్షా నువాచ హ

38

శీఘ్ర మాఖ్యాత మాం ప్రాప్తం కౌశికం గాధిన స్సుతమ్,
తచ్ఛ్రుత్వా వచనం త్రాసా ద్రాజ్ఞో వేశ్మ ప్రదుద్రువుః.

39

సంభ్రాంతమనసః సర్వే తేన వాక్యేన చోదితాః,
తే గత్వా రాజభవనం విశ్వామిత్ర మృషిం తదా.

40

ప్రాప్త మావేదయామాసు ర్నృపా యైక్ష్వాకవే తదా,
తేషాం తద్వచనం శ్రుత్వా సపురోధాః సమాహితః.

41

ప్రత్యుజ్జగామ సంహృష్టో బ్రహ్మాణ మివ వాసవః,
తం దృష్ట్వా జ్వలితం దీప్త్యా తాపసం సంశితవ్రతమ్.

42

ప్రహృష్టవదనో రాజా తతోఽర్ఘ్య ముపహారయత్,
స రాజ్ఞః ప్రతిగృహ్యార్ఘ్యం శాస్త్రదృష్టేన కర్మణా.

43

కుశలం చావ్యయం చైవ పర్యపృచ్ఛ న్నరాధిపమ్,

పురే కోశే జనపదే బాంధవేషు సుహృత్సు చ.

44

కుశలం కౌశికో రాజ్ఞః పర్యపృచ్ఛత్ సుధార్మికః,
అపి తే సన్నతాః సర్వే సామంతా రిపవో జితాః.

45

దైవం చ మానుషం చాపి కర్మ తే సాధ్వనుష్ఠితమ్,
వసిష్ఠం చ సమాగమ్య కుశలం మునిపుంగవః.

46

ఋషీంశ్చ తాన్ యథాన్యాయం మహాభాగా నువాచ హ,
తే సర్వే హృష్టమనస స్తస్య రాజ్ఞో నివేశనమ్.

47

వివిశుః పూజితా స్తత్ర నిషేదుశ్చ యథార్హతః,
అథ హృష్టమనా రాజా విశ్వామిత్రం మహామునిమ్.

48

ఉవాచ పరమోదారో హృష్ట స్త మభిపూజయన్,
యథాఽమృతస్య సంప్రాప్తి ర్యథా వర్ష మనూదకే.

49

యథా సదృశదారేషు పుత్రజన్మాఽప్రజస్య చ,
ప్రణష్టస్య యథా లాభో యథా హర్షో మహోదయే.

50

తథై వాగమనం మన్యే స్వాగతం తే మహామునే,
కం చ తే పరమం కామం కరోమి కిము హర్షితః.

51

పాత్రభూతోఽసి మే బ్రహ్మన్ దిష్ట్యా ప్రాప్తోఽసి కౌశిక,
అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్.

52

పూర్వం రాజర్షిశబ్దేన తపసా ద్యోతితప్రభః,
బ్రహ్మర్షిత్వ మనుప్రాప్తః పూజ్యోఽసి బహుధా మయా.

53

త దద్భుత మిదం బ్రహ్మన్ పవిత్రం పరమం మమ,
శుభక్షేత్రగత శ్చాహం తవ సందర్శనాత్ ప్రభో.

54

బ్రూహి యత్ ప్రార్థితం తుభ్యం కార్య మాగమనం ప్రతి,
ఇచ్ఛా మ్యనుగృహీతోఽహం త్వదర్థపరివృద్ధయే.

55

కార్యస్య న విమర్శం చ గంతు మర్హసి కౌశిక,
కర్తా చాహ మశేషేణ దైవతం హి భవాన్ మమ.

56

మమ చాయ మనుప్రాప్తో మహా నభ్యుదయో ద్విజ,
తవాగమనజః కృత్స్నో ధర్మ శ్చానుత్తమో మమ.

57

ఇతి హృదయసుఖం నిశమ్య వాక్యం
శ్రుతిసుఖ మాత్మవతా వినీత ముక్తమ్,
ప్రథితగుణయశా గుణై ర్విశిష్టః
పరమఋషిః పరమం జగామ హర్షమ్.

58

ఇత్యార్షే శ్రీమద్రామాయణే బాలకాండే అష్టాదశః సర్గః

శ్రీ సీతారామ కళ్యాణ ఘట్టం

యస్మింస్తు దివసే రాజా చక్రే గోదాన ముత్తమమ్,

తస్మింస్తు దివసే శూరో యుధాజిత్ సముపేయివాన్.

1

పుత్రః కేకయరాజస్య సాక్షాద్భరతమాతులః,
దృష్ట్వా పృష్ట్వా చ కుశలం రాజాన మిద మబ్రవీత్.

2

కేకయాధిపతీ రాజా స్నేహాత్ కుశల మబ్రవీత్,
యేషాం కుశలకామోఽసి తేషాం సంప్ర త్యనామయమ్.

3

స్వసీయం మను రాజేంద్ర ద్రష్టుకామో మహీపతిః,
తదర్థ ముపయాతోఽహ మయోధ్యాం రఘునందన.

4

శ్రుత్వా త్వహ మయోధ్యాయాం వివాహార్థం తవాత్మజాన్,
మిథిలా ముపయాతాంస్తు త్వయా సహ మహీపతే.

5

త్వరయాఽభ్యుపయాతోఽహం ద్రష్టుకామః స్వసు స్సుతమ్,
అథ రాజా దశరథః ప్రియాతిథి ముపస్థితమ్.

6

దృష్ట్వా పరమసత్కారైః పూజార్హం సమపూజయత్,
తత స్తౌ ముషితో రాత్రిం సహ పుత్రై ర్మహాత్మభిః.

7

ప్రభాతే పున రుత్థాయ కృత్వా కర్మాణి కర్మవిత్,
ఋషీం స్తదా పురస్కృత్య యజ్ఞవాట ముపాగమత్.

8

యుక్తేముహూర్తే విజయే సర్వాభరణభూషితైః,
భ్రాతృభిః సహితో రామః కృతకౌతుకమంగళః.

9

వసిష్ఠం పురతః కృత్వా మహర్షీ నపరానపి,
వసిష్ఠో భగవా నేత్య వై దేహ మిద మబ్రవీత్.

10

రాజా దశరథో రాజన్ కృతకౌతుకమంగళైః,
పుత్రైర్నరవరశ్రేష్ఠ దాతార మభికాంక్షతే.

11

దాతృప్రతిగ్రహీతృభ్యాం సర్వార్థాః ప్రభవంతి హి,
స్వధర్మం ప్రతిపద్యస్వ కృత్వా వైవాహ్య ముత్తమమ్.

12

ఇత్యుక్తః పరమోదారో వసిష్ఠేన మహాత్మనా,
ప్రత్యువాచ మహాతేజా వాక్యం పరమధర్మవిత్.

13

క స్ఫీతః ప్రతిహారో మే కస్యాజ్ఞా సంప్రతీక్ష్యతే,
స్వగృహే కో విచారోఽస్తి యథారాజ్య మిదం తవ.

14

కృతకౌతుకసర్వస్వా వేదిమూల ముపాగతాః,
మమ కన్యా మునిశ్రేష్ఠ దీప్తా వహ్నే దివార్చిషః.

15

సజ్జోఽహం త్వత్ప్రతీక్షోఽస్మి వేద్యా మస్యాం ప్రతిష్ఠితః,
అవిఘ్నం కురుతాం రాజన్ కిమర్థ మవలంబతే.

16

తతో రాజా విదేహానాం వసిష్ఠ మిద మబ్రవీత్,
కారయస్వ ఋషే సర్వ మృషిభిః సహ ధార్మిక.

17

రామస్య లోకరామస్య క్రియాం వై వాహికీం విభో,
తథే త్యుక్త్వా తు జనకం వసిష్ఠో భగవా నృషిః.

18

విశ్వామిత్రం పురస్కృత్య శతానందం చ ధార్మికమ్,
ప్రపామధ్యే తు విధివ ద్వేదిం కృత్వా మహాతపాః.

19

అలంచకార తాం వేదిం గంధపుష్పై స్సమంతతః,
సువర్ణపాలికాభిశ్చ ఛిద్రకుంభై శ్చ సాంకురైః.

20

అంకురాఢ్యై శ్శరావై శ్చ ధూపపాత్రై స్సధూపకైః,
శంఖపాత్రైః స్రువైః స్రుగ్భిః పాత్రై రర్ఘ్యాభిపూరితైః.

21

లాజపూర్ణైశ్చ పాత్రీభి రక్షతై రభిసంస్కృతైః,
దర్భై స్సమై స్సమా స్తీర్య విధివ న్మంత్రపూర్వకమ్.

22

అగ్ని మాధాయ వేద్యాం తు విధిమంత్ర పురస్కృతమ్,
జుహో వాగ్నౌ మహాతేజా వసిష్ఠో భగవా నృషిః.

23

తత స్సీతాం సమానీయ సర్వాభరణభూషితామ్,
సమక్ష మగ్నే స్సంస్థాప్య రామవాభిముఖే తదా.

24

ఆబ్రవీ జ్జనకో రాజా కౌసల్యానందవర్ధనమ్,
ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ.

25

ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా,
పతివ్రతా మహాభాగా ఛాయే వానుగతా సదా.

26

ఇత్యుక్త్వా ప్రాక్షిప ద్రాజా మంత్రపూతం జలం తదా,

సాధు సాధ్వితి దేవానా మృషీణాం వదతాం తదా.

27

దేవదుందుభినిర్ఘోషః పుష్పవర్షో మహా నభూత్,
ఏవం దత్త్వా తదా సీతాం మంత్రోదకపురస్కృతామ్.

28

అబ్రవీ జ్జనకో రాజా హర్షే ణాభిపరిప్లుతః,
లక్ష్మ ణాగచ్ఛ భద్రం తే ఊర్మిళా ముద్యతాం మయా.

29

ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మా భూత్ కాలస్య పర్యయః,
త మేవ ముక్త్వా జనకో భరతం చాభ్యభాషత.

30

గృహాణ పాణిం మాండవ్యాః పాణినా రఘునందన,
శత్రుఘ్నం చాపి ధర్మాత్మా అబ్రవీ జ్జనకేశ్వరః.

31

శ్రుతకీర్త్యా మహాబాహో పాణిం గృహ్ణీష్వ పాణినా,
సర్వే భవంతః సౌమ్యాశ్చ సర్వే సుచరితవ్రతాః.

32

పత్నీభి స్సంతు కాకుత్థ్సా మా భూత్ కాలస్య పర్యయః,
జనకన్య వచః శ్రుత్వా పాణీన్ పాణిభి రస్పృశన్.

33

చత్వార స్తే చతసృణాం వసిష్ఠస్య మతే స్థితాః,
అగ్నిం ప్రదక్షిణీకృత్య వేదిం రాజాన మేవ చ.

34

ఋషీం శ్చైవ మహాత్మాన స్సభార్యా రఘుసత్తమాః,
యథోక్తేన తదా చక్రు ర్వివాహం విధిపూర్వకమ్.

35

పుష్పవృష్టి ర్మహ త్యాసీ దంతరిక్షాత్ సుభాస్వరా,
దివ్యదుందుభి నిర్ఘోష ర్గీతవాదిత్రనిస్వనైః.

36

ననృతు శ్చాప్సరస్సంఘా గంధర్వాశ్చ జగుః కలమ్,
వివాహే రఘుముఖ్యానాం తదద్భుత మదృశ్యత.

37

ఈదృశే వర్తమానే తు తూర్యోద్ఘుష్టనినాదితే,
త్రి రగ్నిం తే పరిక్రమ్య ఊహు ర్భార్యాం మహౌజసః.

38

అథోపకార్యాం జగ్ము స్తే సభార్యా రఘునందనాః,
రాజా ప్యనుయయౌ పశ్యన్ సర్షిసంఘ స్సబాంధవః.

39

ఇత్యార్షే శ్రీమద్రామాయణే బాలకాండే త్రిసప్తతితమః సర్గః

1వ సర్గ

హనుమంతుడి సముద్ర లంఘనం

తతో రావణనీతాయా స్సీతాయా శ్శత్రుకర్శనః,
ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి.

1

దుష్కరం నిష్ప్రతిద్వన్ద్వం చికీర్షన్ కర్మ వానరః,
సముదగ్రశిరోగ్రీవో గవాంపతి రివాబభౌ.

2

అథ వైదూర్యవర్ణేషు శాద్వలేషు మహాబలః,
ధీరః సలిలకల్పేషు విచచార యథాసుఖమ్.

3

జాంబవంతాదులు ప్రోత్సహించగా శత్రువులను రూపుమాప సమర్థుడైన హనుమంతుడు, రావణుడు అపహరించిన సీతాదేవిని వెతకడానికి, చారణులు మొదలైన దేవతలు సంచరించే ఆకాశమార్గంలో పయనింప నిశ్చయించు కొన్నాడు.

1

అన్యులకు శక్యంకాని కార్యం నిర్వర్తింప సంకల్పించుకొన్న హనుమంతుడు ఎటువంటి అడ్డంకులూ లేనివాడై, తలను పైకెత్తి, మెడను చాచి అబోతు చందాన విరాజిల్లాడు.

2

పిదప ధీరుడూ, మహాబలశాలీ అయిన హనుమంతుడు వైదూర్య మణులలా ఆకుపచ్చ రంగుతో, దూరానికి నీటిని పోలిన పచ్చికబీళ్ల మీద సుఖంగా కాసేపు పచార్లు చేశాడు.

3

ద్విజాన్ విత్రాసయన్ ధీమానురసా పాదపాన్ హరన్
మృగాంశ్చ సుబహూ నిఘ్నన్ ప్రవృద్ధ ఇవ కేసరీ.

4

నీలలోహితమాంజిష్ఠపత్రవర్ణై స్సితాసితైః,
స్వభావవిహితై శ్చిత్రై ర్ధాతుభి స్సమలంకృతమ్.

5

కామరూపిభి రావిష్ట మభీక్ష్ణం సపరిచ్ఛదైః,
యక్షకిన్నరగంధర్వై ర్దేవకల్పైశ్చ పన్నగైః.

6

స తస్య గిరివర్యస్య తలే నాగవరాయుతే,
తిష్ఠన్ కపివర స్తత్ర హ్రదే నాగ ఇవాబభౌ.

7

స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే,
భూతేభ్య శ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్.

8

ధీమంతుడైన హనుమంతుడు అమిత వేగంగా సంచరిస్తూన్నప్పుడు పక్షులన్నీ భయపడ్డాయి. ఆతడి ఛాతీ తాకిడులకు చెట్లు కూలిపోయాయి. సింహంలా ఆతడు విజృంభించడంతో అనేక మృగాలుకూడా హతమైనాయి.

4

ఆ మహేంద్రగిరి ప్రాంతం యావత్తు నలుపు, తెలుపు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ ఇత్యాది రంగులుగల సహజాలైన ధాతువులతో సుందరంగా అలరారుతూన్నది. ఆ ప్రాంతంలో ఇచ్ఛమేరకు రూపాలు ధరించగల యక్షులు, కిన్నరులు, గంధర్వులు, దేవతలకు దీటైన పన్నగులు పరివారసమేతంగా వసిస్తూ ఉన్నారు.

5–6

ఆ గిరిశ్రేష్ఠం దిగువ ప్రాంతాన శ్రేష్ఠములైన అనేక ఏనుగులు సంచరిస్తూన్నవి. ఆ మహేంద్రగిరిపై నిలబడ్డ ఆ హనుమంతుడు సరస్సులోని మదగజంలా ప్రకాశించసాగాడు.

7

సూర్యుడికి, మహేంద్రుడికి, వాయుదేవుడికి, బ్రహ్మదేవుడికి, భూతములకు నమస్కరించి హనుమంతుడు బయలుదేరడానికి సంకల్పించు కొన్నాడు.

8

అంజలిం ప్రాఙ్ముఖం కుర్వన్ పవనా యాత్మయోనయే,
తతోఽభివవృధే గంతుం దక్షిణో దక్షిణాం దిశమ్.

9

ప్రవంగప్రవరై ర్దృష్టః ప్లవనే కృతనిశ్చయః,
వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు.

10

నిష్క్రమాణశరీర స్సన్ లిలంఘయిషు ర్ణవమ్
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్.

11

స చచా లాచల శ్చాపి ముహూర్తం కపిపీడితః,
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్ప మశాతయత్.

12

తేన పాదపముక్తేన పుష్పౌఘేణ సుగంధినా,
సర్వత స్సంవృత శ్శైలో బభౌ పుష్పమయో యథా.

13

హనుమంతుడు తూర్పు దిక్కుగా తిరిగి, తన తండ్రియైన వాయుదేవుడికి మరొకసారి నమస్కరించి, సమర్థు డవడంచేత దక్షిణ దిశగా వెళ్లడానికి తన దేహాన్ని పెంచాడు.

9

వానరవీరులు తనను చూస్తూ ఉండగా సముద్రాన్ని లంఘింప నిశ్చయించిన వాడైన హనుమంతుడు, శ్రీరాముని అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ పూర్ణిమాపర్వంలో సముద్రం పొంగేటట్లు తన శరీరాన్ని పెంచాడు.

10

సముద్రాన్ని లంఘించాలనే కృతనిశ్చయంతో హనుమంతుడు కొలవడానికి సాధ్యంకానంతగా దేహాన్ని పెంచి చేతులతోను, పాదాలతోను ఆ పర్వతాన్ని నొక్కిపట్టాడు.

11

ఆ పర్వతరాజం అచలమైనదే అయినప్పటికీ, హనుమంతుడు నొక్కిపట్టడం వలన ఒక్కక్షణం చలించింది. అలా చలించడంతో ఆ పర్వతం పైనున్న చెట్లకు విరియబూసిన పువ్వులన్నీ రాలిపడ్డాయి.

12

పరిమళించే పుష్పరాశులు ఆ చెట్లనుండి రాలి, పర్వతం అంతటా కప్పివేయడంతో, అప్పుడు ఆ మహేంద్రగిరి పువ్వుల కొండలా ఒప్పారింది.

13

తేన చోత్తమవీర్యేణ పీడ్యమాన స్స పర్వతః,
సలిలం సంపసుస్రావ మదం మత్త ఇవ ద్విపః.

14

పీడ్యమానస్తు బలినా మహేన్ద్రస్తేన పర్వతః,
రీతీ ర్నిర్యర్తయామాస కాంచనాంజనరాజతీః.

15

ముమోచ చ శిలా శ్శైలో విశాలా స్సమనః శిలాః,
మధ్యమే నార్చిషా జుష్టో ధూమరాజీ రివానలః.

16

గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వతః,
గుహావిష్టాని భూతాని వినేదు ర్వికృతైః స్వరైః.

17

స మహాసత్త్వసన్నాద శ్శైలపీడానిమిత్తజః,
పృథివీం పూరయామాస దిశ శ్శోపవనాని చ.

18

మహాపరాక్రమవంతుడైన హనుమంతుడు ఆ రీతిలో నొక్కిపట్టగా, మదగజం మదోదకాన్ని స్రవించినట్లు, ఆ పర్వతం మిక్కుటంగా నీటిని స్రవించింది.

14

మహాబలశాలియైన హనుమంతుడు పీడించడం వలన, ఆ మహేంద్రగిరిలోని బంగారు శిలలు, నీలములు, వెండి శిలలు పగిలి ఆయా లోహాల రేఖలు మెరిశాయి.

15

సప్తజ్వాలలలో మధ్యదియైన ధూమ్రవర్ణ అనే జ్వాలతో కూడిన అగ్ని నుండి పొగ వెలువడునట్లు, ఆ మహేంద్రపర్వతం మణిశిలలతో కూడిన మహాశిలలను విరజిమ్మింది.

16

హనుమంతుడు ఆ విధంగా మహేంద్ర పర్వతాన్ని నొక్కిపట్టగా, ఆ పర్వత గుహలలో వసిస్తూన్న ప్రాణులు అన్నివైపులా నలిగిపోతూ, వికృత స్వరాలతో బిగ్గరగా ఆక్రందించాయి.

17

ఆ పర్వతం నలిగిపోవడం వలన పెద్దపెద్ద జంతువులు చేసిన ఆ ఆక్రందనలు భూమినీ, దిక్కులనూ, సమీపారణ్యాలనూ ప్రతిధ్వనింపచేశాయి.

18

శిరోభిః పృథుభి స్సర్పా వ్యక్తస్వస్తికలక్షణైః,
వమంతః పావకం ఘోరం దదంశు ర్దశనై శ్శిలాః.

19

తా స్తదా సవిషై ర్దష్టాః కుపితై స్తై ర్మహాశిలాః,
జజ్వలుః పాపకోద్దీప్తా బిభిదుశ్చ సహస్రధా.

20

యాని చౌషధజాలాని తస్మిన్ జాతాని పర్వతే,
విషఘ్నా న్యపి నాగానాం న శేకు శ్శమితుం విషమ్.

21

భిద్యతేఽయం గిరి ర్భూతై రితి మత్వా తపస్వినః,
త్రస్తా విద్యాధరా స్తస్మా దుత్పేతుః స్త్రీగణై స్సహ.

22

పానభూమిగతం హిత్వా హైమ మాసవభాజనమ్
పాత్రాణి చ మహార్హాణి కరకాంశ్చ హిరణ్మయాన్.

23

లేహ్యా నుచ్చావచాన్ భక్ష్యాన్ మాంసాని వివిధాని చ,
ఆర్షభాణి చ చర్మాణి ఖడ్గాంశ్చ కనకత్సరూన్.

24

తమ విస్తారమైన పడగలు విప్పడంచే వాటిమీద నల్లని స్వస్తిక చిహ్నాలు స్పష్టంగా కనబడుతూవున్న పెద్ద శిరస్సుల నుండి సర్పములు అగ్నిజ్వాల వంటభయంకర విషాన్ని గ్రక్కుతూ కోరలతో శిలలను కరచాయి.

19

విషసర్పాలు కోపించి శిలలను కరవగా, అవి విషాగ్నిజ్వాలలచే దగ్ధాలై, వేలాది ముక్కలుగా బ్రద్దలైపోయాయి.

20

ఆ మహేంద్ర పర్వతం మీద మొలచిన విషసంహారకాలైన ఓషధులు ఎన్ని ఉన్నప్పటికీ, ఆ సర్పాల విషాన్ని శమింపచేయలేకపోయాయి.

21

భూతాలు ఆ పర్వతాన్ని బ్రద్దలుకొట్టివేస్తున్నాయనుకొని మునులు ఆ పర్వతాన్ని వీడి ఆకాశంలోకి ఎగిరిపోయారు. అప్పటి వరకు తమ స్త్రీలతో కలసి మద్యం గ్రోలుతూ, రుచికరమైన భక్ష్యాలు ఆరగిస్తూవున్న విద్యాధరులు పానభూమిపై ఉన్న

బంగారు మద్య పాత్రలను, అమూల్యాలైన భోజన పాత్రలను, (మద్యంగ్రోలు) పొడవైన బంగారు చిన్న పాత్రలను, నానావిధ లేహ్యాలను, భక్ష్యాలను, మాంసాలను, నేలమీద పరచుకొన్న ఎద్దు చర్మాలను, బంగారు పిడుల కత్తులను అక్కడే విడిచిపెట్టి తమ ప్రియాంగనలతో సహా ఆ పర్వతాన్ని విడిచి ఆకాశాని కెగిరిపోయారు.

22–24

కృతకంఠగుణాః క్షీబా రక్తమాల్యానులేపనాః,
రక్తాక్షాః పుష్కరాక్షాశ్చ గగనం ప్రతిపేదిరే.

25

హారనూపురకేయూరపారిహార్యధరాః స్త్రియః,
విస్మితా స్సస్మితా స్తస్థు రాకాశే రమణైః సహ.

26

దర్శయంతో మహావిద్యాం విద్యాధరమహర్షయః,
సహితా స్తస్థు రాకాశే వీక్షాంచక్రుశ్చ పర్వతమ్.

27

శుశ్రువుశ్చ తదా శబ్ద మృషీణాం భావితాత్మనామ్
చారణానాం చ సిద్ధానాం స్థితానాం విమలేఒంబరే.

28

కంఠాన బంగారు త్రాళ్లూ, శిరమున ఎర్రని పువ్వులమాలలు ధరించి, దేహానికి చందనం అలది, సహజంగా పద్మాలవంటివీ మద్యపానంతో మరింత ఎర్రబారినవీ అయిన కళ్ళుగల విద్యాధరులు ఆకాశంలోకి రివ్వున ఎగిరిపోయారు.

25

హారాలు, అందియలు, బాహుపురులు, కంకణాలు ధరించిన విద్యాధర స్త్రీలు విస్మితలై, చిరునవ్వులు చిందిస్తూ ఆకాశంలో నిలబడ్డారు.

26

అణిమాద్యష్ట సిద్ధులు సంతరించుకొన్న విద్యాధరులు, మహర్షులు ఆధార రహితంగా ఆకాశంలో నిలబడగల తమ మహాశక్తిని ప్రదర్శిస్తూ, ఆకాశంలో ఒక్క చోట నిలబడి, ఆ పర్వతాన్ని చూశారు.

27

అప్పుడు వారికి నిర్మలాకాశంలో నిలబడివున్న చారణులు, సిద్ధులు, పరిశుద్ధ మనస్కులైన ఋషులు పలికిన వచనాలు వినవచ్చాయి.

28

ఏష పర్వతసంకాశో హనుమాన్ మారుతాత్మజః,
తితీర్షతి మహావేగ స్సముద్రం మకరాలయమ్.

29

రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తుమిచ్ఛతి.

30

ఇతి విద్యాధరాః శ్రుత్వా వచ స్తేషాం మహాత్మనామ్

త మప్రమేయం దదృశుః పర్వతే వానరర్షభమ్.

31

దుధువే చ స రోమాణి చకంపే చాచలోపమః,
ననాద సుమహానాదం సుమహానివ తోయదః.

32

అనుపూర్వ్యేణ వృత్తం చ లాంగూలం లోమభి శ్చితమ్
ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్.

33

పర్వత సమానుడూ, మహావేగవంతుడూ, వాయుపుత్రుడూ అయిన ఈ హనుమంతుడు మొసళ్లకు ఆలవాలమైన సముద్రాన్ని దాటగోరుతున్నాడు.

29

ఇతడు రాముని కోసమూ, వానరుల కోసమూ, అన్యులు ఎవరూ సాధించలేని కార్యం నిర్వర్తింప సంకల్పించి, దాట శక్యంగాని సముద్రందాటి ఆవలి ఒడ్డు చేరగోరుతున్నాడు.

30

మహాత్ములైన వారు పలుకుతున్న ఆ వచనాలు ఆలకించి, ఆ పర్వతం మీద సాటిలేని ఆకారం దాల్చి నిలబడి ఉన్న హనుమంతుణ్ణి, విద్యాధరులు చూశారు.

31

పర్వతం వంటి శరీరం దాల్చిన ఆ హనుమంతుడు తన మేని రోమములను విదల్చాడు; శరీరాన్ని కంపింపచేశాడు; మహామేఘంలా గర్జించాడు.

32

ఆకాశంలోకి ఎగురబోతున్న ఆ హనుమంతుడు మొదట లావుగాను, చివరికి పోనుపోను సన్నగా ఉన్నదీ, వెంట్రుకలతో నిండివున్నదీ అయిన తన తోకను, గరుత్మంతుడు సర్పాన్ని పట్టి గిరగిర త్రిప్పినట్లు త్రిప్పాడు.

33

తస్య లాంగూల మావిద్ధ మాత్తవేగస్య పృష్ఠతః,
దదృశే గరుడేనేవ ప్రియమాణో మహోరగః.

34

బాహూ సంస్తంభయామాస మహాపరిఘసన్నిభౌ,
ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ.

35

సంహృత్య చ భుజౌ శ్రీమాన్ తథైవ చ శిరోధరామ్
తేజః సత్త్వం తథా వీర్య మావివేశ స వీర్యవాన్.

36.

మార్గ మాలోకయన్ దూరా దూర్ధ్వం ప్రణిహితేక్షణః,
రురోధ హృదయే ప్రాణా నాకాశ మవలోకయన్.

37

పద్భ్యాం దృఢ మవస్థానం కృత్వా స కపికుంజరః,
నికుంచ్య కర్ణౌ హనుమా నుత్పతిష్యన్ మహాబలః,
వానరాన్ వానరశ్రేష్ఠ ఇదం వచన మబ్రవీత్.

38

మహావేగం పుంజుకోబోతున్న ఆ హనుమంతుడి వెనుక భాగాన వంకరగా ఒప్పారుతున్న తోక, గరుత్మంతుడు పట్టి తీసుకుపోతున్న మహాసర్పం చందాన ఉంది.

34

హనుమంతుడు గొప్ప పరిఘలాంటి తన బాహువులను బిగబట్టి, నడుమును సన్నం చేసి, పాదాలను ఎగురడానికి తయారుగా మడిచిపెట్టాడు.

35

శోభాయమానుడూ, పరాక్రమశాలీ అయిన హనుమంతుడు తన బాహువులను, మెడను వంచి, తనలో సహజసిద్ధంగా గోప్యంగా ఉన్న తేజస్సును, బలాన్ని, వీర్యాన్ని పెంపొందించుకొన్నాడు.

36

కళ్ళను పైకెత్తి దూరంగా ఉన్న, తాను పయనించవలసిన ఆకాశమార్గం వైపు చూస్తూ, ఊపిరిని బిగపట్టాడు.

37

వానరులలో గజం వంటివాడూ, మహాబలుడూ, కపిశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు పాదాలతో దృఢంగా పర్వతాన్ని అదిమిపెట్టి, చెవులు వంచి, ఎగురబోతూ సమీపంలోని వానరులతో ఇలా వచించాడు.

38

యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః,
గచ్ఛే త్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితామ్.

39

న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్.

40

యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యా మ్యకృతశ్రమః,
బద్ధ్వా రాక్షసరాజాన మానయిష్యామి రావణమ్.

41

సర్వథా కృతకార్యోఽహ మేష్యామి సహ సీతయా,
ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్.

42

ఏవ ముక్త్వా తు హనుమాన్ వానరాన్ వానరోత్తమః,
ఉత్పపా తాథ వేగేన వేగవా నవిచారయన్.

43

సువర్ణ మివ చాత్మానం మేనే స కపికుంజరః.

44

శ్రీరాముడు ప్రయోగించిన బాణంలా నేను వాయువేగంతో రావణుడు పాలించే లంకకు వెళతాను.

39

లంకలో సీతాదేవి కనిపించని పక్షంలో, ఇదే వేగంతో దేవలోకానికి వెళతాను.

40

దేవలోకంలో సైతం సీత కనిపించకపోతే, ఏమాత్రం శ్రమ చెందక రావణుణ్ణి బంధించి తీసుకువస్తాను.

41

అన్నివిధాల ప్రయత్నించి కార్యం సాధించే నేను, సీతతో తిరిగివస్తాను. కాకుంటే రావణుడితో సహా లంకనే పెకలించి ఇక్కడకు తెస్తాను.

42

వానరశ్రేష్ఠుడూ, మహావేగవంతుడూ అయిన హనుమంతుడు ఆ వానరులతో ఇలా వచించి, మరే విషయం గూర్చీ ఆలోచింపక, వేగంగా పైకి ఎగిరాడు. అలా ఎగురుతూ ఆతడు వాయుమార్గంలో ప్రయాణించడంలో తనను గరుత్మంతునికి దీటైన వాడనని భావించాడు.

43–44

సముత్పతతి తస్మిం స్తు వేగా త్తే నగరోహిణః,
సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతు స్సమంతతః.

45

స మత్తకోయష్టిభకాన్ పాదపాన్ పుష్పశాలినః,
ఉద్వహ న్నూరువేగేన జగామ విమలేఽంబరే.

46

ఊరువేగోద్ధతా వృక్షా ముహూర్తం కపి మన్వయుః,
ప్రస్థితం దీర్ఘ మధ్వానం స్వబంధు మివ బాంధవాః.

47

త మూరువేగోన్మథితా స్సాలా శ్చాన్యే నగోత్తమాః,
అనుజగ్ము ర్హనూమంతం సైన్యా ఇవ మహీపతిమ్.

48

సుపుష్పితాగ్రై ర్బహుభిః పాదపై రన్వితః కపిః,
హనుమాన్ పర్వతాకారో బభూ వాద్భుతదర్శనః.

49

హనుమంతుడు అలా ఎగురుతూండగా ఆ వేగానికి ఆ పర్వతంపై మొలచిన వృక్షాలన్నీ తమ కొమ్మలను ముడుచుకొని నలువంకలా పైకి ఎరిగిపోయాయి.

45

మదించిన చీకుకొక్కెర అనే పక్షులు వసిస్తూవున్న, విరబూసిన పుష్పాలుగల వృక్షాలను తన తొడల వేగంచేత పెకలించి, తనతో పైకెగరచేస్తూ నిర్మలాకాశాన ఆ హనుమంతుడు పయనించాడు.

46

హనుమంతుడి ఊరువుల వేగంచేత పైకి ఎగురగొట్టబడిన చెట్లు, దూర ప్రయాణానికి పోతున్న తమ బంధువును

సాగనంప వచ్చిన బంధువులలా కాసేపు అతణ్ణి అనుసరించాయి.

47

ఊరువుల వేగంచేత పెకలించివేయబడ్డ మద్దిచెట్లు, తదితర మహావృక్షాలు, రాజును అనుసరించి వెళ్ళే సైన్యాలలా హనుమంతుని అనుసరించి వెళ్లాయి.

48

విరబూసిన అనేక వృక్షాలు చుట్టూ చేరడంచేత, వాటి మధ్యనున్న హనుమంతుడు, దట్టంగా పెరిగిన చెట్లుగల మహాపర్వతంలా అద్భుతరూపంతో అగపడ్డాడు.

49

సారవంతోఽథ యే వృక్షా న్యమజ్జన్ లవణాంభసి,
భయా దివ మహేంద్రస్య పర్వతా వరుణాలయే.

50

స నానాకుసుమైః కీర్ణః కపి స్సాంకురకోరకైః,
శుశుభే మేఘసంకాశః ఖద్యోతైరివ పర్వతః.

51

విముక్తా స్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః,
అవశీర్యంత సలిలే నివృత్తాః సుహృదో యథా.

52

లఘుత్వే నోపపన్నం త ద్విచిత్రం సాగరేఽవతత్
ద్రుమాణాం వివిధం పుష్పం కపివాయుసమీరితమ్.

53

తారాశత మివాకాశం ప్రబభౌ స మహార్ణవః.

54

దేవేంద్రుడికి భయపడి పర్వతాలు సముద్రంలో మునిగిపోయినట్లుగా, చేవగల వృక్షాలు లవణ సముద్రంలో పడి మునిగిపోయాయి.

50

మేఘంలా ఉన్న హనుమంతుడి మేనిపై నానావిధ పుష్పాలు, మొగ్గలు పడడంచేత అతడు అప్పుడు మిణుగురు పురుగులు ఆవరించిన పర్వతంలా భాసించాడు.

51

హనుమంతుడి వేగం క్రమంగా పెరిగి అతడు దూరం కావడంతో, మిత్రుణ్ణి సాగనంప కొంతదూరం వెళ్ళిన స్నేహితులు వెనక్కు మరలినట్లు ఆ చెట్లు ఆతడిపై పుష్పాలు కురిపించి నీటిలో పడిపోయాయి.

52

హనుమంతుడి వేగంచేత పైకెగసిన తేలిక, విచిత్రమైన రంగులతో ఉన్న ఆ నానావిధ పుష్పసముదాయం చెట్లనుండి రాలి సముద్రంలో పడింది. అప్పుడు ఆ సముద్రం నక్షత్రాలతో కూడిన ఆకాశంలా ప్రకాశించింది.

53–54

పుష్పౌఘ ణానుబద్ధేన నానావర్ణేన వానరః,

బభౌ మేఘ ఇవాకాశే విద్యుద్గణవిభూషితః.

55

తస్య వేగసమాధూతైః పుష్పై స్తోయ మదృశ్యత,
తారాభి రభిరామాభి రుదితాభి రివాంబరమ్.

56

తస్యాంబరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ,
పర్వతాగ్రా ద్వినిష్క్రాంతౌ పంచాస్యావివ పన్నగౌ.

57

పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్
పిపాసు రివ చాకాశం దదృశే స మహాకపిః.

58

తస్య విద్యుత్ప్రభాకారే వాయుమార్గానుసారిణః,
నయనే విప్రకాశేతే పర్వతస్థావివానలౌ.

59

అనేకమైన రంగురంగుల పుష్పాలు మేనిని కప్పివేయడంచేత ఆ హనుమంతుడు, ఆకాశాన మెరుపుతీగల సమూహంతో ఒప్పారే మేఘంలా ప్రకాశించాడు.

55

హనుమంతుని వేగం వలన పైకి ఎగసిన పుష్పాలు సముద్రంలో పడగా, ఆ సముద్రం ఉదయించిన సుందరమైన నక్షత్రాలతో కూడిన ఆకాశంలా శోభించింది.

56

ఆకాశం కేసి చాచిన హనుమంతుడి బాహువులు, పర్వత శిఖరంనుండి చొచ్చుకువస్తూన్న రెండు ఐదు తలల సర్పాలలా కనిపించాయి.

57

మహాకపివరేణ్యుడైన ఆ హనుమంతుడు తరంగ పంక్తులతో కూడుకొన్న మహాసాగరాన్ని తాగ్రివేస్తున్నాడా అన్నట్లు భాసిల్లాడు; సముద్రానికి దూరంలో సంచరిస్తూన్నప్పుడు ఆకాశాన్ని కబళించివేస్తున్నాడా అన్నట్లు కనిపించాడు.

58

ఆకాశ మార్గాన అలా వెళుతూన్న ఆ హనుమంతుడి కళ్ళు మెరుపు కాంతులతో ఒప్పారుతూ పర్వతం మీద రెండు నిప్పు నెగళ్లలా ప్రకాశిస్తూన్నాయి.

59

పింగే పింగాక్షముఖ్యస్య బృహతీ పరిమండలే,
చక్షుషీ సంప్రకాశేతే చంద్రసూర్యా వివోదితౌ.

60

ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్ర మాబభౌ,
సంధ్యయా సమభిస్పృష్టం యథా తత్ సూర్యమండలమ్.

61

లాంగూలం చ సమావిద్ధం ప్లవమానస్య శోభతే,
అంబరే వాయుపుత్రస్య శక్రధ్వజ ఇవోచ్ఛ్రితః.

62

లాంగూలచక్రేణ మహాన్ శుక్లదంష్ట్రోఽనిలాత్మజః,
వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః.

63

స్నిగ్ధేశే నాతితామ్రేణ రరాజ స మహాకపిః,
మహతా దారితేనేవ గిరి ర్గైరికధాతునా.

64

వానరశ్రేష్ఠుడైన హనుమంతుడి పెద్దపెద్ద గుండ్రని, పచ్చని కళ్ళు ఉదయించిన చంద్రసూర్యులలా ప్రకాశించసాగాయి.

60

ఎర్రనైన ముక్కు కాంతిచే ఎర్రబారిన హనుమంతుని ముఖారవిందం, సంధ్యారాగం ఆవరించిన సూర్యబింబంలా ప్రకాశించసాగింది.

61

ఆకాశంలో ఎగిరిపోతూవున్న హనుమంతుడి వాలం మహోన్నతంగా నిలిచినదై, ఎత్తైన ఇంద్రధ్వజంలా అలరారింది.

62

తెల్లని కోరలు, గొప్ప దేహము గలవాడూ, మహాబుద్ధిశాలీ అయిన ఆ హనుమంతుడు, తోక చక్రాకారంగా ఏర్పడినందున గూడుకట్టిన సూర్యునిలా శోభిల్లాడు.

63

ఎర్రని పెద్ద పిరుదులతో ఆ హనుమంతుడు రెండు ఖండాలుగా చేయబడిన, గైరికధాతువుతో కూడుకొన్న పర్వతంలా ఒప్పారాడు.

64

తస్య వానరసింహస్య ప్లవమానస్య సాగరమ్
కక్షాంతరగతో వాయు ర్జీమూత ఇవ గర్జతి.

65

ఖే యథా నిపతం త్యుల్కా హ్యుత్తరాంతా ద్వినిస్సృతా,
దృశ్యతే సానుబంధా చ తథా స కపికుంజరః.

66

పతత్పతంగసంకాశో వ్యాయత శ్శుశుభే కపిః,
ప్రవృద్ధ ఇవ మాతంగః కక్షయా బధ్యమానయా.

67

ఉపరిష్టా చ్ఛరీరేణ ఛాయయా చావగాఢయా,
సాగరే మారుతావిష్టా నౌ రివాఽఽసీ త్తదా కపిః.

68

యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః,

స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే.

69

ఆ విధంగా సముద్రాన్ని లంఘిస్తూవున్న వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడి చంకల సందుగుండా ప్రసరిస్తూవున్న వాయువు చేసే శబ్దం మేఘగర్జితంలా ఉంది.

65

ఉత్తర దిక్కున ఉదయించి ఆకాశమార్గాన దక్షిణ దిక్కుకు పోయే ఉల్కలా ఆ కపిశ్రేష్ఠుడు కానవచ్చాడు.

66

ఆకాశంలో శ్రీఘ్రగమనం చేస్తూన్న సూర్యుడిలా ఉన్న ఆ హనుమంతుడు, కట్టివేయబడడం వలన నిడివిగా సాగుతున్న ఏనుగులా గోచరించాడు.

67

అప్పుడు హనుమంతుడి శరీరం సముద్రం పైనున్న ఆకాశంలోను ఉంది; ఆతడి నీడ సముద్ర ఉపరితలపై ఉంది. ఆ విధంగా ఉన్న హనుమంతుడు గాలికి కదలిపోతున్న ఓడలా కనిపించాడు.

68

ఆ కపిశ్రేష్ఠుడు ఏఏ ప్రాంతాలను గమిస్తూన్నాడో ఆయా ప్రాంతాలు ఆతడి తొడల వేగంచేత చలిస్తూ, ఉన్మాదం చెందినట్లు గోచరించసాగాయి.

69

సాగర స్యోర్మిజాలానా మురసా శైలవర్ష్మణామ్
అభిఘ్నం స్తు మహావేగః పుప్లువే స మహాకపిః.

70

కపివాత శ్చ బలవాన్ మేఘవాత శ్చ నిస్సృతః,
సాగరం భీమనిర్ఘోషం కంపయామాసతు ర్బృశమ్.

71

వికర్ష న్నుర్మిజాలాని బృహంతి లవణాంభసి,
పుప్లువే కపిశార్దూలో వికిరన్నివ రోదసీ.

72

మేరుమందరసంకాశా నుద్ధతాన్ స మహార్ణవే,
అతిక్రామన్ మహావేగ స్తరంగాన్ గణయ న్నివ.

73

తస్య వేగసముద్ధూతం జలం సజలదం తదా,
అంబరస్థం విబభ్రాజ శారదాభ్ర మివాతతమ్.

74

మహావేగవంతుడైన ఆ హనుమంతుడు, కొండంత ఎత్తుకు లేచిపడుతున్న సముద్ర తరంగ సముదాయాలను తన వక్షస్థ్సలంతో ఢీకొని, ఎగురసాగాడు.

70

మహాబలవంతుడైన హనుమంతుడి వలన జనించిన గాలి, మేఘాల గాలి కలిసి భయంకరమైన ధ్వనిని కలిగిస్తూ

సముద్రాన్ని కంపింపచేశాయి.

71

లవణ సముద్రంలోని పెద్దపెద్ద అలలను తనతో లాక్కొనిపోతూ భూమ్యాకాశాల మధ్య వాటిని విరజిమ్ముతూన్నట్లుగా హనుమంతుడు ఎగురుతున్నాడు.

72

ఆ మహాసముద్రంలో లేస్తూన్న మేరుమందర పర్వతాలకు దీటైన తరంగాలను మహావేగవంతుడైన హనుమంతుడు లెక్కిస్తున్నాడా అన్నట్లుగా వాటిని గమించిపోతున్నాడు.

73

అప్పుడు ఆ హనుమంతుడి వేగం వలన పైకి ఎగసిన జలం మేఘాలతోకూడి, ఆకాశంలో వ్యాపించిన శరత్కాలపు మేఘంలా భాసిల్లింది.

74

తిమినక్రఝషాः కూర్మా దృశ్యంతే వివృతా స్తదా,
వస్త్రాపకర్షణే నేవ శరీరాణి శరీరిణామ్.

75

ప్లవమానం సమీక్ష్యాథ భుజంగా స్సాగరాలయాः,
వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే.

76

దశయోజనవిస్తీర్ణా త్రింశద్యోజన మాయతా,
ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽఽభవత్.

77

శ్వేతాభ్రఘనరాజీవ వాయుపుత్రానుగామినీ,
తస్య సా శుశుభే ఛాయా వితతా లవణాంభసి.

78

శుశుభే స మహాతేజా మహాకాయో మహాకపిः,
వాయుమార్గే నిరాలంబే పక్షవానివ పర్వతः.

79

సముద్ర జలం అంతా పైకి ఎగయడం వలన దాని అడుగున ఉన్న తిమింగలాలు, మొసళ్ళు, చేపలు, తాబేళ్ళు వస్త్రాలను తొలగించి వేయగా స్పష్టంగా కనిపించే మానవుల అవయవాలలా కానవచ్చాయి.

75

సముద్రంలో వసిస్తూవున్న సర్పాలు, ఆకాశంలో ఎగురుతున్న ఆ హనుమంతుణ్ణి చూసి గరుత్మంతుడని భ్రమించాయి.

76

హనుమంతుడి నీడ ముప్పై యోజనాలు పొడమా, పది యోజనాలు వెడల్పూ గలదై సముద్ర జలం మీద మనోహరంగా కనబడసాగింది.

77

హనుమంతుణ్ణి అనుసరించి సముద్రం మీద విస్తరించి సాగిపోతున్న ఆ నీడ దట్టమైన తెల్లని మేఘ సముదాయంలా ప్రకాశించసాగింది.

78

ఏ ఆధారమూ లేకుండా ఆకాశమార్గంలో పోతున్న మహాతేజస్వీ, మహాకాయుడూ అయిన హనుమంతుడు రెక్కల పర్వతంలా భాసిల్లాడు.

79

యేనాఽసౌ యాతి బలవాన్ వేగేన కపికుంజరః,
తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః.

80

ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ ప్రజన్
హనుమాన్ మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా.

81

పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ,
కపినాఽఽకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే.

82

ప్రవిశ న్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే.

83

ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవంగం త్వరితం తదా,
వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః.

84

మహాబలవంతుడైన ఆ హనుమంతుడు ఏ మార్గంలో పోతున్నాడో ఆ మార్గంలో సముద్రం తొట్టెలా ఏర్పడసాగింది.

80

హనుమంతుడు వాయువులా మేఘశ్రేణిని తనతో లాక్కొని ఆకాశ మార్గంలో పోతూ గరుత్మంతుడిలా శోభిల్లాడు.

81

తెలుపు, ఎరుపు, నలుపు, ఆకుపచ్చ రంగులలోని విస్తృత మేఘాలను హనుమంతుడు తనతో లాక్కొని పోతూవుంటే ఆ దృశ్యం చూడముచ్చట గొలిపింది.

82

పదేపదే మేఘాల వెనుకకు పోతూ, బయటకు వస్తూ ఎగురుతూవున్న హనుమంతుడు మేఘాల మాటున దాగి, పైకి కనిపిస్తూవున్న చంద్రుడిలా దీపించాడు.

83

ఆ సమయంలో వేగంగా ఎగిరి వెళుతూన్న హనుమంతుణ్ణి చూసి దేవతలూ, గంధర్వులూ, దానవులూ అతడిపై పుష్పవర్షం కురిపించారు.

84

తతాప న హి తం సూర్యః ప్లవంతం వానరోత్తమమ్

నిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే.

85

ఋషయ స్తుష్టువు శ్చైనం ప్లవమానం విహాయసా,
జగుశ్చ దేవగంధర్వాః ప్రశంసంతో మహౌజసమ్.

86

నాగాశ్చ తుష్టువు ర్యక్షా రక్షాంసి విబుధాః ఖగాః,
ప్రేక్ష్య సర్వే కపివరం సహసా విగతక్లమమ్.

87

తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి,
ఇక్ష్వాకుకులమానార్థీ చింతయామాస సాగరః.

88

సాహాయ్యం వానరేంద్రస్య యది నాహం హనూమతః,
కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో విపక్షతామ్.

89

రామకార్యం సిద్ధించాలనే ఉద్దేశంతో సాగరాన్ని లంఘిస్తూన్న హనుమంతుడికి సూర్యుడు వేడిమి కలుగకుండేటట్లు చూశాడు; వాయువు కూడా చల్లగా వీచి అతణ్ణి సేవించింది.

85

గగనమార్గంలో పయనిస్తూవున్న తేజోవంతుడైన ఆ హనుమంతుణ్ణి చూసి ఋషులు స్తుతించారు. దేవతలూ, గంధర్వులూ అతణ్ణి ప్రశంసిస్తూ గానం చేశారు.

86

కించిత్తుకూడా శ్రమపడకుండా గగనపథంలో సాగిపోతున్న హనుమంతుణ్ణి చూడగానే ఆశ్చర్యపోతూ నాగులూ, యక్షులూ, రాక్షసులూ, దేవతలూ, పక్షులూ కొనియాడసాగారు.

87

కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు ఆ రీతిలో గగనసీమన ఎగురుతూ ఉండడం చూసి సముద్రుడు ఇక్ష్వాకు వంశాన్ని గౌరవింప కోరినవాడై ఇలా తలపోశాడు.

88

వానరేంద్రుడైన మారుతికి ఇప్పుడు నేను సహాయం చేయకపోతే జనుల దృష్టిలో నేను నిందార్హుడ నవుతాను.

89

అహ మిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః,
ఇక్ష్వాకుసచివ శ్చాయం నావసీదితు మర్హతి.

90

తథా మయా విధాతవ్యం విశ్రమేత యథా కపిః,
శేషం చ మయి విశ్రాంత స్సుఖీ నాతిపతిష్యతి.

91

ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్ర శ్చన్న మంభసి,

హిరణ్యనాభం మైనాక మువాచ గిరిసత్తమమ్.

92

త్వ మిహాసురసంఘానాం పాతాళతలవాసినామ్
దేవరాజ్ఞా గిరిశ్రేష్ఠ పరిఘ స్సన్నివేశితః.

93

త్వ మేషాం జ్ఞాతవీర్యాణాం పునరే వోత్పతిష్యతామ్
పాతాళ స్యాప్రమేయస్య ద్వార మావృత్య తిష్ఠసి.

94

ఇక్ష్వాకు వంశస్థుడైన సగర చక్రవర్తి నన్ను పెంపొందించాడు కదా! అదే ఇక్ష్వాకు వంశానికి చెందిన రాముడికి తోడ్పడుతున్న ఈ హనుమంతుడు అలసటతో డస్సిపోరాదు.

90

ఏదో విధంగా కొంతసేపు విశ్రమించేటట్లు హనుమంతునకు నేను తోడ్పడాలి. విశ్రాంతి తీసుకొన్న తరువాత మిగిలిన దూరాన్ని అలుపులేకుండా అతడు దాటగలుగుతాడు.

91

సముద్రుడు ఈ విధంగా చక్కగా ఆలోచించి తనలో (సముద్ర జలాలలో) మునిగి దాగివున్న, మధ్యప్రదేశమంతటా బంగారంతో నిండిన మైనాకమనే పర్వతేంద్రునితో ఇలా అన్నాడు.

92

ఓ గిరిశ్రేష్ఠుడా! పాతాళవాసులైన రాక్షసులు (భూమి) పైకి రాకుండా అడ్డుకోవడానికై దేవేంద్రుడు నిన్నిక్కడ ఒక పెద్ద అడ్డగడియగా కాపుంచాడు.

93

పరాక్రమం ఇనుమడించుకొని మళ్లీ పైకి రాబోయే ఆ రాక్షసులను నివారిస్తూ అతి పెద్దదైన పాతాళలోక ద్వారాన్ని నువ్వు మూసివేసి నిలబడ్డావు.

94

తిర్య గూర్ధ్వ మధ శ్చైవ శక్తి స్తే శైల వర్ధితుమ్
తస్మాత్ సంచోదయామి త్వా ముత్తిష్ఠ గిరిసత్తమ.

95

స ఏష కపిశార్దూల స్త్వా ముపర్యేతి వీర్యవాన్
హనుమాన్ రామకార్యార్థం భీమకర్మా ఖ మాప్లుతః.

96

అస్య సాహ్యం మయా కార్యమిక్ష్వాకుకులవర్తినః,
మమ హీక్ష్వాకవః పూజ్యాః పరం పూజ్యతమా స్తవ.

97

కురు సాచివ్య మస్మాకం న నః కార్య మతిక్రమేత్
కర్తవ్య మకృతం కార్యం సతాం మన్యు ముదీరయేత్.

98

సలిలా దూర్ధ్వ ముత్తిష్ఠ తిష్ఠ త్వేష కపి స్త్వయి,
అస్మాక మతిథి శ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః.

99

ఓ గిరీంద్రమా! అడ్డంగానూ, పైకీ, క్రిందికీ పెరిగే శక్తి నీకు ఉంది. కాబట్టే నిన్ను ప్రోత్సహిస్తున్నాను. లేచి నిలబడు.

95

వానరశ్రేష్ఠుడూ, అందరికీ భీతిగొల్పే గొప్ప కార్యాలు చేయగలవాడూ, పరాక్రమవంతుడూ అయిన ఈ హనుమంతుడు రామకార్యం సాధింప నీ మీదుగా ఆకామార్గంలో ఎగురుతూ వస్తున్నాడు.

96

ఇక్ష్వాకు వంశస్థుడైన రాముణ్ణి సేవిస్తూన్న ఈ హనుమంతుడికి నేను సహాయం చేయాలి. ఇక్ష్వాకువంశీయులు నాకు పరమపూజ్యులు. నీకూ ఎంతో పూజనీయులు.

97

మాకు తోడ్పడు. పని మించిపోకముందే మాకు సహాయపడు. చేయవలసిన పని చేయకుంటే సత్పురుషులు కోపిస్తారు.

98

మనకు పూజ్యుడైన అతిథీ, ఆకాశమార్గాన ఎగరగలిగేవారిలో శ్రేష్ఠుడూ ఈ హనుమంతుడు. కనుక నువ్వు నీటినుండి పైకి లేచి రా.

99

చామీకరమహానాభ దేవగన్ధర్వ సేవిత,
హనుమాం స్త్వయి విశ్రాన్త స్తతఃశేషం గమిష్యతి.

100

కాకుత్థ్సస్యానృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్
శ్రమం చ ప్లవగేన్ద్రస్య సమీక్ష్యోత్థాతు మర్హసి.

101

హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణామ్భసః,
ఉత్పపాత జలాత్తూర్ణం మహాద్రుమలతాయుతః.

102

స సాగరజలం భిత్త్వా బభూ వాభ్యుత్థిత స్తదా,
యథా జలధరం భిత్త్వా దీప్తరశ్మి ర్దివాకరః.

103

స మహాత్మా ముహూర్తేన సర్వతః సలిలావృతః,
దర్శయామాస శృఙ్గాణి సాగరేణ నియోజిత.

104

శాతకుమ్భమయైః శృఙ్గైః సకిన్నరమహోరగైః,
ఆదిత్యోదయసంకాశై రాలిఖద్భి రివామ్బరమ్.

105

విశాలమైన బంగారుమయ మధ్యప్రదేశం గలవాడమా, దేవగంధర్వాదులచే సేవింపబడేవాడమా అయిన ఓ మైనాకుడా! తక్కిన ప్రయాణాన్ని సుగమంగా చేయడానికై నీ మీద కొంతసేపు హనుమంతుడు విశ్రమిస్తాడు.

100

రాముని ఉత్తమ స్వభావాన్ని, సీత పరదేశవాసాన్ని, హనుమంతుడి శ్రమను దృష్టిలో ఉంచుకొని నువ్వు పైకి రావాలి.

101

మధ్యభాగంలో బంగారం గల ఆ మైనాక పర్వతం, సముద్రుడి వచనాలు విని మహావృక్షాలతో, లతలతో సహా వెంటనే సముద్రజలాల నుండి పైకి లేచింది.

102

ప్రకాశమానమైన కిరణాలు గల సూర్యుడు మేఘసముదాయాన్ని ఛేదించుకొని వస్తూవున్నట్లు, అప్పుడు ఆ మైనాక పర్వతం సముద్ర జలాలను ఛేదించుకొని పైకి వచ్చింది.

103

మహాత్ముడైన మైనాకుణ్ణి, సముద్రుడు అలా నిర్దేశించగానే అతడు తన శిఖరాలను ప్రదర్శిస్తూ సముద్ర జలాలనుండి పైకి వచ్చాడు. ఆకాశాన్ని స్పృశిస్తూన్నట్లున్న ఆ బంగారు శిఖరాలు ఉదయకాల సూర్యునిలా ప్రకాశించసాగాయి. ఆ శిఖరాలు కిన్నరులు, ఉరగులు మొదలైన వారికి ఆవాసమై ఉంది.

104–105

తప్తజామ్బూనదైః శృఙ్గైః పర్వతస్య సముత్థితైః,
ఆకాశం శస్త్రసంకాశ మభవత్కాఞ్చనప్రభమ్.

106

జాతరూపమయైః శృఙ్గైర్భ్రాజమానైః స్వయంప్రభైః,
ఆదిత్యశతసంకాశః సోఽభవ ద్గిరిసత్తమః.

107

తముత్థిత మసంగేన హనుమానగ్రతః స్థితమ్
మధ్యేలవణతోయస్య విఘ్నోఽయమితి నిశ్చితః.

108

స తముచ్ఛ్రితమత్యర్థం మహావేగో మహాకపిః,
ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః.

109

సముద్రజలాలనుండి పైకి లేచిన ఆ శిఖరాలు కరిగించిన బంగారంలా మెరుస్తూ ఉండడం వలన, ఇనుములాంటి నల్లని ఆకాశం బంగారు కాంతిని సంతరించుకొంది.

106

సహజమైన కాంతితో విరాజమానమూ, కనకమయమూ అయిన శిఖరాలచే ఆ మైనాకపర్వతం నూరుమంది సూర్యులు ఏకకాలంలో ఉదయించినట్లు ప్రకాశించింది.

107

తన ముందు హఠాత్తుగా సముద్రంనుండి లేచి నిలచిన ఆ పర్వతం తనకు విఘ్నం కలిగింప వచ్చిందని హనుమంతుడు నిశ్చయించుకొన్నాడు.

108

మహావేగవంతుడైన ఆ హనుమంతుడు, ఎంతో పైపైకి పెరిగిన ఆ పర్వతాన్ని, వాయువు మేఘాన్ని చెదరగొట్టినట్లు, తన వక్షస్థ్సలంతో ధీకొని అలవోకగా క్రిందికి పడగొట్టాడు.

109

స తథా పాతితస్తేన కపినా పర్వతోత్తమః,
బుద్ధ్వా తస్య కపే ర్వేగం జహర్ష చ ననన్ద చ.

110

త మాకాశగతం వీరమాకాశే సముపస్థితః,
ప్రీతో హృష్టమనా వాక్య మబ్రవీ త్పర్వతః కపిమ్
మానుషం ధారయన్ రూపమాత్మనః శిఖరే స్థితః.

111

దుష్కరం కృతవాస్కర్మ త్వమిదం వానరోత్తమ,
నిపత్య మమ శృఙ్గేషు విశ్రమస్వ యథాసుఖమ్.

112

రాఘవస్య కులే జాతైరుదధిః పరివర్ధితః,
స త్వాం రామహితే యుక్తం ప్రత్యర్చయతి సాగరః.

113

కృతే చ ప్రతికర్తవ్య మేష ధర్మః సనాతనః,
సోఽయం త్వత్ప్రతికారార్థీ త్వత్తః సంమానమర్హతి.

114

ఆ విధంగా పడగొట్టగా పర్వతశ్రేష్ఠుడైన మైనాకుడు, హనుమంతుని వేగాన్ని గుర్తించి, పులకించిపోయాడు.

110

అప్పుడు ఆ మైనాకుడు ఎంతో ప్రీతుడై, సంతుష్టుడై మానవరూపం దాల్చి తన శిఖరాల మీద నిలబడి, ఆకాశంలో పోతున్న హనుమంతుని దరిచేరి ఇలా పలికాడు.

111

ఓ వానరేంద్రా! ఎవరికీ శక్యంకాని ఈ కార్యం చేశావు. కనుక నా శిఖరాల మీద సుఖంగా విశ్రమించు.

112

రఘువంశ రాజుల వలననే సముద్రం వృద్ధి గాంచింది. కాబట్టి ఈ సముద్రుడు రాముని హితార్థం పయనిస్తూవున్న నీ ద్వారా వారికి ప్రతిపూజ చేయగోరుతున్నాడు.

113

ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయడం సనాతన ధర్మం. కనుక నీకు సహాయం చేయడం మూలంగా రఘువంశీయులకు ప్రత్యుపకారం చేయాలనుకొన్న ఈ సముద్రుడు నీ గౌరవానికి పాత్రుడు.

114

త్వన్నిమిత్త మనేనాహం బహుమానాత్ప్రచోదితః,
యోజనానాం శతం చాపి కపి రేష సమాప్లుతః.

115

తవ సానుషు విశ్రాన్తః శేషం ప్రక్రమతా మితి,
తిష్ఠ త్వం కపిశార్దూల మయి విశ్రమ్య గమ్యతామ్.

116

తదిదం గన్ధవత్స్వాదు కన్దమూలఫలం బహు,
తదాస్వాద్య హరిశ్రేష్ఠ విశ్రాన్తోఽను గమిష్యసి.

117

అస్మాకమపి సమ్బన్ధః కపిముఖ్య త్వయాస్తి వై,
ప్రఖ్యాతస్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః.

118

వేగవన్తః ప్లవన్తో యే ప్లవగా మారుతాత్మజ,
తేషాం ముఖ్యతమం మన్యే త్వామహం కపికుఞ్జర.

119

"ఈ హనుమంతుడు నూరు యోజనాల దూరం లంఘింప ఉద్యమించాడు. నీ చరియలపై కొంతసేపు విశ్రమించి, ఆ తరువాత మిగిలిన దూరం దాటుతాడు" అని ఈ సముద్రుడు నీ పట్ల గల గౌరవంతో నన్ను ప్రేరేపించాడు. అందుచేత ఓ వానరశ్రేష్ఠా! నా మీద కొంతసేపు విశ్రమించి, వెళ్ళు.

115–116

ఓ వానరశ్రేష్ఠా! ఇక్కడున్న మంచి రుచీ, వాసనాగల కందమూల ఫలాదులు ఆరగించి, కొంతసేపు విశ్రమించి, ఆ తరువాత పయనం కొనసాగించు.

117

ఓ కపిశ్రేష్ఠా! మాకూ సద్గుణాల కారణంగా నీతో ఏర్పడిన ఇచ్చిపుచ్చుకొనే సత్సంబంధం ఒకటి లేకపోలేదు. అది ముల్లోకాలలోనూ ప్రసిద్ధమైనది.

118

ఓ వాయుపుత్రా! వానరశ్రేష్ఠా! మహావేగంతో ఆకాశంలో ఎగురగల వానరులలో నువ్వు అద్వితీయుడవని నేను తలచుచున్నాను.

119

అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా,
ధర్మం జిజ్ఞాసమానేన కిం పున స్త్వాదృశో మహాన్.

120

త్వం హి దేవవరిష్ఠస్య మారుతస్య మహాత్మనః,
పుత్ర స్తస్యైవ వేగేన సదృశః కపికుఞ్జర.

121

పూజితే త్వయి ధర్మజ్ఞ పూజాం ప్రాప్నోతి మారుతః,
తస్మాత్త్వం పూజనీయో మే శృణు చాప్యత్ర కారణమ్.

122

పూర్వం కృతయుగే తాత పర్వతాః పక్షిణోఽభవన్,
తే హి జగ్ముర్దిశః సర్వా గరుడానిలవేగినః.

123

తతస్తేషు ప్రయాతేషు దేవసంఘాః సహర్షిభిః,
భూతాని చ భయం జగ్ముస్తేషాం పతనశఙ్కయా.

124

ధర్మం తెలుసుకోనెంచినవారు, తెలిసినవారు కూడా వచ్చిన అతిథిని, అతడు సామాన్యుడే అయినప్పటికీ, పూజించాలి. అటువంటప్పుడు నీ అంతటి మహాత్ముడు అతిథిగా ఏతెంచినప్పుడు వేరే చెప్పాలా?

120

ఓ వానరశ్రేష్ఠా! నువ్వు మహాత్ముడూ, దేవతలలో శ్రేష్ఠుడూ అయిన వాయుదేవుని కుమారుడవు. వేగంలో ఆయనకు దీటైన వాడవు.

121

ఓ ధర్మజ్ఞుడా! నిన్ను పూజిస్తే నీ తండ్రియైన వాయుదేవుణ్ణే పూజించినట్లవుతుంది. కాబట్టే నాకు నువ్వు పూజనీయుడవు. ఇందుకు మరో కారణం కూడా ఉంది. చెబుతాను విను.

122

నాయనా! పూర్వం ఒకప్పుడు కృతయుగంలో పర్వతాలకు రెక్కలు ఉండేవి. అందుచేత అవి గరుత్మంతునిలా, వాయువేగం గలవై సకల దిక్కులకూ ఎగురుతూ ఉండేవి.

123

ఆ పర్వతాలు ఆ విధంగా ఎగురుతూ ఉండగా దేవతలూ, మహర్షులూ, ఇతర ప్రాణులూ అవి ఎక్కడ తమ మీద పడతాయోనని శంకించి భయపడుతూ ఉండేవారు.

124

తతః క్రుద్ధః సహస్రాక్షః పర్వతానాం శతక్రతుః,
పక్షాం శ్చిచ్ఛేద వజ్రేణ తత్ర తత్ర సహస్రశః.

125

స మాముపాగతః క్రుద్ధో వజ్రముద్యమ్య దేవరాట్
తతోఽహం సహసా క్షిప్తః శ్వసనేన మహాత్మనా.

126

అస్మిన్లవణతోయే చ ప్రక్షిప్తః ప్లవగోత్తమ,
గుప్తపక్షసమగ్రశ్చ తవ పిత్రాభిరక్షితః.

127

తతోఽహం మానయామి త్వాం మాన్యో హి మమ మారుతః,
త్వయా మే హ్యేష సంబన్ధః కపిముఖ్య మహాగుణః.

128

అస్మిన్నేవం గతే కార్యే సాగరస్య మమైవ చ,
ప్రీతిం ప్రీతమనాః కర్తుం త్వ మర్హసి మహాకపే.

129

అప్పుడు నూరు యజ్ఞాలు నిర్వర్తించిన దేవేంద్రుడు కోపించి, ఎక్కడి కక్కడే పర్వతాలకున్న రెక్కలను తన వజ్రాయుధంతో తెగనరికాడు.

125

కోపించిన అమరేంద్రుడు వజ్రాయుధాన్ని చేతబుచ్చుకొని నా రెక్కలను ఖండింప వచ్చాడు. ఆ సమయంలో మహాత్ముడైన వాయుదేవుడు వేగంగా నన్ను సుదూరానికి తీసుకొనిపోయాడు.

126

ఓ వానరోత్తమా! ఈ విధంగా నీ తండ్రియైన వాయుదేవుడు అలా నన్ను తీసుకుపోయి ఈ లవణసముద్రంలో పడవేసి, చెక్కుచెదరకుండా నన్ను రక్షించాడు.

127

ఓ కపిశ్రేష్ఠా! నాకు ఆ విధంగా సహాయం చేసిన వాయుదేవుడు నాకు మాననీయుడు. అందువలన నిన్ను గౌరవిస్తున్నాను. నీకూ నాకూ మధ్య కలిగిన ఈ సంబంధం ఉత్తమ గుణాలనుబట్టి ఏర్పడింది.

128

ఓ వానరశ్రేష్ఠా! జరిగిన సంఘటన ఇది. ఈ పరిస్థితులలో నువ్వు మా ఆతిథ్యం స్వీకరించి నాకూ, సముద్రునికీ ఆనందం కలిగించు.

129

శ్రమం మోక్షయ పూజాం చ గృహాణ కపిసత్తమ,
ప్రీతిం చ బహుమన్యస్వ ప్రీతోఽస్మి తవ దర్శనాత్.

130

ఏవముక్తః కపిశ్రేష్ఠస్తం నగోత్తమ మబ్రవీత్
ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యురేషోఽపనీయతామ్.

131

త్వరతే కార్యకాలో మే అపశ్చాప్యతివర్తతే,
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్య మిహాన్తరే.

132

ఇత్యుక్త్వా పాణినా శైలమాలభ్య హరిపుంగవః,
జగామాకాశమావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ.

133

స పర్వతసముద్రాభ్యాం బహుమానాదవేక్షితః,
పూజితశ్చోపపన్నాభిరాశీర్భి రనిలాత్మజః.

134

ఓ కపీంద్రా! మా పూజలు స్వీకరించు. కొంతసేపు విశ్రమించి బడలిక తీర్చుకో. మా ప్రేమను ఆదరించు. నీ సందర్శనంతో నే నెంతో సంప్రీతుడ నైనాను.

130

హనుమంతుడు ఆ మైనాకుడి పలుకులు విని, ఇలా అన్నాడు: "నువ్వు ఆతిథ్యం సలిపినట్లే ఆనందిస్తున్నాను. నీ

ఆతిథ్యం స్వీకరించలేదని ఎంతమాత్రమూ నొచ్చుకోవద్దు.

131

"నా కార్యానికి ఆలస్యమైపోతున్నది. పగటిపూట గడచిపోతున్నది. నా మిత్రుల ముందు ప్రతిజ్ఞ చేసి ఉన్నాను. మార్గమధ్యంలో ఎంతమాత్రం ఆగడానికి ససేమిరా వీలులేదు."

132

పరాక్రమవంతుడైన ఆ హనుమంతుడు ఇలా చెప్పి, మైనాకుణ్ణి తన చేతితో స్నేహపూర్వకంగా స్పృశించి, నవ్వుముఖంతో ఆకాశమార్గాన తన పయనాన్ని కొనసాగించాడు.

133

మైనాకుడూ, సముద్రుడూ హనుమంతుణ్ణి పూజ్యభావంతో తిలకిస్తూ యత్నకార్యం సిద్ధించేటట్లు ఆశీర్వాదాలతో ప్రస్తుతించారు.

134

అథోర్ధ్వం దూరముత్పత్య హిత్వా శైలమహోర్ణవౌ,
పితుః పన్థాన మాస్థాయ జగామ విమలేఽమ్బరే.

135

భూయ శ్చోర్ధ్వంగతిం ప్రాప్య గిరిం తమవలోకయన్
వాయుసూను ర్నిరాలమ్బే జగామ విమలేఽమ్బరే.

136

తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్
ప్రశశంసుః సురాః సర్వే సిద్ధాశ్చ పరమర్షయః.

137

దేవతాశ్చాభవన్ హృష్టాస్తత్రస్థా స్తస్య కర్మణా,
కాఞ్చనస్య సునాభస్య సహస్రాక్షశ్చ వాసవః.

138

ఉవాచ వచనం ధీమాన్ పరితోషాత్సగద్గదమ్
సునాభం పర్వతశ్రేష్ఠం స్వయమేవ శచీపతిః.

139

తరువాత హనుమంతుడు మైనాకుణ్ణీ, సముద్రుణ్ణీ విడచి, ఎంతో ఎత్తుకు ఎగిరి, నిర్మలాకాశంలో వాయుమార్గాన రివ్వున పయనించసాగాడు.

135

హనుమంతుడు సమున్నతమైన ఎత్తు కెగిరి, మైనాక పర్వతాన్ని పరికిస్తూ ఆధారరహితమైన వినిర్మలాకాశంలో ప్రయాణం సాగించాడు.

136

హనుమంతుడు మైనాకం మీద విశ్రమించకుండా వెళ్లడం చూసి, అది అతడు చేసిన రెండవ మహాకార్యంగా పరిగణించి దేవతలు, సిద్ధులు, మహర్షులు యావన్మందీ ఆతణ్ణి ప్రశంసించారు.

137

స్వర్ణమయ శిఖరాలు గల ఆ మైనాక పర్వతం చేసిన పనికి అక్కడున్న దేవతలూ, దేవేంద్రుడూ సంతోషించారు.

138

తన ధీమహిమ ఉట్టిపడుతూవుండగా ఆనందాతిరేకంతో గద్గద స్వరాన సునాభునితో (మైనాకునితో) స్వయంగా దేవేంద్రుడు ఇలా వచించాడు.

139

హిరణ్యనాభ శైలేన్ద్ర పరితుష్టోఽస్మి తే భృశమ్
అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య యథాసుఖమ్.

140

సాహ్యం కృతం తే సుమహద్విక్రాన్తస్య హనూమతః,
క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి.

141

రామస్యైష హితాయైవ యాతి దాశరథేర్హరిః,
సత్క్రియాం కుర్వతా తస్య తోసితోఽస్మి దృఢం త్వయా.

142

తతః ప్రహర్షమగమద్విపులం పర్వతోత్తమః,
దేవతానాం పతిం దృష్ట్వా పరితుష్టం శతక్రతుమ్.

143

స వై దత్తవరః శైలో బభూవావస్థితస్తదా,
హనుమాంశ్చ ముహూర్తేన వ్యతిచక్రామ సాగరమ్.

144

బంగారు శిఖరాలు గల ఓ శైలరాజా, మైనాకా! నువ్వు చేసిన పనికి నే నెంతో సంతోషించాను. ఓ సౌమ్యా! నీకు అభయం ఇస్తున్నాను. ఇకనుంచి భయం విడిచి సుఖంగా ఉండు.

140

నూరు యోజనాల దూరం లంఘిస్తూ ఉన్నప్పుడు హనుమంతునకు ఏమౌతుందో ఏమో అని మేం భయపడ్డాం. అటువంటి సందర్భంలో కూడా భయపడని హనుమంతుడికి నువ్వు గొప్ప సహాయం చేశావు.

141

దశరథనందనుడైన రామునికి ఈ హనుమంతుడు హితం చేయడానికే పోతున్నాడు. అటువంటి వానికి సత్కారం చేసిన నిన్ను చూసి నే నెంతో సంప్రీతుడనైనాను.

142

దేవరాజైన ఇంద్రుడు తన పట్ల సంతుష్టుడవడం చూసి ఆ పర్వతశ్రేష్ఠుడైన మైనాకుడుకూడా ఎంతో ఆనందించాడు.

143

అలా మైనాకుడు దేవేంద్రుని నుండి అభయ వరం పొంది అక్కడ నిలబడి ఉండగా, క్షణకాలంలో హనుమంతుడు సముద్రాన్ని చాలాదూరం దాటి వెళ్ళిపోయాడు.

144

తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,

అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్.

145

అయం వాతాత్మజః శ్రీమాన్ప్లవతే సాగరోపరి,
హనుమా న్నామ తస్య త్వం ముహూర్తం విఘ్నమాచర.

146

రాక్షసం రూప మాస్థాయ సుఘోరం పర్వతోపమమ్
దంష్ట్రాకరాళం పింగాక్షం వక్త్రం కృత్వా నభస్సమమ్.

147

బలమిచ్ఛామహే జ్ఞాతుం భూయశ్చాస్య పరాక్రమమ్
త్వాం విజేష్య త్యుపాయేన విషాదం వా గమిష్యతి.

148

ఏవముక్తా తు సా దేవీ దైవతైరభిసత్కృతా,
సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః.

149

వికృతం చ విరూపం చ సర్వస్య చ భయావహమ్
ప్లవమానం హనూమన్తమావృత్యేద మువాచ హ.

150

అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు సూర్యునితో సమానమైన ప్రకాశం గల నాగమాతయైన సురసతో ఇలా పలికారు.

145

వాయుపుత్రుడైన హనుమంతుడు బలోపేతుడై అలసిపోక ఆకాశమార్గంలో ఎగురుతూ సముద్రాన్ని దాటుతున్నాడు. నువ్వు కోరలతో భయంకరమూ, గోరోజన వర్ణంగల కళ్లూ, పర్వతసమానమూ అయిన రాక్షసరూపం దాల్చి ఆకాశమంతటనోటిని తెరచుకొని ముహూర్తకాలం హనుమంతుని గమనానికి విఘ్నం కలిగించు.

146–147

ఇతడి బలపరాక్రమాలనూ, ఉపాయంతో నిన్ను జయంచగలడా లేదా, నిన్ను జయించలేక దిగులు చెందుతాడా అనే విషయాన్నీ మేం తెలుసుకో గోరుతున్నాం.

148

గౌరవపూర్వకంగా దేవతలు ఈ రీతిలో కోరగా, నాగమాతయైన ఆ సురసాదేవి సాగర మధ్యంలో అసహజమూ, వికృతమూ, భయంకరమూ అయిన రాక్షసరూపం దాల్చింది. ఆకాశంలో ఎగురుతూ పోతున్న హనుమంతుడి మార్గానికి అడ్డంగా నిలబడి ఇలా పలికింది.

149–150

మమ భక్షః ప్రదిష్టస్త్వమీశ్వరై ర్వానరర్షభ,
అహం త్వాం భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్.

151

ఏవముక్తః సురసయా ప్రాఞ్జలిర్వానరర్షభః,

ప్రహృష్టవదనః శ్రీమానిదం వచనమబ్రవీత్.

152

రామో దాశరథిర్నామ ప్రవిష్టో దణ్డకావనమ్
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా.

153

అన్యకార్యవిషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః,
తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ.

154

ఓ వానరశ్రేష్ఠా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా ఒసగారు. కనుక నిన్ను భక్షిస్తాను. నా నోట ప్రవేశించు.

151

సురస ఇలా చెప్పగానే ఆ వానరోత్తముడు సంతోషంతో ప్రకాశించే ముఖం గలవాడై, చేతులు జోడించి, ఆమెకు నమస్కరించి ఇలా పలికాడు.

152

దశరథ మహారాజు తనయుడైన రాముడు, తమ్ముడు లక్ష్మణునితోను, భార్య సీతతోను దండకారణ్యంలో ప్రవేశించాడు.

153

రాక్షసులతో రాముడికి వైరం ఏర్పడింది. ఒక రోజు రాముడు మరో కార్యంలో నిమగ్నుడై ఉండగా, కీర్తిమంతురాలైన అతడి భార్య సీతను రావణుడు అపహరించాడు.

154

తస్యాః సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్
కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని.

155

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే.

156

ఏవముక్తా హనుమతా సురసా కామరూపిణీ,
అబ్రవీన్నాతివర్తేన్మాం కశ్చిదేష వరో మమ.

157

తం ప్రయాన్తం సముద్వీక్ష్య సురసా వాక్యమబ్రవీత్
బలం జిజ్ఞాసమానా వై నాగమాతా హనూమతః.

158

ప్రవిశ్య వదనం మేఽద్య గన్తవ్యం వానరోత్తమ,
వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా.

159

నేను రాముని ఆజ్ఞను శిరసావహించి, ఆయన దూతగా సీత వద్దకు పోతున్నాను. రాముని రాజ్యంలో వసిస్తూన్నావు

కనుక రామునికి సహాయం చేయడం నీ ధర్మం.

155

అలా నీకు అంగీకారం కాని పక్షంలో సీతాదేవిని దర్శించి, ఆ సమాచారం రామునికి తెలిపి, పిదప నీ నోట ప్రవేశిస్తాను. ముమ్మాటికీ ఇది నిజం. ఇదే ప్రతిజ్ఞ చేస్తున్నాను.

156

హనుమంతుడి మాటలు విని కామరూపిణి(ఇచ్ఛామాత్రాన రూపం దాల్చే శక్తిగల) యైన ఆ సురస, "నన్ను ఎవ్వరూ అతిక్రమించి పోలేరు. నా కటువంటవరం ఉంది" అని చెప్పింది.

157

తన పలుకులను లక్షించక వెళ్లిపోతున్న హనుమంతుణ్ణి చూసి, నాగ మాతయైన సురస అతడి బలాన్ని తెలుసుకోదలచి అతడితో ఇలా పలికింది.

158

"ఓ వానరశ్రేష్ఠా! నా నోట ప్రవేశించే నువ్వు వెళ్ళాలి. పూర్వం బ్రహ్మదేవుడు నాకు ఈ వరం అనుగ్రహించాడు." ఇలా అంటూ సురస తన విస్తృతమైన నోటిని తెరచి హనుమంతుడి ముందు నిలబడింది.

159

వ్యాదాయ వక్త్రం విపులం స్థితా సా మారుతేః పురః,
ఏవముక్తః సురసయా క్రుద్ధో వానరపుఙ్గవః.

160

అబ్రవీత్కురు వై వక్త్రం యేన మాం విషహిష్యసే,
ఇత్యుక్తా సురసాం క్రుద్ధో దశయోజనమాయతః.

161

దశయోజనవిస్తారో బభూవ హనుమాం స్తదా,
తం దృష్ట్వా మేఘసంకాశం దశయోజన మాయతమ్.

162

చకార సురసా చాస్యం వింశద్యోజన మాయతమ్
హనుమాంస్తు తతః క్రుద్ధ స్త్రింశద్యోజన మాయతః.

163

చకార సురసా వక్త్రం చత్వారింశత్తథోచ్ఛ్రితమ్
బభూవ హనుమాన్వీరః పఞ్చాశ ద్యోజనోచ్ఛ్రితః.

164

సురస మాటలు విని హనుమంతుడు ఆగ్రహోదగ్రుడై, "ఎంత విశాలంగా నన్నా నీ నోటిని తెరువు, నన్ను ఎలా సహించగలవో నేనూ చూస్తాను" అని సవాలు చేస్తున్నట్లు పలికాడు.

160

ఇలా పలికి హనుమంతుడు కోపించినవాడై, పది యోజనాల వైశాల్యం ఉండేటట్లు తన దేహాన్ని పెంచాడు.

161

ఇలా పది యోజనాలు పెరిగి మేఘంలా ఉన్న ఆ హనుమంతుణ్ణి చూసి, సురస కూడా తన నోటిని ఇరవై యోజనాలు

విస్తరింపచేసింది.

162

ఆ తరువాత హనుమంతుడు కుపితుడై ముప్పై యోజనాలు విస్తరించాడు. అప్పుడు సురస తన నోటిని నలభై యోజనాల మేరకు విస్తృతం చేసింది. వీరుడైన హనుమంతుడు అప్పుడు తన దేహాన్ని యాభై యోజనాలు పెంచాడు.

163–164

చకార సురసా వక్త్రం షష్ఠియోజన మాయతమ్
తథైవ హనుమాన్వీరః సప్తతీయోజనోచ్ఛ్రితః.

165

చకార సురసా వక్త్రా మశీతీ యోజనోచ్ఛ్రితమ్
హనుమా నచలప్రఖ్యో నవతీయోజనోచ్ఛ్రితః.

166

తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్రః సుబుద్ధిమాన్
దీర్ఘజిహ్వం సురసయా సుఘోరం నరకోపమమ్
సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాఙ్గుష్ఠమాత్రకః.

167

సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాజవః,
అన్తరిక్షే స్థితః శ్రీమానిదం వచనమబ్రవీత్.

168

అది చూసి సురస తన నోటిని అరవై యోజనాలు విస్తరింపచేసింది. అంతట వీరుడైన హనుమంతుడు తన దేహాన్ని డెబ్భై యోజనాల మేరకు విస్తరింపచేశాడు.

165

అప్పుడు సురస తన నోటిని ఎనభై యోజనాలు విస్తృతించింది. దాంతో పర్వతసమానుడైన హనుమంతుడు తన శరీరాన్ని తొంభై యోజనాలు పెంచాడు.*

166

మహా వివేకవంతుడైన హనుమంతుడు సుదీర్ఘమైన నాలుక కలదీ, ఎంతో భయంకరమైనదీ, నరకంతో సమానమైనదీ అయిన సురస తెరిచిన నోటిని చూసి, తన శరీరాన్ని ఎంతో సంకోచింపచేసి బొటనవ్రేలి ప్రమాణం గలవాడైనాడు.

167

వాయువేగంగల హనుమంతుడు వెంటనే ఆమె నోట ప్రవేశించి, మళ్లీ బయటకు వచ్చి, ఆకాశంలో నిలబడి, ఇలా పలికాడు.

168

ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే,
గమిష్యే యత్ర వైదేహీ సత్యం చానీద్వరస్తవ.

169

తం దృష్ట్వా వదనాన్ముక్తం చన్ద్రం రాహుముఖాదివ,
అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ వానరమ్.

170

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా.

171

తత్తృతీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్
సాధు సాధ్వితి భూతాని ప్రశశంసు స్తదా హరిమ్.

172

స సాగర మనాధృష్య మభ్యేత్య వరుణాలయమ్
జగామాకాశ మావిశ్య వేగేన గరుడోపమః.

173

దక్షపుత్రివైన ఓ సురసా! నీ నోట ప్రవేశించాను. నీకు నమస్కారం. ఇక సీత ఎక్కడున్నదో అక్కడకు వెళతాను. నీ నోట ప్రవేశించి బయటకు రావడంతో బ్రహ్మ నీ కిచ్చిన వరం వమ్ముకాలేదు!

169

సురస తన నిజరూపం దాల్చి, రాహువు నోటినుండి బయటపడ్డ చంద్రునిలా తన నోటినుండి బయటకు వచ్చిన ఆ హనుమంతుణ్ణి చూసి, ఇలా అన్నది.

170

సౌమ్యుడవైన ఓ వానరశ్రేష్ఠా! కార్యసిద్ధి నిమిత్తం సుఖంగా వెళ్లు. సీతను మహాత్ముడైన రామునితో చేర్చు.

171

ఇతరు లెవరికీ శక్యంకాని హనుమంతుడు చేసిన ఆ మూడవ పని చూసి సర్వులూ ఆతణ్ణి ప్రశంసించారు.

172

గరుత్మంతుడితో సమాన వేగంగల ఆ హనుమంతుడు ప్రతిఘటింప శక్యంకాని, వరుణుని నివాసమైన ఆ సముద్రం మీద ఆకాశమార్గాన ఎగురసాగాడు.

173

సేవితే వారిధారిభిః పతగైశ్చ నిషేవితే,
చరితే కైశికాచార్యైరావతనిషేవితే.

174

సింహకుఞ్జర శార్దూల పతగోరగ వాహనైః,
విమానైః సంపతద్భిశ్చ విమలైః సమలంకృతే.

175

వజ్రాశనిసమాఘాతైః పావకైరుపశోభితే,
కృతపుణ్యైర్మహాభాగైః స్వర్గజిద్భిరలంకృతే.

176

వహతా హవ్యమత్యర్థం సేవితే చిత్రభానునా,
గ్రహనక్షత్ర చన్ద్రార్క తారాగణ విభూషితే.

177

మహర్షిగణగన్ధర్వ నాగయక్షసమాకులే,
వివిక్తే విమలే విశ్వే విశ్వావసునిషేవితే.

178

దేవరాజగజాక్రాన్తే చన్ద్రసూర్యపథే శివే,
వితానే జీవలోకస్య వితతే బ్రహ్మనిర్మితే.

179

బహుశః సేవితే వీరై ర్విద్యాధరగణై ర్వరైః,
జగామ వాయుమార్గే తు గరుత్మానివ మారుతిః.

180

అప్పుడు ఆ ఆకాశమార్గం ఇలా ఉంది: మేఘాలు కురిపించే వర్షధారలతో నిండివుంది. పక్షులు ఎగరుతున్నాయి. కైశిక రాగం ఆలపించే విద్యాధరులు సంచరిస్తున్నారు. ఐరావతం విహరిస్తూన్నది. సింహాలు, ఏనుగులు, పులులు, పక్షులు, సర్పాలు వాహనాలుగా పూన్చిన అందమైన విమానాలు ఎన్నో అక్కడ ఎగురుతున్నాయి. అక్కడక్కడ వజ్రం, పిడుగుల ఒరపిడిచే ఉత్పన్నమైన అగ్నులు తేజరిల్లుతున్నాయి. పుణ్యకర్మలు ఆచరించి స్వర్గానికి ఏతెంచిన మహానుభావులు ఆ ప్రదేశాన్ని అలంకరించి ఉన్నారు. యజ్ఞాదులలో దేవతలకు అర్పించిన హవిస్సులను మోసికొనిపోయే అగ్ని తారసపడుతున్నాడు. సూర్యచంద్రాది గ్రహాలతోను, అశ్విన్యాది నక్షత్రాలతోను అందంగా ప్రకాశిస్తూన్నది ఆ ప్రదేశం. మహర్షులు, గంధర్వులు, నాగులు, యక్షులు గుంపులుగా అక్కడ విహరిస్తున్నారు. కొన్నిచోట్ల నిర్జనంగా ఉంది. ఒక నిర్మల ప్రదేశంలో విశ్వావశుడనే గంధర్వరాజు వసిస్తూన్నాడు. మంగళదాయకమూ, సూర్యచంద్రుల గమన మార్గమూ అయిన ఆ ఆకాశంలో దేవేంద్రుడి ఐరావతం అనే ఏనుగు సంచరిస్తూన్నది. జీవలోకం పై భాగాన బ్రహ్మచే నిర్మితమైన అందమైన విశాలమైన వితానం (చాందినీ) మాదిరిగా ఉన్న ఆ ఆకాశ మార్గాన హనుమంతుడు, గరుత్మంతుడిలా సాగిపోతున్నాడు.

174–180

ప్రదృశ్యమానః సర్వత హనుమాన్మారుతాత్మజః,
భేజేఽమ్బరం నిరాలమ్బం లమ్బపక్ష ఇవాద్రిరాట్.

181

ప్లవమానం తు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ,
మనసా చిన్తయామాస ప్రవృద్ధా కామరూపిణీ.

182

అద్య దీర్ఘస్య కాలస్య భవిష్యామ్యహమాశితా,
ఇదం హి మే మహత్సత్త్వం చిరస్య వశమాగతమ్.

183

అతిపొడవైన రెక్కలుగల మహాపర్వతంలా, ఎటువంటి ఆధారం లేని ఆ ఆకాశమార్గాన హనుమంతుడు ఎంతో ఎత్తులో ప్రయాణం చేస్తున్నందు వలన అతడు అన్ని చోట్లనుండి కానరాసాగాడు.

181

ఆ విధంగా సముద్రాన్ని దాటిపోతున్న ఆ హనుమంతుణ్ణి కోరిన రూపం పొందగ (కామరూపిణి) సింహిక అనే ఒక రాక్షసి చూసి, తన దేహాన్ని పెంచుతూ, ఇలా యోచించింది.

182

"ఎంతో కాలం తరువాత నాకు తగిన ఆహారం లభించింది. ఏదో పెద్ద జంతువే నాకు చిక్కింది."

183

ఇతి సంచిన్త్య మనసా ఛాయామస్య సమాక్షిపత్
ఛాయాయాం గృహ్యమాణాయాం చిన్తయామాస వానరః.

184

సమాక్షిప్తోఽస్మి సహసా పఙ్గూకృతపరాక్రమః,
ప్రతిలోమేన వాతేన మహానౌరివ సాగరే.

185

తిర్యగూర్ధ్వమధశ్చైవ వీక్షమాణస్తతః కపిః,
దదర్శ స మహత్సత్త్వముత్థితం లవణామ్భసి.

186

తద్దృష్ట్వా చిన్తయామాస మారుతిర్విక్రితాననమ్
కపిరాజేన కథితం సత్త్వమద్భుతదర్శనమ్
ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః.

187

స తాం బుద్ధ్యార్థతత్త్వేన సింహికాం మతిమాన్కపిః,
వ్యవర్ధత మహాకాయః ప్రావృషీవ వలాహకః.

188

ఈ విధంగా యోచించి ఆ రాక్షసి నీడనుపట్టి హనుమంతుని తన వైపుకు ఈడ్వసాగింది. అలా తన నీడను పట్టి లాగుతూండగా హనుమంతుడు ఇలా తలచాడు.

184

సముద్ర మధ్యంలో వీచిన ఎదురుగాలికి ఓడ నిరోధింపబడినట్లు, నన్నెవరో బలవంతంగా ఈడ్చివేస్తున్నారు.

185

తరువాత హనుమంతుడు పైకీ క్రిందికీ ప్రక్కలకూ తన దృష్టిని సారించి లవణసముద్రంలో పైకి లేచిన ఒక పెద్ద జంతువును చూశాడు.

186

వికృతమైన ముఖంగల ఆ జంతువును చూసి హనుమంతుడు ఇలా అనుకొన్నాడు: 'సముద్రంలో ఒక మహాజంతువు ఉందనీ, నీడనుపట్టి లాగే మహాబలం గలదనీ సుగ్రీవుడు చెప్పిన ఆ జంతువు ఇదే. సందేహం లేదు.'

187

మహాబుద్ధిశాలియైన హనుమంతుడు తన నీడను పట్టి లాగివేస్తున్న ఆ జంతువు సింహికయే అని గ్రహించి, వర్షాకాల మేఘంలా తన దేహాన్ని విస్తృతించాడు.

188

తస్య సా కాయముద్వీక్ష్య వర్ధమానం మహాకపేః,
వక్త్రం ప్రసారయామాస పాతాళాన్తరసన్నిభమ్.

189

ఘనరాజీవ గర్జన్తీ వానరం సమభిద్రవత్.

190

స దదర్శ తతస్తస్యా వివృతం సుమహన్ముఖమ్
కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః.

191

స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః,
సంక్షిప్య ముహురాత్మానం నిష్పపాత మహాబలః.

192

ఆస్యే తస్యా నిమజ్జన్తం దదృశుః సిద్ధచారణాః,
గ్రస్యమానం యథా చన్ద్రం పూర్ణం పర్వణి రాహుణా.

193

తతస్తస్యా నఖైస్తీక్ష్ణైర్మర్మాణ్యుత్కృత్య వానరః,
ఉత్పపాతాథ వేగేన మనః సంపాతవిక్రమః.

194

హనుమంతుని శరీరం ఆ రీతిలో పెరగడం చూసి, ఆ సింహిక పాతాళ బిలంలాంటి తన నోటిని తెరచింది.

189

మేఘపంక్తిలా ఆమె గర్జిస్తూ, హనుమంతుణ్ణి వెంబడించింది. అప్పుడు బుద్ధిశాలియైన హనుమంతుడు తన శరీరమంత ప్రమాణంలో ఉన్న ఆమె తెరవబడిన నోటిని, ఆయువుపట్టును చూశాడు.

190–191

వజ్రదేహుడు, మహాబలశాలీ అయిన హనుమంతుడు తన దేహాన్ని అత్యంత చిన్నదిగా చేసి, తెరచివున్న ఆమె నోట ప్రవేశించాడు.

192

పౌర్ణమినాడు రాహువుచే కబళింపబడుతూన్న పూర్ణచంద్రునిలా హనుమంతుడు ఆమె నోట పడిపోతూండగా సిద్ధులూ, చారణులూ చూశారు.

193

తదనంతరం హనుమంతుడు తన వాడి గోళ్ళతో ఆమె ఆయువుపట్లను చీల్చి, ఆమె నోరు మూతపడే లోపలే మనోవేగంతో పైకి ఎగిరి వచ్చేశాడు.

194

తాం తు దృష్ట్వా చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ,
స కపిప్రవరో వేగాద్వవృధే పునరాత్మవాన్.

195

హృతహృత్సా హనుమతా పపాత విధురాఽమ్బుసి,
తాం హతాం వానరేణాశు పతితాం వీక్ష్య సింహికామ్.

196

భూతాన్యాకాశచారీణి తమూచుః ప్లవగోత్తమమ్
భీమమద్య కృతం కర్మ మహత్సత్త్వం త్వయా హతమ్

సాధయార్థమభిప్రీతమరిష్టం ప్లవతాం వర.

197

యస్య త్వేతాని చత్వారి వానరేన్ద్ర యథా తవ,
ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స కర్మసు న సీదతి.

198

స తైః సంభావితః పూజ్యః ప్రతిపన్నప్రయోజనః,
జగామాకాశమావిశ్య పన్నగాశనవత్కపిః.

199

గొప్ప బుద్ధిశాలియైన ఆ హనుమంతుడు ధైర్యంతోను, నేర్పుతోను సామర్థ్యంతోను ఆ సింహికను పడగొట్టి, మరుక్షణమే తన శరీరాన్ని పెంచి వేశాడు.

195

హనుమంతుడు ఆమె గుండెను చీల్చివేయగా ఆ సింహిక విగతజీవియై నీళ్ళలో పడిపోయింది. హనుమంతుడు చిటికెలో చంపివేసిన ఆ సింహికను చూసి గగనచరులైన భూతాలు అతడితో ఇలా పలికాయి.

196

ఓ వానరశ్రేష్ఠా! ఈ మహాప్రాణిని వధించి ఇప్పుడు నువ్వు అసాధ్యమైన కార్యాన్ని సాధించావు. ఇక నీ అభీష్ట కార్యాన్ని మంగళప్రదంగా నిర్వర్తించుకో.

197

ఓ కపీంద్రా! అకుంఠిత ధైర్యం, సూక్ష్మదృష్టి, సునిశితబుద్ధి, సామర్థ్యం నీలా ఉన్నవాడు తన కార్యాలలో ఎన్నటికీ అపజయం పొందడు.

198

వారితో అలా స్తుతింపబడిన పూజ్యనీయుడైన హనుమంతుడు ఆ తరువాత తన భవిష్యత్కార్యాన్ని గురించి నిశ్చయించుకొని గరుత్మంతునిలా గగనతలంలో పయనం సాగించాడు.

199

ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రతిలోకయన్
యోజనానాం శతస్యాన్తే వనరాజిం దదర్శ సః.

200

దదర్శ చ పతన్నేవ వివిధద్రుమభూషితమ్
ద్వీపం శాఖామృగశ్రేష్ఠో మలయోపవనాని చ.

201

సాగరం సాగరానూపం సాగరానూపజాన్ద్రుమాన్.
సాగరస్య చ పత్నీనాం ముఖాన్యపి విలోకయన్.

202

స మహామేఘసంకాశం సమీక్ష్యాత్మానమాత్మవాన్
నిరున్ధన్తమివాకాశం చకార మతిమాన్ మతిమ్.

203

కాయవృద్ధిం ప్రవేగం చ మమ దృష్ట్వైవ రాక్షసాః,
మయి కౌతూహలం కుర్యురితి మేనే మహాకపిః.

204

ఆ విధంగా హనుమంతుడు దాదాపు నూరు యోజనాల దూరం గమించి, ఇంచుమించు సముద్రతీరం చేరి, నలుమూలలా పరికించగా ఒక వృక్షపంక్తి అతడి కంటబడింది.

200

హనుమంతుడు క్రిందికి దిగుతూనే నానావిధ వృక్షాలచే తీర్చిదిద్దబడిన ద్వీపాన్ని, మలయపర్వత ప్రాంతంలోని వనాలను చూశాడు.

201

బుద్ధిశాలీ, సదాలోచనా సమర్థుడూ అయిన ఆ హనుమంతుడు సముద్రాన్ని, సముద్రతీరంలోని జలప్రాంతాలను, అక్కడ పెరిగిన వృక్షాలను, నదీముఖాలను చూస్తూ, ఆకాశాన్ని అడ్డగిస్తూన్నట్లున్న మహామేఘంలా ఒప్పారే తన శరీరాన్ని పరికించి ఇలా తలపోశాడు.

202–203

'నా ఈ పెద్ద శరీరాన్ని, వేగాన్ని చూడగానే రాక్షసులకు నా పట్ల కుతూహలం తప్పక కలుగుతుంది' అని హనుమంతుడు తలచాడు.

204

తతః శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్
పునః ప్రకృతిమాపేదే వీతమోహ ఇవాత్మవాన్.

205

తద్రూపమతిసంక్షిప్య హనుమాన్ ప్రకృతౌ స్థితః,
త్రీన్ క్రమానివ విక్రమ్య బలివీర్యహరో హరిః.

206

స చారునానావిధరూపధారీ
పరం సమాసాద్య సముద్రతీరమ్,
పరైరశక్యః ప్రతిపన్నరూపః
సమీక్షితాత్మా సమవేక్షితార్థః.

207

తతః స లమ్బస్య గిరేః సమృద్ధే
విచిత్రకూటే నిపపాత కూటే,
సకేతకోద్దాలకనాలికేరే
మహాద్రికూటప్రతిమో మహాత్మా.

208

అలా అనుకొని కొండవంటి తన శరీరాన్ని చిన్నదిగా చేసి, అజ్ఞానం తొలగిపోయిన ఆత్మజ్ఞాని తన స్వస్వరూపాన్ని పొందినట్లు, సహజరూపం సంతరించుకొన్నాడు.

205

త్రివిక్రముడై బలిని నిర్జించి విష్ణువు తన స్వాభావిక వామనరూపాన్ని పొందిన విధంగా హనుమంతుడు తన మహారూపాన్ని ఉపసంహరించుకొని సహజ రూపం దాల్చాడు.

206

సుందరమైన నానావిధ రూపాలు దాల్చ సమర్థుడూ, శత్రువులకు జయింప అలవికాని వాడూ అయిన హనుమంతుడు ఆవలి తీరం చేరుకొని, తన పెను శరీరాన్ని చూసుకొని, తను చేయవలసిన పనిని నిర్ణయించుకొని, ఇతరులకు అసాధ్యమైన సూక్ష్మరూపం దాల్చాడు.

207

తరువాత మహాపర్వత శిఖరంలా ఒప్పారే మహాత్ముడైన ఆ హనుమంతుడు సమస్తవస్తు సమృద్ధమూ, వివిధ రంగుల చిన్నచిన్న శిఖరాలు గలదీ, మొగలిపొదలూ విరిగిచెట్లూ కొబ్బరిచెట్లతో శోభించే లంబపర్వత శిఖరం మీద దిగాడు.

208

తత స్తు సంప్రాప్య సముద్రతీరం
సమీక్ష్య లఙ్కాం గిరివర్యమూర్ధ్ని,
కపిస్తు తస్మిన్నిపపాత పర్వతే
విధూయ రూపం వ్యథయన్మృగద్విజాన్.

209

స సాగరం దానవపన్నగాయుతం
బలేన విక్రమ్య మహోర్మిమాలినమ్
నిపత్య తీరే చ మహోదధేస్తదా
దదర్శ లఙ్కామమరావతీమివ.

210

అలా హనుమంతుడు సముద్రతీరం చేరి, లంబపర్వత శిఖరం మీద నెలకొని ఉన్న లంకానగరాన్ని చూసి, అక్కడి మృగాలకూ, పక్షులకూ భీతిగొల్పే రీతిలో ఆ కొండ మీద దిగాడు.

209

పెద్దపెద్ద అలలతో కూడిన, దానవులకూ పన్నగులకూ ఆవాసస్థానమైన సముద్రాన్ని తన శక్తిసామర్థ్యాలతో లంఘించి, తీరం చేరి, అక్కడ అమరావతిలా వెలసిన లంకానగరాన్ని హనుమంతుడు చూశాడు.

210

శ్రీమద్వాల్మీకి రామాయణమున మొదటి సర్గ సమాప్తం

2వ సర్గ
లంకానగర ప్రవేశం

స సాగరమనాధృష్యమతిక్రమ్య మహాబలః,
త్రికూటశిఖరే లఙ్కాం స్థితాం స్వస్థో దదర్శ హ.

1

తతః పాదపముక్తేన పుష్పవర్షేణ వీర్యవాన్,
అభివృష్టః స్థిత స్తత్ర బభౌ పుష్పమయో యథా.

2

యోజనానాం శతం శ్రీమాం స్తీర్త్వాఽప్యుత్తమవిక్రమః,
అనిఃశ్వసన్ కపిస్తత్ర న గ్లానిమధిగచ్ఛతి.

3

మహాబలశాలియైన హనుమంతుడు ఆ విధంగా దాట శక్యంగాని సముద్రాన్ని దాటి, ఏమాత్రం శ్రమచెందనివాడై, త్రికూట పర్వత శిఖరం మీద నెలకొని ఉన్న లంకానగరాన్ని తిలకించాడు.

1

అప్పుడు ఆ పర్వతం మీది చెట్లు పువ్వుల వాన కురిపించాయి. ఆ పువ్వులచే కప్పబడిన ఆ హనుమంతుడు పువ్వులతో నిర్మితమైన విగ్రహంలా ప్రకాశించాడు.

2

లోకోత్తర పరాక్రమశాలీ, శ్రీమంతుడూ అయిన ఆ హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని లంఘించినా ఏమాత్రం శ్రమ చెందలేదు, కనీసం నిట్టూర్పుకూడా విడవలేదు.

3

శతాన్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి,
కిం పునః సాగర స్యాన్తం సంఖ్యాతం శతయోజనమ్

4

స తు వీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః,
జగామ వేగవాన్ లఙ్కాం లఙ్ఘయిత్వా మహోదధిమ్.

5

శాద్వలాని చ నీలాని గన్ధవన్తి వనాని చ,
గణ్డవన్తి చ మధ్యేన జగామ నగవన్తి చ.

6

శైలాంశ్చ తరుసంఛన్నాన్ వనరాజీశ్చ పుష్పితాః,
అభిచక్రామ తేజస్వీ హనుమాన్ ప్లవగర్షభః.

7

స తస్మిన్నచలే తిష్ఠన్వనాన్యుపవనాని చ,
స నగాగ్రే చ తాం లఙ్కాం దదర్శ పవనాత్మజః.

8

'అనేక వందల యోజనాల దూరాన్నైనా దాటిపోగలను. ఇక నూరు యోజనాల పరిమితమైన సముద్రాన్ని దాటడం ఎంత?' అని హనుమంతుడు అనుకొన్నాడు.

పరాక్రమవంతులలో శ్రేష్ఠుడూ, ఎగుర గలిగినవారిలో ఉత్తముడూ, వేగవంతుడూ అయిన హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకను చేరుకొన్నాడు.

5

తదనంతరం అతడు నల్లని పచ్చికబీళ్ళూ, సువాసనలు గుబాళించే పువ్వులూ, పెద్ద పెద్ద శిలలూ, పర్వతములూ గల అరణ్యాలలో సంచరించాడు.

6

మహాతేజశ్శాలీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు చెట్లచే ఆవరింపబడిన కొండలను, పుష్పించిన వనశ్రేణులను దాటి ముందుకు వెళ్ళాడు.

7

హనుమంతుడు ఆ లంబగిరి మీద నిలబడి వనాలను, ఉద్యానవనాలను, పర్వతాగ్రంలో నెలకొని ఉన్న లంకానగరాన్ని చూశాడు.

8

సరళాన్ కర్ణికారాంశ్చ ఖర్జూరాంశ్చ సుపుష్పితాన్,
ప్రియాళాన్ముచులిన్దాంశ్చ కుటజాన్ కేతకానపి.

9

ప్రియఙ్గూన్ గన్ధపూర్ణాంశ్చ నీపాన్ సప్తచ్ఛదాం స్తథా,
అసనాన్ కోవిదారాంశ్చ కరవీరాంశ్చ పుష్పితాన్.

10

పుష్పభారనిబద్ధాంశ్చ తథా ముకులితానపి,
పాదపాన్ విహగాకీర్ణాన్ పవనాధూతమస్తకాన్.

11

హంసకారణ్డవాకీర్ణావ్యాపీః పద్మోత్పలాయుతాః,
ఆక్రీడాన్ వివిధాన్ రమ్యాన్వివిధాంశ్చ జలాశయాన్.

12

సంతతాన్ వివిధైర్వృక్షైః సర్వర్తుఫలపుష్పితైః,
ఉద్యానాని చ రమ్యాణి దదర్శ కపికుఞ్జరః.

13

సరళ వృక్షాలనూ, కొండగోగు చెట్లనూ, చక్కగా పూసిన ఖర్జూర చెట్లనూ, మోరటి, నిమ్మ కొండమల్లె చెట్లనూ, మొగలి పొదలనూ, సువాసనలు వెదజల్లే పిప్పలి చెట్లనూ, మంకెన, ఏడాకుల అరటి చెట్లనూ, వేగిస కాంచన వృక్షాలనూ, పుష్పించిన గన్నేరు చెట్లనూ, పువ్వుల భారంతో క్రిందికి వంగినవీ, మొగ్గతొడిగినవీ, పక్షులచే వ్యాకులమైనవీ, గాలికి కదలాడుతున్న అగ్రభాగాలు కలవీ అయిన ఇతర చెట్లనూ, హంసలూ కారండవములనే నీటిపక్షులతో కూడినవీ, తామరలూ కలువలూ నిండినవీ అయిన దిగుడు బావులూ, అనేక మనోహర ప్రదేశములూ, అన్ని ఋతువులలో పండ్లనిచ్చే, పువ్వులతో శోభిల్లే పలురకాల చెట్లతో పరివ్యాప్తమైనవీ అయిన సుందరోద్యానాలనూ, పుష్పించిన అనేక రకాల చెట్లు తీరంలో ఉన్న తటాకాలనూ హనుమంతుడు అక్కడ చూశాడు.

9–13

సమాసాద్య చ లక్ష్మీవాన్ లఙ్కాం రావణపాలితామ్,
పరిఖాభిః సపద్మాభిః సోత్పలాభిరలంకృతామ్.

14

సీతాపహరణార్థేన రావణేన సురక్షితామ్,
సమన్తాద్విచరద్భిశ్చ రాక్షసైరుగ్రధన్విభిః.

15

కాఞ్చనేనావృతాం రమ్యాం ప్రాకారేణ మహాపురీమ్,
గృహైశ్చ గ్రహసంకాశైః శారదామ్బుదసన్నిభైః.

16

పాణ్డురాభిః ప్రతోళీభి రుచ్చాభి రభిసంవృతామ్,
అట్టాలకశతాకీర్ణాం పతాకాధ్వజమాలినీమ్.

17

తోరణైః కాఞ్చనై ర్దివ్యై ర్లతాపఙ్క్తివిచిత్రితైః,
దదర్శ హనుమాన్ లఙ్కాం దివి దేవపురీ మివ.

18

ఆ విధంగా కాంతిచే సంశోభితుడైన హనుమంతుడు లంకానగరాన్ని సమీపించి, సుందరమైన రావణ పాలిత ఆ లంకను చూశాడు. ఆ నగరం చుట్టూ పద్మాలతోను, కలువలతోను నిండిన అగడ్తలున్నాయి. సీతను అపహరించి తీసుకు రావడం కారణంగా రాముని వలన యుద్ధం శంకించి రావణుడు భయంకరమైన ధనుస్సులు ధరించిన రాక్షసులను లంకకు కావలి ఉంచాడు. ఆ నగరం చుట్టూ సువర్ణమయ ప్రాకారం ఉంది. గ్రహతుల్యములూ, శరత్కాలమేఘ సమానములూ అయిన గృహాలతో ఆ నగర ప్రధాన వీథులు ఎత్తుగానూ, తెల్లగానూ కానవస్తున్నాయి. వందలాది కోట బురుజులతో, పతాక ధ్వజాలతో ఆ నగరం శోభాయమానంగా ఒప్పారుతూన్నది. బంగారు మయమైన, చెక్కిన లతల పంక్తులచే చిత్రంగా రూపుదిద్దుకొన్న ముఖద్వారాలతో కూడినదై స్వర్గలోకంలోని అమరావతిలా ఉన్న ఆ లంకానగరాన్ని హనుమంతుడు చూశాడు.

14–18

గిరిమూర్ధ్ని స్థితాం లఙ్కాం పాణ్డురైర్భవనైః శుభైః,
దదర్శ స కపిశ్రేష్ఠః పురమాకాశగం యథా.

19

పాలితాం రాక్షసేన్ద్రేణ నిర్మితాం విశ్వకర్మణా,
ప్లవమానామివాకాశే దదర్శ హనుమాన్ పురీమ్.

20

వప్రప్రాకారజఘనాం విపులామ్బునవామ్బరామ్,
శతఘ్నీశూల కేశాన్తా మట్టాలకవతంసకామ్.

21

మనసేన కృతాం లఙ్కాం నిర్మితాం విశ్వకర్మణా,
ద్వారముత్తరమాసాద్య చిన్తయామాస వానరః.

22

కైలాసశిఖరప్రఖ్యా మాలిఖన్తీ మివామ్బరమ్,
డీయమానా మివాకాశ ముచ్ఛ్రితై ర్భవనోత్తమైః.

23

సంపూర్ణాం రాక్షసైర్ఘోరై ర్నాగై ర్భోగవతీ మివ,
అచిన్త్యాం సుకృతాం స్ఫీతాం కుబేరాధ్యుషితాం పురా.

24

దంష్ట్రిభిర్బహుభిః శూరైః శూలపట్టిసపాణిభిః,
రక్షితాం రాక్షసై ర్ఘోరై ర్గుహా మాశీవిషైరివ.

25

తస్యాశ్చ మహతీం గుప్తిం సాగరం చ నిరీక్ష్య సః,
రావణం చ రిపుం ఘోరం చిన్తయామాస వానరః.

26

తెల్లని శుభకరాలైన భవనాలతో, పర్వతాగ్రాన నెలకొని ఉండడం

వలన ఆకాశంలో నిర్మించినట్లున్న ఆ లంకానగరాన్ని హనుమంతుడు తిలకించాడు.

19

విశ్వకర్మ నిర్మితమైన రావణ పాలిత లంకానగరం ఆకాశంలో తేలిపోతున్నట్లు హనుమంతునికి కానవచ్చింది.

20

మట్టిగోడల, శిలానిర్మిత ప్రాకారాలే జఘనంగానూ, అగడ్తలలో ప్రవహిస్తూవున్న నీరే వస్త్రంగానూ, శతఘ్నులూ శూలాలూ కేశపాశాలుగానూ, కోటబురుజులు కర్ణభూషణాలుగానూ ఒప్పారే స్త్రీలా, ఊహానిర్మితమా అన్నట్లున్న విశ్వకర్మ నిర్మిత ఆ లంకానగర ఉత్తర ద్వారం వద్దకెళ్లి హనుమంతుడు ఆలోచించసాగాడు.

21–22

కైలాస పర్వత శిఖరంలా మహోన్నతమై ఉన్న ఆ లంకానగరం ఆకాశాన్ని స్పృశిస్తూన్నట్లున్నది. అందలి భవనాలు అత్యున్నతాలై ఉన్నాయి. భోగవతీ నగరం(పాతాళంలోనిది) మాదిరి భయంకరులైన రాక్షసులతో, సర్పాలతో నిండివుంది. లంకానగర శోభ ఊహాతీతంగా కనిపిస్తున్నది. స్పష్టంగా తేజరిల్లుతున్న ఆ నగరం పూర్వం కుబేరుని ఆవాసమై ఒప్పారింది. గుహవంటి కోరలు ఉన్నవారూ, శూలాలూ, పట్టిసాలూ(అడ్డకత్తులూ) ధరించినవారూ, భయంకరులూ, శూరులూ అయిన రాక్షసులు అనేకులు, సర్పాలు గుహను రక్షిస్తూవున్న చందాన ఆ లంకానగరాన్ని రక్షిస్తున్నారు. అటువంటి ఆ లంకానగరానికి ఏర్పాటుచేసిన రక్షణను, దాని చుట్టూ సముద్రాన్ని చూసి, రావణుడు భయంకర శత్రువని గ్రహించి, హనుమంతుడు ఇలా తలపోశాడు.

23–26

ఆగత్యాపీహ హరయో భవిష్యన్తి నిరర్థకాః,
న హి యుద్ధేన వై లఙ్కా శక్యా జేతుం సురైరపి.

27

ఇమాం తు విషమాం దుర్గాం లఙ్కాం రావణపాలితామ్,
ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః.

28

'వానరులు ఇక్కడకు వచ్చినా ఫలితం ఏమీ ఉండదు. ఈ లంకానగరం దేవతలకు సైతం యుద్ధంలో జయింపరానిది.

27

'లోపలకు ప్రవేశింప శక్యంకానిదీ, రావణుడు పరిపాలిస్తూన్నదీ అయిన ఈ దుష్కరమైన లంకానగరానికి వచ్చికూడా మహాబాహువైన రాముడు మాత్రం ఏం చేయగలడు?

28

అవకాశో న సాన్త్వస్య రాక్షసేష్వభిగమ్యతే,
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే.

29

చతుర్ణామేవ హి గతి ర్వానరాణాం మహాత్మనామ్,
వాలిపుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః.

30

యావజ్జానామి వైదేహీం యది జీవతి వా న వా,
తత్రైవ చిన్తయిష్యామి దృష్ట్వా తాం జనకాత్మజామ్.

31

తతః స చిన్తయామాస ముహూర్తం కపికుఞ్జరః,

గిరిశృఙ్గే స్థితస్తస్మిన్ రామస్యాభ్యుదయే రతః.

32

అనేన రూపేణ మయా న శక్యా రక్షసాం పురీ,
ప్రవేష్టుం రాక్షసైర్గుప్తా క్రూరై ర్బలసమన్వితైః.

33

‘రాక్షసుల విషయంలో సామ దాన భేదాపాయాలకు ఆస్కారం లేదు. ఇక యుద్ధం చేతకూడా వీరిని నిగ్రహించే అవకాశం లేదు.

29

‘ఈ లంకకు రావడానికి నలుగురు వానరులకు మాత్రమే సాధ్యం. వారు: వాలి పుత్రుడైన అంగదుడూ, నీలుడూ, ధీమంతుడూ మాకు రాజూ అయిన సుగ్రీవుడూ, నేనూ.

30

‘సీతాదేవి జీవించి ఉన్నదో లేదో ముందుగా తెలుసుకోవాలి. ఆమె దర్శనం అయిన తరువాతనే మిగతా విషయాల గురించి ఆలోచించవచ్చు. ఇప్పుడే ఎందుకు?’

31

రాముని అభ్యుదయం ఆకాంక్షించే కపిశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు ఆ పర్వత శిఖరాగ్రాన నిలబడి ముహూర్తకాలంపాటు ఇలా ఆలోచించాడు.

32

‘క్రూరులూ, బలవంతులూ అయిన రాక్షసులు పరిరక్షిస్తూవున్న ఈ లంకా నగరంలోకి నేను ఈ రూపంలో ప్రవేశించడం శక్యం కాదు.

33

ఉగ్రౌజసో మహావీర్యా బలవన్తశ్చ రాక్షసాః,

వఞ్చనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా.

34

లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లఙ్కాపురీ మయా,
ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్.

35

తాం పురీం తాదృశీం దృష్ట్వా దురాధర్షాం సురాసురైః,
హనుమాన్ చిన్తయామాస వినిశ్చిత్య ముహుర్ముహుః.

36

కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్,
అదృష్టో రాక్షసేన్ద్రేణ రావణేన దురాత్మనా.

37

న వినశ్యేత్కథం కార్యం రామస్య విదితాత్మనః,
ఏకా మేకశ్చ పశ్యేయం రహితే జనకాత్మజామ్.

38

'ప్రచండమైన తేజస్సుగలవారూ, మహాబల పరాక్రమ సంపన్నులూ అయిన ఈ రాక్షసులను మోసగించిగాని సీతాదేవిని నేను అన్వేషించలేను.

34

'ఈ మహాకార్యాన్ని సాధించాలంటే నేను కనీకనబడని చిన్నిరూపం ధరించి రాత్రివేళ ఈ లంకానగరంలో ప్రవేశించడమే సమయానుకూలమైన పని.'

35

దేవాసుర లెవ్వరూ ఎదిరింప శక్యంకాని అటువంటి ఆ లంకానగరాన్ని చూసి హనుమంతుడు కృతనిశ్చయుడై, దానిని ఎలా సాధించాలో అని

పదేపదే యోచించసాగాడు.

36

దురాత్ముడైన ఆ రాక్షసరాజు రావణుడి కంట పడకుండా ఏ ఉపాయంతో జనకుని కుమార్తెయైన సీతాదేవిని దర్శించగలుగుతాను?

37

మహానుభావుడైన రాముని కార్యానికి భంగం కలుగకుండడానికి ఉపాయం ఏమిటి? నిర్జన ప్రదేశంలో ఏకాంతంగా ఉన్న సీతాదేవిని నేను ఒంటరిగా చూడడానికి ఉపాయం ఏమిటి?

38

భూతాశ్చార్థా వివద్యన్తే దేశకాలవిరోధితాః,
విక్లబం దూతమాసాద్య తమః సూర్యోదయే యథా.

39

అర్థానర్థాన్తరే బుద్ధిర్నిశ్చితాఽపి న శోభతే,
ఘాతయన్తి హి కార్యాణి దూతాః పణ్డితమానినః.

40

న వినశ్యేత్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లఙ్ఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్.

41

మయి దృష్టే తు రక్షోభీ రామస్య విదితాత్మనః,
భవేద్వ్యర్థమిదం కార్యం రావణానర్థమిచ్ఛతః.

42

న హి శక్యం క్వచిత్ స్థాతుమవిజ్ఞాతేన రాక్షసైః,
అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్.

43

యుక్తాయుక్త వివేచనలేని దూతలు చేయపూనుకొంటే సుసాధ్యాలయ్యే కార్యాలు సైతం దేశకాలాలకు అనుగుణాలు కాక చెడి, సూర్యోదయ సమయంలో చీకట్లలా నశిస్తాయి.

39

ఈ ఫలానా కార్యం చేయాలని నిశ్చయించుకొన్న తదుపరి కూడా లాభనష్టాల ఆలోచనకు లోనైన బుద్ధి ప్రకాశించదు. దూతలు తాము బుద్ధిమంతులమనే(తాము సర్వజ్ఞులమనే) అహంకారంతో కార్యాలను చెడగొడుతూ ఉంటారు.

40

వచ్చిన రామకార్యం చెడిపోకుండడానికి మార్గం ఏమిటి? నేను అవివేకిని కాకుండా ఉండడానికి దారి ఏమిటి? నేను చేసిన సముద్ర లంఘనం నిష్ప్రయోజనం కాకుండా ఉండడానికి ఉపాయం ఏమిటి?

41

నన్ను రాక్షసులు చూసేపక్షంలో రావణుడి వినాశంగోరే మహాత్ముడైన రాముని కార్యమంతా వ్యర్థమౌతుంది.

42

నేను రాక్షసరూపం ధరించినప్పటికీ రాక్షసులకు తెలియకుండా ఈ లంకలో ఎక్కడ ఉండడానికీ సాధ్యంకాదు. అటువంటప్పుడు ఇతర రూపం దాల్చడం గురించి వేరేగా చెప్పాలా?

43

వాయురప్యత్ర నజ్ఞాతశ్చరేదితి మతిర్మమ,
న హ్యస్త్యవిదితం కించి ద్రాక్షసానాం బలీయసామ్.

44

ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః,
వినాశ ముపయాస్యామి భర్తురర్థశ్చ హీయతే.

45

తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః,
లఙ్కామభిపతిష్యామి రాఘవ స్యార్థసిద్ధయే.

46

రావణస్య పురీం రాత్రౌ ప్రవిశ్య సుదురాసదామ్,
విచిన్వన్ భవనం సర్వం ద్రక్ష్యామి జనకాత్మజామ్.

47

ఇతి సంచిన్త్య హనుమాన్ సూర్యస్యాస్తమయం కపిః,
ఆచకాంక్షే తదా వీరో వైదేహ్యా దర్శనోత్సుకః.

48

గాలికూడా రాక్షసులకు తెలియకుండా ఈ లంకానగరంలో చొరలేదని నా అభిప్రాయం. బలోపేతులైన ఈ రాక్షసులకు తెలియరానిది ఏదీ లేనట్లుగా కానవస్తోంది.

44

నేను నా సహ (పెద్ద) రూపంతోనే ఇక్కడ సంచరిస్తే పట్టుబడి, నశిస్తాను. ప్రభువైన సుగ్రీవుని కార్యంకూడా చెడిపోతుంది.

45

ఆ కారణం వలన నా రూపాన్ని చిన్నదిగా చేసుకొని, రామకార్యం సాధింప రాత్రి సమయంలో లంకలో ప్రవేశిస్తాను.

46

సమీపింప శక్యంకాని ఈ లంకానగరంలోకి రాత్రివేళ ప్రవేశించి,

రావణుని గృహాన్ని యావత్తు వెతకి, సీతను దర్శించుకొంటాను.

47

వానరవీరుడైన హనుమంతుడు ఆ రకంగా తర్జనభర్జన చేసుకొని, సీతను దర్శించాలనే ఆసక్తిగలవాడై, సూర్యాస్తమయానికై నిరీక్షించసాగాడు.

48

సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః,
వృషదంశకమాత్రః సన్ బభూవాద్భుతదర్శనః.

49

ప్రదోషకాలే హనుమాం స్తూర్ణ ముత్ప్లుత్య వీర్యవాన్,
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్.

50

ప్రాసాదమాలావితతాం స్తమ్భైః కాఞ్చనరాజతైః,
శాతకుమ్భమయై ర్జాలై ర్గన్ధర్వనగరోపమామ్.

51

సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్,
తలైః స్ఫటికసంకీర్ణైః కార్తస్వరవిభూషితైః.

52

వైడూర్యమణిచిత్రైశ్చ ముక్తాజాలవిభూషితైః,
తలైః శుశుభిరే తాని భవనాన్యత్ర రక్షసామ్.

53

సూర్యాస్తమయం కాగానే రాత్రివేళ హనుమంతుడు, తన దేహాన్ని పిల్లి అంత ప్రమాణానికి కుదింప చేసుకొని, చూడడానికి ఆశ్చర్యం కలిగేలా రూపుమార్చుకొన్నాడు.

49

మహావీరుడైన హనుమంతుడు సాయంకాల సమయాన చటుక్కున ఎగిరి, చక్కగా విభజింపబడివున్న ప్రధాన మార్గాలున్న, సుందరమైన లంకానగరంలోకి ప్రవేశించాడు.

50

ఆ లంకానగరం భవనాల శ్రేణులతో నిండివుంది. బంగారు వెండి స్తంభాలతోను, బంగారు గవాక్షాలతోను కూడినదైన ఆ నగరం గంధర్వ నగరంలా అద్భుతంగా శోభిస్తున్నది. ఏడు, ఎనిమిది అంతస్తుల మేడలతో ఆ నగరం అలరారుతున్నది. బంగారంతో అలంకరింపబడిన ఆ మేడల పైభాగాల మీద స్ఫటిక మాణిక్యాలు పరచబడి ఉండడం హనుమంతుడు చూశాడు.

51–52

ఆ లంకానగరంలోని రాక్షసుల భవంతులు వైడూర్యమాణిక్య చిత్రితాలై, ముత్యాల సముదాయాలచే అలంకరింపబడి ప్రకాశిస్తూన్నాయి.

53

కాఞ్చనాని విచిత్రాణి తోరణాని చ రక్షసామ్,
లఙ్కా ముద్ద్యోతయామాసుః సర్వతః సమలంకృతామ్.

54

అచిన్త్యా మద్భుతాకారాం దృష్ట్వా లఙ్కాం మహాకపిః,
ఆసీద్విషణ్ణో హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః.

55

స పాణ్డురోద్విద్ధవిమానమాలినీం
మహార్హజామ్బూనదజాలతోరణామ్,
యవస్వినీం రావణబాహుపాలితాం

క్షపాచరై ర్భీమబలైః సమావృతామ్.

56

బంగారు నిర్మితాలైన, విచిత్ర వర్ణాలుగల ఆ రాక్షసుల గృహ ముఖద్వారాలు, సర్వతోముఖంగా అలంకరింపబడిన ఆ లంకానగరాన్ని ఎంతో ప్రకాశింపచేస్తున్నాయి.

54

సీతాదర్శన ఆకాంక్షితుడైన ఆ కపివరేణ్యుడు ఊహాతీతమైనదీ, ఆశ్చర్యాన్ని కలిగించేదీ అయిన ఆ లంకానగరాన్ని చూసి, సీతను చూడాలనే కుతూహలం చెందుతూ, 'ఈ లంకను జయించడం దుష్కరం కదా' అని దిగులుపడ్డాడు, 'వెంటనే సీతాదేవిని చూడగలను కదా' అని ఆనందాన్ని కూడా పొందాడు.

55

ఆ లంకానగరంలో తెల్లని మహోన్నత సౌధాలు బారులుతీరి ఉన్నాయి. ఆ సౌధాల గవాక్షాలూ, ముఖద్వారాలూ బంగారు నిర్మితాలై వెలకట్టలేనివిగా శోభిస్తూన్నాయి. రావణుని బలపరాక్రమాలచే సంరక్షింపబడుతున్న కీర్తిమంతమైన ఆ లంకానగరం బలసమన్వితులైన భయంకర రాక్షసులచే నిండివుంది.

56

చన్ద్రోఽపి సాచివ్యమివాస్య కుర్వన్
తారాగణై ర్మధ్యగతో విరాజన్,
జ్యోత్స్నావితానేన వితత్య లోకమ్
ఉత్తిష్ఠతే నైకసహస్రరశ్మిః.

57

శఙ్ఖప్రభం క్షీరమృణాలవర్ణ

ముద్గచ్ఛమానం వ్యవభాసమానమ్,
దదర్శ చన్ద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీన హంసమ్.

58

ఆ సమయంలో హనుమంతునికి తోడ్పడడానికా అన్నట్లు నక్షత్రగణ మధ్యంలో ప్రకాశిస్తూ, తన వెన్నెలతో లోకాన్ని నింపుతూ, సహస్రాధిక కిరణ సంశోభితుడై చంద్రుడు ఉదయించాడు.

57

శంఖం, పాలు, తామరతూడు వంటి తెల్లని కాంతితో ఒప్పారుతూ, సరోవరం నుండి పైకి ఎగురుతూన్న హంస చందాన ఆకాశంలో పైపైకి వస్తూ ఉన్న చంద్రుణ్ణి వానరేంద్రుడైన హనుమంతుడు దర్శించాడు.

58

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 2 వ సర్గ
సమాప్తం

3వ సర్గ
లంకాధిదేవతను ప్రతిఘటించడం

స లమ్బశిఖరే లమ్బే లమ్బతోయదసన్నిభే,
సత్త్వమాస్థాయ మేధావీ హనుమాన్ మరుతాత్మజః.

1

నిశి లఙ్కాం మహాసత్త్వో వివేశ కపికుఞ్జరః,
రమ్యకాననతోయాఢ్యాం పురీం రావణపాలితామ్.

2

శారదామ్బుధరప్రఖ్యై ర్భవనైరుపశోభితామ్,
సాగరోపమనిర్ఘోషాం సాగరానిలసేవితామ్.

3

సుపుష్టబలసంఘుష్టాం యథైవ విటపావతీమ్,
చారుతోరణనిర్యూహాం పాణ్డురద్వారతోరణామ్.

4

భజగాచరితాం గుప్తాం శుభాం భోగవతీమివ,
తాం స విద్యుద్ఘనాకీర్ణాం జ్యోతిర్మార్గనిషేవితామ్.

5

మన్దమారుతసంచారాం యథేన్ద్ర స్యామరావతీమ్,
శాతకుమ్భేన మహతా ప్రాకారే ణాభిసంవృతామ్.

6

కిఙ్కిణీజాలఘోషాభిః పతాకాభిరలంకృతామ్,
ఆసాద్య సహసా హృష్టః ప్రాకారమభిపేదివాన్.

7

విస్మయావిష్టహృదయః పురీమాలోక్య సర్వతః,
జామ్బూనదమయై ర్ద్వారై ర్వైడూర్యకృతవేదికైః.

8

వజ్రస్ఫటికముక్తాభి ర్మణికుట్టిమభూషితైః,
తప్తహాటకనిర్యూహై రాజతామలపాణ్డురైః.

9

వైడూర్యకృతసోపానైః స్ఫాటికాన్తరపాంసుభిః,
చారుసంజవనోపేతైః ఖమివోత్పతితైః శుభైః.

10

క్రౌఞ్చబర్హిణసంఘుష్టై రాజహంసనిషేవితైః,
తూర్యాభరణనిర్ఘోషైః సర్వతః ప్రతినాదితామ్.

11

వస్వోకసారాప్రతిమాం త్వాం వీక్ష్య నగరీం తతః,
ఖమివోత్పతితాం లఙ్కాం జహర్ష హనుమాన్ కపిః.

12

తాం సమీక్ష్య పురీం రమ్యాం రాక్షసాధిపతేః శుభామ్,
అనుత్తమామృద్ధియుతాం చిన్తయామాస వీర్యవాన్.

13

మహాబలశాలీ, బుద్ధిశాలీ, వాయుతనయుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన

ఆ హనుమంతుడు సమున్నత శిఖరాలతో ఎత్తైన మేఘంలా కానవస్తున్న లంబపర్వతంమీద నెలకొన్నదీ, సుందరారణ్యాలతోను, జలాశయాలతోను కూడుకొన్నదీ అయిన రావణ పాలిత ఆ లంకానగరంలో ధైర్యం వహించి ప్రవేశించాడు.

1-2

శరత్కాల మేఘాలలా ఉన్న భవంతులతో ఆ లంక శోభిస్తూవున్నది. రాక్షసుల కలకల ధ్వనులచే ఆ నగరం అప్పుడు సముద్రంలా ఘోషిస్తూవున్నది. సాగర వాయువులు లంకను సేవిస్తున్నాయి. బలిష్ఠులైన సైనికుల సింహనాదాలు మిన్ను ముట్టుతున్నాయి. వైభవంలో అలకాపురిలా ఆ నగరం తులతూగుతున్నది. ఆ నగర ముఖద్వారాలు ఏనుగుల సముదాయంతో కూడినవై ఒప్పారుతున్నాయి. తెల్లని ద్వారాలూ, బహిర్ద్వారాలూ గలదై, సర్పాలు సంచరిస్తూన్నదీ వాటి రక్షణలో ఉన్నదీయైన మంగళకరమైన భోగవతీ నగరాన్ని పోలివుంది ఆ లంకానగరం. మెరుపులతో కూడి మేఘపరివ్యాప్తమై, నక్షత్ర మార్గాన్ని స్పృశిస్తూ, మంద మారుతం వీస్తూన్న ఆ లంకాపురి దేవేంద్రుని అమరావతిలా అలరారుతూన్నది. ఆ నగరం బంగారు ప్రాకారాలచే ఆవృతమై ఉంది. చిరుగజ్జెలు సవ్వడులు చేస్తూన్న పతాకలతో ఆ లంకానగరం అలంకరింపబడివుంది. అటువంటి ఆ లంకానగరాన్ని వడివడిగా సమీపించి, సంతుష్టమనస్కుడై హనుమంతుడు ప్రాకారాన్ని చేరుకొన్నాడు.

3-7

హనుమంతుడు ఆ నగరం నలువైపులా పరికించి ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆ నగరంలోని భవంతుల ద్వారాలు బంగారంతో రూపొందించబడ్డాయి. ఆ భవంతుల అరుగులు వైడూర్యమాణిక్య విరాజమానాలు. ఆ భవంతుల గచ్చులు వజ్రాలు, స్ఫటికాలు, ముత్యాలు, మాణిక్యాలు తాపినవై ఒప్పారుతున్నాయి. బంగారు ఏనుగుల ప్రతిమలతో,

వెండిలా తెల్లనైన ఆ భవంతులలోని సోపానాలు వైడూర్యమాణిక్యాలతో నిర్మితాలై ఉన్నాయి. ప్రాకారాదుల లోపల స్ఫటిక మాణిక్యాల పుప్పొడి ఉంది. క్రౌంచ పక్షులు, నెమళ్ళు, రాజహంసలు అక్కడ తిరుగాడుతున్నాయి. శుభప్రదాలైన ఆ భవంతులు ఆకాశంలో ఎగిరిపోతున్నట్లు కానవస్తున్నాయి. నగరం యావత్తు వాద్యఘోషతో, ఆభరణాల సవ్వడితో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ రీతిలో వస్వౌకసార అనే స్వర్గలోక నగరంలా ఆకాశంలోకి ఎగిరి పోతున్నట్లుగా కనిపించే ఆ లంకానగరాన్ని చూసి హనుమంతుడు ఎంతో సంతోషించాడు.

8–12

సర్వశ్రేష్ఠమూ, ఐశ్వర్య సంపన్నమూ, మనోజ్ఞమూ, మంగళప్రదమూ అయిన ఆ రావణుని లంకానగరాన్ని చూసి పరాక్రమశాలియైన హనుమంతుడు ఇలా ఆలోచనలోపడ్డాడు.

13

నేయమన్యేన నగరీ శక్యా ధర్షయితుం బలాత్,
రక్షితా రావణబలై రుద్యతాయుధధారిభిః.

14

కుముదాబ్జదయోర్వాపి సుషేణస్య మహాకపేః,
ప్రసిద్ధేయం భవేద్భూమి ర్మైన్దద్వివిదయోరపి.

15

వివస్వతస్తనూజస్య హరేశ్చ కుశపర్వణః,
ఋక్షస్య కేతుమాలస్య మమ చైవ గతిర్భవేత్.

16

సమీక్ష్య తు మహాబాహూ రాఘవస్య పరాక్రమమ్,
లక్ష్మణస్య చ విక్రాన్తమభవత్ ప్రీతిమాన్ కపిః.

17

తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకామ్,
యన్త్రాగారస్తనీమృద్ధాం ప్రమదామివ భూషితామ్.

18

తాం నష్టతిమిరాం దీప్తైర్భాస్వరైశ్చ మహాగృహైఃr,
నగరీం రాక్షసేన్ద్రస్య స దదర్శ మహాకపిఃr.

19

ఆయుధాలు చేతపుచ్చుకొని సదా సర్వసన్నద్ధులై రావణ సేనలచే రక్షింపబడుతున్న ఈ నగరాన్ని బలంతో ఎవ్వరూ ఎదిరించలేరు.

14

కుముదుడు, అంగదుడు, మహావానరుడైన సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు – వీరికి బహుశా ఈ లంకానగరం తెలిసి ఉండవచ్చు.

15

సూర్యనందనుడైన సుగ్రీవుడు, కుశపర్వుడనే వానరుడు, కేతుమాలుడు, ఋక్షుడు, నేను నగరంలో ప్రవేశించగలుగుతాము.

16

అప్పుడు రాముని పరాక్రమాన్ని, లక్ష్మణుని విక్రమాన్ని తలచుకొని (లంకను వారు అలవోకగా జయించగలరని భావించి) హనుమంతుడు ఆనందభరితుడైనాడు.

17

రత్నకాంతులచే వస్త్రాన్ని, గిడ్డంగులనే కర్ణభూషణాలను, యంత్రాగారాలనే స్తనాలను గలిగి సర్వసంపత్సమృద్ధమైన స్త్రీలా ఆ లంకానగరం అలరారింది. రత్నకాంతులు ఈనుతూన్న గృహాలలోని దీపాలు

ప్రకాశిస్తూ నగరంలోని చీకటినంతా పారద్రోలాయి. అటువంటి లంకానగరాన్ని మహాకపివరేణ్యుడైన హనుమంతుడు చూశాడు.

18–19

అథ సా హరిశార్దూలం ప్రవిశన్తం మహాబలమ్,
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్.

20

సా తం హరివరం దృష్ట్వా లఙ్కా రావణపాలితా,
స్వయమేవోత్థితా తత్ర వికృతాననదర్శనా.

21

పురస్తాత్కపివర్యస్య వాయుసూనోరతిష్ఠత,
ముఞ్చమానా మహానాద మబ్రవీత్పవనాత్మజమ్.

22

కస్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ,
కథయస్వేహ యత్తత్త్వం యావత్ప్రాణా ధరన్తి తే.

23

మహాబలవంతుడూ, కపిశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు నగరంలోకి ప్రవేశిస్తూవుండగా, లంకానగరాధిదేవత తన నిజ స్త్రీరూపం దాల్చి అతణ్ణి చూసింది.

20

రావణునిచే పరిపాలింపబడుతున్న ఆ లంకానగరి (లంకిణి) హనుమంతుణ్ణి చూసి, వికృతమైన ముఖమూ, కళ్ళు గలదై స్వయంగా అతడి ముందు లేచి నిలిచింది.

21

ఆ లంకాధిదేవత వానరశ్రేష్ఠుడైన హనుమంతుని ముందు నిలబడి బిగ్గరగా అరుస్తూ అతడితో ఇలా అంది.

22

ఓ వానరుడా! నువ్వెవడవు? ఏ పనిమీద ఇక్కడకు వచ్చావు? ప్రాణాలు కోల్పోక మునుపే యథార్థ మేమిటో చెప్పు.

23

న శక్యం ఖల్వియం లఙ్కా ప్రవేష్టుం వానర త్వయా,
రక్షితా రావణబలైరభిగుప్తా సమన్తతః.

24

అథ తామబ్రవీద్వీరో హనుమానగ్రతః స్థితామ్,
కథయిష్యామి తే తత్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి.

25

కా త్వం విరూపనయనా పురద్వారేఽవతిష్ఠసి,
కిమర్థం చాపి మాం రుద్ధ్వా నిర్భర్త్సయసి దారుణా.

26

హనుమద్వచనం శ్రుత్వా లఙ్కా సా కామరూపిణీ,
ఉవాచ వచనం క్రుద్ధా పరుషం పవనాత్మజమ్.

27

అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః,
ఆజ్ఞాప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీమిమామ్.

28

ఓ వానరా! సర్వవిధాల సురక్షితంగా రావణ సైన్యంచే పరిరక్షింపబడుతున్న ఈ లంకానగరంలోకి నువ్వు ప్రవేశించలేవు.

24

హనుమంతు డప్పుడు తన ముందు నిలబడిన ఆమెతో ఇలా అన్నాడు: "నువ్వు అడిగినట్లు యథార్థ విషయం యావత్తు చెబుతాను.

25

"లంకానగర ద్వారంవద్ద వికృత ఆకారంతో, కళ్లతో నిలబడ్డ నువ్వెవరవు? భయంకరివైన నువ్వు నన్ను అడ్డగించి ఎందుకు బెదిరిస్తున్నావు?"

26

కామరూపిణియైన ఆ లంక (లంకాధిదేవత) హనుమంతుని మాటలు విని కోపంతో ఇలా కఠినంగా పలికింది:

27

"నేను రాక్షసుల ప్రభుమా, మహాత్ముడూ అయిన రావణుని ఆజ్ఞను శిరసా వహించేదానిని. నన్ను ఎదిరించ ఎవరికీ శక్యం కాదు. ఈ నగరాన్ని నేను రక్షిస్తున్నాను.

28

న శక్యా మామవజ్ఞాయ ప్రవేష్టుం నగరీ త్వయా,
అద్య ప్రాణైః పరిత్యక్తః స్వప్స్యసే నిహతో మయా.

29

అహం హి నగరీ లఙ్కా స్వయమేవ ప్లవఙ్గమ,
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా.

30

లఙ్కాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
యత్నవాన్ స హరిశ్రేష్ఠః స్థితశ్శైల ఇవాపరః.

31

స తాం స్త్రీరూపవికృతాం దృష్ట్వా వానరపుఙ్గవః,
ఆబభాషేఽథ మేధావీ సత్త్వవాన్ ప్లవగర్షభః.

32

ద్రక్ష్యామి నగరీం లఙ్కాం సాట్టప్రాకారతోరణామ్,
ఇత్యర్థమిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే.

33

"నన్ను మీరి నువ్వు ఈ నగరంలో ప్రవేశించలేవు. ఇప్పుడే నిన్ను చంపబోతున్నాను. నువ్వు ప్రాణాలు విడిచి దీర్ఘనిద్ర పోతావు.

29

"ఓ వానరుడా! నేను స్వయంగా లంకను. ఈ నగరాన్ని అన్నివైపుల నుండి రక్షిస్తూన్నాను. అడిగావు కనుక నా విషయం తెలిపాను."

30

స్త్రీరూపంతో ఉన్న ఆ లంక పలుకులు విని, వానరశ్రేష్ఠుడు, వాయునందనుడు అయిన హనుమంతుడు ఆమెను ఎదుర్కోవడానికి సిద్ధపడి రెండవ పర్వతంలా నిలబడ్డాడు.

31

మేధావీ, మహాబలవంతుడూ, ఎగురగలిగిన వారిలో అద్వితీయుడూ, వానరులలో శ్రేష్ఠుడూ అయిన హనుమంతుడు వికృతరూపంలో ఉన్న ఆమెను చూసి ఇలా పలికాడు:

32

"బురుజులు, ప్రాకారాలు, ముఖద్వారాలు గలిగి మనోహరంగా ఒప్పారుతున్న ఈ లంకానగరాన్ని చూడాలనే అభిలాషతో కుతూహలంకొద్దీ

ఇక్కడకు వచ్చాను.

33

వనాన్యుపవనానీహ లజ్కాయాః కాననాని చ,
సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే.

34

తస్య తద్వచనం శ్రుత్వా లజ్కా సా కామరూపిణీ,
భూయ ఏవ పునర్వాక్యం బభాషే పరుషాక్షరమ్.

35

మామనిర్జిత్య దుర్బుద్ధే రాక్షసేశ్వరపాలితామ్,
న శక్యమద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ.

36

తతః స కపిశార్దూలస్తామువాచ నిశాచరీమ్,
దృష్ట్వా పురీమిమాం భద్రే పునర్యాస్యే యథాగతమ్.

37

తతః కృత్వా మహానాదం సా వై లజ్కా భయావహమ్,
తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా.

38

"లంకానగరంలో ఉన్న తోటలను, ఉద్యానాలను, అడవులను, నగరంలో సర్వత్రా వెలసివున్న అందమైన భవంతులను చూడడానికే ఇక్కడకు నేను వచ్చాను."

34

హనుమంతుని వచనాలు విని ఇచ్ఛమేరకు వివిధ రూపాలు ధరించగల ఆ లం (లంకాధిదేవత) మళ్ళీ కఠినంగా ఇలా పలికింది.

35

ఓ దుర్బుద్ధియైన వానరాధమా! నన్ను జయించకుండా రావణ పాలిత ఈ లంకానగరాన్ని నువ్వు ఎప్పటికీ దర్శించలేవు.

36

అందుకు హనుమంతుడు ఆ రాక్షసితో, "ఓ మంగళప్రదమైనదానా! ఈ నగరాన్ని ఒకసారి దర్శించి, వచ్చిన దారినే తిరిగి పోతాను" అని నమ్రతతో చెప్పాడు.

37

అప్పుడు ఆ లంక భయంకరంగా అరిచి, వేగంగా తన అరచేతిని చాచి హనుమంతుణ్ణి కొట్టింది.

38

తతః స కపిశార్దూలో లజ్జయా తాడితో భృశమ్,
ననాద సుమహానాదం వీర్యవాన్ పవనాత్మజః.

39

తతః సంవర్తయామాస వామహస్తస్య సోఽఙ్గులీః,
ముష్టినాఽభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః.

40

స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధః స్వయం కృతః.

41

సా తు తేన ప్రహారేణ విహ్వలాఙ్గీ నిశాచరీ,
పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా.

42

తతస్తు హనుమాన్ ప్రాజ్ఞస్తాం దృష్ట్వా వినిపాతితామ్,

కృపాం చకార తేజస్వీ మన్యమానః స్త్రియం తు తామ్.

43

తతో వై భృశసంవిగ్నా లజ్కా సా గద్గదాక్షారమ్,
ఉవాచాగర్వితం వాక్యం హనూమన్తం ప్లవఙ్గమమ్.

44

లంక తనను ఆ విధంగా తీవ్రంగా కొట్టగానే పరాక్రమశాలీ, వాయునందనుడూ అయిన ఆ హనుమంతుడు మరింత బిగ్గరగా అరిచాడు.

39

అలా అరిచి, హనుమంతుడు పట్టరాని కోపంతో ఎడమచేతి వ్రేళ్ళు మడిచి, పిడికిలితో ఆమెను బలంగా కొట్టాడు.

40

స్త్రీ కదా అని తలచి ఆమెపట్ల హనుమంతుడు ఆగ్రహోదగ్రుడు కాలేదు. అయినప్పటికీ ఆ దెబ్బతో ముఖం కళ్ళు వికృతాలుకాగా ఆ రాక్షసి వెంటనే స్మృతి కోల్పోయి నేలమీద పడిపోయింది.

41–42

పిదప ప్రాజ్ఞుడూ, తేజశ్శాలీ అయిన హనుమంతుడు ఆమె అలా నేలమీద పడిపోవడం చూసి, ఆమె పట్ల జాలిపడ్డాడు.

43

అప్పుడు ఆ లం (స్త్రీ) ఎంతో భయపడి, వినమ్రంగా హనుమంతునితో గద్గదస్వనంలో ఇలా పలికింది.

44

ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ,
సమయే సౌమ్య తిష్ఠన్తి సత్త్వవన్తో మహాబలాః.

45

అహం తు నగరీ లఙ్కా స్వయమేవ ప్లవఙ్గమ,
నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల.

46

ఇదం తు తథ్యం శృణు వై బ్రువన్త్యా మే హరీశ్వర,
స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ.

47

యదా త్వాం వానరః కశ్చిద్విక్రమాద్వశమానయేత్,
తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయామాగతమ్.

48

స హి మే సమయః సౌమ్య ప్రాప్తోఽద్య తవ దర్శనాత్,
స్వయంభూవిహితః సత్యో న తస్యాస్తి వ్యతిక్రమః.

49

"గొప్ప బాహువులు గల ఓ వానరశ్రేష్ఠా! కరుణించి నన్ను రక్షించు. సౌమ్యా! నీ వంటి ధీరులు, మహాబలవంతులు 'స్త్రీలను చంపరాదు' అనే నియమాన్ని ఉల్లంఘించరు కదా!

45

"ఓ వానరా! సాక్షాత్తు లంకానగరాన్ని నేనే. వీరుడు, మహాబలశాలివి అయిన నువ్వు పరాక్రమంతో నన్ను జయించావు.

46

"ఓ వానరశ్రేష్ఠా! పూర్వం బ్రహ్మదేవుడు నాకు అనుగ్రహించిన వరం గురించి నిజం చెబుతాను, విను.

47

"ఏనాడు ఒక వానరుడు నిన్ను తన పరాక్రమంతో జయిస్తాడో, ఆ రోజే రాక్షసులకు భయం కలిగిందని (మూడిందని) గ్రహించు" అని బ్రహ్మ వచించాడు.

48

"ఓ సౌమ్యుడా! నీ దర్శనం కలుగడం వలన బ్రహ్మ విధించిన ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని గ్రహించాను. బ్రహ్మవాక్కు సత్యమే. దానికి తిరుగు లేదు.

49

సీతానిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః,
రక్షసాం చైవ సర్వేషాం వినాశః సముపాగతః.

50

తత్ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్,
విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాఞ్ఛసి.

51

ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వర
శుభాం పురీం రాక్షసరాజపాలితామ్,
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీం
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్.

52

"సీత మూలంగా దురాత్ముడైన రావణుడికీ, రాక్షసులు యావన్మందికీ వినాశకాలం ఆసన్నమైంది.

50

"ఓ వానరశ్రేష్ఠా! కనుక రావణుడు పాలించే ఈ లంకలోకి ప్రవేశించి, ఏఏ కార్యాలు సాధింపగోరావో వాటినన్నీ నిర్వర్తించుకో.

"ఓ వానరేంద్రా! రావణుడు పరిపాలిస్తూన్న ఈ మంగళకరమైన లంకా నగరానికి శాపం తగిలింది. అటువంటి ఈ నగరంలోకి యథేచ్ఛగా ప్రవేశించి, ఆనందంగా సర్వత్రా సంచరించి, పతివ్రతామతల్లియైన సీతను వెతకు" అని లంక హనుమంతునితో పలికింది.

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 3 వ సర్గ

సమాప్తం

4వ సర్గ

హనుమంతుని రావణాంతఃపుర ప్రవేశం

స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లఙ్కాం తాం కామరూపిణీమ్,
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః,
అద్వారేణ మహాబాహుః ప్రాకారమభిపుప్లువే.

1

ప్రవిశ్య నగరీం లఙ్కాం కపిరాజహితంకరః,
చక్రేఽథ పాదం సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని.

2

ప్రవిష్టః సత్త్వసంపన్నో నిశాయాం మారుతాత్మజః,
స మహాపథ మాస్థాయ ముక్తాపుష్పవిరాజితమ్.

3

తతస్తు తాం పురీం లఙ్కాం రమ్యామభియయౌ కపిః.

4

మహాపరాక్రమశాలి, తేజస్వి, వానరశ్రేష్ఠుడు అయిన హనుమంతుడు కామరూపిణీ, పురశ్రేష్ఠమూ అయిన ఆ లంకను జయించాడు. పిదప సింహద్వారం గుండా కాక ప్రాకారం లంఘించి లంకలోకి ప్రవేశించాడు. సుగ్రీవుడికి సంక్షేమం చేకూర్చేవాడైన హనుమంతుడు మొదట ఆ లంకానగర

భూభాగం మీద తన ఎడమ పాదాన్ని, శత్రువు తల మీద పెట్టినట్లు మోపాడు.

1–2

బలిష్ఠుడైన ఆ హనుమంతుడు రాత్రివేళ ముత్యాలతోను, పువ్వులతోను ప్రకాశిస్తూన్న రాజమార్గంలో వెళ్లాడు. అతడు ఆ విధంగా రాజమార్గాన్ని బట్టి రమ్యమైన లంకానగరంలో తిరుగసాగాడు.

3–4

హసితోత్కృష్టనినదై స్తూర్యఘోషపురః సరైః,
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః,
గృహమేఘైః పురీ రమ్యా బభాసే ద్యౌరివామ్బుదైః.

5

ప్రజజ్వాల తదా లఙ్కా రక్షోగణగృహైః శుభైః.

6

సితాభ్రసదృశైశ్చిత్రైః పద్మస్వస్తికసంస్థితైః,
వర్ధమానగృహైశ్చాపి సర్వతః సువిభూషితా.

7

తాం చిత్రమాల్యాభరణాం కపిరాజహితంకరః,
రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననంద చ.

8

పకపక మనే నవ్వుల సవ్వడులూ, వివిధ వాద్యాల ధ్వనులూ అక్కడ వినవస్తున్నాయి. ఆ ఇళ్ళు వజ్రాలు పొదిగిన గవాక్షాలతో అలంకరింపబడి ఉన్నాయి. కొన్ని వజ్రాల ఆకారంలోను, కొన్ని అంకుశాల ఆకృతిలోను నిర్మితాలై ఉన్నాయి. ఉన్నతాలైన గృహాలతో నెలకొనివున్న లంకానగరం, మేఘాలతో ఆకాశంలా ప్రకాశిస్తూన్నది.

5

ఆ లంకానగరం తెల్లని మేఘాలవంటి ఉన్నతమైన భవంతులతో దేదీప్య మానంగా వెలిగిపోతోంది. కొన్ని గృహాలు పద్మాకారంలోను, కొన్ని స్వస్తిక ఆకారంలోను ఉన్నాయి. కొన్ని గృహాలు వర్ధమాన లక్షణంతో ఒప్పారుతున్నాయి. ఆశ్చర్యం గొల్పేవీ, మంగళప్రదాలూ అయిన ఈ భవంతులు యావత్తు లంకానగరంలో విస్తరించి ఆ నగర శోభను ఇనుమడింపచేస్తున్నాయి.

6–7

సుగ్రీవ హితకరుడైన, రాముని కార్యార్థం సంచరిస్తూన్న హనుమంతుడు చిత్రవిచిత్ర పుష్పమాలికలతోను, భూషణాలతోను అలంకరింపబడిన ఆ లంకను చూసి ఎంతో ఆనందించాడు.

8

భవనాద్భవనం గచ్ఛన్ దదర్శ పవనాత్మజః,
వివిధాకృతిరూపాణి భవనాని తతస్తతః.

9

శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితమ్,
స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసామివ.

10

శుశ్రావ కాఞ్చీనినదం నూపురాణాం చ నిస్స్వనమ్,
సోపాననినదాంశ్చైవ భవనేషు మహాత్మనామ్.

11

ఆస్ఫోటితనినాదాంశ్చ క్ష్వేళితాంశ్చ తతస్తతః,
శుశ్రావ జపతాం తత్ర మన్త్రాన్ రక్షోగృహేషు వై.

12

స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః,

రావణస్తవసంయుక్తాన్ గర్జతో రాక్షసానపి.

13

ఒక గృహం నుండి మరొక గృహానికి వెళుతూ నానా ఆకృతులలో ఉన్న భవంతులను చూశాడు.

9

స్వర్గంలోని అప్సరసలలా మదవతులైన స్త్రీలు(వక్షం, కంఠం, శిరస్సులనే స్థానాలను బట్టి) మంద్ర మధ్యమ తార స్వరాలతో మధురంగా ఆలాపించే గీతాలు వినవచ్చాయి.

10

గొప్పవారైన రాక్షసుల భవంతులలోని స్త్రీలు నడుస్తూన్నప్పుడు జనించే వడ్డాణాల సవ్వడులు, అందెల ధ్వనులు, ఆ స్త్రీలు మేడలపైకి ఎక్కుతున్నప్పుడు దిగుతున్నప్పుడు జనించే ధ్వనులు, వీరులు తమ జబ్బలు చరచడం వలన కలిగే ధ్వనులు, సింహనాదాలు హనుమంతునికి వినవచ్చాయి.

11

రాక్షసుల గృహాలలో జపం చేసేవారి మంత్రాలను హనుమంతుడు విన్నాడు. వేదాధ్యయననిరతులైన రాక్షసులను చూశాడు. రావణునిపై స్తోత్రపాఠాలు వల్లిస్తూ, గర్జిస్తూవున్న రాక్షసులనూ అతడు చూశాడు.

12–13

రాజమార్గం సమావృత్య స్థితం రక్షోబలం మహత్,
దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్ బహూన్.

14

దీక్షితాన్ జటిలాన్ ముణ్డాన్ గోఽజినామ్బరవాససః,
దర్భముష్టిప్రహరణా నగ్నికుణ్డాయుధాం స్తథా.

15

కూటముద్గరపాణీంశ్చ దణ్డాయుధధరానపి,
ఏకాక్షా నేకకర్ణాంశ్చ లమ్బోదరపయోధరాన్.

16

కరాళాన్ భుగ్నవక్త్రాంశ్చ వికటాన్ వామనాంస్తథా,
ధన్వినః ఖడ్గినశ్చైవ శతఘ్నీముసలాయుధాన్.

17

పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్,
నాతిస్థూలా న్నాతికృశా న్నాతిదీర్ఘాతిహ్రస్వకాన్.

18

నాతిగౌరాన్నాతికృష్ణా న్నాతికుబ్జాన్న వామనాన్,
విరూపాన్ బహురూపాంశ్చ సురూపాంశ్చ సువర్చసః,
ధ్వజీన్ పతాకినశ్చైవ దదర్శ వివిధాయుధాన్.

19

రాజామార్గాన్ని ఆవరించివున్న మహారాక్షస సైన్యాన్ని, నగరం మధ్య ప్రదేశంలో రావణుడు నియమించిన అనేకమంది గూఢచారులను కూడా చూశాడు.

14

లంకానగరంలో నానారకాల రాక్షసులను హనుమంతుడు చూశాడు. యజ్ఞదీక్షలో ఉన్నవారిని, జటలు దాల్చినవారిని, బోడితలల వారిని, ఎద్దుచర్మాలు ధరించిన వారిని, ఇతర వస్త్రాలు ధరించిన వారిని చూశాడు. పిడికెళ్ళలో దర్భలనే ఆయుధాలుగా ధరించినవారిని, మారణహోమాదులు చేస్తూవుండడం వలన ఆ హోమకుండాలే ఆయుధాలుగా గల కొందరిని, కూటములు, ముద్గరములు, దండములనే ఆయుధాలు ధరించిన వారిని హనుమంతుడు చూశాడు. ఏకాక్షులను, ఒంటి చెవివాళ్లను, వ్రేలాడుతున్న

పొట్టలు, స్తనాలు గలవారిని, భయంకరమైన ఆకృతి గలవారిని, వంకర ముఖాలున్న వారిని, వికృతరూపులను, పొట్టివారిని కూడా అతడు లంకలో చూశాడు. విచిత్రమైన కవచాలతో ప్రకాశిస్తూ ధనుస్సులు, ఖడ్గాలు, శతఘ్నులు, ముసలాలు, పరిఘలు ఇత్యాది ఆయుధాలు ధరించిన కొందరు కనిపించారు. ఎక్కువ పొడవుగాగాని పొట్టిగాగాని లేనివారిని, బాగా తెల్లగాలేనివారిని, బాగా నల్లగాలేనివారిని, వికృత రూపంతో ఉన్నవారిని, నానారూపాలతో ఉన్న కొందరిని హనుమంతుడు చూశాడు. తేజస్సుతో ప్రకాశించే కొందరు, సుందరరూపులు కొందరు కనిపించారు. ధ్వజాలు, పతాకలు, నానావిధ ఆయుధాలు దాల్చిన మరికొందరినికూడా హనుమంతుడు చూశాడు.

15–19

శక్తివృక్షాయుధాంశ్చైవ పట్టిసాశనిధారిణః.

20

క్షేపణీపాశహస్తాంశ్చ దదర్శ స మహాకపిః,
ప్రగ్విణస్త్వనులిప్తాంశ్చ వరాభరణభూషితాన్.

21

నానావేషసమాయుక్తాన్యథా స్వైరగతాన్ బహూన్,
తీక్ష్ణశూలధరాంశ్చైవ వజ్రిణశ్చ మహాబలాన్.

22

శతసాహస్ర మవ్యగ్ర మారక్షం మధ్యమం కపిః,
రక్షోధిపతినిర్దిష్టం దదర్శాన్తః పురాగ్రతః.

23

అక్కడ కానవచ్చిన మహాబలవంతులైన రాక్షసులలో కొందరు శక్తులను, వృక్షములను, పట్టిసాలను, అశనులను, క్షేపణులను,

పాశములను, పదునైన శూలములను, వజ్రాయుధాలను ధరించి ఉండడం హనుమంతుడు చూశాడు. కొందరు రాక్షసులు పుష్పమాలలు ధరించి, సుగంధద్రవ్యాలు దేహానికి అలదుకొని, నానావిధ ఆభరణాలు అలంకరించుకొని, అనేక వేషాలు ధరించి కనిపించారు, స్వేచ్ఛానుసారం సంచరించ సమర్థులైన కొందరు కూడా వారిలో ఉన్నారు.

20–22

రావణునిచే ఆజ్ఞాపితులై నగరం మధ్య అంతఃపురానికి ఎదుట అప్రమత్తంగా కాపలాకాస్తున్న లక్షమంది సైనికులను హనుమంతుడు అక్కడ చూశాడు.

23

స తదా తద్గృహం దృష్ట్వా మహాహాటకతోరణమ్,
రాక్షసేన్ద్రస్య విఖ్యాత మద్రిమూర్ధ్ని ప్రతిష్ఠితమ్.

24

పుణ్డరీకావతంసాభిః పరిఖాభిరలంకృతమ్,
ప్రాకారావృతమత్యన్తం దదర్శ స మహాకపిః.

25

త్రివిష్టపనిభం దివ్యం దివ్యనాదవినాదితమ్,
వాజిఘోషితసంఘుష్టం నాదితం భూషణైస్తథా,

26

రథైర్యానైర్విమానైశ్చ తథా హయగజైః శుభైః,
వారణైశ్చ చతుర్దంతైః శ్వేతాభ్రనిచయోపమైః,

27

భూషితం రుచిరద్వారం మత్తైశ్చ మృగపక్షిభిః,
రక్షితం సుమహావీర్యైర్యాతుధానైః సహస్రశః,

రాక్షసాధిపతేర్ముప్తమావివేశ మహాకపిః.

28

అప్పుడు హనుమంతుడు బంగారుమయమైన ముఖద్వారం ఉన్న రావణుని భవనాన్ని చూశాడు. ఆ భవనం ఒక పర్వత శిఖరం మీద నిర్మితమై ఉంది. తామరలతో నిండిన అగడ్తలు కలిగి, ప్రాకారావృతమైన ఆ భవనాన్ని హనుమంతుడు తిలకించాడు.

24–25

ఆ రావణుని భవనం స్వర్గంలా శోభిల్లుతూన్నది. ఆ భవనంలో సుమధుర స్వనాలు, గుర్రాల సకిలింతలు, స్త్రీ పురుషులు ధరించిన భూషణాలు చేసే సవ్వడులు వినవస్తున్నాయి. రథాలు, వాహనాలు, విమానాలు, మంగళకరములైన అశ్వాలు, తెల్లని మేఘసముదాయం వంటి నాలుగేసి దంతాలుగల గొప్ప ఏనుగులు ఆ భవనానికి అలంకారంగా ఒప్పారుతున్నాయి. మత్తిల్లిన లేళ్ళతోను, పక్షులతోను ఆ భవన ద్వారాలు శోభాయమానమై అలరారుతున్నాయి. మహాపరాక్రమశాలురైన వేలాది రాక్షసులు ఆ భవనానికి కావలిగా ఉన్నారు. అటువంటి ఆ రావణుని భవనంలోకి రహస్యంగా హనుమంతుడు ప్రవేశించాడు.

26–28

స హేమజామ్బూనదచక్రవాళం,
మహార్హ ముక్తామణిభూషితాన్తమ్,
పరార్థ్యకాలాగురుచన్దనాక్తం
స రావణాన్తఃపురమావివేశే.

29

బంగారుమయమైన ఆ రావణుని అంతఃపురం చుట్టూ బంగారు ప్రాకారం నిర్మించబడి ఉంది. విలువకట్టలేని ముత్యాలతోను, మణులతోను

అలంకరింపబడిన ఆ అంతఃపుర మధ్య ప్రదేశం మేలైన అగరు, చందనం కలిసిన జలంతో తడుపబడి ఉంది. అటువంటి రావణుని అంతఃపురంలోకి హనుమంతుడు ప్రవేశించాడు.

29

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 4వ సర్గ

సమాప్తం

5వ సర్గ
లంకలో సీతాన్వేషణం

తతః స మధ్యంగతమంశుమన్తం
జ్యోత్స్నావితానం మహదుద్వమన్తమ్
దదర్శ ధీమాన్ దివి భానుమన్తం
గోష్ఠే వృషం మత్తమివ భ్రమన్తమ్.

1

లోకస్య పాపాని వినాశయన్తం
మనోదధిం చాపి సమేధయన్తమ్
భూతాని సర్వాణి విరాజయన్తం
దదర్శ శీతాంశుమథాభియాన్తమ్.

2

తరువాత ధీమంతుడైన హనుమంతుడు ఆకాశ మధ్యంలో తన కిరణాలచే వెన్నెలను విస్తృతంగా వ్యాపింపచేస్తూ, గోశాలలో తిరుగాడుతున్న ఆబోతులా ఉన్న చంద్రుణ్ణి చూశాడు.

1

లోకుల దుఃఖాలను అన్నింటిని నశింపజేస్తూ, సమస్త ప్రాణులను ప్రకాశింపజేస్తూ, సముద్రాన్ని ఉప్పొంగింపచేస్తూ, చల్లని కిరణాలతో ఆకాశంలో సంచరిస్తున్న చంద్రుణ్ణి హనుమంతుడు చూశాడు.

2

యా భాతి లక్ష్మీర్భువి మన్దరస్థా
తథా ప్రదోషేషు చ సాగరస్థా
తథైవ తోయేషు చ పుష్కరస్థా
రరాజ సా చారునిశాకరస్థా.

3

హంసో యథా రాజతపఞ్జరస్థః
సింహో యథా మన్దరకన్దరస్థః,
వీరో యథా గర్వితకుఞ్జరస్థః
చన్ద్రోఽపి బభ్రాజ తథామ్బరస్థః.

4

స్థితః కకుద్మానివ తీక్ష్ణశృఙ్గో
మహాచలః శ్వేత ఇవోచ్చశృఙ్గః,
హస్తీవ జామ్బూనదబద్ధశృఙ్గో
రరాజ చన్ద్రః పరిపూర్ణశృఙ్గః.

5

భూమ్మీది గల మందర పర్వతంపై ఏ శోభ ఉంటుందో, ప్రదోష కాలాల్లో(సాయంకాలాల్లో) సముద్రమునందు ఏ ప్రకాశం ఉంటుందో, జలములందలి కమలాలలో ఏ కాంతి ఉంటుందో, అట్టి ప్రకాశమే చంద్రునిలో మహోజ్జ్వలంగా కానవస్తున్నది.

3

వెండి పంజరంలో ఉన్న హంస ఎలా ప్రకాశిస్తుందో, మందర పర్వత గుహలోని సింహం ఎలా ప్రకాశిస్తుందో, మదించిన ఏనుగు మీద ఉన్న వీరుడు ఎలా ప్రకాశిస్తాడో, ఆకాశంలో ఉన్న చంద్రుడు అలా ప్రకాశిస్తున్నాడు.

4

వాడి కొమ్ములున్న వృషభంలా, మహోన్నత శిఖరాలు గల తెల్లని మహాపర్వతంలా, బంగారపు తొడుగులు దాల్చిన దంతాలు గల ఏనుగులా అప్పుడు పరిపూర్ణ కళలతో చంద్రుడు ప్రకాశిస్తూన్నాడు.

5

వినష్టశీతామ్బుతుషారపఙ్కో
మహాగ్రహగ్రాహ వినష్టపఙ్కః
ప్రకాశలక్ష్మ్యాశ్రయ నిర్మలాఙ్కో
రరాజ చన్ద్రో భగవాన్ శశాఙ్కః.

6

శిలాతలం ప్రాప్య యథా మృగేన్ద్రో
మహారణం ప్రాప్య యథా గజేన్ద్రః,
రాజ్యం సమాసాద్య యథా నరేన్ద్ర
స్తథాప్రకాశో విరరాజ చన్ద్రః.

7

ప్రకాశచన్ద్రోదయనష్టదోషః
ప్రవృద్ధరక్షఃపిశితాశదోషః,
రామాభిరామేరిత చిత్తదోషః
స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోషః.

8

మంచు తుంపరలను మాలిన్యము తొలగిపోయి, మహాగ్రహమైన సూర్యుని కిరణాలు తనపై ప్రతిఫలించడం వలన అంధకారమంతా నశించిపోగా, గొప్ప కాంతిని పొంది స్పష్టంగా కానవస్తున్న అంకము(మచ్చ) గలవాడూ, పూజ్యుడూ అయిన శశాంకుడు(చంద్రుడు) ప్రకాశిస్తున్నాడు.

6

ఆకాశం పైకి వస్తూన్న ఆ చంద్రుడు శిలాతలం మీదికి ఎక్కి నిలబడ్డ సింహం మల్లే, యుద్ధరంగంలో ప్రవేశించిన గజరాజుమల్లే, రాజ్యాన్ని పొందిన రాజుమల్లే ప్రకాశించాడు.

7

స్వర్గం మల్లే ప్రకాశిస్తూన్న పావనమైన ఆ సాయం సమయంలో చంద్రుడు ఉదయించి ప్రకాశిస్తూ ఉండడంతో చీకటి నశించింది. రాక్షసులు మాంసభక్షణానికి ఉపక్రమించారు. తమ తమ మనస్సులలోని కోపాలను విడిచి స్త్రీలు, వారి ప్రియులు కలిసికోసాగారు.

8

తన్త్రీస్వనాః కర్ణసుఖాః ప్రవృత్తాః
స్వపన్తి నార్యః పతిభిః సువృత్తాః
నక్తంచరాశ్చాపి తథా ప్రవృత్తా
విహర్తుమత్యద్భుతరౌద్రవృత్తాః.

9

మత్తప్రమత్తాని సమాకులాని
రథాశ్వభద్రాసనసంకులాని,
వీరః శ్రియా చాపి సమాకులాని
దదర్శ ధీమాన్ స కపిః కులాని.

10

పరస్పరం చాధికమాక్షిపన్తి
భూజాంశ్చ పీనాన్‌ధినిక్షిపన్తి,
మత్తప్రలాపానధివిక్షిపన్తి
మత్తాని చాన్యోన్యమధిక్షిపన్తి.

11

ఆ సమయంలో చెవులకు ఇంపుగా వీణానాదం వినవస్తూన్నది. పవిత్ర చరిత్రులైన స్త్రీలు భర్తల ప్రక్కన శయనిస్తూన్నారు. అమిత ఆశ్చర్యమును కలిగించు ప్రవర్తనగల రాక్షసులు సైతం విహరిస్తూన్నారు.

9

వీరుడూ, బుద్ధిమంతుడూయైన ఆ హనుమంతుడు అనేక రకాల గృహాలను తిలకించాడు. వాటిలో కొన్ని గృహాలలో మదించి ఏమరపాటుతో ఉన్న జనులు ఉన్నారు. మరికొన్ని గృహాలు రథాలతోను, అశ్వాలతోను, భద్రజాతికి చెందిన ఏనుగులతోను, ఉత్తమమైన ఆసనాలతోను అలంకరింపబడినవిగా విరాజిల్లుతున్నవి. ఈ గృహాలన్నీ సిరిసంపదలతో తులతూగుచూ, కళకళలాడుతూన్నవి.

10

ఆ గృహాలలో వసిస్తూన్న రాక్షసులు పరస్పరం హేళన చేసుకుంటూ తమ బలిష్ఠమైన బాహువులను ఇటూ అటూ కదల్చుచున్నారు. కొంతమంది మద్యపానంచే మత్తులై ఎక్కువగా ప్రేలాపనలలో నిమగ్నులై ఉన్నారు. మరికొందరు ఒకరినొకరు ఆక్షేపించుకొనుచున్నారు. ఇలాంటి ధోరణిలో ఉన్న రాక్షసులు హనుమంతుని కంటబడ్డారు.

11

రక్షాంసి వక్షాంసి చ విక్షిపన్తి
గాత్రాణి కాన్తాసు చ విక్షిపన్తి
రూపాణి చిత్రాణి చ విక్షిపన్తి
దృఢాని చాపాని చ విక్షిపన్తి.

12

దదర్శ కాన్తాశ్చ సమాలభన్త్య
స్తథా పరాస్తత్ర పునః స్వపన్త్యః,

సురూపవక్త్రాశ్చ తథా హసన్త్యః
క్రుద్ధాః పరాశ్చాపి వినిఃశ్వసన్త్యః.

13

మహాగజైశ్చాపి తథా నదద్భిః
సుపూజితైశ్చాపి తథా సుసద్భిః,
రరాజ వీరైశ్చ వినిఃశ్వసద్భి
ర్భుదోభుజజ్జైరివ నిఃశ్వసద్భిః.

14

రాక్షసులలో కొందరు తమ రొమ్ములను విరచుకొనుచున్నారు. కొందరు తమ ప్రియురాళ్లపై పడుచున్నారు. మరికొందరు విచిత్రాలయిన రూపాలను ప్రదర్శిస్తూన్నారు. ఇంక కొందరు దృఢాలయిన ధనుస్సులను ఎక్కుపెట్టి తిరుగుచున్నారు.

12

ఆ గృహాలలోని అందమైన స్త్రీలు కొందరు తమ శరీరాలకు చందనాదులు అలదుకుంటున్నారు. మరికొందరు స్త్రీలు నిద్రిస్తున్నారు. చక్కని రూపమూ, అందమైన ముఖమూ ఉన్న ఇంకొందరు స్త్రీలు నవ్వుకుంటున్నారు. కొందరు వనితలు ప్రియుల పట్ల కోపం వహించి నిట్టూర్పులు విడుస్తున్నారు. ఇటువంటస్త్రీలను హనుమంతుడు అక్కడ చూశాడు.

13

ఆ మహానగరం ధ్వని చేస్తూన్న మహాగజాలతోను, పూజనీయులైన ఉత్తమ పురుషులతోను ప్రకాశిస్తూన్నది. దీర్ఘనిశ్శ్వాసాలు విడుస్తున్న వీరులతో ఆ మహానగరం బుసలు కొడుతూన్న సర్పాలతో నిండివున్న మడుగుమల్లే వెలుగొందుతూన్నది.

14

బుద్ధిప్రధానాన్ రుచిరాజభిధానాన్
సంశ్రద్ధానాన్ జగతః ప్రధానాన్
నానావిధానాన్ రుచిరాభిధానాన్
దదర్శ తస్యాం పురి యాతుధానాన్.

15

ననన్ద దృష్ట్వా స చ తాన్ సురూపా
న్నానాగుణానాత్మ గుణానురూపాన్,
విద్యోతమానాన్స తదానురూపాన్
దదర్శ కాంశ్చిచ్చ పునర్విరూపాన్.

16

తతో వరార్హాః సువిశుద్ధభావా
స్తేషాం స్త్రియస్తత్ర మహానుభావాః,
ప్రియేషు పానేషు చ సక్తభావా
దదర్శ తారా ఇవ సుప్రభావాః.

17

ఆ నగరంలో బుద్ధిజీవులైన (బుద్ధియే ప్రధానంగా గల) అనేక మంది రాక్షసులను హనుమంతుడు చూశాడు. వారు మనోహరంగా మాట్లాడుతూ, శ్రద్ధాసక్తులతో నానారకములైన కార్యములందు పాల్గొనుచూ, జగత్తులో ప్రధానులై, మనోహరమైన నామధేయాలతో అలరారుతున్నారు.

15

చక్కని రూపవంతులైన ఆ బుద్ధిజీవులందరూ సద్గుణాలతో విరాజిల్లుతూ తమ తమ గుణాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ భాసిస్తూన్నారు. వారిని చూసి హనుమంతుడు ఎంతో సంతోషించాడు. వికృత రూపులైన కొందరు రాక్షసులు కూడా అక్కడ హనుమంతునికి కానవచ్చారు. వారి

రూపాలకు అనుగుణంగానే వారి ప్రవృత్తులు అమరి ఉన్నాయి.

16

తదనంతరం హనుమంతుడు ఆ గృహములందు ఉత్తమ గుణగణాలను సంతరించుకొన్న వారూ, గొప్ప ప్రభావము గల వారూ అయిన స్త్రీలను చూశాడు. ఆ రాక్షసాంగనలు తమ ప్రియుల ఎడ గల ప్రేమాతిశయంచే మద్యపానం పట్ల అభిరుచి గలవారై ఉన్నారు. అంతేగాక కాంతివంతమైన నక్షత్రాల మల్లే వారు ప్రకాశిస్తూన్నారు.

17

శ్రియా జ్వలన్తీస్త్రపయోపగూఢా
నిశీథకాలే రమణోపగూఢాః
దదర్శ కాశ్చిత్ప్రమదోపగూఢా
యథా విహఙ్గాః కుసుమోపగూఢాః.

18

అన్యాః పునర్హర్మ్యతలోపవిష్టా
స్తత్ర ప్రియాజ్కేషు సుఖోపవిష్టాః,
భర్తుః ప్రియా ధర్మపరా నివిష్టా
దదర్శ ధీమాన్ మదనాభివిష్టాః.

19

అప్రావృతాః కాఞ్చనరాజివర్ణాః
కాశ్చిత్పరార్థ్యాస్తపనీయవర్ణాః,
పునశ్చ కాశ్చిచ్ఛశలక్ష్మవర్ణాః
కాన్తప్రహీణా రుచిరాఙ్గవర్ణాః.

20

అర్ధరాత్రి సమయంలో కాంతితో ప్రకాశిస్తూ తమ ప్రియుల కౌగిళ్ళలో

ఒదిగిపోయి సిగ్గుపడుతూ కొందరు స్త్రీలు అమిత ఆనందాన్ని పొందుతున్నారు. పుష్పములచేత కప్పబడిన పక్షులమల్లే వారు కానవచ్చారు. అలాంటి స్త్రీలు కూడా కొందరు హనుమంతుని కంటబడ్డారు.

18

మేడల పై భాగాలలో భర్తల ఒడులలో సుఖంగా కొందరు స్త్రీలు కూర్చుని ఉన్నారు. భర్తల ప్రేమకు నోచుకొన్న మరికొందరు మన్మథావేశానికి గురియై వారితో రతిక్రీడలలో మునిగి ఉన్నారు. వీరందరూ ధర్మమార్గావలంబులు. అలాంటి స్త్రీలను హనుమంతుడు చూశాడు.

19

హనుమంతునికి కానవచ్చిన కొందరు స్త్రీలు వస్త్రవిహీనులై, బంగారు తీగల వన్నెలో ఉన్నారు. అత్యంత సంభోగానందం అందించగల కొందరు అతివలు పుటం పెట్టిన బంగారు వర్ణంలో ఉన్నారు. చంద్రునిలో మచ్చ రంగుమల్లే కొందరి స్త్రీల శరీరవర్ణం ఉన్నది. అందమయిన అవయవాలు, రంగు సంతరించుకొన్న కొందరు స్త్రీలు ప్రియుల వియోగంతో బాధపడుతూ కానవచ్చారు.

20

తతః ప్రియాన్ ప్రాప్య మనోభిరామాన్
సుప్రీతియుక్తాః ప్రసమీక్ష్యరామాః
గృహేషు హృష్టాః పరమాభిరామా
హరిప్రవీరః స దదర్శ రామాః.

21

చన్ద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలాః
వక్రాక్షి పక్ష్మాశ్చ సునేత్రమాలాః,
విభూషణానాం చ దదర్శ మాలాః

శతప్రదానామివ చారుమాలాః.

22

న త్వేవ సీతాం పరమాభిజాతాం
పథి స్థితే రాజకులే ప్రజాతామ్
లతాం ప్రపుల్లామివ సాధు జాతాం
దదర్శ తన్వీం మనసాభిజాతామ్.

23

అమిత సౌందర్యవతులై, తమ మనస్సులకు ఆహ్లాదమును కలిగించు ప్రియుల పొందులో ఆనందమనుభవిస్తూ సుఖసంతోషాలతో తమతమ గృహాలలో ఉన్న స్త్రీలను హనుమంతుడు చూశాడు.

21

చంద్రుని మల్లే ప్రకాశిస్తూ ఉన్న ముఖాల వరుసలు, వంకరగా ఉన్న కనురెప్పలుగల అందమైన నేత్ర పంక్తులు, మెరపుల యొక్క అందమైన మాలల మల్లే ఉన్న అలంకారాల వరుసలు అక్కడ హనుమంతునకు కనిపించాయి.

22

ఇందరు స్త్రీలు హనుమంతునికి కనిపించినప్పటికీ పరమ సౌందర్యవతీ, నిలకడగా ధర్మమార్గమందున్న రాజవంశంలో అవతరించినదీ, బాగుగా ఎదిగి విరాజిల్లు పూదీగ మల్లే కోమల శరీరం గలదీ, సంకల్ప మాత్రాన శరీరం దాల్చినదీ అయిన సీతాదేవి మాత్రం కానరాలేదు.

23

సనాతనే వర్త్మని సంనివిష్టాం
రామేక్షణాం తాం మదనాభివిష్టామ్
భర్తుర్మనః శ్రీమదనుప్రవిష్టాం

స్త్రీభ్యో వరాభ్యశ్చ సదా విశిష్టామ్.

24

ఉష్ణార్దితాం సానుసృతాస్రకంఠీం
పురా వరార్హోత్తమనిష్కకంఠీమ్,
సుజాతపక్ష్మామభిరక్త కంఠీం
వనే ప్రవృత్తామివ నీలకంఠీమ్.

25

అవ్యక్తరేఖామివ చన్ద్రరేఖాం
పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్,
క్షతప్రరూఢామివ బాణరేఖాం
వాయుప్రభిన్నామివ మేఘురేఖామ్.

26

అతి ప్రాచీనమైన పాతివ్రత్య ధర్మమున నిరతురాలు, రాముని యందే దృష్టి గలదీ, రామదర్శనానికై తను తపించిపోతున్నదీ, రాముని హృదయంలో స్థిరంగా నిలచి ఉన్నదీ, సదా శ్రేష్ఠులయిన స్త్రీలందరికన్నా ఉత్తమురాలైన సీత మాత్రం కనిపించలేదు.

24

రామ విరహ తాపముచే పీడితురాలై నిరంతరం బాష్పాలు కంఠమునందు గలదీ, పూర్వం కంఠమున అమూల్యమైన నిష్కమనే ఆభరణం ధరించినదీ, దట్టంగా అందంగా ఉన్న కనురెప్పలు గలదీ, మధురమైన కంఠస్వరం గలదీ, వనంలో నాట్యం చేయని ఆడునెమలి మల్లే ఉన్నదీ అయిన సీత మాత్రం హనుమంతునికి కనిపించలేదు.

25

అస్పష్టమైన చంద్రరేఖమల్లే ఉన్నదీ (కృశించి ఉండడానికీ, కాంతి

తరిగి ఉండడానికీ ఇది ఉదాహరణ), దుమ్ముచే కప్పబడిన బంగారు కడ్డీమల్లే, గాయమై అది మానిపోయినా దాని గుర్తుగా మిగిలిపోయిన బాణం దెబ్బవల్ల ఏర్పడ్డ రేఖమల్లే, వాయువుచే చెదరిన మేఘమాల మల్లె ఉన్న సీతాదేవి మాత్రం హనుమంతునికి కనిపించలేదు.

26

సీతామపశ్యన్ మనుజేశ్వరస్య
రామస్య పత్నీం వదతాం వరస్య
బభూవ దుఃఖాభిహతశ్చిరస్య
ప్లవంగమో మంద ఇవాచిరస్య.

27

నరేంద్రుడూ, యుక్తియుక్తంగా మాట్లాడు నేర్పుగల వారిలో శ్రేష్ఠుడూ అయిన శ్రీరాముని భార్యయైన సీతాదేవిని చాలాసేపు వెదకినప్పటికీ ఆమె కానరాకపోవడంతో హనుమంతుడు కాసేపు మందునివలె నిరాశానిస్పృహలకు లోనయ్యాడు.

27

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 5వ సర్గ సమాప్తం

6వ సర్గ
రావణాంతఃపురంలో సీతాన్వేషణం

స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్,
విచచార పునర్లఙ్కాం లాఘవేన సమన్వితః.

1

ఆససాదాథ లక్ష్మీవాన్రాక్షసేన్ద్రనివేశనమ్,
ప్రాకారేణార్కవర్ణేన భాస్వరేణాభిసంవృతమ్.

2

రక్షితం రాక్షసైర్భీమైః సింహైరివ మహద్వనమ్,
సమీక్షమాణో భవనం చకాశే కపికుఞ్జరః.

3

కోరిన రూపాలను ధరించ గల సమర్థుడైన ఆ హనుమంతుడు అనేక గృహాలలో అన్వేషించినా సీత కానరాకపోవడంతో దిగులుపడి మళ్లీ మహావేగంతో సీతాన్వేషియై లంకానగరంలో తిరుగసాగాడు.

1

ఆ తరువాత శుభలక్షణాలున్న హనుమంతుడు సూర్యుని వర్ణముతో ప్రకాశిస్తూన్న ప్రాకారంచే పరివృతమై ఉన్న రావణుని భవనమున ప్రవేశించెను.

2

సింహాలచే మహారణ్యం పరిరక్షింపబడుచున్నట్లు, భీకరులైన రాక్షసులు కావలి ఉన్న ఆ రావణుని భవంతిని జాగ్రత్తగా పరిశీలిస్తూ హనుమంతుడు అచ్చెరవు చెందాడు.

3

రూప్యకోపహితై శ్చిత్రైస్తోరణైర్హేమభూషితైః,
విచిత్రాభిశ్చ కక్ష్యాభిర్వ్యాప్తైశ్చ రుచిరైర్వృతమ్.

4

గజాస్థితైర్మహామాత్రైః శూరైశ్చ విగతశ్రమైః,
ఉపస్థితమసంహార్యైర్హయైః స్యన్దనయాయిభిః.

5

సింహవ్యాఘ్రతనుత్రాణై ర్దాన్తకాఞ్చనరాజతైః,
ఘోషవద్భిర్విచిత్రైశ్చ సదా విచరితం రథైః.

6

బహురత్నసమాకీర్ణం పరార్థ్యాసనభాజనమ్,
మహారథసమావాసం మహారథమహాస్వనమ్.

7

దృశ్యైశ్చ పరమోదారైస్తైస్తైశ్చ మృగపక్షిభిః,
వివిధైర్బహుసాహస్రైః పరిపూర్ణం సమన్తతః.

8

వెండితోనూ, బంగారంతోనూ నిర్మితమై అలంకరింపబడి మిగుల సుందరముగాను, ఆశ్చర్యంగొలుపునట్టి ముఖద్వారములతోను, వాకిళ్లతోను ఆ రావణుని భవనం విరాజిల్లుచున్నది.

4

ఏమాత్రం శ్రమ ఎరుగని శూరులయిన గజపాలకులు గజములను అధిష్ఠించి ఆ రావణ భవనాన్ని కాపలాకాస్తున్నారు. అజేయములైన గుర్రాలను పూన్చిన రథములపై సంచరిస్తూన్న వీరులు కూడా ఆ భవనంలో ఉన్నారు.

5

సింహాల, పులుల చర్మాలతో చేయబడ్డ కవచములు అమర్చబడినవీ, బంగారు, వెండి, దంతాలతో అలంకరింపబడినవీ, అయిన విచిత్రమైన రథాలు మహాధ్వనితో సదా అక్కడ సంచరిస్తూ ఉన్నవి.

6

అనేక రత్నాలచే అలంకరింపబడిన అమూల్యమైన ఆసనాలూ, పాత్రలూ ఆ రావణుని భవనంలో కోకొల్లలుగా ఉన్నవి. అంతేగాక మహారథులకు నివాస స్థానంగా అది అలరారుతున్నది. శ్రేష్ఠమైన రథాలూ, ఉత్తమాసనాలూ ఆ భవనంలో చోటుచేసుకొన్నాయి.

7

చూడ ముచ్చట గొలిపే, అద్వితీయ లక్షణములున్న అనేక విధాలైన మృగాలూ, పక్షులూ వేలసంఖ్యలో ఆ రావణ భవనంలో ఎల్లెడలా కానవస్తున్నాయి.

8

వినీతైరన్తపాలైశ్చ రక్షోభిశ్చ సురక్షితమ్,
ముఖ్యాభిశ్చ వరస్త్రిభిః పరిపూర్ణం సమన్తతః.

9

ముదితప్రమదారత్నం రాక్షసేన్ద్రనివేశనమ్,
వరాభరణసంహ్రాదైః సముద్రస్వననిస్వనమ్.

10

తద్రాజగుణసంపన్నం ముఖ్యైశ్చాగరుచన్దనైః,

మహాజనైః సమాకీర్ణం సింహైరివ మహద్వనమ్.

11

భేరీమృదఙ్గాభిరుతం శఙ్ఖఘోషనినాదితమ్,
నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసైః సదా.

12

సుశిక్షితులూ, వినయ ప్రవర్తన గలవారూ అయిన రాక్షసులు వెలుపల నుండి ఆ భవనాన్ని రక్షిస్తున్నారు. ఆ భవనంలో ప్రతిచోట ఆనందంలో మునిగివున్న కులీనవంశ సంజాతలైన సుందరాంగులు కానవస్తున్నారు.

9

రావణుని నివాసమైన ఆ భవనంలో సంతోషంతో ఓలలాడుతున్న స్త్రీరత్నాలు ఎందరో నివసిస్తూ ఉన్నారు. ఆ భవనం నుండి సముద్ర ధ్వని మల్లే శ్రేష్ఠములైన వారి ఆభరణముల మంజుల రవములు వినవస్తున్నాయి.

10

ఛత్రచామరాది రాజచిహ్నాలతో కూడినదీ, శ్రేష్ఠములయిన అగరు చందనాది లేపన ద్రవ్యాలతో నిండినదీ, మహాజనులతో నిండి ఉన్న ఆ రావణ భవనం సింహాలతో వ్యాప్తమైన మహారణ్యం మల్లే శోభిస్తోంది.

11

భేరీమృదంగ ధ్వానాలతోను, శంఖ ధ్వనులతోను ఆ భవనం ప్రతిధ్వనిస్తూ ఉన్నది. ఆ భవనమునందు నిత్యమూ గంధపుష్పాదులచే అర్చనలు జరుగుతూ ఉండటమే కాక, పౌర్ణమి అమావాస్య మున్నగు పర్వదినాలలో హోమములు కూడా ఒనరుస్తూ ఉంటారు. ఆ భవనాన్ని సదా రాక్షసులు పూజిస్తూ ఉంటారు.

12

సముద్రమివ గమ్భీరం సముద్రమివ నిస్స్వనమ్,

మహాత్మనో మహాద్వేశ్మ మహారత్నపరిచ్ఛదమ్.

13

మహారత్నసమాకీర్ణం దదర్శ స మహాకపిః,
విరాజమానం వపుషా గజాశ్వరథ సంకులమ్.

14

లజ్జాభరణమిత్యేవ సోఽమన్యత మహాకపిః
చచార హనుమాంస్తత్ర రావణస్య సమీపతః.

15

గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ వానరః,
వీక్షమాణోఽప్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః.

16

అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
తతోఽన్యత్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్.

17

సముద్రం మల్లే ఆ భవన నడిమి భాగం గంభీర ముద్ర వహించి నిశ్శబ్దంగా ఉంది. ఆ భవనం పైకప్పునకు మహారత్నాలు అనేకం పొదగబడి ఉన్నాయి. ఆ భవనం రత్నమయమై ఒప్పారుతున్నది. మహాత్ముడైన రావణుని ఆ గొప్పదైన భవనాన్ని హనుమంతుడు చూశాడు.

13

రథగజతురగముల సమూహముతో క్రిక్కిరిసి, అతిసుందరరూపంతో అలరారుతూన్న ఆ రావణ సౌధరాజాన్ని లంకానగరానికే అలంకారమని భావిస్తూ హనుమంతుడు, రావణుని సమీపననే సంచరించసాగాడు.

14–15

మనస్సులో ఏమాత్రమూ జంకూగొంకూ లేక రాక్షసుల గృహాలను, వాటి ఉద్యానవనాలను ఒకటి వెంట ఒకటిగా సీతాదేవికై అన్వేషిస్తూ ఆ హనుమంతుడు తిరుగసాగాడు.

16

పరాక్రమశాలీ, మహావేగవంతుడూ అయిన హనుమంతుడు ముందుగా రావణుని మంత్రియైన ప్రహస్తుని గృహంలోకి దూకి, అక్కణ్ణుంచి మహాపార్శ్వుని ప్రాసాదంలోకి దూకాడు.

17

అథ మేఘప్రతీకాశం కుమ్భకర్ణనివేశనమ్,
విభీషణస్య చ తథా పుప్లువే స మహాకపిః.

18

మహోదరస్య చ గృహం విరూపాక్షస్య చైవ హి,
విద్యుజ్జిహ్వస్య భవనం విద్యున్మాలేస్తథైవ చ.

19

వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః.

20

తథా చేన్ద్రజితో వేశ్మ జగామ హరియూథపః,
జమ్బుమాలేః సుమాలేశ్చ జగామ హరిసత్తమః.

21

రశ్మి కేతోశ్చ భవనం సూర్యకేతో స్తథైవ చ,
వజ్రకాయస్య చ తథా పుప్లువే స మహాకపిః.

22

ఆ తరువాత హనుమంతుడు మేఘసదృశమైన కుంభకర్ణుని భవనంలోనికి, తదుపరి విభీషణుని ప్రాసాదంలోనికి ప్రవేశించాడు.

18

తదనంతరం హనుమంతుడు వరుసగా మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి అను రాక్షస ప్రముఖుల గృహాల లోనికి దుమికెను.

19

మహాతేజస్వీ, వానరసైన్య పాలకుడూ అయిన హనుమంతుడు తరువాత వజ్రదంష్ట్రుని, శుకుని గృహాలలోనికి, ధీమంతుడైన సారణుని గృహంలోనికి, ఇంద్రజిత్తు భవనం లోనికి సైతం వెళ్లి సీతకోసం వెతికాడు.

20

జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు, సూర్యకేతువు, వజ్రకాయుడు అనే రాక్షస వీరుల గృహాల మీదికి దూకి, అక్కడ కూడా వెతుక నారంభించాడు.

21–22

ధూమ్రాక్షస్య చ సంపాతేర్భవనం మారుతాత్మజః,
విద్యుద్రూపస్య భీమస్య ఘనస్య విఘనస్య చ.

23

శుకనాసస్య వక్రస్య శఠస్య వికటస్య చ,
బ్రహ్మకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః.

24

యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య నాదినః,
విద్యుజ్జిహ్వేన్ద్రజిహ్వానాం తథా హస్తిముఖస్య చ.

25

కరాళస్య విశాచస్య శోణితాక్షస్య చైవ హి,
క్రమమాణః క్రమేణైవ హనుమాన్మారుతాత్మజః.

26

తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
తేషామృద్ధిమతామృద్ధిం దదర్శ స మహాకపిః.

27

సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమన్తతః,
ఆసాసాదాథ లక్ష్మీవాన్ రాక్షసేన్ద్రనివేశనమ్.

28

తదనంతరం హనుమంతుడు క్రమంగా ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, బ్రహ్మకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, నాది, విద్యుజ్జిహ్వుడు, ఇంద్రజిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు అనే రాక్షసాగ్రగణ్యుల భవంతుల మీదికి కూడా దూకి, అక్కడా అన్వేషించాడు. వాయునందనుడూ, మహాయశస్వీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు పైన పేర్కొన్న ఆ రాక్షసుల భవనాలన్నింటినీ వరుసగా అన్వేషిస్తూ, వారి సమృద్ధిని, ఐశ్వర్యాన్ని చూశాడు.

23–27

కాంతిమంతుడైన హనుమంతుడు రావణుని భవంతికి నలువైపులా అమరి ఉన్న రాక్షస ప్రముఖుల గృహాలను దాటిన తరువాత రావణుని భవనాన్ని చేరుకొన్నాడు.

28

రావణస్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః
విచరన్హరిశార్దూలో రాక్షసీర్వికృతేక్షణాః,

శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః.

29

దదర్శ వివిధాన్ గుల్మాన్ తస్య రక్షఃపతేర్గృహే,
రాక్షసాంశ్చ మహాకాయాన్నానాప్రహరణోద్యతాన్.

30

రక్తాన్ శ్వేతాన్ సితాంశ్చైవ హరీంశ్చాపి మహాజవాన్.

31

కులీనాన్ రూపసంపన్నాన్ గజాస్పరగజారుజాన్,
నిష్ఠితాన్ గజశిక్షాయామైరావత సమాన్యుధి.

32

నిహన్తవాన్ పరసైన్యానాం గృహే తస్మిన్ దదర్శ సః,
క్షరతశ్చ యథా మేఘాన్ స్రవతశ్చ యథా గిరీన్,
మేఘస్తనితనిర్ఘోషాన్ దుర్ధర్షాన్ సమరే పరైః.

33

వానరులలో శార్దూలం వంటి వాడూ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు రావణుడు నిద్రించే సమయంలో మేల్కొని కావలి ఉండే రాక్షస స్త్రీలను చూశాడు. వికృతనేత్రాలున్న ఆ రాక్షస స్త్రీలు శూలాలు, ముద్గరాలు, శక్తులు, తోమరాలు మొదలైన ఆయుధాలు ధరించి ఉన్నారు. ఆ రావణుని భవనంలో నానావిధాలయిన సైనిక విభాగాలనూ, భారీశరీరాలతో అనేక రకాలైన ఆయుధాలను ప్రయోగించడానికి సంసిద్ధులై ఉన్న రాక్షసులనూ హనుమంతుడు చూశాడు.

29–30

రావణుని ఆ మహాసౌధంలో వాయువేగం గల ఎర్రనివి, బాగా తెల్లనివి, ఓ మోస్తరు తెల్లనివి అయిన గుర్రాలను హనుమంతుడు చూశాడు.

అదే విధంగా అతడక్కడ చక్కని శిక్షణ పొందిన ఐరావతానికి దీటైన గజాలను కూడా చూశాడు. ఉత్తమమైన గజజాతులలో జన్మించినవి, చక్కని రూపురేఖలు గలవి, శత్రు గజాలను పీడించగలవి, శత్రు సైన్యాన్ని సంహరించగలవి, సతతమూ మదోదకాన్ని స్రవిస్తూ వర్షించే మేఘాల మల్లే, జలపాతాలతో కూడుకొన్న పర్వతాలమల్లే కానవస్తున్న గజరాజులు హనుమంతుని కంటబడ్డాయి. మేఘాల ఉరుములాంటఘీంకార ధ్వనులు చేసే ఆ గజములను యుద్ధరంగంలో శత్రువు లెవరూ ఎదుర్కొనలేరు.

31–33

సహస్రం వాహినీస్తత్ర జామ్బూనద పరిష్కృతాః.

34

హేమజాల పరిచ్ఛన్నాస్తరుణాదిత్య సన్నిభాః,
దదర్శ రాక్షసేన్ద్రస్య రావణస్య నివేశనే.

35

శిబికా వివిధాకారాః స కపిర్మారుతాత్మజః,
లతాగృహాణి చిత్రాణి చిత్రశాలాగృహాణి చ.

36

క్రీడాగృహాణి చాన్యాని దారుపర్వతకానపి,
కామస్య గృహకం రమ్యం దివాగృహకమేవ చ.

37

దదర్శ రాక్షసేన్ద్రస్య రావణస్య నివేశనే,
స మన్దరగిరిప్రఖ్యం మయూరస్థాన సంకులమ్.

38

ధ్వజయష్టిభి రాకీర్ణం దదర్శ భవనోత్తమమ్,
అనేక రత్న సంకీర్ణం నిధిజాలం సమన్తతః,

ధీరనిష్ఠితకర్మాన్తం గృహం భూతపతేరివ.

39

రాక్షస రాజైన రావణుని గృహంలో బంగారంతో అలంకరింపబడి సూర్యుని మల్లే ప్రకాశిస్తూన్న వేయి వాహినులను★ హనుమంతుడు చూశాడు.

34–35

వాయునందనుడైన హనుమంతుడు ఆ రావణుని గృహంలో అనేక ఆకృతులు గల పల్లకీలను, విచిత్ర లతాగృహాలను, చిత్రశాలలను, క్రీడాగృహాలను, కొయ్యతో నిర్మితమైన చిన్న పర్వతాలను, మన్మథ క్రీడలకు ఉపయుక్తమైన గృహాలను, పగటి వేళ సుఖంగా గడపడానికి అనువైన సుందర గృహాలను చూశాడు.

36–37

మందరపర్వతం లాగా, సాక్షాత్తూ శివుని ఆవాసం వలె వెలుగొందుతున్న ఆ రావణుని భవనం పెంపుడు నెమళ్ళు విశ్రమించే స్థానాలతో, ధ్వజాలు కట్టిన వేత్రదండాలతో శోభిల్లుతూన్నది. ఆ భవనంలో సర్వత్రా అనేక రత్నాలతో నిండిన నిధులున్నాయి. ధీరులైన పురుషులు ఆ భవన కార్యనిర్వహణను శ్రద్ధతో పర్యవేక్షిస్తూన్నారు.

38–39

అర్చిర్భిశ్చాపి రత్నానాం తేజసా రావణస్య చ,
విరరాజాథ తద్వేశ్మ రశ్మిమానివ రశ్మిభిః.

40

జామ్బూనదమయాన్యేవ శయనాన్యాసనాని చ,
భాజనాని చ ముఖ్యాని దదర్శ హరియూథపః.

41

మధ్వాసవకృతక్లేదం మణిభాజన సంకులమ్,

మనోరమమసంబాధం కుబేర భవనం యథా.

42

నూపురాణాం చ ఘోషేణ కాఞ్చీనాం నినదేన చ,
మృదఙ్గతలఘోషైశ్చ ఘోషవద్భిర్వినాదితత్.

43

ప్రాసాద సంఘాతయుతం స్త్రీరత్న శతసంకులమ్,
సుమ్యాధకక్ష్యం హనుమాన్ ప్రవివేశ మహాగృహమ్.

44

రత్నాల కిరణాలతోను, రావణుని తేజస్సుతోను, కిరణాలచే సూర్యుడు ప్రకాశించే రీతిలో ఆ భవనం తేజరిల్లింది.

40

ఆ భవనంలోని శయ్యలు, ఆసనాలు, ప్రధానమైన పాత్రలు సమస్తం స్వర్ణమయమై ఉండడం హనుమంతుడు తిలకించాడు.

41

ఆ రావణుని భవనంలో తేనెతో తయారుచేసిన మద్యం సతతం పానం చేయబడుతున్నది. మణి మణిక్యాలు పొదగిన పాత్రలు ఎల్లెడలా కానవస్తున్నవి. మనోహరమూ విశాలమూ అయిన ఆ భవనం కుబేర భవనం మల్లే అలరారుతున్నది. అందెల రవాలతోను, వడ్డాణాల చిరుగజ్జెల నాదాలతోను, మృదంగాలకూ అరచేతులకూ కలిగిన రాపిడిచే జనించిన ధ్వనుల చేతను ఆ భవనం ప్రతిధ్వనిస్తూన్నది. వందలాది స్త్రీరత్నాలు నివసిస్తూన్న ఆ రావణుని భవనం ఎన్నో ప్రాసాదాల సముదాయంతో ఆవృతమై ఉంది. చక్కగా అమర్చబడిన గదులు, వాకిళ్ళు గల ఆ మహాసౌధంలోకి హనుమంతుడు ప్రవేశించాడు.

42–44

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 6వ సర్గ
సమాప్తం

7వ సర్గ

పుష్పక విమానాన్ని హనుమంతుడు తిలకించడం

స వేశ్మజాలం బలవాన్ దదర్శ
వ్యాసక్తవైడూర్యసువర్ణజాలమ్,
యథా మహత్ ప్రావృషి మేఘజాలం
విద్యుత్పినద్ధం సవిహఙ్గజాలమ్.

1

నివేశనానాం వివిధాశ్చ శాలాః
ప్రధానశఙ్ఖాయుధ చాపశాలాః,
మనోహరాశ్చాపి పునర్విశాలాః
దదర్శ వేశ్మాద్రిషు చన్ద్రశాలాః.

2

ఆ రావణుని భవన సముదాయంలోని భవనాలన్నింటికీ వైడూర్యాలు పొదగిన సువర్ణగవాక్షాలు అమర్చబడి ఉండడం వలన, అవి వర్షాకాలంలో మెరపులచే ఆవరించబడి, దిగువన పక్షులు ఎగురుతూన్న మేఘాలను పోలి ఉన్నాయి. అటువంటి భవన సముదాయాన్ని మహాబలవంతుడయిన హనుమంతుడు చూశాడు.

1

ఆ గృహాలు ప్రధానమైన శంఖాలు, ఆయుధాలు, ధనుస్సులు నిల్వ ఉంచిన శాలలతో కూడుకొని ఉన్నాయి. ఆ సమున్నత భవనాలలో వెన్నెలను అనుభవించడానికి అనువైన విశాలమైన చంద్రశాలలు (డాబాలు) కూడా ఉన్నవి.

2

గృహాణి నానావసురాజితాని
దేవాసురైశ్చాపి సుపూజితాని,
సర్వైశ్చ దోషైః పరివర్జితాని
కపిర్దదర్శ స్వబలార్జితాని.

3

తాని ప్రయత్నాభిసమాహితాని
మయేన సాక్షాదివ నిర్మితాని,
మహీతలే సర్వగుణోత్తరాణి
దదర్శ లఙ్కాధిపతేర్గృహాణి.

4

తతో దదర్శోచ్చ్రితమేఘరూపం
మనోహరం కాఞ్చనచారురూపమ్,
రక్షోధిపస్యాత్మబలానురూపం
గృహోత్తమం హ్యపతిరూపరూపమ్.

5

హనుమంతుడు చూసిన ఆ గృహాలన్నీ దోషరహితమైనవి, సమృద్ధితోను, సకల సంపత్తులతోను తులతూగుతున్నవి, దేవతల అసురుల ప్రశంసలు చూరగొన్నవి. వాటి నన్నిటినీ రావణుడు తన స్వశక్తిచే ఆర్జించాడు.

రావణుని భవన సముదాయం సమస్త హంగులతోను గట్టి ప్రయత్నంతో, అమిత శ్రద్ధతో నిర్మితమైనది. దానవ శిల్పియైన మయుడే స్వయంగా వాటిని నిర్మించాడా అన్నట్లుగా ఉన్నాయి ఆ భవనాలు.

4

తరువాత హనుమంతుడు ఆ భవన సముదాయంలో అన్నింటినీ మించి, స్వర్ణమయ మేఘపంక్తిమల్లే ఉన్న ఒక భవనాన్ని చూశాడు. ఆ భవనం కళాత్మక సౌందర్యంలో సాటిలేనిదిగా, అన్ని రీతులలోనూ రావణుని రాజఠీవికి దీటైనదిగా ఒప్పారుచున్నది.

5

మహీతలే స్వర్గమివ ప్రకీర్ణం
శ్రియా జ్వలన్తం బహురత్నకీర్ణమ్,
నానాతరూణాం కుసుమావకీర్ణం
గిరేరివాగ్రం రజసావకీర్ణమ్.

6

నారీప్రవేకైరివ దీప్యమానం
తటిద్బిరమ్భోదవదర్చ్యమానమ్,
హంసప్రవేకైరివ వాహ్యమానం
శ్రియా యుతం ఖే సుకృతాం విమానమ్.

7

యథా నగాగ్రం బహుధాతుచిత్రం
యథా నభశ్చ గ్రహచన్ద్రచిత్రమ్,
దదర్శ యుక్తీకృతమేఘచిత్రం
విమానరత్నం బహురత్న చిత్రమ్.

8

అక్కడ హనుమంతుడు సుప్రసిద్ధమైన పుష్పక విమానాన్ని చూశాడు. భూతలానికి దిగివచ్చిన స్వర్గంలా ఉంది అది. అనేక రత్నాలతో అలంకరింపబడి కాంతులు విరజిమ్ముతూన్నది. విరబూసిన అనేక వృక్షాల పుష్పాలు దాని మీద వెదజల్లబడి ఉండడం వలన అది పుప్పొడులచే ఆవృతమైన పర్వతశిఖరంలా ఒప్పారుతున్నది.

6

అత్యుత్తమ స్త్రీలు వసించడం వలన ప్రకాశిస్తూన్న ఆ పుష్పక విమానం, మెరపులచే ప్రకాశమానమైన మేఘం మల్లే కానవస్తున్నది. హంసలు మోస్తున్నవా అన్నట్లుగా ఆ విమానం ఆకాశాన తేలియాడుతున్నది. పుణ్యపురుషులు సంతరించుకున్న దేవతా విమానాలమల్లే ఆ పుష్పకం వెలుగొందుతున్నది.

7

అనేక రకాల రత్నాలతో అది అలంకరింపబడి ఉన్నది. చంద్రుడు నవగ్రహాలతో కూడిన ఆకాశంచే ఆవృతమైన పర్వతాగ్రంలా ఉందా పుష్పకం. రత్నాలంకృతమైన ఆ పుష్పకం అనేక మేఘాల తీరాలను అనుసంధించడంచే రూపొందిన నిర్మాణాన్ని తలపింపచేస్తున్నది.

8

మహీ కృతా పర్వతరాజిపూర్ణా
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః,
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్.

9

కృతాని వేశ్మాని చ పాణ్డురాణి
తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి,

పునశ్చ పద్మాని సకేసరాణి
ధన్యాని చిత్రాణి తథా వనాని.

10

పుష్పాహ్వయం నామవిరాజమానం
రత్నప్రభాభిశ్చ వివర్ధమానమ్,
వేశ్మోత్తమానామపి చోచ్చమానం
మహాకపిస్తత్ర మహావిమానమ్.

11

ఆ పుష్పక విమానంలో భూమి పర్వత పంక్తులతోను, పర్వతపంక్తులు వృక్షసంపత్తితోను, వృక్షాలు పుష్పసముదాయంతోను, పుష్పాలు కింజల్కాల (కేసరముల)తోను, రేకులతోను మనోజ్ఞంగా కల్పితమై ఉన్నవి.

9

ఆ పుష్పకంలో తెల్లని భవనములు, రమణీయమైన పుష్పాలతో నిండిన సరోవరాలు, కింజల్కాలతో కూడుకొన్న పద్మాలు, దట్టంగా పెరిగిన వృక్షసముదాయంతో కూడిన అరణ్యాలు చిత్రీకృతమై ఉన్నాయి.

10

రత్నకాంతుల అతిశయంతో అమితంగా ప్రకాశిస్తూ, అక్కడ వెలసి ఉన్న ఉత్తమ భవనాలకన్నా అత్యున్నతమైన పుష్పకమనే పేరుగల ఆ మహావిమానాన్ని హనుమంతుడు చూశాడు.

11

కృతాశ్చ వైడూర్యమయా విహఙ్గా
రూప్యప్రవాళైశ్చ తథా విహఙ్గాః,
చిత్రాశ్చ నానావసుభిర్భుజఙ్గాః
జాత్యాను రూపాస్తురగాః శుభాఙ్గాః.

12

ప్రవాళజామ్బూనదపుష్పపక్షాః
సలీలమావర్జిత జిహ్మపక్షాః,
కామస్య సాక్షాదివ భాన్తి పక్షాః
కృతా విహఙ్గాః సుముఖాః సుపక్షాః.

13

నియుజ్యమానాస్తు గజాః సుహస్తాః
సకేసరాశ్చోత్పలపత్రహస్తాః,
బభూవ దేవీ చ కృతా సుహస్తా
లక్ష్మీస్తథా పద్మిని పద్మహస్తా.

14

ఆ పుష్పక విమానంలో వైడూర్యాలతోను, వెండితోను, పగడాలతోను రూపొందించిన పక్షులూ, అనేక విధాలైన మాణిక్యాలతో తయారైన సర్పాలూ, శుభకర లక్షణాలు గల ఉత్తమజాతి గుర్రాలూ అలంకార నిమిత్తం అమర్చబడి ఉన్నాయి.

12

ఆ విమానంలో మంచి ముఖాలు, కోమలమైన రెక్కలు గల పక్షులను కూడా రూపొందించారు. సవిలాసంగా ఒకింత వంకరగా వంచబడిన ఆ పక్షుల రెక్కల మీద పగడపు, బంగారపు పువ్వులు చెక్కబడి ఉన్నవి. ఆ పక్షులు మన్మథునికి దోహదపడేవిలా తోచుచున్నాయి.

13

ఆ పుష్పక విమానంలో తామర కొలను, దాన్లో లక్ష్మీదేవిని అభిషేకించడానికన్నట్లు ఆయత్తమైన ఏనుగులు చిత్రించబడి ఉన్నాయి. సుందరములైన తొండములు గల ఆ ఏనుగుల శరీరాలు పుప్పొడితో నిండి

ఉన్నాయి. ఆ ఏనుగులు తామర పువ్వులను తామర ఆకులను తమ తొండములతో పైకెత్తి ఆ కొలనులో క్రీడిస్తున్నాయి. అందమైన హస్తములు కలదీ, ఆ హస్తములందు పద్మములు ధరించి, ఆ ఏనుగులచే అభిషేకము పొందుచున్నదా అన్నట్లున్న లక్ష్మీదేవి ఆ కొలనులో ప్రకాశిస్తూ చిత్రీకరించబడి ఉంది.

14

ఇతీవ తద్గృహమభిగమ్య శోభనమ్
సవిస్మయో నగమివ చారు శోభనమ్,
పునశ్చ తత్పరమసుగన్ధి సున్దరమ్
హిమాత్యయే నగమివ చారుకన్దరమ్.

15

తతః స తాం కపిరభిపత్య పూజితాం
చరన్ పురీం దశముఖబాహుపాలితామ్,
అదృశ్య తాం జనకసుతాం సుపూజితాం
సుదుఃఖీతః పతిగుణ వేగనిర్జితామ్.

16

తతస్తదా బహువిధభావితాత్మనః
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః,
అపశ్యతోఽభవదతిదుఃఖీతం మనః
సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః.

17

అలా హనుమంతుడు సుందరమూ, శుభప్రదమూ అయిన పర్వతం మల్లే ఉన్న ఆ రావణ గృహాన్ని తిలకించి, ఆశ్చర్యచకితుడై వసంత ఋతువులో సుగంధభరితమై సుందరమైన గుహలతో మనోహరంగా ఒప్పారుతున్న

పర్వతంలా ఉన్న ఆ గృహంలో మళ్ళీ ప్రవేశించి అన్వేషించసాగాడు.

15

తరువాత రావణుని బాహుబలంతో రక్షింపబడుతూ రాక్షసులకు ఆదరణీయమైన ఆ లంకా నగరంలో కలయ తిరుగుతూ, భర్త సద్గుణ సంపత్తిచే వశీకృతమై ఆయనయందే మనస్సును లగ్నం చేసిన సీతాదేవి ఎక్కడా కానరాకపోవడంతో హనుమంతుడు ఎంతో దుఃఖించాడు.

16

అనేక రీతుల్లో యోచించగల శక్తిమంతుడూ, మహాత్ముడూ అయిన హనుమంతుడు సునిశిత దృష్టితో, దృఢనిశ్చయంతో ఎంతగా అన్వేషించినా సీతాదేవి కనిపించకపోవడంతో చింతాక్రాంతుడయ్యాడు.

17

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 7వ సర్గ

సమాప్తం

8వ సర్గ
హనుమంతుడు మళ్ళీ పుష్పకాన్ని అన్వేషించడం

న తస్య మధ్యే భవనస్య సంస్థితం
మహద్విమానం మణివజ్రచిత్రితమ్,
ప్రతప్తజామ్బూనద జాలకృత్రిమం
దదర్శ వీరః పవనాత్మజః కపిః.

1

తదప్రమేయాప్రతికారకృత్రిమం
కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా,
దివం గతం వాయుపథ ప్రతిష్ఠితం
వ్యరాజతాదిత్యపథస్య లక్ష్మవత్.

2

మహావీరుడూ, వాయుపుత్రుడూ అయిన హనుమంతుడు ఆ భవన సముదాయం మధ్యలో ఆకాశంలో ఎగురగల భవన వాహనమైన గొప్ప పుష్పక విమానాన్ని చూశాడు. ఆ పుష్పకం వజ్రాలూ, మణిక్యాలు పొదుగబడి ఉండడంతో చిత్రవర్ణంతో ఒప్పారుతూన్నది. దాని గవాక్షాలు పుటంపట్టిన బంగారంతో నిర్మితమై, నగిషీలతో అలరారుతున్నాయి.

1

స్వయంగా విశ్వకర్మయే ఆ పుష్పకాన్ని రూపొందించి, దాని నిర్మాణ కౌశలాన్ని ప్రశంసించాడు. కనుక ఆ పుష్పకానికి చేసిన అలంకరణ సాటిలేనిదై విరాజిల్లుతూన్నది. అది ఆకాశాన వాయుమార్గంలో నిలబడినదై, సూర్యమార్గానికి చిహ్నంలా ప్రకాశిస్తూన్నది.

2

న తత్ర కించిన్న కృతం ప్రయత్నతో
న తత్ర కించిన్న మహార్హరత్నవత్,
న తే విశేషా నియతాః సురేష్వపి
న తత్ర కించిన్న మహావిశేషవత్.

3

తపః సమాధానపరాక్రమార్జితం
మనః సమాధానవిచారచారిణమ్,
అనేక సంస్థాన విశేష నిర్మితం
తతస్తతస్తుల్య విశేషదర్శనమ్.

4

మనస్సమాధాయ తు శీఘ్రగామినం
దురావరం మారుతతుల్యగామినమ్,
మహాత్మనాం పుణ్యకృతాం మహర్ధినాం
యశస్వినా మగ్ర్యముదా మివాలయమ్.

5

ఆ విమానంలో విశేష ప్రయత్నంతో నిర్మితంకానిదీ, అమూల్య రత్నాలు పొదుగబడనిదీ ఏదీ లేదు. అందలి విశేషాలు దేవలోకంలో సైతం కచ్చితంగా ఉన్నాయని చెప్పలేము. దానిలో గొప్ప నిర్మాణాత్మక విశేషం లేనిది ఏదీ లేదు.

3

ఆ విమానాన్ని రావణుడు తన పరాక్రమంతోనూ, గొప్ప తపశ్శక్తితోనూ సముపార్జించుకున్నాడు. సంకల్ప మాత్రాన అది కోరుకున్న ప్రదేశానికి పోగలదు. ఆయా భాగాలందు అనేక ఆకారాల విశేషాలతో నిర్మితమైనదీ, అక్కడక్కడ తుల్యమైన విశేషాల దర్శనం గలదీ అయిన విమానాన్ని హనుమంతుడు చూశాడు.

4

ప్రభువు మనస్సు నెరిగి ఆ విమానం వాయువేగంతో సత్వరంగా పయనిస్తూ ఇతరు లెవరూ ఆపడానికి వీలులేనిదై ఉన్నది. మహాత్ములు, పుణ్యాత్ములు, తేజస్సంపన్నులు, కీర్తిశాలురు, మహదానందభరితులు అయిన ఇంద్రాదులు నివసించే స్వర్గాన్ని ఆ విమానం పోలి ఉంది.

5

విశేషమాలమ్బ్య విశేష సంస్థితం
విచిత్రకూటం బహుకూటమణ్డితమ్,
మనోఽభిరామం శరదిన్దునిర్మలం
విచిత్రకూటం శిఖరం గిరేర్యథా.

6

వహన్తి యం కుణ్డలశోభితాననాః
మహాశనా వ్యోమచరా నిశాచరాః,
వివృత్తవిధ్వస్తవిశాలలోచనాః
మహాజవా భూతగణాః సహస్రశః.

7

వసన్తపుష్పోత్కరచారుదర్శనం
వసన్తమాసాదపి కాన్తదర్శనమ్,

స పుష్పకం తత్ర విమానముత్తమం
దదర్శ తద్వానరవీరసత్తమః.

8

విశిష్ట రీతుల్లో నిర్మితమైనదవడం వలన ఆ విమానం రూపంలో విశిష్టతను సంతరించుకొంది. అనేక శిఖరాలతో కూడుకొన్నదై, చూడడానికి విచిత్రంగా కనిపిస్తూన్నది. మనోహరంగా, శరత్కాల చంద్రుని మల్లే నిర్మలంగా చిన్నచిన్న శిఖరాలు గల మహాపర్వత శిఖరంలా ఉన్న ఆ పుష్పకాన్ని హనుమంతుడు చూశాడు.

6

కుండలాలతో శోభిస్తూన్న ముఖాలు గలవారూ, మహాకాయులూ, గగన విహారులూ అయిన రాక్షసులూ, గుండ్రని వంకర విశాలమూ అయిన కళ్ళు గల మహావేగవంతమైన వేలకొద్దీ భూతాలూ మోస్తూ ఉన్నట్లున్న పుష్పక విమానాన్ని హనుమంతుడు చూశాడు.

7

వసంత ఋతువులో పూచే పుష్పరాసులచే మనోజ్ఞమై, వసంత మాసంకన్నా రమ్యమై ఒప్పారుతున్న ఆ పుష్పక విమానాన్ని వానర వీరులలో శ్రేష్ఠుడైన హనుమంతుడు చూశాడు.

8

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 8వ సర్గ
సమాప్తం

9వ సర్గ

హనుమంతుడు రావణుని అంతఃపురాన్ని సందర్శించడం

తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతమ్,
దదర్శ భవనశ్రేష్ఠం హనుమాన్ మారుతాత్మజః.

1

అర్ధయోజన విస్తీర్ణమాయతం యోజనం హి తత్,
భవనం రాక్షసేన్ద్రస్య బహుప్రాసాదసంకులమ్.

2

మార్గమాణస్తు వైదేహీం సీతామాయతలోచనామ్,
సర్వతః పరిచక్రామ హనుమానరిసూదనః.

3

వాయునందనుడైన హనుమంతుడు శ్రేష్ఠమైన ఆ భవన సముదాయం నడుమ, విస్తృతమైన ఒక భవనశ్రేష్ఠాన్ని చూశాడు.

1

రాక్షసేంద్రుడైన రావణుని ఆ భవంతి అర యోజనం వెడల్పు ఒక యోజనం పొడవు గలదై అనేక ప్రాసాదాలతో కూడినదై అలరారుతోంది.

2

విశాలమైన నేత్రాలు గల విదేహరాజు జనకుని కుమార్తెయైన సీతాదేవి కోసం శత్రు సంహారకుడైన హనుమంతుడు ఆ మందిరం యావత్తూ అన్వేషిస్తూ తిరిగాడు.

3

ఉత్తమం రాక్షసావాసం హనుమానవలోకయన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేన్ద్రనివేశనమ్.

4

చతుర్విషాణైర్ద్విరదైస్త్రివిషాణైస్తథైవ చ,
పరిక్షిప్తమసంబాధం రక్ష్యమాణముదాయుధైః.

5

రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనమ్,
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభిరావృతమ్.

6

తన్నక్రమకరాకీర్ణం తిమిఝిలఝుషాకులమ్,
వాయువేగసమాధూతం పన్నగైరివ సాగరమ్.

7

యా హి వైశ్రవణే లక్ష్మ్యా చేన్ద్రే హరివాహనే,
సా రావణగృహే సర్వా నిత్యమేవానపాయినీ.

8

తరువాత శ్రీమంతుడైన హనుమంతుడు అనేక మంది రాక్షసుల గృహాలను పరిశీలించి చూసి చివరగా రాక్షసరాజైన రావణుని నివాస భవనంలోకి ప్రవేశించాడు. ఆ భవనంలో అన్ని చోట్లా రెండు దంతములున్న ఏనుగులు, మూడు దంతాలు గల ఏనుగులు, నాలుగు దంతాల ఏనుగులు నిలబడి ఉన్నాయి. ఆ భవనాన్ని ఆయుధాలు ధరించి అప్రమత్తంగా ఉన్న రాక్షసులు సదాసర్వదా పరిరక్షిస్తూన్నారు. అయినప్పటికీ ఆ భవనం విశాలంగానే కానవస్తున్నది.

4–5

రావణుని భార్యలైన రాక్షస స్త్రీలతోనూ, ఆతడు చెరబట్టి తెచ్చిన రాజకన్యలతోనూ ఆ భవనం నిండి ఉంది. ఏనుగులు, రక్షక భటులతో కూడుకొన్న ఆ భవనం, మొసళ్ళు, పెద్ద చేపలు, తిమింగలాలు, పాములు తిరుగాడుతూ, పెనుగాలులు వీస్తూ ప్రచండంగా ఉన్న సముద్రాన్ని పోలి ఉంది.

6–7

కుబేరునికి ఎంత ఐశ్వర్యం ఉందో, ఆకుపచ్చ గుర్రాలు పూన్చిన రథం వాహనంగా గల ఇంద్రునికి ఎంత ఐశ్వర్యం ఉందో, అంతటి ఐశ్వర్యం స్థిరంగా ఆ రావణుని గృహంలో కొలువై ఉంది.

8

యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ,
తాదృశీ తద్విశిష్టా వా ఋద్ధీ రక్షోగృహేష్విహ.

9

తస్య హర్మ్యస్య మధ్యస్థం వేశ్మ చాన్యత్సునిర్మితమ్,
బహునిర్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః.

10

బ్రహ్మణోఽర్థే కృతం దివ్యం దివి యద్విశ్వకర్మణా,
విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితమ్.

11

పరేణ తపసా లేభే యత్కుబేరః పితామహాత్,
కుబేరమోజసా జిత్వా లేభే తద్రాక్షసేశ్వరః.

12

ఈహామృగసమాయుక్తైః కార్తస్వరహిరణ్మయైః,
సుకృతైరాచితం స్తమ్భైః ప్రదీప్తమివ చ శ్రియా.

13

మేరుమన్దరసఙ్కాశైరుల్లిఖద్భిరి వామ్బరమ్,
కూటాగారైః శుభాకారైః సర్వతః సమలంకృతమ్.

14

రావణుని గృహంలోని సంపత్సమృద్ధి, యక్షాధిపతియైన కుబేరుని, యముని, వరుణుని సమృద్ధితో తులతూగుతుంది; కాదు వాటిని మించినదని చెప్పడం సత్యదూరం కాదేమో!

9

రావణుని భవన మధ్య భాగంలో, మత్తగజాల ఆకృతిలో రూపొందిన అనేక శిఖరాలతో కూడుకొని. చక్కగా నిర్మితమైన ఒక భవనం(పుష్పకం) వాయుపుత్రుడైన హనుమంతుని కంటబడింది.

10

ఈ పుష్పక విమానాన్ని పూర్వం బ్రహ్మదేవుని కోసం దేవశిల్పియైన విశ్వకర్మ స్వర్గంలో నిర్మించాడు. ఆ పుష్పకం సమస్తమైన రత్నాలతో అలంకరింపబడింది. కుబేరుడు కఠోర తపస్సు చేసి దానిని బ్రహ్మనుండి పొందాడు. తన పరాక్రమంచే కుబేరుణ్ణి నిర్జించి రావణుడు ఆ పుష్పక విమానాన్ని కైవసం చేసుకొన్నాడు.

11–12

ఆ పుష్పకం తోడేళ్ల బొమ్మలు మలచబడిన బంగారు, వెండి స్తంభాలతో శోభాయమానంగా ప్రకాశిస్తున్నది. దాని పైభాగం మేరు, మందర పర్వతాలకు దీటైన, ఆకాశాన్ని తాకుచున్నవా అన్నట్లున్న అనేక కూటాగారాలతో (పెద్ద గదులు) సమలంకృతమై ఒప్పారుతోంది. 13–14.

జ్వలనార్క ప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా,
హేమసోపాన సంయుక్తం చారుప్రవరవేదికమ్.

15

జాలవాతాయనైర్యుక్తం కాఞ్చనైః స్ఫాటికైరపిః,
ఇన్ద్రనీల మహానీలమణి ప్రవరవేదికమ్.

16

విద్రుమేణ విచిత్రేణ మణిభిశ్చ మహాధనైః,
నిస్తులాభిశ్చ ముక్తాభిస్తలేనాభివిరాజితమ్.

17

చన్దనేన చ రక్తేన తవనియనిభేన చ,
సుపుణ్యగన్ధినా యుక్తమాదిత్య తరుణోపమమ్.

18

అగ్నిమల్లే, సూర్యునిమల్లే ప్రకాశిస్తూన్న ఆ పుష్పక విమానాన్ని విశ్వకర్మ తన నైపుణ్యాన్నంతా ప్రదర్శించి నిర్మించాడు. దానిలోనికి వెళ్ళడానికి రూపొందించిన మెట్లు బంగారుమయమైనవి. అందులో సుందరమైన వేదికలు అమర్చబడి ఉన్నాయి.

15

బంగారంతోనూ, స్ఫటికమణులతోనూ అలంకారయుతంగా అమర్చబడిన చిన్న, పెద్ద గవాక్షాలు, ఇంద్రనీల మహానీల మణులు పరచిన వేదికలు ఆ పుష్పకానికి మరింత వన్నె తెస్తున్నాయి.

16

ఆ విమానం అడుగుభాగం (గచ్చు) విచిత్రవర్ణంగల పగడాలతోనూ, అమూల్యమైన మణులతోనూ, సాటిలేని ముత్యాలతోనూ పొదగబడి అద్భుతంగా విరాజిల్లుతోంది.

17

సువాసనులు వెదజల్లే ఎర్రచందనం, బంగారు రంగు చందనం ఆ విమానమంతటా అలదడంచే అది బాలభానునిలా భాసిస్తోంది.

18

కూటగారైర్వరాకారైర్వివిధైః సమలంకృతమ్,
విమానం పుష్పకం దివ్యమారురోహ మహాకపిః.

19

తత్రస్థః స తదా గన్ధం పానభక్ష్యాన్న సంభవమ్,
దివ్యం సంమ్మూర్ఛితం జిఘ్రుద్రూప వన్తమివానిలమ్.

20

స గన్ధస్తం మహాసత్త్వం బన్ధుర్బన్ధుమివోత్తమమ్,
ఇత ఏహీత్యువాచేవ తత్ర యత్త స రావణః.

21

తతస్తాం ప్రస్థితః శాలాం దదర్శ మహతీం శుభామ్,
రావణస్య మనఃకాన్తాం కాన్తామివ వరస్త్రియమ్.

22

మణిసోపానవిక్రుతాం హేమజాలవిభూషితామ్,
స్ఫాటికైరావృతతలాం దన్తాన్తరితరూపికామ్.

23

సుందరమైన వివిధ కూటాగారాలచే (గదులచే) కూడుకొన్నదీ, దివ్యమైనట్టిదీ అయిన ఆ పుష్పక విమానాన్ని హనుమంతుడు అధిరోహించాడు.

19

హనుమంతుడు ఆ పుష్పకంలోనికి రాగానే మద్యాదిపానీయాలు, భక్ష్యాలు, అన్నాలు మొదలైన ఆహార పదార్థాలనుండి వెలువడిన కమ్మని వాసనలను ఆఘ్రాణించాడు.

20

ఆ కమ్మని వాసన ఒక బంధువు తన ఆప్తబంధువును ఆహ్వానించినట్లు మహాబలశాలియైన హనుమంతుణ్ణి, రావణుడున్న చోటుకు ఆహ్వానించెనా అన్నట్లు అనిపించింది.

21

అటు వైపు బయలుదేరిన హనుమంతుడు అక్కడ రావణునికి ప్రీతిని కలిగించే ఉత్తమవంశ సంజాతయైన తరుణి మల్లే విలసిల్లుతూన్న విశాలమైన, అందమైన ఒక శాలను చూశాడు.

22

ఆ శాలలో అమర్చబడిన మెట్లు మణులచే పొదగబడి ఉన్నాయి. అక్కడి కిటికీలు బంగారంతో నిర్మితమైనవి. నేల స్ఫటికమణి సమావృతమై అలరారుతోంది. మధ్యమధ్య ఏనుగు దంతాల బొమ్మలను మలచి ఉన్నారు.

23

ముక్తాభిశ్చ ప్రవాళైశ్చ రూప్యచామీకరైరపి,
విభూషితాం మణిస్తమ్భైః సుబహుస్తమ్భభూషితామ్.

24

సమైర్ఋజుభిరత్యుచ్చైః సమన్తాత్సువిభూషితైః,
స్తమ్భైః వక్షైరివాత్యుచ్చైర్దివం సంప్రస్థితామివ.

25

మహత్యా కుథయాస్తీర్ణాం పృథివీ లక్షణాఙ్కయా,
పృథివీమివ విస్తీర్ణాం సరాష్ట్రగృహమాలినీమ్.

26

నాదితాం మత్తవిహగైర్దివ్యగన్ధాధివాసితామ్,
పరార్ధ్యాస్తరణోపేతాం రక్షోధిపనిషేవితామ్.

27

వెండి బంగారాలతో నిర్మితమై, ముత్యాలతోనూ పగడాలతోనూ అలంకృతమై ఉన్న మణిస్తంభాల మీద శాల నిలిచి ఉన్నట్లుగా చూపరులకు తోచుతోంది.

24

వంకర టింకరలేని, చక్కగా అలంకరించబడిన మహోన్నతమైన స్తంభాలతో విరాజిల్లుతూన్న ఆ శాల ఎత్తయిన రెక్కలు చాచి చూపరులకు ఆకాశంలోకి ఎగరడానికి సిద్ధంగా ఉన్నదా అన్నట్లు కానవస్తోంది.

25

ఆ శాల గచ్చుమీద, రత్నకంబళం పరుచబడి ఉంది. ఆ కంబళం మీద భూచిహ్నాలయిన సముద్రాలు, నదులు, అరణ్యాలు, గృహాలు చిత్రింపబడి ఉండడంతో ఆ శాల రాష్ట్రాలు, గృహాల సముదాయంతో కూడినట్టి భూతలాన్ని తలపింపచేస్తోంది.

26

మత్తిల్లిన పక్షుల కిలకిలారావాలతో ఆ శాల ప్రతిధ్వనిస్తున్నది. ఆ శాల సుగంధంతో గుబాళిస్తూన్నది. ఆ శాల గచ్చు మీద అమూల్యమైన తివాచీలు పరుపబడి ఉన్నవి. రావణుని

సుఖాసీనుడవడానికి అక్కడ ఆసనాలు అమర్చబడి ఉన్నాయి.

27

ధూమ్రామగరుధూపేన విమలాం హంసపాణ్డురామ్,
చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభామ్.

28

మనః సంహ్లాదజననీం వర్ణస్యాపి ప్రసాదినీమ్,
తాం శోకనాశనీం దివ్యాం శ్రియః సంజననీమివ.

29

ఇన్ద్రియాణీన్ద్రియార్థైస్తు పఞ్చ పఞ్చభిరుత్తమైః,
తర్పయోమాస మాతేవ తదా రావణపాలితా.

30

స్వర్గోఽయం దేవలోకోఽయమిన్ద్రస్యేయం పురీ భవేత్,
సిద్ధిర్వేయం పరా హి స్యాదిత్యమన్యత మారుతిః.

31

ప్రధ్యాయత ఇవాపశ్యత్ప్రదీప్తాంస్తత్ర కాఞ్చనాన్,
ధూర్తానివ మహాధూర్తైర్దేవనేన పరాజితాన్.

32

ఆ శాల హంసమల్లే తెల్లగా స్వచ్ఛమైనదైనప్పటికీ అగరు ధూపం వేయడం వలన బూడిద రంగును సంతరించుకొంది. వివిధ రంగుల పువ్వులతో అలంకరించబడడంతో చిత్రవర్ణంతో ఉన్న ఆ శాల వసిష్ఠుని కామధేనువు మల్లే చక్కని వర్చస్సుచే విరాజిల్లుతోంది.

28

ఆ శాల చూపరుల మనస్సులకు ఆనందం కలిగించడమే కాక వారి శరీర వర్చస్సును పెంపొందిస్తుంది. అది సిరులకు ఆలవాలమై శోకాన్ని నశింప చేస్తున్నది. అద్భుతమైన అలాంటి శాలను హనుమంతుడు చూశాడు.

29

రావణునిచే పరిరక్షితమైన ఆ శాల సందర్శకుల పంచేంద్రియాలకూ కావలసిన ఉత్తమమైన పదార్థాలను సమకూర్చడం మూలంగా తల్లి వలె వారికి సంతృప్తిని చేకూరుస్తూన్నది.

30

ఇది స్వర్గమా! దేవలోకమా! ఇంద్రుని రాజధానియైన అమరావతీ పట్టణమా? లేక సృష్టికర్తయైన బ్రహ్మదేవుని సత్యలోకమా! అని ఆ శాల వైభవాన్ని చూసి ఆశ్చర్యపోతూ హనుమంతుడు భావించాడు.

31

హనుమంతుడు అక్కడ పెద్ద బంగారు దీపసెమ్మలలో నిశ్చలంగా వెలుగుతున్న దీపాలను చూశాడు. అవి నిపుణులైన జూదరుల చేతుల్లో పరాజితులై మౌనం వహించి చింతన చేస్తున్న జూదరుల్లా కనిపించాయి.

32

దీపానాం చ ప్రకాశేన తేజసా రావణస్య చ,
అర్చిర్భిర్భూషణానాం చ ప్రదీప్తేత్యభ్యమన్యత.

33

తతోఽపశ్యత్ముధాసీనం నానావర్ణామ్బరస్రజమ్,
సహస్రం వరనారీణాం నానావేష విభూషితమ్.

34

పరివృత్తేఽర్ధరాత్రే తు పాననిద్రావశం గతమ్,
క్రీడిత్వోపరతం రాత్రౌ సుష్వాప బలవత్తదా.

35

తత్ప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాన్తరభూషణమ్,
నిఃశబ్దహంసభ్రమరం యథా పద్మవనం మహత్

36

తాసాం సంవృతదన్తాని మీలితాక్షాణి మారుతిః,
అపశ్యత్పద్మగన్ధీని వదనాని సుయోషితామ్.

37

దీపాల కాంతి, రావణుని తేజస్సు, ఆభరణాల ప్రకాశం ఏకం కావడంతో ఆ భవనం ప్రజ్వలిస్తూన్నట్లుగా హనుమంతునికి తోచింది.

33

తదుపరి విభిన్న రంగుల వస్త్రాలను, మాలలను ధరించి నానావిధాలైన అలంకారాలను సింగారించుకొని రత్నకంబళముల మీద శయనించిన అనేకమంది ఉత్తమాంగనలు హనుమంతుని కంటపడ్డారు.

34

ఆ స్త్రీలందరూ అర్ధరాత్రి వరకూ ఆటపాటలలో మునిగితేలి, తరువాత మద్యపానం చేత కలిగిన మత్తుకు వశవర్తులై గాఢనిద్రలోకి జారిపోయి ఉన్నారు.

35

శరీరాలు కదలిక లేకుండా ఉండడంతో ఆభరణాల గలగల సవ్వడిలేక నిశ్శబ్దమై ఆ నారీసహస్రం నిద్రిస్తూన్న ఆ భవనం నిశ్శబ్దంగా ఉన్న హంసలు, తుమ్మెదలతో కూడుకొన్న తామర కొలను మల్లే విరాజిల్లుతోంది.

36

దంతాలు కనబడకుండా పెదవులు మూసుకొని, కళ్ళు మూసుకొని నిద్రిస్తూన్న ఆ సుందరీమణుల పద్మాలవంటి పరిమళాన్ని వెదజల్లుతూన్న ముఖారవిందాలను హనుమంతుడు చూశాడు.

37

ప్రబుద్ధానీవ పద్మాని తాసాం భూత్వా క్షపాక్షయే,
పునః సంవృతపత్రాణి రాత్రావివ బభుస్తదా.

38

ఇమాని ముఖపద్మాని నియతం మత్తషట్పదాః,
అమ్బుజానీవ ఫుల్లాని ప్రార్థయన్తి పునః పునః.

39

ఇతీవామన్యత శ్రీమానుపపత్త్యా మహాకపిః,
మేనే హి గుణతస్తాని సమాని సలిలోద్భవైః.

40

సా తస్య శుశుభే శాలా తాభిః స్త్రీభిర్విరాజితా,
శారదీవ ప్రసన్నా ద్యౌస్తారాభిరభిశోభితా.

41

స చ తాభిః పరివృతః శుశుభే రాక్షసాధిపః,
యథా హ్యుడుపతిః శ్రీమాంస్తారాభిరభిసంవృతః.

42

ఆ స్త్రీలు మేల్కొని ఉన్నప్పుడు వారి ముఖాలు రాత్రి క్షీణించి సూర్యోదయం

అవుతున్నప్పుడున్న పద్మాల మల్లే ఉండి, రాత్రి యందు ముకుళించుకున్న రేకులు గల పద్మాల వలె ఉన్నాయి.

38

"మదించిన తుమ్మెదలు ఈ ముఖారవిందాలను వికసించిన పద్మాలనుకొని పదే పదే వాటి మీద నిశ్చయంగా వ్రాలగోరతాయి."

39

శ్రీమంతుడైన ఆ హనుమంతుడు సయుక్తికంగా ఆ స్త్రీల ముఖాలను గురించి పై విధంగా అనుకున్నాడు. ఎందుకంటే సౌందర్య సుగంధాది గుణాలచే ఆ స్త్రీల ముఖాలు పద్మాలకు సాటియైనవిగా ఉన్నవి కనుక.

40

రావణుని ఆ భవనం సుందరాంగులైన ఆ స్త్రీలతో విరాజిల్లుతూ నక్షత్రాలతో విరాజమానమైన శరత్కాల వినిర్మలాకాశం మల్లే శోభిల్లింది.

41

ఆ స్త్రీలు తన చుట్టూ ఉండడం వలన రాక్షసరాజైన రావణుడు, నక్షత్రాలతో పరివేష్టితుడైన చంద్రుడిలా భాసించాడు.

42

యాశ్చ్యవన్తేఽమ్బరాత్తారాః పుణ్యశేష సమావృతాః,
ఇమాస్తాః సంగతాః కృత్స్నా ఇతి మేనే హరిస్తదా.

43

తారాణామివ సువ్యక్తం మహతీనాం శుభార్చిషామ్,
ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజుస్తత్ర యోషితామ్.

44

వ్యావృత్తగురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః,
పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః.

45

వ్యావృత్తతిలకాః కాశ్చిత్కాశ్చిదుద్భ్రాన్తనూపురాః,
పార్శ్వే గళితహారాశ్చ కాశ్చిత్పరమయోషితః.

46

ముక్తాహారావృతాశ్చాన్యాః కాశ్చిద్విస్రస్తవాససః,
వ్యావిద్ధరశనాదామాః కిశోర్య ఇవ వాహితాః.

47

తమ పుణ్యఫలం తీరిపోగా భూమ్మీద జారిపడిపోయిన ఆ నక్షత్రాలే ఆ స్త్రీల రూపంతో ఇక్కడ కలసి ఉన్నవని హనుమంతుడు భావించాడు.

43

అక్కడున్న ఆ స్త్రీల కాంతీ, వర్ణమూ, ప్రసన్నతా, శుభమైన కాంతిని ప్రసరించే పెద్దదైన నక్షత్రాల కాంతీ వర్ణము ప్రసన్నతల వలె ప్రకాశిస్తున్నాయి.

44

మధుపాన మత్తు ప్రభావంలో, రతికేళుల అనంతరం కలిగిన అలసటతో ఆ స్త్రీలు ఆదమరచి నిద్రిస్తున్నారు. వారు ధరించిన పుష్పమాలలు, ఆభరణాలు అన్నీ చెల్లాచెదరై అస్తవ్యస్తంగా ఉన్నాయి.

45

ఈ కులీన స్త్రీలలో కొందరి నుదుట దాల్చిన తిలకం రేగిపోయి ఉంది. కొందరి అందెలు వదులై స్థానం తప్పాయి. కొందరు స్త్రీలు ధరించిన హారాలు ప్రక్కలకు జారి పడివున్నాయి.

46

కొందరి స్త్రీల ముత్యాల హారాలు తెగి ముత్యాలు చిందరవందరగా నేలపై పడివున్నాయి. కొందరి వస్త్రాలు శరీరం మీదనుంచి జారిపోయి ఉన్నాయి. కొందరి మొలనూళ్లు చిక్కులుపడి ఉన్నాయి. ఆ స్త్రీలలో కొందరు మార్గాయాసం తొలగడానికి కట్లు విప్పగా నేలపై పొరలుతున్న ఆడగుర్రాలను పోలి ఉన్నారు.

47

సుకుణ్డలధరాశ్చాన్యా విచ్ఛిన్నమృదితస్రజః,
గజేన్ద్రమృదితాః ఫుల్లా లతా ఇవ మహావనే.

48

చన్ద్రాంశుకిరణాభాశ్చ హారాః కాసాంచిదుత్కటాః,
హంసా ఇవ బభుః సుప్తాః స్తనమధ్యేషు యోషితామ్.

49

అపరాసాం చ వైడూర్యాః కాదమ్బా ఇవ పక్షిణః,
హేమసూత్రాణి చాన్యాసాం చక్రవాకా ఇవాభవన్.

50

హంసకారణ్డవాకీర్ణాశ్చక్రవాకోపశోభితాః,
ఆపగా ఇవ తా రేజుర్జఘనైః పులినైరివ.

51

కిఙ్కిణీజాల సంకోశాస్తా హైమవిపులామ్బుజాః,
భావగ్రాహా యశ స్తీరాః సుప్తా నద్య ఇవాఽఽబభుః.

52

మహారణ్యంలో ఏనుగులచే నలగగొట్టబడినప్పటికీ కొన్ని లతలు పుష్పాలతో అలరారుతున్న రీతిలో కొందరు స్త్రీలు దాల్చిన హారములు తెగి చిందరవందరగా పడిపోయినప్పటికీ వారి కుండలములు చెక్కుచెదరక అట్లే ఉన్నవి.

48

కొందరు స్త్రీలు ధరించిన పెద్ద ముత్యాల హారాలు వారి స్తన మధ్యములందు చోటుచేసుకుని చంద్రకిరణాల వలె తెల్లని కాంతిని ప్రసరిస్తూన్నాయి; చూడడానికి అవి నిదురించిన హంసలను పోలి ఉన్నాయి.

49

కొందరు స్త్రీలు ధరించిన వైడూర్య హారాలు కాదంబ పక్షుల మల్లేనూ, మరికొందరు స్త్రీలు నడుమున ధరించిన బంగారు సూత్రాలు చక్రవాక పక్షుల వలెనూ కానవచ్చాయి.

50

నదీ తీరాలందు ఏర్పడ్డ విస్తృత ఇసుక తిన్నెలవంటి విశాలములైన జఘనాలు గల ఆ స్త్రీలు, హంస కారండవ చక్రవాక పక్షులతో విరాజిల్లే నదుల్లా శోభించారు.

51

చిరుమువ్వలు గల ప్రకాశవంతమైన మొలనూళ్ళను ధరించి నిద్రిస్తున్న ఆ సుందరాంగులలో కొందరు నదులవలె శోభించారు. వారు ధరించిన సువర్ణాభరణాలే పెద్ద పద్మాలుగా, శృంగార చేష్టలలో ఏర్పడ్డ నఖ గాట్లే మొసళ్ళుగా, వారి యశస్సులే తీరాలుగా ఒప్పారాయి.

52

మృదుష్వఙ్గేషు కాసాంచిత్ కుచాగ్రేషు చ సంస్థితాః,
బభూవురూభూషణానీవ శుభా భూషణరాజయః.

53

అంశుకాన్తాశ్చ కాసాం చిన్ముఖమారుతకమ్పితాః,
ఉపర్యుపరి వక్త్రాణాం వ్యాధూయన్తే పునః పునః.

54

తాః పతాకా ఇవోద్ధూతాః పత్నీనాం రుచిరప్రభాః,
నానావర్ణసువర్ణానాం వక్త్రమూలేషు రేజిరే.

55

వవల్గుశ్చాత్ర కాసాంచిత్ కుణ్డలాని శుభార్చిషామ్,
ముఖమారుత సంసర్గాన్మన్దం మన్దం సుయోషితామ్.

56

శర్కరాసవగన్ధైశ్చ ప్రకృత్యా సురభిః సుఖః,
తాసాం వదననిశ్వాసః సిషేవే రావణం తదా.

57

ఆ స్త్రీలు ధరించిన ఆభరణాల బరువు వలన కొందరి మృదువైన అవయవాల మీదా, కుచాగ్రాల మీదా ఏర్పడ్డ ముద్రలు అచ్చం ఆభరణాల వలెనే ప్రకాశించాయి.

53

ఆ స్త్రీలలో కొందరి గాఢ నిశ్వాసాలచే రెపరెపలాడుతున్న పయ్యెద కొంగులు పదేపదే వారి ముఖారవిందాలపై పడుతున్నాయి.

54

విభిన్న శరీరచాయలు గల, వివిధ ఆభరణాలు ధరించిన ఆ స్త్రీల చెక్కిళ్ళ మీద శోభాయమానమైన వస్త్రాంతములు రెపరెపలాడుతూ ఉండడం విజయ కేతనాలు ఎగురవేస్తున్నట్లుగా కనిపించింది.

55

నిద్రిస్తున్న సౌందర్యవతులైన ఆ స్త్రీలలో కొందరి కర్ణాభరణాలు (కుండలాలు) వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాల తాకిడికి మెల్లమెల్లగా కదలుతున్నాయి.

56

ఆ స్త్రీల నిట్టూర్పులు స్వాభావికంగానే పరిమళభరితమైనవి; చక్కెరతో తయారైన మద్యం సేవించడంతో వారి ముఖనిశ్వాసం మరింతగా పరిమళిస్తూ రావణుని మీద ప్రసరించి సేవిస్తూన్నట్లుగా ఉంది.

57

రావణాననశఙ్కాశ్చ కాశ్చిద్రావణయోషితః,
ముఖాని స్మ సపత్నీనాముపాజిఘ్రన్ పునః పునః.

58

అత్యర్థం సక్తమనసో రావణే తా వరస్త్రియః,
అస్వతన్త్రాః సపత్నీనాం ప్రియమేవాచరం స్తదా.

59

బాహూనుపనిధాయాన్యాః పారిహార్యవిభూషితాన్,
అంశుకాని చ రమ్యాణి ప్రమదాస్తత్ర శిశ్యిరే.

60

అన్యా వక్షసి చాన్యస్యాస్తస్యాః కాశ్చిత్పునర్భుజమ్,
అపరా త్వఙ్కమన్యస్యాస్తస్యాశ్చాప్యపరా భుజౌ.

61

ఊరుపార్శ్వకటీపృష్ఠ మన్యోన్యస్య సమాశ్రితాః,
పరస్పరనివిష్టాఙ్గ్యో మదస్నేహవశానుగాః.

62

రావణుని భార్యలు కొందరు మద్యపాన పారవశ్యంలో రావణుని ముఖమే అనే భ్రాంతి చేత సవతుల ముఖములను పదే పదే ముద్దుపెట్టుకొనసాగారు.

58

రావణుని పట్ల అమిత అనురక్తి గలవారవడం చేత ఆ సుందరాంగులు తమ చెంతనున్న సవతులను రావణుడే అని భ్రమించి చుంబిస్తూ వారికి ప్రియాన్నే చేకూర్చారు. ఆ సవతులు తమను రావణుడే ముద్దాడుతున్నాడని భ్రమించి ప్రీతినొందారు.

59

కొందరు అతివలు కడియములచే అలంకరింపబడిన తమ భుజములను, రమ్యాతిరమ్యములైన వస్త్రములను తలగడలుగా చేసుకొని హాయిగా నిద్రిస్తున్నారు.

60

వారిలో ఒక స్త్రీ వేరొక స్త్రీ వక్షస్థలంపై తల ఉంచి నిద్రిస్తూండగా, ఆమె భుజముపై తలపెట్టి మరొక స్త్రీ నిద్రిస్తున్నది. ఒక స్త్రీ మరొక స్త్రీ తొడ మీద తల ఉంచి నిద్రించగా, ఆమె భుజముల మీద తలనుంచి మరో స్త్రీ పడుకొని ఉన్నది.

61

మద్యపానంచే కలిగిన మదంచే, మైత్రీ ప్రాబల్యంచే పరవశులైన ఆ స్త్రీలు ఒండొరుల తొడలు, ప్రక్కలు, కటిప్రదేశముల మీద తలలు ఆన్చి, కాళ్ళు చేతులు వేసి పడుకొని ఉన్నారు.

62

అన్యోన్యభుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా,
మాలేవ గ్రథితా సూత్రే శుశుభే మత్తషట్పదా.

63

లతానాం మాధవే మాసి ఫుల్లానాం వాయుసేవనాత్,
అన్యోన్యమాలాగ్రథితం సంసక్తకుసుమోచ్చయమ్.

64

వ్యతివేష్టితసుస్కన్ధమన్యోన్య భ్రామరాకులమ్,
ఆసీద్వనమివోద్భూతం స్త్రీవనం రావణస్య తత్.

65

ఉచితేష్వపి సువ్యక్తం న తాసాం యోషితాం తదా,
వివేకః శక్య ఆధాతుం భూషణాఙ్గామ్బరస్రజామ్.

66

ఒండొరుల భుజాలనే దారంతో గుచ్చబడిన ఆ స్త్రీ బృందమనే మాల (హారం), మదించిన తుమ్మెదలుగలదీ, దారంచే గుచ్చబడినదీ అయిన పుష్పమాల మల్లే ప్రకాశిస్తున్నది.

63

ఆ రావణుని స్త్రీజన సమూహం అనే వనం వసంత ఋతువులో వాయు సంచారముచే పుష్పించిన లతావనాన్ని తోపింపజేస్తున్నది. తీగలన్నీ కలసి ఎలా మాలగా ఏర్పడుతాయో, ఎలా శాఖోపశాఖలుగా కలసిపోతాయో, ఎలా ఆ తీగల పువ్వులు, వాటి మీద వ్రాలిన తుమ్మెదలు కలసిపోయినట్లు కానవస్తాయో ఆ విధంగానే ఒకే చోట కలసి ఉన్న ఆ రావణుని స్త్రీలు మాలవలె కనిపించారు. వారి భుజాలు పరస్పరం చుట్టుకొని ఉండగా వారి ముంగురులు కలిసిపోయి ఉన్నాయి.

64–65

అప్పుడు ఆ అంగనలు ధరించిన ఆభరణాలుగాని, వారి అవయవాలుగాని, ఆచ్ఛాదించుకొన్న వలువలుగాని, పుష్పమాలికలుగాని బాగా పరిచయస్థులకు కూడా ఏవి ఎవరివో కచ్చితంగా చెప్పడానికి వీలుకాకుండెను.

66

రావణే సుఖసంవిష్టే తాః స్త్రియో వివిధప్రభాః,
జ్వలన్తః కాఞ్చనా దీపాః ప్రైక్షన్తానిమిషా ఇవ.

67

రాజర్షి పితృదైత్యానాం గన్ధర్వాణాం చ యోషితః,
రాక్షసానాం చ యాః కన్యాస్తస్య కామవశం గతాః.

68

యుద్ధకామేన తాః సర్వా రావణేన హృతాః స్త్రియః,
సమదా మదనేనైవ మోహితాః కాశ్చిదాగతాః.

69

న తత్ర కాచిత్ప్రమదా ప్రసహ్య
వీర్యోపపన్నేన గుణేన లబ్ధా,
న చాన్యకామాపి న చాన్యపూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తామ్.

70

రావణుడు మేల్కొని ఉన్నప్పుడు ఎవరూ ఆ స్త్రీలను కన్నెత్తికూడా చూడడానికి సాహసించరు. రావణుడు సుఖంగా నిద్రిస్తున్న ఈ సమయంలో బంగారు దీపపాత్రలలో ప్రజ్వలిస్తున్న దీపాలు తదేకంగా వివిధ కాంతులు గల ఆ స్త్రీలను చూస్తున్నవా అన్నట్లు ఉన్నాయి.

67

రాజర్షుల స్త్రీలు, పితరుల అతివలు, దైత్యాంగనలు, గంధర్వకాంతలు, రాక్షస కన్యలు రావణుని కామించియే అతడికి వశవర్తులయ్యారు.

68

అక్కడ నిద్రిస్తున్న స్త్రీలలో అత్యధికపాలు మందిని రావణుడు అనేక యుద్ధములు చేసి జయించి తీసుకువచ్చాడు. కాని వారిలో కొందరు మాత్రం యవ్వనోన్మాదం వల్ల కలిగిన మన్మథ ప్రేరణచే ఇష్టపడి రావణుని చెంత చేరారు.

69

అత్యుత్తములాలైన సీతాదేవి తప్ప ఆ స్త్రీ సమూహంలో రావణుడు తన పరాక్రమంచే బలాత్కారంగా తీసుకువచ్చిన వారు మచ్చుకికూడా ఎవరూ లేరు. అంగీకారంతోనే వారిని రావణుడు తీసుకువచ్చాడు. వారిలో మరొక పురుషుణ్ణి వలచిన వనితగాని, పూర్వమే వేరొక పురుషునికి ప్రియురాలైన స్త్రీ గాని ఎవరూ లేరు.

70

న చాకులీనా న చ హీనరూపా
నాదక్షిణా నానుపచారయుక్తా,
భార్యాఽభవత్తస్య న హీనసత్త్వా
న చాపి కాన్తస్య న కామనీయా.

71

బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవధర్మపత్నీ,
ఇమా యథా రాక్షసరాజభార్యాః
సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః.

72

పునశ్చ సోఽచిన్తయదార్తరూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా,
అథాయమస్యాం కృతవాన్మహాత్మా
లజ్కేశ్వరః కష్టమనార్యకర్మ.

73

రావణుని భార్యలలో ఉత్తమ వంశంలో జన్మించనివారుగాని, సౌందర్యవతి కానివారుగాని, నేర్పులేనివారుగాని, సేవలు అందుకోనివారుగాని, బుద్ధిహీను రాలుగాని, రావణునికి ప్రీతిపాత్రురాలు కాని స్త్రీ ఒక్కరు కూడా లేరు.

71

అత్యంత వివేకవంతుడైన హనుమంతుని మదిలో ఈ ఆలోచన మెదలింది: 'ఈ రావణుని భార్యలు తమ భర్తను ఎడబాయక సుఖంగా ఉన్న రీతిలో శ్రీరాముని ధర్మపత్నియైన సీతాదేవి తన భర్త సాన్నిధ్యంలో ఉండి ఉంటే నేనెంత అదృష్టవంతుడనో, నా జన్మ ఎంత సార్థకమయ్యేదో కదా!'

72

హనుమంతుడు దుఃఖిస్తూ మళ్ళీ ఇలా అనుకొన్నాడు: 'సీతాదేవి నిస్సంశయంగా సద్గుణ సంపన్నురాలు. అయినప్పటికీ లంకాధిపతి అయిన రావణుడు ఆమె విషయంలో హీనంగా వ్యవహరించాడు. ఎంత కష్టం.'

73

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 9వ సర్గ సమాప్తం

10వ సర్గ
మండోదరిని చూసి సీతగా భ్రమించడం

తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్,
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్.

1

దాన్తకాఞ్చన చిత్రాఙ్గైర్వైడూర్యైశ్చ వరాసనైః,
మహార్హాస్తరణోపేతైరుపపన్నం మహాధనైః.

2

తస్య చైకతమే దేశే సోఽగ్ర్యమాలావిభూషితమ్,
దదర్శ పాణ్డురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్.

3

సీతాదేవిని అన్వేషిస్తూ హనుమంతుడు అంతఃపురాన్నంతా పరిశీలించ నారంభించాడు. ఇంద్రుని శయనాగారాన్ని పోలిన, శ్రేష్ఠమైనదీ స్ఫటిక నిర్మితమైనదీ నానా రత్నాలంకృతమై భాసిస్తున్న రావణుని శయన గృహాన్ని హనుమంతుడు చూశాడు. అమూల్యములైన ఉత్తమ ఆసనములచే ఆ గృహం తీర్చిదిద్దబడి ఉంది. ఆ ఆసనములు బంగారముతోను, దంతపు నగిషీలతోను, వైడూర్యమణిఖచితములై నానావర్ణములతో ప్రకాశిస్తున్నాయి. ఆ ఆసనముల మీద అత్యంత విలువైన పరుపులు పరిచి ఉన్నవి.

1–2

ఆ శయనాగారమందు హనుమంతుడు ఒక వైపు శ్రేష్ఠములైన పుష్పమాలికలతో అలంకరింపబడి చంద్రుని వలె ప్రకాశిస్తూన్న తెల్లని గొడుగును చూశాడు.

3

జాతరూపపరిక్షిప్తం చిత్రభానుసమ ప్రభమ్,
అశోకమాలావితతం దదర్శ పరమాసనమ్.

4

వాలవ్యజనహస్తాభిర్వీజ్యమానం సమన్తతః,
గన్ధైశ్చ వివిధైర్జుష్టం వరధూపేన ధూపితమ్.

5

పరమాస్తరణాస్తీర్ణమావికాజినసంవృతమ్,
దామభిర్వరమాల్యానాం సమన్తాదుపశోభితమ్.

6

తస్మిన్ జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుణ్డలమ్,
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్.

7

లోహితేనానులిప్తాఙ్గం చన్దనేన సుగన్ధినా,
సన్ధ్యారక్తమివాకాశే తోయదం సతటిద్గణమ్.

8

వృతమాభరణైర్దివ్యైః సురూపం కామరూపిణమ్,
సవృక్షవనగుల్మాఢ్యం ప్రసుప్తమివ మన్దరమ్.

9

క్రీడిత్వోపరతం రాత్రౌ వరాభరణభూషితమ్,
ప్రియం రాక్షసకన్యానాం రాక్షసానాం సుఖావహమ్.

10

పీత్వా వ్యుపరతం చాపి దదర్శ స మహాకపిః,
భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్.

11

బంగారంతో నిర్మితమై, అగ్నివలె ఉజ్జ్వలమై, అశోక పుష్పమాలలతో అలంకరింపబడిన ఉత్తమోత్తమమైన ఒక శయ్యను అక్కడ హనుమంతుడు చూశాడు.

4

ఆ శయ్య చుట్టూ కొందరు సుందరాంగులు నిలబడి వింజామరలు వీచుచున్నారు. వివిధములైన సుగంధముల పరిమళం ఆ ప్రదేశంలో గుబాళిస్తూన్నది. శ్రేష్ఠమైన ధూపధూమం సర్వత్రా వ్యాపించి ఉన్నది.

5

ఆ శయ్య మీద మెత్తని గొర్రె చర్మములు, శ్రేష్ఠతమమైన పరుపులు పరచబడి ఉన్నవి. ఆ శయ్య చుట్టూ పరిమళభరితములైన పుష్పమాలలు కట్టబడి ఉన్నవి.

6

ప్రకాశమానమైన ఆ శయనం మీద నిద్రిస్తున వీరుడూ, రాక్షస రాజూ అయిన రావణుని హనుమంతుడు చూశాడు. అతడు నల్లనైన మేఘం చందాన ఉన్నాడు. ఆతడు ధరించిన శ్రేష్ఠములైన కుండలాలు మెరుస్తున్నాయి. ఎర్రని కళ్ళు, మహాబాహువులు గల రావణుడు బంగారు జరీ వస్త్రాలు ధరించి ఉన్నాడు. సుగంధ పరిమళాలు వెదజల్లే ఎర్రచందనాన్ని ఒడలంతా అలదుకొని ఉండడంతో, అత్యద్భుతమైన ఆభరణాలు ధరించడంతో,

ఆకాశంలో సంధ్యాసమయాన ఎర్రని రంగు దాల్చి మెరపు తీగలతో కూడుకొన్న మేఘంలా ఆ రావణుడు తోపట్టాడు. కోరిన రూపాన్ని ధరించగల ఆ రాక్షసేంద్రుడు సుందరరూపంతో భాసిస్తున్నాడు. అమూల్యమైన ఆభరణాలను ధరించిన అతడు రాత్రంతా రతిక్రీడలు సలిపిన పిదప విశ్రమిస్తున్నాడు. అందువలన అతడు వృక్షాలు, వనాలు, పొదలతో నిండి నిద్రిస్తున్న మందరపర్వతంలా కనిపించాడు. రాక్షస కన్యలకు ప్రియుడూ, రాక్షసులకు సుఖం చేకూర్చే వాడూ అయిన ఆ రావణుడు మద్యపాన మత్తులో ప్రకాశమానమైన ఆ శయ్య మీద నిద్రిస్తూ ఉండడం కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు చూశాడు.

7–11

నిశ్శ్వసన్తం యథా నాగం రావణం వానరర్షభః,
ఆసాద్య పరమోద్విగ్నః సోఽపాసర్పత్సుభీతవత్.

12

అథారోహణమాసాద్య వేదికాన్తరమాశ్రితః,
సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః.

13

బుసకొట్టుతున్న మహాసర్పంలా నిశ్శ్వసిస్తూన్న రావణుని వద్దకు వెళ్ళిన హనుమంతుడు ఉద్విగ్నుడై భీతి చెందిన వ్యక్తిలా కాస్త వెనుకకు వెళ్ళాడు.

12

వెంటనే హనుమంతుడు మెట్ల మీదుగా వెళ్ళి మరొక వేదికనెక్కి నిలబడి అక్కణ్ణుంచి నిద్రిస్తున్న ఆ రావణుని పరీక్షగా చూడసాగాడు.

13

శుశుభే రాక్షసేన్ద్రస్య స్వపతః శయనోత్తమమ్,
గన్ధహస్తిని సంవిష్టే యథా ప్రస్రవణం మహత్.

14

కాఞ్చనాఙ్గదసన్ననద్ధౌ చ దదర్శ స మహాత్మనః,
విక్షిప్తౌ రాక్షసేన్ద్రస్య భుజావిన్ద్రధ్వజోపమౌ.

15

ఐరావతవిషాణాగ్రై రాపీడనకృతవ్రణౌ,
వజ్రోల్లిఖీతపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ.

16

పీనౌ సమసుజాతాంసౌ సంగతౌ బలసంయుతౌ,
సులక్షణనఖాఙ్గుష్ఠౌ స్వఙ్గుళీతలలక్షితౌ.

17

సంహతౌ పరిఘాకారౌ వృత్తౌ కరికరోపమౌ,
విక్షిప్తౌ శయనే శుభ్రే పఞ్చశీర్షావివోరగౌ.

18

శశక్షతజకల్పేన సుశీతేన సుగన్ధినా,
చన్దనేన పరార్థ్యేన స్వనులిప్తౌ స్వలఙ్కృతౌ.

19

ఉత్తమస్త్రీవిమృదితౌ గన్ధోత్తమ నిషేవితౌ,
యక్షపన్నగగన్ధర్వ దేవదానవ రావిణౌ.

20

దదర్శ స కపిస్తస్య బాహూ శయనసంస్థితౌ,
మన్దరస్యాన్తరే సుప్తౌ మహాహీ రుషితావివ.

21

రావణుడు శయనించి ఉన్న ఆ శ్రేష్ఠమైన శయనం మదపుటేనుగు

శయనించిన విశాలమైన తటాకంలా ఒప్పారింది.

14

ఆ శయనం మీద చాపబడిన రాక్షసేంద్రుని బాహువులను హనుమంతుడు తేరిపార చూశాడు. ఆ బాహువులు బంగారు బాహుపురులతో తేజరిల్లుతూ, ఇంద్రధ్వజానికి దీటైనవిగా కానవచ్చాయి. పూర్వం ఐరావతంతో పోరాడినప్పుడు ఏర్పడ్డ గాయం తాలూకు మచ్చలు, దేవేంద్రుని వజ్రాయుధపు గాట్లు, విష్ణుచక్రం వలన కలిగిన గాయాల మచ్చలు ఆ బాహువుల ఇనుమడించిన శౌర్యాన్ని చెప్పక చెబుతున్నాయి. ఆ బాహువులు బాగుగా బలిసి సమసుందరములైన మూపు గలవై, శుభలక్షణలక్షితాలైన గోళ్ళను, బొటనవేళ్ళను, అరచేతులను కలిగి, దృఢమైన కోటగడియల వలె ఒప్పారుతున్నాయి. అంతేకాక ఏనుగు తొండము వలె గుండ్రముగా అమరి ఉన్న ఆ బాహువులు నిర్మలమైన ఆ శయనం మీద పడగవిప్పిన ఐదు తలల పాముల చందాన కానవస్తున్నాయి. కుందేటి రక్తం వలె ఎరన్ని, చల్లని మంచిగంధపు మైపూతతో అవి అలరారుతున్నాయి. ఉత్తమాంగనలచే మర్దింపబడే ఆ బాహువులకు శ్రేష్ఠములైన ఇతర సుగంధద్రవ్యాలు కూడా అలదబడి ఉన్నాయి. ఎన్నోసార్లు యక్షులను, పన్నగులను, గంధర్వులను, దేవతలను, దానవులను ఆ మహాబాహువులు విలపించేటట్లు చేశాయి. మందర పర్వత మధ్య ప్రదేశమందు నిద్రించుచున్నట్టి కోపించిన మహాసర్పాల మల్లే ఉన్న ఆ రావణుని మహాబాహువులను హనుమంతుడు తిలకించాడు.

15–21

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశః శృఙ్గాభ్యామివ మన్దరః.

22

చూతపున్నాగసురభి ర్వకుళోత్తమసంయుతః,
మృష్టాన్నరససంయుక్తః పానగన్ధ పురస్సరః.

23

తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహాముఖాత్,
శయానస్య వినిఃశ్వాసః పూరయన్నివ తద్గృహమ్.

24

బలిసిన బాహువులతో పర్వత సదృశుడైన ఆ రాక్షసరాజు రెండు శిఖరాలతో కూడిన మందర పర్వతంలా విరాజిల్లుతున్నాడు.

22

నిద్రిస్తున్న రాక్షస శ్రేష్ఠుడైన ఆ రావణుని ముఖం నుండి మామిడి, పొన్నపువ్వుల సువాసన గలిగి, పొగడ పువ్వుల పరిమళము వహించి, మృష్టాన్న రసముల వాసనలతో కూడిన మద్యగంధము గల నిశ్శ్వాసవాయువులు ఆ గృహాన్ని యావత్తు నింపివేస్తున్నట్లు వెలువడసాగాయి.

23–24

ముక్తామణి విచిత్రేణ కాఞ్చనేన విరాజితమ్,
మకుటేనాపవృత్తేన కుణ్డలోజ్జ్వలితాననమ్.

25

రక్తచన్దనదిగ్ధేన తథా హారేణ శోభినా,
పీనాయతవిశాలేన వక్షసాభివిరాజితమ్.

26

పాణ్డరేణాపవిద్ధేన క్షౌమేణ క్షతజేక్షణమ్,
మహార్హేణ సుసంవీతం పీతేనోత్తమవాससా.

27

మాషరాశిప్రతీకాశం నిశ్శ్వసన్తం భుజఙ్గవత్,

గాఙ్గే మహతి తోయాన్తే ప్రసుప్తమివ కుఞ్జరమ్.

28

చతుర్భిః కాఞ్చనైర్దీపైర్దీప్యమానచతుర్దిశమ్,
ప్రకాశీకృతసర్వాఙ్గం మేఘం విద్యుద్గణైరివ.

29

పాదమూలగతాశ్చాపి దదర్శ సుమహాత్మనః,
పత్నీః స ప్రియభార్యస్య తస్య రక్షఃపతేర్గృహే.

30

నిద్రిస్తున్న రావణునీ, ఆతని పాదముల చెంత నిద్రిస్తున్న ఇష్టులైన ఆతని భార్యలనూ ఆ శయన మందిరంలో హనుమంతుడు చూశాడు. నిద్రావశాన కాస్త ప్రక్కకు ఒరిగిన ముత్యములు మణులు పొదుగబడిన బంగారు కిరీటంతో రావణుడు ప్రకాశిస్తున్నాడు. కుండలముల కాంతిచే ఆతడి ముఖమండలం తేజరిల్లుతున్నది. బలిష్ఠమూ, విశాలమూ, రక్తచందనంచే అలదబడినదీ, ముత్యాలహారాలు గలదీ అయిన వక్షస్థ్సలంతో అతడు భాసిస్తున్నాడు. ఉత్తరీయముగా తెల్లని పట్టువస్త్రాన్ని, కట్టువస్త్రంగా శ్రేష్ఠమైన పీతాంబరాన్ని అతడు ధరించి ఉన్నాడు. అతడి కళ్ళు ఎర్రబారి ఉన్నాయి. బుసలుకొట్టే మహాసర్పం వలె నిశ్శ్వసిస్తూ, మినుముల రాశిలా నల్లగా ఉన్న ఆతడు గంగానదీ జలాల నడుమ శయనించిన ఏనుగు మల్లే కానవచ్చాడు. నలువంకలా బంగారు దీపపాత్రలు ప్రకాశిస్తూండడంతో ఆ రావణుడు మెరపుల సమూహాలచే సర్వత్రా ప్రకాశమానమైన మేఘం చందాన విరాజిల్లుతున్నాడు.

25–30

శశిప్రకాశవదనాశ్చారుకుణ్డలభూషితాః,
అమ్లానమాల్యాభరణా దదర్శ హరియూథపః.

31

నృత్తవాదిత్రకుశలా రాక్షసేన్ద్రభుజాఙ్కగాః,
వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః.

32

వజ్రవైడూర్యగర్భాణి శ్రవణాన్తేషు యోషితామ్,
దదర్శ తాపనీయాని కుణ్డలాన్యఙ్గదాని చ.

33

చంద్రుని వలె ప్రకాశిస్తూన్న మోముగలవారూ, అందమైన కుండలములు ధరించిన వారూ, వాడిపోని పుష్పమాలలను అలంకరించుకొన్న వారూ అయిన రావణునికి ఇష్టులైన భార్యలను హనుమంతుడు చూశాడు.

31

నృత్తమునందు, వివిధ వాద్యవాదనమందు నిపుణులై, రావణుని బాహువుల చేతనూ అంకభాగాలచేతనూ లాలింపబడిన వారూ, ఉత్తమాభరణాలను అలంకరించుకొన్న వారూ అయిన రావణుని భార్యలు నిద్రిస్తూండడం హనుమంతుడు అక్కడ చూశాడు.

32

తమ భుజములనే తలగడగా చేసుకొని నిద్రిస్తూండడంచేత, ఆ సుందరీమణులు చెవులకు ధరించిన వజ్రవైడూర్యములు పొదిగిన కర్ణాభరణములు, బాహుపురులు చెవులకు అతుక్కుపోయి ఉన్నట్లుగా హనుమంతునికి కనిపించాయి.

33

తాంసాం చన్ద్రోపమైర్వక్త్రైః శుభైర్లలితకుణ్డలైః,
విరరాజ విమానం తన్నభస్తారాగణైరివ.

34

మదవ్యాయామఖీన్నాస్తా రాక్షసేన్ద్రస్య యోషితః,
తేషు తేష్వవకాశేషు ప్రసుప్తాస్తనుమధ్యమాః.

35

అజ్ఘహారైస్తథైవాన్యా కోమలైర్నృత్తశాలినీ,
విన్యస్తశుభసర్వాఙ్గీ ప్రసుప్తా వరవర్ణినీ.

36

కాచిద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే,
మహానదీప్రకీర్ణేవ నలినీ పోతమాశ్రితా.

37

అన్యా కక్షగతేనైవ మడ్డుకేనాసితేక్షణా,
ప్రసుప్తా భామినీ భాతి బాలపుత్రేవ వత్సలా.

38

మనోహరములైన కుండలములు దాల్చిన ఆ చంద్రవదనల ముఖారవిందాలతో ఆ విమానము నక్షత్ర సముదాయముతో ప్రకాశిస్తూన్న ఆకాశం మల్లే మెరిసిపోతున్నది.

34

సన్నని నడుముగల ఆ రావణుని భార్యలు మద్యము గ్రోలి మత్తిల్లి, రతికేళులచే అలసిసొలసి అవకాశమున్న చోట్లలో అట్లే పరుండి నిద్రిస్తున్నారు.

35

వారిలో ఒక లావణ్యవతి నృత్తవిద్యాపారంగతురాలవడం వలన నిద్రలో కూడా అభ్యాసవశమున నృత్త అంగభంగిమలను ప్రదర్శిస్తూనే శయనించి ఉన్నది.

36

ఒకనొక వైణికురాలైన సుందరీమణి వీణను కౌగలించుకునే నిద్రిస్తూ. మహానదీ ప్రవాహంలో కొట్టుకొనిపోతూ యాదృచ్ఛికంగా ఒక చిన్నపడవకు తగుల్కొన్న తామరతీగ మల్లే ఒప్పుతూ కానవచ్చింది.

37

మడ్డుక మనే వాద్యాన్ని చంకలోనే ఉంచుకొని నిద్రిస్తున్న నల్లనైన కన్నులుగల ఒక అంగన, శిశువును చంకలో ఉంచుకొన్న పుత్రవాత్సల్యం ఉట్టిపడే స్త్రీలా భాసిస్తోంది.

38

పటహం చారుసర్వాఙ్గీ పీడ్య శేతే శుభస్తనీ,
చిరస్య రమణం లబ్ధ్వా పరిషజ్యేవ భామినీ.

39

కాచిద్వంశం పరిష్వజ్య సుప్తా కమలలోచనా,
రహః ప్రియతమం గృహ్య సకామేవ చ కామినీ.

40

విపఞ్చీం పరిగృహ్యాన్యా నియతా నృత్తశాలినీ,
నిద్రావశమనుప్రాప్తా సహకాన్తేవ భామినీ.

41

అన్యా కనకసంకాశైర్మృదుపీనైర్మనోరమైః,
మృదఙ్గం పరిపీడ్యాఙ్గైః ప్రసుప్తా మత్తలోచనా.

42

భుజపార్శ్వాన్తరస్థేన కక్షగేన కృశోదరీ,
పణవేన సహానిన్ద్యా సుప్తా మదకృతశ్రమా.

43

సుందరములైన సర్వావయవాలు, చక్కని స్తన సంపత్తి గల ఒక అంగన, చాలాకాలం తరువాత వచ్చిన ప్రియుణ్ణి కౌగలించుకొన్నట్లు పహాట మనే (తప్పెట వంటిది) గట్టిగా పొదవిపట్టుకొని నిద్రిస్తూన్నది.

39

పద్మముల వంటి కన్నులు గల ఒక సుందరాంగి ఏకాంతంలో ప్రియుణ్ణి కూడిన కామపరవశమైన కామిని వలె వేణువును గాఢంగా కౌగలించుకొని నిద్రిస్తూన్నది.

40

నృత్తంలో కోవిదురాలైన మరో అంగన విపంచి అనబడే ఏడు తంత్రుల వీణను హృదయానికి హత్తుకొని, నిద్రాపరాధీనయై కాంతుని కూడిన స్త్రీలా నిద్రలో జారిపోయి ఉన్నది.

41

సుతిమెత్తనివీ, మనోహరమైనవీ, బలిసినవీ, బంగారు వర్ణంలోనివి అయిన అవయవాలతో, మదించిన కన్నులతో ఉన్న ఒక స్త్రీ మృదంగాన్ని గట్టిగా కౌగలించుకుని పారవశ్యంలో కళ్ళు మూతలుపడగా నిద్రిస్తూన్నది.

42

మధుపానంతో అలసిన కృశోదరియైన (కృశించిన పొట్టగల) ఒక యువతి ప్రణవమనే వాద్యవిశేషాన్ని చంకలో బాహువులతో దృఢంగా పుచ్చుకొని నిద్రిస్తూన్నది.

43

డిణ్డిమం పరిగృహ్యాన్యా తథైవాసక్తడిణ్డిమా,
ప్రసుప్తా తరుణం వత్సముపగూహ్యేవ భామినీ.

44

కాచిదాడమ్బరం నారీ భుజసంయోగపీడితమ్,
కృత్వా కమలపత్రాక్షీ ప్రసుప్తా మదమోహితా.

45

కలశీమపవిధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ,
వసన్తే పుష్పశబలా మాలేవ పరిమార్జితా.

46

పాణిభ్యాం చ కుచౌ కాచిత్సువర్ణకలశోపమౌ,
ఉపగూహ్యేబలా సుప్తా నిద్రాబలపరాజితా.

47

అన్యా కమలపత్రాక్షీ పూర్ణేన్దుసదృశాననా,
అన్యామాలిఙ్గ్య సుశ్రోణీం ప్రసుప్తా మదవిహ్వలా.

48

మరో యువతి డిండిమమనే వాద్యాన్ని ఒక చేత పట్టుకొని, మరొక డిండిమమును కౌగలించుకొన్నదై, ప్రియుణ్ణి కౌగలించుకొని మరొక చేత శిశువును ఎత్తుకొన్న స్త్రీలా శయనించి ఉంది.

44

తామరపువ్వు రేకులను పోలిన కన్నులు గల ఒక సుందరాంగి ఆడంబరమనే వాద్యాన్ని బాహువులచే గట్టిగా కౌగలించుకొని, మదమోహితయై నిద్రిస్తూ ఉన్నది.

45

నిద్రాపరవశయైన ఒక స్త్రీ ప్రక్కనున్న నీటి కలశాన్ని త్రోసి, ఆ నీటిలో తడిసిపోయి వసంత కాలంలో వాడకుండా ఉండడానికి నీరు చల్లి తడిపిన రంగురంగు పువ్వులతో కట్టబడిన పూలమాలవలె నిద్రిస్తూ, శోభించింది.

46

మరొక స్త్రీ బంగారు కలశములను పోలిన తన కుచద్వయం మీద చేతులు ఉంచుకొని అతిశయించిన పారవశ్యంలో నిద్రిస్తూన్నది.

47

పద్మపత్రాల వంటి కన్నులు, పూర్ణచంద్రుని వంటి వదనముగల మదవతియైన అంగన ఒకతె చక్కని కట ప్రదేశంగల మరొక యువతిని మత్తుతో కౌగలించుకుని నిద్రిస్తూన్నది.

48

ఆతోద్యాని విచిత్రాణి పరిష్వజ్య వరస్త్రియః,
నిపీడ్య చ కుచైః సుప్తాః కామిన్యః కాముకానివ.

49

తాసామేకాన్తవిన్యస్తే శయానాం శయనే శుభే,
దదర్శ రూపసంపన్నామపరాం స కపిః స్త్రియమ్.

50

ముక్తామణిసమాయుక్తైర్భూషణైః సువిభూషితామ్,
విభూషయన్తీమివ తత్స్వశ్రియా భవనోత్తమమ్.

51

గౌరీం కనకవర్ణాభామిష్టామన్తః పురేశ్వరీమ్,
కపిర్మన్దోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్.

52

అనేక విధములైన వాద్యములను కౌగలించుకొని తమ కుచములతో అదిమిపట్టి, కాముకులను కౌగలించుకొన్న కామినుల వలె కొందరు సుందరీమణులు అక్కడ నిద్రపోతున్నారు.

49

ఆ సుందరాంగుల నడుమ ప్రత్యేకంగా శ్రేష్ఠమైన ఒక శయ్యమీద నిద్రిస్తున్న అత్యంత సౌందర్యవతియైన ఒక స్త్రీని హనుమంతుడు చూశాడు.

50

ముత్యములూ, రత్నములూ పొదిగిన ఆభరణములను ధరించినదై, తన కాంతి పుంజములచే ఆ యావత్తు భవనాన్ని ప్రకాశింపజేస్తున్నదా అన్నట్లున్న ఆ అంగనామణిని హనుమంతుడు చూశాడు.

51

బంగారం వంటి మేని చాయ గలదీ, రావణునికి అమిత ఇష్టమైన ప్రియురాలు, ఆతని అంతఃపురానికి అధినేత్రి అయిన మండోదరి అనే ఆ స్త్రీని నిద్రిస్తూండగా హనుమంతుడు చూశాడు.

52

స తాం దృష్ట్వా మహాబాహుర్భూషితాం మారుతాత్మజః,
తర్కయామాస సీతేతి రూపయౌవన సంపదా,
హర్షేణ మహతా యుక్తో ననన్ద హరియూథపః.

53

ఆస్ఫోటయామాస చుచుమ్బ పుచ్ఛం
ననన్ద చిక్రీడ జగౌ జగామ,
స్తమ్భానరోహన్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్.

54

గొప్పవైన బాహువులు గలవాడూ, వానర సేనానాయకుడూ అయిన ఆ హనుమంతుడు చక్కగా అలంకరించుకొన్న ఆమెను చూసి, ఆమె సౌందర్య యౌవనాలను బట్టి ఆమే సీత అని భావించి సంతోషంతో పులకించిపోయాడు.

53

సీతాదేవి కనపడిందన్న ఆనందపారవశ్యంలో వానర సహజాలైన చేష్టలచే తన సంతోషాన్ని హనుమంతుడు వ్యక్తం చేశాడు. జబ్బలు చరచుకొన్నాడు, తోకను ముద్దుపెట్టుకొన్నాడు. ఆట పాటలతో ఆనందంగా అటూ ఇటూ పచార్లు చేశాడు. చకచకా స్తంభాల మీదికెక్కి క్రిందికి దూకాడు.

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండంలోని 10వ సర్గ

సమాప్తం

11వ సర్గ
పానగృహంలో అన్వేషణ

అవధూయ చ తాం బుద్ధిం బభూనావస్థితస్తదా,
జగామ చాపరాం చిన్తాం సీతాం ప్రతి మహాకపిః.

1

న రామేణ వియుక్తా సా స్వప్తుమర్హతి భామినీ,
న భోక్తుం నాప్యలంకర్తుం న పానముపసేవితుమ్.

2

నాన్యం నరముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్,
న హి రామసమః కశ్చి ద్విద్యతే త్రిదశేష్వపి,
అన్యేయమితి నిశ్చిత్య పానభూమౌ చచార సః.

3

మండోదరిని చూసి సీతగా భ్రమించి సంతోషించిన హనుమంతుడు ఆ భ్రమను వీడి సీత విషయంగా పునరాలోచించసాగాడు.

1

రాముని ఎడబాసి సీత నిద్రింపదు, భుజింపదు, అలంకరించుకోదు, పాన సేవనం చేయదు. సాక్షాత్తు దేవేంద్రుడైనప్పటికీ పరపురుషుని ససేమిరా సమీపించదు. రామునికి సాటియైన వారు దేవతల్లో కూడా ఎవరూ లేరు కదా! కనుక ఈమె ముమ్మాటికీ సీత కాదు, మరెవరో అయివుంటారు. ఈ విధంగా

దృఢ నిశ్చయం చేసుకున్న హనుమంతుడు మళ్ళీ పానగృహంలో అన్వేషణ మొదలుపెట్టాడు.

2–3

క్రీడితేనాపరాః క్లాన్తా గీతేన చ తథాఽపరాః,
నృత్తేన చాపరాః క్లాన్తాః పానవిప్రహతాస్తథా.

4

మురజేషు మృదఙ్గేషు పీఠికాసు చ సంస్థితాః,
తథాఽఽస్తరణముఖ్యేషు సంవిష్టాశ్చాపరాః స్త్రియః.

5

అఙ్గనానాం సహస్రేణ భూషితేన విభూషణైః,
రూపసల్లాపశీలేన యుక్తగీతార్థభాషిణా.

6

దేశకాలాభియుక్తేన యుక్తవాక్యాభిధాయినా,
రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః.

7

తాసాం మధ్యే మహాబాహుః శుశుభే రాక్షసేశ్వరః,
గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథా వృషః.

8

ఆ రావణుని స్త్రీలలో కొందరు రతిక్రీడలచే ఆ పానగృహంలో అలసిపోయి ఉన్నారు. కొందరు పాడడం వలన, మరికొందరు నృత్యం చేసీ అలసిసొలసి ఉన్నారు. ఇంకా కొందరు మద్య సేవనంతో మత్తిల్లి పడి ఉన్నారు.

4

రావణుని స్త్రీలలో కొందరు మురజముల మీద, మద్దెళ్ళ మీద, చిన్న పీఠముల మీద ఆనుకుని పారవశ్యంలో నిద్రిస్తూన్నారు. కొంతమంది మెత్తని పాన్పుల మీద పవళించి నిద్రిస్తున్నారు.

5

వివిధాభరణ అలంకారాలతో ప్రకాశిస్తున్న వారు, సౌందర్యాది విషయాలను గూర్చి ముచ్చటించుకొంటున్న వారు, సమయానుకూలంగా పాడుతూ, ఆ గీతాలకు అర్థవివరణ ఇస్తున్న వారు, దేశకాలానుగుణంగా వ్యవహరిస్తున్న వారు, ఔచిత్యం ఉట్టిపడేలా మాట్లాడే వారు అయిన అనేకమంది స్త్రీలు రతి సుఖాన్ని చవిచూసిన తదనంతరం ఆదమరచి నిద్రిస్తూ ఉండడం హనుమంతుడు చూశాడు.

6–7

ఆ స్త్రీజనం మధ్య ఉన్న గొప్ప బాహువులు గల రావణుడు, గోశాలలోని శ్రేష్ఠములైన గోవుల మధ్యనున్న వృషభం మల్లే శోభిస్తున్నాడు.

8

స రాక్షసేంద్రః శుశుభే తాభిః పరివృతః స్వయమ్,
కరేణుభిర్యథారణ్యే పరికీర్ణో మహాద్విపః.

9

సర్వకామైరుపేతాం చ పానభూమిం మహాత్మనః,
దదర్శ హరిశార్దూలస్తస్య రక్షః పతేర్గృహే.

10

మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః,
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః.

11

రౌక్మేషు చ విశాలేషు భాజనేష్వర్ధభక్షితాన్,

దదర్శ హరిశార్దూలో మయూరాన్ కుక్కుటాంస్తథా.

12

వరాహవార్ధ్రాణసకాన్ దధిసౌవర్చలాయుతాన్,
శల్యాన్ మృగమయూరాంశ్చ హనుమాననవ్వైక్షత.

13

ఆ స్త్రీలతో పరివృతుడై ఉన్న ఆ రావణుడు మహారణ్యంలో ఆడ ఏనుగుల మధ్యనున్న మహాగజంలా విరాజిల్లుతున్నాడు.

9

మహాత్ముడూ, రాక్షసరాజూ అయిన ఆ రావణుని గృహమందు అభిలషింపదగిన సమస్త భోగ్యవస్తువులు విరివిగా లభించే పానభూమిని వానరశ్రేష్ముడైన హనుమంతుడు చూశాడు.

10

ఆ పానభూమిలో హనుమంతుడు విడివిడిగా అమర్చిపెట్టిన లేళ్ళ మాంసములను, అడవిదున్నల మాంసములను, అడవిపందుల మాంసములను చూశాడు.

11

పెద్ద పెద్ద బంగారు పాత్రలలో సగం తిని విడిచిపెట్టిన నెమలి, కోడి మాంసములు హనుమంతునికి అక్కడ కనిపించాయి.

12

హనుమంతుడు అక్కడ పెరుగు, సౌవర్చలమనే లవణంతో కలిపి వండిన వరాహాల, వార్ధ్రాణసకాలనే పక్షుల, ఏదుబందుల, లేళ్ళ, నెమళ్ళ మాంసాలను చూశాడు.

13

క్రకరాన్విధాన్ సిద్ధాంశ్చకోరానర్ధభక్షితాన్,
మహిషానేకశల్యాంశ్చ ఛాగాంశ్చ కృతనిష్ఠితాన్.

14

లేహ్యానుచ్చావచాన్ పేయాన్ భోజ్యాని వివిధాని చ.

15

తథాఽమ్లలవణోత్తంసైర్వివిధై రాగషాడబైః,
హార నూపుర కేయూరై రపవిద్ధై ర్మహాధనైః.

16

పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి,
కృతపుష్పోపహారా భూరధికం పుష్యతి శ్రియమ్.

17

తత్ర తత్ర చ విన్యస్తైః సుశ్లిష్టైః శయనాసనైః,
పానభూమిర్వినా వహ్నిం ప్రదీప్తేవోపలక్ష్యతే.

18

చక్కగా పక్వము చేసి ఆరగించడానికి సిద్ధంగా ఉన్న కొక్కెర పక్షుల దున్నపోతుల మాంసములను, ఏకశల్యములనే మత్స్యములను, వండిన మేక మాంసమును, అనేక రకాలైన లేహ్యాలను, త్రాగదగిన పదార్థములను, తినుబండారాలను హనుమంతుడు ఆ పానగృహంలో చూశాడు.

14–15

పులుపు, ఉప్పు ప్రధానంగా గల వివిధములైన పదార్థములతో షడ్రసములన్నీ కలిపి తయారుచేసిన భక్ష్యములతో, చిందరవందరగా పడి ఉన్న అమూల్య హారములతో, అందెలతో, కేయూరములతో, పెద్ద పానపాత్రలలో పడవేసి ఉన్న అనేక రకాలైన పండ్లతో, వెదజల్లబడిన పుష్పములతో ఆ పానగృహం ఎనలేని శోభను సంతరించుకొన్నది.

16–17

అక్కడక్కడ ఎడం లేకుండా అమర్చబడి ఉన్న రత్నమయములైన శయనముల, ఆసనములతో కూడుకున్న ఆ పానగృహం అగ్ని లేకుండానే తేజరిల్లుచున్నట్లు కానవచ్చింది.

18

బహుప్రకారైర్వివిధై ర్వరసంస్కార సంస్కృతైః,
మాంసైః కుశలసంయుక్తైః పానభూమిగతైః పృథక్.

19

దివ్యాః ప్రసన్నా వివిధాః సురాః కృతసురా స్తథా,
శర్కరాసవమాధ్వీక పుష్పాసవ ఫలాసవాః,
వాసచూర్ణైశ్చ వివిధై ర్దృష్టా స్తై స్తైః పృథక్ పృథక్.

20

సంతతా శుశుభే భూమిర్మాల్యైశ్చ బహుసంస్థితైః.

21

హిరణ్మయైశ్చ వివిధైర్భాజనైః స్ఫాటికైరపి,
జామ్బూనదమయైశ్చాన్యైః కరకైరభిసంవృతా.

22

రాజతేషు చ కుమ్భేషు జామ్బూనదమయేషు చ,
పానశ్రేష్ఠం తదా భూరి కపిస్తత్ర దదర్శ హ.

23

ఆ పానగృహంలో సమర్థులైన వంటవారు అనేక రకాలైన మాంసాలను చక్కగా పాకంచేసి, వివిధ రీతుల్లో భక్ష్యాలను తయారుచేసి చూడముచ్చటగా అమర్చి ఉంచారు.

19

శ్రేష్ఠమైనవీ, నిర్మలమైనవీ, సహజసిద్ధమైనవీ అయిన మద్యములు, చక్కెర తేనె పువ్వుల ఫలాలతో రూపొందించిన కృత్రిమ మద్యములు వివిధాలైన సువాసన చూర్ణములతో సంస్కరింపబడి విడివిడిగా అక్కడ అమర్చిపెట్టారు.

20

సర్వత్రా అలంకరింపబడిన పుష్పమాలలతో, స్వర్ణమయములైన వివిధ పాత్రలతో, స్ఫటికఖచిత పాత్రలతో, పుటం పెట్టిన బంగారు చెంబులతో ఆ పానగృహం శోభాయమానంగా ప్రకాశిస్తోంది.

21–22

వెండి కడవలలోను, బంగారు కలశాలలోను సమృద్ధిగా నిల్వచేసి ఉన్న శ్రేష్ఠమైన మద్యాన్ని హనుమంతుడు అక్కడ చూశాడు.

23

సోఽపశ్యచ్ఛాతకుమ్భాని శీధోర్మణిమయాని చ,
రాజతాని చ పూర్ణాని భాజనాని మహాకపిః.

24

క్వచిదర్ధావశేషాణి క్వచిత్పీతాని సర్వశః,
క్వచిన్నైవ ప్రపీతాని పానాని స దదర్శ హ.

25

క్వచిద్భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్పానాని భాగశః,
క్వచిదన్నావశేషాణి పశ్యన్వై విచచార హ.

26

క్వచిత్ప్రభిన్నైః కరకైః క్వచిదాలోళితైర్ఘటైః,

క్వచిత్సంపృక్తమాల్యాని జలాని చ ఫలాని చ.

27

శయనాన్యత్ర నారీణాం శుభ్రాణి బహుధా పునః,
పరస్పరం సమాశ్లిష్య కాశ్చిత్సుప్తా వరాఙ్గనాః.

28

ఆ వానరేంద్రుడు మద్యంతో నింపబడి ఉన్న బంగారు పాత్రలను, మణిమయ పాత్రలను, వెండిగిన్నెలను అక్కడ చూశాడు.

24

అక్కడ ఉన్న పాత్రలలో కొన్నింట్లో మద్యం సగం మిగిలి ఉంది; కొన్నింట్లో పూర్తిగా త్రాగివేసి ఉన్నారు; మరికొన్నింట్లో చుక్కకూడా త్రాగినట్లు లేదు.

25

కొన్నిచోట్ల అనేక రకాలైన భక్ష్యాలను, కొన్నిచోట్ల విడివిడిగా ఉంచిన పానీయములను, మరికొన్నిచోట్ల తినగా మిగిలిపోయిన అన్నపురాశులను చూస్తూ హనుమంతుడు ఆ పానగృహంలో తిరుగాడసాగాడు.

26

ఒకచోట పగిలిపోయిన పాత్రలను, మరోచోట దొర్లుతున్న కడవలను, ఇంకొకచోట జలసిక్తములైన పుష్పమాలికలను, పండ్లను చూసుకొంటూ హనుమంతుడు సంచరించాడు.

27

అక్కడ అమర్చబడిన స్త్రీల శయ్యలు విభిన్న ఆకృతులలో పరిశుభ్రముగా ఉన్నాయి. వాటి మీద కొందరు తరుణులు పరస్పరం కౌగలించుకొని నిద్రపోతున్నారు.

28

కాశ్చిచ్చ వస్త్రమన్యస్యాః స్వపన్త్యాః పరిధాయ చ,
ఆహృత్య చాబలాః సుప్తా నిద్రాబలపరాజితాః.

29

తాసాముచ్ఛ్వాసవాతేన వస్త్రం మాల్యం చ గాత్రజమ్,
నాత్యర్థం స్పన్దతే చిత్రం ప్రాప్య మన్దమివానిలమ్.

30

చన్దనస్య చ శీతస్య శీధోర్మధురసస్య చ,
వివిధస్య చ మాల్యస్య పుష్పస్య వివిధస్య చ.

31

బహుధా మారుతస్తత్ర గన్ధం వివిధముద్వహన్,
స్నానానాం చన్దనానాం చ ధూపానాం చైవ మూర్ఛితః,
ప్రవవౌ సురభిర్గన్ధో విమానే పుష్పకే తదా.

32

శ్యామావదాతాస్తత్రాన్యాః కాశ్చి త్కృష్ణా వరాంగనాః,
కాశ్చిత్కాంచనవర్ణాంగ్యః ప్రమదా రాక్షసాలయే.

33

కొందరు స్త్రీలు నిద్రకు వివశులైన స్థితిలో ప్రక్కన నిద్రిస్తున్న స్త్రీల వలువలను లాగికొని వాటిని కప్పుకొని గాఢనిద్రలో మునిగివున్నారు.

29

నిద్రిస్తున్న ఆ స్త్రీల ఉచ్ఛ్వాసనిశ్శ్వాసాలచే వారి మేనిపైనున్న వస్త్రములు, పూలమాలలు పిల్లవాయువుచే కదలునట్లు కించిత్తు కదలుతున్న దృశ్యం ముచ్చటగొలుపుతోంది.

30

చల్లని చందనము, మద్యము, తేనె, వివిధ రకములైన పూలమాలల ధూపముల సంయుక్తమైన సుగంధాలను వ్యాపింపజేస్తూ నలువంకలా వాయువు అప్పుడు వీచసాగింది. ఆ సమయంలో ఆ పుష్పకవిమానంలో స్నానయోగ్యమైన సుగంధద్రవ్యాల, చందనముల, ధూపముల పరిమళము వ్యాపించి ఉంది.

31–32

రావణాంతఃపుర స్త్రీజనంలో కొందరు చామనచాయ వారు, కొందరు తెల్లగా ఉన్నవారు, మరికొందరు నల్లనివారు, ఇంకా కొందరు బంగారువన్నెను సంతరించుకొన్నవారు ఉన్నారు.

33

తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్,
పద్మినీనాం ప్రసుప్తానాం రూప మాసీ ద్యథైవ హి.

34

ఏవం సర్వమశేషేణ రావణాంతఃపురం కపిః,
దదర్శ సుమహాతేజా న దదర్శ చ జానకీమ్.

35

నిరీక్షమాణశ్చ తదా తాః స్త్రియః స మహాకపిః,
జగామ మహతీం చిన్తాం ధర్మసాధ్వసశంకితః.

36

పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్,
ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి.

37

న హి మే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ,
అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః.

38

నిద్రాపారవశ్యం వలన, రతిక్రీడలు సలిపి ఉండడం చేత బాగా అలసిపోయిన ఆ అంగనల రూపాలు ముకుళించిన పద్మలతల చందాన కానవచ్చారు.

34

మహాతేజశ్శాలియైన హనుమంతుడు ఆ రీతిలో రావణాంతఃపురాన్ని ఆసాంతం వెతికి చూసినప్పటికీ అతడికి సీత మాత్రం ఎక్కడా కానరాలేదు.

35

ఆ సమయంలో నిద్రిస్తున్న రావణుని అంతఃపురకాంతలను అలా చూడడం వలన తను ధర్మలోపానికి గురైనానా అనే శంక హనుమంతునికి కలిగి, అతడు దిగులు చెందాడు.

36

అలా పరభార్యలు ఆదమరచి నిద్రిస్తున్న అంతఃపురాన్ని నిశితంగా పరికించి చూడడం వలన ఎంతో ధర్మలోపం వాటిల్లుతుంది కదా అని హనుమంతుడు భావించాడు.

37

నా చూపు ఎన్నడూ పరభార్యల విషయం మీద ప్రసరింపదు. అయినప్పటికీ ఈ రోజు ఇక్కడ పరభార్యలను చూడవలసిన గత్యంతరం ఏర్పడింది కదా!

38

తస్య ప్రాదురభూచ్చిన్తా పునరన్యా మనస్వినః,
నిశ్చితై కాన్తచిత్తస్య కార్యనిశ్చయదర్శినీ.

39

కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః,
న హి మే మనసః కిం చిద్వైకృత్యముపపద్యతే.

40

మనో హి హేతుః సర్వేషామిన్ద్రియాణాం ప్రవర్తనే,
శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్.

41

నాన్యత్ర హి మయా శక్యా వైదేహీ పరిమార్గితుమ్,
స్త్రియో హి స్త్రీషు దృశ్యన్తే సదా సంపరిమార్గణే.

42

యస్య సత్త్వస్య యా యోనిస్తస్యాం తత్పరిమార్గ్యతే,
న శక్యా ప్రమదా నష్టా మృగేషు పరిమార్గితుమ్.

43

మనోబల సంపన్నుడూ, చిత్తైకాగ్రత గలవాడూ, కార్యనిర్ణయం చక్కగా తెలిసివాడూ అయిన ఆ హనుమంతుడు మరో విధంగా యోచించసాగాడు.

39

పరాయి పురుషులు ఎవరూ లేరనే నమ్మకంతో తమ ఇచ్ఛ వచ్చిన తీరులో పడుకొని నిద్రిస్తున్న రావణుని భార్యలను నేను చూడడం నిజమే అయినా నా మనస్సులో ఎటువంటి వికారమూ జనించలేదు.

40

ఒక మంచిపని లేదా చెడ్డపని చేయడానికి ఇంద్రియాలను పురిగొల్పేది మనస్సే. ఇక్కడ జరుగుతున్న శుభాశుభ కృత్యములను చూసినా కూడా నా మనస్సు చెక్కుచెదరక స్థిరంగా ఉంది.

41

సీతాదేవిని మరో ప్రదేశంలో ఎక్కడా నేను వెతుకలేనుగదా! ఎందుకంటే స్త్రీలను, స్త్రీల మధ్యకే వెళ్ళి వెతకటమే సమంజసం.

42

ఏ జాతికి చెందిన ప్రాణిని ఆ జాతియందే అన్వేషించవలసి ఉంటుంది. తప్పిపోయిన స్త్రీని ఆడలేళ్ళ మందలోకి వెళ్ళి వెతికితే ఫలమేమిటి?

43

తదిదం మార్గితం తానచ్ఛుద్ధేన మనసా మయా,
రావణాన్తఃపురం సర్వం దృశ్యతే న చ జానకీ.

44

దేవగన్ధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ వీర్యవాన్,
అవేక్షమాణో హనుమాన్నైవాపశ్యత జానకీమ్.

45

తామపశ్యన్ కపిస్తత్ర పశ్యంశ్చాన్యా వరస్త్రియః,
అపక్రమ్య తదా వీరః ప్రధ్యాతుముపచక్రమే.

46

స భూయస్తు పరం శ్రీమాన్ మారుతిర్యత్నమాస్థితః,
ఆపానభూమిముత్సృజ్య తాం విచేతుం ప్రచక్రమే.

47

ఆ కారణంగానే నేను మనస్సులో ఎటువంటి కల్మషానికీ చోటివ్వకుండా రావణాంతఃపురాన్ని సీతాదేవి కోసం వెతికినాను. కాని ఆమె జాడమాత్రం తెలియరాలేదు.

44

అమిత పరాక్రమవంతుడైన ఆ హనుమంతునికి రావణుని

అంతఃపురంలో దేవకన్యలు, గంధర్వకన్యలు, నాగకన్యలు మాత్రమే కనిపించారేగాని సీతాదేవి మాత్రం కనిపించలేదు.

45

వీరుడైన హనుమంతుడు అక్కడ ఎందరో ఉత్తమకాంతలను చూసినప్పటికీ సీతాదేవి కానరాకపోవడంతో, ఆమె ఎక్కడ ఉండి ఉంటుందోనని దీర్ఘంగా ఆలోచింపసాగాడు.

46

శ్రీమంతుడైన హనుమంతుడు పానశాలనుంచీ వెలుపలకు వచ్చి ప్రయత్నలోపం లేకుండా రావణుని అంతఃపురంలో మళ్ళీ సీతాదేవికై వెతుకసాగాడు.

47

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 11వ సర్గ

సమాప్తం

12వ సర్గ
హనుమంతుని నిర్వేదము

స తస్య మధ్యే భవనస్య మారుతి
ర్లతాగృహాంశ్చిత్రగృహాన్నిశాగృహాన్,
జగామ సీతాం ప్రతి దర్శనోత్సుకో
న చైవ తాం పశ్యతి చారుదర్శనామ్.

1

స చిన్తయామాస తతో మహాకపిః,
ప్రియామపశ్యన్ రఘునన్దనస్య తామ్
ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే
విచిన్వతో దర్శనమేతి మైథిలీ.

2

సీతను దర్శించాలని మనస్సు తహతహలాడుతూంటే హనుమంతుడు ఆ భవన మధ్య ప్రదేశంలోని లతాగృహాలనూ, చిత్రగృహాలనూ, రాత్రి బసచేయడానికి యోగ్యమైన గృహాలనూ నిశితంగా పరికించి చూశాడు. కాని అందమైన సీతాదేవి మాత్రం ఎక్కడా కనిపించలేదు.

1

శ్రీరామచంద్రుని భార్య ఎక్కడా కనిపించకపోవడంతో హనుమంతుడు, 'సీత తప్పక మరణించి ఉండవచ్చు. అందుకే ఎంత వెతికినా నాకు కనిపించలేదు' అని తలచాడు.

2

సా రాక్షసానాం ప్రవరేణ జానకీ
స్వశీల సంరక్షణ తత్పరా సతీ,
అనేన నూనం ప్రతిదుష్టకర్మణా
హతా భవేదార్యపథే పరే స్థితా.

3

విరూపరూపా వికృతా వివర్చసో
మహాననా దీర్ఘవిరూపదర్శనాః,
సమీక్ష్య సా రాక్షసరాజయోషితో,
భయాద్వినష్టా జనకేశ్వరాత్మజా.

4

సీతామదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం
విహృత్య కాలం సహ వానరైశ్చిరమ్,
న మేఽస్తి సుగ్రీవసమీపగా గతిః
సుతీక్ష్ణదణ్డో బలవాంశ్చ వానరః.

5

పాతివ్రత్య ధర్మమునందు చెక్కుచెదరక స్థిరంగా ఉండి తన శీలాన్ని కాపాడుకొనే ప్రయత్నంచేస్తూ సీతాదేవి దురాత్ముడైన ఆ రాక్షసరాజు చేతిలో మృతి చెంది ఉండవచ్చునేమో!

3

వికారమైన రూపములు గలవారూ, వికృత స్వభావం గలవారూ, కాంతివిహీనలూ, పొడవైన వికృతమైన నేత్రములు గలవారూ, పెద్ద ముఖములు గలవారూ అయిన ఆ రావణుని భార్యలను చూడడంతో సీతాదేవి భీతిచెంది మరణించి ఉండవచ్చునేమో!

4

శత్రువులమీద పరాక్రమం చూపకుండా, చాలాకాలం వానరులతో గడపి నా కర్తవ్యమైన సీతాదేవిని చూడకుండా, సుగ్రీవుని వద్దకు తిరిగి వెళ్ళడానికి ససేమిరా వీలులేదు. మహాబలవంతుడైన ఆ సుగ్రీవుడు తన ఆజ్ఞను శిరసావహించని వాడికి కఠిన శిక్ష విధిస్తాడు.

5

దృష్టమన్తఃపురం సర్వం దృష్టా రావణయోషితః,
న సీతా దృశ్యతే సాధ్వీ వృథా జాతో మమ శ్రమః.

6

కిం ను మాం వానరాః సర్వే గతం వక్ష్యన్తి సంగతాః,
గత్వా తత్ర త్వయా వీర కిం కృతం తద్వదస్వ నః.

7

అదృష్ట్వా కిం ప్రవక్ష్యామి తామహం జనకాత్మజామ్,
ధ్రువం ప్రాయముపైష్యన్తి కాలస్య వ్యతివర్తనే.

8

కిం వా వక్ష్యతి వృద్ధశ్చ జామ్బవానఙ్గదశ్చ సః,
గతం పారం సముద్రస్య వానరాశ్చ సమాగతాః.

9

అనిర్వేదః శ్రియో మూలమనిర్వేదః పరం సుఖమ్,
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః.

10

కరోతి సఫలం జన్తోః కర్మ యత్తర్కరోతి సః,
తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేఽహముత్తమమ్.

11

అంతఃపురంలో అణువణుమా వెతికాను; రావణుని భార్యలను మాత్రం చూడగలిగాను. పతివ్రతయైన సీతాదేవి మాత్రం కనిపించలేదు. నా శ్రమ అంతా వృథా అయింది.

6

నా కోసం ఎదురుతెన్నులు చూస్తున్న వానరులంతా తిరిగి వెళ్ళిన నన్ను చూసి ఏమంటారో గదా! "ఓ మహావీరుడా! లంకకు వెళ్ళి అక్కడ నువ్వు ఏం చేశావో చెప్పు?" అని తప్పక ప్రశ్నిస్తారు.

7

సీతాదేవిని చూడడానికి నోచుకోని నేను వారి ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పగలను? పైగా నేను తిరిగి వెళ్ళడంలో జాప్యం కనుక జరుగుతే వారు తప్పక ప్రాయోపవేశం చేసుకొంటారు.

8

వృద్ధుడైన జాంబవంతుడు, యువరాజైన అంగదుడు, తక్కిన వానరులు వ్యర్థంగా లంకకు పోయి వచ్చిన నన్ను చూసి ఏమంటారోగదా!

9

అభివృద్ధికి మూలం దిగులుచెందకుండటమే, అంటే ఉత్సాహంగా ఉండడమే! ఉత్సాహమే సుఖానికి హేతువు. ఎప్పుడూ మనిషిని సమస్త కార్యకలాపాల్లో పాల్గొనేట్లు చేయగలిగింది ఉత్సాహమే. మనిషి ఉపక్రమించిన కార్యాన్ని సఫలం గావించేది ఈ ఉత్సాహమే. కనుక సమధికోత్సాహంతో నేను గట్టిగా ప్రయత్నిస్తానుగాక!

10–11

భూయస్తావ ద్విచేష్యామి దేశాన్ రావణపాలితాన్,
ఆపానశాలా విచితా స్తథా పుష్పగృహాణి చ.

12

చిత్రశాలాశ్చ విచితా భూయః క్రీడాగృహాణి చ,
నిష్కుటాంతర రథ్యాశ్చ విమానాని చ సర్వశః.

13

ఇతి సంచిన్త్య భూయోఽపి విచేతు ముపచక్రమే,
భూమీగృహాం శ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి.

14

ఉత్పతన్నిపతంశ్చాపి తిష్ఠన్గచ్ఛన్ పునః పునః,
అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటాన్యవఘాటయన్.

15

ప్రవిశన్నిష్పతంశ్చాపి ప్రపతన్నుత్పతన్నపి,
సర్వమప్యవకాశం స విచచార మహాకపిః.

16

రావణుని రక్షణలోని అన్ని ప్రదేశాలను మళ్ళీ వెతికిచూస్తాను. ఇంతదాకా నేను పానశాలలు, పుష్పగృహాలు, చిత్రశాలలు, క్రీడాగృహాలు, ఉద్యానాల నడుమగల వీథులు, విమానమును వెతికినాను. హనుమంతుడు ఇలా ఆలోచించి భూగృహాలను, చైత్య గృహాలను, విడివిడిగా ఉన్న మందిరాలను వెతకటం ప్రారంభించాడు.

12–14

మాటిమాటికీ పైకి ఎగురుతూ, క్రిందికి దూకుతూ వాకిళ్ళు తెరుస్తూ, తలుపులు తోస్తూ, లోపలికి ప్రవేశిస్తూ, వెలుపలకు వస్తూ, దిగుతూ, ఎక్కుతూ ఈ చోట ఆ చోట అనక అవకాశం ఉన్న చోట్లలో హనుమంతుడు వెతకుతూ వచ్చాడు.

15–16

చతురఙ్గులమాత్రోఽపి నావకాశః స విద్యతే,
రావణాంతఃపురే తస్మిన్ యం కపిర్న జగామ సః.

17

ప్రాకారాన్తరరథ్యాశ్చ వేదికాశ్చైత్యసంశ్రయాః,
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ సర్వం తేనావలోకితమ్.

18

రాక్షస్యో వివిధాకారా విరూపా వికృతాస్తథా,
దృష్టా హనుమతా తత్ర న తు సా జనకాత్మజా.

19

రూపేణాప్రతిమా లోకే వరా విద్యాధరస్త్రియః,
దృష్టా హనుమతా తత్ర న తు రాఘవనన్దినీ.

20

రావణుని అంతఃపురంలో నాలుగు అంగుళాల మేరకూడా వదలిపెట్టకుండా హనుమంతుడు వెతికాడు.

17

ప్రాకారం నడుమ గల వీథులను, నాలుగు వీథుల కూడలులకు (చైత్యములకు) చేరివున్న తిన్నెలను, దిగుడు బావులనూ, పద్మసరస్సులనూ హనుమంతుడు ఒక్కటి వదలకుండా చూశాడు.

18

అక్కడ వికృతాలైన రూపాలతో, వికృతాలైన అంగాలతో నానా ఆకారాలలో ఉన్న రాక్షసస్త్రీలు మాత్రమే హనుమంతునికి కనిపించారుగాని సీత కానరాలేదు.

19

లోకంలో సాటిలేని సౌందర్యవతులైన విద్యాధర స్త్రీలు అక్కడ కనిపించారుగాని హనుమంతునికి సీత మాత్రం కనిపించలేదు.

20

నాగకన్యా వరారోహాः పూర్ణచన్ద్రనిభాననాः,
దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా.

21

ప్రమథ్య రాక్షసేన్ద్రేణ నాగకన్యా బలాద్ధృతాः,
దృష్టా హనుమతా తత్ర న సా జనకనన్దినీ.

22

సో–పశ్యంస్తాం మహాబాహుः పశ్యంశ్చాన్యా వరస్త్రియः,
విషసాద ముహుర్ధీమాన్ హనుమాన్ మారుతాత్మజः.

23

ఉద్యోగం వానరేన్ద్రాణాం ప్లవనం సాగవస్య చ,
వ్యర్థం వీక్ష్యానిలసుతశ్చిన్తాం పునరుపాగమత్.

24

అవతీర్య విమానాచ్చ హనుమాన్ మారుతాత్మజः,
చిన్తాముపజగామాథ శోకోపహతచేతనः.

25

చక్కని పిరుదులుగల, పూర్ణచంద్రుని వంటి వదనంగల నాగకన్యలు అక్కడ హనుమంతునికి తారసపడ్డారుగాని, సన్నని నడుముగల సీతాదేవి మాత్రం కానరాలేదు.

21

రావణుడు శత్రువులను జయించి బలాత్కారంగా లంకకు

తీసుకువచ్చిన నాగకన్యలు హనుమంతునికి అక్కడ కనిపించారుగాని సీత మాత్రం కానరాలేదు.

22

అక్కడ ఎందరో ఉత్తమురాళ్ళయిన స్త్రీలు కనిపించినప్పటికీ సీత మాత్రం కనపడకపోవడంతో ధీమంతుడు, వాయునందనుడు, మహాబాహువు అయిన హనుమంతుడు నిరుత్సాహం చెందాడు.

23

ఇంతవరకూ వానరశ్రేష్ఠులు చేసిన ప్రయత్నమూ, తాను సముద్రాన్ని దాటడమూ అంతా వ్యర్థమైందిగదా అని తలపోస్తూ హనుమంతుడు మళ్ళీ దుఃఖించాడు.

24

వాయునందనుడైన హనుమంతుడు ఆ పుష్పక విమానంనుండి క్రిందికి దిగి, శోకంచే కలతనొంది ఆలోచనల్లో మునిగిపోయాడు.

25

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 12వ సర్గ సమాప్తం

13వ సర్గ

నిరాశాజనిత మానసికస్థితిలో హనుమంతుడు

విమానాత్తు సుసంక్రమ్య ప్రాకారం హరియూథపః,
హనుమాన్వేగవానాసీద్యథా విద్యుద్ఘనాన్తరే.

1

సంపరిక్రమ్య హనుమాన్రావణస్య నివేశనాత్,
అదృష్ట్వా జానకీం సీతా మబ్రవీద్వచనం కపిః.

2

భూయిష్ఠం లోళితా లఙ్కా రామస్య చరతా ప్రియమ్,
న హి పశ్యామి వైదేహీం సీతాం సర్వాఙ్గశోభనామ్.

3

మేఘమండలాన మెరపు మెరసినట్లు వానరసేనానాయకుడైన హనుమంతుడు విమానం నుండి ప్రాకారం మీదికి దూకాడు.

1

హనుమంతుడు ఆ విధంగా రావణుని గృహనుండి కాస్త దూరంగా వెళ్ళి సీత ఎక్కడా కనిపించకపోవడంతో తనలో ఇలా అనుకొన్నాడు.

2

రామునకు ప్రియం చేకూర్చనెంచి నేను సంచరిస్తూ లంకానగరాన్నంతా పూర్తిగా గాలించి వేశాను. కాని సర్వాంగసుందరియైన సీత జాడ మాత్రం

కానరాలేదు.

3

పల్వలాని తటాకాని సరాంసి సరితస్తథా,
నద్యోఽనూపవనాన్తాశ్చ దుర్గాశ్చ ధరణీధరాః,
లోళితా వసుధా సర్వా న తు పశ్యామి జానకీమ్.

4

ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే,
ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహమ్.

5

కిం ను సీతాఽథ వైదేహీ మైథిలీ జనకాత్మజా,
ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్.

6

క్షిప్ర ముత్పతతో మన్యే సీతామాదాయ రక్షసః,
బిభ్యతో రామబాణానామన్తరా పతితా భవేత్.

7

అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే,
మన్యే పతితమార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరమ్.

8

నీటి గుంటలను, చెరువులను, సరోవరాలను, వాగులను, నదులను, వనప్రాంతాలను, అధిరోహింప శక్యంగాని పర్వతాలను, ఒకటేమిటి ఇక్కడున్న సమస్త ప్రదేశాలను వెతికివేశానుగాని సీత జాడ మాత్రం తెలియరాలేదు.

4

సీత రావణుని గృహంలోనే ఉందని గృధ్రరాజైన సంపాతి చెప్పాడు. కాని ఇక్కడ ఎంత వెతికినా ఆమె కానరావడంలేదు.

5

అయోనిజ, విదేహ రాజ్యానికి చెందిన, మిథిలను పుట్టినిల్లుగా చేసుకొన్న, జనకుని కుమార్తె అయిన సీత తన నిస్సహాయస్థితిలో రావణునికి వశవర్తియై ఉంటుందని నమ్మకం కలగడంలేదు.

6

రాముడు ఏ క్షణంలో వస్తాడోనని రామబాణాలకు భయపడి రావణుడు సీతను తీసుకొని ఆకాశమార్గాన వేగంగా ఎగరిపోతున్నప్పుడు దారి మధ్యలో ఆమె క్రింద పడిపోయి ఉంటుందేమో!

7

లేకపోతే సిద్ధులు సంచరించే ఆకాశమార్గంలో అపహరింపబడి తీసుకునిపోతుండగా క్రిందనున్న మహాసముద్రాన్ని చూడగానే భీతిచెంది పూజ్యురాలైన సీతకు గుండె ఆగిపోయి ఉండవచ్చునేమో!

8

రావణస్యోరువేగేన భుజాభ్యాం పీడితేన చ,
తయా మన్యే విశాలాక్ష్యా త్యక్తం జీవితమార్యయా.

9

ఉపర్యుపరి వా నూనం సాగరం క్రమతస్తదా,
వివేష్టమానా పతితా సముద్రే జనకాత్మజా.

10

అహో క్షుద్రేణ వాఽనేన రక్షన్తీ శీలమాత్మనః,
అబన్ధుర్భక్షితా సీతా రావణేన తపస్వినీ.

11

అథవా రాక్షసేన్ద్రస్య పత్నీభిరసితేక్షణా,
అదుష్టా దుష్టభావాభిర్భక్షితా సా భవిష్యతి.

12

సంపూర్ణచన్ద్రప్రతిమం పద్మపత్ర నిభేక్షణమ్,

రామస్య ధ్యాయతీ వక్త్రం పఞ్చత్వం కృపణా గతా.

13

సీతను ఆకాశమార్గంలో అపహరించి తీసుకొని వస్తున్నప్పుడు రావణుని ప్రచండ వేగానికీ, ఆతడి భుజాల ఒత్తిడికీ విశాలనేత్రాలు గల ఆ సాధ్వీమణి ప్రాణాలు విడిచి ఉంటుందేమో!

9

సముద్రం మీద ఎగురుతూ పోతున్నప్పుడు రావణుని బంధనం నుండి విడివడడానికి పెనగులాడుతున్నప్పుడు సీత సముద్రంలో పడిపోయి ఉండడానికి కూడా ఆస్కారం లేకపోలేదు.

10

బంధువు లెవరూ చెంతలేని దీనురాలైన సీత, తన శీలాన్ని సంరక్షించుకొంటూ రావణునికి లొంగకపోవడంతో ఆ నీచుడైన రావణుడు ఆమెను భక్షించి ఉండవచ్చునేమో!

11

నల్లని కన్నులు గలది, సజ్జనురాలు అయిన సీతను, ఆమె సౌందర్యం పట్ల ఈర్ష్య చెందిన దుష్టస్వభావులైన ఆ రావణుని భార్యలు భక్షించి ఉంటారేమో!

12

పూర్ణచంద్రుని పోలిన, తామరరేకుల వంటి కన్నులు కలిగిన రాముని ముఖారవిందాన్ని సదా ధ్యానిస్తూ ఆ సాధ్వి ధైన్యముతో మరణించినదేమో!

13

హా రామ లక్ష్మణేత్యేవం హాఽయోధ్యే చేతి మైథిలీ,
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి.

14

అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే,
నూనం లాలప్యతే సీతా పఞ్జరస్థేవ శారికా.

15

జనకస్య సుతా సీతా రామపత్నీ సుమధ్యమా,
కథముత్పలపత్రాక్షీ రావణస్య వశం వ్రజేత్.

16

వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనకాత్మజా,
రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమమ్.

17

నివేద్యమానే దోషః స్యాద్దోషః స్యాదనివేదనే,
కథం ను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతి మే.

18

అయ్యో! రామా! అయ్యో! లక్ష్మణా! అయ్యో! అయోధ్యానగరమా అంటూ ఎంతో విలపిస్తూ సీతాదేవి దేహం త్యజించి ఉంటుందేమో!

14

లేకపోతే రావణుని గృహంలో నిర్బంధంలో మ్రగ్గుతూ పంజరంలో బంధింపబడిన గోరింక మల్లే సీత విలపిస్తూన్నదేమో!

15

జనకమహారాజు కుమార్తె, రాముని భార్య, చక్కని నడుము గలది, కలువరేకుల వంటి కన్నులుగలది అయిన సీతాదేవి ఎలా ఆ రావణునికి వశవర్తి అవుతుంది?

16

సీత తప్పిపోయినప్పటికీ, అసలు కనిపించకపోయినప్పటికీ, ఒకవేళ మరణించి నప్పటికీ ఆ విషయం భార్య పట్ల అత్యంత ప్రేమగల రామునికి చెప్పడం భావ్యం కాదు.

17

రామునికి పై విషయం గూర్చి చెప్పినా దోషమే, చెప్పకపోయినా దోషమే.

కనుక ఇప్పుడు నేను ఏం చేయాలి? పరిస్థితి విషమంగా తోస్తున్నది కదా!

18

అస్మిన్నేవం గతే కార్యే ప్రాప్తకాలం క్షమం చ కిమ్,
భవేదితి మతం భూయో హనుమాన్పవిచారయత్.

19

యది సీతా మదృష్ట్వాఽహం వానరేంద్రపురీ మితః,
గమిష్యామి తతః కో మే పురుషార్థో భవిష్యతి.

20

మమేదం లంఘనం వ్యర్థం సాగరస్య భవిష్యతి,
ప్రవేశశ్చైవ లఙ్కాయాః రాక్షసానాం చ దర్శనమ్.

21

కిం మాం వక్ష్యతి సుగ్రీవో హరయో వా సమాగతాః,
కిష్కిన్ధాం సమనుప్రాప్తం తౌ వా దశరథాత్మజౌ.

22

గత్వా తు యది కాకుత్థ్సం వక్ష్యామి పరమప్రియమ్,
న దృష్టేతి మయా సీతా తతస్త్యక్ష్యతి జీవితమ్.

23

ప్రస్తుతం పరిస్థితి ఈ తీరులో పరిణమించినప్పుడు తను ఏం చేస్తే కాలానుగుణంగానూ, సయుక్తమైనదిగానూ ఉంటుందోనని హనుమంతుడు యోచింపసాగాడు.

19

నేను సీతాదేవిని చూడకుండానే ఇక్కణ్ణుంచి కిష్కింధకు తిరిగి వెళితే నాకు ఒనగూరే ప్రయోజనం ఏమిటి?

20

నేను సముద్రాన్ని లంఘించడమూ, లంకలో ప్రవేశించడమూ, రాక్షసులను

చూడడమూ అంతా వ్యర్థమైపోతుందిగదా!

21

ఈ పరిస్థితిలో నేను కిష్కింధకు తిరిగి వెళితే సుగ్రీవుడు, నా సహచరులైన వానరులు, ఆ రామలక్ష్మణులు నన్ను చూపి ఏమంటారో కదా!

22

నేను కిష్కింధకు తిరిగి వెళ్ళి "సీత కనిపించలేదు" అనే అత్యంత అప్రియమైన మాట చెప్పీచెప్పగానే రాముడు ప్రాణాలు విడుస్తాడు.

23

పరుషం దారుణం క్రూరం తీక్ష్ణమింద్రియతాపనమ్,
సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి.

24

తం తు కృచ్ఛ్రగతం దృష్ట్వా పఞ్చత్వగతమానసమ్,
భృశానురక్తో మేధావీ న భవిష్యతి లక్ష్మణః.

25

వినష్టౌ భ్రాతరౌ శ్రుత్వా భరతోఽపి మరిష్యతి,
భరతం చ మృతం దృష్ట్వా శత్రుఘ్నో న భవిష్యతి.

26

పుత్రాన్మృతాన్సమీక్ష్యాథ న భవిష్యన్తి మాతరః,
కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ న సంశయః.

27

కృతజ్ఞః సత్యసన్ధశ్చ సుగ్రీవః ప్లవగాధిపః,
రామం తథాగతం దృష్ట్వా తతస్త్యక్ష్యతి జీవితమ్.

28

కర్ణకఠోరము, దారుణము, క్రూరము, తీక్షణము, ఇంద్రియాలను క్షోభింపజేసేది అయిన "సీత కనిపించలేదు" అనే దుర్వార్త వినగానే రాముడు

బ్రతకడం అసంభవం.

24

దుఃఖంచే కుమిలిపోతూ మరణోన్ముఖుడై ఉన్న రాముని చూసి, అన్నగారి పట్ల అత్యంత ప్రేమగల వాడూ, మేధావీ అయిన లక్ష్మణుడు కూడా జీవించడు.

25

రామలక్ష్మణులు మరణించారనే వార్త తెలియగానే భరతుడు మరణిస్తాడు; భరతుడు మరణించడం చూసి శత్రుఘ్నుడు కూడా మృతి చెందుతాడు.

26

తమ కుమారులు మరణించారని తెలియగానే తల్లులైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలు కూడా నిస్సంశయంగా ప్రాణాలు విడుస్తారు.

27

కృతజ్ఞుడూ, సత్యసంధుడూ, వానరరాజూ అయిన సుగ్రీవుడు, రాముని ఈ దుఃస్థితిని చూసి ప్రాణాలు విడవడం తథ్యం.

28

దుర్మనా వ్యథితా దీనా నిరానన్దా తపస్వినీ,
పీడితా భర్తృశోకేన రుమా త్యక్ష్యతి జీవితమ్.

29

వాలిజేన తు దుఃఖేన పీడితా శోకకర్శితా,
పఞ్చత్వం చ గతే రాజ్ఞి తారాఽపి న భవిష్యతి.

30

మాతాపిత్రోర్వినాశేన సుగ్రీవవ్యసనేన చ,
కుమారోఽప్యఙ్గదః కస్మాద్ధారయిష్యతి జీవితమ్.

31

భర్తృజేన తు దుఃఖేన హ్యభిభూతా వనౌకసః,
శిరాంస్యభిహనిష్యన్తి తలైర్ముష్టిభిరేవ చ.

32

సాన్త్వేనానుప్రదానేన మానేన చ యశస్వినా,
లాలితాః కపిరాజేన ప్రాణాం స్త్యక్ష్యన్తి వానరాః.

33

భర్తయైన సుగ్రీవుడు మరణించడం చూసి దుఃఖంతో కుమిలిపోతూ దీనురాలైన రుమ జాలిపడవలసిన స్థితిలో మృతి చెందుతుంది.

29

వాలి మరణశోకంతో మునుపే కృశించిపోయి ఉన్న తార ఇప్పుడు రాజైన సుగ్రీవుడు కూడా మరణిస్తే తను కూడా నిస్సందేహంగా ప్రాణాలు విడుస్తుంది.

30

తల్లితండ్రుల మరణాలతో, ఇప్పుడు సుగ్రీవుని మరణంతో వాటిల్లిన శోకాన్ని తట్టుకుని కుమారుడైన అంగదుడు మాత్రం ఎలా జీవిస్తాడు?

31

తమ ప్రభువైన సుగ్రీవుని మరణం వలన కలిగిన దుఃఖాన్ని భరించలేక వానరులు అరచేతులతోనూ, పిడికిళ్ళతోనూ తలలు బాదుకొని బలవన్మరణం పొందుతారు.

32

సాంత్వన వచనాలచే, కానుకలివ్వడంచే, సగౌరవ సత్కారాలచే, కీర్తిగాంచిన సుగ్రీవునిచే లాలింపబడిన వానరులు ఆతడి తదనంతరం మరణం పొందడాన్నే కోరుకుంటారు.

33

న వనేషు న శైలేషు న నిరోధేషు వా పునః,
క్రీడామనుభవిష్యన్తి సమేత్య కపికుఞ్జరాః.

34

సపుత్రదారాః సామాత్యా భర్తృవ్యసనపీడితాః,

శైలాగ్రేభ్యః పతిష్యన్తి సమేత్య విషమేషు చ.

35

విషముద్బన్ధనం వాపి ప్రవేశం జ్వలనస్య వా,
ఉపవాస మథో శస్త్రం పచరిష్యన్తి వానరాః.

36

ఘోరమారోదనం మన్యే గతే మయి భవిష్యతి,
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్.

37

సోఽహం నైవ గమిష్యామి కిష్కిన్ధాం నగరీమితః,
న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా.

38

సుగ్రీవ వియోగం పొందిన వానరులకు మునుపటిలా వనాలందుగాని, పర్వతాల మీదగాని, గృహాల్లోగాని సమావేశమై క్రీడించే అదృష్టం ఇంకెక్కడిది.

34

తమ ప్రభువు మరణించాడనే దుఃఖంతో పీడింపబడిన వారైన వానరులు తమ ఆలుబిడ్డలతో, సహచరులతో సహా పర్వతశిఖరాలపై నుండి మిట్టపల్లాల మీద పడి ప్రాణత్యాగం చేస్తారు.

35

విషం మ్రింగిగాని, ఉరిపోసుకొనిగాని, అగ్నిప్రవేశం చేసిగాని, ఆయుధాలతో పొడుచుకొనిగాని వానరులు ప్రాణాలు విడుస్తారు.

36

కాబట్టి నేను కిష్కింధకు తిరిగి వెళ్ళడం వలన ఇక్ష్వాకు వంశం అంతరిస్తుంది, వానరజాతీ నశిస్తుంది. అలా జరిగినప్పుడు ఇక మిగిలేది ఒక్క భయంకరమైన రోదనమే కదా!

37

ఆ దుర్ఘటనలు సంభవించకుండా ఉండాలంటే నేను ఇక్కడనుండి కిష్కింధకు ససేమిరా పోకూడదు. సీతాదేవిని కనుగొనకుండా సుగ్రీవుణ్ణి నేను కలుసుకోవడం అసంభవం.

38

మయ్యగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథౌ,
ఆశయా తౌ ధరిష్యేతే వానరాశ్చ మనస్వినః.

39

హస్తాదానో ముఖాదానో నియతో వృక్షమూలికః,
వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజామ్.

40

సాగరనూపజే దేశే బహుమూలఫలోదకే,
చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధమరణీసుతమ్.

41

ఉపవిష్టస్య వా సమ్యగ్గిజ్గినీం సాధయిష్యతః,
శరీరం భక్షయిష్యన్తి వాయసాః శ్వాపదాని చ.

42

ఇదం మహర్షిభిర్దృష్టం నిర్యాణమితి మే మతిః,
సమ్యగాపః ప్రవేక్ష్యామి న చేత్పశ్యామి జానకీమ్.

43

నేను కిష్కింధకు వెళ్ళకుండా ఇక్కడే ఉండిపోతే, ధర్మాత్ములూ మహారథులూ అయిన రామలక్ష్మణులు, మానవంతులైన వానరులు, సీతాదేవిని చూడగలమనే ఆశతో జీవించి ఉంటారు.

39

సీతాదేవి ఒకవేళ కానరాకుంటే నేను నియమవంతుడనై చేతికి అందినదీ, నోట పడినదీ మాత్రం తింటూ, చెట్ల క్రింద నివసిస్తూ వానప్రస్థ జీవనం

గడుపుతాను.

40

లేకుంటే సమృద్ధిగా కందమూలాలూ, పండ్లు, నీరు గల సముద్రతీర ప్రాంతంలో చితిపేర్చి, ప్రజ్వలిస్తున్న అగ్నిలో పడతాను.

41

లేదా నిరాహారవ్రతం పాటిస్తూ ఒక చోట స్థిరంగా కూర్చున్న నా శరీరాన్ని కాకులు మొదలైన పక్షులు, క్రూరజంతువులు భక్షిస్తాయి గాక!

42

ఇటువంటి పరిస్థితుల్లో మహర్షులు వచించిన ప్రాణత్యాగ మార్గం ఇదేనని నాకు అనిపిస్తున్నది. కనుక సీతాదేవి కానరాకుంటే జలరాశిలో మునిగి అయినా ప్రాణాన్ని త్యజిస్తాను.

43

సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ,
ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతామపశ్యతః.

44

తాపసో వా భవిష్యామి నియతో వృక్షమూలికః,
నేతః ప్రతిగమిష్యామి తామదృష్ట్వాఽసితేక్షణామ్.

45

యదీతః ప్రతిగచ్ఛామి సీతామనధిగమ్య తామ్,
అజ్ఞదః సహ తైః సర్వైర్వానరైర్న భవిష్యతి.

46

వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి,
తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః

47

ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్మహుః,

నాధ్యగచ్ఛత్తదా పారం శోకస్య కపికుఞ్జరః.

48

శుభప్రదంగానూ, సానుకూల సంఘటనలతోను ప్రారంభమైన ఈ దీర్ఘరాత్రి సీత జాడను కనుగొనలేకపోయినప్పుడు నాకు నిరర్థకంగా పరిణమిస్తుంది.

44

లేదా వృక్షం క్రింద కూర్చుని నియమనిష్ఠలతో ముని జీవితాన్ని గడపుతాను. నల్లని నేత్రాలు గల ఆ సీతాదేవిని చూడకుండా ససేమిరా వెనుకకు తిరిగే ప్రసక్తే లేదు.

45

సీతాదేవి జాడ తెలుసుకోకుండా ఇక్కణ్ణుండి నేను తిరిగి వెళితే, ఇతర వానరులందరితో సహా అంగదుడు మరణించడం తథ్యం.

46

మరణించడం అనేక దోషాలకు పెట్టు. అలాకాక బ్రతికి ఉంటే అనేక శుభములను చూడవచ్చు. కాబట్టి నేను ప్రాణాలు విడువను. బ్రతికి ఉన్న వాళ్ళు ఎప్పటికైనా తప్పక కలుసుకునే అవకాశం ఉంది.

47

ఈ విధంగా నానారకాలైన నిరాశాపూరిత చింతనలు మనస్సులో మెదలినప్పటికీ, హనుమంతునికి దుఃఖోపశమనం మాత్రం కలుగలేదు.

48

రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్,
కామమస్తు హృతా సీతా ప్రత్యాచీర్ణం భవిష్యతి.

49

అథవైనం సముత్థిప్య ఉపర్యుపరి సాగరమ్,
రామాయోపహరిష్యామి పశుం పశుపతేరివ.

50

ఇతి చిన్తాం సమాపన్నఃసీతామనధిగమ్య తామ్,
ధ్యానశోకపరీతాత్మా చిన్తయామాస వానరః.

51

యావత్సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్,
తావదేతాం పురీం లఙ్కాం విచినోమి పునఃపునఃః.

52

సంపాతివచనాచ్చాపి రామం యద్యానయామ్యహమ్,
అపశ్యన్ రాఘవో భార్యాం నిర్దహేత్సర్వవానరాన్.

53

అపహరింపబడిన సీతకు ఏం జరిగి ఉంటుందోనన్న తర్జనభర్జనలను కట్టిపెట్టి, దశకంఠుడూ మహాబలాఢ్యుడూ అయిన రావణుని వధిస్తాను. ఇందుమూలంగా సరైన ప్రతిక్రియ చేశానన్న సంతృప్తి అయినా నాకు మిగులుతుంది.

49

లేదా ఈ రావణుణ్ణి ఎత్తుకుని సముద్రం మీదుగా ఎగురుతూ వెళ్ళి యాగపశువును యాగశాలకు చేర్చినట్లు రాముని వద్ద పడవేస్తాను.

50

సీత కానరాకపోవడంతో దుఃఖం పొందిన వాడైన హనుమంతుడు పరధ్యానంలో మునిగిపోయి ఏం చేయాలో పాలుబోక మళ్ళీ ఇలా ఆలోచింపసాగాడు.

51

కీర్తిశాలినీ, రాముని భార్యా అయిన సీతాదేవి జాడ తెలిసేటంత వరకు నేను లంకానగరాన్ని పదేపదే వెతికి చూస్తాను.

52

సంపాతి మాట మీద నమ్మకంతో రాముణ్ణి ఇక్కడకు తోడ్కొని వస్తే, సీత

కానరానందున కలిగే కోపంలో ఆ రాముడు వానరులందరినీ దగ్ధం చేస్తాడు.

53

ఇహైవ నియతాహారో వత్స్యామి నియతేన్ద్రియః,
న మత్కృతే వినశ్యేయుః సర్వే తే నరవానరాః.

54

అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా,
ఇమామధిగమిష్యామి న హీయం విచితా మయా.

55

వసూన్ రుద్రాంస్తథాఽఽదిత్యానశ్వినౌ మరుతోపిఽచ,
నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః.

56

జిత్వా తు రాక్షసాన్ సర్వానిక్ష్వాకుకులనన్దినీమ్,
సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే.

57

స ముహూర్తమివ ధ్యాత్వా చిన్తావగ్రథితేన్ద్రియః,
ఉదతిష్ఠన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః.

58

కనుక ఆహార నియమాన్ని పాటిస్తూ, ఇంద్రియాలను నిగ్రహించి నేను ఇక్కడే ఉండిపోతాను. నా కారణంగా ఆ మానవులు, వానరులు నశించకూడదు.

54

ఎదురుగా పెద్ద పెద్ద వృక్షాలతో కూడుకొన్న అశోకవనం కనబడుతోంది. ఇంతవరకు ఆ వనంలో వెతకలేదు. కనుక ఇప్పుడు దాన్లోకి వెళతాను.

55

ఇలా అనుకొంటూ అష్టవసువులకు, ఏకాదశ (11) రుద్రులకు, ద్వాదశ (12) సూర్యులకూ, అశ్వనీదేవతలకు, సప్త మరుత్తులకు హనుమంతుడు

నమస్కరించి, రాక్షసుల శోకాన్ని అధికం చేయడానికి ఆ వనంలోకి ప్రవేశిస్తాను అని నిశ్చయించుకున్నాడు.

56

సమస్త రాక్షసులనూ జయించి, తపస్వికి సిద్ధి చేకూరినట్లు, ఇక్ష్వాకువంశానికి ఆనందం కలిగించే సీతాదేవిని, రాముని వద్దకు చేర్చుతాను.

57

ఈ విధంగా యోచిస్తూ కాసేపు ధ్యానంలో లయించిన మహాతేజశ్శాలియైన ఆ హనుమంతుడు దుఃఖమనే బంధాన్ని తెంచుకుని లేచి నిలబడ్డాడు.

58

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేన్ద్రయమానిలేభ్యో
నమోఽస్తు చన్ద్రార్కమరుద్గణేభ్యః.

59

స తేభ్యస్తు నమస్కృత్య సుగ్రీవాయ చ మారుతిః,
దిశః సర్వాః సమాలోక్య హ్యశోకవనికాం ప్రతి.

60

స గత్యా మనసా పూర్వమశోకవనికాం శుభామ్,
ఉత్తరం చిన్తయామాస వానరో మారుతాత్మజః.

61

ధ్రువం తు రక్షోబహులా భవిష్యతి వనాకులా,
అశోకవనికా చిన్త్యా సర్వసంస్కారసంస్కృతా.

62

తరువాత హనుమంతుడు ఇలా పలికాడు: "లక్ష్మణ సమేతుడైన రామునకు నమస్కారం; సీతాదేవికి నమస్కారం; రుద్రునకు, ఇంద్రునకు, యమునకు,

వాయుదేవునకు నమస్కారం; చంద్రునకు, సూర్యునకు, మరుద్గణాలకు నమస్కారం.”

59

హనుమంతుడు ఈ రీతిలో వారికి ప్రణామంచేసిన తరువాత తన రాజైన సుగ్రీవునికి కూడా నమస్కరించాడు. పిదప ఒకసారి నలువంకలా తన దృక్కులను అశోకవనం వైపుగా సారించాడు.

60

వాయునందనుడైన హనుమంతుడు ముందుగానే మానసికంగా ఆ అశోకవనంలో ప్రవేశించి, తదనంతరం తన కర్తవ్యం గురించి యోచించాడు.

61

అశోకవనం తప్పక రాక్షసులతో నిండి ఉంటుంది. వృక్షాలు విరివిగా, దట్టంగా ఉంటాయి. సంస్కారాలతో (కలుపు మొక్కలు తీసివేయడం మొదలైన) సుందరంగా తీర్చబడ్డ ఈ అశోకవనాన్ని తప్పక వెతికి తీరవలసిందే.

62

రక్షిణశ్చాత్ర విహితా నూనం రక్షన్తి పాదపాన్,
భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై.

63

సంక్షిప్తోఽయం మయాత్మా చ రామార్థే రావణస్య చ,
సిద్ధిం మే సంవిధాస్యన్తి దేవాః సర్షిగణాస్త్విహ.

64

బ్రహ్మా స్వయంభూర్భగవాన్ దేవాశ్చైవ దిశన్తు మే,
సిద్ధిమగ్నిశ్చ వాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్.

65

వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవ చ,
అశ్వినౌ చ మహాత్మానౌ మరుతః శర్వ ఏవ చ.

66

సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః,
దాస్యన్తి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః.

67

ఈ వనంలో వృక్షాలను రక్షిస్తూ వనపాలకులైన రాక్షసులు తప్పక నియమితులై ఉంటారు. సర్వవ్యాపీ, పూజ్యుడూ అయిన వాయువు కూడా మెల్లగానే వీస్తూంటాడు.

63

రావణుని, రావణుని సైనికుల కంటపడకుండా ఉండడానికి నా శరీరాన్ని అతిచిన్నదిగా చేసుకొంటాను. రామకార్యం నిర్విఘ్నంగా సిద్ధించడానికి దేవతలు, ఋషులు నాకు తోడ్పడతారుగాక!

64

స్వయంభువు (తనంతటతానే జన్మించిన) అయిన బ్రహ్మదేవుడు, దేవతలు, అగ్ని, వాయువు, వజ్రాయుధం ధరించిన దేవేంద్రుడు, చేత పాశం గల వరుణుడు, సూర్యచంద్రులు, మహాత్ములైన అశ్వనీదేవతలు, మరుత్తులు, పరమేశ్వరుడు (శివుడు) నాకు కార్యసిద్ధిని ప్రాప్తింపజేస్తారుగాక!

65–66

సకల భూతములు, భూతములకు అధిపతియైన సర్వేశ్వరుడు, మార్గంలో అదృశ్యంగా ఉండే దేవతలు నాకు కార్యసిద్ధిని కలిగిస్తారుగాక!

67

తదున్నసం పాణ్డురదన్తమవ్రణం
శుచిస్మితం పద్మపలాశలోచనమ్,
ద్రక్ష్యే తదార్యావదనం కదా న్వహం
ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్.

68

క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా
సుదారుణాలంకృతవేషధారిణా,
బలాభిభూతా హ్యబలా తపస్వినీ
కథం ను మే దృష్టిపథేఽద్య సా భవేత్.

69

ఉన్నతమైన నాసిక, తెల్లని పలువరుస, ఆకర్షణీయమైన చిరునవ్వు, తామరరేకుల వంటి కన్నులు, పూర్ణచంద్రుని వంటి ప్రసన్నమైన వదనంగల దోషరహితయైన, పూజ్యురాలైన ఆ సీతాదేవి ముఖారవిందాన్ని ఎప్పుడు దర్శిస్తానో కదా!

68

నీచుడు, పాపి, క్రూరుడు, నిజానికి అతిభయంకరుడే అయినప్పటికీ అలంకారాలచే ప్రసన్న వేషధారణలో ఉండేవాడైన రావణుడు, బలాత్కారంగా అపహరించి తెచ్చిన అబల, నిస్సహాయురాలు, సాధ్వి అయిన ఆ సీతాదేవి ఏ స్థితిలో నాకు కానవస్తుందో గదా!

69

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 13వ సర్గ సమాప్తం

14వ సర్గ
అశోకవనంలో అన్వేషణ

స ముహూర్తమివ ధ్యాత్వా మనసా చాధిగమ్య తామ్,
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః.

1

స తు సంహృష్ట సర్వాఙ్గః ప్రాకారస్థో మహాకపిః,
పుష్పితాగ్రాన్ వసన్తాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్.

2

సాలానశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్,
ఉద్దాలకాన్నాగవృక్షాంశ్చూతాన్ కపిముఖానపి.

3

మహాతేజోవంతుడైన హనుమంతుడు పై రీతిలో కొన్ని క్షణాలు యోచించి, సీతాదేవిని తలచుకుని రావణ భవన ప్రాకారం మీదికి దుమికాడు.

1

అలా ఆ ప్రాకారం మీద నిలబడ్డ హనుమంతుని సర్వాంగాలూ సంతోషంతో పులకించాయి. వసంతోదయంలో పుష్పించిన శాఖాగ్రాలు గల అనేక రకాలైన చెట్లను చూశాడు. మద్దిచెట్లను, అందం ఉట్టిపడే అశోక వృక్షాలను, విరగబూసిన సంపెంగి చెట్లను, విరిగిచెట్లను, పొన్నచెట్లను, మామిడిచెట్లను, తీగకానుగ చెట్లను హనుమంతుడు అక్కడ చూశాడు.

అథామ్రవణసంఛన్నాం లతాశతసమావృతామ్,
జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వృక్షవాటికామ్.

4

స ప్రవిశ్య విచిత్రాం తాం విహగైరభినాదితామ్,
రాజతైః కాఞ్చనైశ్చైవ పాదపైః సర్వతో వృతామ్.

5

విహగైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ఉదితాదిత్యసంకాశాం దదర్శ హనుమాన్ కపిః.

6

వృతాం నానావిధైర్వృక్షైః పుష్పోపగఫలోపగైః,
కోకిలైర్భృఙ్గరాజైశ్చ మత్తైర్నిత్యనిషేవితామ్.

7

ప్రహృష్టమనుజే కాలే మృగపక్షిసమాకులే,
మత్తబర్హిణసంఘుష్టాం నానాద్విజగణాయుతామ్.

8

తరువాత హనుమంతుడు వింటి నారి నుండి ప్రయోగింపబడ్డ బాణంలా ఆ వనవాటికలోనికి దూసుకుపోయాడు. ఆ వనవాటిక మామిడిచెట్లతోను, వందలాది తీగలతోను ఆవరింపబడి ఉంది.

4

మనుష్యులతో సహా సమస్త జీవజాలమూ సంతోషాతిశయంతో విహరించే ఆ వసంతోదయ సమయంలో నానారకాల పువ్వులను సంతరించుకున్న ఆ వృక్షవాటిక విచిత్ర వర్ణంతో శోభిస్తోంది. పక్షుల

కిలకిలారావాలతో ప్రతిధ్వనిస్తున్న ఆ వనవాటిక చుట్టూ వెండి, బంగారు రంగుగల చెట్లు కొలువుదీరి ఉన్నాయి. నానారకాలైన పక్షుల, మృగాల సంచారంచే ఆ వాటిక ఎంతో వైచిత్ర్యంతో భాసిస్తోంది. వృక్షసముదాయం కూడా అనేక రంగులతో చూడడానికి విచిత్రంగా కనిపిస్తున్నది. మొత్తానికి ఆ వనవాటిక ఉదయసూర్యునిలా ప్రకాశిస్తూన్నది. ఆ వాటిక పుష్పఫలభరిత వృక్షాలతో ఆవృతమై ఒప్పారుతోంది. మదించిన కోకిలలకు, తుమ్మెదలకు శాశ్వత ఆవాసమైన ఆ వనవాటిక మదించిన నెమళ్ళ క్రేంకారాలతో ప్రతిధ్వనిస్తున్నది. అంతేగాక అనేక రకాలైన పక్షుల గుంపులకు కూడా ఆ వాటిక ఆలవాలంగా విరాజిల్లుతోంది. అటువంటి వృక్షవాటికలోకి హనుమంతుడు అడుగుపెట్టాడు.

5–8

మార్గమాణో వరారోహాం రాజపుత్రీమనిన్దితామ్,
సుఖప్రసుప్తాన్విహగాన్బోధయామాస వానరః.

9

ఉత్పతద్భిర్విజగణైః పక్షైః సాలాః సమాహతాః,
అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః.

10

పుష్పావకీర్ణః శుశుభే హనుమాన్ మారుతాత్మజః,
అశోకవనికామధ్యే యథా పుష్పమయో గిరిః.

11

దిశః సర్వాః ప్రధావన్తం వృక్షషణ్ణగతం కపిమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని వసన్త ఇతి మేనిరే.

12

వృక్షేభ్యః పతితైః పుష్పైరవకీర్ణా పృథగ్విధైః,

రరాజ వసుధా తత్ర ప్రమదేవ విభూషితా.

13

రాజపుత్రీ, దోషములు లేనిదీ, అమిత సౌందర్యవతీ అయిన సీతాదేవి కోసం అన్వేషిస్తూ హనుమంతుడు అశోకవనంలో అడుగుపెట్టగానే చెట్ల మీద సుఖంగా నిద్రిస్తున్న పక్షులన్నీ ఒక్కసారిగా మేల్కొని, ఎగిరిపోయాయి.

9

ఎగిరిపోతున్న పక్షుల రెక్కల తాకిడిచే వృక్షములు, అనేక రంగులు అనేక విధాలు అయిన పూల వానను కురిపించాయి.

10

అలా రాలిపడిన పువ్వులచే కప్పబడిన హనుమంతుడు ఆ అశోకవన మధ్యమున పుష్పమయమైన పర్వతం మల్లే శోభిల్లాడు.

11

ఆ వనంలోని చెట్ల నడుమ నలువంకలా సంచరిస్తున్న ఆ పుష్పమయ రూపంలోని హనుమంతుని చూసిన సకల భూతములు సాక్షాత్తు ఆ వసంతుడే సంచరిస్తున్నాడేమోనని భావించాయి.

12

చెట్లనుండి నానారకాలైన పువ్వులు రాలి పడి ఉండడం వలన ఆ నేల చూడముచ్చటగా అలంకరించుకున్న స్త్రీలా భాసిస్తోంది.

13

తరస్వినా తే తరవస్తరసాభిప్రకమ్పితాః,
కుసుమాని విచిత్రాణి ససృజుః కపినా తదా.

14

నిర్ధూతపత్రశిఖరాః శీర్ణపుష్పఫలా ద్రుమాః,

నిక్షిప్తవస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః.

15

హనూమతా వేగవతా కమ్పితాస్తే నగోత్తమాః,
పుష్పపర్ణఫలాన్యాశు ముముచుః పుష్పశాలినః.

16

విహఙ్గసంఘైర్వీనాస్తే స్కన్ధమాత్రాశ్రయా ద్రుమాః,
బభూవురగమాః సర్వే మారుతేనేవ నిర్ధుతాః.

17

నిర్ధూతకేశీ యువతిర్యథా మృదితవర్ణకా,
నిష్పీతశుభదన్తోష్ఠీ నఖైర్దన్తైశ్చ విక్షతా.

18

తథా లాజ్జాలహస్తైశ్చ చరణాభ్యాం చ మర్దితా,
బభూవాశోకవనికా ప్రభగ్నవరపాదపా.

19

మహాశక్తిమంతమైన హనుమంతుని చేతుల కదలికకూ, వేగానికీ ఊగిపోతున్న ఆ వృక్షాలు ఇంకా ఎన్నో రంగురంగుల పువ్వులను నేలరాల్చాయి.

14

హనుమంతుని సంచార వేగం వలన తమ పువ్వులనన్నింటినీ, పండ్లనన్నింటినీ నేలరాల్చివేసిన చెట్లు, జూదంలో సర్వస్వం ఓడి తమ అమూల్య వస్త్రాభరణాలను సైతం విజేతకు ఊడ్చి ఇచ్చిన జూదరులమల్లే కానవచ్చాయి.

15

పుష్పమయములైన వృక్షాలు హనుమంతుని ప్రచండ వేగానికి ఊగిపోయి, పువ్వులను, ఆకులను, పండ్లను తక్షణమే నేలరాల్చాయి.

16

పక్షులన్నీ ఎగిరిపోగా బోదెలు మాత్రమే మిగిలి ఉన్న ఆ వృక్షాలు పెనుగాలి తాకిన వృక్షాల చందాన బోసిపోయి ఉన్నాయి.

17

తోకతో, చేతులతో, కాళ్ళతో మహావృక్షాలను హనుమంతుడు విరుగగొట్టగా, ప్రియునిచే గాఢంగా చుంబింపబడి శరీరంపై నఖక్షత దంతక్షతాలు, తొలగిపోయిన అంగరాగం (మైపూతలు), వీడిపోయిన జుట్టుముడి గల యువతిలా ఆ అశోకవనం ఆ సమయంలో దర్శనమిచ్చింది.

18–19

మహాలతానాం దామాని వ్యధమత్తరసా కపిః,
యథా ప్రావృషి విన్ధ్యస్య మేఘజాలాని మారుతః.

20

స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః,
తథా కాఞ్చనభూమీశ్చ దదర్శ విచరన్ కపిః.

21

వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా,
మహార్హైర్మణిసోపానైరుపపన్నాస్తతస్తతః.

22

ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాన్తరకుట్టిమాః,
కాఞ్చనైస్తరుభిశ్చిత్రైస్తీరజైరుపశోభితాః.

23

ఫుల్లపద్మోత్పలవనా శ్చక్రవాకోపకూజితాః,
నత్యూహరుతసంఘుష్టా హంససారసనాదితాః.

24

దీర్ఘాభిర్ద్రుమయుక్తాభిః సరిద్భిశ్చ సమన్తతః,
అమృతోపమతోయాభిః శివాభిరుపసంస్కృతాః.

25

లతాశతైరవతతాః సన్తానకుసుమావృతాః,
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాన్తరాః.

26

వర్ష ఋతువున వింధ్యపర్వతాల మీద మసలివస్తున్న మేఘసమూహాలను ప్రచండవాయువు చెల్లాచెదరు చేసినట్లు, హనుమంతుడు తన బలంచే పెద్ద పెద్ద తీగల పొదలను ఛిన్నాభిన్నం చేశాడు.

20

హనుమంతుడు ఆ అశోకవనంలో సంచరిస్తూ చూడముచ్చటగా ఉన్నవీ, ప్రకాశమానమైనవీ అయిన మణులు పొదిగిన గచ్చులను, వెండి బంగారు పలకలు పరుచబడిన గచ్చులను చూశాడు.

21

హనుమంతుడు ఆ అశోకవనంలో ఉత్తమమైన జలాలలతో నిండిన విభిన్న ఆకారాలలో ఉన్న పలు దిగుడు బావులను చూశాడు. ఆ బావులలో అక్కడక్కడ మణిఖచితములైన మెట్లను అమర్చి ఉన్నారు. ఇసుకకు మారుగా ఆ బావులలో ముత్యాలు, పొగడాలు పొదగబడి ఉన్నవి. కూర్చోవడానికి అనువుగా వాటి మధ్య స్ఫటిక మాణిక్య నిర్మిత చప్టాలు ఉన్నాయి. ఆ దిగుడు బావుల తీరాన కృత్రిమంగా నిర్మతమైన కాంచన వృక్షాలు శోభిల్లుతున్నాయి. ఆ బావులు వికసించిన తామరలతో, కలువలతో నిండి ఉన్నాయి. చక్రవాక

పక్షుల కూతలతో, నీటికోళ్ళ అరపులతో, హంసల సారస పక్షుల మధుర నాదాలతో ఆ ప్రాంతం ఒప్పారుతూ ఉంది. ఆ దిగుడు బావులకు అన్నివైపులా మధుర జలాలతో కూడుకున్న పొడవైన వాగులు ప్రవహిస్తూన్నాయి. ఆ వాగులను రకరకాల చెట్లు, సంతానక వృక్షాల పుష్పాలతో కప్పబడిన దటమైన పొదరిళ్ళు ఆవరించి ప్రకృతి సౌందర్యాన్ని మరింతగా ఇనుమడింపజేస్తున్నాయి. వీటి మధ్య అక్కడక్కడ కరవీర వృక్షాలు వెలసి ఉన్నాయి.

22–26

తతోఽమ్బుధరసంకాశం ప్రవృద్ధశిఖరం గిరిమ్,
విచిత్రకూటం కూటైశ్చ సర్వతః పరివారితమ్.

27

శిలాగృహైరవతతం నానావృక్షైః సమావృతమ్,
దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్.

28

తదనంతరం హనుమంతుడు అత్యంత అందమైన పర్వతాలలో ఒకటైన, మేఘంలా కనిపిస్తూ ఎత్తైన శిఖరాలతో కూడుకున్న ఒక పర్వతరాజాన్ని చూశాడు. ఆ పర్వతం నివాసయోగ్యమైన గుహలతో కూడుకున్నదై, నానారకాల వృక్షసముదాయంచే ఆవరింపబడి భాసిస్తోంది.

27–28

దదర్శ చ నగాత్తస్మాన్నదీం నిపతితాం కపిః,
అజ్కాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్.

29

జలే నిపతితాగ్రైశ్చ పాదపైరుపశోభితామ్,
వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబన్ధుభిః.

30

పునరావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః,
ప్రసన్నామివ కాన్తస్య కాన్తాం పునరుపస్థితామ్.

31

తస్యాదూరాత్స పద్మిన్యో నానాద్విజగణాయుతాః,
దదర్శ హరిశార్దూలో హనుమాన్ మారుతాత్మజః.

32

కృత్రిమాం దీర్ఘికాం చాపి పూర్ణాం శీతేన వారిణా,
మణిప్రవరసోపానాం ముక్తాసికతశోభితామ్.

33

వివిధైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ప్రాసాదైః సుమహద్భిశ్చ నిర్మితైర్విశ్వకర్మణా.

34

కాననైః కృత్రిమైశ్చాపి సర్వతః సమలంకృతామ్.

35

ఆ పర్వతం పైనుండి క్రిందికి జారి ప్రవహిస్తున్న నది నొకదాన్ని హనుమంతుడు చూశాడు. అది ప్రియుని అంకభాగం (తొడ) నుండి వైదొలగిపోతున్న ప్రియురాలిని తోపింపజేస్తున్నది.

29

అంతేకాక వ్యతిరిక్త దిశలో ప్రవహిస్తున్న నదీ ప్రవాహాన్ని కొన్నిచోట్ల నదీజలాలలోనికి వంగి ఉన్న చెట్లు నిరోధిస్తున్నట్లు హనుమంతునికి కానవచ్చింది. ప్రియునిపై అలిగి అతడిని వీడి వెళ్ళిపోబోతున్న ప్రియురాలు హితుల సాంత్వన వచనాలతో సమాధానపడి ప్రసన్నురాలై తిరిగి వస్తున్న

చందాన ఆ కమనీయ దృశ్యం హనుమంతునికి అగపడింది.

30–31

వానరశ్రేష్ఠుడూ, వాయునందనుడూ అయిన హనుమంతునకు ఆ పర్వతం సమీపంలోనే అనేక పక్షుల సమూహాలతో కూడినదైన తామరలతో నిండిన సరోవరాలు కనిపించాయి.

32

అక్కడ హనుమంతుడు చల్లని నీటితో నిండి ఉన్న మానవ నిర్మితమైన ఒక పెద్ద దిగుడుబావిని చూశాడు. మణులు పొదగిన మెట్లతో, ముత్యాల ఇసుకచే శోభిల్లుతున్న ఆ దిగుడుబావి ప్రక్కన అనేక రకాలైన జింకలు గుంపులుగా సంచరిస్తున్న చిత్రమైన వనములు కొలువుదీరి ఉన్నాయి. వాటి చెంతనే ఉన్న విశ్వకర్మ నిర్మితమైన పెద్ద మేడలు, కృత్రిమ వృక్షాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

33–35

యే కేచిత్పాదపాస్తత్ర పుష్పోపగఫలోపగాః,
సచ్ఛత్రాః సవితర్దీకాః సర్వే సౌవర్ణవేదికాః.

36

లతాప్రతానైర్బహుభిః పర్ణైశ్చ బహుభిర్వృతామ్,
కాఞ్చనీం శింశుపామేకాం దదర్శ హనుమాన్ కపిః,
వృతాం హేమమయీభిస్తు వేదికాభిః సమన్తతః

37

సోఽపశ్యద్భూమిభాగాంశ్చ గర్తప్రస్రవణాని చ,
సువర్ణవృక్షానపరాన్ దదర్శ శిఖీసన్నిభాన్.

38

అక్కడ గల పుష్పభరిత ఫలభరిత వృక్షాల క్రింది ఛత్రములు, బంగారు

మెట్లుగల పెద్ద అరుగులు అమర్చబడి ఉన్నాయి.

36

హనుమంతుడు అక్కడ బంగారు వన్నె సంతరించుకున్న ఒక శింశుపావృక్షాన్ని చూశాడు. ఆ వృక్షాన్ని అనేక లతలు అల్లుకొని ఉన్నాయి. ఆ వృక్ష శాఖలు ఆకులతో దట్టంగా ఉన్నాయి. దాని చుట్టూ బంగారు వేదికలు అమర్చబడి ఉన్నాయి.

37

సెలయూటలున్న లోతైన పల్లపు ప్రాంతాలనూ, అగ్నికిమల్లే ప్రకాశిస్తూన్న బంగారు వన్నెలో వృక్షాలు గల జలరహిత మైదానములను హనుమంతుడు అక్కడ చూశాడు.

38

తేషాం ద్రుమాణాం ప్రభయా మేరోరివ దివాకరః,
అమన్యత తదా వీరః కాఞ్చనోస్మీతి వానరః.

39

తాం కాఞ్చనైస్తరుగణైర్మారుతేన చ వీజితామ్,
కిఙ్కిణీశతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయమాగమత్.

40

స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాఙ్కురపల్లవామ్,
తామారుహ్య మహాబాహుః శింశుపాం పర్ణసంవృతామ్.

41

ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసామ్,
ఇతశ్చేతశ్చ దుఃఖార్తాం సంపతన్తీం యదృచ్ఛయా.

42

అశోకవనికా చేయం దృఢం రమ్యా దురాత్మనః,
చమ్పకైశ్చన్దనైశ్చాపి వకుళైశ్చ విభూషితా.

43

మేరుపర్వత కాంతి సంక్రమించడం వలన సూర్యుని మల్లే, ఈ బంగారుమయ వృక్షాల కాంతి ప్రకాశం వలన తాను బంగారువన్నె గలవాడనయ్యానని హనుమంతుడు అనుకొన్నాడు.

39

బంగారు రంగుగల శాఖోపశాఖలతో, గాలి కదలికచే సవ్వడి చేస్తున్న ఆ శాఖలకు కట్టిన అనేకమైన చిరుగంటలతో భాసిస్తున్న ఆ శింశుపా వృక్షాన్ని పరికించి హనుమంతుడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

40

గొప్ప బాహువులు గల ఆ హనుమంతుడు విరగబూచిన కొమ్మలతో కూడినదీ, అందమైన లేచిగుళ్ళు అంకురాలు గలదీ, గుబురుగానున్న ఆకులతో కూడుకొన్నదీ అయిన ఆ శింశుపా వృక్షాన్ని ఎక్కి ఇలా ఆలోచించాడు: 'బహుశా ఇక్కడ రాముని చూడాలనే ఏకైక ఆలోచనలో మునిగిపోయి, దుఃఖిస్తూ అటూ ఇటూ పచార్లుచేస్తున్న సీతాదేవిని అనుకోకుండా చూడగలనేమో!'

41–42

దుష్టుడైన రావణుని ఈ అశోకవనం సంపెంగ చెట్ల, చందన వృక్షాల, పొగడ చెట్ల వలన ఇనుమడించిన అందంతో అలరారుతోంది.

43

ఇయం చ నలినీ రమ్యా ద్విజసంఘనిషేవితా,
ఇమాం సా రామమహిషీ నూనమేష్యతి జానకీ.

44

సా రామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతీ,
వనసంచారకుశలా నూనమేష్యతి జానకీ.

45

అథవా మృగశాబాక్షీ వనస్యాస్య విచక్షణా,
వనమేష్యతి సార్యేహ రామచిన్తానుకర్శితా.

46

రామశోకాభిసంతప్తా సా దేవీ వామలోచనా,
వనవాసే రతా నిత్యమేష్యతే వనచారిణీ.

47

వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా,
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ.

48

సన్ధ్యాకాలమనాఃశ్యామా ధ్రువమేష్యతి జానకీ,
నదీం చేమాం శివజలాం సన్ధ్యార్థే వరవర్ణినీ.

49

కిలకిలారావాలు చేస్తున్న పక్షిసముదాయంతో కూడినదైన ఈ పద్మసరోవరం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. రాముని పట్టమహిషియైన ఆ సీతాదేవి ఇక్కడకు తప్పక రావచ్చు.

44

రాముని భార్య, పతివ్రత, ఆయనకు ప్రియమును చేకూర్చేదీ, అరణ్యంలో వసించడంలో ఎంతో అనుభవం గడించినదీ అయిన జానకి తప్పక ఇక్కడికి రాగలదు.

45

రామున్ని గూర్చిన ఆలోచనల వలన కలిగిన దుఃఖంచే కృశించినదీ, లేడి కన్నుల వంటి కన్నులుగలదీ, పూజ్యురాలూ, అరణ్య జీవిత కష్టాలకు అలవాటుపడ్డదీ అయిన సీత ఈ వనానికి రావచ్చును.

46

ఇప్పటికి అరణ్య జీవితం పట్ల మక్కువ పెంచుకున్న సుందర నేత్రములు గల సీత, రాముని ఎడబాటు వలన కలిగిన శోకంతో నిత్యమూ ఇక్కడకు వస్తూ ఉండాలి.

47

రాముని ప్రియ భార్యా, జనకుని కుమార్తె, యౌవనవతీ, సౌందర్యవతీ అయిన సీతాదేవికి వనంలో సంచరించే వారి పట్ల (వానరులు) ప్రేమాసక్తులు ఉండి ఉండడం తథ్యం. ప్రస్తుతం సంధ్యాసమయం అనే విషయం గుర్తించి సంధ్యోపాసన నిమిత్తం పవిత్ర జలాలతో కూడిన ఈ నది వద్దకు తప్పకుండా రావచ్చు.

48–49

తస్యాశ్చాప్యనురూపేయ మశోకవనికా శుభా,
శుభా యా పార్థివేన్ద్రస్య పత్నీ రామస్య సమ్మతా.

50

యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా,
ఆగమిష్యతి సావశ్య మిమాం శివజలాం నదీమ్.

51

ఏవం తు మత్వా హనుమాన్మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేన్ద్రపత్నీమ్,
అవేక్షమాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః.

52

శుభప్రదమైన ఈ అశోకవనం రాజాధిరాజైన రామునికి పత్నీ, మంగళప్రదురాలూ అయిన సీతకు నివసింప ఎంతో తగినదిగా ఉంది.

50

చంద్రబింబం వంటి మోముగల ఆ సీతాదేవి జీవించి ఉండే పక్షంలో, తప్పక ఆమె పవిత్ర జలాలున్న ఈ నది వద్దకు వస్తుంది.

51

ఈ విధంగా మహాత్ముడైన హనుమంతుడు ఆలోచిస్తూ, సీతాదేవి రాకకై నిరీక్షిస్తూ విరగబూసి, దట్టమైన ఆకులున్న కొమ్మ మీద నక్కిదాక్కొని నలువంకలా నిశితంగా పరికించసాగాడు.

52

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 14వ సర్గ

సమాప్తం

15వ సర్గ
సీతను కనుగొనడం

స వీక్షమాణస్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్,
అవేక్షమాణశ్చ మహీం సర్వాం తామన్వవైక్షత.

1

సన్తానకలతాభిశ్చ పాదపైరుపశోభితామ్,
దివ్యగన్ధరసోపేతాం సర్వతః సమలంకృతామ్.

2

తాం స నన్దనసంకాశాం మృగపక్షిభిరావృతామ్,
హర్మ్యప్రాసాదసంబాధాం కోకిలాకులనిస్స్వనామ్.

3

కాఞ్చనోత్పలపద్మాభిర్వాపీభిరుపశోభితామ్,
బహ్వాసనకుథోపేతాం బహుభూమిగృహాయుతామ్.

4

సర్వర్తుకుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః,
పుష్పితానామశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్.

5

ప్రదీప్తామివ తత్రస్థో మారుతిః సముదైక్షత,
నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణామివాసకృత్.

6

వినిష్పతద్భిః శతశశ్చిత్రైః పుష్పావతంసకైః,
ఆమూలపుష్పనిచితైరశోకైః శోకనాశనైః.

7

పుష్పభారాతిభారైశ్చ స్పృశద్భిరివ మేదినీమ్,
కర్ణికారైః కుసుమితైః కింశుకైశ్చ సుపుష్పితైః.

8

ఆ శింశుపావృక్షం మీద తనను మరుగుపరచుకొని కూర్చున్న హనుమంతుడు సీత కోసం వెతకుతూ ఆ ప్రదేశాన్నంతా సునిశితంగా కలయజూడసాగాడు.

1

సంతానక లతలు వృక్షాలు ఆ వనానికి మరింత శోభను సంతరింపజేస్తున్నాయి. సర్వత్రా పిల్లవాయువులు వీస్తున్నాయి. తీర్చిదిద్దబడినట్లున్న ఆ అశోకవనం నందనవనానికి దీటైనదిగా భాసిస్తోంది. ఆ వనం రకరకాల మృగాలతో, పక్షులతో కూడినదై నివసింప అందమైన మేడలు, భవనాలతో మరింత శోభాయమానంగా విరాజిల్లుతోంది. కోకిలల కలకల ధ్వనులు సర్వత్రా వినవస్తున్నాయి. బంగారు కలువలు, తామరలు ఆవరించి ఉన్న దిగుడు బావులు చూడముచ్చటగొలుపుతున్నాయి. ఆ వనంలో పలుచోట్ల రకరకాలైన ఆసనాలు, అత్యంత విలువైన తివాచీలు అమర్చబడి ఉన్నాయి. అక్కడక్కడ నిర్మితమైన భూగృహాలు ఆ వన సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అన్ని ఋతువులలో విరగబూచిన పువ్వులతో, ఫలాలతో నిండిన అనేక చెట్లతో ఆ వనం అలరారుతోంది. కొన్ని చెట్ల కొమ్మలు ఫలభరిత పుష్పభరిత భారంతో బాగా వంగిపోయి నేలను తాకుచున్నాయి. మనుష్యుల శోకాన్ని తొలగింపజేస్తూ ఉండడం వలన

అశోకవనం అనే పేరు ఆ వనానికి సార్థకమై ఒప్పారుతోంది. బాగుగా పుష్పించిన కర్ణికార వృక్షాలు, కింశుక వృక్షాలు ఆ వన అందచందాలను ఇనుమడింపజేస్తుండగా, అశోకవృక్షాల పుష్పాలు వెదజల్లే కాంతులు సూర్యకాంతిని తలపింపజేస్తున్నాయి. పదేపదే వందలాది పక్షులు వ్రాలడం వలన అనేక చెట్ల కొమ్మల ఆకులన్నీ రాలిపోయి, పువ్వులు మాత్రం మిగిలి ఉండి వింత శోభను సంతరించుకొన్నట్లు కానవస్తున్నాయి. దిగువన కనబడుతున్న ఈ దృశ్యాన్నంతా శింశుపా వృక్షం మీద తనను మరుగుపరచుకొని కూర్చున్న హనుమంతుడు చూశాడు.

2–8

స దేశః ప్రభయా తేషాం ప్రదీప్త ఇవ సర్వతః,
పున్నాగాః సప్తపర్ణాశ్చ చమకోద్దాలకాస్తథా,
వివృద్ధమూలా బహువః శోభన్తే స్మ సుపుష్పితాః.

9

శాతకుమ్భనిభాః కేచిత్ కేచిదగ్నిశిఖోపమాః,
నీలాఞ్జననిభాః కేచిత్తత్రాశోకాః సహస్రశః.

10

నన్దనం విబుధోద్యానం చిత్రం చైత్రరథం యథా,
అతివృత్తమివాచిన్త్యం దివ్యం రమ్యం శ్రియా వృతమ్,
ద్వితీయమివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతమ్.

11

పుష్పరత్నశతైశ్చిత్రం ద్వితీయం సాగరం యథా,
సర్వర్తుపుష్పైర్నిచితం పాదపైర్మధుగన్ధిభిః.

12

నానానినాదైరుద్యానం రమ్యం మృగగణైర్ద్విజైః.

13

అనేకగన్ధప్రవహం పుణ్యగన్ధం మనోరమమ్,
శైలేంద్రమివ గన్ధాఢ్యం ద్వితీయం గన్ధమాదనమ్.

14

ఆ వృక్షాలు వెదజల్లుతున్న కాంతిపుంజాలచే ఆ ప్రాంతమంతా ప్రజ్వలిస్తున్నట్లుగా భాసిస్తోంది. బాగా విస్తరించిన మొదళ్ళుగల పున్నాగ వృక్షాలు, ఏడాకుల అరటి చెట్లు, సంపెంగ చెట్లు, ఉద్దాలక వృక్షాలు చక్కగా పుష్పించి ఆ అశోకవనంలో శోభాయమానంగా ప్రకాశిస్తున్నాయి.

9

ఆ వనంలో కొలువై ఉన్న వేలాది అశోకవృక్షాలలో కొన్ని బంగారువన్నెలో, కొన్ని అగ్నిజ్వాలమల్లే, మరికొన్ని ఇంద్రనీలాలలా, ఇంకాకొన్ని కాటుకరంగులో ఉండి భాసిస్తున్నాయి.

10

వివిధ ఉద్యానాలతో కూడినదైన ఆ అశోకవనం ఇంద్రుని నందనవనాన్ని, కుబేరుని చైత్రరథమనే ఉద్యానాన్ని మించినట్లుగా కానవస్తోంది. అశోకవన శోభ, అద్వితీయతలు ఊహింప వర్ణనాతీతంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాబోదు. ఆ అశోకవనం పుష్పములనే నక్షత్రాలతో రెండవ ఆకాశం అన్నట్లుగాను, పువ్వులనే రత్నాలతో రెండవ సముద్రం అన్నట్లుగాను విరాజిల్లుతోంది. అన్ని ఋతువులలోనూ పూచే పువ్వులుగల వృక్షాలు, సుగంధాల గుబాళింపుతో వీచే పిల్లవాయువు, పశుపక్ష్యాదులు చేస్తున్న విలక్షణ ధ్వనులు, సర్వత్రా ఉత్పన్నమౌతున్న ఆహ్లాదకరమైన సువాసనలు – ఇవన్నీ కలగలసి ఆ అశోకవనాన్ని రెండవ గంధమాదన పర్వతంలా భావింపజేస్తున్నాయి.

11–14

అశోకవనికాయాం తు తస్యాం వానరపుంగవః,
స దదర్శావిదూరస్థం చైత్యప్రసాదముచ్ఛ్రితమ్.

15

మధ్యే స్తమ్భసహస్రేణ స్థితం కైలాసపాణ్డురమ్,
ప్రవాళకృతసోపానం తప్తకాఞ్చనవేదికమ్.

16

ముష్ణన్తమివ చక్షూంషి ద్యోతమానమివ శ్రియా,
విమలం ప్రాంశుభావత్వా దుల్లిఖన్త మివామ్బరమ్.

17

ఆ అశోకవన మధ్యంలో తాను దాగివున్న శింశుపా వృక్షానికి సమీపంలో సమున్నతమైన ఒక మహాభవనరాజాన్ని హనుమంతుడు చూశాడు. కైలాసంలా తెల్లగా ఉన్న ఆ మహాసౌధం వేయిస్తంభాల మీద నిలచి ఉంది. ఆ మహాభవనపు మెట్లు పగడాలతో పొదగబడి ఉన్నాయి; వేదికలు మేలిమి బంగారంతో రూపొందించబడ్డాయి. చూపరుల కళ్ళకు మిరిమెట్లు గొలిపేలా ప్రజ్వలిస్తున్న కాంతితో ఆ భవనం ప్రకాశిస్తోంది. ఆ మహాసౌధం ఆకాశాన్ని చుంబిస్తున్నంత ఎత్తైనదిగా అలరారుతోంది.

15–17

తతో మలినసంవీతాం రాక్షసీభిః సమావృతామ్,
ఉపవాసకృశాం దీనాం నిశ్శ్వసన్తీం పునః పునః,
దదర్శ శుక్లపక్షాదౌ చన్ద్రరేఖామివామలామ్.

18

మన్దం ప్రఖ్యాయమానేన రూపేణ రుచిరప్రభామ్,
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః.

19

పీతేనైకేన సంవీతాం క్లిష్టేనోత్తమవాససా,
సపఙ్కామనలఙ్కారాం విపద్మామివ పద్మినీమ్.

20

వ్రీడితాం దుఃఖసంతప్తాం పరిమ్లానాం తపస్వినీమ్,
గ్రహేణాఙ్గారకేణేవ పీడితామివ రోహిణీమ్.

21

ఇలా నలువంకలా నిశితంగా పరికిస్తున్న హనుమంతునికి ఒక చోట మలినవస్త్రం ధరించి రాక్షసస్త్రీల మధ్య కూర్చుని ఉన్న ఒక స్త్రీ కనిపించింది. కఠోర ఉపవాసాలచే కృశించి దీనురాలై కానవస్తున్న ఆమె పదేపదే నిట్టూరుస్తున్నది. శుక్లపక్ష ప్రారంభాన నిర్మలమై ప్రకాశిస్తున్న చంద్రరేఖ చందాన ఆమె ఒప్పారుతోంది.

18

పొగచే ఆవృతమైన అగ్నిజ్వాల వలె ఆమె సౌందర్యం స్పష్టంగా కానరాకున్నది.

19

ఒక్క పసుపు పచ్చని జీర్ణవస్త్రమును మాత్రం ఆమె ధరించి ఉంది. ఆమె శరీరం దుమ్ముకొట్టుకొనిపోయి ఆభరణరహితంగా, ఒక్క పద్మం కూడా లేని తామర కొలను చందాన కానవస్తోంది.

20

అమిత దుఃఖం అనుభవిస్తున్నందున శరీర శోభ తరిగి వాడిపోయినదై దైన్య స్థితిలో ఉన్న ఆమె సిగ్గుతో తలవంచుకుని కూర్చుని ఉన్నది. అంగారక గ్రహంచే పీడింపబడిన రోహిణీ నక్షత్రంలా ఆమె ప్రకాశరహితంగా కనిపిస్తున్నది.

21

అశ్రుపూర్ణముఖీం దీనాం కృశామనశనేన చ,
శోకధ్యానపరాం దీనాం నిత్యం దుఃఖపరాయణామ్.

22

ప్రియం జనమపశ్యన్తీం పశ్యన్తీం రాక్షసీగణమ్,
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభివృతామివ.

23

నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ.

24

సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానామకోవిదామ్,
తాం సమీక్ష్య విశాలాక్షీమధికం మలినాం కృశామ్,
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః.

25

కన్నుల నుండి స్రవిస్తున్న కన్నీరు ఆమె విషాదాన్ని చెప్పక చెబుతున్నది. ఉపవాసములచే ఆమె బాగా కృశించిపోయి ఉంది. భయాందోళనలతో ఏవేవో ఆలోచనల్లో మునిగి ఉన్న ఆమె దుఃఖాక్రాంతురాలై కానవచ్చింది.

22

తన పట్ల ఆదరం చూపే వారు ఒక్కరుకూడా లేకపోవడంతోను, తన చుట్టూ నిరంతరాయంగా క్రూరస్వభావులైన రాక్షసస్త్రీలు ఉండడం వలనా ఆమె శోకసాగరంలో మునిగి ఉంది. మందనుండి విడివడిపోయి వేటకుక్కలు చుట్టుముట్టిన ఆడజింక చందాన ఉంది ఆమె పరిస్థితి.

23

కటి ప్రదేశం వరకు వ్రేలాడుతున్న నల్లత్రాచు వంటి ఒక్క జడతో ఉన్న

ఆ స్త్రీ శరదృతువులో ముదురు ఆకుపచ్చ వృక్షపంక్తితో కూడిన భూమిని తలపింపజేస్తున్నది.

24

ఎన్నడూ కష్టాలు చవిచూచి ఎరుగని, సుఖాలను అనుభవించడానికే అర్హురాలైన ఆమె దుఃఖంచే క్రుంగిపోయినట్లు కనిపిస్తోంది. మాలిన్యంతో కూడి కృశించిపోయి ఉన్న ఆ విశాలములైన నేత్రాలుగల స్త్రీని తేరిపార పరికించిన హనుమంతుడు సహేతుక దృక్పథంతో ఆమె సాక్షాత్తు సీతాదేవి అయివుంటుందని ఊహించాడు.

25

హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా,
యథారూపా హి దృష్టా వై తథారూపేయమఙ్గనా.

26

పూర్ణచన్ద్రాననాం సుభ్రూం చారువృత్తపయోధరామ్,
కుర్వన్తీమ్ ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః.

27

తాం నీలకేశీం బిమ్బోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితామ్,
సీతాం పద్మపలాశాక్షీం మన్మథస్య రతిం యథా.

28

ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచన్ద్రప్రభామివ,
భూమౌ సుతనుమాసీనాం నియతామివ తాపసీమ్.

29

నిఃశ్వాసబహులాం భీరుం భుజగేన్ద్రవధూమివ,
శోకజాలేన మహతా వితతేన న రాజతీమ్.

30

నాడు ఇచ్ఛానుసారం రూపం మార్చుకోగల ఆ రాక్షసునిచే (రావణుడు) అపహరింపబడిన స్త్రీ ఏ రూపంలో ఉన్నదో, అచ్చం అటువంటి రూపురేఖలే ఈ స్త్రీలో కూడా కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

26

ఆమె ముఖారవిందం పూర్ణచంద్రునిలా ఉంది, కనుబొమలు తీర్చిదిద్దినట్లుండి ఆకర్షణీయంగా ఉన్నాయి. ఆమె స్తనములు వర్తులాకార ఆకృతిలో రూపొంది ఉన్నాయి. ఆమె మేనిచాయ ప్రకాశం చుట్టుపట్ల ఉన్న చీకట్లను పారద్రోలివేస్తున్నది. నల్లని కేశాలు, దొండపండువంటి పెదవులు, చక్కని నడుము, తామరరేకుల వంటి కన్నులు గలిగి మన్మథుని భార్యయైన రతీదేవి వలె ఉన్న సీతాదేవిని హనుమంతుడు అక్కడ చూశాడు.

27–28

పూర్ణచంద్రుని వెన్నెల మల్లే సమస్త ప్రాణులకు ఆమె ప్రీతిపాత్రురాలైనది. నియమవతియై తపస్విని మాదిరి ఆమె నేల మీద కూర్చుని ఉంది. నాగకన్యవలె ఆమె భయదుఃఖాదుల కారణంచే అధికంగా నిట్టూరుస్తున్నది. పెల్లుబుకుతున్న శోకంచే ప్రకాశవిహీనురాలై పొగ క్రమ్మిన అగ్నిజ్వాలను ఆమె గుర్తుకు తెస్తున్నది.

29–30

సంసక్తాం ధూమజాలేన శిఖామివ విభావసోః.
తాం స్మృతీమివ సన్దిగ్ధామృద్ధిం నిపతితామివ.

31

విహితామివ చ శ్రద్ధామాశాం ప్రతిహతామివ,
సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ.

32

అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ,

రామోపరోధవ్యథితాం రక్షోహరణకర్శితామ్.

33

అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తతస్తతః,
బాష్పామ్బుపరిపూర్ణేన కృష్ణవక్రాక్షిపక్ష్మణా,
వదనేనాప్రసన్నేన నిఃశ్వసన్తీం పునః పునః.

34

మలపఙ్కధరాం దీనాం మణ్డనార్హామమణ్డితామ్,
ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘైరివావృతామ్.

35

సంశయం కలిగించే అర్థవంతమైన స్మృతి వాక్యంవలె, క్షీణించిన సమృద్ధి మల్లే, సడలిపోయిన శ్రద్ధ మాదిరి, అవరోధం వాటిల్లిన ఆశవలె, విఘ్నం దాపురించిన కార్యసిద్ధిలా, తికమకపెట్టే ఆలోచనలతో ఆవరింపబడిన బుద్ధి చందాన ఆమె కావచ్చింది.

31–32

రావణునిచే అపహరింపబడడం వలన, తద్ద్వారా కలిగిన రాముని ఎడబాటు కారణంగా ఎంతో దిగులుతో కృశించిపోయిన ఆ సీత మిథ్యాపవాదంచే క్షీణించిన కీర్తివలె కానవస్తోంది.

33

విల్లువంటి కనుబొమలుగల కన్నీటితో నిండిన నల్లనైన కళ్ళతో నిస్సహాయ, దుస్థితిలో ఉన్న లేడిపిల్లలా అటూ ఇటూ చూస్తూ పదేపదే నిట్టూరుస్తున్న ఆమె శోకం ఇట్టే అర్థమవుతోంది.

34

స్నానాదికాలు లేకపోవడంచే ఆమె శరీరం మురికిపట్టి ఉంది. అలంకారాలకు అర్హురాలైన ఆమె ఎటువంటి అలంకారాలూలేక దీనంగా

కారుమేఘాలు ఆవరించిన చంద్రుని కాంతిలా అగపడుతున్నది.

35

తస్య సందిదిహే బుద్ధిర్మహుఃసీతాం నిరీక్ష్య తు,
ఆమ్నాయనామయోగేన విద్యాం ప్రశిథిలామివ.

36

దుఃఖేన బుబుధే సీతాం హనుమాననలంకృతామ్,
సంస్కారేణ యథా హీనాం వాచమర్థాంతరం గతామ్.

37

తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీమనిన్దితామ్,
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః.

38

వైదేహ్యా యాని చాఙ్గేషు తదా రామోఽన్వకీర్తయత్,
తన్యాభరణజాలాని గాత్రశోభీన్యలక్షయత్.

39

సుకృతౌ కర్ణవేష్టౌ చ శ్వదంష్ట్రౌ చ సుసంస్థితౌ,
మణివిద్రుమచిత్రాణి హస్తేష్వాభరణాని చ.

40

శ్యామాని చిరయుక్తత్వాత్తథా సంస్థానవన్తి చ,
తాన్యేవైతాని మన్యేఽహం యాని రామోఽన్వకీర్తయత్.

41

మననము లేకపోవడం వలన మరుగుపడిన విద్యవలె కనిపిస్తున్న ఆమెను చూసిన హనుమంతునికి ఆమె సీతయేనా అనే సందేహం పదేపదే తలెత్త సాగింది.

36

సంస్కారరహితమై (శబ్దవ్యుత్పత్తి లోపించడం) వేరొక పదము యొక్క కచ్చితమైన అర్థాన్ని శ్రమపడి అర్థంచేసుకొన్నట్లు, అలంకారాలు లేకుండా సంస్కారరహితమై కృశించి ఉన్న ఆమెను అతికష్టంమీద సీతగా హనుమంతుడు గుర్తించాడు.

37

విశాల నేత్రములుగల కులీనురాలైన ఆ రాజపుత్రిని నిశితంగా పరికించి యుక్తియుక్తములైన కారణాలచే ఆమెను హనుమంతుడు సీతాదేవిగా ఊహించాడు.

38

సీతాదేవిని గుర్తించడానికి తనకు రాముడు చెప్పిన గుర్తులుగల ఆభరణాలు ఆమె మేని మీద ప్రకాశిస్తూండడాన్ని హనుమంతుడు చూశాడు.

39

హనుమంతుడు ఇలా అనుకొన్నాడు: "సీతాదేవిని గుర్తుపట్టడానికి రాముడు నాకు తెలిపిన ఆభరణాలు ఆమె మేని మీద ప్రకాశిస్తున్నాయి. చక్కగా రూపొందించిన కుండలాలు, శ్వదంష్ట్రాలనే కర్ణాభరణాలు, మణులతో పొగడములతో కూడివున్న విచిత్రాలైన ఆభరణాలు అవి. చాలాకాలం ధరించకపోవడం వలన అవి కాస్త మాసినట్లుగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో వాటిని ధరించక తీసివేయడంతో వాటి గుర్తులు కూడా ఆమె మేని మీద కానవస్తున్నాయి."

40–41

తత్ర యాన్యావహీనాని తాన్యహం నోపలక్షయే,
యన్యస్యా నావహీనాని తానీమాని న సంశయః.

42

పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభమ్,
ఉత్తరీయం నగాసక్తం తదా దృష్టం ప్లవఙ్గమైః.

43

భూషణాని చ ముఖ్యాని దృష్టాని ధరణీతలే,
అనయైవాపవిద్ధాని స్వనవన్తి మహాన్తి చ.

44

"ఋష్యమూక పర్వతం మీదుగా పోతున్నప్పుడు సీతాదేవి జారవిడిచిన ఆభరణాలు ఆమె ఒంటి మీద కానరావడం లేదు. తక్కిన ఆభరణాలు మాత్రమే ఇంకా ఆమె మేని మీద ఉండడం నేను చూస్తున్నాను. దీన్లో ఎటువంటి సందేహమూ లేదు."

42

బంగారంతో రూపొందినదా అన్నట్లున్న పసుపచ్చని మంగళప్రదమై ఒప్పారుతున్న తన ఉత్తరీయాన్ని నాడు సీత జారవిడిచిప్పుడు పర్వతం మీద ఉన్న వానరులు చూశారు.

43

పైనుండి ఆమె పడవేయడంతో చప్పుడు చేస్తూ నేల మీద పడ్డ అమూల్యమైనవి, ప్రధానమైనవి అయిన ఆభరణాలను కూడా వానరులు చూశారు.

44

ఇదం చిరగృహీతత్వాద్వసనం క్లిష్టవత్తరమ్,
తథాఽపి నూనం తద్వర్ణం తథా శ్రీమద్యథేతరత్.

45

ఇయం కనకవర్ణాఙ్గీ రామస్య మహిషీ ప్రియా,
ప్రణష్టాఽపి సతీ యాఽస్య మనసో న ప్రణశ్యతి.

46

ఇయం సా యత్కృతే రామశ్చతుర్భిః పరితప్యతే,
కారుణ్యేనానృశంస్యేన శోకేన మదనేన చ.

47

స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాదాశ్రితేత్యానృశంస్యతః,
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ.

48

అస్యా దేవ్యా యథా రూపమఙ్గప్రత్యఙ్గసౌష్ఠవమ్,
రామస్య చ యథా రూపం తస్యేయమసితేక్షణా.

49

చాలాకాలం నుండి విడువక ధరించడం వలన ఆమె చీర బాగా నలిగిపోయి ఉంది. అయినప్పటికీ దాని రంగు, కాంతి అక్కడ పర్వతం మీద జారవిడిచిన ఉత్తరీయపు రంగుకు, కాంతికి దీటుగా ఉన్నాయి.

45

రావణుడు అపహరించడంతో ఎడబాటు కలిగినప్పటికీ, రాముని మనస్సులో మాత్రం చెక్కుచెదరక నిలచి ఉన్న బంగారు మేనిచాయ గల ఆయన ప్రియ భార్య సీత ఈమే!

46

జాలి, దయ, శోకం, మదనబాధ అనే నాల్గింటిచే రాముడు ఎవరి నిమిత్తం దిగులు చెందుతున్నాడో ఆమె కచ్చితంగా ఈమే! తను పరిరక్షించవలసిన ఆమెను మరొకరు అపహరించడం వల్ల ఆమెపట్ల జాలి, తన మీదనే ఆధారపడి ఉన్నందున దయ, తన భార్య కానరానందున శోకం, తనకు ప్రియురాలవడం వలన మదనబాధ అనే నాలుగింటితో రాముడు పరితపిస్తున్నాడు.

47–48

ఈమె రూపం, అవయవాల పొందిక ఎలా ఉన్నవో, రాముని రూపమూ అవయవాల అమరిక అందుకు తగినట్లే ఉన్నాయి. నల్లని నేత్రాలు గల సీత రూపం రాముని రూపానికి అన్ని విధాలా తగి ఉంది.

49

అస్యా దేవ్యా మనస్తస్మింస్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్,
తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి.

50

దుష్కరం కృతవాన్రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి.

51

దుష్కరం కురుతే రామో య ఇమాం మత్తకాశినీమ్,
సీతాం వినా మహాబాహుర్ముహూర్తమపి జీవతి.

52

ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవనసంభవః,
జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్.

53

ఈమె మనస్సు చెక్కుచెదరక రాముని యందు, ఆ రాముని మనస్సుకూడా సుస్థిరంగా ఈమె యందు నెలకొని ఉండడం వల్లనే వీరిద్దరూ పరస్పరం ఆశతో క్షణమైనా జీవించగలుగుతున్నారు.

50

సీత వియోగ బాధను అనుభవిస్తూ కూడా రాముడు ప్రాణాలు నిలుపుకొని జీవిస్తున్నాడు. అనితరసాధ్యమైన ఇటువంటి కృత్యం చేయడం

ఒక్క రామునికే చెల్లింది.

51

యౌవనంతో అలరారుతున్న సీతను వదలి మహాబాహువైన రాముడు క్షణమైనా జీవించగలుతున్నాడంటే, చేయనలవిగాని పని ఆయన చేస్తున్నాడన్నమాటే!

52

అక్కడ ఉన్న స్త్రీని సీతగా గుర్తించడంతో ఆ వాయునందనుని సంతోషం కట్టలు తెంచుకొంది. అంతే, ఒక్కసారి రాముని మనసారా స్మరించి ఆయన మహత్వాన్ని వేనోళ్ళ కొనియాడి ఆనందించాడు.

53

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 15వ సర్గ సమాప్తం

16వ సర్గ
సీతను గురించి దుఃఖించడం

ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుఙ్గవః,
గుణాభిరామం రామం చ పునశ్చిన్తాపరోఽభవత్.

1

స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః,
సీతామాశ్రిత్య తేజస్వీ హనుమాన్విలలాప హ.

2

మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,
యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః.

3

వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు ప్రశంసనీయురాలైన ఆ సీతాదేవినీ, సుగుణాభిరాముడైన రామునీ శ్లాఘించి మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాడు.

1

పరాక్రమశాలియైన ఆ హనుమంతుడు క్షణకాలం ఈ విధంగా యోచించి, కళ్ళు చెమ్మగిల్లగా సీతను గూర్చి ఇలా అనుకుంటూ విలపించసాగాడు.

2

గురువుల వద్ద సుశిక్షితుడైన లక్ష్మణునకు పూజనీయురాలూ, రాముని

పత్నీ, పెద్దల అభిమానాన్ని చూరగొన్నదీ అయిన సీత ఇలా దుఃఖపీడితురాలై ఉండడం చూస్తే కాలాన్ని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదని కచ్చితంగా తెలుస్తోంది!

3

రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః,
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గఙ్గేవ జలదాగమే.

4

తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్,
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయమసితేక్షణా.

5

తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాన్తామివ శ్రియమ్,
జగామ మనసా రామం వచనం చేదమబ్రవీత్.

6

అస్యా హేతోర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః,
రావణప్రతిమో వీర్యే కబన్ధశ్చ నిపాతితః.

7

విరాధశ్చ హతః సంఖ్యే రాక్షసో భీమవిక్రమః,
వనే రామేణ విక్రమ్య మహేన్ద్రేణేవ శమ్బరః.

8

రాముని కృతనిశ్చయాన్ని, ధీశాలియైన లక్ష్మణుని కర్తవ్య నిష్ఠను బాగుగా ఎరిగినదవడం చేత, వర్షాకాలంలో గంగ పొంగిపొరలుతున్నా కలత చెందనట్లు సీతాదేవి కలవరపాటు చెందడం లేదు.

రామునికి దీటైన శీలము, వయస్సు, ప్రవర్తన, సద్వంశము, ఉత్తమ లక్షణాలు గల సీతకు ఆయనే తగిన భర్త. అదేవిధంగా నల్లని కన్నులు గల ఈ సీత అన్నివిధాలా ఆ రామునికి తగిన భార్య.

5

సరికొత్త బంగారం మల్లే ప్రకాశిస్తూ యావత్తు లోకానికి ప్రీతిపాత్రమైన లక్ష్మీదేవిని పోలి ఉన్న ఆ సీతాదేవిని చూడగానే హనుమంతుడు, రాముని స్మరించి తనలో తాను ఇలా అనుకున్నాడు.

6

విశాలములైన నేత్రాలు సంతరించుకొన్న ఈ సీత కోసమే కదా రాముడు మహాబలశాలయైన వాలిని, పరాక్రమంలో రావణునికి సముడైన కబంధుని సంహరించాడు.

7

దేవేంద్రుడు శంబరాసురుని హతమార్చినట్లు సీత నిమిత్తమే కదా రాముడు అరణ్యంలో జరిగిన యుద్ధంలో భయంకరుడూ, మహాపరాక్రమవంతుడూ అయిన విరాధుడనే రాక్షసుని వధించాడు.

8

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
నిహతాని జనస్థానే శరైరగ్నిశిఖోపమైః.

9

ఖరశ్చ నిహతః సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః,
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా.

10

ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితమ్,
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్.

11

సాగరశ్చ మయా క్రాన్తః శ్రీమాన్ నదనదీపతిః,
అస్యా హేతో ర్విశాలాక్ష్యాః పురీ చేయం నిరీక్షితా.

12

యది రామః సముద్రాన్తాం మేదినీం పరివర్తయేత్,
అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః.

13

జనస్థానంలో రాముడు ఈమె కొరకే కదా అగ్నిజ్వాలలాంటి బాణాలతో భీకరకృత్యాలకు ఒడిగడుతున్న పదునాలుగు వేల రాక్షసులను హతమార్చాడు.

9

ఈ సీత కోసమే కదా సర్వజ్ఞుడైన రాముడు యుద్ధంలో అపరిమిత బలాఢ్యుడైన ఖరుని మరియు దూషణుడు, త్రిశిరస్సు అనే రాక్షసులను అంతంచేశాడు.

10

సులభంగా పొంద శక్యం కానిదీ, లోకంలో మర్యాదామన్ననలను పొందుతున్నదీ అయిన వానర రాజ్యాన్ని ఈమె కారణంగానే కదా సుగ్రీవుడు ప్రాప్తించుకోగలిగాడు.

11

విశాలములైన నేత్రాలు గల ఈ సీతాదేవి నిమిత్తమే కదా శ్రీమంతుడూ, నదీనదాలకు ప్రభువు అయిన సముద్రుని నేను లంఘించి వచ్చి ఈ లంకా నగరాన్ని అన్వేషించాను గదా!

12

ఈ సీతాదేవి కోసమై రాముడు సముద్రపర్యంతం వ్యాపించిన భూమినే కాదు యావత్తు జగత్తును తలక్రిందులు చేసినా సబబేనని అభిప్రాయ పడుతున్నాను.

13

రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్కలామ్.

14

ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః,
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా.

15

ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే,
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః.

16

విక్రాన్త స్యార్యశీలస్య సంయుగేష్వనివర్తినః,
స్నుషా దశరథస్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ.

17

ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః,
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశమాగతా.

18

ముల్లోకాల ఆధిపత్యం గొప్పదా లేక జనకుని కుమార్తెయైన సీత గొప్పదా అని అంచనాకడితే మూడు లోకాలపై రాజ్యాధిపత్యం సీతలో పదహారవ పాలుకు కూడా సరితూగదు.

యజ్ఞక్షేత్రాన్ని నాగలితో దున్నుతున్నప్పుడు పద్మపరాగాల వంటి మంగళకరాలైన ఆ యజ్ఞభూమిలోని పరాగాలచే ఆవృతమైన శరీరంతో భూమిని భేదించుకొని పైకి వచ్చినదీ, ధర్మశీలుడూ మహాత్ముడూ మిథిలాధిపతీ అయిన జనక మహారాజు కుమార్తె, దృఢమైన పాతివ్రత్య వ్రతాన్ని చెక్కుచెదరక పాటిస్తున్నదీ అయిన ఆ సీతాదేవి కచ్చితంగా ఈమే!

15–16

గొప్ప పరాక్రమశాలి, గౌరవించదగిన శీలము గలవాడు, యుద్ధంలో వెనుదీయని వాడు అయిన దశరథ మహారాజుకు కీర్తిమంతురాలైన ఈమె పెద్ద కోడలు.

17

సకల ధర్మాలు తెలిసిన వాడూ, కృతజ్ఞత గలవాడూ, ఆత్మజ్ఞుడూ అయిన రాముని ప్రియపత్నియైన ఈమె ఇప్పుడు రాక్షసస్త్రీలకు వశవర్తియై ఉంది కదా!

18

సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహబలాత్కృతా,
అచిన్తయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్.

19

సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా,
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా.

20

సేయం కనకవర్ణాఙ్గీ నిత్యం సుస్మితభాషిణీ,
సహతే యాతనామేతామనర్థానా మభాగినీ.

21

ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టుమర్హతి రాఘవః,

రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః.

22

అస్యా నూనం పునర్లాభాద్రాఘవః ప్రీతిమేష్యతి,
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్.

23

భర్తపట్ల గల అసామాన్యమైన ప్రేమచే, కర్తవ్య నిష్ఠచే ఈమె సకల భోగాలనూ త్యజించి, కష్టాలను ఏమాత్రం లక్షించక నిర్జరారణ్యానికి వచ్చింది. భర్తను సేవించడంలోనే ఆసక్తి వహించి, పండ్లు కందమూలాలు తినడంతోనే సంతృప్తిచెంది రాజభవనంలో నివసించినట్లే సంతోషాన్ని పొందినది.

19–20

బంగారు మేనిచాయ గలదీ, సదా దరహాసంతో సంభాషించేదీ, శోకం అంటే ఏమిటో ఎరుగనదీ అయిన ఈ సీతాదేవి ఇప్పుడు భరించరాని ఈ యాతనలు అనుభవిస్తున్నది.

21

బాగా దప్పికగొన్న వాడు చలివేంద్రాన్ని చూడగానే దాని మీద విరుచుకుపడే రీతిలో రావణుడు ఈమెను లోబరచుకోవడానికి సదా సన్నద్ధుడై ఉన్నాడు. అయినప్పటికీ తన పాతివ్రత్య ధర్మాన్ని లేశమాత్రంకూడా సడలనివ్వకుండా అంటిపెట్టుకొని ఉన్న ఈమె నిజంగా రామ సంయోగానికి అర్హురాలై విరాజిల్లుతోంది.

22

రాజ్యభ్రష్టుడైన రాజు మళ్ళీ తన రాజ్యాన్ని సముపార్జించుకొన్నప్పుడు ఎంత సంతోషిస్తాడో, ఈ సీతాదేవి మరల లభ్యమవడం వలన రాముడు కూడా తప్పక అంతే సంతోషిస్తాడు.

23

కామభోగైః పరిత్యక్తా హీనా బన్ధుజనేన చ,
ధారయత్యాత్మనో దేహం తత్సమాగమకాంక్షిణీ.

24

నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్,
ఏకస్థహృదయా నూనం రామమేవానుపశ్యతి.

25

భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి,
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే.

26

దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న దుఃఖేనావసీదతి.

27

ఇమామసితకేశాన్తాం శతపత్రనిభేక్షణామ్,
సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః.

28

అన్ని కోరికలు, సుఖాలు విడచి, బంధువులకు దూరమైపోయిన ఆమె రామ సమాగమాన్నే చింతన చేస్తూ, ఆ ఆశతోనే ప్రాణాలు నిలుపుకొంటున్నది.

24

తన చెంతనే ఉన్న రాక్షస స్త్రీల మీదగాని, పుష్పఫల వృక్షాల మీదగాని తన దృష్టిని సారించడం లేదు. ఏకాగ్రచిత్తంతో రాముని మాత్రమే ధ్యానిస్తున్నది. అది నిశ్చయం.

25

స్త్రీలకు సువర్ణరత్నఖచితమైన ఆభరణాలన్నింటి కన్నా భర్తే శ్రేష్ఠమైన ఆభరణం. భూషణార్హయైన ఈ సీత భర్త అనే ఆభరణం చెంత లేనందున శోభించడం లేదు.

26

సీత ఎడబాటుకు దుఃఖంతో శారీరకంగా క్షీణించిపోకుండా ఉన్నాడంటే, ఆ రామప్రభువు ఎవరూ చేయ శక్యంకాని పనిని చేస్తున్నాడనే అనుకోవాలి.

27

నల్లని కేశాలుగల, పద్మపత్రాల వంటి కన్నులు గల, కేవలం సుఖములే అనుభవింపదగిన ఈమె ఇలా దుఃఖంలో ఉండడం చూస్తే నా మనస్సు క్షోభిస్తోంది.

28

క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్,
సా రాక్షసీభిర్వికృతేక్షణాభిః
సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే.

29

హిమహతనలినీవ నష్టశోభా
వ్యసనపరమ్పరయా నిపీడ్యమానా,
సహచరరహితేవ చక్రవాకీ
జనకసుతా కృపణాం దశాం ప్రపన్నా.

30

అస్యా హి పుష్పావనతాగ్రశాఖాః
శోకం దృఢం వై జనయన్త్యశోకాః,

హిమవ్యపాయేన చ మందరశ్మి
రభ్యుత్థితో నైకసహస్రరశ్మిః.

31

సహనంలో భూదేవి వంటిదీ, పద్మాలలాంటి కన్నులు గలదీ, మునుపు రామ లక్ష్మణులచే రక్షించబడినదీ అయిన ఆ సీత ఇప్పుడు వికృతనేత్రాలున్న రాక్షసస్త్రీల నిర్బంధంలో శింశుపావృక్ష మూలమున కూర్చుని ఉన్నది.

29

ఎడతెగని కష్ట పరంపరలతో బాధననుభవిస్తున్న ఈ సీత మంచు దెబ్బ తగిలిన తామరపువ్వు వలె శోభను కోల్పోయి, మగచక్రవాక పక్షిని ఎడబాసిన ఆడచక్రవాకం మల్లే దీనస్థితిలో ఉంది.

30

పుష్పభారంచే వంగిన అశోకవృక్షాలు, మంచు తొలగిపోవడంతో వేలాది కిరణాలతో వెన్నెలను కురిపిస్తూ ప్రకాశిస్తున్న చంద్రుడు, భర్త ఎడబాటుతో దిగులు చెందుతున్న ఈమె శోకాన్ని రెట్టింపు చేస్తున్నట్లున్నాయి.

31

ఇత్యేవమర్థం కపిరన్వవేక్ష్య
సీతేయమిత్యేవ నివిష్టబుద్ధిః,
సంశ్రిత్య తస్మిన్నిషసాద వృక్షే
బలీ హరిణామృషభస్తరస్వీ.

32

బలిష్ఠుడు, వానరశ్రేష్ఠుడు, వేగశాలి అయిన హనుమంతుడు ఈ రకంగా తనకు తోచిన విషయాలన్నింటినీ కూలంకషంగా విశ్లేషించుకుని ఆమెను సీతగానే నిశ్చయించుకొని, ఆ శింశుపా వృక్షం మీదనే తనను మరుగుపరచుకొని యథాప్రకారం కూర్చున్నాడు.

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 16వ సర్గ
సమాప్తం

17వ సర్గ

వికృతరూపిణులైన రాక్షస స్త్రీలు

తతః కుముదషణ్డాభో నిర్మలో నిర్మలం స్వయమ్,
ప్రజగామ సభశ్చన్ద్రో హంసో నీలమివోదకమ్.

1

సాచివ్యమివ కుర్వన్ స ప్రభయా నిర్మల ప్రభః,
చన్ద్రమా రశ్మిభిః శీతైః సిషేవే పవనాత్మజమ్.

2

స దదర్శ తతః సీతాం పూర్ణచన్ద్రనిభాననామ్,
శోకభారైరివ న్యస్తాం భారైర్నావమివామ్భసి.

3

అప్పుడే తెల్లకలువల సమూహం వంటి నిర్మలమూ, కాంతీ గలవాడైన చంద్రుడు, నీలవర్ణపు జలం లోనికి హంస ప్రవేశించినట్లు నిర్మలాకాశంలో ఉదయిస్తూ కనిపించాడు.

1

నిర్మలమైన కాంతిని, చల్లని కిరణాలను ప్రసరింపజేస్తూ సహాయం చేస్తున్నాడా అన్నట్లుగా చంద్రుడు, ఆ హనుమంతుని సేవించసాగాడు.

2

అత్యధిక భారం కారణంగా నీట మునిగిపోతున్న ఓడ మల్లే

శోకభారంచే క్రుంగిపోతున్న, పూర్ణచంద్రునివంటి మోముగల సీతను ఆ చంద్ర కాంతిలో హనుమంతుడు స్పష్టంగా చూడగలిగాడు.

3

దిదృక్షమాణో వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
స దదర్శావిదూరస్థా రాక్షసీర్ఘోరదర్శనాః.

4

ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
అకర్ణాం శఙ్కుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్.

5

అతికాయోత్తమాఙ్గీం చ తనుదీర్ఘశిరోధరామ్,
ధ్వస్తకేశీం తథాకేశీం కేశకమ్బళధారిణీమ్.

6

లంబకర్ణలలాటాం చ లమ్బోదరపయోధరామ్,
లమ్బోష్ఠీం చుబుకోష్ఠీం చ లమ్బాస్యాం లమ్బజానుకామ్.

7

హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా,
కరాలాం భుగ్నవక్త్రాం చ పిఙ్గాక్షీం వికృతాననామ్.

8

వాయునందనుడైన హనుమంతుడు తన దృష్టిని సీత వైపు సారించగా, ఆమె సమీపంలో చూపరులకు భయభ్రాంతులను గొలిపే రాక్షస స్త్రీలు కనిపించారు. ఒంటి కన్నుగల రక్కసిని, ఒక చెవి ఉన్న దానిని, గొడుగుల వంటి చెవులున్న రక్కసిని, చెవులే లేనిది మేకులాంటి చెవులు గల రక్కసిని, తల దాకా ఉబ్బిన ముక్కు ఉన్న రక్కసిని, శరీరానికి మించిన తలగల దానిని, సన్నని పొడవాటి మెడ ఉన్న దానిని, కొద్దిపాటి జుట్టు ఉన్న దానిని, బట్టతల

దానిని, కంబళి మాదిరి అల్లుకున్న జుట్టుగల రక్కసిని, వ్రేలాడే చెవులు, నొసలు గల రాక్షసస్త్రీని, వ్రేలాడుతున్న పొట్ట స్తనములు ఉన్న రక్కసిని, వ్రేలాడుతున్న పెదవులు గడ్డమందు పెదవులు గల రాక్షసస్త్రీలను, వ్రేలాడే ముఖంగలది, వ్రేలాడుతున్న మోకాళ్ళు గలది, పొట్టిది, పొడవైనది, గూనిది, వంకరటింకరగా ఉన్నది, మరుగుజ్జుది, ఎత్తుపళ్ళుగలది, సొట్టముఖం గలది, పచ్చని కళ్ళు గలది, వికృతమైన ముఖం గల రాక్షసస్త్రీలను హనుమంతుడు చూశాడు.

4–8

వికృతాః పిఙ్గలాః కాళీః క్రోధనాః కలహప్రియాఃׁ,
కాలాయసమహాశూలకూట ముద్గరధారిణీఃׁ.

9

వరాహమృగశార్దూల మహిషాజశివాముఖీఃׁ,
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాతశిరసోపరాఃׁ.

10

ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాఃׁ,
గోకర్ణీర్హస్తికర్ణీశ్చ హరికర్ణీస్తథాపరాఃׁ.

11

అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాఃׁ,
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాస నాసికాఃׁ.

12

హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాఃׁ,
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీఃׁ.

13

అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వానఖాస్తథా,

అజాముఖీర్హస్తిముఖీర్గోముఖీ స్సూకరీముఖీః.

14

హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీర్ఘోరదర్శనాః,
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః.

15

కరాళా ధూమ్రకేశీశ్చ రాక్షసీర్వికృతాననాః,
పిబన్తీః సతతం పానం సదా మాంససురాప్రియాః.

16

మాంసశోణితదిగ్ధాఙ్గీర్మాంస శోణిత భోజనాః,
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః,
స్కన్ధవన్తముపాసీనాః పరివార్య వనస్పతిమ్.

17

వికృత రూపాలతో పసుపుపచ్చగా, కారునలుపుగా ఉన్న, కోప స్వభావమూ కలహించే స్వభావమూగల రాక్షస స్త్రీలను హనుమంతుడు చూశాడు. వాళ్ళు పెద్ద శూలములు, గూటములు, ముద్గరాలు చేతపుచ్చుకొని ఉన్నారు. పందుల, లేళ్ళ, పులుల, దున్నపోతుల, మేకపోతుల, ఆడనక్కల ముఖాల వంటి ముఖాలతో ఉన్నారు వాళ్ళు. ఏనుగుల, ఒంటెల, గుర్రాల వంటి పాదాలను పోలి వారి పాదాలున్నాయి. కొందరికి మెడ లేకుండానే తలలు మాత్రం ఉన్నాయి. కొందరికి ఒంటి చెయ్యి, ఒంటి కాలు మాత్రం ఉన్నాయి. గాడిదల, కుక్కల, ఆవుల, ఏనుగుల, సింహాలవంటి చెవులు గల వాళ్ళు కొందరున్నారు. ముక్కు లేని వాళ్ళు, పెద్దముక్కు వాళ్ళు, వంకరటింకర ముక్కు వాళ్ళు, ఏనుగు తొండంవంటముక్కు వాళ్ళు, నుదుటి దాకా సాగివున్న ముక్కు వాళ్ళు ఆ రాక్షస స్త్రీలలో కొందరున్నారు. ఏనుగు పాదాల వాళ్ళు, ఎద్దు పాదాల వాళ్ళు, పాదాల మీద జుట్టు ఉన్న వాళ్ళు కొందరు కనిపించారు.

పెద్ద తలలు పొడవైన మెడలు ఉన్న వాళ్ళు, పెద్ద స్తనాలు పొట్టలు గల వాళ్ళు, విస్తృతించిన నోళ్ళు, కళ్ళు, పొడవైన నాలుక, గోళ్ళు గల వాళ్ళు కొందరు కనిపించారు. మరికొందరు రాక్షసస్త్రీలు ఆడమేకల, ఏనుగుల, ఎద్దుల, ఆడపందుల, గుర్రాల, ఒంటెల, గాడిదల వంటముఖాలను పోలిన ముఖాలతో వికృతంగా కనిపించారు. కోపస్వభావులు, కలహప్రియులు అయిన ఆ రాక్షసాంగనలు పొగరంగు కేశాలతో, భీతిగొల్పుతూ చేతుల్లో శూలాలు, ముద్గరాలు ధరించి ఉన్నారు. వాళ్ళు సదా మద్యపానం చేస్తూ మాంసం తింటూ కనిపించారు. వాళ్ళ దేహాల మీద రక్తమాంసాల మరకలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. చూపరులకు గగుర్పాటు కలిగించే ఆ రాక్షసస్త్రీలు విశాలమైన బోదె ఉన్న ఆ మహావృక్షం చుట్టూ కూర్చుని హనుమంతునికి కనిపించారు.

9–17

తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీమనిన్దితామ్,
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్.

18

కాంతిమంతుడైన ఆ హనుమంతుడు ఆ వృక్షరాజం క్రింద రాజపుత్రీ, జనకుని కుమార్తె, దోషరహితా అయిన సీతాదేవిని చూశాడు.

18

నిష్ప్రభాం శోకసన్తప్తాం మలసంకులమూర్ధజామ్,
క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ.

19

చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్,
భూషణైరుత్తమైర్హీనాం భర్తృవాత్సల్యభూషణామ్.

20

రాక్షసాధిపసంరుద్ధాం బంధుభిశ్చ వినాకృతామ్,
వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ.

21

చన్ద్రరేఖాం పయోదాన్తే శారదాభ్రైరివావృతామ్,
క్లిష్టరూపామసంస్పర్శాదయుక్తామివ వల్లకీమ్.

22

దుఃఖంచే తపిస్తున్నదీ, శోభా విహీనురాలైనదీ, సంస్కారరహితం కావడంతో మాలిన్యంతో కూడిన కేశాలు గలదీ అయిన ఆ సీతాదేవి పుణ్యం క్షీణించగా నేలకొరిగిన నక్షత్రం చందాన ఉన్నది.

19

పతివ్రతాధర్మాన్ని తు.చ.తప్పక పాటించడంతో కీర్తి సంపన్నురాలైన సీతాదేవి, భర్త దర్శన విషయంలో మాత్రం దరిద్రురాలై (భర్తృదర్శనం కరవై) ఉన్నది. శ్రేష్ఠములైన భూషణాలు ఏవీ లేని సీతాదేవికి భర్త ప్రేమ ఒక్కటే అలంకారంగా విరాజిల్లుతోంది.

20

రాక్షసరాజైన రావణునిచే చెరపట్టబడి బంధువులకు దూరమైన ఆ సీతాదేవి, తన గుంపును ఎడబాసి సింహముచే అడ్డగింపబడి బంధింపబడిన ఆడ ఏనుగు వలె ఉన్నది.

21

వర్ష ఋతువు అనంతరం శరత్కాల మేఘాలచే ఆవరించిన చంద్రరేఖ మల్లే ఉన్న సీతాదేవిని హనుమంతుడు చూశాడు. స్నానాది దేహ సంస్కారాల లోటుచే కాంతివిహీనమైన రూపంతో, తీగలు సారించని వీణలా సీతాదేవి హనుమంతునకు అగపడినది.

22

సీతాం భర్తృవశే యుక్తామయుక్తాం రాక్షసీవశే,
అశోకవనికామధ్యే శోకసాగరమాప్లుతామ్.

23

తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్,
దదర్శ హనుమాన్ దేవీం లతామకుసుమా మివ.

24

సా మలేన చ దిగ్ధాఙ్గీ వపుషా చాప్యలంకృతా,
మృణాలీ పఙ్కదిగ్ధేవ విభాతి న విభాతి చ.

25

మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్,
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్ కపిః.

26

తాం దేవీం దీనవదనా మదీనాం భర్తృతేజసా,
రక్షితాం స్వేన శీలేన సీతామసితలోచనామ్.

27

భర్త సమక్షంలో మాత్రమే ఉండదగిన ఆ సీతాదేవి ఇప్పుడు భరించనలవిగాని రాక్షసస్త్రీల అజమాయిషీలో ఆ అశోకవన మధ్యంలో శోకసాగరంలో మునిగి ఉంది. పువ్వులతో నిండుగా ఉన్న లతను పోలిన ఆ సీతాదేవి ఇప్పుడు రాక్షసస్త్రీలు చుట్టూ ఉండడంతో దుష్టగ్రహాలచే పరివేష్టింపబడిన రోహిణీ నక్షత్రం స్థాయికి క్షయీకరించినట్లుగా హనుమంతునికి కానవచ్చింది.

23–24

అలంకారాలు లేకుండానే సహజ సౌందర్యరాశియైన ఆ సీతాదేవి మాలిన్యంతో నిండి ఉన్న దేహంచే బురదతో కూడిన తామర కాడవలె ఒక

వంక ప్రకాశిస్తూ మరోవంక ప్రకాశింపక ఉంది.

25

అతిలోక సౌందర్యవతియైన సీతాదేవి మలినమై నలిగి ఉన్న వస్త్రమును దాల్చి ఉంది. లేడిపిల్ల కన్నులవంటి కన్నులున్న ఆమె ముఖారవిందం దీనంగా ఉంది. భర్త పరాక్రమాన్ని తలచుకొని నల్లని నేత్రాలు గల ఆ సీతాదేవి దైన్యము చెందక ధైర్యం వహించింది. తన పాతివ్రత్యంచే తనను రక్షించుకొంటున్న సీతాదేవిని హనుమంతుడు చూశాడు.

26–27

తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్,
మృగకన్యామివ త్రస్తాం వీక్షమాణాం సమన్తతః.

28

దహన్తీమివ నిశ్శ్వాసైర్వృక్షాన్ పల్లవధారిణః,
సంఘాతమివ శోకానాం దుఃఖస్యోర్మిమివోత్థితామ్.

29

తాం క్షమాం సువిభక్తాఙ్గీం వినాభరణశోభినీమ్,
ప్రహర్షమతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీమ్.

30

హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్,
ముమోచ హనుమాంస్తత్ర నమశ్చక్రే చ రాఘవమ్.

31

నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యాన్,
సీతాదర్శన సంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్.

32

లేడిపిల్ల కళ్ళవంటి కన్నులున్న ఆ సీతాదేవి భీతిచెందిన ఆడలేడి పిల్లలా బెదరు చూపులు ప్రసరింపజేస్తున్నది. చిగిర్చిన చెట్లను తన వేడి నిట్టూర్పులతో దహిస్తున్నట్లుంది. శోకాల సమూహం మల్లే, ఉవ్వెత్తున పైకిలేచిన దుఃఖతరంగం వలె ఉన్న ఆ సీతాదేవిని హనుమంతుడు చూశాడు.

28–29

ఆభరణములు ధరింపకున్నా శోభిస్తున్నది, సహనంలో సాక్షాత్తూ భూదేవిని పోలినది, పొందికయైన అవయవములుగలది అయిన ఆ సీతాదేవిని చూసి హనుమంతుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు.

30

ఆకర్షణీయమైన నేత్రాలు గల ఆ సీతాదేవిని చూసిన హనుమంతుని కళ్ళ వెంట ఆనందాశ్రువులు స్రవించాయి. వెంటనే అతడు రామునికి మానసికంగా నమస్కరించాడు.

31

సీతా సందర్శనంతో పరాక్రమశాలియైన ఆ హనుమంతుడు ఆనందభరితుడై రామలక్ష్మణులకు మానసిక ప్రణామాలు చేసి, ఆ శింశుపావృక్షం మీద ఆకుల చాటున ఇతరులకు కనబడకుండా నక్కిదాక్కున్నాడు.

32

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 17వ సర్గ

సమాప్తం

18వ సర్గ

రావణుని రాక

తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్,
విచిన్వతశ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశాభవత్.

1

షడఙ్గవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్,
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసామ్.

2

అథ మఙ్గలవాదిత్రశబ్దైః శ్రోత్రమనోహరైః,
ప్రాబుధ్యత మహాబాహుర్దశగ్రీవో మహాబలః.

3

విరగబూసిన వృక్షాలు గల ఆ అశోక వనాన్ని పరికిస్తూ సీతాదేవి కోసం హనుమంతుడు అన్వేషిస్తూ ఉండగా రాత్రి దాదాపు ముగిసిపోయి తెల్లవారసాగింది.

1

ఆ తెల్లవారుజామున షడంగములతోడి వేదములను ఆపోసనపట్టిన వారూ, శ్రేష్ఠములైన యాగములను నిర్వర్తించడంలో నిష్ణాతులూ అయిన బ్రహ్మరాక్షసుల (బ్రాహ్మణత్వము గల రాక్షసులు) వేదఘోషలను హనుమంతుడు ఆలకించాడు.

2

ఈలోపు చెవులకు ఇంపుగొలిపే మంగళవాద్య ధ్వనులతో పెద్ద బాహువులు గలవాడూ, మహాబలుడూ అయిన రావణుని మేల్కొల్పారు.

3

విబుధ్య తు యథాకాలం రాక్షసేన్ద్రః ప్రతాపవాన్,
ప్రస్తమాల్యామ్బరధరో వైదేహీమన్వచిన్తయత్.

4

భృశం నియుక్తస్తస్యాం చ మదనేన మదోత్కటః,
న స తం రాక్షసః కామం శశాకాత్మని గూహితుమ్.

5

స సర్వాభరణైర్యుక్తో బిభ్రచ్ఛ్రియమనుత్తమామ్,
తాం నగైర్బహుభిర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః.

6

వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్,
సదామదైశ్చ విహగైర్విచిత్రాం పరమాద్భుతామ్.

7

ఈహామృగైశ్చ వివిధైర్జుష్టాం దృష్టిమనోహరైః,
వీథీః సంప్రేక్షమాణశ్చ మణికాఞ్చనతోరణాః.

8

నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితైర్వృతామ్,
అశోకవనికామేవ ప్రావిశత్సంతతద్రుమామ్.

9

నిద్రావశంచే జారిన మాలికలు, వస్త్రములు గలవాడూ, ప్రతాపశాలీ

అయిన ఆ రాక్షసరాజు కాలానుగుణంగా మేల్కొని, అప్పుడు సీతను గురించి తలచాడు.

4

సీత పట్ల అత్యంత వ్యామోహితుడైన ఆ రాక్షసుడు, ఆమె విషయంలో మన్మథ ప్రేరణచే కలిగిన కామాతిరేకాన్ని అదుపు చేసుకోలేకపోయాడు.

5

సర్వాభరణాలను ధరించి సాటిలేని శోభతో విలసిల్లుతూ ఉన్న రావణుడు సమస్త పుష్పములతోనూ, ఫలములతోనూ కూడిన వృక్షములు గల ఆ అశోకవనం లోనికి ప్రవేశించాడు.

6

అనేక రకములైన పుష్పములతో, అక్కడక్కడ తామరలు నిండి ఉన్న సరస్సులతో ఆ అశోకవనం శోభాయమానంగా అలరారుతున్నది. సదాసర్వవేళల సంచరించే మత్తిల్లిన పక్షులతో చూడముచ్చటగా ఆ వనం చూపరులకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

7

చూడముచ్చట గొలిపే ఈహామృగములతోను (కృత్రిమ తోడేళ్ళు), తదితర మృగములతోను ఆ వనం ఇనుమడించిన సొబగులు సంతరించుకున్నది. దట్టమైన చెట్లనుండి రాలిన పండ్లతో నేల ఈనినట్లు కానవస్తోంది. అటువంటి అశోకవనంలోనికి మణులు పొదగిన బంగారు తోరణాలున్న ఉద్యాన వీథులను పరికిస్తూ రావణుడు ప్రవేశించాడు.

8–9

అజ్ఞనాశతమాత్రం తు తం వ్రజన్తమనువ్రజత్,
మహేన్ద్రమివ పౌలస్త్యం దేవగన్ధర్వయోషితః.

10

దీపికాः కాఞ్చనీः కాశ్చిజ్జగృహుస్తత్ర యోషితः,
వాలవ్యజనహస్తాశ్చ తాలవృన్తాని చాపరాः.

11

కాఞ్చనైరపి భృఙ్గారైర్జహ్రుः సలిలమగ్రతः,
మణ్డలాగ్రాన్ బ్రసీం చైవ గృహ్యాన్యాः పృష్ఠతో యయుः.

12

కాచిద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ,
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా.

13

దేవకాంతలు, గంధర్వాంగనలు దేవేంద్రుని అనుసరించి వెళ్ళిన తీరులో పులస్త్య వంశజుడైన ఆ రావణుని వెంబడించి నూరుమంది యువతులు రాసాగారు.

10

ఆ స్త్రీలలో కొందరు స్వర్ణదీపికలను, మరికొందరు చారమములను, కొందరు విసనకర్రలను చేతపుచ్చుకుని రావణుని అనుసరించారు.

11

కొందరు స్త్రీలు బంగారు పాత్రలనిండా జలం నింపుకొని రావణుని ముందు నడవసాగారు. మరికొందరు కత్తులు పట్టుకొని, తివాచీలు పుచ్చుకుని రాజు వెనుక వస్తున్నారు.

12

నేర్పరియైన ఒక యువతి మద్యం నిండిన మణిమయ పాత్రను కుడిచేత్తో పుచ్చుకుని రావణునికి కుడి వైపు నడుస్తూ అనుసరించి రాసాగింది.

13

రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభమ్,
సౌవర్ణదణ్డమపరా గృహీత్వా పృష్ఠతో యయౌ.

14

నిద్రామదపరీతాక్ష్యో రావణస్యోత్తమాః స్త్రియః,
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ.

15

వ్యావిద్ధహార కేయూరా స్సమామృదిత వర్ణకాః,
సమాగళితకేశాన్తాః సస్వేదవదనాస్తథా.

16

ఘూర్ణన్త్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః,
స్వేదక్లిష్టాఙ్గకుసుమాః సుమాల్యాకులమూర్ధజాః.

17

ప్రయాన్తం నైరృతపతిం నార్యో మదిరలోచనాః,
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యాస్తమన్వయుః.

18

మరో స్త్రీ బంగారు దండం గల, పూర్ణచంద్రుని కాంతితో సమానమైన రాజహంస వలె ఉన్న ఛత్రాన్ని పట్టుకుని రావణుని వెనుకనే రాసాగింది.

14

నిద్ర వలనా, మద్యం మత్తువల్లా ఎర్రబారిన కన్నులు గల రావణుని భార్యలు మెరపుతీగలు మేఘాన్ని అనుసరించే తీరులో అతడి వెంట వచ్చారు.

15

ఆ స్త్రీలు ధరించిన కంఠ హారములు, బాహుపురులు స్థానభ్రంశములై ఉన్నాయి. శరీరం మీద అలదుకొన్న అంగరాగాలు దాదాపుగా చెరిగిపోయి

ఉన్నాయి. వారి శిరోజాల ముడులు వదులైపోయాయి. వారికి చెమట పట్టడంతో, ముఖాలమీద స్పష్టంగా చెమట బిందువులు కానవస్తున్నాయి. చెదరిన కేశములను తాజా పువ్వులతో అలంకరించుకొని ఉన్నారు. మద్యపాన మత్తు వలన, నిద్రచేత వారు తూలిపోతున్నారు. రావణుని ప్రియ భార్యలైన ఆ స్త్రీలు అతడి పట్ల గల గౌరవము వలన, మదనపారవశ్యం వల్లా అతణ్ణి ఆ విధంగా అనుసరిస్తూ అశోకవనం లోనికి వచ్చారు.

16–18

స చ కామపరాధీనః పతిస్తాసాం మహాబలః,
సీతాసక్త మనా మన్దో మదాఞ్ఛితగతిర్బభౌ.

19

తతః కాఞ్చీనినాదం చ నూపురాణాం చ నిస్వనమ్,
శుశ్రావ పరమస్త్రీణాం స కపిర్మారుతాత్మజః.

20

తం చాప్రతిమకర్మాణమచిన్త్యబలపౌరుషమ్,
ద్వారదేశమనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః.

21

దీపికాభిరనేకాభిః సమన్తాదవభాసితమ్,
గన్ధతైలావసిక్తాభిర్ధియమాణాభిరగ్రతః.

22

కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్,
సమక్షమివ కన్దర్పమపవిద్ధశరాసనమ్.

23

ఆ అందరి స్త్రీలకు భర్త, మహాబలుడు అయినప్పటికీ ఆ రావణుడు, సీతపట్ల గల తీవ్ర వ్యామోహంతోను, కరడుగట్టిన కామంతోను అహమూ,

ఆత్మగౌరవమూ ప్రదర్శించే తీరులో నడుస్తూ వచ్చాడు.

19

అప్పుడు వాయునందనుడైన ఆ హనుమంతునికి ఆ ఉత్తమ వనితల వడ్డాణముల చిరుగజ్జెల, అందెల ధ్వనులు వినిపించాయి.

20

అనితరసాధ్యములైన కార్యాలు సాధించగలవాడూ, ఊహాతీతమైన బలపౌరుషములు గలవాడూ అయిన ఆ రావణుని అశోకవన ద్వార ప్రవేశం చేస్తూండగా హనుమంతుడు చూశాడు.

21

పరిమళించే తైలములతో తడుపబడిన అనేక దీపికలను రావణుని ముందు పట్టుకుని తీసుకుపోతున్నారు. నలువంకలా ప్రసరిస్తున్న ఆ దీపికల కాంతిలో అతడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు.

22

మదన తాపం, దర్పం, మత్తు కలిగిన వంకరగాను ఎర్రగాను ఉన్న విశాలములైన కన్నులుగల ఆ రావణుడు తన విల్లు అయిన చెరకుగడను విడిచి వచ్చిన మన్మథునిలా కానవచ్చాడు.

23

మథితామృతఫేనాభ మరజోవస్త్రముత్తమమ్,
సలీలమనుకర్షన్తం విముక్తం సక్తమఙ్గదే.

24

తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః,
సమీపమివ సంక్రాన్తం నిధ్యాతుముపచక్రమే.

25

అవేక్షమాణస్తు తతో దదర్శ కపికుఞ్జరః,
రూపయౌవనసంపన్నా రావణస్య వరస్త్రియః.

26

తాభిః పరివృతో రాజా సురూపాభిర్మహాయశాః,
తన్మృగద్విజసంఘుష్టం పవిష్టః ప్రమదావనమ్.

27

క్షీబో విచిత్రాభరణః శఙ్కకర్ణో మహాబలః,
తేన విశ్రవసః పుత్రః స దృష్టో రాక్షసాధిపః.

28

వృతః పరమనారీభిస్తారాభిరివ చన్ద్రమాః,
తం దదర్శ మహాతేజాస్తేజోవన్తం మహాకపిః.

29

మథించిన అమృతం నురుగు వంటి తెల్లనైన, స్వచ్ఛమైన మేలైన వస్త్రము జారి భుజకీర్తులలో తగుల్కొనగా, దానిని విలాసంగా మీదికి లాగికొంటూ నడచివస్తున్న రావణుని, హనుమ చూశాడు.

24

హనుమంతుడు ఆ శింశుపా వృక్షపు కొమ్మల చాటున, ఆకుల పువ్వులచే తనను బాగా మరుగుపరచుకొని దగ్గరగా వస్తున్నట్లు కనిపిస్తున్న ఆ రావణుని నిదానించి చూడసాగాడు.

25

అలా రావణుని పరికిస్తున్న వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు రూపయౌవన సంపన్నులైన ఆ రావణుని ఉత్తమ కాంతలను కూడా పరికించి చూశాడు.

26

గొప్ప యశస్సు గల ఆ రావణుడు ఆ సుందరాంగనలతో కలసి మృగముల, పక్షుల మధుర ధ్వనులతో ఒప్పారే ఆ ప్రమదావనంలోనికి (అంతఃపురస్త్రీలు విహరించే వనం – అశోకవనం) ప్రవేశించాడు.

27

మధుపానంచే మత్తెక్కిన వాడూ, విచిత్రమైన ఆభరణాలు ధరించిన వాడూ, శంకువు మాదిరి నిక్కబొడుచుకున్న చెవులు గల వాడూ, మహాబలశాలీ, విశ్వవసుని పుత్రుడూ, రాక్షసులకు ప్రభుమా అయిన రావణుని, హనుమంతుడు చూశాడు. నక్షత్రాలచే పరివేష్టితుడైన చంద్రుని మల్లే ఉత్తమ స్త్రీలతో కూడి ఉన్న తేజస్వియైన ఆ రావణుని మహాతేజస్వియైన హనుమంతుడు చూశాడు.

28–29

రావణోఽయం మహాబాహురితి సంచిన్త్య వానరః,
అవప్లుతో మహాతేజా హనుమాన్మారుతాత్మజః.

30

స తథాప్యుగ్రతేజాః సన్నిర్ధూతస్తస్య తేజసా,
పత్రగుహ్యాన్తరే సక్తో హనుమాన్ సంవృతోఽభవత్.

31

స తామసితకేశాన్తాం సుశ్రోణీం సంహతస్తనీమ్,
దిదృక్షురసితాపాఙ్గాముపావర్తత రావణః.

32

మహాతేజస్వీ, వాయుపుత్రుడూ అయిన హనుమంతుడు ‘ఇతడే మహాబాహువు అయిన రావణుడు’ అని భావించి, అతణ్ణి మరింత నిశితంగా పరికింప తానున్న కొమ్మ మీద నుండి క్రింది కొమ్మకు దిగాడు.

30

స్వయంగా తానే మహాతేజశ్శాలి అయినప్పటికీ ఆ రావణుని తేజోవిభవాన్ని చూసి హనుమంతుడు ఒకింత ఆందోళనకు గురియై ఆ చెట్టు ఆకులతో తనను మరింత మరుగుపరచుకున్నాడు.

31

నల్లని కేశములు, ముచ్చటగొలిపే కటిప్రదేశం, పరస్పరం ఒరసుకొంటున్న స్తనములు, నల్లని కనుకొనలు గల సీతాదేవిని చూడాలనే కోర్కెతో రావణుడు ఆమెను సమీపించాడు.

32

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 18వ సర్గ

సమాప్తం

19వ సర్గ
సీత దురవస్థ

తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిన్దితా,
రూపయౌవన సంపన్నం భూషణోత్తమ భూషితమ్.

1

తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్,
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా.

2

ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాం చ పయోధరౌ,
ఉపవిష్టా విశాలాక్షీ రుదన్తీ వరవర్ణినీ.

3

రూపయౌవన సంపన్నుడూ, అమూల్యమైన ఆభరణాలు ధరించిన వాడూ అయిన ఆ రాక్షసరాజును (రావణుని) అల్లంత దూరంలో చూడగానే జనకరాజనందనా, దోషరహితా, అందమైన కటిప్రదేశం గలదీ అయిన సీత పెనుగాలిలో ఊగులాడే అరటిచెట్టులా గజగజ వణకిపోయింది.

1–2

విశాల నయనాలూ, శ్రేష్ఠమైన మేనిచ్ఛాయా గల ఆ సీత భయంతో తన తొడలతో పొట్టను, చేతులతో స్తనములను కప్పుకొని ముడుచుకొని కూర్చుని విలపించసాగింది.

3

దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః,
దదర్శ సీతాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే.

4

అసంవృతాయామాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్,
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః.

5

మలమణ్డన చిత్రాఙ్గీం మణ్డనార్హామ మణ్డితామ్,
మృణాలీ పఙ్కదిగ్ధేవ విభాతి న విభాతి చ.

6

సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః,
సఙ్కల్పహయసంయుక్తైర్యాన్తీమివ మనోరథైః.

7

శుష్యన్తీం రుదతీమేకాం ధ్యానశోకపరాయణామ్,
దుఃఖస్యాన్తమపశ్యన్తీం రామాం రామమనువ్రతామ్.

8

విదేహరాజు పుత్రిక, రాక్షసస్త్రీల కావలిలో ఉన్నది, దుఃఖంచే పీడితయైనది, సముద్ర మధ్యంలో ప్రమాదంలో చిక్కుకున్న నావవలె ఉన్నది అయిన ఆ సీతను, రావణుడు చూశాడు.

4

కఠోర పాతివ్రత్య నియమాన్ని పాటిస్తూన్న సీతాదేవి నరికివేయడంచే నేలబడిన మహావృక్షపు కొమ్మలా కటిక నేలపై కూర్చుని ఉన్నది.

5

అలంకరణలకు ఏకైక అర్హురాలైనప్పటికీ అలంకారరహితయై ఉన్న సీతాదేవి మాలిన్యమనే అలంకారాన్ని ధరించి ఉంది. బురదతో కూడిన తామరతూడు వలె ఆమె ప్రకాశించీ ప్రకాశింపనిదై కానవస్తోంది.

6

సంకల్పాలనే గుర్రాలు పూన్చిన మనోరథాలనే రథాన్ని అధిరోహించి రాజశ్రేష్ఠుడూ సర్వజ్ఞుడూ అయిన రాముని వద్దకు సీత వెళుతున్నదా అన్నట్లున్నది.

7

రామవియోగ దుఃఖానికి అంతం కానరాకపోవడంతో, సదాసర్వవేళలా విలపిస్తూ, కుంగిపోతూ ఒంటరియై రాముని మీదనే మనస్సును నిలిపి ఆ సీతాదేవి శుష్కించిపోయింది.

8

వేష్టమానాం తథావిష్టాం పన్నగేన్ద్రవధూమివ,
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా.

9

వృత్తశీలకులే జాతామాచారవతి ధార్మికే,
పునఃసంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే.

10

అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ,
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ.

11

సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితామ్,
పూజామివ పరిక్షీణామాశాం ప్రతిహతామివ.

12

ఆయతీమివ విధ్వస్తామాజ్ఞాం ప్రతిహతామివ,
దీప్తామివ దిశం కాలే పూజామపహృతామివ.

13

మణిమంత్రాది ప్రభావంచే కట్టువడి చుట్టచుట్టుకొని ఉన్న ఆడుసర్పంవలె, ధూమకేతువనే (ధూమం) గ్రహంచే దిక్కుతోచని స్థితిలో ఉన్న రోహిణీ నక్షత్రం మల్లే ఆ సీత కనబడుతోంది.

9

సదాచారమూ, ధర్మతత్పరతా, కులీనమూ అయిన వంశంలో జన్మించి, అంతకు దీటైన ఉత్తమ వంశములో వివాహసంస్కారం ద్వారా ప్రవేశించిన ఆ సీతాదేవి ఇప్పుడు నిమ్నమైన, పేదరికం తాండవించే వంశ సంజాతగా కనబడుతున్నది.

10

కల్పితమైన అపవాదు వలన పతనమైన కీర్తివలె, మననము లేనందున నిష్ఫలమైన విద్య చందాన ఆ సీత ఇప్పుడు ఉన్నది.

11

క్షీణించిన యశస్సులా, వమ్మయిన నమ్మకంలా, పూజాద్రవ్యాలు లోటైన పూజ వలె, నిష్ఫలమైన ఆశ మల్లే ఆ సీతాదేవి కానవస్తున్నది.

12

తప్పక వస్తుందని ఎదురుచూస్తున్న ధనలబ్ధి రాకుండాపోయిన చందాన, శిరసావహింపబడని ఆజ్ఞలా, ఉత్పాత సమయంలో జ్వలిస్తున్న దిక్కువలె, సకాలంలో నిర్వర్తించబడని పూజవలె సీతాదేవి ఉన్నది.

13

పద్మినీమివ విధ్వస్తాం హతశూరాం చమూమివ,
ప్రభామివ తమోధ్వస్తామపక్షీణామివాపగామ్.

14

వేదీమివ పరామృష్టాం శాన్తామగ్నిశిఖామివ,
పౌర్ణమాసీమివ నిశాం రాహుగ్రస్తేన్దుమణ్డలామ్.

15

ఉత్కృష్టపర్ణకమలాం విత్రాసితవిహఙ్గమామ్,
హస్తిహస్తపరామృష్టామాకులాం పద్మినీమివ.

16

పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ,
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశామివ.

17

కాలరాచిన తామరతీగమల్లే, శూరులు నేలకొరిగిన సేనవలె, చీకట్లు ఆవరించిన కాంతివలె, ఎండిపోయిన నదీప్రవాహం వలె సీత పేలవంగా కనబడుతున్నది.

14

అపవిత్రుల స్పర్శచే పవిత్రతను కోల్పోయిన యజ్ఞవేదికను, శమించిన అగ్ని జ్వాలను, రాహువు కబళించిన పున్నమినాటి చంద్రమండలాన్ని పోలి ఉంది సీత.

15

ఏనుగు తొండంతో ఆకులను, తామరలను చెల్లాచెదరుచేసి ధ్వంసం చేయడంతో పక్షులన్నీ భయపడి పారిపోయిన వెలవెలబోయిన తామరకొలను చందాన్ని ఆ సీతాదేవి తలపుకు తెస్తోంది.

16

భర్త వియోగ దుఃఖంతో పీడితురాలై, శ్రేష్ఠ శరీర సంస్కారరాహిత్యంతో

ఉన్న ఆ సీతాదేవి, మరొక చోటుకు నీరు పారించడంతో ఎండిపోయిన నదిలా కృష్ణపక్ష రాత్రిని పోలి ఉన్నది.

17

సుకుమారీం సుజాతాఙ్గీం రత్నగర్భగృహోచితామ్,
తప్యమానామివోష్ణేన మృణాలీమచిరోద్ధృతామ్.

18

గృహీతామాళితాం స్తమ్భే యూథపేన వినాకృతామ్,
నిఃశ్వసన్తీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ.

19

ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానామయత్నతః,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ.

20

ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ,
పరిక్షీణాం కృశాం దీనామల్పాహారాం తపోధనామ్.

21

కోమలమైన మరియు సుందరమైన అవయవాలతో విరాజిల్లుతూ, మణిమయ సౌధాలలో మాత్రమే నివసింపతగ్గ ఆ సీతాదేవి అప్పుడు పెకలించివేయబడడంతో ఎండవేడిమికి కమిలిపోతున్న తామరతూడులా కానవచ్చింది.

18

వేటగాండ్రు పట్టుకుని గజరాజును దూరంగా తీసుకుపోయి స్తంభానికి బంధించగా నిట్టూరుస్తూ ఎంతో దుఃఖిస్తున్న ఆడ ఏనుగు స్థితిని సీత తలపుకు తెస్తున్నది.

19

తైలసంస్కారాదులు లేకున్నప్పటికీ అప్రయత్నంగా అమరిన పొడవైన నల్లటి ఒంటి జడతో శోభయమానంగా ఉన్న ఆ సీత వర్షాకాలం ముగిసిన పిదప నల్లని వృక్షముల వరుసచే శోభిల్లే భూమిలా కానవస్తున్నది.

20

ఉపవాసంచేత, దుఃఖంచేత, ఆలోచనచేత, భయంచేత కుంగి కృశించి దైన్యావస్థలో ఉంది సీత. ప్రాణాలు నిలుపుకోవడానికి స్వల్పాహారం మాత్రమే తీసుకొంటూ రామధ్యానం అనే మహాతపస్సులో ఆమె మునిగి ఉంది.

21

ఆయాచమానం దుఃఖార్తాం ప్రాఞ్జలిం దేవతామివ,
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్.

22

సమీక్షమాణాం రుదతీమనిన్దితాం
సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనామ్,
అనువ్రతాం రామమతీవ మైథిలీం
ప్రలోభయామాస వధాయ రావణః.

23

దుఃఖపీడితయై రఘువంశ రాజులలో శ్రేష్ఠుడైన రాముని చేతుల్లో రావణునకు పరాభవం కలిగేటట్లు అంజలి ఘటించి తన ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నట్లుగా సీత ఉంది.

22

చక్కని రెప్పలు, కొనలందు ఎరుపుదనం, మధ్య తెల్లనైన విశాల నేత్రములు గల, దోషరహితయై సదా విలపిస్తూ, రాముని మీద మాత్రమే ఆధారపడి ఉన్న ఆ సీతాదేవి భయంతో నలువంకలా చూస్తున్నది. అట్టి మిథిల రాకుమారియైన సీతాదేవిని తన వశంకమ్మని రావణుడు వేధిస్తున్నాడు.

చివరికి తన చావుకు దారితీయబోయే కోర్కెను అతడు కోరుతున్నాడు.

23

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 19వ సర్గ
సమాప్తం

20వ సర్గ

రావణుడు సీతను ప్రలోభపెట్టడం

స తాం పరివృతాం దీనాం నిరానన్దాం తపస్వినీమ్,
సాకారైర్మధురైర్వాక్యైర్న్యదర్శయత రావణః.

1

మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరమ్,
ఆదర్శనమివాత్మానం భయాన్నేతుం త్వమిచ్ఛసి.

2

కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే,
సర్వాఙ్గగుణసంపన్నే సర్వలోకమనోహరే.

3

సంతోషంలేని దయనీయ స్థితిలో రాక్షస స్త్రీల కాపలాలో ఉన్న ఆ సీతాదేవికి హావభావచేష్టలతో కూడిన మధురమైన మాటలతో రావణుడు తన మనోగతాన్ని వ్యక్తం చేయసాగాడు.

1

ఏనుగు తొండంవంటి ఊరువులు గల సీతా! నన్ను చూసి భయంతో స్తనములను, ఉదరాన్ని (కడుపు) కప్పుకొని నా చూపుల నుంచి నిన్ను ఎందుకు మరుగుపరచుకోవాలనుకుంటున్నావు.

2

విశాలమైన కన్నులతో, సర్వాంగ సౌందర్య సంపత్తితో సర్వుల మనస్సులలో వ్యామోహం పుట్టించే ఓ సీతా! నేను నిన్ను వాంఛిస్తున్నాను. నా ఈ విన్నపానికి సానుకూలంగా స్పందించు.

3

నేహ కేచిన్మనుష్యా వా రాక్షసాः కామరూపిణः,
వ్యపసర్పతు తే సీతే భయం మత్తः సముత్థితమ్.

4

స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయः,
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా.

5

ఏవం చైతదకామాం తు న త్వాం స్పృక్ష్యామి మైథిలి,
కామం కామः శరీరే మే యథాకామం ప్రవర్తతామ్.

6

దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే,
ప్రణయస్య చ తత్త్వేన మైవం భూः శోకలాలసా.

7

ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలినమమ్బరమ్,
అస్థానేఽప్యుపవాసశ్చ నైతాన్యౌపయికాని తే.

8

ఓ సీతా! నీకు భయం కలిగించే మనుష్యులుగాని, కామరూపులైన రాక్షసులుగాని ఎవరూ ఇక్కడ లేరు. ఇకపోతే నీ పట్ల ఇష్టం ఉన్న నా వలన కూడా నువ్వు భయం లేకుండా నిశ్చింతగా ఉండవచ్చు.

భయస్థురాలైన ఓ సీతా! పరస్త్రీలను బలాత్కారంగా అపహరించి తేవడమూ, వారిని రమించడమూ రాక్షసుల ధర్మంగా పరిగణించబడుతోంది. కనుక నేను చేసిన పనిని అధర్మంగా భావించకు.

5

రాక్షసుల ధర్మం ఆ రీతిలో ఉన్నప్పటికీ, కామం నా శరీరాన్ని ఎంతగా పీడిస్తున్నప్పటికీ నీ అంగీకారం లేకుండా ససేమిరా నిన్ను తాకను.

6

ఓ దేవీ! ఈ విషయంలో నువ్వు ఎటువంటి భయానికి గురి కానక్కర్లేదు. ఓ ప్రేయసీ! నన్ను నమ్ము, మనస్ఫూర్తిగా నన్ను ప్రేమించు. ఇకపై ఇలా శోకిస్తూ కాలాన్ని వృథాచేయకు.

7

కేశసంస్కారం లేని ఒంటి జడ, కటిక నేల మీద పరుండడం, అన్యమనస్కత, మలినవస్త్ర ధారణ, అనుచిత ఉపవాసం – ఇవన్నీ ఇకపై నీకు తగవు.

8

విచిత్రాణి చ మాల్యాని చన్దనాన్యగరూణి చ,
వివిధాని చ వాసాంసి దివ్యాన్యాభరణాని చ.

9

మహార్హాణి చ పానాని శయనాన్యాసనాని చ,
గీతం నృత్తం చ వాద్యం చ లభ మాం ప్రాప్య మైథిలి.

10

స్త్రీరత్నమసి మైవం భూః కురు గాత్రేషు భూషణమ్,
మాం ప్రాప్య హి కథం ను స్యాస్త్వమనర్హా సువిగ్రహే.

11

ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే,
యదతీతం పునర్నైతి స్రోతః శీఘ్రమపామివ.

12

త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృక్,
న హి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే.

13

ఓ మిథిలానగర రాజకుమారీ! నన్ను పొంది విచిత్రాలైన పూలమాలికలను, చందనములను, సువాసనలు వెదజల్లే లేపనాలను, అత్యంత విలువైన వస్త్రములను, దివ్యాభరణాలను, శ్రేష్ఠములైన పానీయాలను, మేలైన శయనాలను, ఆసనాలను, నృత్య గీత సంగీతాదుల్లో పాల్గొనడం వంటి సకల రాజభోగాలను అనుభవించు.

9–10

సుందరమైన రూపం గల ఓ సీతా! స్త్రీలలో నువ్వు రత్నానివి. ఈ రకంగా నువ్వు ఉండకూడదు. నీ అవయవాలకు తగిన ఆభరణాలను ధరించు. నన్ను ప్రాప్తించుకున్న తరువాత కూడా ఈ సుఖభోగాదులు అనుభవించడానికి నువ్వు ఎలా అర్హురాలవు కాకుంటావు?

11

అత్యంత ఆకర్షణీయమైన నీ యౌవనం వ్యర్థంగా గడచిపోతున్నది. వేగంగా ప్రవహించి వెళ్ళిపోయిన జలం తీరున, మళ్ళిపోయిన యౌవనం తిరిగిరాదు.

12

దర్శనమాత్రాన శుభాలను కలిగించేదానా! సృష్టికర్తయైన బ్రహ్మ అతిలోక సౌందర్యవతియైన నిన్ను సృజించిన తరువాత సౌందర్యాన్ని సృజించడాన్ని విరమించాడు కాబోలు! అందుకే నీకు ఈడైన సౌందర్యవతి

లోకంలో మరొకరు లేరు.

13

త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవనశాలినీమ్,
కః పుమానతివర్తేత సాక్షాదపి పితామహః.

14

యద్యత్పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే,
తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే.

15

భవ మైథిలి భార్యా మే మోహమేనం విసర్జయ,
బహ్వీనాముత్తమస్త్రీణా మాహృతానా మిత స్తతః,
సర్వాసామేవ భద్రం మమాగ్రమహిషీ భవ.

16

లోకేభ్యో యాని రత్నాని సంప్రమథ్యాహృతాని వై,
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైతదహం చ తే.

17

ఓ విదేహ రాకుమారీ! ముల్లోకాల్లో సాటిలేని రూపలావణ్యాలతో ఒప్పుతున్న నిన్ను చూసిన సృష్టికర్తయైన బ్రహ్మతో సహా ఏ పురుషుడూ విడిచిపెట్టడు. ఇక ఇతరుల సంగతి చెప్పాలా?

14

చంద్రబింబం వంటి వదనమూ, చక్కని కటి ప్రదేశమూ గల ఓ సీతా! నీ ఏ అవయవాన్ని చూసినా దాని మీద నుండి నా దృష్టిని మరల్చలేక పోతున్నాను.

15

సీతా! శోకాన్ని వీడి, నా భార్యవవు. నేను అనేక ప్రాంతాలనుండి నా బాహుబలంతో తీసుకువచ్చిన ఉత్తమ స్త్రీలందరిలోనూ అగ్రేసురాలవై విరాజిల్లుతూ నా పట్టమహిషివి అవు. నీకు మంగళం ఒనగూరుతుంది.

16

భయస్వభావురాలవైన ఓ సీతా! ముల్లోకాలనూ జయించి నేను సముపార్జించి తెచ్చిన అత్యంత విలువైన సమస్త వస్తువులూ, నా రాజ్యమూ, నేను కూడా నీకే సొంతం.

17

విజిత్య పృథివీం సర్వాం నానానగరమాలినీమ్,
జనకాయ ప్రదాస్యామి తవ హేతోర్విలాసిని.

18

నేహ పశ్యామి లోకేఽన్యం యో మే ప్రతిబలో భవేత్,
పశ్యమే సుమహ ద్వీర్యమప్రతిద్వన్ద్వమాహవే.

19

అసకృత్ సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః,
అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః.

20

ఇచ్ఛ మాం క్రియతామద్య ప్రతికర్మ తవోత్తమమ్.

21

సప్రభాణ్యవసజ్యన్తాం తవాఙ్గే భూషణాని చ,
సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా.

22

ప్రతికర్మాభిసంయుక్తా దాక్షిణ్యేన వరాననే,

భుంక్ష్వ భోగాన్యథాకామం పిబ భీరు రమస్వ చ.

23

విలాసవతియైన ఓ సీతా! నీ కోసం అనేక నగరాలతో విరాజిల్లే ఈ భూమండలాన్నంతా నా పరాక్రమంతో జయించి నీ తండ్రియైన జనకునికి సమర్పిస్తాను.

18

లోకంలో నాకు ఎదురొడ్డి నిలవగలవాడు ఎవడూ కానరాడు. యుద్ధంలో ఏ ప్రత్యర్థీ ఎదుర్కొనలేని సాటిలేని నా పరాక్రమం గూర్చి కాస్త యోచించు.

19

పలుమార్లు దేవతలు, రాక్షసులు నాతో యుద్ధం చేసి పరాజయం పొంది నా ముందు నిలబడలేక విరిగిన ధ్వజములతో పలాయనం చిత్తగించారు.

20

నన్ను అంగీకరించు. ఇప్పటికిప్పుడే దివ్యాభరణాలను తదితర అలంకారాలను నీకు కానుకగా ఇస్తాను. నీ సహజ సౌందర్యాన్ని ఇనుమడింపజేసే ప్రకాశమానమైన ఆ భూషణాలను నువ్వు ధరించగా నీ రూపాన్ని తృప్తిగా చూడాలని ఉంది.

21–22

సుందర వదనా! భయ స్వభావం గల సీతా! సొగసుగా అలంకరించుకుని యథేచ్ఛగా భోగాలు అనుభవించు. మధుపానం సేవిస్తూ నాతో క్రీడించు.

23

యథేష్టం చ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ,

లలస్వ మయి విస్రబ్ధా ధృష్టమాజ్ఞాపయస్వ చ.

24

మత్ప్రసాదాల్లలన్త్యాశ్చ లలన్తాం బాన్ధవాస్తవ,
బుద్ధిం మమానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే.

25

కిం కిరిష్యసి రామేణ సుభగే చీరవాససా,
నిక్షప్తవిజయో రామో గతశ్రీర్వనగోచరః,
వ్రతీ స్థణ్డిలశాయీ చ శఙ్కే జీవతి వా న వా.

26

న హి వైదేహి రామస్త్వాం ద్రష్టుం వా ప్యుపలప్స్యతే,
పురోబలాకైరసితైర్మేఘై ర్జ్యోత్స్నామివావృతామ్.

27

నిరాక్షేపణీయంగా నీకు ఇష్టమైన వారికి విరివిగా భూములను, ధనాన్ని దానంచెయ్యి. నా పట్ల విశ్వాసంతో స్వేచ్ఛగా నాతో విహరించు. నిర్భయంగా నన్ను ఆజ్ఞాపించు.

24

నన్ను అనుగ్రహించడం చేత నువ్వు సుఖసంతోషాలు పొందడమేగాక, నీ బంధువులు సైతం వాటిని పొందుతారు. ఓ మంగళస్వరూపిణీ! నా మహత్వాన్ని, ఐశ్వర్యాన్ని, కీర్తిని ఒకింత పరికించు.

25

ఓ సుందరీ! నారవస్త్రాలు ధరించే ఆ రాముని వల్ల నీకు ఏం ఒరుగుతుంది? రాముని విజయం, సంపద గతించిన విషయాలు. మునివ్రతం పాటిస్తూ అరణ్యాల్లో అతడు సంచరిస్తున్నాడు. కటిక నేల మీద శయనిస్తున్న ఆ రాముడు ఇప్పటికి ఇంకా సజీవుడేనా అనే విషయం కూడా సందేహమే.

26

వానరాకను సూచిస్తూ ముందు కొంగలు ఎగురుతూ పోతుండగా వెనుక కారుమబ్బులచే ఆవృతమైన వెన్నెలను చూడలేని విధంగా నా వశంలోని నువ్వు రాముని కంటపడడం అసంభవం.

27

న చాపి మమ హస్తాత్త్వాం ప్రాప్తుమర్హతి రాఘవః,
హిరణ్యకశిపుః కీర్తిమింద్రహస్తగతామివ.

28

చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని,
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా.

29

క్లిష్టకౌశేయవసనాం తన్వీమప్యనలంకృతామ్,
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభామ్యహమ్.

30

అన్తఃపురనివాసిన్యః స్త్రియః సర్వగుణాన్వితాః,
యావత్యో మమ సర్వాసామైశ్వరం కురు జానకి.

31

మమ హ్యసితకేశాన్తే త్రైలోక్యప్రవరాః స్త్రియః,
తాస్త్వాం పరిచరిష్యన్తి శ్రియమప్సరసో యథా.

32

ఇంద్రుడు అపహరించిన తన భార్యయైన కీర్తిని హిరణ్యకశిపుడు పొందగలిగాడు. కాని నా చేజిక్కిన నిన్ను మాత్రం రాముడు పొందలేడు.

అందమైన చిరునవ్వు, చక్కని పలువరుస, ఆకర్షణీయమైన కళ్ళు గల భయస్వభావురాలైన ఓ విలాసినీ! గరుత్మంతుడు సర్పాన్ని హరించే రీతిలో నువ్వు నా మనస్సును హరించివేస్తున్నావు.

29

నలిగిపోయిన పట్టువస్త్రం ధరించి, చిక్కిపోయి, అలంకారరహితంగా ఉన్నప్పటికీ నిన్ను చూసిన తరువాత నా భార్యల పట్ల నాకు ఇచ్చే కలగడం లేదు.

30

నా అంతఃపురంలో సకల సద్గుణాలతో భాసిల్లుతున్న వనితలు ఎందరో ఉన్నారు. ఓ సీతా! వారందరిపై ఆధిపత్యం నీదే అవుతుంది.

31

నల్లని కురులతో అలరారుతున్న సీతా! ముల్లోకాలలోనూ శ్రేష్ఠలైన నా అంతఃపుర తరుణులు, లక్ష్మీదేవిని అప్సరసలు సేవించే తీరులో నీకు పరిచర్యలు చేస్తారు.

32

యాని వైశ్రవణే సుభ్రు రత్నాని చ ధనాని చ,
తాని లోకాంశ్చ సుశ్రోణి మాం చ భుఙ్క్ష్వ యథాసుఖమ్.

33

న రామస్తపసా దేవి న బలేన న విక్రమైః,
న ధనేన మయా తుల్యస్తేజసా యశసాపి వా.

34

పిబ విరహ రమస్య భుఙ్క్ష్వ భోగాన్
ధన నిచయం ప్రదిశామి మేదినీం చ,
మయి లల లలనే యథాసుఖం త్వం

త్వయి చ సమేత్య లలన్తు బాన్ధవాస్తే.

35

కుసుమితతరుజాలసంతతాని
భ్రమరయుతాని సముద్రతీరజాని,
కనకవిమలహారభూషితాంగి
విహర మయా సహ భీరు కాననాని.

36

అందమైన కనుబొమ్మలూ, చక్కని కటి ప్రదేశమూ గల సీతా! నేను కుబేరుని జయించి తెచ్చిన సమస్త రత్నరాశులను, ధనాన్ని, లోకాలనూ అనుభవిస్తూ నాతో కలసి ఆనందంగా ఉండు.

33

ఓ దేవీ! తపస్సు, బలపరాక్రమాలు, ఐశ్వర్యం, తేజస్సు, కీర్తి మొదలైన ఏ విషయంలోనూ రాముడు నాకు సాటిరాడు.

34

ఓ లలనామణీ! నువ్వు కోరినంత ధనరాసులను, భూమిని నీ పరం చేస్తాను. యథేచ్ఛగా త్రాగి, విహరిస్తూ క్రీడించు. భోగాలు అనుభవించు. నా పట్ల అనురాగవతివై మెలగు. అప్పుడు నీతోపాటు నీ బంధుగణమంతా కూడా సంతోషంలో ఓలలాడతారు.

35

భయస్వభావురాలైన సీతా! మేలిమి బంగారంతో రూపొంది ప్రకాశిస్తున్న హారాలను, ఇతర ఆభరణాలను ధరించి, ఎడతెగక పుష్పించి, తుమ్మెదలతో ధ్వనిస్తున్న వృక్షసముదాయాలతో శోభిల్లుతున్న సముద్రతీర ఉద్యానాలలో నాతో కలసి విహరించు.

36

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 20వ సర్గ
సమాప్తం

21వ సర్గ

రావణుని నిందిస్తూ అతణ్ణి సీత తిరస్కరించడం

తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః,
ఆర్తా దీనస్వరా దీనా ప్రత్యువాచ శనైర్వచః.

1

దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ,
చిన్తయన్తీ వరారోహా పతిమేవ పతివ్రతా,
తృణమన్తరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా.

2

నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః,
న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్.

3

దుఃఖపీడితురాలైన సీత భయంకరుడైన ఆ రావణుని మాటలు విని దీనస్వరంలో మెల్లగా ఇలా పలికింది.

1

సుందరమైన కటిప్రదేశమూ, వదనాన వెల్లివిరిసే చిరునవ్వు, మహోన్నత పాతివ్రత్యం గల ఆ సీతాదేవి దుఃఖీతురాలై, జాలిగొల్పే స్థితిలో ఏడుస్తున్నది. ఆమె తన పతియైన రాముణ్ణే సదా ధ్యానిస్తూ తనకూ

రావణునకూ మధ్య ఒక గడ్డిపోచను అడ్డుగా ఉంచుకొని భయంచే వణకుతూ ఇలా ప్రత్యుత్తరమిచ్చింది.

2

రావణా! నీ మనస్సును నా మీదనుండి తొలగించుకో; నీ మనస్సును, మనోవాంఛితాలను నీ భార్యల వరకే పరిమితం చేసుకో. పాపం చేసిన వ్యక్తి ఎలా మోక్షప్రాప్తిని కోరదగడో నువ్వు అలా నన్ను ససేమిరా ఆశించరాదు.

3

అకార్యం న మయా కార్యమేకపత్న్యా విగర్హితమ్,
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా.

4

ఏవముక్త్యా తు వైదేహీ రావణం తం యశస్వినీ,
రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచనమబ్రవీత్.

5

నాహమౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ,
సాధు ధర్మమవేక్షస్వ సాధు సాధువ్రతం చర.

6

యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర,
ఆత్మానముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్.

7

అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేన్ద్రియమ్,
నయన్తి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్.

8

ఉత్తమమైన వంశంలో జన్మించి, ఉత్తమమైన వంశంలోనికి (ఇక్ష్వాకు)

కోడలుగా వెళ్ళిన పతివ్రతను. నిందనీయమైన ఇటువంటి అకృత్యానికి కంఠంలో ప్రాణం ఉండగా నేను పాల్పడను.

4

యశస్వినియైన సీత, రావణుని నిర్లక్ష్యం చేస్తున్న వైఖరిలో అతడి వైపుగా వీపు త్రిప్పి, ఇలా హితవు చెప్పసాగింది.

5

నేను పరభార్యను, పతివ్రతను; ముమ్మాటికీ నీకు భార్యను కాలేను. ఓ రావణా! ధర్మదృష్టి కలిగి ఉండి, సత్పురుషుల జీవన నియతులను తూ.చ.తప్పక పాటించు.

6

ఓ నిశాచరా! నీ భార్యలు ఎలా నీకు శీలవతులయ్యేట్లు కాపాడదగినవారో, అలాగే ఇతరుల భార్యలు కూడా శీలసంరక్షణ చేయదగ్గవారనే విషయం గ్రహించు. కాబట్టి ఇప్పటికే నీకు లభించిన భార్యలతో తృప్తిపడి జీవించు.

7

తన భార్యలతో సంతృప్తిచెందక చపలత్వంతో ఇంద్రియచాంచల్యానికి లోనై పర భార్యల వెంటబడే నీచునికి పతనం వారి వల్లనే వాటిల్లుతుంది.

8

ఇహ సన్తో న వా సన్తి సతో వా నానువర్తసే,
తథాహి విపరీతా తే బుద్ధిరాచారవర్జితా.

9

వచో మిథ్యాప్రణీతాత్మా పథ్యముక్తం విచక్షణైః,
రాక్షసానామభావాయ త్వం వా న ప్రతిపద్యసే.

10

అకృతాత్మానమాసాద్య రాజానమనయే రతమ్,
సమృద్ధాని వినశ్యన్తి రాష్ట్రాణి నగరాణి చ.

11

తథేయం త్వాం సమాసాద్య లఙ్కా రత్నౌఘసంకులా,
అపరాధాత్తవైకస్య నచిరాద్వినశిష్యతి.

12

స్వకృతైర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః,
అభినన్దన్తి భూతాని వినాశే పాపకర్మణః.

13

రావణా! శిష్టాచారాలను వీడి నీ బుద్ధి విపరీతంగా వ్యవహరిస్తున్నది. ఈ దేశంలో నీకు సద్బుద్ధిని గరపే సత్పురుషులే కరవయ్యారా? ఒకవేళ ఉన్నా నువ్వు వారి మాటను పెడచెవిని పెడుతున్నావా?

9

ధర్మమార్గావలంబులైన సత్పురుషులు సదుపదేశాలు చేసినప్పటికీ వక్రమార్గం పట్టిన నీకు, సకల రాక్షసుల వినాశం ఆసన్నమవడంతో ఆ హితోపదేశాలు చెవికెక్కడం లేదా?

10

హితోక్తులు రుచించని బుద్ధిగల వాడూ, నీతిబాహ్యమైన కార్యాలు చేయడంలో ఆసక్తిగలవాడూ అయిన రాజు పరిపాలనలోని నగరాలూ, రాష్ట్రాలూ ఎంత సస్యసమృద్ధాలైనప్పటికీ అవి త్వరలో నశించే తీరుతాయి.

11

అట్లే మణిమయరత్నాదులతో సకలైశ్వర్య సంపన్నమై విరాజిల్లుతున్న ఈ లంక, రాజైన నీ ఒక్కడి అపరాధ కారణంగా కొలది కాలంలోనే నశించబోతున్నది.

12

రావణా! దూరదృష్టిలేని పాపాత్ముడు తాను ఒనరించిన పాపకృత్యముల దుష్ఫలితాన్ని చావుదెబ్బల రూపంలో అనుభవిస్తున్నప్పుడు అతణ్ణి చూసి ప్రాణులన్నీ సంతోషిస్తాయి.

13

ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యన్తి నికృతా జనాః,
దిష్ట్యైతద్వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః.

14

శక్యా లోభయితుం నాహమైశ్వర్యేణ ధనేన వా,
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా.

15

ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్,
కథం నామోపధాస్యామి భుజమన్యస్య కస్య చిత్.

16

అహమౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః,
వ్రతస్నాతస్య ధీరస్య విద్యేవ విదితాత్మనః.

17

సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖీతామ్,
వనే వాశితయా సార్ధం కరేణ్యేవ గజాధిపమ్.

18

పాపకృత్యాలు చేస్తున్న నువ్వు కూడా నశించినప్పుడు నీ వలన హింసలకు కష్టనష్టాలకు గురియైన వారందరూ, "మన భాగ్యవశంచే ఈ దుష్టుడికి వినాశం దాపురించింది" అని సంతోషిస్తారు.

14

సిరిసంపదలనూ, ధనాన్ని ఎరగా చూపించి నన్నెవరూ ప్రలోభపెట్టలేరు. సూర్యుని నుండి కాంతి వేరుగాని రీతిలో శ్రీరాముని నుండి నేను వేరు కాను.

15

సకలలోక ప్రభువైన రాముని పూజనీయ భుజమును తలగడగ చేసుకుని పరుండిన నేను ప్రస్తుతం ఎవరో మరొకని భుజాన్ని ఎలా ఆశ్రయించగలను?

16

నియమనిష్ఠలతో వేదాధ్యయనమనే వ్రతాన్ని పూర్తిచేసుకొన్న బ్రాహ్మణునకు ఆ వేదవిద్యా సంపత్తి ఎలా ఒప్పివుంటుందో ధరణీనాథుడైన ఆ రామునకు మాత్రమే భార్యగా తగినదానను.

17

రావణా! అరణ్యంలో మగ ఏనుగును వీడి సంచరించే ఆడు ఏనుగును గజరాజుతో కలిపినట్లు, రాముని ఎడబాటుతో దుఃఖిస్తున్న నన్ను రాముని వద్దకు చేర్చడం నీకు ధర్మం.

18

మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా,
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభః.

19

విదితః స హి ధర్మజ్ఞః శరణాగతవత్సలః,
తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి.

20

ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్,
మాం చాస్మై నియతో భూత్వా నిర్యాతయితుమర్హసి.

21

ఏవం హి తే భవేత్స్వస్తి సంప్రదాయ రఘూత్తమే,
అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ.

22

వర్జయేద్వ్రజముత్సృష్టం వర్జయేదన్తకశ్చిరమ్,
త్వద్విధం తు న సంక్రుద్ధో లోకనాథః స రాఘవః.

23

దుర్మరణం దాపురించకుండా నువ్వు చిరకాలం సుస్థిరంగా లంకా రాజ్యాధికారాన్ని నిలుపుకోగోరితే ఓ రావణా! పురుషశ్రేష్ఠుడైన రామునితో స్నేహం నెరపడమే నీకు యుక్తం.

19

సకల ధర్మాలు తెలిసిన రాముడు శరణాగత వత్సలుడని ఖ్యాతి గాంచాడు. నువ్వు ఇంకా నాలుగు కాలాలపాటు జీవించగోరితే ఆయనతో స్నేహం చేసుకోవడం నీకు అన్ని విధాలా మంచిది.

20

శరణు వేడినవారిని అనుగ్రహించే ఆ రాముని ప్రసన్నుణ్ణి చేసుకో. మదిలోని దోషాన్ని నిర్మూలించుకొని నిర్మలుడవై ఆయనకు నన్ను సగౌరవంగా అప్పగించు.

21

రావణా! నేను చెప్పిన విధంగా నన్ను రామునికి సగౌరవంగా అప్పగిస్తే నీకు మేలు జరుగుతుంది. అందుకు మారుగా ప్రవర్తిస్తే నీకు వినాశం తప్పదు.

22

దేవేంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధం బహుశా నిన్ను ఏమీ చెయ్యకుండా విడిచిపెట్టవచ్చునేమో! యముడు ఒకవేళ నిన్ను చాలాకాలం గొనిపోకుండా విడువవచ్చు నేమో! కాని లోకాలకు ప్రభువైన రాముడు ఆగ్రహిస్తే మాత్రం నీ అంతం చూడక మానడు.

23

రామస్య ధనుషః శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్,
శతక్రతువిస్పష్టస్య నిర్ఘోషమశనేరివ.

24

ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః,
ఇషవో నిపతిష్యన్తి రామలక్ష్మణ లక్షణాః.

25

రక్షాంసి పరివిఘ్నన్తః పుర్యామస్యాం సమన్తతః,
అసంపాతం కరిష్యన్తి పతన్తః కఙ్కవాససః.

26

రాక్షసేన్ద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్,
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్.

27

అపనేష్యతి మాం భర్తా త్వత్తః శీఘ్రమరిన్దమః,
అసురేభ్యః శ్రియం దీప్తాం విష్ణుస్త్రిభిరివ క్రమైః.

28

అతిత్వరలోనే రావణా! నువ్వు ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధం ధ్వనిని మించి దిక్కులు పిక్కటిల్లజేసే రాముని ధనుష్టంకార ధ్వనిని వినబోతావు.

24

గట్టి కణుపులున్న, బుసలుగొడుతూ మంటలుగ్రక్కే ముఖాలుగల మహాసర్పాల మల్లే భయంకరాలైన రామలక్ష్మణ నామాంకితాలైన మహోగ్ర బాణాలు త్వరలోనే లంకానగరాన్ని ముంచెత్తగలవు.

25

రామలక్ష్మణులు ఎడతెరపి లేకుండా ప్రయోగించే గ్రద్ద రెక్కలు కట్టిన బాణాలకు నేలకొరిగిన రాక్షసుల మృతదేహాలతో ఈ యావత్తు లంకానగరం కించిత్తు సందు కూడా లేకుండా నిండిపోతుంది.

26

గరుత్మంతుడు ఎలా వేగంగా సర్పాలను మట్టుబెడతాడో అదేవిధంగా మహాత్ముడైన రాముడనే గరుత్మంతుడు, రాక్షసులనే మహాసర్పాలను త్రుటిలో రూపుమాపుతాడు.

27

మహావిష్ణువు త్రివిక్రముడై మూడడుగులు వేసి రాక్షసులనుండి లక్ష్మిని (అష్టైశ్వర్యాలను) ఇట్టే హరించి వేసినట్లు శత్రువినాశకుడైన రాముడు (నా భర్త) నన్ను నీ వద్దనుండి తీసుకుపోతాడు.

28

జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే,
అశక్తేన త్వయా రక్షః కృతమేతదసాధు వై.

29

ఆశ్రమంతు తు తయోః శూన్యం ప్రవిశ్య నరసింహయోః
గోచరం గతయోర్భ్రాత్రోరపనీతా త్వయాఽధమ.

30

న హి గన్ధముపాఘ్రాయ రామలక్ష్మణయోస్త్వయా,
శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయోరివ.

31

తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణ మస్థిరమ్,
వృత్రస్యేవేన్ద్రబాహుభ్యాం బాహోరేకస్య నిగ్రహః.

32

క్షిప్రం తవ స నాథో మే రామః సౌమిత్రిణా సహ,
తోయమల్పమివాదిత్యః ప్రాణానాదాస్యతే శరైః.

33

ఓ రాక్షసుడా! జనస్థానంలోని యావత్తు రాక్షససైన్యం రాముని చేతిలో హతమై ఆ ప్రాంతం పాడుపడింది. అప్పుడు నువ్వు రాముని ప్రత్యక్షంగా ప్రతిఘటించలేక నన్ను అపహరించడమనే ఈ తుచ్ఛమైన కార్యానికి పాల్పడ్డావు.

29

ఓ నీచుడా! పురుషసింహులైన రామలక్ష్మణులు లేని సమయంకోసం కాచుకొని ఆశ్రమంలో ప్రవేశించి నన్ను అపహరించుకొచ్చావు.

30

పెద్దపులుల జాడను పసిగట్టగల దూరంలో సైతం కుక్క కించిత్తు ధైర్యంతో కూడా నిలబడలేనట్లు రామలక్ష్మణులకు అల్లంతదూరంలో కూడా వారికి ప్రత్యర్థిగా నిలబడడం నీ తరం కాదు.

31

ఒక బాహువు ఖండింపబడగా వృత్రాసురుడు మిగిలిన ఒంటిచేత్తో రెండు చేతులతో యుద్ధంచేస్తున్న ఇంద్రుని ముందు నిలబడలేనట్లు, నుమ్వా యుద్ధంలో రామలక్ష్మణుల ముందు నిలబడడం అసంభవం.

32

సూర్యుడు తన కిరణాలచే చిన్న తటాకంలోని నీటిని ఎంత త్వరగా ఇగిరిపోయేట్లు చేస్తాడో నా భర్త అయిన రాముడు, లక్ష్మణసమేతుడై త్వరలోనే వచ్చి తన బాణాలచే నీ ప్రాణశక్తిని హరించివేస్తాడు.

33

గిరిం కుబేరస్య గతాఽథవాలయం
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః,
అసంశయం దాశరథేర్న మోక్షస్యే
మహాద్రుమః కాలహతోఽశనేరివ.

34

నీ అంతం సమీపించింది. ఎంతటి మహావృక్షమైనా పిడుగుపాటును తప్పించుకోలేనట్లు నువ్వు కైలాసపర్వతానికి పలాయనం చేసినా, కుబేరుని అలకాపురానికి పారిపోయినా, వరుణుని సభలోకి వెళ్ళి తలదాచుకొన్నా రామ బాణాలనుండి నిన్ను రక్షించుకోలేవు, ఇది నిశ్చయం.

34

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 21వ సర్గ
సమాప్తం

22వ సర్గ

రావణుని తుది హెచ్చరిక

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసేశ్వరః,
ప్రత్యువాచ తతః సీతాం విప్రియం ప్రియదర్శనామ్.

1

యథా యథా సాన్త్వయితా వశ్యః స్త్రీణాం తథా తథా,
యథా యథా ప్రియం వక్తా పరిభూతస్తథా తథా.

2

సంనియచ్ఛతి మే క్రోధం త్వయి కామః సముత్థితః,
ద్రవతోఽమార్గమాసాద్య హయానివ సుసారథిః.

3

పరుషములైన అదేసమయంలో దృఢనిశ్చయంతో కూడుకున్న సీత మాటలు విని, రాక్షసరాజైన ఆ రావణుడు సమాధానంగా బెదరింపు ధోరణిలో ఇలా పలికాడు.

1

పురుషుడు బుజ్జగించేకొద్దీ స్త్రీ ఆ బుజ్జగింపును అలుసుగానూ, తనకు అనుకూలంగానూ భావిస్తుంది; ప్రియవచనాలతో ప్రశంసించేకొద్దీ ఆ పురుషుణ్ణి ఆమె తిరస్కరిస్తుంది.

2

అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్న గుర్రాలను సమర్థుడైన సారధి నియంత్రించే తీరులో, నీ ములుకుల్లాంటి మాటల వల్ల నాలో చెలరేగిన ఆగ్రహాన్ని నీ పట్ల నాకుగల వలపు అదుపుచేస్తున్నది.

3

వామః కామో మనుష్యాణాం యస్మిన్ కిల నిబధ్యతే,
జనే తస్మిం స్త్వనుక్రోశః స్నేహశ్చ కిల జాయతే.

4

ఏతస్మాత్కారణాన్న త్వాం ఘాతయామి వరాననే,
వధార్హామవమానార్హాం మిథ్యాప్రవ్రజితే రతామ్.

5

పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్,
తేషు తేషు వధో యుక్తస్తవ మైథిలి దారుణః.

6

ఏవముక్త్వా తు వైదేహీం రావణో రాక్షసాధిపః,
క్రోధసంరమ్భసంయుక్తః సీతాముత్తరమబ్రవీత్.

7

ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధిస్తే మయాకృతః,
తతః శయనమారోహ మమ త్వం వరవర్ణిని.

8

నిజానికి కామేచ్ఛ లేదా తీరని వ్యామోహం గల వ్యక్తి ప్రతికూలంగా ప్రవర్తిస్తాడు. ఏ వ్యక్తి పట్ల అత్యంత వ్యామోహం కలుగుతుందో ఆ వ్యక్తి పట్ల జాలి, స్నేహం కూడా జనిస్తాయి.

ఓ సుందరవదనా, సీతా! నువ్వు నన్ను తిరస్కరించి ఆ కపట వనవాసంలో ఉన్న రాముని పట్ల అనురక్తి కలిగి ఉన్నా నీ పట్ల నాకు పిచ్చి వ్యామోహం ఉండడం వల్లనే నువ్వు వధార్హవైనా, అవమానింపదగినదానివైనా నీ మీద జాలి, ప్రేమ అధికమవుతున్నాయి.

5

ఓ మిథిల రాజపుత్రీ! నన్ను గూర్చి పలికిన ప్రతి కర్కశమైన మాటకూ నిన్ను నిర్దాక్షిణ్యంగా వధించవలసి ఉంటుంది.

6

రాక్షసులకు ప్రభువైన రావణుడు, సీతాదేవితో ఇలా పలికి ఆగ్రహోదగ్రుడై మళ్ళీ ఆమెతో ఇలా పలుకసాగాడు:

7

ఓ సుందరాంగీ! ఇంకా నీకు రెండు నెలలు గడువు ఉన్నది. అప్పటి వరకు నిరీక్షిస్తాను. ఈ లోపు నాతో శయనించడానికి నిర్ణయించుకో.

8

ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్,
మమ త్వాం ప్రాతరాశార్థమారభన్తే మహానసే.

9

తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేన్ద్రేణ జానకీమ్,
దేవగన్ధర్వకన్యాస్తా విషేదుర్వికృతేక్షణాః.

10

ఓష్ఠప్రకారైరపరా వక్త్రనేత్రైస్తథాపరాః,
సీతామాశ్వాసయామాసుస్తర్జితాం తేన రక్షసా.

11

తాభిరాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపమ్,
ఉవాచాత్మహితం వాక్యం వృత్తశౌణ్డీర్యగర్వితమ్.

12

నూనం న తే జనః కశ్చిదస్తి నిశ్శ్రేయసే స్థితః,
నివారయతి యో న త్వాం కర్మణోఽస్మాద్విగర్హితాత్.

13

ఈ రెండు నెలల వ్యవధి ముగిసే లోపుగా నువ్వు నన్ను భర్తగా వరించకపోతే, తదనంతరం నా ఉదయకాల ఆహార నిమిత్తం నిన్ను నా వంటశాలకు తీసుకునిపోయి ముక్కలు ముక్కలుగా నరుకుతారు.

9

రాక్షసరాజైన రావణుడు, సీతను ఆ విధంగా భయపెట్టడాన్ని చూసి అక్కడే ఉన్న దేవకన్యలు, గంధర్వకన్యలు బిత్తరపోతూ కళ్ళనీళ్ళపర్యంతమై దుఃఖించసాగారు.

10

ఆ దేవగంధర్వ కన్యలలో కొందరు తమ పెదవుల కదలికతో, మరికొందరు ముఖవైఖరితో, కొందరు కనుసైగలతో రావణునిచే భయపెట్టబడుతున్న సీతను ఊరడించారు.

11

దేవగంధర్వ కన్యలచే ఆ విధంగా సాంత్వన పొందిన సీత, పాతివ్రత్యమనే బలంచే తేరుకొని ఆ రాక్షసరాజైన రావణునితో హితకరంగా ఇలా మాట్లాడసాగింది.

12

ఓ రావణా! నిజంగా నీ శ్రేయస్సును ఆకాంక్షించి ఈ విధమైన తుచ్ఛ కార్యం నుండి నిన్ను నివారించే వారు ఎవరూ ఇక్కడ ఉన్నట్లు లేరని నాకు

స్పష్టంగా తెలుస్తోంది.

13

మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః,
త్వదన్యస్త్రిషు లోకేషు ప్రార్థయేన్మనసాఽపి కః.

14

రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః,
ఉక్తవానసి యత్పాపం క్వ గతస్తస్య మోక్ష్యసే.

15

యథా దృప్తశ్చ మాతఙ్గః శశశ్చ సహితౌ వనే,
తథా ద్విరదవద్రామస్త్వం నీచ శశవత్ స్మృతః.

16

స త్వమిక్ష్వాకునాథం వై క్షిపన్నిహ న లజ్జసే,
చక్షుషోర్విషయం తస్య న తావదుపగచ్ఛసి.

17

ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపిఙ్గలే,
క్షితౌ న పతితే కస్మాన్మామనార్య నిరీక్షతః.

18

దేవేంద్రునికి శచీదేవిలా ధర్మాత్ముడైన రామునకు భార్యనైన నన్ను ముల్లోకాల్లో నువ్వు తప్ప మరెవరైనా మనస్సులోనైనా వాంఛిస్తారా?

14

రాక్షసాధముడవైన రావణా! అమిత తేజోసంపన్నుడైన రాముని భార్యనైన నాతో పలికిన పాపపు మాటల ఫలితాన్ని అనుభవించకుండా నువ్వు ఎక్కడకు పోయి తప్పించుకోగలవు?

15

ఓరీ నీచుడా! నువ్వు రామునితో యుద్ధానికి సిద్ధమవడం, అడవిలో కుందేలు మదించిన ఏనుగును ఎదుర్కోవడంలాంటిది. రాముని ముందు నిజానికి నువ్వొక కుందేలు మాత్రుడివి.

16

అటువంటి నువ్వు ఇక్ష్వాకువంశ రాజైన రాముని పరోక్షంలో నిందిస్తున్నావు, ఆయన కంటపడకుండా ఇలా పిరికిపందలా సిగ్గూలజ్జాలేక దాక్కొని ఉన్నావు.

17

ఓరీ దుష్టుడా! నన్ను మోహంతో చూస్తున్న క్రూరములు, నల్లగానూ పసుపుపచ్చగానూ ఉన్న వికృతమైన నీ కళ్ళు ఎందుకు ఇంకా నేల రాలకున్నాయి?

18

తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ,
కథం వ్యాహరతో మాం తే న జిహ్వా వ్యవశీర్యతే.

19

అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హతేజసా.

20

నాపహర్తుమహం శక్యా త్వయా రామస్య ధీమతః,
విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః.

21

శూరేణ ధనదభ్రాత్రా బలైః సముదితేన చ,

అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్.

22

సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
వివృత్య నయనే క్రూరే జానకీమన్వవైక్షత.

23

పాపాత్ముడా! నేను ధర్మాత్ముడైన రాముని భార్యను, ఘనత వహించిన దశరథ మహారాజు కోడలిని. అటువంటి నన్ను ఇలా దుర్భాషలాడుతున్న నీ నాలుక ఇంకా ఎందుకు తెగి క్రిందపడకున్నది?

19

ఓ దశకంఠుడా! నువ్వు భస్మం కావలసినవాడవు. నా తపస్సు చేత, పాతివ్రత్య మహిమచేత నిన్ను ఇట్టే భస్మం చేయగలను. కాని అందుకు రాముని ఆనతి లేనందున నువ్వు బ్రతికిపోయావు.

20

ధీమంతుడైన రాముని భార్యను నేను. నిజానికి నన్ను నీవు అపహరింపలేవు. కాని ఇలా నా అపహరణ జరిగిందంటే, అది నీ చావు నిమిత్తమే సంభవించినదనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

21

శూరుణ్ణి, యక్షరాజైన కుబేరుని సోదరుణ్ణి, అపారబల సమన్వితుణ్ణి అని గొప్పలు చెప్పుకుంటున్నావు కదా! అటువంటి వాడివి రాముని వంచనతో దూరంగా పంపించి ఆయన భార్యనైన నన్ను దొంగలా ఎలా అపహరించావు?

22

సీత పరుషోక్తులు విన్న రాక్షసరాజైన ఆ రావణుడు కోపం కారణంగా ఎర్రబారిన కనుగ్రుడ్లను పెద్దవి చేసి తేరిపార ఆమెను చూశాడు.

23

నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః,
సింహసత్త్వగతిః శ్రీమాన్ దీప్త జిహ్వాగ్రలోచనః.

24

చలాగ్రమఃకుటప్రాంశు చిత్రమాల్యానులేపనః,
రక్తమాల్యామ్బరధరస్తప్తాఙ్గద విభూషణః.

25

శ్రోణీసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః,
అమృతోత్పాదనద్ధేన భుజగేనేవ మన్దరః.

26

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశః శృఙ్గాభ్యామివ మన్దరః.

27

నల్లని మేఘం మల్లే ఉన్న ఆ రావణుడు గొప్ప భుజములు పెద్ద మెడను కలిగి ఉన్నాడు. సింహబలమూ, సింహ గమనముతో అతడు విరాజిల్లుతున్నాడు. అతడి జిహ్వాగ్రమూ (నాలుక చివరిభాగం) కన్నులూ మంటల్లా ఎర్రబారి ఉన్నాయి.

24

సమున్నతుడైన (ఎత్తుగల) ఆ రావణుడు ధరించిన కిరీటం కోపోద్రేకాల కారణంగా చలిస్తున్నది. అతడు విచిత్రమైన మాలలు, లేపనాలను, ఎర్రని దండలను, ఎర్రని వస్త్రాలను ధరించి ఉన్నాడు. మేలిమి బంగారు భుజకీర్తులను కూడా ఆ రావణుడు అలంకరించుకొని ఉన్నాడు.

25

నల్లని గొప్పమొలత్రాడుతో ఒప్పుతున్న ఆ రావణుడు, అమృత మథన సమయంలో వాసుకిచే చుట్టబడిన మందరపర్వతం చందాన భాసిస్తున్నాడు.

26

పర్వత సమానుడైన ఆ రావణుడు బలిష్ఠాలైన భుజములు సంతరించుకొన్నవాడై రెండు శిఖరాలతో విలసిల్లుతున్న మందరపర్వతంలా శోభిస్తున్నాడు.

27

తరుణాదిత్యవర్ణాభ్యాం కుణ్డలాభ్యాం విభూషితః,
రక్తపల్లవపుష్పాభ్యామశోకాభ్యామివాచలః.

28

స కల్పవృక్షప్రతిమో వసన్త ఇవ మూర్తిమాన్,
శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః.

29

అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః,
ఉవాచ రావణః సీతాం భుజఙ్గ ఇవ నిశ్శ్వసన్.

30

అనయేనాభిసంపన్న మర్థహీనమనువ్రతే,
నాశయామ్యహమద్య త్వాం సూర్యః సన్ధ్యా మివౌజసా.

31

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః,
సందిదేశ తతః సర్వా రాక్షసీర్ఘోరదర్శనాః.

32

బాలసూర్యుని మల్లే ధగధగ మెరసే కుండలాలను ధరించిన ఆ రావణుడు ఎర్రని చిగుళ్ళు, పువ్వులతో ఇరువైపుల అలరారుతున్న అశోకవృక్ష ద్వయం గల పర్వతంలా శోభిల్లుతున్నాడు.

28

సర్వాలంకారభూషితుడై కల్పవృక్షాన్ని పోలి మూర్తీభవించిన వసంత ఋతువులా ఆ రావణుడు శోభిల్లుతున్నప్పటికీ శ్మశానంలోని స్మారక మండపంలా అతడు భీతిగొల్పుతున్నాడు.

29

కోపం వలన ఎర్రబారిన కళ్ళతో సీతను చూస్తూ, మహాసర్పంలా బుసలుకొట్టుతూ ఆమెతో ఇలా పలికాడు.

30

నీతిమాలినవాడూ, నిర్ధనుడూ అయిన ఆ రాముణ్ణే ఇంకా ఆతురతతో అపేక్షిస్తున్న సీతా! సూర్యుడు తన తేజస్సు చేత ప్రాతఃసంధ్యాకాల చీకటిని పటాపంచలు చేసేటట్లు నిన్ను ఇప్పుడే నేను రూపుమాపుతాను.

31

శత్రువులను వేధించి ఏడిపించే రాక్షసరాజైన ఆ రావణుడు, సీతాదేవితో అలా పలికి అక్కడ కాపలాగా ఉన్న భయంకర స్వరూపిణులైన రాక్షస స్త్రీలను ఇలా ఆదేశించాడు.

32

ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
గోకర్ణీం హస్తికర్ణీం చ లమ్బకర్ణీమకర్ణికామ్.

33

హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూళికామ్,
ఏకాక్షీమేకపాదీం చ పృథుపాదీమపాదికామ్.

34

అతిమాత్రశిరోగ్రీవామ్ అతిమాత్రకుచోదరీమ్,

అతిమాత్రాస్యనేత్రాం చ దీర్ఘజిహ్వామజిహ్వికామ్,
అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీమ్.

35

యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ,
తథా కురుత రాక్షస్యః సర్వాః క్షిప్రం సమేత్య చ.

36

ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః,
అవర్తయత వైదేహీం దండస్యోద్యమనేన చ.

37

ఒకే కన్ను, ఒకే చెవి, తల చుట్టూ విస్తరించిన చెవులు గల, ఆవు చెవులు గల, ఏనుగు చెవులు గల, వ్రేలాడుతున్న చెవులు గల, అసలు చెవులేలేని రాక్షసాంగనలు ఆ సమూహంలో ఉన్నారు. అంతేగాక ఏనుగు పాదాలు గల, గుర్రం పాదాలు గల, ఆవు పాదాలుగల, పాదల మీద వెంట్రుకలు మొలచిన, ఒకే కన్ను ఒకే పాదం ఉన్న, పెద్ద పాదాలు గల, అసలు పాదాలు లేని, పెద్ద తల మెడ ఉన్న, పెద్ద స్తనములున్న, పెద్ద పొట్ట, పెద్ద నోరు, పెద్ద కళ్ళతో కూడిన, పొడవైన నాలుక ఉన్న, అసలు నాలుకే లేని, అసలు ముక్కేలేని, సింహముఖం ఉన్న, ఆవుముఖం గల, పందిముఖం ఉన్న రాక్షస స్త్రీలు కూడా వారిలో ఉన్నారు. వారందరినీ రావణుడు ఇలా ఆజ్ఞాపించాడు. "ఓ రాక్షసాంగనలారా! మీరందరూ కలసి మంచి మాటలతోగాని లేదా భయపెట్టిగాని, సామదానభేదోపాయాలచేగాని లేదా చివరికి దండోపాయంచేనైనా సరే సత్వరమే ఈ సీత నాకు వశమయ్యేటట్లు చేయండి."

33–37

ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేన్ద్రః పునః పునః,

కామమన్యపరీతాత్మా జానకీం పర్యతర్జయత్.

38

ఉపగమ్య తతః క్షిప్రం రాక్షసీ ధాన్యమాలినీ,
పరిష్వజ్య దశగ్రీవమిదం వచనమబ్రవీత్.

39

మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా,
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర.

40

నూనమస్యా మహారాజ న దివ్యాన్ భోగసత్తమాన్,
విదధాత్యమరశ్రేష్ఠస్తవ బాహుబలార్జితాన్.

41

అకామాం కామయానస్య శరీరముపతప్యతే,
ఇచ్ఛన్తీం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా.

42

పదే పదే ఆ రాక్షసస్త్రీలను ఆ విధంగా ఆదేశిస్తూ రావణుడు కట్టలుత్రెంచుకుంటున్న కామక్రోధాలకు లోనై సీతాదేవిని భయపెట్టాడు.

38

అప్పుడు ధాన్యమాలిని అనే రాక్షసాంగన (రావణుని భార్యలలో ఒకతె) గబగబ రావణుని వద్దకు వచ్చి ఆతణ్ణి కౌగిలించుకొని ఇలా పలికింది.

39

మహారాజా! శోభ కోల్పోయి దీనురాలై ఉన్న మానవ కాంతయైన ఈ సీతతో నువ్వు ఏం సుఖించగలవు? రాక్షసేశ్వరా! నాతో క్రీడిస్తూ సుఖించు.

40

మహారాజా! నీ బాహుబలం మూలంగా సంతరించుకున్న దివ్యభోగాలను అనుభవించే యోగం బ్రహ్మదేవుడు ఈమె నుదుట వ్రాయలేదు. ఇది ముమ్మాటికీ నిజం.

41

తన పట్ల అనురాగంలేని స్త్రీని వాంఛించే పురుషుడి శరీరానికి తాపం మాత్రమే మిగులుతుంది. కాని తన పట్ల వలపు గల స్త్రీని వాంఛించినప్పుడు ఆ స్త్రీ నుంచి ఆ పురుషుడు తనివితీరా సుఖం అనుభవిస్తాడు.

42

ఏవముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్తస్తతో బలీ,
ప్రహసన్మేఘసంకాశో రాక్షసః స న్యవర్తత.

43

ప్రస్థితః స దశగ్రీవః కమ్పయన్నివ మేదినీమ్,
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనమ్.

44

దేవగన్ధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః,
పరివార్య దశగ్రీవం వివిశుస్తం గృహోత్తమమ్.

45

స మైథిలీం ధర్మపరామవస్థితాం
ప్రవేపమానాం పరిభర్త్స్య రావణః,
విహాయ సీతాం మదనేన మోహితః
స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్.

46

బలిష్ఠుడూ, మేఘ సమాన వర్ణుడూ అయిన రావణుడు, ఆ ధాన్యమాలిని ఇలా పలుకగా నవ్వుతూ సీత సమక్షం నుండి కదలి

వెళ్ళిపోయాడు.

43

అలా వెళ్ళిన దశకంఠుడు భూమి కంపిచేటట్లు అడుగులు వేస్తూ సూర్యునిలా దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న తన భవనంలోనికి ప్రవేశించాడు.

44

రావణునితో పాటు వచ్చిన దేవకన్యలు, గంధర్వకన్యలు, నాగకన్యలు అతణ్ణి పరివేష్టించినవారై ఆ మహాప్రాసాదంలోనికి ప్రవేశించారు.

45

భయంతో వణకుచున్నప్పటికీ ధర్మమార్గం నుండి కించిత్తు అయినా వైదొలగేలాచేసి తనకు లొంగిపోయేటట్లు సీతను చేయలేకపోవడంతో ఆమెను విడిచి, కామవివశుడైన ఆ రావణుడు శోభాయమానమైన తన భవంతిలోనికి వెళ్ళిపోయాడు.

46

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 22వ సర్గ

సమాప్తం

23వ సర్గ

రాక్షసస్త్రీలు సీతను పురిగొల్పి యత్నించడం

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః,
సందిశ్య చ తతః సర్వా రాక్షసీర్నిర్జగామ హ.

1

నిష్క్రాన్తే రాక్షసేన్ద్రే తు పునరన్తఃపురం గతే,
రాక్షస్యో భీమరూపాస్తాః సీతాం సమభిదుద్రువుః.

2

తతః సీతాముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
పరం పరుషయా వాచా వైదేహీమిదమబ్రువన్.

3

శత్రువులను బాధించి ఏడ్పించే రావణుడు, రాక్షసస్త్రీలందరికీ సీతను గూర్చి ఆదేశాలిచ్చి అక్కణ్ణుండి వెళ్ళిపోయాడు.

1

రాక్షసేంద్రుడైన రావణుడు తన అంతఃపురం లోనికి పోగానే భయంకరాకృతుల్లో ఉన్న రాక్షసస్త్రీలందరూ సీత వద్దకు పరుగుతీశారు.

2

ఆ రాక్షసస్త్రీలు సీతను సమీపించి క్రోధావేశంతో ఆమెతో కటువుగా

ఇలా మాట్లాడసాగారు.

3

పౌలస్తస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః,
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే.

4

తతస్త్వేకజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
ఆమన్త్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్.

5

ప్రజాపతీనాం షణ్ణాం తు చతుర్థో యః ప్రజాపతిః,
మానసో బ్రహ్మణః పుత్రః పులస్త్య ఇతి విశ్రుతః.

6

పులస్త్యస్య తు తేజస్వీ మహర్షిర్మానసః సుతః,
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః.

7

తస్య పుత్రో విశాలాక్షి రావణః శత్రురావణః,
తస్య త్వం రాక్షసేన్ద్రస్య భార్యా భవితుమర్హసి,
మయోక్తం చారుసర్వాఙ్గి వాక్యం కిం నానుమన్యసే.

8

ఓ సీతా! రావణుడు పులస్త్యబ్రహ్మ వంశజుడు, సర్వశ్రేష్ఠుడు, పైగా మహాత్ముడు. అటువంటి దశకంఠుని భార్యవు కావడాన్ని గౌరవంగా నువ్వు ఎందుకు భావించడంలేదు?

4

అప్పుడు ఏకజట అనే రాక్షసస్త్రీ కోపంతో కళ్ళెర్రజేసి పిడికిలిలో ఇమిడే

సన్నని నడుం గల సీతను సంబోధిస్తూ ఇలా అంది:

5

పులస్త్య ప్రజాపతి బ్రహ్మమానసపుత్రుడు. ఆయన ఖ్యాతిగాంచిన ఆరుగురు ప్రజాపతుల్లో నాలుగవ వాడు. (ఆరుగురు ప్రజాపతులు: మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు.)

6

విశ్రవసుడనే మహర్షి పులస్త్య ప్రజాపతి మానసపుత్రుడు. ఆ విశ్రవసుడు బ్రహ్మదేవునితో సమానమైన తేజోసంపన్నుడు.

7

విశాల నేత్రాలుగల ఓ సీతా! శత్రువులకు సింహస్వప్నమైన రావణుడు, సుప్రసిద్ధుడైన ఆ విశ్రవసుని కుమారుడు. అట్టి రాక్షసప్రభువైన రావణునికి నువ్వు భార్యవు కాతగినదానవు. ఓ సుందరాంగీ! నా హితవచనాలను నువ్వెందుకు వినకున్నావు?

8

తతో హరిజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
వివర్త్య నయనే కోపాత్ మార్జారసదృశేక్షణా.

9

యేన దేవాస్త్రయస్త్రింశద్దేవరాజశ్చ నిర్జితాః,
తస్య త్వం రాక్షసేన్ద్రస్య భార్యా భవితుమర్హసి.

10

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భర్త్సయన్తీ తదా ఘోరమిదం వచనమబ్రవీత్.

11

వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామేష్వనివర్తినః,
బలినో వీర్యయుక్తస్య భార్యాత్వం కిం న లప్స్యసే.

12

ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః,
సర్వాసాం చ మహాభాగాం త్వాముపైష్యతి రావణః.

13

తదుపరి పిల్లి కళ్ళున్న హరిజట అనే రాక్షసాంగన క్రోధంతో కళ్ళు గిరగిరా తిప్పుతూ సీతతో ఇలా అంది:

9

ముప్పది మూడు కోట్ల దేవగణాలనూ, వారికి ప్రభువైన దేవేంద్రుణ్ణీ యుద్ధంలో జయించిన రాక్షసప్రభువైన రావణునకు భార్యవు కావడానికి అర్హత నీకే ఉంది.

10

పిదప ప్రఘస అనే రాక్షసస్త్రీ కోపావేశంతో సీతను బెదరిస్తూ కాఠిన్యం ఉట్టిపడే ధోరణిలో ఇలా పలికింది:

11

గర్వించదగ్గ పరాక్రమవంతుడు, శూరుడు, మహావీరుడు, రణరంగంలో ఎన్నడూ వెన్నుచూపని వాడు, మహాశక్తిమంతుడు అయిన రాక్షసరాజైన ఆ రావణునికి భార్యవు కావడానికి ఎందుకు సమ్మతించకున్నావు?

12

తన భార్యలందరిలోకీ అమిత ఇష్టురాలూ, గౌరవనీయురాలూ, సకల సౌభాగ్యాలూ సంతరించుకొన్నదీ అయిన మండోదరిని సైతం కాదని మహాబలశాలియైన రావణుడు నిన్ను పొందగోరుతున్నాడు.

13

సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్,
అన్తఃపురం సముత్సృజ్య త్వాముపైష్యతి రావణః.

14

అన్యా తు వికటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
అసకృద్దేవతా యుద్ధే నాగగన్ధర్వదానవాః,
నిర్జితాః సమరే యేన స తే పార్శ్వముపాగతః.

15

తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః,
కిమద్య రాక్షసేన్ద్రస్య భార్యాత్వం నేచ్ఛసేఽధమే.

16

తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః,
న వాతి స్మాయతాపాఙ్గే కిం త్వం తస్య న తిష్ఠసి.

17

నానావిధ రత్నాలతో ప్రకాశిస్తూ, వేలాదిమంది తరుణీమణులతో శోభిల్లుతూ ఉన్న తన అంతఃపురాన్ని సైతం పరిత్యజించి రావణప్రభువు నిన్ను చేరాలని కాంక్షిస్తున్నాడు.

14

తరువాత వికట అనే పేరుగల మరొక రాక్షసస్త్రీ ఇలా చెప్పింది: యుద్ధరంగంలో దేవతలను, నాగులను, గంధర్వులను, దానవులను అనేక పర్యాయాలు అలవోకగా ఓడించిన రావణుడు నీ చెంత చేరడానికి విలవిల్లాడుతున్నాడు.

15

ఓ అధమురాలా! సకలైశ్వర్యాలతో తులతూగుతున్న వాడూ, మహాత్ముడూ, రాక్షస ప్రభుమా అయిన రావణునికి భార్యవు కావడానికి నువ్వెందుకు ఇష్టపడకున్నావు?

16

ఇంతలో దుర్ముఖీ అనే రాక్షసాంగన ఇలా పలికింది: విశాల నయనాలు గల సీతా! ఏ రావణుని భయ కారణంగా సూర్యుడు తీక్ష్ణకిరణాలను ప్రసరింపజేయడో, వాయువు ప్రచండంగా వీచడో అటువంటి రావణప్రభువు ఇచ్ఛ మేరకు నువ్వెందుకు ప్రవర్తించడం లేదు?

17

పుష్పవృష్టిం చ తరవో ముముచుర్యస్య వై భయాత్,
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి.

18

తస్య నైరృత రాజస్య రాజరాజస్య భామిని,
కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి.

19

సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని,
గృహాణ సుస్మితే వాక్యమ్ అన్యథా న భవిష్య సి.

20

తీర్చిదిద్దినట్లున్న కనుబొమ్మలు గల సీతా! ఎవరి భయం వలన వృక్షాలు పువ్వుల వాన కురిపిస్తున్నాయో, ఎవరి కోర్కె మేరకే పర్వతాలు, మేఘాలు మధుర జలాలను సమృద్ధిగా ఇస్తున్నవో అటువంటి రాక్షసరాజూ, రాజాధిరాజూ అయిన రావణునకు భార్యగా ఉండడానికి ఎందుకు ససేమిరా సమ్మతించడం లేదు?

18–19

ఆకర్షణీయమైన చిరునవ్వుతో శోభిల్లే సౌందర్యవతీ! ఓ సీతా! పరిస్థితిని చక్కగా అవగాహన చేసుకొని మా సలహాలు పాటించు. అలా చేయకపోతే నీ జీవితం అర్ధాంతరంగా ముగిసిపోతుంది.

20

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 23వ సర్గ

సమాప్తం

24వ సర్గ

రాక్షసస్త్రీలు సీతను బెదరించి భయపెట్టడం

తతః సీతాముపాగమ్య రాక్షస్యో వికృతాననాః,
పరుషం పరుషా నార్య ఊచుస్తాం వాక్యమప్రియమ్.

1

కిం త్యమన్తఃపురే సీతే సర్వభూతమనోహరే,
మహార్హశయనోపేతే న వాసమనుమన్యసే.

2

మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే,
ప్రత్యాహార మనో రామాన్న త్వం జాతు భవిష్యసి.

3

ఆ తరువాత వికృత ముఖాలు గల, స్వభావంచే క్రూరులైన కొందరు రాక్షస స్త్రీలు సీత ప్రక్కన చేరి గద్దించే ధోరణిలో అప్రియాలైన మాటలు పలుకసాగారు.

1

ఓ సీతా! అతిశ్రేష్ఠములైన శయనాలతో, తల్పాలతో అలరారుతున్న రావణప్రభువు అంతఃపురం సకల జనుల మనస్సులనూ రంజింపజేస్తుంది. అటువంటి అంతఃపురంలో సుఖంగా నివసించడానికి నువ్వెందుకు

అంగీకరించడంలేదు?

2

నువ్వు మానవకాంతవు కనుక మానవునికే భార్యగా ఉండడాన్ని గొప్పగా భావిస్తున్నావు. ఏ రకంగానూ ఎన్నటికీ నువ్వు రాముని చేరుకోలేవు. కనుక నీ మనస్సును ఇక రాముని నుండి మరల్చుకో.

3

త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరమ్,
భర్తారముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్.

4

మానుషీ మానుషం తం తు రామమిచ్ఛసి శోభనే,
రాజ్యాద్భ్రష్టమ సిద్ధార్థం విక్లబం త్వమనిన్దితే.

5

రాక్షసీనాం వచః శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యామిదం వచనమబ్రవీత్.

6

యదిదం లోకవిద్విష్టముదాహరథ సంగతాః,
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః.

7

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః.

8

ముల్లోకాలలోని సమస్త సంపదలు రాక్షసేంద్రుడైన రావణుని కైవసంలో ఉన్నాయి. కనుక అతణ్ణి భర్తగా చేసుకుని సుఖంగా విహరిస్తూ

జీవించు.

4

మంగళప్రదమైన, దోషరహితమైన ఓ సీతా! మానవకాంతవు కావడంచే నువ్వు ఇంకా రాముణ్ణే తలచుకుంటున్నావు. అతడు రాజ్యభ్రష్టుడు. ఏ కార్యంలోనూ కృతకృత్యుడు కాలేని వాడు, క్లేశాల్లో మునిగి ఉన్నవాడు, పైగా కేవలం మానవమాత్రుడు.

5

పద్మనయన అయిన సీతాదేవి ఆ రాక్షసాంగనల మాటలన్నీ విని, కళ్ళనుండి అశ్రువులు స్రవిస్తుండగా ఇలా పలికింది:

6

ఇక్కడ గుమిగూడిన మీరందరూ ఇంతవరకు నాతో జననిందితాలైన మాటలే పలికారు. ఆ పాపిష్టి మాటలు నా మానసిక వైఖరికి సుతరామూ నచ్చవు.

7

మానవస్త్రీ ఎన్నటికీ రాక్షసునకు భార్య కావడం పొసగదు. మీరందరూ కలసి నన్ను చంపి తిన్నాసరే మీరు చెప్పినట్లు మాత్రం ససేమిరా చెయ్యను.

8

దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః,
తం నిత్యమనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా.

9

యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి,
అరున్ధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా.

10

లోపాముద్రా యథాగస్త్యం సుకన్యా చ్యవనం యథా,
సావిత్రీ సత్యవన్తం చ కపిలం శ్రీమతీ యథా.

11

సౌదాసం మదయన్తీవ కేశినీ సగరం యథా,
నైషధం దమయన్తీవ భైమీ పతిమనువ్రతా,
తథాహమిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా.

12

సీతాయా వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
భర్త్సయన్తి స్మ పరుషైర్వాక్యై రావణచోదితాః.

13

నా భర్త దీనుడే అయినా, రాజ్యభ్రష్టుడే అయినా ఆయనే నాకు ఘనుడు, ఆరాధనీయుడు. సూర్యుని యందు సువర్చల అనురాగవతియై ఉన్నట్లు నేను సదా నా భర్త పట్లే అచంచలమైన అనురాగవతిగా ఉంటూనే జీవిస్తాను.

9

శచీదేవి దేవేంద్రుని, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుణ్ణి, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనుని, సావిత్రి సత్యవంతుని, శ్రీమతి కపిల మహర్షిని, మదయంతి సౌదాసుని, కేశిని సగరుని, దమయంతి నలుని అనువర్తించి ఉన్నట్లే నేను ఇక్ష్వాకువంశములో శ్రేష్ఠుడైన రామునే సదా అనువర్తించి ఉంటాను.

10–12

సీతాదేవి మాటలు విని రావణునిచే ఆదేశించబడిన ఆ రాక్షసస్త్రీలు కోపోద్రిక్తలై కఠోరమైన మాటలతో ఆమెను భయపెట్టసాగారు.

13

అవలీనః స నిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే,
సీతాం సంతర్జయన్తీస్తా రాక్షసీరశృణోత్ కపిః.

14

తామభిక్రమ్య సంక్రుద్ధా వేపమానాం సమన్తతః,
భృశం సంలిలిహుర్దీప్తాన్ ప్రలమ్బాన్ దశనచ్ఛదాన్.

15

ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యేశు పరశ్వధాన్,
నేయమర్హతి భర్తారం రావణం రాక్షసాధిపమ్.

16

సంభర్త్స్యమానా భీమాభీ రాక్షసీభిర్వరాననా,
సా బాష్పమపమార్జంతీ శింశుపాం తాముపాగమత్.

17

తతస్తాం శింశుపాం సీతా రాక్షసీభిః సమావృతా,
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా.

18

అంతసేపు శింశుపావృక్షం మీద మౌనంగా దాగివున్న హనుమంతుడు, సీతను భయపెడుతున్న ఆ రాక్షసస్త్రీల మాటలను చెవులు రిక్కించి వినసాగాడు.

14

భయంతో వణకిపోతున్న సీతాదేవిని చుట్టుముట్టి కోపావేశంతో ఆ రాక్షసస్త్రీలు వ్రేలాడుతున్న తమ ఎర్రని పెదవులను నాకుకుంటూ, ఆమెను చంపి తినబోతున్నట్లు ప్రవర్తించసాగారు.

15

ఆ రాక్షసస్త్రీలు గండ్రగొడ్డళ్ళను చేతపుచ్చుకుని, "రాక్షసేంద్రుడైన రావణుని భర్తగా పొందే అర్హత ఈమెకు లేదు" అంటూ ఆగ్రహోదగ్రలై పలికారు.

16

భయంకరులైన రాక్షసస్త్రీలు ఇలా బెదిరిస్తూండగా అందమైన ముఖంగల సీతాదేవి కన్నీరుమున్నీరవుతూ ఆ (హనుమంతుడు దాగివున్న) శింశుపావృక్షం వద్దకు వెళ్ళింది.

17

ఆ విధంగా శింశుపావృక్షం మొదలు వద్దకు చేరిన సీతాదేవిని ఆ రాక్షసి మూక చుట్టుముట్టింది. అప్పుడు విశాలములైన కన్నులు గల సీతాదేవి శోకమగ్నయే అయింది.

18

తాం కృశాం దీనవదనాం మలినామ్బరధారిణీమ్,
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్యస్తాం సమన్తతః.

19

తతస్తాం వినతా నామ రాక్షసీ భీమదర్శనా,
అబ్రవీత్ కుపితాకారా కరాళా నిర్ణతోదరీ.

20

సీతే పర్యాప్తమేతావత్ భర్తృస్నేహో నిదర్శితః,
సర్వత్రాతికృతం భద్రే వ్యసనాయోపకల్పతే.

21

పరితుష్టాస్మి భద్రం తే మానుషస్తే కృతో విధిః,
మమాపి తు వచః పథ్యం బ్రువన్త్యాః కురు మైథిలి.

22

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్,
విక్రాన్తం రూపవన్తం చ సురేశమివ వాసవమ్.

23

దక్షిణం త్యాగశీలం చ సర్వస్య ప్రియదర్శనమ్,
మానుషం కృపణం రామం త్యక్త్వా రావణమాశ్రయ.

24

బాగా కృశించి, దైన్యం ముఖాన తాండవిస్తూండగా, మాసిపోయిన వస్త్రాలను ధరించిన ఆ సీతాదేవి చుట్టూ చేరి ఆ రక్కసిమూక మరింత భయపెట్టసాగింది.

19

అప్పుడు ఎగుడు దిగుడు అవయవాలతో బాగా లోతుకు పోయిన పొట్టతో, తీక్ష్ణమైన చూపులతో, చూడడానికే భయంకరంగా ఉన్న వినత అనే రాక్షసి కోపంగా ఇలా అంది.

20

సీతా! ఇప్పటి వరకు నీ భర్తపట్ల నువ్వు ప్రదర్శించిన ప్రేమ ఇక చాలు. ఓ శుభాంగీ! ఏదీ అతిగా చెయ్యకూడదు. అలా చేస్తే అది కష్టాలనే కొనితెస్తుంది.

21

ఓ సీతా! మానవస్త్రీకి ఉచితమైన ధర్మాన్ని ఆచరించావు. అందుకు సంతోషిస్తున్నాను. నీకు మంచి జరుగుగాక! ఇప్పుడు నీ శ్రేయోభిలాషిగా చెబుతున్న హితవు విని, ఆ ప్రకారం నడుచుకో.

22

రావణుడు మహా పరాక్రమశాలి, రూపవంతుడు, దేవతలకు రాజైన ఇంద్రునివంటి వాడు, నేర్పరి, త్యాగశీలి, అందరికీ ప్రీతిపాత్రుడు. సమస్త

రాక్షసగణాలకు ప్రభువైన అట్టి రావణుని భర్తగా స్వీకరించు. సీతా! మానవుడు, పైగా దీనుడు అయిన రాముని వెంటనే త్యజించి రావణుని ఆశ్రయించు.

23–24

దివ్యాఙ్గరాగా వైదేహి దివ్యాభరణభూషితా,
అద్యప్రభృతి సర్వేషాం లోకానామీశ్వరీ భవ.

25

అగ్నేః స్వాహా యథా దేవీ శచీ వేన్ద్రస్య శోభనే,
కిం తే రామేణ వైదేహి కృపణేన గతాయుషా.

26

ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి,
అస్మిన్ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయమ్.

27

అన్యా తు వికటా నామ లమ్బమానపయోధరా,
అబ్రవీత్ కుపితా సీతాం ముష్టిముద్యమ్య గర్జతీ.

28

ఓ సీతా! నేటి నుండి అత్యంత శ్రేష్ఠములైన మైపూతలతో (అంగరాగాలు) అమూల్య ఆభరణాలను అలంకరించుకొని శోభిల్లు. ఓ మంగళప్రదురాలా! అగ్నిదేవునికి స్వాహాదేవి మల్లే, ఇంద్రునికి శచీదేవి చందాన నువ్వు రావణ ప్రభువుకు భార్యవై సకల లోకాలకూ మహారాణివై వెలుగొందు. దీనుడై ఆయువు తీరనున్న రామునితో ఇక నీకు ఎటువంటి ప్రయోజనమూ లేదు.

25–26

హితోక్తులు ఇంతచెప్పినా వినకపోతే మేమందరమూ ఈ క్షణంలోనే

నిన్ను చంపి భక్షిస్తాం.

27

ఇంతలో వ్రేలాడుతున్న స్తనాలు గల వికట అనే మరో రాక్షసి బిగించిన పిడికిలిని పైకెత్తి గర్జిస్తూ సీతతో కోపంగా ఇలా అంది:

28

బహూన్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే,
అనుక్రోశాన్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి.

29

న చ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్,
అనీతాసి సముద్రస్య పారమన్యైర్దురాసదమ్,
రావణాన్తఃపురం ఘోరం ప్రవిష్టా చాసి మైథిలి.

30

రావణస్య గృహే రుద్ధామస్మాభిస్తు సురక్షితామ్,
న త్వాం శక్తః పరిత్రాతుమపి సాక్షాత్పురన్దరః.

31

కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి,
ఆలమశ్రుప్రపాతేన త్యజ శోకమనర్థకమ్.

32

భజ ప్రీతిం చ హర్షం చ త్యజైతాం నిత్యదైన్యతామ్,
సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్.

33

బుద్ధిహీనురాలైన ఓ సీతా! మాకు సుతరామూ నచ్చని ఎన్నో మాటలు పలికావు. అయినప్పటికీ నీ పట్ల జాలితో, మా మంచితనంతో వాటిని

ఇంతదాకా సహించాం.

29

ఓ సీతా! పరిస్థితులకు అనుగుణంగా మేం చెబుతున్న హితవాక్యాలను నువ్వు పెడచెవిన పెడుతున్నావు. ఇతరులెవరూ చేర శక్యంగాని సముద్రం ఈవలి తీరానికి నిన్ను తెచ్చి, ఎవరూ చొరబడడానికి అశక్యమైన రావణాంతఃపురంలో ఉంచారు.

30

రావణాంతఃపురంలో బందీవై ఉన్న నిన్ను మేము అప్రమత్తంగా కావలి కాస్తున్నాం. సాక్షాత్తు ఆ దేవేంద్రుడే పూనుకొన్నా నిన్ను రక్షించలేడు.

31

సీతా! నీ మంచికోరి చెబుతున్న నా మాట విని ఆ ప్రకారం మసలుకో. నిష్ప్రయోజనమైన శోకాన్ని విడిచిపెట్టు. ఇక ఏడుపు చాలించు.

32

సీతా! ఈ నిత్యదైన్యానికి స్వస్తి పలుకు. ఆనందంగా, ప్రేమగా ఉంటూ రాక్షసరాజైన రావణునితో సుఖంగా క్రీడిస్తూ కాలం గడుపు.

33

జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవనమధ్రువమ్,
యావన్న తే వ్యతిక్రామేత్తావత్ సుఖమవాప్నుహి.

34

ఉద్యానాని చ రమ్యాణి పర్వతోపవనాని చ,
సహ రాక్షసరాజేన చర త్వం మదిరేక్షణే.

35

స్త్రీసహస్రాణి తే సప్త వశే స్థాస్యన్తి సున్దరి,

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్.

36

ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి,
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్కరిష్యసి.

37

తతశ్చణ్డోదరీ నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భ్రామయన్తీ మహచ్ఛూలమిదం వచనమబ్రవీత్.

38

ఓ పిరికిదానా! స్త్రీకి యౌవనం శాశ్వతం కాదన్న విషయం నీకు తెలియనిది కాదు. కనుక ఆ యౌవనం గడచిపోక మునుపే ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొని సుఖించు.

34

మత్తు కల్పించే చూపులు గల ఓ సీతా! రమ్యమైన ఉద్యానవనాలలో, పర్వత ప్రాంతోద్యానాలలో రావణునితో కలసి నువ్వు ఆనందంగా విహరిస్తూ సుఖించు.

35

ఓ సుందరీ! సకల రాక్షసులకు రాజైన రావణుని భర్తగా స్వీకరించు. అప్పుడు ఏడు వేలమంది అందగత్తెలు సదా నీకు సేవలు అందిస్తారు.

36

ఓ సీతా! సదుద్దేశంతో నేను చెప్పింది తు.చ. తప్పక పాటించకపోతే, నీ గుండెను పెకలించి భక్షిస్తాను.

37

తదుపరి చండోదరి అనే రాక్షసి కోపోద్రేకంతో ఒక పెద్ద శూలాన్ని

గిరగిరా తిప్పుతూ ఇలా పలికింది.

38

ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కమ్పిపయోధరామ్,
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహానభూత్.

39

యకృత్ప్లీహమథోత్పీడం హృదయం చ సబన్ధనమ్,
అన్త్రాణ్యపి తథా శీర్షం ఖాదేయమితి మే మతిః.

40

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
కంఠమస్యా నృశంసాయాః పీడయామ కిమాస్యతే.

41

నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ,
నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి.

42

తతస్త్వజాముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
విశస్యేమాం తతః సర్వాః సమాన్ కురుత పీలుకాన్.

43

లేడి కళ్ళవలె చంచలములైన కన్నులు గల, భయం వలన కంపిస్తున్న స్తనములుగల ఈ సీతను, రావణుడు అపహరించి తెచ్చినప్పుడు ఈమె పట్ల నా మదిలో ఒక గొప్ప కోర్కె కలిగింది.

39

ఈమెను చంపి యకృత్తును (గుండెకు కుడివైపు గల మాంస భాగం) ప్లీహాన్ని, ఉత్పీడమును (గుండె పైన గల మాంసభాగం), గుండెకాయను,

ప్రేగులను, తలను తినాలని మహా కోరిక పుట్టింది.

40

తరువాత ప్రఘస అనే రాక్షసి ఇలా అంది: వృథాగా ఇలా ఊరక కూర్చోవడం ఎందుకు? ఈ క్రూరురాలి కంఠం నులిమివేద్దాం.

41

పిదప ఈ మానవస్త్రీ సహజంగానే మరణించిందని రాజుకు తెలియజేద్దాం. అప్పుడు ఆయన ఈమెను తినివెయ్యమని మనకు పురమాయిస్తాడనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

42

ఆ మాటలు విని అజాముఖీ అనే రాక్షసి ఇలా అంది: "ఈమెను చంపి ప్రతి ఒక్కరికీ సమానంగా అందేట్లు మాంసఖండాలను చేయండి."

43

విభజామ తతః సర్వా వివాదో మే న రోచతే,
పేయమానీయతాం క్షిప్రం లేహ్యముచ్చావచం బహు.

44

తతః శూర్పణఖా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
అజాముఖ్యా యదుక్తం హి తదేవ మమ రోచతే.

45

సురా చానీయతాం క్షిప్రం సర్వశోక వినాశినీ,
మానుషం మాంసమాస్వాద్య నృత్యామోథ నికుమ్భిలామ్.

46

ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా,
రాక్షసీభిః సుఘోరాభిర్భయముత్సృజ్య రోదితి.

47

“తరువాత ఆ మాంసఖండాలను అందరమూ పంచుకుందాం. ఎక్కువ తక్కువ అని కలహించుకోవడం నాకు సుతరామూ నచ్చదు. వెంటనే మద్యం, పలువిధాలైన లేహ్యాలను (నాకుకొంటూ తినవలసిన పదార్థాలు) సమృద్ధిగా తెండి.”

44

అప్పుడు శూర్పణఖ అనే మరో రాక్షసి ఇలా అంది: “ఈ అజాముఖీ చెప్పిన విధంగా చేయడానికే నేనూ ఇష్టపడుతున్నాను.

45

“సమస్త శోకాలకూ విరుగుడు అయిన మద్యాన్ని వెంటనే తెప్పించండి. నరమాంస భక్షణ చేసి, లంకానగరానికి పశ్చిమద్వారం వద్ద వెలసిన నికుంభిలాదేవి (భద్రకాళి) సంప్రీతికై నృత్యం చేద్దాం.”

46

ఈ విధంగా భయంకరులై ఆ రాక్షసస్త్రీలు భయపెడుతూ బెదరిస్తూంటే దేవకన్యలా శోభిల్లే సీతాదేవి ధైర్యం కోల్పోయి ఏడవసాగింది.

47

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 24వ సర్గ సమాప్తం

25వ సర్గ
మూర్తీభవించిన శోకమూర్తియైన సీత

అథ తాసాం వదన్తీనాం పరుషం దారుణం బహు,
రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా.

1

ఏవముక్తా తు వైదేహీ రాక్షసీభిర్మనస్వినీ,
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా.

2

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః.

3

కఠినాత్మలైన ఆ రాక్షసస్త్రీలు అలా దారుణంగానూ, పరుషంగానూ మాట్లాడుతూంటే, వారి మాటలు విని సీత భోరున విలపించసాగింది.

1

తన పాతివ్రత్య రక్షణ విషయంలో దృఢసంకల్పంతో ఉన్న సీత, ఆ రాక్షసస్త్రీల కఠోరమైన మాటలు విని ఎంతో భయపడినదై, మాటలు తడబడుతుండగా గద్గదస్వరంలో ఇలా పలికింది.

2

ఒక మానవకాంత రాక్షసునికి భార్య కావడం ఎన్నటికీ పొసగదు.

మీరంతా కలసి నన్ను చంపి మీ ఇష్టానుసారం తిన్నా సరే! ముమ్మాటికీ మీరు చెప్పినట్లు మాత్రం చెయ్యనుగాక చెయ్యను.

3

సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా,
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా.

4

వేపతే స్మాధికం సీతా విశన్తీవాఙ్గమాత్మనః,
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకైరివార్దితా.

5

సా త్వశోకస్య విపులాం శాఖామాలమ్బ్య పుష్పితామ్,
చిన్తయామాస శోకేన భర్తారం భగ్నమానసా.

6

సా స్నాపయన్తీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః,
చిన్తయన్తీ న శోకస్య తదాన్తమధిగచ్ఛతి.

7

సా వేపమానా పతితా ప్రవాతే కదళీ యథా,
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనాభవత్.

8

దేవకన్యవంటి ఆ సీతాదేవి, రావణుడు భయపెట్టి ఉండడం వలనా, రాక్షసస్త్రీల మధ్య ఉన్నందునా అమిత దుఃఖంతో బిక్కుబిక్కుమంటూ శాంతికి కరవై ఉంది.

4

అరణ్యంలో తన మందనుండి విడివడి ఒంటరియై తోడేళ్ళ బారినపడి

బాధింపబడుతున్న లేడి మల్లే సీతాదేవి భయంతో వణకిపోతూ ముడుచుపోయి కూర్చుంది.

5

శోకంచే మనస్సు వికలమైపోగా సీతాదేవి బాగా పుష్పించిన అశోకవృక్షపు పెద్దదైన కొమ్మను ఒకదాన్ని ఆలంబనగా పట్టుకుని భర్తను గురించే తదేకంగా ఆలోచించసాగింది.

6

భర్తనే తలచుకొంటూ కన్నీరుమున్నీరై విలపిస్తున్న సీతాదేవి కళ్ళ వెంట స్రవిస్తున్న అశ్రువుల ధారతో విశాలములైన ఆమె స్తనములు పూర్తిగా తడిసిపోయాయి. ఆమె శోకానికి అంతమే లేనట్లుంది.

7

పెనుగాలికి బాగా వంగిపోయి నేలను తాకుచున్న అరటిచెట్టులా సీతాదేవి రాక్షసస్త్రీల నుండి ఆపద వస్తుందనే భయంతో వణకిపోతూ పాలిపోయిన ముఖంగలదై కానవస్తోంది.

8

తస్యాః సా దీర్ఘవిపులా వేపన్త్యా సీతయా తదా,
దదృశే కమ్పినీ వేణీ వ్యాళీవ పరిసర్పతీ.

9

సా నిఃశ్వసన్తీ దుఃఖార్తా శోకోపహతచేతనా,
ఆర్తా వ్యసృజదశ్రూణి మైథిలీ విలలాప హ.

10

హా రామేతి చ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ,
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ.

11

లోకప్రవాదః సత్యోఽయం పణ్డితైః సముదాహృతః,
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా.

12

యత్రాహమేవం క్రూరాభీ రాక్షసీభిరిహార్దితా,
జీవామి హీనా రామేణ ముహూర్తమపి దుఃఖీతా.

13

భయంతో వణకిపోతున్నప్పుడు సీతాదేవి పొడవైన, ఒత్తైన జడకూడా అటూ ఇటూ కదలుతూ ప్రాకుతున్న పాములా అనిపిస్తోంది.

9

ఒక వంక భర్త ఎడబాటు వలన కలిగిన దుఃఖంతో బాధపడుతూన్న సీతాదేవికి మరోవంక రాక్షసస్త్రీలు భయపెట్టడంతో ఆ దుఃఖం కట్టలు త్రెంచుకోగా ఆమె నిట్టూర్పులు విడుస్తూ ఏకధారగా కన్నీరు కారుస్తూ ఇలా విలపించింది.

10

దుఃఖంతో కుమిలిపోతున్న సీతాదేవి 'హా రామా', 'హా లక్ష్మణా', 'హా అత్తయైన కౌసల్యా', 'హా సుమిత్రా' అంటూ రోదించసాగింది.

11

'ఏ పురుషుడుగాని స్త్రీగాని తాను మరణించగోరినప్పటికీ కాలం ఆసన్నమయ్యేవరకూ మరణం సంభవించదు' అని పండితులు వచిస్తారు. రాముని ఎడబాటుకు గురై ఇలా క్రూరమైన రాక్షసస్త్రీలచే పీడింపబడుతూ కూడా ఇంకా జీవించే ఉన్నానంటే పండితులు పలికిన పై మాటలో ఎంత సత్యం ఉందోకదా!

12–13

ఏషాఽల్పపుణ్యా కృపణా వినశిష్యామ్యనాథవత్,

సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగైరివాహతా.

14

భర్తారం తమపశ్యన్తీ రాక్షసీవశమాగతా,
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా.

15

తం పద్మదళపత్రాక్షం సింహవిక్రాన్తగామినమ్,
ధన్యాః పశ్యన్తి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్.

16

సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా,
తీక్ష్ణం విషమివాస్వాద్య దుర్లభం మమ జీవితమ్.

17

కీదృశం తు మయా పాపం పురా జన్మాన్తరే కృతమ్,
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్.

18

సముద్ర మధ్యంలో తుపాను గాలిలో చిక్కుకున్న సరుకుల ఓడ మునిగిపోయేటట్లు కించిత్తు పుణ్యమే సముపార్జించుకొన్న దీనురాలైన నేను అనాథవలె అంతరించిపోతాను.

14

జలప్రవాహం తాకిడికి కూల్చివేయబడిన ఏటిగట్టులా ఈ రాక్షసస్త్రీలకు వశవర్తినై, నా భర్తయైన రాముని దర్శనానికి నోచుకోని కారణంగా వాటిల్లిన శోకంతో కుమిలి క్రుంగిపోతున్నాను.

15

వికసించిన పద్మాలవంటి నేత్రాలు గల వాడూ, సింహంలా ఠీవిగా

నడచేవాడూ, కృతజ్ఞత గలవాడూ, ప్రీతిగా మాట్లాడే వాడూ అయిన నా నాథుని (రాముని) దర్శనం కేవలం ధన్యాత్ములకు మాత్రమే లభిస్తుంది.

16

ప్రాణాంతకమైన విషం మ్రింగిన తరువాత జీవించడం ఎంత కష్టమో ఆత్మవిదుడైన రాముని ఎడబాసి ఇంక నేను జీవించడమూ అంతే కష్టం.

17

పూర్వజన్మలో నేను ఎంతటి మహాపాపానికి ఒడిగట్టి ఉంటానో కదా! అందుకే ఇప్పుడు దారుణమూ, భయంకరమూ అయిన దుఃఖాన్ని అనుభవిస్తున్నాను.

18

జీవితం త్యక్తుమిచ్ఛామి శోకేన మహతా వృతా,
రాక్షసీభిశ్చ రక్ష్యన్త్యా రామో నాసాద్యతే మయా.

19

ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతామ్,
న శక్యం యత్ పరిత్యక్తుమాత్మచ్ఛన్దేన జీవితమ్.

20

రాక్షసస్త్రీల కట్టుదిట్టమైన కావలిలో ఉన్న నేను రాముని చూడగలగడం కూడా అసాధ్యమే. కనుక శోక సాగరంలో మునిగి ఉన్న నేను మరణింప గోరుతున్నాను.

19

మానవ జీవితం, అందులోనూ పరాధీనమైన జీవితం ఎంత హేయమైనది. పరాధీనమైన జీవితంలో కోరినప్పుడు మరణించే స్వాతంత్ర్యం కూడా మృగ్యం. ఇలా పరిపరివిధాలుగా ఆలోచిస్తూ సీత చెప్పనలవిగాని దిగులుకు లోనయింది.

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 25వ సర్గ
సమాప్తం

26వ సర్గ

సీత ప్రాణత్యాగ సంకల్పం

ప్రసక్తాశ్రుముఖీ త్వేవం బ్రువంతీ జనకాత్మజా,
అధోముఖముఖీ బాలా విలప్తుముపచక్రమే.

1

ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాన్తచిత్తేవ శోచతీ,
ఉపావృత్తా కిశోరీవ వివేష్టన్తీ మహీతలే.

2

రాఘవస్య ప్రమత్తస్య రక్షసా కామరూపిణా,
రావణేన ప్రమథ్యాహమానీతా క్రోశతీ బలాత్.

3

జనకమహారాజు కుమార్తె అయిన సీతాదేవి ముఖాన్ని దించుకొని కన్నీరు మున్నీరై ఇలా పలుకుతూ విలపించసాగింది. పిచ్చిదానిలా, మత్తులో ఉన్న దానిలా, చిత్తభ్రమకు లోనైన దానిలా, అలసట పోగొట్టడానికి పొరలింపబడిన ఆడగుర్రంలా ఆమె నేల మీదపడి దొరలుతూ రోదించసాగింది.

1–2

రాముడు ఏమరిపాటు చెంది ఉన్న సమయంలో రాక్షసుడూ, కామరూపీ అయిన రావణుడు ఆక్రోశిస్తున్న నన్ను బలాత్కారంగా

తీసుకువచ్చాడు.

3

రాక్షసీవశమాపన్నా భర్త్స్యమానా సుదారుణమ్,
చింతయన్తీ సుదుఃఖార్తా నాహం జీవితుముత్సహే.

4

న హి మే జీవితేనార్థో నైవార్థైర్న చ భూషణైః,
వసన్త్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్.

5

అశ్మసారమిదం నూనమథవాప్యజరామరమ్,
హృదయం మమ యేనేదం న దుఃఖేనావశీర్యతే.

6

ధిఙ్మామనార్యామసతీం యాహం తేన వినా కృతా,
ముహూర్తమపి రక్షామి జీవితం పాపజీవితా.

7

కా చ మే జీవితే శ్రద్ధా సుఖే వా తం ప్రియం వినా,
భర్తారం సాగరాన్తాయా వసుధాయాః ప్రియంవదమ్.

8

తమ ఆధీనంలో ఉన్న నన్ను ఈ రాక్షసస్త్రీలు దారుణంగా బెదిరిస్తూ, భయపెడుతున్నారు. సదా పతినే తలపోస్తూ దుఃఖంలో మునిగివున్న ఈ జీవితం పట్ల నాకేమాత్రమూ ఆశలేదు.

4

మహారథుడైన రాముని ఎడబాసి ఈ రాక్షసస్త్రీల మధ్య చిక్కుకుపోయిన నాకు సిరిసంపదలెందుకు? అలంకారాలు ఎందుకు? ఆఖరికి ఈ ప్రాణాలు

మాత్రం ఎందుకు?

5

నిజానికి నా హృదయం నల్లశాణపురాయితో చేయబడినదై ఉండాలి. అది కాఠిన్యంతోకూడా నాశనంకానిదై ఉండాలి. అలాకాకుంటే ఇంత దుఃఖం వాటిల్లినా అది ఎందుకు బ్రద్దలుకావడంలేదు?

6

రామునికి దూరమై క్షణం కూడా జీవించకూడని నేను ఇలా రాముని ఎడబాటును ఓర్చుకొంటూ జీవిస్తున్నానంటే నేనెంతటి పాపినో, దుష్టురాలనో కదా!

7

సముద్ర పర్యంతం విస్తరించి ఉన్న ఈ భూమండలానికి ప్రభువు నా భర్త. అతడు ప్రియభాషి. అటువంటి ప్రియతముని ఎడబాసిన నాకు సుఖాల మీదగాని, జీవితం మీదగాని మమకారం ఎందుకు?

8

భిద్యతాం భక్షతాం వాపి శరీరం విసృజామ్యహమ్,
న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా.

9

చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్,
రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్.

10

ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్,
యో నృశంసస్వభావేన మాం ప్రార్థయితుమిచ్ఛతి.

11

ఛిన్నా భిన్నా విభక్తా వా దీప్తే వాగ్నౌ ప్రదీపితా,
రావణం నోపతిష్ఠేయం కిం ప్రలాపేన వశ్చిరమ్.

12

ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః,
సద్వృత్తో నిరనుక్రోశః శఙ్కే మద్భాగ్య సంక్షయాత్.

13

నన్ను ముక్కలుగా నరికి ఈ రాక్షసస్త్రీలు భక్షించినా సరే ప్రాణత్యాగానికి నేను సంసిద్ధనై ఉన్నాను. నా ప్రియభర్తకు దూరమై చిరకాలం ఈ అంతులేని దుఃఖాలను సహించలేను.

9

నింద్యుడైన ఆ నిశాచరుణ్ణి (రాక్షసుణ్ణి) నేను ఎడమకాలితో సైతం తాకను. అట్టి రావణుని నేను కోరతానా?

10

తనను వరించమని క్రూరంగా నిర్బంధిస్తున్న ఈ రావణుడు నేను ససేమిరా తిరస్కరిస్తున్నాననే విషయాన్నిగాని, తన వంశ మర్యాదనుగాని కించిత్తుకూడా గుర్తించడంలేదు.

11

ఓ రాక్షసస్త్రీలారా! మీరు నన్ను అడ్డంగా నరికినా, ముక్కలు ముక్కలుగా కోసినా, మంటలో వేసి కాల్చినా సరే ఆ రావణునికి మాత్రం లొంగను. మీ ప్రేలాపనలు వ్యర్థం.

12

రాముడు పేరుప్రఖ్యాతులు గలవాడు, వివేకి, కృతజ్ఞత గలవాడు, దయామయుడు, సద్వర్తనుడు. అటువంటి వాడు ఇప్పుడు నా పట్ల జాలి చూపకపోవడానికి నా దురదృష్టమే కారణం.

13

రాక్షసానం సహస్రాణి జనస్థానే చతుర్దశ,
యేనైకేన నిరస్తాని స మాం కిం నాభిపద్యతే.

14

నిరుద్ధా రావణే నాహమల్పవీర్యేణ రక్షసా,
సమర్థః ఖలు మే భర్తా రావణం హన్తుమాహవే.

15

విరాధో దండకారణ్యే యేన రాక్షసపుంగవః,
రణే రామేణ నిహతః స మాం కిం నాభిపద్యతే.

16

కామం మధ్యే సముద్రస్య లంకేయం దుష్ప్రధర్షణా,
న తు రాఘవబాణానాం గతిరోధీహ విద్యతే.

17

కిం ను తత్కారణం యేన రామో దృఢపరాక్రమః,
రక్షసాపహృతాం భార్యామిష్టాం నాభ్యవపద్యతే.

18

జనస్థానంలో పద్నాలుగు వేలమంది రాక్షసులను తానొక్కడే సంహరించిన రాముడు నేడు నన్ను రక్షింప ఎందుకు ఉపేక్షిస్తున్నాడో?

14

అంతంతమాత్రమే పరాక్రమంగల రావణుడు నన్ను నిర్బంధించి ఉంచాడు. నా భర్తయైన రాముడు ఇతగాణ్ణి రణరంగంలో ఇట్టే సంహరించగల సమర్థుడనడంలో కించిత్తు కూడా సందేహంలేదు.

15

దండకారణ్యంలో రాక్షసశ్రేష్ఠుడైన విరాధుణ్ణి అలవోకగా మట్టికరిపించిన మహావీరుడైన రాముడు ఇప్పుడు నన్ను రక్షించడానికి ఎందుకు రాకున్నాడో?

16

సముద్ర మధ్యంలో నెలకొని ఉన్న ఈ లంకానగరం శత్రుదుర్భేద్యమూ అజేయమూ అవడం నిజమే కావచ్చు. కాని రామ బాణాల గమనాన్ని అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు.

17

సాటిలేని పరాక్రమవంతుడైన రాముని ప్రియభార్యను. అటువంటి నన్ను ఈ రాక్షసుడు అపహరించగా నన్ను రక్షించి తీసుకుపోవడానికి రాముడు రాకపోవడానికి కారణం ఏమిటో?

18

ఇహస్థాం మాం న జానీతే శఙ్కే లక్ష్మణపూర్వజః,
జానన్నపి హి తేజస్వీ ధర్షణం మర్షయిష్యతి.

19

హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్,
గృధ్రరాజోఽపి స రణే రావణేన నిపాతితః.

20

కృతం కర్మ మహత్తేన మాం తథాభ్యవపద్యతా,
తిష్ఠతా రావణద్వన్ద్వే వృద్ధేనాపి జటాయుషా.

21

యది మామిహ జానీయాద్వర్తమానాం స రాఘవః,
అద్య బాణైరభిక్రుద్ధః కుర్యాల్లోకమరాక్షసమ్.

22

నేను ఇక్కడ బందీగా ఉన్నట్లు రామునికి అసలు తెలియదేమోననే సందేహం నాకు లేకపోలేదు. ఒకవేళ తెలిసివుంటే తేజశ్శాలియైన రాముడు లజ్జాహీనమైన రావణుని ఈ దుశ్చర్యను సహిస్తాడా?

19

నేను (సీత) ఇలా రావణునిచే అపహరింపబడ్డ సమాచారాన్ని సత్వరమే రామునికి అందజేయగలిగిన వాడు గృధ్రరాజైన జటాయువు. దురదృష్టవశాత్తు అతడు రావణునితో తలపడి మరణించాడు గదా!

20

జటాయువు వృద్ధుడైనప్పటికీ రావణునితో ద్వంద్వ యుద్ధంచేసి నన్ను రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించి శ్లాఘనీయమైన వీరోచితకార్యంలో అసువులు బాసాడు.

21

ఈ లంకలో నేను ఇలా బందీనై ఉన్నాననే విషయం రామునికి తెలిసివుంటే అతడు ఆగ్రహోదగ్రుడై ఈ లోకంలో మచ్చుకి ఒక్క రాక్షసుడు కూడా మిగులకుండేట్లు చేసేవాడు.

22

విధమేచ్ఛ పురీం లఙ్కాం శోషయేచ్ఛ మహోదధిమ్,
రావణస్య చ నీచస్య కీర్తిం నామ చ నాశయేత్.

23

తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే,
యథాహమేవం రుదతీ తథా భూయో న సంశయః.

24

అన్విష్య రక్షసాం లఙ్కాం కుర్యాద్రామః సలక్ష్మణః,
న హి తాభ్యాం రిపుర్దృష్టో ముహూర్తమపి జీవతి.

25

చితాధూమాకులపథా గృధ్రమణ్డలసంకులా,
అచిరేణ తు లఙ్కేయం శ్మశానసదృశీ భవేత్.

26

అంతేకాక రాముడు ఈ లంకను, దాని ఉనికే లేకుండా 'ఉఫ్' అని ఊదిపారేసేవాడు, ఈ సముద్రాన్ని బొట్టు నీరైనా లేకుండా ఎండింపజేసేవాడు. నీచుడైన రావణుని నామరూపాలు లేకుండా చేసేవాడు.

23

ఇప్పుడు నేనెలా విలపిస్తున్నానో ఆ విధంగానే ఈ లంకలో ప్రతి ఇంట్లోను భర్తలు మరణించిన రాక్షసస్త్రీలు కన్నీరుమున్నీరై కుమిలికుమిలి రోదించే ధ్వనులతో ఈ నగరం ప్రతిధ్వనిస్తుంది. దీన్లో ఎలాంటి సందేహమూ లేదు.

24

లక్షణ సమేతుడైన రాముడు రాక్షసుల ఆవాసమైన ఈ లంకానగరాన్ని వెతకి కనుగొనగలడు. అలా కనుగొన్న వెంటనే వారి కంటబడ్డ శత్రువు క్షణం కూడా ప్రాణాలతో ఉండడు. ఇది తథ్యం.

25

త్వరలోనే ఈ నగరం శ్మశానమైపోతుంది. ఈ నగర వీథులన్నీ రాక్షసుల చితిమంటల పొగలతో క్రమ్ముకునిపోతాయి. రాక్షసుల మృతదేహాల కోసం నగరం మీద రాబందులు వృత్తాకారంలో ఎగురుతూ తిరుగుతాయి.

26

అచిరేణైవ కాలేన ప్రాప్స్యామ్యేవ మనోరథమ్,
దుష్ప్రస్థానోఽయమాఖ్యాతి సర్వేషాం వో విపర్యయమ్.

27

యాదృశానీహ దృశ్యన్తే లఙ్కాయామశుభాని వై,
అచిరేణ తు కాలేన భవిష్యతి హతప్రభా.

28

నూనం లఙ్కా హతే పాపే రావణే రాక్షసాధమే,
శోషం యాస్యతి దుర్ధర్షా ప్రమదా విధవా యథా.

29

పుణ్యోత్సవసముత్థా చ నష్టభర్త్రీ సరాక్షసీ,
భవిష్యతి పురీ లఙ్కా నష్టభర్త్రీ యథాఽఙ్గనా.

30

నూనం రాక్షసకన్యానాం రుదన్తీనాం గృహే గృహే,
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానామిహ ధ్వనిమ్.

31

అచిరకాలంలోనే నా మనోరథం ఈడేరి తీరుతుంది. మీ ఈ దుష్టప్రవర్తనే మీకు వాటిల్లబోతున్న వినాశనాన్ని సూచిస్తున్నది.

27

ఈ లంకలో అశుభాన్ని సూచించే అనేక దుశ్శకునాలు కానవస్తున్నాయి. త్వరలోనే శోభాయమానంగా ఉన్న ఈ నగరం పాడుబడిపోవడాన్ని అవి చెప్పక చెబుతున్నాయి.

28

పాపాత్ముడూ, రాక్షసాధముడూ అయిన రావణుడికి కాలం మూడింది. అతడు వధింపబడగానే అజేయమైన ఈ లంకానగరం వైధవ్యం ప్రాప్తించిన స్త్రీమల్లే కళావిహీనమౌతుంది. ఇది ఖాయం.

29

సకల రాక్షసులతో సహా రాజైన రావణుడు మరణించడంతో కేవలం స్త్రీలు మాత్రమే లంకలో మిగిలి ఉంటారు. అప్పుడు లంకానగరం వైధవ్యం ప్రాప్తించిన స్త్రీలా ఎటువంటి శుభకార్యాలకూ నోచుకోదు.

30

ఈ లంకానగరంలో త్వరలోనే ప్రతి ఇంట్లోనూ రాక్షసాంగనలు దుఃఖపీడితలై విలపిస్తూండగా వారి రోదన ధ్వనులను స్పష్టంగా వినగలను.

31

సాన్ధకారా హతద్యోతా హతరాక్షసపుఙ్గవా,
భవిష్యతి పురీ లఙ్కా నిర్దగ్ధా రామసాయకైఃం.

32

యది నామ స శూరో మాం రామో రక్తాన్తలోచనఃం,
జానీయాద్వర్తమానాం హి రావణస్య నివేశనే.

33

అనేన తు నృశంసేన రావణేనాధమేన మే,
సమయో యస్తు నిర్దిష్టస్తస్య కాలోఽయమాగతఃం,
స చ మే విహితో మృత్యుఃం అస్మిన్ దుష్టేన వర్తతే.

34

అకార్యం యే న జానన్తి నైర్ఋతాఃం పాపకారిణఃం,
అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్.

35

నైతే ధర్మం విజానన్తి రాక్షసాఃం పిశితాశనాఃం,
ధ్రువం మాం ప్రాతరాశార్థే రాక్షసఃం కల్పయిష్యతి.

36

మహాశూరుడూ, కోపంచే ఎర్రబారిన కనుకొనలు గలవాడూ అయిన రామునికి నేను ఇక్కడ రావణుని నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిన వెంటనే లంకలోని రాక్షస వీరులందరూ రామబాణాలకు నేలకొరుగుతారు. లంకానగరం దగ్ధమైపోయి, చిమ్మచీకట్లు సర్వత్రా అలముకొంటాయి. లంక అంధకారబంధురమైపోతుంది.

32–33

అయ్యో! క్రూరుడూ, అధముడు అయిన ఈ రావణుడు నాకు ఇచ్చిన గడువు తీరిపోతోందే! ఈ దుష్టునికి ఆ మృత్యువు ఎందుకు దాపరించడంలేదు?

34

పాపకృత్యాలతో నిమగ్నులై ఉన్న ఈ రాక్షసులు తాము ఒనరించే అధర్మ కార్యాచరణ వలన కలిగే దుష్పరిణామాలను, ఈ నగరవాసులకు వాటిల్లబోయే మహోపద్రవం గూర్చి గ్రహించలేకున్నారు.

35

నరమాంసభక్షకులైన ఈ రాక్షసులకు ధర్మమేదో తెలియదు. ఏదో ఒక రోజు తన ప్రాతఃకాల భోజనార్థం ఈ రావణుడు నన్ను వండించి తీరతాడు.

36

సాఽహం కథం కరిష్యామి తం వినా ప్రియదర్శనమ్,
రామం రక్తాన్తనయనమపశ్యన్తీ సుదుఃఖీతా.

37

యది కశ్చిత్ ప్రదాతా మే విషస్యాద్య భవేదిహ,
క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా.

38

నాజానాజ్జీవతీం రామః స మాం లక్ష్మణపూర్వజః,

జానన్తౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్.

39

నూనం మమైవ శోకేన స వీరో లక్ష్మణాగ్రజః,
దేవలోకమితో యాతస్త్యక్త్వా దేహం మహీతలే.

40

ధన్యా దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
మమ పశ్యన్తి యే నాథం రామం రాజీవలోచనమ్.

41

ప్రియదర్శనుడు, ఎర్రని కనుకొనలు గలవాడు అయిన రాముని కానలేక దుఃఖంలో మునిగి ఉన్న నేను ఇప్పుడు ఏం చేయగలను?

37

ఇక్కడ ఎవరైనా నాకు విషం ఇచ్చే దాత ఉన్నట్లయితే, ఇక భర్త ఎడబాటు దుఃఖాన్ని అనుభవించకుండా వెంటనే యమలోకానికి పోగలుగుతాను.

38

లక్ష్మణాగ్రజుడైన రామునకు నేను ఇంకా జీవించే ఉన్నాననే విషయం బహుశా తెలిసివుండకపోవచ్చు. అలా తెలిసి ఉన్న పక్షంలో వారిద్దరూ నా కోసం ఈ భూమండలాన్నంతా తప్పక వెతకుతూనే ఉంటారు గదా!

39

వీరుడైన రాముడు నా వియోగ దుఃఖం భరించలేక భూలోకంలో తనువు చాలించి దేవలోకం చేరివుండవచ్చునని నిశ్చయంగా నాకు అనిపిస్తోంది.

40

నా నాథుడూ, పద్మనయనుడూ అయిన రాముని స్వర్గంలో దర్శించుకోగలుగుతున్న దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఎంతటి ధన్యాత్ములో కదా!

41

అథవా న హి తస్యార్థో ధర్మకామస్య ధీమతః,
మయా రామస్య రాజర్షేర్భార్యయా పరమాత్మనః.

42

దృశ్యమానే భవేత్ప్రీతిః సౌహృదం నాస్త్యపశ్యతః,
నాశయన్తి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి.

43

కిం ను మే న గుణాః కేచిత్కిం వా భాగ్యక్షయో మమ,
యాఽహం సీదామి రామేణ హీనా ముఖ్యేన భామినీ.

44

శ్రేయో మే జీవితాన్మర్తుం విహీనాయా మహాత్మనః,
రామాదక్లిష్టచారిత్రాత్ శూరాచ్ఛత్రునిబర్హణాత్.

45

లేదా రాముడు జీవించే ఉండవచ్చు. కాని అచంచలమైన ధర్మనిష్ఠ గలవాడు, జ్ఞాని, రాజర్షి, వాస్తవానికి పరమాత్ముడు అయిన రామునిలో వైరాగ్యం కలిగి ఉండవచ్చు. ఇక భార్యనైన నా వలన ఏం ప్రయోజనం ఉంటుంది? అందువల్లనే నన్ను ఉపేక్షించి ఉండవచ్చు.

42

లోకంలో ఎవరికైనా వాళ్ళ కళ్ళముందు కనబడుతున్నంత వరకు ప్రేమ నెలకొని ఉంటుంది. ఆ సదరు వ్యక్తి కనబడనప్పుడు ప్రేమ అంతరించిపోతుంది. ఇది ఇతరుల విషయంలోనూ, కృతఘ్నుల

విషయంలోనూ నిజం కావచ్చు. కాని రాముడు నన్నూ, నా ప్రేమనూ విస్మరించడం అసంభవం.

43

స్త్రీనైన నేను, నా భర్తా, లోకారాధ్యుడూ అయిన రాముని ఎడబాటు వల్ల వాటిల్లిన శోకంతో క్రుంగికృశించిపోతున్నాను. నాలో ఏ సద్గుణాలూ లేవా? లేక నా భాగ్యం హఠాత్తుగా క్షీణించిపోయిందా? ఇలా ఎందుకు జరుగుతోంది?

44

మహాత్ముడూ, ఉదాత్తచరిత్రుడు, శూరుడు, శత్రుసంహారకుడూ అయినట్టి పతియైన రాముని ఎడబాసి జీవించడంకన్నా మరణించడమే మేలు.

45

అథవా న్యస్తశస్త్రౌ తౌ వనే మూలఫలాశినౌ,
భ్రాతరౌ హి నరశ్రేష్ఠౌ సంవృత్తౌ వనగోచరౌ.

46

అథవా రాక్షసేన్ద్రేణ రావణేన దురాత్మనా,
ఛద్మనా ఘుతితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ.

47

సాఽహమేవం గతే కాలే మర్తుమిచ్ఛామి సర్వథా,
న చ మే విహితో మృత్యురస్మిన్ దుఃఖేఽపి వర్తతి.

48

ధన్యాః ఖలు మహాత్మానో మునయస్త్యక్తకిల్బిషాః,
జితాత్మానో మహాభాగా యేషాం నస్తః ప్రియాప్రియే.

49

లేదా పురుషశ్రేష్ఠులైన ఆ సోదరులిద్దరూ (రామలక్ష్మణులు) శస్త్రాస్త్ర సన్న్యాసం చేసి అరణ్యాలలో దుంపలు, పండ్లు తింటూ మునివృత్తిని పాటిస్తున్నారో ఏమో?

46

లేదా శూరాగ్రేసరులైన ఆ రామలక్ష్మణులను, దుర్మార్గుడూ రాక్షసరాజూ అయిన ఈ రావణుడు కపటోపాయంతో చంపించి ఉంటాడేమో!

47

జరుగుతున్న ఇటువంటి దుర్భరమైన కాలఘట్టంలో నాకు మరణమే అన్నివిధాలా శరణ్యమనిపిస్తోంది. కాని ఇంతటి దుఃఖసమయంలో కూడా నాకు మరణం ప్రాప్తించకున్నదే!

48

పాపరహితులూ, మహాత్ములూ, జితేంద్రియులూ అయిన మునీశ్వరులు సుఖదుఃఖాలకు అతీతులైన ధర్మాత్ములు. వారికి 'ఇది ప్రియం, ఇది అప్రియం' అనే తారతమ్యమే ఉండదు.

49

ప్రియాన్న సంభవేద్దుఃఖమప్రియాదధికం భయమ్,
తాభ్యాం హి యే వియుజ్యన్తే నమస్తేషాం మహాత్మనామ్.

50

సాఽహం త్వక్తా ప్రియార్హేణ రామేణ విదితాత్మనా,
ప్రాణాం స్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్.

51

సుఖం ప్రాప్తించినప్పుడు మనస్సు ఆనందంతో నిండిపోతుంది; కష్టం వాటిల్లినప్పుడు మనస్సు దుఃఖమయం అవుతుంది. కాని ఈ రెండు మానసిక

పరిస్థితులకూ అతీతులైన వారు మహాత్ములు. అటువంటి వారికి నమస్కారం.

50

అటువంటి మహాత్ముల వలె సుఖదుఃఖాలకు నేను అతీతురాలను కాను; సర్వజ్ఞుడు, నాకు ప్రాణాధికుడూ అయిన రాముని ఎడబాసి, పాపాత్ముడైన రావణుని అధీనంలో ఉన్న నేను ప్రాణత్యాగం చేస్తాను.

51

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 26వ సర్గ

సమాప్తం

27వ సర్గ

త్రిజటా స్వప్న ఉదంతం

ఇత్యుక్తాః సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
కాశ్చిజ్జగ్ముస్తదాఖ్యాతుం రావణస్య దురాత్మనః.

1

తతః సీతాముపాగమ్య రాక్షస్యో ఘోరదర్శనాః,
పునః పరుషమేకార్థమనర్థార్థమథాబ్రువన్.

2

అద్యేదానీం తవానార్యే సీతే పాపవినిశ్చయే,
రాక్షస్యో భక్షయిష్యన్తి మాంసమేతద్యథాసుఖమ్.

3

సీతాదేవి మాటలు విన్న ఆ రాక్షసస్త్రీలు కోపోద్రిక్తులయ్యారు. వారిలో కొందరు ఈ విషయాలు తెలియజేయడానికి దురాత్ముడైన రావణుని వద్దకు వెళ్ళారు.

1

భయంకర స్వరూపిణులైన ఆ రాక్షసస్త్రీలు సీతాదేవి చుట్టూ చేరి మునుపు చెప్పిన అనర్థకరములైన మాటలనే మళ్ళీ కఠోరంగా చెప్పసాగారు.

2

అనార్యురాలమా, (ఆత్మహత్యకు పాల్పడడమనే) పాప సంకల్పం గల

ఓ సీతా! ఇప్పుడే రాక్షసస్త్రీలమైన మేమంతా నీ మాంసంతో విందు చేసుకొంటాం చూడు!

3

సీతాం తాభిరనార్యాభిర్దృష్ట్వా సంతర్జితాం తదా,
రాక్షసీ త్రిజటా వృద్ధా శయనా వాక్యమబ్రవీత్.

4

ఆత్మానం ఖాదతానార్యా న సీతాం భక్షయిష్యథ,
జనకస్య సుతామిష్టాం స్నుషాం దశరథస్య చ.

5

స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రాక్షసానామభావాయ భర్తురస్యా జయాయ చ.

6

ఏవముక్తాస్త్రిజటయా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
సర్వా ఏవాబ్రువన్ భీతాస్త్రిజటాం తామిదం వచః.

7

కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి,
తాసాం శ్రుత్వా తు వచనం రాక్షసీనాం ముఖాచ్చ్యుతమ్.

8

ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితమ్,
గజదన్తమయీం దివ్యాం శిబికామన్తరిక్షగామ్.

9

యుక్తాం హంససహస్రేణ స్వయమాస్థాయ రాఘవః,
శుక్లమాల్యామ్బరధరో లక్ష్మణేన సహాగతః.

10

అప్పటి వరకు నిద్రిస్తూ అప్పుడే మేల్కొన్న త్రిజట అనే వివేకవంతురాలైన ఒక వృద్ధ రాక్షసి దుష్టరాండ్రైన ఆ రాక్షసిమూక సీతను భయపెట్టడం చూసింది. వెంటనే వారితో ఇలా చెప్పసాగింది.

4

ఓ దురాత్మురాండ్రా! జనకమహారాజు పుత్రికా, దశరథ మహారాజు కోడలూ, సర్వులకూ ప్రీతిపాత్రురాలూ అయిన సీతాదేవినా మీరు భక్షించగోరుతున్నారు. అలా భక్షించే తీరాలంటే ఆమెకు మారుగా నన్ను తినండి.

5

ఇప్పుడే నాకు గగుర్పాటు కలిగించే ఒక పీడకల వచ్చింది. ఆ కల రాక్షసుల సర్వనాశనాన్ని, ఈమె భర్తయైన రాముని విజయాన్ని సూచిస్తున్నది.

6

కోపావేశంలో ఉన్న ఆ రాక్షసస్త్రీలు త్రిజట మాటలు విని భయాందోళనలకులోనై ఆమెతో ఇలా అన్నారు.

7

"ఓ త్రిజటా, నీ స్వప్న ఉదంతం సవివరంగా చెప్పు." అందుకు త్రిజట ఆ ప్రాతఃకాలంలో తనకు వచ్చిన కల గూర్చి ఇలా చెప్పసాగింది. "ఏనుగు దంతాలతో నిర్మితమై, వేయి హంసలు మోస్తున్న ఒక దివ్యమైన పల్లకీ ఆకాశంలో సంచరిస్తూ ఇటు వస్తూండడం నేను కలలో చూశాను. ఆ పల్లకీలో లక్ష్మణ సమేతుడై రాముడు తెల్లని మాలలు, తెల్లని వస్త్రములు ధరించి ఆసీనుడై ఉన్నాడు.

8–10

స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా,

సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వతమాస్థితా.

11

రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా,
రాఘవశ్చ మయా దృష్టశ్చతుర్దంతం మహాగజమ్,
ఆరూఢః శైలసంకాశం చచార సహలక్ష్మణః.

12

తతస్తౌ నరశార్దూలౌ దీప్యమానౌ స్వతేజసా,
శుక్లమాల్యామ్బరధరౌ జానకీం పర్యుపస్థితౌ.

13

సముద్ర మధ్యంలోని ఒక తెల్లని పర్వతం మీద తెల్లని వస్త్రాలు ధరించి కూర్చుని ఉన్న సీత కూడా అప్పుడు కలలో నాకు కనిపించింది.

11

కాంతి సూర్యునిలో కూడినట్లుగా, సీత రాముని చేరడాన్ని చూశాను. తదుపరి రాముడు నాలుగు దంతాలుగల పర్వత ప్రమాణంలో ఉన్న ఒక ఏనుగునెక్కి లక్ష్మణునితో కలసి ఆకాశమార్గంలో వస్తూండడం నాకు కనిపించింది.

12

తమ తేజస్సుతో భాసిస్తున్న పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులు తదనంతరం తెల్లని మాలలను, తెల్లని వస్త్రాలను ధరించి సీత వద్దకు రావడం చూశాను.

13

తతస్తస్య నగస్యాగ్రే హ్యేకాశస్థస్య దన్తినః,
భర్త్రా పరిగృహీతస్య జానకీ స్కన్ధమాశ్రితా.

14

భర్తురఙ్కాత్సముత్పత్య తతః కమలలోచనా,
చన్ద్రసూర్యౌ మయా దృష్టౌ పాణినా పరిమార్జతీ.

15

తతస్తాభ్యాం కుమారాభ్యామాస్థితః స గజోత్తమః,
సీతయా చ విశాలాక్ష్యా లఙ్కాయ ఉపరి స్థితః.

16

పాణ్డురర్షభయుక్తేన రథేనాష్టయుజా స్వయమ్,
ఇహోపయాతః కాకుత్థ్సః సీతయా సహ భార్యయా.

17

అప్పుడు ఆకాశంలో ఆ మహాగజాన్ని రాముడు నిలిపి ఉంచగా పర్వతాగ్రం మీద ఉన్న సీత ఆ ఏనుగు మూపుపై ఎక్కి రాముని ఒడిని చేరింది.

14

ఆ తరువాత పద్మముల వంటి కన్నులు గల సీత, భర్త ఒడిలోనుండి లేచి నిలబడి సూర్యచంద్రులను తన చేతులతో బుజ్జగించి లాలిస్తూన్నట్లు నాకు కనిపించింది.

15

తదనంతరం రామలక్ష్మణులు, సీతాదేవి అధిరోహించిన పర్వత ప్రమాణంలో ఉన్న ఆ మహాగజం లంకా నగరం నడినెత్తిన ఆకాశంలో నిలబడింది.

16

మరొక దృశ్యంలో రాముడు సీతా లక్ష్మణ సమేతుడై తెల్లని ఎనిమిది వృషభములు పూన్చిన రథం మీద ఇక్కడకు రావడం కలలో నాకు కనిపించింది.

17

లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ వీర్యవాన్,
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్,
ఉత్తరాం దిశమాలోక్య జగామ పురుషోత్తమః.

18

ఏవం స్వప్నే మయా దృష్టో రామో విష్ణుపరాక్రమః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ రాఘవః.

19

న హి రామో మహాతేజాః శక్యో జేతుం సురాసురైః,
రాక్షసైర్వా పి చాన్యైర్వా స్వర్గః పాపజనైరివ.

20

రావణశ్చ మయా దృష్టోః క్షితౌ తైలసముక్షితః,
రక్తవాసాః పిబన్ మత్తః కరవీరకృతస్రజః.

21

పిదప సాటిలేని పరాక్రమవంతుడూ, పురుషశ్రేష్ఠుడూ అయిన ఆ రాముడు, భార్యయైన సీతతో తమ్ముడైన లక్ష్మణునితో సహా సూర్యప్రకాశానికి దీటైన కాంతిపుంజాలు విరజిమ్ముతున్న దివ్య పుష్పకవిమానం అధిరోహించి ఉత్తర దిశగా సాగిపోయాడు.

18

విష్ణువుకు సాటియైన పరాక్రమం గల రాముడు, ఆతని సోదరుడైన లక్ష్మణుడు, భార్యయైన సీత ఈ రీతిలో నాకు స్వప్నంలో కనిపించారు.

19

ఎలా పాపాత్ములు స్వర్గలోకవాసాన్ని ప్రాప్తించుకోలేరో, అదే విధంగా సురాసురులుగాని, రాక్షసులుగాని, అన్యులుగాని మహాతేజశ్శాలియైన రామునిపై విజయం సాధించడం అసంభవం.

20

ఎర్రని వస్త్రములు, ఎర్రని గన్నేరు దండలను ధరించి, శరీరానికి నూనె పూసుకుని, నూనె త్రాగుతూ మత్తులో నేలమీద పడి ఉన్న రావణుని కూడా నా కలలో చూశాను.

21

విమానాత్పుష్పకాదద్య రావణః పతితో భువి,
కృష్యమాణః స్త్రియా దృష్టో ముణ్డః కృష్ణామ్బరః పునః.

22

రథేన ఖరయుక్తేన రక్తమాల్యానులేపనః,
పిబంస్తైలం హసన్నృత్యన్ భ్రాన్తచిత్తాకులేన్ద్రియః,
గర్దభేన యయౌ శీఘ్రం దక్షిణాం దిశ మాస్థితః.

23

పునరేవ మయా దృష్టో రావణో రాక్షసేశ్వరః,
పతితోఽవాక్ఛిరా భూమౌ గర్దభాద్భయమోహితః.

24

సహసోత్థాయ సంభ్రాన్తో భయార్తో మదవిహ్వలః,
ఉన్మత్త ఇవ దిగ్వాసా దుర్వాక్యం ప్రలవన్ బహు.

25

దుర్గన్ధం దుస్సహం ఘోరం తిమిరం నరకోపమమ్,
మలపఙ్కం ప్రవిశ్యాశు మగ్నస్తత్ర స రావణః.

26

మరో దృశ్యంలో రావణునికి శిరోముండనం జరిగినట్లూ, నల్లని వస్త్రాలు ధరించిన అతడు పుష్పకవిమానం నుండి నేలమీద పడిపోగా అతణ్ణి

ఒక స్త్రీ ఈడ్చుకుపోతున్నట్టు నాకు కనిపించింది.

22

మరొకసారి రావణుడు ఎర్రని మాలలు ధరించి, మైపూతలను అలదుకొని నూనె త్రాగుతూ భ్రాంతచిత్తుడై, ఇంద్రియనిగ్రహం కోల్పోయి నవ్వుతూ, నృత్యం చేస్తూ గాడిదలు పూన్చిన రథం ఎక్కి దక్షిణం వైపుగా వెళ్ళడం నాకు కలలో కనబడింది.

23

రాక్షసేశ్వరుడైన రావణుడు పిదప భయాందోళనకు గురై దిక్కుతోచని వాడై గాడిద మీద నుండి తలక్రిందులుగా భూమిపై పడిపోయినట్లు కలలో నాకు కనిపించాడు.

24

అలా భూమ్మీద పడ్డ రావణుడు వెంటనే తత్తరపాటుచే లేచి భయపడుతూ మదంచే వివశుడై, దిగంబరుడై పిచ్చివాడిలా దుర్భాషలు ప్రేలాపించసాగాడు. అంతలో భరింపశక్యంకాని దుర్గంధపూరితమైన, భయంకరమైన, అంధకారబంధురమైన నరకకూపంలాంటి మలపంకంలో పడి దాన్లో మునిగిపోయాడు.

25–26

కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ,
కాళీ కర్దమలిప్తాఙ్గీ దిశం యామ్యాం ప్రకర్షతి.

27

ఏవం తత్ర మయా దృష్టః కుమ్భకర్ణో మహాబలః,
రావణస్య సుతాః సర్వే దృష్టాస్తైలసముక్షితాః.

28

వరాహేణ దశగ్రీవః శింశుమారేణ చేన్ద్రజిత్,

ఉష్ట్రేణ కుమ్భకర్ణశ్చ ప్రయాతా దక్షిణాం దిశమ్.

29

ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః,
శుక్లమాల్యామ్బరధరః శుక్లగన్ధానులేపనః.

30

అప్పుడు ఎర్రని వస్త్రములు ధరించిన, శరీరమంతా బురదమయమై ఉన్న ఒక కారునలుపు స్త్రీ, రావణుని మెడకు తాడు కట్టి దక్షిణ దిశగా ఈడ్చుకుపోసాగింది.

27

నిశాచరుడైన (రాక్షసుడైన) కుంభకర్ణుడు కూడా కలలో నాకు ఇలాగే కనిపించాడు. రావణుని కుమారులందరూ శరీరాలకు నూనె పూసుకొని ఉన్నట్లు కానవచ్చారు.

28

రావణుడు పందిని, ఇంద్రజిత్తు మొసలిని, కుంభకర్ణుడు ఒంటెను ఎక్కి దక్షిణ దిశగా పోవడం నాకు కలలో కనిపించింది.

29

వారిలో ఒక్క విభీషణుడు మాత్రం మల్లెపువ్వులాంటి తెల్లని వస్త్రాలను, మాలలను ధరించి, తెల్లని స్వచ్ఛమైన గంధంతో ఒప్పారుతూ, తెల్లని గొడుగు దాల్చి కనిపించాడు.

30

శంఖదున్దుభినిర్ఘోషైర్నృత్తగీతైరలఙ్కృతః,
ఆరూహ్య మేఘసంకాశం మేఘస్తనితనిస్వనమ్.

31

చతుర్దన్తం గజం దివ్యమాస్తే తత్ర విభీషణః,
చతుర్భిః సచివైః సార్ధం వైహాయసముపస్థితః.

32

సమాజశ్చ మయా దృష్టో గీతవాదిత్రనిస్స్వనః,
పిబతాం రక్తమాల్యానాం రక్షసాం రక్తవాససామ్.

33

లఙ్కా చేయం పురీ రమ్యా సవాజిరథకుంజరా,
సాగరే పతితా దృష్టా భగ్నగోపురతోరణా.

34

లఙ్కా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా,
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా.

35

శంఖదుందుభుల ధ్వనులు, నృత్యగీతాలు ఇత్యాది వేడుకల మధ్య పర్వతంవలె సమున్నతమైన, మేఘగర్జనలవంటి ఘీంకారాలు సలుపుతున్న నాలుగు దంతాల గజరాజును ఆ విభీషణుడు తన నలుగురు మంత్రులతో కలసి అధిరోహించి ఆకాశమధ్యంలో నిలబడి ఉండడం నేను చూశాను.

31–32

రాక్షసులందరూ ఎర్రని మాలలు, ఎర్రని వస్త్రాలు ధరించి గుంపులు గుంపులుగా అక్కడ చేరి ఉండడాన్ని చూశాను. వారంతా మద్యం గ్రోలుతూ, వాద్యాలు వాయిస్తూ, పాటలు పాడుతూ కానవచ్చారు.

33

అత్యంత సుందరమైన ఈ లంకానగరంలోని గోపురాలూ, ముఖద్వారాలూ కూలిపోయి గుర్రాలు, ఏనుగులు, రథాలతో సహా లంక యావత్తూ సముద్రంలో మునిగిపోతూండడం నాకు కలలో కనిపించింది.

34

ఇప్పటి వరకు రావణుని సురక్షిత రక్షణలో ఉన్న ఈ లంకానగరాన్ని రాముని దూత, వాయువేగం గలవాడు అయిన ఒక వానరుడు దగ్ధం చేస్తున్నట్లు కలలో చూశాను.

35

పీత్వా తైలం ప్రనృత్తాశ్చ ప్రహసన్త్యో మహాస్వనాః,
లఙ్కాయాం భస్మరూక్షాయాం సర్వా రాక్షసయోషితః.

36

కుమ్భకర్ణాదయశ్చేమే సర్వే రాక్షసపుఙ్గవాః,
రక్తం నివసనం గృహ్య ప్రవిష్టా గోమయాహ్రదే.

37

అపగచ్ఛత నశ్యధ్వం సీతా మాపస రాఘవః,
ఘాతయేత్పరమామర్షీ సర్వైః సార్ధం హి రాక్షసైః.

38

ప్రియాం బహుమతాం భార్యాం వనవాసమనువ్రతామ్,
భర్త్సితాం తర్జితాం వాపి నానుమంస్యతి రాఘవః.

39

బూడిదరాసులతో నిండిన ఈ లంకానగరంలోని రాక్షసస్త్రీలందరూ నూనె త్రాగుతూ వికటాట్టహాసాలతో వెర్రిగంతులు వేస్తూండే దృశ్యం నాకు కలలో కనిపించింది.

36

కుంభకర్ణాది రాక్షస శ్రేష్ఠులందరూ ఎర్రని వస్త్రాలు ధరించి పేడ గుంటలలో పడి మునిగిపోతూండడం నా కంటపడింది.

37

కనుక ఓ రాక్షసాంగనలారా! కనిపించకుండా ఇక్కణ్ణుండి దూరంగా తొలగిపోండి. రాముడు సీతను పొందడం ఖాయం. తన భార్యను బాధించాడనే ఆగ్రహంతో రాక్షసులందరినీ అతడు సంహరిస్తాడు. వారితో పాటు సీతను హింసించారనే కోపంతో మిమ్మల్ని కూడా అతడు వధించడం తథ్యం.

38

రామునికి సీత అత్యంత ప్రీతిపాత్రురాలు, ఆరో ప్రాణం. అతణ్ణి అనుసరిస్తూ వనవాస దీక్షను ఆచరించిన మహాసాధ్వి ఆమె. అటువంటి భార్యను ఎవరైనా భయపెట్టినా, దుర్భాషలాడినా రాముడు ఎంతమాత్రమూ సహించడు.

39

తదలం క్రూరవాక్యైర్వ్యః సాన్త్వమేవాభిధీయతామ్,
అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే.

40

యస్యామేవంవిధః స్వప్నో దుఃఖీతాయాం ప్రదృశ్యతే,
సా దుఃఖైర్వివిధైర్ముక్తా ప్రియం ప్రాప్నోత్యనుత్తమమ్.

41

భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా,
రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్.

42

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా,
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్.

43

కనుక సీతతో ఇక ఎంతమాత్రం పరుషంగా పలుకకండి. వీలయినంత వరకు ఆమెతో మృదుమధురంగా మాట్లాడండి. ఆమెను క్షమించమని బ్రతిమాలుకుందాం. ఇదే యుక్తమని నేను భావిస్తున్నాను.

40

అమిత దుఃఖంలో ఉన్న ఏ స్త్రీకి సంబంధించి ఇటువంటి కలను కంటామో, ఆమె సమస్త దుఃఖాల నుండి విముక్తి పొంది సర్వోత్కృష్ట అభ్యున్నతిని గాంచుతుంది.

41

ఓ రాక్షసస్త్రీలారా! ఇప్పటి వరకు ఈమెను భయపెట్టి బెదిరించాము కదా! ఇప్పుడు రక్షించు తల్లీ అని నోరు తెరిచి ఎలా అడగగలమని సంకోచించకండి. ఈమెను ప్రార్థించండి, అంతే! ఎందుకంటే రాముడి వలన ఇప్పుడు రాక్షసులకు అనుకోని భయంకరమైన ఆపద ముంచుకువస్తోంది.

42

ఓ రాక్షసాంగనలారా! జనకమహారాజు కుమార్తెయైన ఈ సీతకు మనస్ఫూర్తిగా నమస్కరిద్దాం. అంతమాత్రానికే ఈమె మన తప్పిదాలను మన్నించి మన పట్ల ప్రసన్నురాలయి మనలను ఈ ఘోరవిపత్తునుండి రక్షిస్తుంది.

43

అపి చాస్యా విశాలాక్ష్యా న కించిదుపలక్షయే,
విరూపమపి చాఙ్గేషు సుసూక్ష్మమపి లక్షణమ్.

44

ఛాయావైగుణ్యమాత్రం తు శఙ్కే దుఃఖముపస్థితమ్,
అదుఃఖార్హామిమాం దేవీం వైహాయసముపస్థితామ్.

45

అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యామ్యహముపస్థితామ్,
రాక్షసేన్ద్రవినాశం చ విజయం రాఘవస్య చ.

46

నిమిత్తభూతమేతత్తు శ్రోతుమస్యా మహత్ప్రియమ్,
దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్రమివాయతమ్.

47

మరొక విశేషం ఏమిటంటే విశాలనేత్రాలు గల ఈ సీత మేనియందు ఎక్కడా అమంగళకరమైన, అశుభకరమైన లక్షణం మచ్చుకి ఒక్కటి కూడా కానరావడం లేదు.

44

దివ్య విమానాన్ని అధిష్ఠించినట్లు కలలో నేను చూసిన సీతకు, ఈమెకు ఒక్క తేడా మాత్రం నాకు కనిపిస్తోంది. అది ఆమె మేని వర్చస్సులో (ఛాయ). ఇప్పుడు అనుభవిస్తున్న దుఃఖం కారణంగానూ, స్నానాది సంస్కారాలు లేకపోవడం వల్లా ఆమె మేని కాంతిలో కొంత తరుగు కనబడుతోంది.

45

సీతాదేవి మనోభీష్టమైన, రావణుని వినాశం, రాముని విజయం తప్పక నెరవేరే సమయం ఆసన్నమైనదని నాకు కచ్చితంగా అనిపిస్తోంది.

46

తామర రేకువలె విశాలమైన ఈమె ఎడమ కన్ను అదురుతూండడం గొప్ప శుభసూచకం. ఈమె మహదానందకరమైన ఒక శుభవార్తను వినబోతున్నదని ఇది సూచిస్తున్నది.

47

ఈషచ్చ హృషితో వాస్యా దక్షిణాయా హ్యదక్షిణః,
అకస్మాదేవ వైదేహ్యా బహురేకః ప్రకమ్పతే.

48

కరేణుహస్తప్రతిమః సవ్యశ్చోరురనుత్తమః,
వేపమానః సూచయతి రాఘవం పురతః స్థితమ్.

49

పక్షీ చ శాఖానిలయం ప్రవిష్టః
పునః పునశ్చోత్తమసాన్త్వవాదీ
సుస్వాగతాం వాచముదీరయానః
పునః పునశ్చోదయతీవ హృష్టః.

50

మృదుస్వభావియైన సీతాదేవి ఎడమ భుజం గగుర్పాటుకు లోనై అకస్మాత్తుగా అదురుతూ కంపిస్తున్నది. ఇది కూడా ఆమెకు త్వరలో ప్రాప్తించబోయే శుభాన్నే సూచిస్తున్నది.

48

ఆడ ఏనుగు తొండం వంటి ఆమె ఎడమ తొడ కంపిస్తున్నది. ఈ శుభ శకునం రాముడు త్వరలోనే ఆమె ఎదుటకు రాబోతున్నాడని సూచిస్తున్నది.

49

అల్లంత దూరంలోని చెట్టు కొమ్మ మీది గూటిలోని పక్షి ఎంతో సంతోషంతో సీతకు అత్యంత ఆప్తుడు రాబోతున్నాడని స్వాగతం పలుకుతున్నట్లు పదేపదే మధురంగా కూస్తూ రామాగమనాన్ని సూచనప్రాయంగా తెలుపుతోంది.

50

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 27వ సర్గ
సమాప్తం

28వ సర్గ

సీత ప్రాణత్యాగానికి ఉద్యమించడం

సా రాక్షసేన్ద్రశ్చ వచో నిశమ్య
తద్రావణస్యాప్రియమప్రియార్తా,
సీతా విత్రాస యథా వనాన్తే
సింహాభిపన్నా గజరాజకన్యా.

1

సా రాక్షసీమధ్యగతా చ భీరు
ర్వాగ్భిర్భృశం రావణతర్జితా చ,
కాన్తారమధ్యే విజనే విసృష్టా
బాలేవ కన్యా విలలాప సీతా.

2

ఏ సాధ్వీ వినలేని రాక్షసరాజైన రావణుని కఠోర వచనాలు వినడం వలన, రాముని ఎడబాటు కారణంగాను చెప్పవలవిగాని దుఃఖంలో మునిగిపోయినదై, అరణ్య మధ్యంలో సింహం బారినపడ్డ ఆడ ఏనుగు చందాన సీత భయవిహ్వలయైనది.

1

రాక్షసస్త్రీల మధ్య దిక్కుతోచక విలవిల్లాడుతూ, రావణుని కర్ణకఠోరమైన మాటలతో మరింత బెదరిపోయిన సహజంగానే భయస్థురాలైన సీత నిర్జనమైన అరణ్యమధ్యంలో ఒంటరిగా వదలివేయబడి

బిక్కుబిక్కుమంటున్న బాలిక వలె విలపించింది.

2

సత్యం బతేదం ప్రవదన్తి లోకే
నాకాలమృత్యుర్భవతీతి సన్తః,
యత్రాహమేవం పరిభర్త్స్యమానా
జీవామి కించిత్క్షణమప్యపుణ్యా.

3

సుఖాద్విహీనం బహుదుఃఖపూర్ణ
మిదం తు నూనం హృదయం స్థిరం మే,
విశీర్యతే యన్న సహస్రధాఽద్య
వజ్రాహతం శృఙ్గమివాచలస్య.

4

నైవాస్తి దోషం మమ నూనమత్ర
వధ్యాహమస్యాఽప్రియదర్శనస్య,
భావం న చాస్యాహమనుప్రదాతు
మలం ద్విజో మన్త్రమివాద్విజాయ.

5

పుణ్యహీననైన నేను ఈ రక్కసిమూకచే ఇలా భయపెట్టబడుతున్నా, దీనురాలనై ప్రాణాలు విడువకుండా క్షణమైనా జీవిస్తున్నాను అంటే రాసిపెట్టిన సమయం ఆసన్నం కాకుండా మృత్యువు రాదనే ప్రాజ్ఞుల వచనాలలో ఎంత సత్యం ఉంది!

3

ఎటువంటి సుఖసంతోషాలూలేక కేవలం దుఃఖ క్లేశాలతో మాత్రమే నిండి ఉన్న నా హృదయం అత్యంత కఠినమైనదై ఉండాలి. కనుకనే ఇది

వజ్రాయుధ ఘాతానికి తుత్తునియలయ్యే పర్వతశిఖరంలా వేయి ముక్కలు కావడం లేదు.

4

ద్విజుడు, ద్విజేతరునికి ఎన్నటికీ మంత్రం ఉపదేశించనట్లే, నేను ఈ రాక్షసునికి నా మనస్సును ఇవ్వలేను, ఇవ్వను కూడా. అట్టి పరిస్థితిలో భీతిగొల్పే రూపంగల ఈ రావణుడు నన్ను తప్పక చంపి తీరుతాడు. కనుక ఈ క్షణంలోనే నేను ఆత్మహత్య చేసుకోవడంలో ఎటువంటి దోషమూ లేదు.

5

నూనం మామాజ్ఞాన్యచిరాదనార్యః
శస్త్రైః శితైశ్ఛేత్స్యతి రాక్షసేన్ద్రః,
తస్మిన్ననాగచ్ఛతి లోకనాథే
గర్భస్థజన్తోరివ శల్యకృన్తః.

6

దుఃఖం బతేదం మమ దుఃఖీతాయా
మాసౌ చిరాయాధిగమిష్యతో ద్వౌ,
బద్ధస్య వధ్యస్య తథా నిశాన్తే
రాజాపరాధాదివ తస్కరస్య.

7

హా రామ హా లక్ష్మణ హా సుమిత్రే
హా రామమాతః సహ మే జనన్యా,
ఏషా విపద్యామ్యహమల్పభాగ్యా
మహార్ణవే నౌరివ మూఢవాతా.

8

లోకనాథుడైన రాముడు గడవులోపు ఇక్కడకు రాకపోతే దురాత్ముడైన

ఈ రావణుడు, గర్భంలోని మృతపిండాన్ని శస్త్రచికిత్స ద్వారా ముక్కలు ముక్కలుగా చేసి వెలికి తీసేటట్లు, వాడియైన శస్త్రాలతో నా అవయవాలను ఖండఖండాలుగా తప్పక నరుకుతాడు.

6

అయ్యో! రాజాపరాధం కారణంగా మరణదండన విధింపబడ్డ దొంగను ఇక తెల్లవారితే వధిస్తారనగా అతడికి ఆ రాత్రి భారంగా, దుర్భరంగా గడుస్తుంది. దుఃఖంలో మునిగి ఉన్న నాకు రావణుడు ఇచ్చిన రెండు మాసాల గడువు, పైన పేర్కొన్న దొంగ స్థితి వలె దుర్భరంగా, భారంగా గడుస్తోంది కదా!

7

అయ్యో రామా! లక్ష్మణా! సుమిత్రాదేవీ! అయ్యో రామమాతవైన కౌసల్యాదేవీ! అయ్యో! నా తల్లీ భూదేవీ! దుర్భాగ్యురాలైన నేను ఇప్పుడు సముద్రమధ్యంలో సుడిగాలికి గురైన ఓడ మల్లే విపత్కర పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నాను.

8

తరస్వినౌ ధారయతా మృగస్య
సత్త్వేన రూపం మనుజేన్ద్రపుత్రౌ,
నూనం విశస్తౌ మమ కారణాత్తౌ
సింహర్షభౌ ద్వావివ వైద్యుతేన.

9

నూనం స కాలో మృగరూపధారీ
మామల్పభాగ్యం లులుభే తదానీమ్,
యత్రార్యపుత్రం విససర్జ మూఢా
రామానుజం లక్ష్మణపూర్వజం చ.

10

హా రామ సత్యవ్రత దీర్ఘబాహో
హా పూర్ణచన్ద్రప్రతిమానవక్త్ర,
హా జీవలోకస్య హితః ప్రియశ్చ
వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్.

11

శ్రేష్ఠతమమైన రెండు సింహాలు పిడుగుపాటుకు నేలకొరిగిపోయినట్లు, మహాబలశాలులైన ఆ రామలక్ష్మణులు నా మూలంగా లేడి రూపంలో వచ్చిన మాయారాక్షసుని వాతబడి ప్రాణాలు కోల్పోయి ఉంటారని నిస్సందేహంగా నాకు అనిపిస్తోంది.

9

నిజానికి ఆ రోజు కాలపురుషుడే లేడిరూపం దాల్చి దురదృష్టవంతురాలైన నన్ను ప్రలోభపెట్టాడు. ఆ ప్రలోభంలో వివేకం కోల్పోయిన నేను ముందుగా రాముని ఆ లేడిని పట్టుకొని రమ్మని, తరువాత లక్ష్మణుని పంపించాను.

10

అయ్యో! సత్యవ్రతుడమా, దీర్ఘబాహుడమా, నిండు చంద్రుని వంటి మోము గలవాడమా, సమస్త ప్రాణికోటికీ హితుడమా, ప్రియతముడమా అయిన ఓ రామా! తమకు విందుగా రాక్షసులు నన్ను చంపబోతున్నారనే విషయం నీకు తెలియదా!

11

అనన్యదైవత్వమియం క్షమా చ
భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే,
పతివ్రతాత్వం విఫలం మమేదం

కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్.

12

మోఘో హి ధర్మశ్చరితో మయాఽయం
తథైకపత్నీ త్వమిదం నిరర్థమ్,
యా త్వాం న పశ్యామి కృశా వివర్ణా
హీనా త్వయా సంగమనే నిరాశా.

13

పితుర్నిదేశం నియమేన కృత్వా
వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ,
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభి,
స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః.

14

పతినే పరమ దైవంగా ఆరాధిస్తున్నాను. రాక్షసుల దారుణ వచనాలనూ, బాధలనూ ఓర్పుతో సహిస్తున్నాను. కటిక నేలమీద శయనిస్తున్నాను. ధర్మాన్ని తు.చ. తప్పక పాటిస్తున్నాను. చెక్కుచెదరని పాతివ్రత్య నిష్ఠతో జీవిస్తున్నాను. ఇవి అన్నీ కృతఘ్నులైన మనుజులకు చేసిన ఉపకారం మల్లే నిష్ఫలమై పోతున్నాయి.

12

రామా! నా ధర్మాచరణ యావత్తూ నిష్ప్రయోజనమైనది. నా పాతివ్రత్య పాలన, నీ ఏకపత్నీవ్రత నియమమూ నిరర్థకం అయ్యాయి. అందుకేనేమో నీ దర్శనభాగ్యం కరవైనది; నీకై కృశించి కళాకాంతులు నశించాయి. నిన్ను మళ్ళీ కలుసుకోగలననే ఆశకూడా అడుగంటింది.

13

రామా! పితృవాక్పరిపాలనను నియమనిష్ఠలతో పాలించి, వనవాస

వ్రతాన్ని పూర్తిచేయడంలో కృతకృత్యుడవై, అయోధ్యకు తిరిగి వెళ్ళి, శోకరహితుడవై నీ తల్లుల ఆలనలో సుఖసంతోషాలతో నువ్వు జీవించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

14

అహం తు రామ త్వయి జాతకామా
చిరం వినాశాయ నిబద్ధభావా,
మోఘం చరిత్వాఽథ తపో వ్రతం చ
త్యక్ష్యామి ధిగ్జీవితమల్పభాగ్యా.

15

సా జీవితం క్షిప్రమహం త్యజేయం
విషేణ శస్త్రేణ శితేన వాపి,
విషస్య దాతా న హి మేఽస్తి కశ్చి
చ్ఛస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య.

16

ఇతీవ దేవీ బహుధా విలప్య
సర్వాత్మనా రామమనుస్మరన్తీ,
ప్రవేపమానా పరిశుష్కవక్త్రా
నగోత్తమం పుష్పితమాససాద.

17

ఓ రామా! నేను మాత్రం సదాసర్వవేళలా నీ యందే అనురాగబద్ధనై నువ్వే సర్వస్వంగా జీవిస్తూ వచ్చాను. కాని నేను ఎంతటి దురదృష్ట వంతురాలనయ్యాను. నిన్ను కలుసుకోలేని నా ధర్మాచరణ, తపస్సు, పాతివ్రత్యమూ అన్నీ నేటితో వ్యర్థాలయ్యాయి. కనుక ప్రాణత్యాగానికి సంకల్పిస్తున్నాను.

15

కనుక వెంటనే గుక్కెడు విషం త్రాగిగాని లేదా వాడియైన ఆయుధంతో పొడుచుకొని గాని ప్రాణత్యాగం చేసుకొంటాను. ఇలా అనుకొంటున్నానేగాని ఈ రాక్షసుల నివాసంలో నాకు విషంగాని లేదా వాడియైన ఆయుధంగాని ఎవరు ఇస్తారు?

16

సీతాదేవి ఇలా పరిపరి విధాల విలపిస్తూ, సర్వాత్మభావంతో రాముణ్ణే స్మరిస్తూ, దుఃఖంతో కంపిస్తూ, నోరు పిడచగట్టుకుపోగా బాగా పుష్పించిన ఆ అశోక వృక్షం వద్దకు వెళ్ళింది.

17

శోకాభితప్తా బహుధా విచిన్త్య
సీతాఽథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా,
ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్రు
మహం గమిష్యామి యమస్య మూలమ్.

18

ఉపస్థితా సా మృదుసర్వగాత్రా
శాఖాం గృహీత్వాఽథ నగస్య తస్య,
తస్యాస్తు రామం ప్రవిచిన్తయన్త్యా
రామానుజం స్వం చ కులం శుభాఙ్గ్యాః.

19

శోకానిమిత్తాని తథా బహూని
ధైర్యార్జితాని ప్రవరాణి లోకే,
ప్రాదుర్నిమిత్తాని తదా బభూవుః
పురాపి సిద్ధాన్యుపలక్షితాని.

20

దుఃఖంతో పరితపిస్తున్న సీతాదేవి పరిపరి విధాల యోచించి, పొడవైన తన జడను చేతపుచ్చుకొని, 'ఈ జడతో ఉరిపోసుకుని వెంటనే యమలోకానికి పోతాను' అని నిర్ణయించుకొంది.

18

అలా నిర్ణయించుకొన్న సుకుమారియైన ఆ సీతాదేవి శింశుపావృక్షపు కొమ్మను గట్టిగా పట్టుకుని నిలబడింది. తదుపరి రాముని, లక్ష్మణుని, తన వంశాన్ని గూర్చి తలచుకోసాగింది. అప్పుడు సీతకు శోకాన్ని తొలగించి ధైర్యాన్ని కలిగించే లోకప్రసిద్ధాలైనవి, గతంలో సత్ఫలాలనిచ్చినవి అయిన కొన్ని శుభశకునాలు కనిపించాయి.

19–20

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 28వ సర్గ

సమాప్తం

29వ సర్గ
సీతకు గోచరించిన శుభశకునాలు

తథాగతాం తాం వ్యథితామనిందితాం
వ్యపేతహర్షాం పరిదీనమానసామ్,
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే
నరం శ్రియా జుష్టమివోపజీవినః.

1

తస్యాః శుభం వామమరాళపక్ష్మ
రాజీవృతం కృష్ణవిశాలశుక్లమ్,
ప్రాస్పన్దతైకం నయనం సుకేశ్యా
మీనాహతం పద్మమివాభితామ్రమ్.

2

హఠాత్తుగా ఐశ్వర్యం లభించిన వ్యక్తి వద్దకు ఆశ్రితులు వచ్చి చేరినట్లు, దుఃఖంతో, దైన్యంతో తల్లడిల్లిపోతూ ఉన్న మంగళప్రదురాలూ, దోషరహితురాలూ, కించిత్తుకూడా ఆనందం లేనిదైన ఆ సీతాదేవిని అనేక శుభశకునాలు సమీపించాయి.

1

నడుమ నల్లగా, చుట్టూ తెల్లగా, కొనలందు ఎర్రగా ఉన్న విశాలమైన ఆ సీతాదేవి కళ్ళ అందాన్ని వంపు తిరిగిన కనుబొమ్మలు ద్విగుణీకృతం చేస్తున్నాయి. అటువంటి కళ్ళలో ఎడమకన్ను, కొలనులో చేప తగిలితే కదలే

పద్మంలా అదిరింది.

2

భుజశ్చ చార్వఞ్చితపీనవృత్తః
పరార్థ్యకాలాగరుచన్దనార్హః,
అనుత్తమేనాధ్యుషితః ప్రియేణ
చిరేణ వామః సమవేపతాఽశు.

3

గజేన్ద్రహస్తప్రతిమశ్చ పీన
స్తయోర్ద్వయోః సంహతయోః సుజాతః,
ప్రస్పన్దమానః పునరూరురస్యా
రామం పుస్తారత్ స్థితమాచచక్షే.

4

శుభం పునర్హేమసమానవర్ణ
మీషద్రజోధ్వస్తమివామలాక్ష్యాః,
వాసః స్థితాయాః శిఖరాగ్రదత్యాః
కించిత్ పరిస్రంసత చారుగాత్ర్యాః.

5

చూడ ముచ్చటగా, ఒప్పిదమై, గుండ్రంగా పరిపుష్టమై, శ్రేష్ఠమైన అగరు చందనాదులు అలదుకోవడానికి తగినదైన, లోకోత్తరుడూ భర్తా అయిన రామునికి చాలాకాలం తలగడగా ఒప్పారిన సీతాదేవి ఎడమ భుజం కూడా వెంటనే కంపించింది.

3

ఏనుగు తొండలా లావైన, పరిపుష్టమైన, అందమైన, ఒకదానితో ఒకటి పొందికగా కలసి ఉన్న సీతాదేవి తొడలలో, ఎడమ తొడ చలిస్తూ, రాముడు

త్వరలోనే ఆమె ముందుకు రాబోతున్నాడని సూచించింది.

4

నిర్మలములైన నేత్రాలు, మల్లెమొగ్గవంటి పలువరుస, చక్కని అవయవ సంపదగల సీతాదేవి నిలబడి ఉండగా, మంగళప్రదమైన, బంగారువన్నె కలిగి, ధూళిచే ఒకింత కాంతివిహీనంగా ఉన్నప్పటికీ శోభిస్తూన్న ఆమె చీర, భర్త సమాగమ సూచకంగా అన్నట్లు కొద్దిగా జారింది.

5

ఏతైర్నిమిత్తైరపరైశ్చ సుభ్రూః
సంబోధితా ప్రాగపి సాధు సిద్ధైః,
వాతతపక్లాన్తమివ ప్రణష్టం
వర్షేణ బీజం ప్రతిసంజహర్ష.

6

తస్యాః పునర్బిమ్బఫలాధరోష్ఠం
స్వక్షిభ్రుకేశాన్తమరాళపక్ష్మ,
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం
రాహోర్ముఖాచ్చంద్ర ఇవ ప్రముక్తః.

7

సా వీతశోకా వ్యపనీతతన్ద్రీ
శాన్తజ్వరా హర్షవిబుద్ధసత్త్వా,
అశోభతార్యా వదనేన శుక్లే
శీతాంశునా రాత్రిరివోదితేన.

8

చక్కని కనుబొమలు గల ఆ సీతాదేవి ఇదివరకే అనుభవపూర్వకంగా సత్ఫలాలను ఇచ్చిన ఈ శుభశకునాల చేత, ఇతర నిమిత్తములచేత తనకు

శుభాలు కలుగబోతున్నవని గ్రహించింది. అంతే, అప్పుడు ఆమె గాలికీ ఎండకూ బాగా ఎండిపోయిన విత్తనం వర్షం పడగానే అంకురించిన రీతిలో ఎంతో ఆనందించింది.

6

దొండపండులాంటి ఎర్రని పెదవి, ఆకర్షణీయమైన నేత్రాలు, కనుబొమలు, ముంగురులు, వంకర తిరిగిన కనురెప్పలు, తెల్లని అందమైన పలువరుస సంతరించుకొన్న ఆ సీతాదేవి ముఖారవిందం రాహు ముఖంనుండి వెలువడ్డ చంద్రబింబంలా అప్పుడు ప్రకాశించింది.

7

శుభశకునములు గోచరించడంచే పూజ్యురాలైన ఆ సీతాదేవి శోకం సమసిపోయింది. అలసత్వం పోయి మ్లానమైన ఆమె ముఖాన వెలుగు ద్యోతకమయింది. సంతోషంతో మనస్సు వికాసం చెందగా ఆమె చంద్రోదయంచే శుక్లపక్ష రాత్రిమల్లే శోభిల్లింది.

8

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 29వ సర్గ

సమాప్తం

30వ సర్గ

సీతను ఊరడింప హనుమంతుడు సంకల్పించడం

హనుమానపి విక్రాన్తః సర్వం శుశ్రావ తత్త్వతః,
సీతాయాస్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్.

1

అవేక్షమాణస్తాం దేవీం దేవతామివ నన్దనే,
తతో బహువిధాం చిన్తాం చిన్తయామాస వానరః.

2

యాం కపీనాం సహస్రాణి సుబహూన్యయుతాని చ,
దిక్షు సర్వాసు మార్గన్తే సేయమాసాదితా మయా.

3

అశోకవృక్షం మీద తనను మరుగుపరచుకుని కూర్చున్న పరాక్రమవంతుడైన హనుమంతుడు రాక్షసాంగనల బెదిరింపులను, సీతాదేవి ప్రత్యుత్తరాన్ని, త్రిజటా స్వప్న ఉదంతాన్ని యావత్తు యథాతథంగా ఆలకించాడు.

1

తదనంతరం దేవేంద్రుని నందనవనంలోని దేవతాస్త్రీలా అశోకవనంలో భాసిస్తున్న సీతాదేవిని పరికిస్తూ పరిపరివిధాలైన ఆలోచనల్లో హనుమంతుడు

మునిగిపోయాడు.

2

ఏ సీతాదేవి నిమిత్తం లక్షలాది వానరులు అన్ని దిక్కులందూ వెతకుతున్నారో, ఆమెను నేను చూడగలిగాను.

3

చారేణ తు సుయుక్తేన శత్రోఃశక్తిమవేక్షతా,
గూఢేన చరతా తావదవేక్షితమిదం మయా.

4

రాక్షసానాం విశేషశ్చ పురీ చేయమవేక్షితా,
రాక్షసాధిపతేరస్య ప్రభావో రావణస్య చ.

5

యుక్తం తస్యాప్రమేయస్య సర్వసత్త్వదయావతః,
సమాశ్వాసయితుం భార్యాం పతిదర్శనకాంక్షిణీమ్.

6

అహమాశ్వాసయామ్యేనాం పూర్ణచన్ద్రనిభాననామ్,
అదృష్టదుఃఖాం దుఃఖార్తాం దుఃఖస్యాన్తమగచ్ఛతీమ్.

7

శత్రు బలాన్ని అంచనాగట్టడానికి రామదూతనై వచ్చిన నేను ఎవరి దృష్టిలోనూ పడకుండా జాగ్రత్తగా గూఢచారిలా సంచరిస్తూ వచ్చాను. అప్రమత్తంగా ఇలా సంచరించినందున నేను సమస్త విషయాలు పూర్తిగా అనగతంచేసుకో గలిగాను.

4

రాక్షసుల శక్తిసామర్థ్య విశేషాలను, ఈ లంకానగర ఆనుపానులను,

రాక్షసాధిపతియైన రావణుని ప్రభావాన్ని, ఆతడి వైఖరిని తెలుసుకొన్నాను.

5

సమస్త జీవుల పట్ల కరుణ గలవాడు, అమేయ బలపరాక్రమాలు గలవాడూ అయినటువంటి తన భర్త అయిన రాముని దర్శనానికై ఆరాటపడుతున్న ఈ సీతాదేవిని ముందుగా ఊరడించడం యుక్తం.

6

పున్నమి చంద్రుని పోలిన వదనం గల ఈ సీత గతంలో ఎన్నడూ ఇంతటి దుఃఖాన్ని అనుభవించలేదు. దుఃఖాలతో క్రుంగిపోతున్న ఈమె క్లేశాలకు అంతమేలేనట్లున్నది. అటువంటి పరిస్థితిలో ఉన్న ఈమెను నేను ఊరడిస్తాను.

7

యద్యప్యహమిమాం దేవీం శోకోపహతచేతనామ్,
అనాశ్వాస్య గమిష్యామి దోషవద్గమనం భవేత్.

8

గతే హి మయి తత్రేయం రాజపుత్రీ యశస్వినీ,
పరిత్రాణమవిన్దన్తీ జానకీ జీవితం త్యజేత్.

9

మయా చ స మహాబాహుః పూర్ణచన్ద్రనిభాననః,
సమాశ్వాసయితుం న్యాయ్యః సీతాదర్శనలాలసః.

10

నిశాచరీణాం ప్రత్యక్షమనర్హం చాపిభాషణమ్,
కథం ను ఖలు కర్తవ్యమిదం కృచ్ఛ్రగతో హ్యహమ్.

11

అనేన రాత్రిశేషేణ యది నాశ్వాస్యతే మయా,
సర్వథా నాస్తి సన్దేహః పరిత్యక్ష్యతి జీవితమ్.

12

అంతులేని శోకం కారణంగా దురవస్థలో ఉన్న ఈ సీతాదేవిని ఊరడించకుండానే నేను తిరిగి వెళ్ళిపోవడం తప్పక పొరబాటు అవడమే కాక, అలా చేయడం ప్రమాదానికీ దారితీయవచ్చు.

8

ఈమె దుఃఖాన్ని ఉపశమింపజేయకుండా నేను వెంటనే తిరిగి వెళ్ళిపోతే రాజపుత్రీ, కీర్తిశాలినీ అయిన ఈ సీతాదేవి తనకు రక్షణోపాయం ఏదీ కానరాక ప్రాణత్యాగానికి తప్పక పాల్పడవచ్చు.

9

పూర్ణచంద్రుని పోలిన ఆహ్లాదకరమైన ముఖారవిందం గలవాడూ, శక్తిమంతమైన బాహువులు గలవాడూ అయిన ఆ రాముడు, సీతను చూడాలని తహతహలాడుతున్నాడు. అటువంటి స్థితిలో ఉన్న రామునికి కూడా ఉపశమనం కలిగించడం నా కర్తవ్యం.

10

ఈ రాకాసిమూక సమక్షంలో ఈమెతో మాట్లాడడం కుదిరే పనికాదు. ఈ పని చేయడం ఎలా? గొప్ప క్లిష్టపరిస్థితి ఎదురయిందే!

11

ఇంకా మిగిలి ఉన్న రాత్రి గడిచే లోపు, అంటే తెల్లవారేలోగా ఏదో విధంగా మాట్లాడి ఆమెను నేను ఓదార్చకపోతే, ఆమె ప్రాణత్యాగం చేయడం తథ్యం. అందులో ఎలాంటి సందేహమూ లేదు.

12

రామశ్చ యది పృచ్ఛేన్మాం కిం మాం సీతాఽబ్రవీద్వచః,

కిమహం తం ప్రతిబ్రూయామసంభాష్య సుమధ్యమామ్.

13

సీతాసన్దేశరహితం మామితస్త్వరయా గతమ్,
నిర్దహేదపి కాకుత్థ్సః క్రుద్ధస్తీవ్రేణ చక్షుషా.

14

యది చోద్యోజయిష్యామి భర్తారం రామకారణాత్,
వ్యర్థమాగమనం తస్య ససైన్యస్య భవిష్యతి.

15

అన్తరం త్వహమాసాద్య రాక్షసీనామిహ స్థితః,
శనైరాశ్వాసయిష్యామి సంతాపబహులామిమామ్.

16

సీతాదేవితో ముఖాముఖీ మాట్లాడకుండానే నేను తిరిగి వెళ్ళిపోతే, అక్కడ రాముడు, 'సీత నాతో ఏం చెప్పమన్నది?' అని ప్రశ్నిస్తే, ఆ స్వామికి నేను ఏం బదులివ్వగలను?

13

సీతాదేవి నుండి ఎటువంటి సందేశాన్నీ తీసుకోకుండా త్వరపడి నేను తిరిగి వెళ్ళిపోతే రాముడు ఆగ్రహించి తీక్షణమైన తన చూపులతో నన్ను దహించివెయ్యడా?

14

నేను సీతాదేవిని సాంత్వనపరచకుండా హడావిడిగా తిరిగివెళ్ళి రాముని సహాయార్థం సుగ్రీవుని తీసుకువచ్చేలోగా సీత ఇక్కడ ప్రాణత్యాగం చేసుకొంటే సైన్యసమేతంగా వచ్చిన రామసుగ్రీవుల రాక నిష్ఫలమౌతుంది గదా!

15

కనుక నేను ఈ చెట్టు మీదనే నక్కిదాక్కుని రాక్షసస్త్రీలు సమీపంలో లేనప్పుడు లేదా వారు ఏమరిపాటుగా ఉన్నప్పుడు అదను చూసి దుఃఖసాగరంలో మునిగి ఉన్న ఈ సీతాదేవితో మాట్లాడి ఆమెను ఊరడిస్తాను.

16

అహం త్వతితనుశ్చైవ వానరశ్చ విశేషతః,
వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్.

17

యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్,
రావణం మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి,
వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్.

18

అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్,
మయా సాన్త్వయితుం శక్యా నాన్యథేయమనిన్దితా.

19

సేయమాలోక్య మే రూపం జానకీ భాషితం తథా,
రక్షోభిస్త్రాసితా పూర్వం భూయస్త్రాసం గమిష్యతి.

20

ప్రస్తుతం నేను సూక్ష్మరూపం సంతరించుకొని ఉన్నాను, పైగా వానరుణ్ణి. కనుక సరళమైన సామాన్య ప్రజలు మాట్లాడే భాషలో ఆమెతో నమ్రతతో మాట్లాడవలసి ఉంటుంది.

17

నేను ద్విజులు మాట్లాడే సంస్కృత భాషలో మాట్లాడితే, ఒక వానరుడు ఇంతటి చక్కని సంస్కృత భాషలో మాట్లాడడం సాధ్యమా? అనే సందేహం ఆమెకు రావచ్చు. అంతేకాక నన్ను కామరూపం దాల్చి వచ్చిన రావణునిగా

భావించి భయపడవచ్చు కూడా.

18

కాబట్టి సర్వులకూ అర్థమయ్యే సామాన్యుల భాషలోనే మాట్లాడడం సముచితంగా ఉంటుంది. దోషరహితయైన ఈమెను సాంత్వనపరచడానికి నాకు మరో మార్గం ఏదీ స్ఫురించడంలేదు.

19

ఇప్పటి వరకు రాకాసిమూక బెదిరింపులతో ఆమె ఎంతో భీతిచెంది ఉంది. ఇప్పుడు నా వానరరూపాన్ని చూసి, నా భాషను వినగానే ఆమె భయం రెట్టింపు అవడం ఖాయం.

20

తతో జాతపరిత్రాసా శబ్దం కుర్యాన్మనస్వినీ,
జానమానా మాం విశాలాక్షీ రావణం కామరూపిణమ్.

21

సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః,
నానాప్రహరణో ఘోరః సమేయాదన్తకోపమః.

22

తతో మాం సంపరిక్షిప్య సర్వతో వికృతాననాః,
వధే చ గ్రహణే చైవ కుర్యుర్యత్నం యథాబలమ్.

23

గృహ్య శాఖాః ప్రశాఖాశ్చ స్కన్ధాంశ్చోత్తమశాఖీనామ్,
దృష్ట్వా విపరిధావన్తం భవేయుర్భయశఙ్కితాః.

24

అటువంటి పరిస్థితిలో నిర్మలమైన మనస్సుగల, విశాలమైన కన్నులు

గల ఈ సీతాదేవి అప్పటికే అపరిమిత దుఃఖంలో మునిగి ఉండడం వల్లా, భీతిచెందినదై ఉండడం వల్లా నన్ను ఇచ్ఛమేరకు రూపాలు ధరించగల రావణుడే అని తలచి, మరింత భయంతో కేకలు పెట్టవచ్చు.

21

సీదాదేవి భయంతో కేకలు పెట్టగానే, యమునిలా భయంకరంగా ఉన్న రాక్షసస్త్రీలు అప్రమత్తలై నానారకాల ఆయుధాలు ధరించి సీత చుట్టూ గుమిగూడుతారు.

22

అలా గుమిగూడిన వికృత ముఖాలు గల ఆ రాక్షసస్త్రీలు అన్నివైపుల నుండి చుట్టుముట్టి నన్ను పట్టుకోవడానికి లేదా గాయపరచడానికి, అదీకాకపోతే చంపడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తారు.

23

అప్పుడు నేను వారికి పట్టుబడకుండా మహావృక్షాల కొమ్మల, చెట్ల కొమ్మల, చెట్ల బోదెల మీదికి ఎగబ్రాకుతూ, ఒక కొమ్మ మీది నుండి మరో కొమ్మమీదికి గెంతుతూ పరుగెత్తుతూండడం చూసి వాళ్ళకు భయమూ, సందేహమూ కలుగవచ్చు.

24

మమ రూపం చ సంప్రేక్ష్య వనే విచరతో మహత్,
రాక్షస్యో భయవిత్రస్తా భవేయుర్వికృతాననాః.

25

తతః కుర్యుః సమాహ్వానం రాక్షస్యో రక్షసామపి,
రాక్షసేన్ద్రనియుక్తానాం రాక్షసేన్ద్రనివేశనే.

26

తే శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః,

ఆపతేయుర్విమర్దేఽస్మిన్ వేగేనోద్విగ్నకారిణః.

27

సంరుద్ధస్తైస్తు పరితో విధమన్ రక్షసాం బలమ్,
శక్నుయాం న తు సంప్రాప్తుం పరం పారం మహోదధేః.

28

మాం వా గృహ్ణీయురాప్లుత్య బహవః శీఘ్రకారిణః,
స్యాదియం చాగృహీతార్థా మమ చ గ్రహణం భవేత్.

29

ఈ వనంలో అటూ ఇటూ మహావేగంగా పరుగెత్తుతున్న నా మహాకాయాన్ని చూసి వికృతాలైన ముఖాలుగల రాక్షసస్త్రీలు గజగజ వణకి పోతారు.

25

ఆ తరువాత ఈ రాక్షసాంగనలు రాక్షసరాజు రాజప్రాసాద రక్షకులైన రాక్షసవీరులను పిలుస్తారు.

26

అప్పుడు ఆ రాక్షసవీరులు శూలాలు, శక్తులూ, ఖడ్గాలు ఇత్యాది ఆయుధాలను చేతపుచ్చుకొని చూపరులకు భయం కలిగించే వేగంతో వచ్చి నన్ను ఎదుర్కొంటారు.

27

ఆ విధంగా నన్ను చుట్టుముట్టి ఎదుర్కొన్న ఆ రాక్షసవీరులను మట్టుబెట్టే ప్రయత్నంలో ఒకవేళ నేను కనుక బాగా అలసిపోతే సముద్రాన్ని దాటి ఆవలి తీరాన్ని చేరుకోవడానికి సరిపడే శక్తి నాలో మిగిలి ఉండకపోవచ్చునేమో!

28

ఆ రాక్షసవీరులలో అమిత సాహసవంతులైన కొందరు పైకి ఎగిరి మూకుమ్మడిగా మీదపడి నన్ను బంధించవచ్చు. అటువంటి పరిస్థితే దాపురిస్తే సీతాదేవికి, రాముని సందేశాన్ని అందించలేకపోయిన వాణ్ణి అవుతాను.

29

హింసాభిరుచయో హింస్యురిమాం వా జనకాత్మజామ్,
విపన్నం స్యాత్తతః కార్యం రామసుగ్రీవయోరిదమ్.

30

ఉద్దేశే నష్టమార్గేఽస్మిన్ రాక్షసైః పరివారితే,
సాగరేణ పరిక్షిప్తే గుప్తే వసతి జానకీ.

31

విశస్తే వా గృహీతే వా రక్షోభిర్మయి సంయుగే,
నాన్యం పశ్యామి రామస్య సాహాయ్యం కార్యసాధనే.

32

విమృశంశ్చ న పశ్యామి యో హతే మయి వానరః,
శతయోజనవిస్తీర్ణం లంఘయేత మహోదధిమ్.

33

లేదా హింసించడమే వ్యాపకంగా పెట్టుకున్న ఈ రాక్షసులు సీతాదేవిని అంతమొందించవచ్చు. అలా జరిగే పక్షంలో రామ సుగ్రీవుల లక్ష్యం నిష్ఫలమౌతుంది.

30

జానకీదేవిని బందీగా ఉంచిన ఈ చోటు ఎవరూ కనుగొనలేని రహస్య స్థలం. ఇక్కడికి చేరుకొనే మార్గాలు లేవు. పైగా ఈ స్థలం సముద్రంచే ఆవరించబడింది. అనేకమంది రాక్షసులు అహర్నిశలూ ఆమెను అప్రమత్తంగా కాపలాకాస్తున్నారు.

31

రాక్షసులతో జరిగే యుద్ధంలో నేను వారికి పట్టుబడవచ్చు లేదా నేను మరణించవచ్చు. అలా జరిగే పక్షంలో సీతాన్వేషణ కార్యంలో రామునికి సహాయపడగల మరో వ్యక్తి ఎవరూ ఎంత ఆలోచించినా నాకు కనిపించడంలేదు.

32

యుద్ధంలో నేను మరణించడమే సంభవిస్తే, నూరు యోజనాల విస్తీర్ణం గల ఈ మహాసముద్రాన్ని లంఘించగల వానరవీరుడు మచ్చుకి ఎవ్వడూ, ఎంత యోచించినా నాకు కనిపించడం లేదు.

33

కామం హన్తుం సమర్థోఽస్మి సహస్రాణ్యపి రక్షసామ్,
న తు శక్ష్యామి సంప్రాప్తుం పరం పారం మహోదధేః.

34

అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే,
కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ ప్రాజ్ఞః ససంశయమ్.

35

ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవేదనభిభాషణే,
ఏష దోషో మహాన్హి స్యాన్మమ సీతాభిభాషణే.

36

భూతాశ్చార్థా వినశ్యన్తి దేశకాలవిరోధితాః,
విక్లబం దూతమాసాద్య తమః సూర్యోదయే యథా.

37

వేలాది రాక్షస వీరులున్న సైన్యాన్ని ఒక్కణ్ణే ధ్వంసం చేయగల

శక్తిసామర్థ్యాలు నాకు ఉన్న మాట నిజమే. కాని ఆ ఘోరసంగ్రామానంతరం మహాసముద్రపు ఆవలి ఒడ్డుకు గడువు ముగిసే లోపుగా చేరడానికి తగినంత శక్తి నాలో మిగిలి ఉంటుందో లేదో?

34

యుద్ధంలో జయాపజయాలు అనిశ్చితాలు, అవి ఎవరిని వరిస్తాయో కచ్చితంగా చెప్పలేము. సంశయాత్మకమైన కార్యంలో దిగడం నాకు సుతరామూ ఇష్టంలేదు. వివేకవంతుడు ఎవ్వడూ అనాలోచితంగా సంశయాత్మకమైన పనికి ఉపక్రమిస్తాడా?

35

నేను సీతాదేవితో ముఖాముఖీ మాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోతే ఆమె ప్రాణత్యాగానికి పాల్పడవచ్చు. కాని ఆమెను నేను కలుసుకుని మాట్లాడితే పైన చెప్పిన ప్రమాదభరితమైన పరిస్థితి తలెత్తవచ్చు.

36

నూటికి నూరుపాళ్ళు నెరవేరే పనులు కూడా వివేకహీనుడైన దూతచే దేశకాలాలకు ప్రతికూలంగా పరిణమించడం వల్ల సూర్యోదయంచే చీకట్లు పటాపంచలయే తీరులో నిష్ఫలాన్ని చవిచూస్తాయి.

37

అర్థానర్థాన్తరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే,
ఘాతయన్తి హి కార్యాణి దూతాః పణ్డితమానినః.

38

న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్.

39

కథం ను ఖలు వాక్యం మే శృణుయాన్నోద్విజేత వా,

ఇతి సంచిన్త్య హనుమాంశ్చకార మతిమాన్మతిమ్.

40

రామమక్లిష్టకర్మాణం స్వబన్ధుమనుకీర్తయన్,
నైనాముద్వేజయిష్యామి తద్బన్ధుగతమానసామ్.

41

ముందు వెనుకలను గూర్చి కూలంకషంగా చర్చించిన తరువాత నిర్ణయించిన కార్యంలో అవివేకియైన దూతను నియమిస్తే ఆ కార్యం చెడడం తథ్యం. ఎందుకంటే పండితులమని విర్రవీగే ఈ కోవకు చెందిన దూతలు స్వామి కార్యాన్ని వమ్ము చేస్తారు.

38

రామకార్యం చెడకుండా ఉండాలంటే ఇప్పుడు నేను ఏ తీరులో వ్యవహరించాలి? ఏ రకంగా ప్రవర్తిస్తే బుద్ధిహీనత ప్రాబల్యం వహించకుండా ఉంటుంది? నా సముద్ర లంఘనం వ్యర్థం కారాదు అంటే తక్షణం నేను ఏం చెయ్యాలి?

39

ఏ ఉపాయం ద్వారా నా మాటలు విని సీతాదేవిని భయపడకుండేట్లు చేయాలి? వివేకవంతుడైన హనుమంతుడు నానారీతుల్లో ఆలోచించి చివరికి ఒక సంతృప్తికరమైన నిర్ణయానికి వచ్చాడు.

40

ఇప్పుడు సీతాదేవి మనస్సు రాముని యందే పూర్తిగా లగ్నమై ఉంది. కనుక ఎటువంటి క్లిష్టమైన కార్యాన్నైనా అవలీలగా నెరవేర్చగల సమర్థుడూ, సీతాదేవికి ఆరో ప్రాణమూ అయిన రాముని గుణకీర్తనం ముందుగా చేస్తే ఆమె ఎలాంటి గందరగోళానికీ, భయానికీ లోను కాదు.

41

ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః,
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్.

42

శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్,
శ్రద్ధాస్యతి యథా హీయం తథా సర్వం సమాదధే.

43

ఇతి స బహువిధం మహానుభావో
జగతిపతేః ప్రమదామవేక్షమాణః,
మధురమవితథం జగాద వాక్యం
ద్రుమవిటపాంతరమాస్థితో హనుమాన్.

44

ఇక్ష్వాకువంశస్థులలో సర్వశ్రేష్ఠుడూ, సర్వజ్ఞుడూ అయిన రామునకు సంబంధించిన సకల ఉదంతాలను మంగళప్రదమైన వాక్కులతో, మధురమైన వాక్యాలతో ఆమెకు వినిపిస్తాను. ఆ విధంగా సీతాదేవికి నా పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగేలా చేస్తాను.

42–43

మహానుభావుడైన ఆ హనుమంతుడు అశోకవృక్షం కొమ్మల మధ్య దాగి కూర్చునే జగన్నాథుడైన రాముని భార్య సీతాదేవిని చూస్తూ అనేక విధాలుగా యోచించి వ్యర్థం కానివీ, మధురమైనవీ అయిన వచనాలను ఇలా పలుకసాగాడు.

44

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 30వ సర్గ

సమాప్తం

31వ సర్గ

రామకథా గానం

ఏవం బహువిధాం చిన్తాం చిన్తయిత్వా మహాకపిః,
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ.

1

రాజా దశరథో నామ రథకుఞ్జరవాజిమాన్,
పుణ్యశీలో మహాకీర్తిః ఇక్ష్వాకూణాం మహాయశాః.

2

రాజర్షీణాం గుణశ్రేష్ఠస్తపసా చర్షిభిః సమః,
చక్రవర్తికులే జాతః పురన్దరసమో బలే.

3

హనుమంతుడు ఆ విధంగా పరిపరి విధాల యోచించి, తన కర్తవ్యాన్ని నిర్ణయించుకొన్న వాడై, సీతాదేవికి మాత్రమే వినిపించేటట్లు ఇలా మధురంగా పలుక నారంభించాడు.

1

సుప్రసిద్ధమైన ఇక్ష్వాకువంశంలో గొప్ప కీర్తి గడించిన, పావనుడైన దశరథుడనే మహారాజు విరాజిల్లాడు. ఆయన రథ గజ తురగ పదాతిదళాలతో సమన్వితమైన మహాసైన్యాన్ని సంతరించుకొని సాటిలేని కీర్తిప్రతిష్ఠలతో తులతూగుతూ ఉండేవాడు.

2

ఈ దశరథ మహారాజు సద్గుణాలచే రాజర్షులలో శ్రేష్ఠుడుగా పేరు పొందాడు. చక్రవర్తుల వంశజుడైన ఆయన తపస్సుచే ఋషీశ్వరులకు సాటియైనాడు, బలసంపదలో దేవేంద్రునికి సమానుడై భాసించాడు.

3

అహింసారతిరక్షుద్రో ఘృణీ సత్యపరాక్రమః,
ముఖ్యశ్చేక్ష్వాకువంశస్య లక్ష్మీవాన్ లక్ష్మివర్ధనః.

4

పార్థివవ్యఞ్జనైర్యుక్తః పృథుశ్రీః పార్థివర్షభః,
పృథివ్యాం చతురన్తాయాం విశ్రుతః సుఖదః సుఖీ.

5

తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠస్తారాధిపనిభాననః,
రామో నామ విశేషజ్ఞః శ్రేష్ఠః సర్వధనుష్మతామ్.

6

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,
రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః.

7

ఈ దశరథ మహారాజు అహింసావాది. ఆయన ఉదారుడు, దయాళువు, అపర పరాక్రమవంతుడు. అంతేకాదు ఐశ్వర్య సంపన్నుడు, సంపదలను పెంపొందించడంలో దక్షుడు. ఇక్ష్వాకు వంశంలో ఆణిముత్యం అనదగ్గ వాడు.

4

ఆ దశరథ మహారాజు సకల రాజలక్షణ సంపన్నుడు. ఆయన

ఐశ్వర్యం ఇంత అని అంచనా కట్టలేనిది. ఆయన రాజాధిరాజు. ఆయన కీర్తిచంద్రికలు చతుస్సాగర పర్యంతమైన యావత్తు భూమండలంలో వ్యాపించాయి. దశరథుడు తన పాలనలో ప్రజలను సుఖపెట్టాడు, తానూ సుఖపడ్డాడు.

5

ఆ దశరథునకు పెద్ద కుమారుడైన రాముడంటే అత్యంత ప్రీతి. ఆ రాముడు, చంద్రుని మల్లే ప్రసన్నమైన ముఖం కలవాడు, జ్ఞాననిధి, ధనుర్ధారులలో సర్వశ్రేష్ఠుడు.

6

మహాత్ముడైన ఆ రాముడు స్వధర్మాన్ని తు.చ. తప్పక పాటిస్తాడు. ఆతడు తన వారికే కాక, సకల ప్రాణులకు, సకల ధర్మాలకు రక్షకుడుగా విరాజిల్లుతున్నాడు. పైగా అతడంటే శత్రువులకు సింహస్వప్నం.

7

తస్య సత్యాభిసన్ధస్య వృద్ధస్య వచనాత్పితుః,
సభార్యః సహ చ భ్రాత్రా వీరః ప్రవ్రాజితో వనమ్.

8

తేన తత్ర మహారణ్యే మృగయాం పరిధావతా,
రాక్షసా నిహతాః శూరా బహవః కామరూపిణః.

9

జనస్థానవధం శ్రుత్వా హతౌ చ ఖరదూషణౌ,
తతస్త్వమర్షాపహృతా జానకీ రావణేన తు,
వఞ్చయిత్వా వనే రామం మృగరూపేణ మాయయా.

10

స మార్గమాణస్తాం దేవీం రామః సీతామనిన్దితామ్,

ఆససాద వనే మిత్రం సుగ్రీవం నామ వానరమ్.

11

సత్యసంధుడూ, వృద్ధుడూ అయిన తండ్రి మాట నిలబెట్టడానికి, ఆయన ఆజ్ఞను శిరసావహిస్తూ మహావీరుడైన రాముడు, భార్యతోనూ తమ్మునితోనూ కలసి వనవాసం చేయడానికి అరణ్యాలకు వెళ్ళాడు.

8

అరణ్యాలలో సంచరిస్తూ వేటాడే సమయాల్లో ఆ రాముడు తనకు తారసపడ్డ శూరులూ, కోరుకున్న రూపాలు ధరించగలవారూ అయిన అనేకమంది రాక్షసులను తృటిలో సంహరించాడు.

9

జనస్థానంలో వేలాదిమంది రాక్షసులను, అజేయ పరాక్రమవంతులైన ఖరదూషణులను రాముడు ఒక్కడే వధించాడనే వార్త విని, రావణునికి కట్టలుతెంచుకున్న కోపం వచ్చింది. దాంతో రావణుడు మాయాలేడి రూపం దాల్చిన ఒక రాక్షసుని సహాయంతో రాముని వంచించి, సీతాదేవిని అపహరించాడు.

10

దోషరహితమైన సీతాదేవిని అన్వేషిస్తూన్న రామునికి ఆ అరణ్యంలో సుగ్రీవుడనే వానరునితో చెలిమి కలిగింది.

11

తతః స వాలినం హత్వా రామః పరపురంజయః,
ప్రాయచ్ఛత్ కపిరాజ్యం తత్ సుగ్రీవాయ మహాబలః.

12

సుగ్రీవేణాపి సందిష్టా హరయః కామరూపిణః,
దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వన్తి సహస్రశః.

13

అహం సంపాతివచనాత్ శతయోజనమాయతమ్,
అస్యా హేతోర్విశాలాక్ష్యాః సాగరం వేగవాన్ ప్లుతః.

14

యథారూపాం యథావర్ణాం యథాలక్ష్మీం చ నిశ్చితామ్,
అశ్రౌషం రాఘవస్యాహం సేయమాసాదితా మయా.

15

విరరామైవముక్త్వాసౌ వాచం వానరపుఙ్గవః,
జానకీ చాపి తచ్ఛ్రుత్వా పరం విస్మయమాగతా.

16

ఆ తరువాత శత్రువుల నగరాలను జయించే వాడూ, మహాబలవంతుడూ అయిన ఆ రాముడు వాలిని (సుగ్రీవుని అన్న) వధించి వానరరాజ్యాన్ని సుగ్రీవునికి పట్టంకట్టాడు.

12

పిదప సుగ్రీవుని ఆదేశం మేరకు ఇచ్ఛారూపం దాల్చగల వేలాదిమంది వానరవీరులు ఆ సీతాదేవి కోసం అన్ని దిక్కులలోనూ తమ అన్వేషణను ప్రారంభించారు.

13

సంపాతి అనే గృధ్రరాజు సూచనల మేరకు విశాలనేత్రాలు గల ఆ సీతాదేవి కోసం నేను సమధికోత్సాహంతో, మహావేగంతో నూరు యోజనాల విస్తీర్ణమైన మహాసముద్రాన్ని లంఘించాను.

14

రాముని నుండి నేను విన్న సీతాదేవి రూపమూ, వర్చస్సూ, శోభా

తదితర సమస్త శుభలక్షణాలనూ ఇప్పుడు ఈమెలో చూస్తున్నాను.

15

ఈ విధంగా పలికి వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఊరకున్నాడు. ఆ కపివరుని పలుకులు విని సీతాదేవి ఆశ్చర్యపోయింది.

16

తతః సా వక్రకేశాన్తా సుకేశీ కేశసంవృతమ్,
ఉన్నమ్య వదనం భీరుః శింశుపావృక్షమైక్షత.

17

నిశమ్య సీతా వచనం కపేశ్చ
దిశశ్చ సర్వాః ప్రదిశశ్చ వీక్ష్య,
స్వయం ప్రహర్షం పరమం జగామ
సర్వాత్మనా రామమనుస్మరన్తీ.

18

సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తా
న్నిరీక్షమాణా తమచిన్త్యబుద్ధిమ్,
దదర్శ పిఙ్గాధిపతేరమాత్యం
వాతాత్మజం సూర్యమివోదయస్థమ్.

19

వక్రములైన కేశాంతములు గల భయస్వభావురాలైన ఆ సీతాదేవి కేశములచే కప్పబడిన తన ముఖాన్ని పైకెత్తి తన దృక్కులను శింశుపావృక్షం వైపుగా సారించింది.

17

హనుమంతుని పలుకులు విని ఆ మాటలు ఎక్కడనుండి వస్తున్నాయా అనుకుని అన్ని దిక్కులా కలయ చూసి, రాముణ్ణే మనస్సులో ధ్యానిస్తూ

సీతాదేవి ఆనందపరవశురాలయింది.

18

సీతాదేవి నలువంకలా, పైనా క్రిందా నిశితంగా పరికించింది. అప్పుడు ఊహింప అలవిగాని వివేకం గలవాడూ, సుగ్రీవుని సచివుడూ, ఉదయాద్రి మీద బాలభానుని మల్లే ప్రకాశిస్తున్న వాడూ అయిన హనుమంతుని ఆమె చూసింది.

19

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 31వ సర్గ

సమాప్తం

32వ సర్గ
పరిపరి విధాలైన సీతాదేవి ఆలోచనలు

తతః శాఖాన్తరే లీనం దృష్ట్వా చలితమానసా,
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపిఙ్గలమ్.

1

సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినమ్,
ఫుల్లాశోకోత్కరాభాసం తప్తచామీకరేక్షణమ్.

2

మైథిలీ చిన్తయామాస విస్మయం పరమం గతా,
అహో భీమమిదం రూపం వానరస్య దురాసదమ్,
దుర్నిరీక్షమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా.

3

కొమ్మల మధ్య నక్కిదాగి ఉన్న, తెల్లని వస్త్రం ధరించిన, మెరపుతీగల సమూహం మల్లే పసుపుపచ్చని మేనిచ్ఛాయ గల ఆ హనుమంతుని చూసి సీతాదేవి గాభరాపడింది.

1

బాగా వికసించిన అశోక పుష్పాల వంటి శరీరకాంతితో, పుటంపెట్టిన బంగారువన్నె వంటి నేత్రాలతో, వినయంతో శోభిల్లుతూ ప్రియ వచనాలు పలుకుతున్న హనుమంతుని ఆ అశోకవృక్షం మీద సీతాదేవి చూసింది.

2

ఆ హనుమంతుని చూడగానే సీతాదేవి విస్తుపోయింది. 'అహో! ఈ వానరుడి రూపం ఎంత భీతిగొల్పుతూ ఉందో! సమీపింప సాధ్యం కానిదిగాను, కనీసం చూడడానికి సైతం శక్యంకానిదిగాను ఉందో' అనుకుంటూ మళ్ళీ ఆమె కలత చెంది దుఃఖించసాగింది.

3

విలలాప భృశం సీతా కరుణం భయమోహితా,
రామరామేతి దుఃఖార్తా లక్ష్మణేతి చ భామినీ,
రురోద బహుధా సీతా మన్దం మన్దస్వరా సతీ.

4

సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదుపస్థితమ్,
మైథిలీ చిన్తయామాస స్వప్నోఽయమితి భామినీ.

5

సా వీక్షమాణా పృథుభుగ్నవక్త్రం
శాఖామృగేన్ద్రస్య యథోక్తకారమ్,
దదర్శ పిఙ్గాధిపతేరమాత్యం
వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్.

6

సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా
గతాసుకల్పేవ బభూవ సీతా,
చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో
విచిన్తయామాస విశాలనేత్రా.

7

భయభ్రాంతురాలై, దుఃఖీస్తూ ఆ సీతాదేవి 'రామా! రామా!' అంటూ,

‘లక్ష్మణా!’ అంటూ దీనాతిదీనంగా విలపించింది. మందస్వరంలో పరిపరి విధాల రోదించింది.

4

చెట్టుకొమ్మల్లో మూర్తీభవించిన వినయంగా కూర్చున్న వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుణ్ణి చూసి సీతాదేవి ‘ఇది కల కావచ్చునేమో!’ అని తలచింది.

5

సీతాదేవి అటూ ఇటూ పరికిస్తూ పెద్దదైన ఉబ్బెత్తు ముఖం గలవాడూ, వానరరాజైన సుగ్రీవుని ఆజ్ఞానువర్తీ, సచివుడూ, వివేకవంతులలో శ్రేష్ఠుడూ, వాయునందనుడూ అయిన హనుమంతుణ్ణి చూసింది.

6

ఆ హనుమంతుణ్ణి స్పష్టంగా చూడగానే విశాలనేత్రాలు గల సీతాదేవి మూర్ఛిల్లి, మరణించిన దానిలా అచేతనురాలయింది. కొంతసేపటికి తెప్పరిల్లి మళ్ళీ ఆమె ఇలా ఆలోచించసాగింది.

7

స్వప్నే మయాఽయం వికృతోఽద్య దృష్టః
శాఖామృగః శాస్త్రగణైర్నిషిద్ధః,
స్వస్త్యస్తు రామాయ సలక్ష్మణాయ
తథా పితుర్మే జనకస్య రాజ్ఞః.

8

స్వప్నోఽపి నాయం న హి మేఽస్తి నిద్రా
శోకేన దుఃఖేన చ పీడితాయాఃఽ,
సుఖం హి మే నాస్తి యతోఽస్మి హీనా
తేనేన్దుపూర్ణప్రతిమాననేన.

9

రామేతి రామేతి సదైవ బుద్ధ్యా
విచిన్త్య వాచా బ్రువతీ తమేవ,
తస్యానురూపాం చ కథాం తమర్థ
మేవం ప్రపశ్యామి తథా శృణోమి.

10

కలలో నేడు వికృతమైన వానరాన్ని చూశాను. కలలో కోతి కనబడడం అశుభ సూచకమని శాస్త్రాలు వచిస్తున్నాయి. రామలక్ష్మణులకు, నా తండ్రియైన జనకమహారాజుకు శుభం కలుగుగాక!

8

పూర్ణచంద్రునికి సాటివచ్చే వదనారవిందం గల నా పతియైన రాముని ఎడబాసి ఉన్న నాకు సుఖమెక్కడ? శోకంతో, దుఃఖంతో కుమిలిపోతున్న నా కంటి మీద కునుకెక్కడిది? అటువంటప్పుడు కల ఎలా వస్తుంది? కాబట్టి కచ్చితంగా ఇది కల మాత్రం కాదు.

9

అహర్నిశలూ నేను మనస్సులో రాముణ్ణే స్మరిస్తూ, రామ నామాన్నే ఉచ్చరిస్తున్నాను. అందుకు అనుగుణంగా రామునికి సంబంధించిన వృత్తాంతాలనే వింటున్నట్లు, వాటినే ఈ రీతిలో అవగతం చేసుకొంటున్నట్లు నాకు అనిపిస్తోంది.

10

అహం హి తస్యాద్య మనోభవేన
సంపీడితా తద్గతసర్వభావా,
విచిన్తయన్తీ సతతం తమేవ
తథైవ పశ్యామి తథా శృణోమి.

11

మనోరథః స్యాదితి చిన్తయామి
తథాపి బుద్ధ్యా చ వితర్కయామి,
కిం కారణం తస్య హి నాస్తి రూపం
సువ్యక్తరూపశ్చ వదత్యయం మామ్.

12

నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే
స్వయంభువే చైవ హుతాశనాయ చ,
అనేన చోక్తం యదిదం మమాగ్రతః
వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా.

13

నేను రామ విరహాన్ని భరించలేక దుఃఖీతనై ఉన్నాను. నా మనస్సునిండా రాముడే ఉన్నాడు. సదాసర్వవేళలా రాముణ్ణే స్మరిస్తున్నాను. కాబట్టి రాముని గురించే వింటున్నట్లు, ఆయన గూర్చిన విషయాలనే చూస్తున్నట్లు నాకు భ్రమ కలుగుతోంది.

11

ఎప్పటికైనా రామ సమాగమం అనే నా మనోరథం ఈడేరాలనే ఆశతో మనస్సులో ఆ విధంగా ఊహించుకొంటున్నాను. అయితే మనోరథానికి ఎదురుగా కనిపించే రూపం ఉండదు కదా! కాని ఈ వానరుడు స్పష్టమైన ఆకారంతో నాతో సూటిగా మాట్లాడుతున్నాడు. అతడి ఉద్దేశం ఏమిటో?

12

దేవగురువైన బృహస్పతికీ, దేవేంద్రునికీ, బ్రహ్మదేవునికీ ప్రణామాలు. అగ్నిదేవునికి నమస్కారం. ఈ వానరుడు నా ఎదుట పలికిన మాటలన్నీ సత్యం అవుగాక! ఒక్కటి కూడా అసత్యం కాకూడదుగాక!

13

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 32వ సర్గ
సమాప్తం

33వ సర్గ
సీతతో హనుమంతుని సంభాషణ

సోఽవతీర్య ద్రుమాత్తస్మాద్విద్రుమప్రతిమాననః,
వినీతవేషః కృపణః ప్రణిపత్యోపసృత్య చ.

1

తామబ్రవీన్మహాతేజా హనూమాన్ మారుతాత్మజః,
శిరస్యఞ్జలిమాధాయ సీతాం మధురయా గిరా.

2

కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని,
ద్రుమస్య శాఖామాలమ్బ్య తిష్ఠసి త్వమనిన్దితే.

3

కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజమ్,
పుణ్డరీకపలాశాభ్యాం విప్రకీర్ణమివోదకమ్.

4

పగడం మల్లే ఎర్రనైన ముఖ ప్రకాశం గలవాడూ, మహాతేజశ్శాలీ, వాయునందనుడూ అయిన ఆ హనుమంతుడు ఆ శింశుపావృక్షం మీదనుండి దిగాడు. సీతాదేవి దుస్థితిని చూసి దీనుడై ఆమెను సమీపించి, చేతులు జోడించి శిరస్సు మీద ఉంచుకుని వినయంగా మధురంగా ఇలా మాట్లాడసాగాడు.

1–2

పద్మపత్రాల వంటి నేత్రాలున్న ఓ దేవీ! నలిగిన పట్టువస్త్రాలు ధరించి ఉన్న సౌశీల్యవతీ! చెట్టుకొమ్మను పట్టుకొని నిలబడి ఉన్నావు. నువ్వెవరివి?

3

తామరపువ్వు రేకుల నుండి నీరు చెదరిపడుతున్నట్లు నీ విశాల నేత్రాలనుండి ఎందుకిలా శోకంతో కన్నీరు స్రవిస్తున్నది?

4

సురాణామసురాణాం వా నాగగన్ధర్వరక్షసామ్,
యక్షాణాం కిన్నరాణాం వా కా త్వం భవసి శోభనే.

5

కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే,
వసూనాం వా వరారోహే దేవతా ప్రతిభాసి మే.

6

కిం ను చన్ద్రమసా హీనా పతితా విబుధాలయాత్,
రోహిణీ జ్యోతిషాం శ్రేష్ఠా శ్రేష్ఠసర్వగుణాన్వితా.

7

కా త్వం భవసి కల్యాణి త్వమనిన్దితలోచనే,
కోపాద్వా యది వా మోహాద్భర్తారమసితేక్షణే,
వసిష్ఠం కోపయిత్వా త్వం నాసి కల్యాణ్యరున్ధతీ.

8

కో ను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే,
అస్మాల్లోకాదముం లోకం గతం త్వమనుశోచసి.

9

ఓ మంగళరూపిణీ! దేవతలు, అసురులు, నాగులు, గంధర్వులు, రాక్షసులు, యక్షులు, కిన్నరులు – వీరిలో నువ్వు ఏ జాతికి చెందినదానవు?

5

ఓ సుందర వదనా! ఆకర్షణీయమైన అవయవాలు గలదానా! నువ్వు రుద్రగణాలకు చెందిన దానవా? మరుద్గణాలకు చెందిన దానవా? వసుగణంలోని దానవా? నువ్వు కచ్చితంగా దేవతాస్త్రీవే అయివుంటావని భావిస్తున్నాను.

6

చంద్రుణ్ణి ఎడబాసి స్వర్గం నుండి భువికి చేరిన నక్షత్రాలలో శ్రేష్ఠురాలూ, సర్వోత్తమగుణాలచే భాసించేది అయిన రోహిణివా నువ్వు?

7

చక్కని నల్లని నేత్రాలుగల ఓ మంగళప్రదురాలా! కోపం లేదా అశ్రద్ధ కారణంగా భర్తయైన వసిష్ఠునికి చిరాకు తెప్పించి ఇక్కడకు వచ్చిన అరుంధతివి ఏమోనని నాకు అనుమానంగా ఉంది.

8

చక్కని నడుము గలదానా! నీ పుత్రులెవరు? ఎవరు నీ తండ్రి? నీ సోదరులు ఎవరు? నీ భర్త ఎవరు? నువ్వు ఏ లోకం నుండి పొరపాటుగా ఈ భువిని చేరి దుఃఖిస్తున్నావు?

9

రోదనాదతినిఃశ్వాసాద్ భూమిసంస్పర్శనాదపి,
న త్వాం దేవీమహం మన్యే రాజ్ఞః సంజ్ఞావధారణాత్.

10

వ్యఞ్జనాని చ తే యాని లక్షణాని చ లక్షయే,
మహిషీ భూమిపాలస్య రాజకన్యాఽసి మే మతా.

11

రావణేన జనస్థానాద్బలాదపహృతా యది,
సీతా త్వమసి భద్రం తే తన్మమాచక్ష్వ పృచ్ఛతః.

12

యథా హి తవ వై దైన్యం రూపం చాప్యతిమానుషమ్,
తపసా చాన్వితో వేషస్త్వం రామమహిషీ ధ్రువమ్.

13

సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా,
ఉవాచ వాక్యం వైదేహీ హనుమన్తం ద్రుమాశ్రితమ్.

14

నువ్వు రోదించడం వల్లా, అధికంగా నిట్టూరుస్తూండడం వల్లా, భూమిని తాకి నిలబడడం వల్లా, నీలో రాజలక్షణాలు కొట్టొచ్చినట్లు కానరావడం చేత నువ్వు దేవతాస్త్రీవి కావేమోనని కూడా అనుకొంటున్నాను.

10

నీ అవయవ సౌష్ఠవాన్ని బట్టి, సాముద్రికశాస్త్ర లక్షణాలను చూసి నువ్వొక రాజకుమార్తెవని, ఏ చక్రవర్తికో పట్టపురాణివై ఉంటావని నాకు స్ఫురిస్తోంది.

11

జనస్థానం నుండి రావణుడు బలాత్కారంగా అపహరించి తీసుకువచ్చిన సీతాదేవివి నువ్వేనని నాకు అనుమానంగా ఉంది. నాలో కలిగిన ఈ అనుమానాన్ని రూఢిపరచు దేవీ! నీకు శుభమవుతుందిగాక!

12

మానవ కాంతలలో కనిపించని నీ లోకోత్తర సౌందర్యం, నీలో గూడు

కట్టుకొన్న దైన్యం, తపస్సును సూచించే వేషధారణను చూస్తూంటే నువ్వు నా స్వామి రాముని భార్యవేనని నిశ్చయంగా తెలుస్తోంది.

13

రామకీర్తనంతో కూడుకొన్న హనుమంతుని పలుకులు విన్న సీతాదేవి సంతోషంలో ఓలలాడింది. పిదప ఆమె చెట్టుకొమ్మపైనున్న హనుమంతునితో ఇలా అంది.

14

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః,
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః.

15

దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః,
సీతేతి నామ నామ్నాఽహం భార్యా రామస్య ధీమతః.

16

సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే,
భుఞ్జానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ.

17

తతస్త్రయోదశే వర్షే రాజ్యేనేక్ష్వాకునన్దనమ్,
అభిషేచయితుం రాజా సోపాధ్యాయః ప్రచక్రమే.

18

తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే,
కైకేయీ నామ భర్తారం దేవీ వచనమబ్రవీత్.

19

భూమండలంలోని రాజశ్రేష్ఠులందరిలోకీ సర్వశ్రేష్ఠుడూ, గొప్ప

వివేకశీలి, శత్రువులకు సింహస్వప్నం అయిన దశరథ మహారాజుకి నేను కోడలిని.

15

మహాత్ముడూ, విదేహ రాజ్యాధిపతీ అయిన జనక మహారాజు పుత్రికను, నా పేరు సీత. ధీమంతుడైన రాముని భార్యను.

16

అక్కడ అయోధ్యలో రాముని అంతఃపురంలో ఏ లోటూ లేకుండా మానవులకు లభించగల సకల భోగాలను సమృద్ధిగా అనుభవిస్తూ పన్నెండు సంవత్సరాలు గడిపాను.

17

పదమూడవ సంవత్సరంలో పురోహితులను సంప్రతించి దశరథ మహారాజు ఇక్ష్వాకువంశానికి వన్నె చేకూర్చే రాముని యువరాజుగా పట్టాభిషిక్తుని చేయాలని నిర్ణయించాడు.

18

రాముని యౌవరాజ్యాభిషేకానికి సకల సన్నాహాలు ముమ్మరంగా జరుగుతుండగా కైకేయి అనే రాణి, భర్త అయిన దశరథ మహారాజుతో ఇలా చెప్పింది.

19

న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్,
ఏష మే జీవితస్యాన్తో రామో యద్యభిషిచ్యతే.

20

యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ,
తచ్చేన్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః.

21

స రాజా సత్యవాగ్దేవ్యా వరదానమనుస్మరన్,
ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూరమప్రియమ్.

22

తతస్తు స్థవిరో రాజా సత్యే ధర్మే వ్యవస్థితః,
జ్యేష్ఠం యశస్వినం పుత్రం రుదన్ రాజ్యమయాచత.

23

స పితుర్వచనం శ్రీమానభిషేకాత్పరం ప్రియమ్,
మనసా పూర్వమాసాద్య వాచా ప్రతిగృహీతవాన్.

24

రాముని యువరాజుగా అభిషిక్తుని చేసే పక్షంలో నేను ఆమరణ పర్యంతం నిరాహార దీక్ష పాటిస్తాను.

20

రాజులలో శ్రేష్ఠుడవైన ఓ మహారాజా! నీవు గతంలో నా పట్ల గల ప్రేమతో నాకు వాగ్దానం ఇచ్చావు గదా! ఆ వాగ్దానం నిలబెట్టుకోవాలంటే రాముణ్ణి అరణ్యాలకు పంపించు.

21

సత్యనిష్ఠాగరిష్ఠుడైన ఆ దశరథ మహారాజు గతంలో కైకేయికి వాగ్దానం చేసిన వరాలను తలపుకు తెచ్చుకొని, అప్రియమూ కర్ణకఠోరమూ అయిన ఆమె మాటలు విని మూర్ఛపోయాడు.

22

సత్యధర్మాలకు కట్టుబడిన వృద్ధుడైన ఆ దశరథ మహారాజు కీర్తిశాలి, ప్రీతిపాత్రుడు, తన పెద్ద కుమారుడైన రాముని చూసి విలపిస్తూ, "నీ రాజ్యాధిపత్య హక్కును భరతుని నిమిత్తం వదలుకో" అని అర్థించాడు.

23

సకల సద్గుణ సంపన్నుడైన రాముడు రాజ్యాభిషేకం కన్నా పితృవాక్య పరిపాలనే మిన్న అని భావించి సంతోషంగా, మనస్ఫూర్తిగా తండ్రి విజ్ఞప్తికి సమ్మతించాడు.

24

దద్యాన్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయాత్కించిదప్రియమ్,
అపి జీవితహేతోర్వా రామః సత్యపరాక్రమః.

25

స విహాయోత్తరీయాణి మహార్హాణి మహాయశాః,
విసృజ్య మనసా రాజ్యం జనన్యై మాం సమాదిశత్.

26

సాహం తస్యాగ్రతస్తూర్ణం ప్రస్థితా వనచారిణీ,
న హి మే తేన హీనాయా వాసః స్వర్గేఽపి రోచతే.

27

ప్రాగేవ తు మహాభాగః సౌమిత్రిర్మ్రతనన్దనః,
పూర్వజస్యానుయాత్రార్థే ద్రుమచీరైరలంకృతః.

28

రాముడు సత్యనిష్ఠాగరిష్ఠుడు. ఇతరులకు దానం చేస్తాడు గాని తను ఎవరి నుండి ఏదీ స్వీకరించడు. ప్రాణాపాయ సమయంలో కూడా ఎవరి గురించీ అప్రియంగా మాట్లాడడు.

25

గొప్ప కీర్తిశాలియైన రాముడు తండ్రి మాట తు.చ. తప్పక పాటించాలని నిర్ణయించుకొన్నాడు. వెంటనే అమూల్యములైన పట్టువస్త్రాలను విసర్జించి నారవస్త్రాలు ధరించాడు. రాజ్యాన్ని పరిత్యజించి నన్ను తన తల్లి సంరక్షణలో ఉండమని చెప్పాడు.

26

రాముని సాహచర్యం లేని స్వర్గలోక వాసం కూడా సుతరామూ నాకు ఇష్టంలేదు. కనుక నేను ఆయనతో పాటే వనవాసం చేయాలని నిశ్చయించుకొని ఆయనకన్నా ముందే అరణ్యానికి బయలుదేరడానికి సంసిద్ధనయ్యాను.

27

మిత్రులను ఆనందపరవశులయ్యేట్లు చేసేవాడు, ఉదాత్తుడు, సుమిత్రాదేవి తనయుడు అయిన లక్ష్మణుడు అన్నగారిని అనుసరించాలని నిర్ణయించుకొని నారవస్త్రాలు ధరించి నాకన్నా ముందే సన్నద్ధుడయ్యాడు.

28

తే వయం భర్తురాదేశం బహుమాన్య దృఢవ్రతాః,
ప్రవిష్టాః స్మ పురాదృష్టం వనం గమ్భీరదర్శనమ్.

29

వసతో దణ్డకారణ్యే తస్యాహమమితౌజసః,
రక్షసాఽపహృతా భార్యా రావణేన దురాత్మనా.

30

ద్వౌ మాసౌ తేన మే కాలో జీవితానుగ్రహః కృతః,
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం తతస్త్యక్ష్యామి జీవితమ్.

31

ఈ విధంగా మేం ముగ్గురమూ మహారాజుగారి ఆదేశాన్ని శిరసావహించి కఠోర నియమాలను పాటిస్తూ, అంతకు మునుపు ఎన్నడూ చూసి ఎరుగని దుర్గమమైన భయంకరారణ్యంలో ప్రవేశించాం.

మేం దండకారణ్యంలో వనవాస కాలాన్ని గడుపుతున్నప్పుడు, సాటిలేని పరాక్రమవంతుడైన రాముని భార్యనైన నన్ను దురాత్ముడైన రావణుడు అపహరించాడు.

30

రావణుడు నాకు ఇంకొక రెండు మాసాలు మాత్రమే గడువు ఇచ్చాడు. ఆ గడువు తీరగానే నేను ప్రాణత్యాగం చేస్తాను.

31

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 33వ సర్గ

సమాప్తం

34వ సర్గ

సీత సందేహం – హనుమంతుని రామగుణకీర్తనం

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరియూథపః,
దుఃఖాద్దుఃఖాభిభూతాయాః సాన్త్వముత్తరబ్రవీత్.

1

అహం రామస్య సందేశాద్దేవి దూతస్తవాగతః,
వైదేహి కుశలీ రామస్త్వాం చ కౌశలమబ్రవీత్.

2

యో బ్రాహ్మమస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాంవరః,
స త్వాం దాశరథీ రామో దేవి కౌశలమబ్రవీత్.

3

దుఃఖ పరంపరతో కుమిలిపోతున్న ఆ సీతాదేవి వచనాలు విని వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు ఆమెను ఓదారుస్తూ ఇలా పలికాడు.

1

విదేహ రాజపుత్రివైన ఓ సీతాదేవీ! రాముడు పంపగా నీ వద్దకు దూతగా నేను వచ్చాను. రాముడు కుశలంగా ఉన్నాడు. తన క్షేమాన్ని గురించి నీకు తెలియజేయమని నన్ను ఆదేశించాడు.

2

ఓ దేవీ! దశరథ మహారాజు కుమారుడు, వేదవేత్తలలో శ్రేష్ఠుడు, వేదాలను ఎరిగినంత క్షుణ్ణంగా బ్రహ్మాస్త్ర ప్రయోగ ఉపసంహారాలలో పారంగతుడు అయిన రాముడు నీ క్షేమసమాచారాలను తెలుసుకోమన్నాడు.

3

లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః,
కృతవాన్ శోకసంతప్తః శిరసా తేఽభివాదనమ్.

4

సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః,
ప్రీతిసంహృష్టసర్వాఙ్గీ హనుమన్తమథాబ్రవీత్.

5

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా,
ఏతి జీవన్తమానన్దో నరం వర్షశతాదపి.

6

తయా సమాగతే తస్మిన్ ప్రీతిరుత్పాదితాద్భుతా,
పరస్పరేణ చాలాపం విశ్వస్తౌ తౌ ప్రచక్రతుః.

7

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్హరియూథపః,
సీతాయాః శోకదీనాయాః సమీపముపచక్రమే.

8

నీ భర్తయైన రామునికి తోడునీడ, అత్యంత ప్రీతిపాత్రుడు, మహాతేజశ్శాలి అయిన లక్ష్మణుడు శోకంతో కుమిలిపోతూ శిరసా నీకు నమస్కరించాడు.

4

నరులలో శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు క్షేమంగా ఉన్నారనే మాట వినగానే పొందిన ఆనందంతో సీతాదేవి శరీరం గగుర్పాటు చెందగా హనుమంతునితో ఆమె ఇలా అంది.

5

'మనిషి కష్టాలను భరిస్తూ బ్రతికి ఉంటే ఎప్పుడో ఒకప్పుడు నూరేళ్ళకైనా ఆనందం పొందగలుగుతాడు' అనే లోకోక్తి ఎంత మంగళప్రదమో, ఎంత యథార్థమో ఇప్పుడు నాకు అవగతమౌతోంది.

6

రాముని వద్దనుండి దూతగా తన వద్దకు వచ్చిన హనుమంతుని పట్ల సీతాదేవికి ఆమెకు తెలియకుండానే అభిమానం కలిగింది. దాంతో వారిద్దరూ పరస్పరం నమ్మకంతో మాట్లాడుకోసాగారు.

7

శోకంతో దైన్యం చెందిన ఆ సీతాదేవి మాటలు విని వానర సేనాధిపతియైన హనుమంతుడు మెల్లగా ఆమెకు మరింత దగ్గరగా వచ్చాడు.

8

యథా యథా సమీపం స హనుమానుపసర్పతి,
తథా తథా రావణం సా తం సీతా పరిశఙ్కతే.

9

అహో ధిగ్ధుష్కృతమిదం కథితం హి యదస్య మే,
రూపాన్తరముపాగమ్య స ఏవాయం హి రావణః.

10

తామశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా,
తస్యామేవానవద్యాఙ్గీ ధరణ్యాం సముపావిశత్.

11

హనుమానపి దుఃఖార్తాం తాం దృష్ట్వా భయమోహితామ్,
అవన్దత మహాబాహు స్తతస్తాం జనకాత్మజామ్,
సా చైనం భయవిత్రస్తా భూయో నైవాభ్యుదైక్షత.

12

హనుమంతుడు తనను సమీపించేకొద్దీ అతడు వానరరూపం దాల్చిన రావణుడేమోననే అనుమానం సీతలో తలెత్తసాగింది.

9

అయ్యో! అనాలోచితంగా ఎంత పొరపాటు చేశాను. ఎటువంటి సంకోచమూ లేకుండా నా కథంతా ఇతడికి పూసగుచ్చినట్లు చెప్పాను. ఆ రావణుడే ఈ వానర రూపం ధరించి వచ్చాడు.

10

అందమైన రూపలావణ్యాలు సంతరించుకొన్న ఆ సీతాదేవి ఇలా శంకించి, శోకంచే నిస్సత్తువ ఆవరించగా, ఆ అశోకవృక్షపు కొమ్మను వదలి నేల మీద చతికిలపడిపోయింది.

11

దుఃఖంతో, భయంతో దిగ్భ్రాంతికి లోనైన ఆ సీతాదేవిని చూసి మహా బాహుడైన ఆ హనుమంతునికి ఏం చేయాలో పాలుబోక నమస్కరించి ఊరకున్నాడు. అయితే భయభ్రాంతురాలైన సీత మాత్రం మళ్ళీ హనుమంతుని వైపు చూడలేదు.

12

తం దృష్ట్వా వందమానం తు సీతా శశినిభాననా,
అబ్రవీద్దీర్ఘముచ్ఛ్వస్య వానరం మధురస్వరా.

13

మాయాం ప్రవిష్టో మాయావీ యది త్వం రావణః స్వయమ్,

ఉత్పాదయసి మే భూయః సంతాపం తన్న శోభనమ్.

14

స్వం పరిత్యజ్య రూపం యః పరివ్రాజకరూపవాన్,
జనస్థానే మయా దృష్టః త్వం స ఏవాసి రావణః.

15

ఉపవాసకృశాం దీనాం కామరూప నిశాచర,
సంతాపయసి మాం భూయః సంతప్తాం తన్న శోభనమ్.

16

అథవా నైతదేవం హి యన్మయా పరిశఙ్కితమ్,
మనసో హి మమ ప్రీతిరుత్పన్నా తవ దర్శనాత్.

17

చంద్రముఖీయైన ఆ సీతాదేవి చాలాసేపటినుంచి తనకు నమస్కరిస్తూ నిలబడ్డ హనుమంతుని చూసి, భారంగా నిట్టూరుస్తూ మధుర స్వరంలో ఇలా పలికింది.

13

నువ్వు వానరరూపం దాల్చి వచ్చిన మాయావియైన ఆ రావణుడవే అయితే నన్ను ఇలా ఎడతెగకుండా బాధించడం నీకు తగదు, మంచిది కాదు కూడా.

14

మునుపు జనస్థానంలో (దండకారణ్యంలో) నీ నిజరూపాన్ని విడిచి సన్న్యాసి రూపంలో నాకు కనిపించిన అదే రావణుడవే నువ్వు.

15

కోరిన రూపాన్ని ధరించగల ఓ రాక్షసుడా! భర్త ఎడబాటుతో

దీనురాలనై పరితపిస్తూ, ఉపవాస వ్రతాలతో కృశించిపోయి ఉన్న నాకు ఇంకా మాటిమాటికీ సంతాపం కలిగించడం నీకు భావ్యం కాదు.

16

ఒకవేళ నువ్వే రావణుడవన్న నా సందేహం నిజం కాదేమో అని కూడా అనిపిస్తోంది. ఎందుకంటే నిన్ను చూడగానే ఏ కారణం లేకుండానే నా మనస్సులో ఆనందం వెల్లివిరిసింది.

17

యది రామస్య దూతస్త్వమాగతో భద్రమస్తు తే,
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే.

18

గుణాన్ రామస్య కథయ ప్రియస్య మమ వానర,
చిత్తం హరసి మే సౌమ్య నదీకూలం యథా రయః.

19

అహో స్వప్నస్య సుఖతా యాహమేవం చిరాహృతా,
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసమ్.

20

స్వప్నేఽపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్,
పశ్యేయం నావసీదేయం స్వప్నోఽపి మమ మత్సరీ.

21

నాహం స్వప్నమిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్,
న శక్యోఽభ్యుదయః ప్రాప్తుం ప్రాప్తశ్చాభ్యుదయో మమ.

22

నిజానికి నువ్వు రాముని దూతగా ఇక్కడికి వచ్చి ఉంటే నీకు మేలు

ఒనగూరుగాక! ఓ వానరశ్రేష్ఠా! దయచేసి నాకు ఆరో ప్రాణమైన రాముని గూర్చి తెలుపు.

18

ఓ వానరా! నాకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఆ రాముని గుణగణాలను వర్ణించి చెప్పు. ఓ సౌమ్యుడా! నదీప్రవాహం నది ఒడ్డును హరించివేసే రీతిలో నా మనస్సును నీ మృదుమధుర భాషణలతో హరించివేస్తున్నావు.

19

చాలా కాలంక్రితం రావణుడు నన్ను అపహరించి తెచ్చి ఈ లంకలో బంధించి ఉంచాడు. ఇంతకాలానికి రాముడు దూతగా పంపించిన వానరుణ్ణి చూస్తున్నాను. ఇది స్వప్నమే అయితే అహో! ఎంత సుఖాన్ని ఇస్తున్న స్వప్నమో గదా!

20

మహావీరుడైన రాముడు లక్ష్మణసమేతుడై ప్రత్యక్షంగా కాకున్నా కనీసం కలలోనైనా కనిపించినా ఈ క్లేశాలన్నింటినీ భరించి జీవించగలిగేదాన్ని. కాని నా విషయంలో కల కూడా కక్షకట్టింది.

21

ఇది కల అని భావించలేకపోతున్నాను. కలలో వానర దర్శనం శుభాన్ని సూచించదు. కాని ఇప్పుడు నాకు ఆనందం కలగడంతో అభ్యుదయం ప్రాప్తించినట్లే కదా!

22

కిం ను స్యాచ్చిత్తమోహోఽయం భవేద్వాతగతిస్త్వియమ్,
ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా.

23

అథవా నాయమున్మాదో మోహోఽప్యున్మాదలక్షణః,

సంబుధ్యే చాహమాత్మానమ్ ఇమం చాపి వనౌకసమ్.

24

ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్,
రక్షసాం కామరూపత్వాన్మేనే తం రాక్షసాధిపమ్.

25

ఏతాం బుద్ధిం తదా కృత్వా సీతా సా తనుమధ్యమా,
న ప్రతివ్యాజహారాథ వానరం జనకాత్మజా.

26

సీతాయాశ్చిన్తితం బుద్ధ్వా హనుమాన్ మారుతాత్మజః,
శ్రోత్రానుకూలైర్వచనైః తదా తాం సంప్రహర్షయత్.

27

ఇదేమైనా మనస్సుకు కలిగిన భ్రాంతా? లేక వాతప్రకోప ఫలమా? లేక ఉన్మాదం వల్ల ఏర్పడ్డ వికారమా! లేక ఎండమావి మల్లే లేనిది ఉన్నట్లుగా తోస్తున్నదా?

23

అయినా ఇది ఉన్మాదమూ కాదు, ఉన్మాద లక్షణాలున్న చిత్తవిభ్రాంతీ కాదు. నేను పూర్తిగా స్మృతిలోనే ఉన్నాను. ఎందుకంటే స్పష్టంగా నేను నన్ను, ఈ వానరుణ్ణి కూడా గుర్తించగలుగుతున్నాను.

24

ఈ విధంగా సీతాదేవి పరిపరి విధాల మంచిచెడ్డలను, యుక్తాయుక్తతలను గూర్చి బాగా తర్కించుకొని రాక్షసులు కామరూపులు కావడం వలన ఇతడు రావణుడేనని చివరికి నిర్ణయించుకొంది.

25

సన్నని నడుముగలదీ, జనకమహారాజు కుమార్తె అయిన ఆ సీతాదేవి ఈ విధంగా నిర్ణయించుకొని హనుమంతునితో ఆ పైన మాట్లాడకుండా ఉండిపోయింది.

26

వాయుపుత్రుడైన హనుమంతుడు ఆమె మనోభావాలను గ్రహించి ఆమె చెవులకు ఇంపైన మధుర వచనాలు పలికి ఆమెకు సంతోషం కలిగించాడు.

27

ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాన్తః శశీ యథా,
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా.

28

విక్రమేణోపపన్నశ్చ యథా విష్ణుర్మహాయశాః,
సత్యవాదీ మధురవాగ్దేవో వాచస్పతిర్యథా.

29

రూపవాన్ సుభగః శ్రీమాన్ కన్దర్ప ఇవ మూర్తిమాన్,
స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః.

30

బాహుచ్ఛాయామవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః,
అపకృష్యాశ్రమపదాన్మృగరూపేణ రాఘవమ్,
శూన్యే యేనాపనీతాసి తస్య ద్రక్ష్యసి యత్ఫలమ్.

31

రాముడు సూర్యుని వంటి తేజశ్శాలి. చంద్రుడి మల్లే లోకులకు ఆహ్లాదం కలిగించే మనోహరుడు. కుబేరుడిలా సకల లోకాలకూ రాజాధిరాజు.

రాముడు విష్ణువంతటి కీర్తిమంతుడు, పరాక్రమశాలి. దేవగురువైన బృహస్పతిలా సత్యమునే రాముడు పలుకుతాడు, మధురభాషణ చేస్తాడు.

29

రాముడు రమణీయరూప సౌభాగ్యాలతో తేజరిల్లుతూ రూపుదాల్చిన మన్మథునిలా భాసిస్తాడు. కోపగించుకోవలసిన తరుణంలో కోపం వహిస్తాడు, శిక్షార్హులను శిక్షిస్తాడు. లోకంలో సర్వశ్రేష్ఠుడైన మహారథుడు.

30

యావత్తు లోకం మహాత్ముడైన రాముని బాహువుల నీడను ఆశ్రయించుకొని మనుగడ సాగిస్తున్నది. అటువంటి రామునికి మాయామృగాన్ని చూపి పర్ణశాలకు దూరంగా పోయేట్లు రావణుడు పన్నాగం పన్నాడు. ఆ పన్నాగం ఫలించి పర్ణశాల శూన్యం కాగానే నిన్ను అపహరించాడు. ఆ దుష్కృత్యానికి రావణునికి ఎటువంటి భయంకరమైన ఫలం లభిస్తుందో నీవే చూస్తావు.

31

న చిరాద్రావణం సంఖ్యే యో వధిష్యతి వీర్యవాన్,
రోషప్రముక్తైరిషుభిర్జ్వలద్భిరివ పావకైః.

32

తేనాహం ప్రేషితో దూతస్త్వత్సకాశమిహాగతః,
త్వద్వియోగేన దుఃఖార్తః స త్వాం కౌశలమబ్రవీత్.

33

లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానన్దవర్ధనః,
అభివాద్య మహాబాహుః స త్వాం కౌశలమబ్రవీత్.

34

రామస్య చ సఖా దేవి సుగ్రీవో నామ వానరః,

రాజా వానరముఖ్యానాం స త్వాం కౌశలమబ్రవీత్.

35

నిత్యం స్మరతి రామస్త్వాం ససుగ్రీవః సలక్ష్మణః,
దిష్ట్యా జీవసి వైదేహి రాక్షసీవశమాగతా.

36

మహావీరుడైన రాముడు క్రుద్ధుడై అతిత్వరలోనే యుద్ధరంగంలో అగ్నిజ్వాలలవంటి ప్రజ్వరిల్లే బాణాలను రోషావేశంతో ప్రయోగించి ఆ రావణుని సంహరిస్తాడు. సాక్షాత్తు ఆ రాముడే నన్ను దూతగా నీ వద్దకు పంపించాడు. నీ వియోగంతో దుఃఖార్తుడై ఉన్న ఆ స్వామి నీ కుశలం అడిగి తెలుసుకోమన్నాడు.

32–33

మహాతేజశ్శాలి, మహాబాహువులు గలవాడు, సుమిత్రాదేవి ఆనందాన్ని ఇనుమడింపజేసే పుత్రుడు అయిన లక్ష్మణుడు నీకు నమస్కరించి నీ క్షేమం గూర్చి అడిగాడు.

34

ఓ దేవీ! సుగ్రీవుడనే వానరుడు రాముని మిత్రుడు. వానరులకు రాజైన అతడు కూడా నీ క్షేమం గూర్చి అడగమన్నాడు.

35

రామలక్ష్మణ సుగ్రీవులు అందరూ అహర్నిశలూ నిన్నే స్మరిస్తున్నారు. ఓ వైదేహీ! నీవు రాక్షసమూకల అధీనంలో ఇన్ని అగచాట్లుపడుతూ కూడా జీవించి ఉండడం మా అదృష్టం.

36

నచిరాద్ద్రక్ష్యసే రామం లక్ష్మణం చ మహాబలమ్,
మధ్యే వానరకోటీనాం సుగ్రీవం చామితౌజసమ్.

37

అహం సుగ్రీవసచివో హనుమాన్నామ వానరః,
ప్రవిష్టో నగరీం లఙ్కాం లఙ్ఘయిత్వా మహోదధిమ్.

38

కృత్వా మూర్ధ్ని పదన్యాసం రావణస్య దురాత్మనః,
త్వాం ద్రష్టుముపయాతోఽహం సమాశ్రిత్య పరాక్రమమ్.

39

నాహమస్మి తథా దేవి యథా మామవగచ్ఛసి,
విశఙ్కా త్యజ్యతామేషా శ్రద్ధత్స్వ వదతో మమ.

40

ఇక కొద్దిరోజుల్లోనే నీవు రాముణ్ణి, మహాబలుడైన లక్ష్మణుణ్ణి, కోట్లాది వానర వీరులను వెంటబెట్టుకుని వచ్చే మహాతేజశ్శాలి అయిన సుగ్రీవుణ్ణీ చూడగలవు.

37

నేను ఆ సుగ్రీవుని మంత్రినైన వానరుడను. నా పేరు హనుమంతుడు. మహాసముద్రాన్ని లంఘించి లంకానగరంలో ప్రవేశించాను.

38

నా పరాక్రమాన్ని ప్రదర్శించి దురాత్ముడైన రావణుని శిరస్సు మీద పాదం మోపినట్లుగా సముద్ర లంఘనం చేసి నీ దర్శనార్థం ఇక్కడకు వచ్చాను.

39

దేవీ! నువ్వు భావిస్తున్నట్లు నేను వానరరూపం దాల్చి వచ్చిన రావణుడను కాను. ఈ నీ అనుమానాన్ని విడిచిపెట్టు. నా మాట నమ్ము.

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 34వ సర్గ
సమాప్తం

35వ సర్గ
రాముని శరీర లక్షణాల వర్ణన

తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ వానరర్షభాత్,
ఉవాచ వచనం సాన్త్వమిదం మధురయా గిరా.

1

క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్,
వానరాణాం నరాణాం చ కథమాసీత్సమాగమః.

2

యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ వానర,
తాని భూయః సమాచక్ష్వ న మాం శోకః సమావిశేత్.

3

వానరశ్రేష్ఠుడైన హనుమంతుని ముఖతా రాముని వృత్తాంతం విన్న సీతాదేవి మనస్సు కాస్త కుదుటపడగా ప్రియంగానూ మధురంగాను ఇలా మాట్లాడసాగింది.

1

నీకు రామునితో ఎప్పుడు పరిచయం కలిగింది? లక్ష్మణుని ఏ విధంగా ఎరుగుదువు? వానరులైన మీకూ, నరులైన రామలక్ష్మణులకూ అసలు స్నేహం ఎలా కుదిరింది?

2

ఓ వానరోత్తమా! రామ లక్ష్మణుల విలక్షణమైన శారీరక లక్షణాలను వర్ణించి చెప్పు. అలా వినడం వలన నా శోకం ఉపశమించగలదు.

3

కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్,
కథమూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే.

4

ఏవముక్తస్తు వైదేహ్యా హనుమాన్మారుతాత్మజః,
తతో రామం యథాతత్త్వమాఖ్యాతుముపచక్రమే.

5

జానన్తీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి,
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ.

6

యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ యాని వై,

లక్షితాని విశాలాక్షి వదతః శృణు తాని మే.

7

రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః,
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే.

8

రామలక్ష్మణుల అవయవాల పొందిక, ఆకృతి, ఊరువులు, బాహువులు ఏ తీరులో ఉంటాయి? అంతా వివరంగా చెప్పు.

4

సీతాదేవి అలా ప్రశ్నించగా వాయుకుమారుడైన హనుమంతుడు, రాముని రూపురేఖలను ఉన్నదున్నట్లు వర్ణించి చెప్పడం ప్రారంభించాడు.

5

తామర రేకుల వంటి కన్నులుగల విదేహ రాజకుమారీ! అంతా నీకు తెలిసినప్పటికీ రామలక్ష్మణుల ఆకృతి ఇత్యాది లక్షణాలను గూర్చి నన్ను అడగడం నా భాగ్యంగా భావిస్తున్నాను. అలా చెప్పడం నాకు చాలా సంతోషం.

6

విశాలములైన నేత్రాలు గల ఓ సీతాదేవీ! నేను పరికించి, గుర్తించిన రాముని శారీరకాది లక్షణాలనూ, లక్ష్మణుని లక్షణాలనూ వివరిస్తాను, ఆలకించు.

7

ఓ జనకరాజపుత్రీ! రాముడు పద్మపత్రాల వంటి విశాలమైన నేత్రాలు గలవాడు. సమస్త ప్రాణుల మనస్సులను ఆకట్టుకొనే సర్వాంగ సుందరుడు. మూర్తీభవించిన రూప, దాక్షిణ్యాలు రాముడు. ఈ లక్షణాలన్నీ పుట్టుకతోనే రాముడిలో ఉన్నాయి.

8

తేజసాఽఽదిత్యసంకాశః క్షమయా పృథివీసమః,
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసనోపమః.

9

రక్షితా జీవలోకస్య స్వజనస్యాభిరక్షితా,
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః.

10

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా,
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః.

11

అర్చిష్మానర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః,
సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్.

12

రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా,

శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః.

13

రాముడు తేజస్సులో సూర్యునికి, సహనంలో భూదేవికి, బుద్ధిలో బృహస్పతికి, కీర్తిలో దేవేంద్రునికి సాటియైన వాడు.

9

రాముడు సకల ప్రాణులకు రక్షకుడు, విశేషించి తన వారికి అంటే తనను ఆశ్రయించుకొన్న వారికి పరిరక్షకుడు. సత్ప్రవర్తన నియమావళికి, ధర్మానికి రక్షకుడు. శత్రువులకు సింహస్వప్నం.

10

ఓ సీతాదేవీ! నాలుగు వర్ణాల వారితో కూడిన ఈ సమస్త ప్రపంచాన్నీ కాపాడేవాడు రాముడు. లోకంలో వ్యాప్తిలో ఉన్న న్యాయ నియమావళికి కర్త అతడు. వాటిని స్వయంగా తను పాటిస్తూ ఇతరులందరి చేత పాటింప జేసేవాడు.

11

రాముడు తేజోవిరాజమానుడు, లోకపూజ్యుడు, బ్రహ్మచర్య వ్రతంలో నిష్ఠగలవాడు. సత్పురుషులకు ఉపకారం చేయడంలో సదా సన్నద్ధుడై ఉంటాడు. సమస్త వ్యవహారాలందు సముచిత కార్యసరళిని చక్కగా పాటించడం తెలిసినవాడు.

12

రాముడు రాజనీతి కోవిదుడు, బ్రాహ్మణుల పట్ల ఆదరాభిమానాలు గలవాడు. సకల శాస్త్రపారంగతుడు, వినయశీలి, శత్రుభయంకరుడు.

13

యజుర్వేదవినీతశ్చ వేదవిద్భిః సుపూజితః,
ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః.

14

విపులాంసో మహాబాహుః కమ్బుగ్రీవః శుభాననః,
గూడజత్రుః సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః.

15

దున్దుభిస్వననిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
సమః సమవిభక్తాఙ్గో వర్ణం శ్యామం సమాశ్రితః.

16

త్రిస్థిరస్త్రిప్రలంబశ్చ త్రిసమ స్త్రిషు చోన్నతః,
త్రితామ్ర స్త్రిషు చ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః.

17

రాముడు యజుర్వేదాన్ని ఆపోశన పట్టిన వాడు. అతడు వేదవేత్తలందరి మన్ననలూ చూరగొన్నవాడు. ధనుర్వేదంలో (ధనుర్విద్యలో) సాటిలేనివాడు. తక్కిన వేదాలు, వేదాంగాలనూ చక్కగా నేర్చినవాడు.

14

ఓ సీతాదేవీ! రాముని భుజాలు విశాలమైనవి, బాహువులు దీర్ఘమైనవి. ఆయన కంఠం శంఖాకారంలో ఉండి,

ముఖారవిందం మంగళప్రదంగా ఉంటుంది. రాముని మూపుసంధి ఎముకలు బయటకు కానరావు. అందమైన నేత్రాల కనుకొనలు ఎర్రగా ఉంటాయి. రాముని గురించి విననివారు లోకంలో ఎవరూ ఉండరు.

15

రాముడి కంఠస్వరం దుందుభిస్వరం లాంటిది. నిగనిగలాడే మేనిచ్ఛాయ రామునిది. అతడు పరాక్రమశాలి. రాముడు మరీ పొడగరీ కాదు, అలాగని పొట్టీ కాదు, సమానమైన ఎత్తులో ఉంటాడు. కుడి ఎడమల ఉన్న శరీర అవయవాలు సమాన ప్రమాణంలో తీర్చిదిద్దినట్లు ఉంటాయి.

16

రాముని వక్షఃస్థలం, మణికట్టు, పిడికిలి సుదృఢంగా ఉంటాయి. రాముని కనుబొమలు, వృషణకోశం, బాహువులు దీర్ఘమైనవి. ఆయన కేశాగ్రములు, వృషణములు, మోకాళ్ళు హెచ్చుతగ్గులు లేకుండా సమప్రమాణంలో ఉంటాయి. రాముని నాభి, పొత్తికడుపు, రొమ్ము ఎత్తైనవిగా అమరి ఉన్నాయి. కనుకొనలు, గోళ్ళు, అరచేతులు, అరికాళ్ళు ఎర్రని రంగును సంతరించుకొని ఉంటాయి. పాదరేఖలు, శిరోజాలు, జననేంద్రియం నునుపుగా, ప్రకాశిస్తూ ఉంటాయి. రాముని కంఠస్వరం, నడకతీరు, నిలబడే వైనం గంభీరమైనవి.

17

త్రివలీవాంస్త్ర్యవనతశ్చతుర్వ్యఙ్గస్త్రిశీర్షవాన్,
చతుష్కలశ్చతుర్లేఖశ్చతుష్కిష్కుశ్చతుఃసమః.

18

చతుర్దశసమద్వన్ద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః,
మహోష్ఠహనునాసశ్చ పఞ్చస్నిగ్ధోఽష్టవంశవాన్.

19

దశపద్మో దశబృహత్త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్,
షడున్నతో నవతనుస్త్రిభిర్వ్యాప్నోతి రాఘవః.

20

రాముని ఉదరం మీద మూడు ముడతలు ఉంటాయి. ఆయన స్తనాలు, స్తనాగ్రాలు, పాదరేఖలు నిమ్నంగా ఉంటాయి. రాముని కంఠం, లింగం, వీపు, పిక్కలు హ్రస్వమైనవి. ఆయన తల మీద మూడు సుడులు ఉంటాయి. అంగుష్ఠ మూలమున నాలుగు రేఖలుంటాయి. రాముని నుదుటి మీద, అరచేతుల్లోను, అరికాళ్ళలోను నాలుగేసి రేఖలుంటాయి. ఆయన నాలుగు మూరల (96 అంగుళాలు) ఎత్తు గలవాడు. ఆయన బాహువులు, మోకాళ్ళు, తొడలు, చెక్కిళ్ళు, హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా ఏకరీతిలో ఉంటాయి.

18

కనుబొమ్మలు, నాసికాపుటాలు, నేత్రాలు, చెవులు, పెదవులు, స్తనాగ్రాలు, మోచేతులు, మణికట్లు, మోకాళ్ళు, వృషణములు, పిరుదులు, చేతులు, పాదాలు, నడుము ఇరుప్రక్కలు అనే ఈ పద్నాలుగు జతల అంగాలన్నీ రామునికి సమానంగానూ ఏకరీతిలోనూ అమరి ఉంటాయి. రామునికి అందమైన మొనదేలిన నాలుగు దంతాలున్నాయి. రాముని నడకతీరు సమయానుకూలంగా సింహ, శార్దూల, గజ, వృషభ గతుల్లో ఉంటుంది. ఆయన పెదవులు, దౌడలు, ముక్కు తీర్చిదిద్దినట్లు చాలా అందంగా ఉంటాయి. ఆయన శరీరంలో ఐదు భాగాలు, అంటే కళ్ళు, పళ్ళు, చర్మం, పాదాలు, కేశాలు నిగనిగలాడుతుంటాయి. రాముని శరీరం, చేతివేళ్ళు, కాలివేళ్ళు, చేతులు, నాసిక, నేత్రాలు, చెవులు, వృషణాలు అనే అష్టవంశకాలు సముచిత ప్రమాణంలో ఉంటాయి.

19

రాముని ముఖం, నేత్రాలు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, స్తనాలు, గోళ్ళు, హస్తాలు, పాదాలు అనే ఈ పదీ పద్మాలను పోలి ఉంటాయి. రాముని శిరస్సు, నుదురు, చెవులు, కంఠం, వక్షము, హృదయం, పొట్ట, చేతులు, కాళ్ళు, వీపు అనే ఈ పది అవయవాలూ విపులంగా పెద్దవిగా అమరి ఉంటాయి. తేజస్సు, కీర్తి, సంపద అనే ఈ మూడింటి వల్లా రాముడు లోకఖ్యాతి గాంచాడు. రాముని మాతృ పితృ వంశాలు రెండూ పావనమైనవి. ఆయన చంకలు, కడుపు, వక్షము, ముక్కు, మూపు, లలాటమనే ఆరు అంగాలూ ఉన్నతములైనవి. సూక్ష్ములైన వేళ్ళకణుపులు, తలవెండ్రుకలు, రోమములు, గోళ్ళు, చర్మము, లింగము, మీసము, దృష్టి, బుద్ధి గలవాడు రాముడు. ఆయన పూర్వాహ్ణ మధ్యాహ్న అపరాహ్ణములనే త్రికాలాలలోనూ ధర్మార్థకామములను ఆచరిస్తుంటాడు.

20

సత్యధర్మపరః శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః,
దేశకాలవిభాగజ్ఞః సర్వలోకప్రియంవదః.

21

భ్రాతా తస్య చ ద్వైమాత్రః సౌమిత్రిరపరాజితః,
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః.

22

తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ,
విచిన్వన్తౌ మహీం కృత్స్నామస్మాభిరభిసంగతౌ.

23

రాముడు సత్యధర్మపరాయణుడు. సకలైశ్వర్య సంపన్నుడు. ధర్మమార్గంలో ధనాన్ని ఆర్జించడంలో, అలా ఆర్జించిన ఆ ధనాన్ని యోగ్యులకు, పాత్రులైనవారికి దానం చేయడంలో ఆయనది అగ్రతాంబూలం. దేశకాలాల యుక్తాయుక్తాలు బాగా తెలిసినవాడు. అందరికీ ప్రియం కలిగే విధంగా మాట్లాడతాడు.

21

సుమిత్రాదేవి కుమారుడు, రాముని సవతి తమ్ముడు అయిన లక్ష్మణుడు అజేయ పరాక్రమశాలి. అతడు రూపంలోనూ, గుణంలోనూ, మమతానురాగాలు వ్యక్తం చేయడంలోనూ రాముని వంటి వాడే.

22

పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులిద్దరూ నిన్ను కనుగొనాలనే ఆతురతతో భూమండలం యావత్తూ అన్వేషిస్తూన్న తరుణంలో మమ్మల్ని కలుసుకున్నారు.

23

త్వామేవ మార్గమాణౌ తౌ విచరన్తౌ వసుంధరామ్,
దదర్శతుర్మృగపతిం పూర్వజేనావరోపితమ్.

24

ఋశ్యమూకస్య పృష్ఠే తు బహుపాదపసంకులే,
భ్రాతుర్భయార్తమాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్.

25

వయం తు హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరమ్,
పరిచర్యామహే రాజ్యాత్పూర్వజేనావరోపితమ్.

26

తతస్తౌ చీరవసనౌ ధనుః ప్రవరపాణినౌ,
ఋశ్యమూకస్య శైలస్య రమ్యం దేశముపాగతౌ.

27

స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః,
అభిప్లుతో గిరేస్తస్య శిఖరం భయమోహితః.

28

నీ కోసం అన్నిచోట్లా వెదకుచున్న ప్రయత్నంలో రామలక్ష్మణులకు వానరరాజైన సుగ్రీవుడు తారసపడ్డాడు. ఈ సుగ్రీవుడు తన అన్నచే రాజ్యం నుండి బహిష్కృతుడై భయంతో ఋశ్యమూక పర్వత లోయల్లోని దట్టమైన అరణ్యాలలో తలదాచుకొంటున్నాడు.

24–25

అన్నచే అవమానింపబడి బహిష్కృతుడై ఋశ్యమూకంలో తల దాచుకొంటున్న సత్యప్రతిజ్ఞుడైన ఆ సుగ్రీవుని మేం కొద్దిమంది మాత్రం సేవించుకొంటున్నాం.

26

ఈ సమయంలోనే నారచీరలతోనూ, జటలతోనూ ఋషివేషధారులై శ్రేష్ఠములైన ధనుస్సులు చేతపుచ్చుకొని రమ్యమైన ఆ ఋశ్యమూక పర్వత ప్రాంతానికి రామలక్ష్మణులు వచ్చారు.

27

ధనుర్ధారులై వస్తున్న నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులను చూడగానే వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు భయకంపితుడై ఠక్కున ఎగిరి పర్వత శిఖరం మీదికి వెళ్ళాడు.

28

తతః స శిఖరే తస్మిన్వానరేన్ద్రో వ్యవస్థితః,
తయోః సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్.

29

తావహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవచనాత్ప్రభూ,
రూపలక్షణసంపన్నౌ కృతాఞ్జలిరుపస్థితః.

30

తౌ పరిజ్ఞాతతత్త్వార్థౌ మయా ప్రీతి సమన్వితౌ,
పృష్ఠమారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ.

31

నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే,
తయోరన్యోఽన్యసల్లాపాత్ భృశం ప్రీతిరజాయత.

32

తతస్తౌ ప్రీతిసంపన్నౌ హరీశ్వరనరేశ్వరౌ,
పరస్పరకృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా.

33

పిదప ఆ వానరేంద్రుడైన సుగ్రీవుడు తను పర్వతశిఖరం మీదనే ఉండి, ఆ అపరిచితులను కలుసుకోవడానికి తక్షణమే నన్ను వారి వద్దకు పంపించాడు.

29

సుగ్రీవుని ఆదేశానుసారం నేను నరవరులు, సర్వసమర్థులు, చక్కని రూపంతోనూ శుభలక్షణాలతోనూ భాసిస్తూన్న ఆ రామలక్ష్మణుల వద్దకు చేతులు జోడించి నమస్కరిస్తూ వెళ్ళాను.

30

సుగ్రీవుని గురించిన వాస్తవ స్థితిగతులను తెలియజేయగా ఆ పురుషశ్రేష్ఠులు సుగ్రీవుని పట్ల ప్రసన్నతను వ్యక్తంచేశారు. అప్పుడు నేను వారిని నా భుజస్కంధాల మీద ఎక్కించుకుని సుగ్రీవుడున్న చోటుకు తీసుకువెళ్ళాను.

31

మహాత్ముడైన సుగ్రీవునకు, రామలక్ష్మణుల వృత్తాంతాన్ని యథాతథంగా నివేదించాను. తదనంతరం రామసుగ్రీవులు ఎటువంటి అరమరికలు లేకుండా మనస్సులు విప్పి మాట్లాడుకోవడంతో వారి మధ్య ప్రగాఢ మైత్రి జనించింది.

32

తరువాత ఆ నర వానర ప్రముఖులైన రామ సుగ్రీవులు ఎంతో ఆదరాభిమానాలతో తమ తమ గడచిన వృత్తాంతాలను ఒకరికొకరు చెప్పుకొని సాంత్వన చెందారు.

33

తతః స సాన్త్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః,
స్త్రీహేతోర్వాలినా భ్రాత్రా నిరస్తమురుతేజసా.

34

తతస్త్వన్నాశజం శోకం రామస్యాక్లిష్టకర్మణః,
లక్ష్మణో వానరేన్ద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్.

35

స శ్రుత్వా వానరేన్ద్రస్తు లక్ష్మణేనేరితం వచః,
తదాసీన్నిష్ప్రభోఽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్.

36

తతస్త్వద్భాత్రశోభినీ రక్షసా హ్రియమాణయా,
యాన్యాభరణజాలాని పాతితాని మహీతలే.

37

తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః,
సంహృష్టా దర్శయామాసుర్గతిం తు న విదుస్తవ.

38

అపరిమిత బలపరాక్రమాలు గల అన్నయైన వాలిచే ఒక స్త్రీ కారణంగా (సుగ్రీవుని భార్య రుమ) రాజ్యం నుండి వెళ్ళగొట్టబడిన సుగ్రీవుని, రాముడు ఊరడించాడు.

34

అదేసమయంలో ఎటువంటి అనితరసాధ్యమైన కార్యాన్నైనా అలవోకగా సాధించగల లక్ష్మణుడు, రామునికి నీ (సీత) ఎడబాటు వల్ల కలిగిన దుఃఖాన్ని గూర్చి సుగ్రీవుడికి విపులంగా చెప్పాడు.

35

లక్ష్మణుడు చెప్పిన మాట వినగానే వానరేంద్రుడైన సుగ్రీవుడు ఖిన్నుడై, గ్రహణం పట్టిన సూర్యునిలా తేజోవిహీనుడయ్యాడు.

36

రావణుడు నిన్ను (సీతను) అపహరించి తీసుకుపోతున్నప్పుడు నీ శరీరం మీద శోభిల్లుతున్న ఆభరణాలను నువ్వు నేలమీద జారవిడిచావు. పదిలపరచిన ఆ ఆభరణాలను వానర నాయకులు తెచ్చి సంతోషంగా రామునికి చూపించారు. కాని నిన్ను తీసుకొనిపోయిన దారిని మాత్రం వారు చెప్పలేకపోయారు.

37–38

తాని రామాయ దత్తాని మయైవోపహృతాని చ,
స్వనవస్త్యవకీర్ణాని తస్మిన్విగతచేతసి.

39

తాన్యజ్మే దర్శనీయాని కృత్యా బహువిధం తవ,
తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్.

40

పశ్యతస్తాని రుదతస్తామ్యతశ్చ పునఃపునఃపునఃప

రాముడు ఆ ఆభరణాలను పదేపదే చూస్తూ మాటిమాటికీ విలపించ సాగాడు. రాముణ్ణి దహించివేస్తున్న శోకాగ్నిని ఆ ఆభరణాలు మరింత ప్రజ్వలింపజేశాయి.

41

మహాత్ముడైన రాముడు చెప్పనలవిగాని దుఃఖంతో అట్లే నేలమీద కుప్పకూలిపోయాడు. అప్పుడు నేనే ఎన్నో సాంత్వన వచనాలు పలికి ఆయనను లేవదీసి కూర్చోబెట్టాను.

42

గొప్ప బాహువులుగల రాముడు లక్ష్మణునితోపాటు ఆ ఆభరణాలను పలుమార్లు పరికించి, ప్రక్కనున్న వారికి కూడా చూపి, వాటిని పదిలపరచమని సుగ్రీవునికి అప్పగించాడు.

43

స తవాదర్శనాదార్యే రాఘవః పరితప్యతే,
మహతా జ్వలతా నిత్యమగ్నినేవాగ్నిపర్వతః.

44

త్వత్కృతే తమనిద్రా చ శోకశ్చిన్తా చ రాఘవమ్,
తాపయన్తి మహాత్మానమగ్న్యగారమివాగ్నయః.

45

తవాదర్శనశోకేన రాఘవః ప్రవిచాల్యతే,
మహతా భూమికమ్పేన మహానివ శిలోచ్చయః.

46

కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణాని చ,
చరన్న రతిమాప్నోతి త్వామపశ్యన్నృపాత్మజే.

47

స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః,
సమిత్రబాన్ధవం హత్వా రావణం జనకాత్మజే.

48

ఓ పూజ్యురాలా! నువ్వు కనిపించకపోవడంతో నిత్యమూ అగ్నిచే ప్రజ్వలిస్తూన్న అగ్నిపర్వతంలా రాముడు పరితపించిపోతున్నాడు.

44

అగ్నిగృహాన్ని త్రేతాగ్నులు* తపింపజేసేటట్లు నీ ఎడబాటుచే నిద్రలేమి, శోకం, చింత అనే మూడూ మహాత్ముడైన రాముని తపింపజేస్తున్నాయి.

45

గొప్ప భూకంపం సంభవించడం వలన ఒక మహాపర్వతం చలించి పోయినట్లు నీ వియోగ శోక కారణాన రాముడు నిలువెల్లా చలించిపోయి ఉన్నాడు.

46

ఓ రాజపుత్రీ! రమ్యమైన వనాలలో, ఆహ్లాదకరమైన నదీ తీరాలలో, సెలయేళ్ళ ప్రక్కన తిరుగుతూన్నప్పటికీ నువ్వు

కానరానందున రాముడు కించిత్తుకూడా ఆనందం పొందలేకపోతున్నాడు.

47

ఓ జనకరాజనందినీ! పురుషశ్రేష్ఠుడైన రాముడు అతిత్వరలోనే ఆ రావణుని బంధుమిత్రసహితంగా సంహరించి నిన్ను తప్పక చేరగలడు.

48

సహితౌ రామసుగ్రీవావుభావకురుతాం తదా,
సమయం వాలినం హన్తుం తవ చాన్వేషణం తథా.

49

తతస్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః,
కిష్కిన్ధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః.

50

తతో నిహత్య తరసా రామో వాలినమాహవే,
సర్వర్క్షహరిసంఘానాం సుగ్రీవమకరోత్ పతిమ్.

51

రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత,
హనూమన్తం చ మాం విద్ధి తయోర్దూతమిహాగతమ్.

52

స్వరాజ్యం ప్రాప్య సుగ్రీవః సమానీయ హరీశ్వరాన్,
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్.

53

నాటి రామసుగ్రీవుల సమావేశంలో రాముడు వాలిని సంహరించేటట్లూ, సుగ్రీవుడు తన వానర సైన్యంతో నిన్ను సర్వత్రా వెతికించేటట్లూ వారు ఉభయపక్ష ఒడంబడిక చేసుకొన్నారు.

49

ఆ ఒడంబడిక ప్రకారం మహావీరులైన రామలక్ష్మణులు కిష్కింధకు వెళ్ళారు. అక్కడ జరిగిన పోరులో వానరరాజైన వాలి నేలకొరిగాడు.

50

ఆ పోరులో రాముడు తన సాటిలేని పరాక్రమంతో వాలిని సంహరించి సమస్త భల్లూకవానర సమూహాలకూ సుగ్రీవుని రాజుగా అభిషిక్తుణ్ణి చేశాడు.

51

ఓ సీతాదేవీ! ఈ విధంగా రామసుగ్రీవుల మధ్య ప్రగాఢ మైత్రి ఏర్పడింది. నేను వారిద్దరూ పంపగా నీ వద్దకు దూతగా వచ్చాను. నా పేరు హనుమంతుడు.

52

సుగ్రీవుడు తన రాజ్యాన్ని తిరిగి పొందిన పిదప మహాబలశాలులైన వానరయోధులను రప్పించి వారిని అన్ని దిక్కులకూ నీ అన్వేషణార్థం పంపించాడు.

53

ఆదిష్టా వానరేన్ద్రేణ సుగ్రీవేణ మహౌజసా,
అద్రిరాజప్రతీకాశాః సర్వతః ప్రస్థితా మహీమ్.

54

తతస్తే మార్గమాణా వై సుగ్రీవవచనాతురాః,
చరన్తి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః.

55

అఙ్గదో నామ లక్ష్మీవాన్ వాలిసూనుర్మహాబలః,
ప్రస్థితః కపిశార్దూలస్త్రిభాగబలసంవృతః.

56

తేషాం నో విప్రణష్టానాం విన్ధ్యే పర్వతసత్తమే,
భృశం శోకపరీతానామహోరాత్రగణా గతాః.

57

తే వయం కార్యనైరాశ్యాత్ కాలస్యాతిక్రమేణ చ,
భయాచ్చ కపిరాజస్య ప్రాణాంస్త్యక్తుం వ్యవస్థితాః.

58

మహాతేజోవంతుడైన ఆ వానరరాజు సుగ్రీవుని ఆదేశం మేరకు మహాపర్వత ప్రమాణంలో ఉన్న వానరవీరులు భూమి నలుమూలలా ఓ దేవీ, నిన్ను వెతకడానికై బయలుదేరారు.

54

అప్పటి నుండి మేము, ఇతర వానరవీరులతోపాటు సుగ్రీవుని ఆదేశాన్ని శిరసావహించాలని త్వరపడుతూ, ఆతురతతో ఓ దేవీ, నిన్ను అన్వేషిస్తూ భూతలమంతా గాలిస్తూ సంచరిస్తున్నాం.

55

శ్రీమంతుడూ, వాలి కుమారుడూ, వానరశ్రేష్ఠుడూ, మహాబలశాలీ అయిన అంగదుడు మూడింట ఒక వంతు వానరసేనకు నాయకత్వం వహించి నీ (సీత) అన్వేషణార్థం బయలుదేరాడు.

56

విన్ధ్య పర్వతశ్రేణులలో మా అన్వేషణ సాగిస్తుండగా దారితెన్ను తెలియకపోవడంతో చెప్పనలవిగాని దుఃఖంలో మునిగిపోయాం. మేం అదే స్థితిలో అనేక పగళ్ళు రాత్రులు గడపవలసి వచ్చింది.

57

మా అన్వేషణా ప్రయత్నాలు సఫలీకృతం కానందున నిరాశానిస్పృహలు చోటుచేసుకోవడం వల్లా, ఇచ్చిన గడువు దాటిపోవడం వల్లా, చండశాసనుడైన సుగ్రీవుని ముందుకు వెళ్ళడంకన్నా మేమంతా ప్రాణత్యాగం చేసుకోవడం ఉత్తమం అని నిర్ణయించుకొన్నాం.

58

విచిత్య వనదుర్గాణి గిరిప్రస్రవణాని చ,
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాంస్త్యక్తుం సముద్యతాః.

59

దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చ సర్వాన్వానరపుఙ్గవాన్,
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయదఙ్గదః.

60

తవ నాశం చ వైదేహి వాలినశ్చ వధం తథా,
ప్రాయోపవేశమస్మాకం మరణం చ జటాయుషః.

61

తేషాం నః స్వామిసందేశాన్నిరాశానాం ముమూర్షతామ్,
కార్యహేతోరివాయాతః శకునిర్వీర్యవాన్ మహాన్.

62

గృధ్రరాజస్య సోదర్యః సంపాతిర్నామ గృధ్రరాట్,
శ్రుత్వా భ్రాతృవధం కోపాదిదం వచనమబ్రవీత్.

63

మేం దుర్గమారణ్యాలను, దుర్గాలను, పర్వతాలను, నదులను, సెలయేళ్ళను నిశితంగా వెతకినప్పటికీ ఓ దేవీ! నీ జాడ తెలియకపోవడంతో నిరాశాపూరితులమై ప్రాణత్యాగానికి సంసిద్ధులమయ్యాం.

59

ఓ విదేహ రాజకుమారీ! ఈ విధంగా వానరపుంగవులందరూ నిరాహార దీక్షతో ప్రాణత్యాగానికి సిద్ధమవడం చూసి మా నాయకుడైన అంగదుడు దుఃఖ సాగరంలో మునిగిపోయాడు. అతడు జటాయువు మరణాన్ని, తన తండ్రి వాలి మృతిని, నీ అన్వేషణా వైఫల్యాన్ని, మా ప్రాయోపవేశ సంకల్పాన్ని గూర్చి పదేపదే తలచుకొంటూ కుమిలిపోయాడు.

60–61

చండశాసనుడైన సుగ్రీవుడు ఇచ్చిన కాల గడువు దాటడంతో మేం నిరాశానిస్పృహలకు లోనై ప్రాణత్యాగానికి సిద్ధమయ్యాం. అదే సమయంలో మా కార్యసాఫల్యతకా అన్నట్లు మహాపరాక్రమశాలియైన ఒక గొప్ప పక్షిరాజు మా పద్దకు వచ్చాడు.

62

ఆ వచ్చిన పక్షిరాజు జటాయువు సోదరుడైన సంపాతి. సోదరుని మరణవార్త విని సంపాతి క్రుద్ధుడై ఇలా పలికాడు:

63

యవీయాన్ కేన మే భ్రాతా హతః క్వ చ నిపాతితః,
ఏతదాఖ్యాతుమిచ్ఛామి భవద్భిర్వానరోత్తమాః.

64

అఙ్గదోఽకథయత్తస్య జనస్థానే మహద్వధమ్,
రక్షసా భీమరూపేణ త్వాముద్దిశ్య యథాతథమ్.

65

జటాయుషో వధం శ్రుత్వా దుఃఖీతః సోఽరుణాత్మజః,
త్వాం శశంస వరారోహే వసన్తీం రావణాలయే.

66

తస్య తద్వచనం శుత్వా సంపాతేః ప్రీతివర్ధనమ్,
అఙ్గదప్రముఖాస్తూర్ణం తతః సంప్రస్థితా వయమ్.

67

విన్ధ్యాదుత్థాయ సంప్రాప్తాః సాగరస్యాన్తముత్తరమ్,
త్వద్దర్శనకృతోత్సాహా హృష్టాస్తుష్టాః ప్లవఙ్గమాః.

68

ఓ వానరశ్రేష్ఠులారా! నా తమ్ముడైన జటాయువు ఎక్కడ ఎవరి చేతుల్లో ఓటమి పొంది మరణించాడో నాకు తెలుపండి.

64

జనస్థానంలో నిన్ను (సీతను) కాపాడడానికి ముందుకు వచ్చిన జటాయువు ఒక భయంకరుడైన రాక్షసుని చేతుల్లో సంహరింపబడిన ఉదంతాన్ని అంగదుడు పూసగుచ్చినట్లు సంపాతికి చెప్పాడు.

65

ఓ సీతాదేవీ! జటాయువు మరణం గురించి విని దుఃఖించిన అరుణపుత్రుడైన ఆ సంపాతి నువ్వు రావణుని అంతఃపురంలో నిర్బంధంలో ఉన్నట్లు మాతో చెప్పాడు.

66

సంతోషకరమైనదీ, అదేసమయంలో ఉత్తేజాన్ని కలిగించేదీ అయిన ఆ సంపాతి పలుకులు వినగానే అంగదుని నేతృత్వంలో ఉన్న మేమందరమూ వెంటనే అక్కణ్ణుండి బయలుదేరాము.

67

నిన్ను (సీతాదేవిని) కనుగొనగలమనే ఆశ చిగురించడంతో మేమందరమూ సమధికోత్సాహంతో ఆ వింధ్య పర్వతం నుండి బయలుదేరి సముద్రపు ఉత్తర తీరం చేరుకున్నాం.

68

అఙ్గదప్రముఖాః సర్వే వేలోపాన్తముపస్థితాః,
చిన్తాం జగ్ముః పునర్భీతాస్త్వద్దర్శనసముత్సుకాః.

69

అథాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః,
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః.

70

లఙ్కా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా,
రావణశ్చ మయా దృష్టస్త్వం చ శోకపరిప్లుతా.

71

ఏతత్తే సర్వమాఖ్యాతం యథావృత్తమనిన్దితే,

అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథేరహమ్.

72

తం మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్తమిహాగతమ్,
సుగ్రీవసచివం దేవి బుద్ధ్యస్వ పవనాత్మజమ్.

73

నీ దర్శన కాంక్షతో ఉత్సాహంగా సముద్ర తీరం చేరిన అంగదాది వానరులందరూ ఆ మహాసముద్రాన్ని చూడగానే నీరుకారిపోయారు. నిన్ను కనుగొనే ప్రయత్నంలో ఈ సముద్రం పెద్ద అడ్డంకిగా ఉండడంతో మళ్ళీ వాళ్ళను విచారమూ విషాదమూ క్రమ్ముకొన్నాయి.

69

విస్తారమైన సముద్రాన్ని చూసి దిక్కుతోచక దిగాలుపడి ఉన్న వానరసేన భయాన్ని తొలగిస్తూ అప్పుడు నేను నూరు యోజనాల విస్తీర్ణమైన ఆ సముద్రాన్ని లంఘించాను.

70

రాక్షసులతో నిండివున్న ఈ లంకానగరాన్నంతా ఈ రాత్రి కలయ తిరిగాను. నేను రావణుణ్ణి చూశాను, శోకంలో మునిగివున్న నిన్నూ చూడగలిగాను.

71

దోషరహితవైన ఓ సీతాదేవీ! జరిగిన వృత్తాంతం యావత్తు నీకు యథాతథంగా విన్నవించాను. నేను రాముని దూతను. నాతో మాట్లాడు.

72

ఓ దేవీ! నిన్ను అన్వేషించడమనే రామకార్యార్థంగా నేను ఇక్కడకు వచ్చాను. నేను సుగ్రీవుని మంత్రిని, వాయుదేవుని కుమారుణ్ణి. ఈ విషయం అర్థం చేసుకో.

73

కుశలీ తవ కాకుత్థ్సః సర్వశస్త్రభృతాం వరః,
గురోరారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః.

74

తస్య వీర్యవతో దేవి భర్తుస్తవ హితే రతః,
అహమేకస్తు సంప్రాప్తః సుగ్రీవవచనాదిహ.

75

మమేయమసహాయేన చరతా కామరూపిణా,
దక్షిణా దిగనుక్రాన్తా త్వన్మార్గవిచయైషిణా.

76

దిష్ట్యాహం హరిసైన్యానాం త్వన్నాశమనుశోచతామ్,
అపనేష్యామి సంతాపం తవాభిగమశంసనాత్.

77

దిష్ట్యా హి మమ న వ్యర్థం దేవి సాగరలఙ్ఘనమ్,

ప్రాప్స్యామ్యహమిదం దిష్ట్యా త్వద్దర్శనకృతం యశః.

78

లోకంలోని సమస్త శస్త్రధారులలో సర్వశ్రేష్ఠుడైన నీ పతి రాముడు క్షేమంగా ఉన్నాడు. సర్వశుభలక్షణ శోభితుడూ, అన్నగారి సేవలోనే తత్పరుడయ్యేవాడూ అయిన లక్ష్మణుడు కూడా కుశలంగానే ఉన్నాడు.

74

ఓ దేవీ! అమిత పరాక్రమవంతుడైన నీ భర్త రామునికి హితం చేకూర్చే కార్యార్థం, సుగ్రీవుని ఆదేశం మేరకు నేను మాత్రమే ఒంటరిగా ఇక్కడకు వచ్చాను.

75

ఇచ్ఛానుసారం రూపాలు ధరించగల నేను, నీ జాడ తెలుసుకోగోరి ఎవరి తోడ్పాటు లేకుండానే ఒంటరిగా సంచరిస్తూ ఈ దక్షిణ ప్రాంతానికి వచ్చాను.

76

నీ జాడ తెలియకపోవడంతో దుఃఖసాగరంలో పరితపిస్తున్న వానరసైన్యానికి, అదృష్టంకొద్దీ నీ దర్శనభాగ్యం కలిగిందనే సంతోషకరమైన వార్తను తెలిపి వారి శోకాన్ని తొలగిస్తాను.

77

అమ్మా! నా అదృష్టం బాగుండి నా సాగర లంఘనం వ్యర్థం కాలేదు. నా భాగ్యవశాన నిన్ను కనుగొని దర్శించిన కీర్తి నాకు దక్కనుంది.

78

రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వామభిపత్స్యతే,
సమిత్రబాన్ధవం హత్వా రావణం రాక్షసాధిపమ్.

79

మాల్యవాన్నామ వైదేహి గిరీణాముత్తమో గిరిః,
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః.

80

స చ దేవర్షిభిర్దిష్టః పితా మమ మహాకపిః,
తీర్థే నదీపతేః పుణ్యే శమ్భుసాదనముద్ధరత్.

81

తస్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి,
హనుమానితి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా.

82

విశ్వాసార్థం తు వైదేహి భర్తురుక్తా మయా గుణాః,
అచిరాద్రాఘవో దేవి త్వామితో నయితాఽనఘే.

83

వీరాధివీరుడైన రాముడు, రణరంగంలో రాక్షసరాజైన రావణుణ్ణి బంధుమిత్ర సపరివార సమేతంగా సంహరించి అతిత్వరలోనే నిన్ను చేరతాడు.

79.

ఓ విదేహ రాజకుమారీ! మాల్యవంతమనే పర్వతం పర్వతాలన్నింట్లోనూ శ్రేష్ఠమైనదిగా ఖ్యాతి గాంచింది. ఆ పర్వతరాజం నుండి కేసరి అనే వానరుడు గోకర్ణ పర్వతానికి వలస వెళ్ళాడు.

80

శంబసాదనుడనే రాక్షసుడు ఆ సముద్ర తీరంలో వెలసిన గోకర్ణ క్షేత్రంలో మితిమీరిన అగడాలు సృష్టిస్తున్నాడు. దేవతల, ఋషుల ఆదేశానుసారం ఆ కేసరి ఆ రాక్షసుణ్ణి సంహరించాడు. వానరవీరుడైన ఆ కేసరే నా తండ్రి.

81

ఓ సీతాదేవీ! ఆ వానరశ్రేష్ఠుడైన కేసరి భార్యయందు వాయుదేవుని అనుగ్రహం వలన నేను జన్మించాను. నా స్వీయ చేతల మూలంగా లోకంలో నాకు హనుమంతుడనే పేరు కలిగింది.

82

ఓ సీతాదేవీ! నా పట్ల నీకు పూర్తిగా నమ్మకం కలిగే నిమిత్తం నీ భర్త గుణగణాలను వర్ణించి చెప్పాను. అమ్మా! త్వరలోనే రాముడు వచ్చి నిన్ను ఇక్కడనుండి తీసుకుపోగలడు.

83

ఏవం విశ్వాసితా సీతా హేతుభిః శోకకర్శితా,
ఉపపన్నైరభిజ్ఞానైర్దూతం తమవగచ్ఛతి.

84

అతులం చ గతా హర్షం ప్రహర్షేణ చ జానకీ,
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమోచానందజం జలమ్.

85

చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్.

86

హనుమన్తం కపిం వ్యక్తం మన్యతే నాన్య థేతి సా,
అథోవాచ హనూమాంస్తామత్తరం ప్రియదర్శనామ్.

87

శోకంతో కృశించిపోయిన ఆ సీతాదేవి, రాముని శారీరక లక్షణాల గుణగణాల వర్ణన చేకూర్చిన సముచిత ఆధారాలను బట్టి హనుమంతుని రామదూతగా తెలుసుకొన్నది.

84

అంతే, సీతాదేవి వర్ణనాతీతమైన ఆనందం పొందింది. ఆ అపరిమిత సంతోషంలో తీర్చిదిద్దిన కనుబొమ్మలు గల ఆమె నేత్రాలనుండి ఆనందాశ్రువులు ధారకట్టాయి.

85

అంచుల వద్ద ఎరుపు ఛాయతో తెల్లనై విశాలములైన నేత్రాలుగల ఆ సీతాదేవి అమిత సుందరమైన ముఖారవిందం రాహువు విడిచిన చంద్రునిలా ప్రకాశించింది.

86

హనుమంతుడు కచ్చితంగా వానరుడేననీ, మరెవరో కాడనీ అప్పుడు సీత ఎలాంటి అనుమానమూ లేకుండా గ్రహించగలిగింది. తరువాత ప్రసన్నమైన చూపుతో ఆ కపీంద్రుణ్ణి చూసింది. అప్పుడు హనుమంతుడు మళ్ళీ ఇలా పలికాడు.

87

ఏతత్తే సర్వమాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి,
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియామ్యహమ్.

88

హతేఽసురే సంయతి శమ్బసాదనే
కపిప్రవీరేణ మహర్షిచోదనాత్,
తతోఽస్మి వాయుప్రభవో హి మైథిలి
ప్రభావతస్తత్ప్రతిమశ్చ వానరః.

89

ఓ సీతాదేవీ! ఉన్న విషయాలన్నీ నీకు సవిపరంగా తెలిపాను. ఇక నువ్వు ఊరటచెందు. ఇప్పుడు నేను ఏం చేస్తే నీకు ఇష్టమౌతుందో చెప్పు. నేను తిరిగి వెళ్ళవలసి ఉంది.

88

ఓ సీతాదేవీ! మహర్షుల ఆకాంక్ష మేరకు కపిశ్రేష్ఠుడైన కేసరి యుద్ధంలో రాక్షసుడైన శంబసాదనుని సంహరించాడు. మహర్షుల దీవెనలతో, వాయుదేవుని వరప్రసాదంగా ఆ కేసరి భార్యయందు నేను జన్మించాను. నేను వాయుదేవుడంతటి బలసంపదలు గలవాడిని.

89

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 35వ సర్గ సమాప్తం

36వ సర్గ

రామముద్రికను సీతకు సమర్పించడం

భూయ ఏన మహాతేజా హనూమాన్ పవనాత్మజః,
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్.

1

వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః,
రామనామాంకితం చేదం పశ్య దేవ్యఙ్గులీయకమ్.

2

పత్యర్థం తవానీతం తేన దత్తం మహాత్మనా,
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి.

3

మహాతేజశ్శాలీ, వాయునందనుడూ అయిన హనుమంతుడు, సీతాదేవికి తన పట్ల మరింత నమ్మకం కలగడానికై మళ్ళీ ఇలా పలికాడు.

1

మహాభాగ్యవతియైన ఓ దేవీ! నేను వానరుడను, ధీమంతుడైన రాముని దూతను. రామనామం చెక్కిన ఉంగరం తెచ్చాను, చూడు.

2

నా పట్ల నీకు నమ్మకం కలగడానికి మహాత్ముడైన రాముడు దీనిని నీకు ఇవ్వమని నాతో పంపించాడు. ఊరట చెందు. నీ దుఃఖాలన్నీ సమసిపోయే

సమయం ఆసన్నమయింది.

3

ఇత్యుక్త్వా ప్రదదౌ తస్యై సీతాయై వానరోత్తమః,
గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్,
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్.

4

చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్.

5

తతః సా హ్రీమతీ బాలా భర్తృసన్దేశహర్షితా,
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్.

6

విక్రాన్తస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ,
యేనేదం రాక్షసపదం త్వయైకేన ప్రధర్షితమ్.

7

వానరోత్తముడైన ఆ హనుమంతుడు అలా వచించి ఆ ఉంగరాన్ని సీతాదేవికి సమర్పించాడు. జానకీదేవి తన భర్త వేలికి అలంకారంగా విరాజిల్లిన ఆ ఉంగరాన్ని గ్రహించి దానిని సునిశితంగా పరికిస్తూ భర్తనే చేరుకొన్నట్లు ఆనందభరితురాలయింది.

4

కొనల వద్ద కించిత్తు ఎరుపుదనంతో తెల్లనై విశాలములైన నేత్రాలు గల ఆ సీతాదేవి సుందర ముఖారవిందం రాహువు విడిచిన చంద్రునిలా తక్కున ప్రకాశించింది.

5

భర్తను గురించిన క్షేమ సమాచారం వినడంతో నిర్మలహృదయయైన ఆ సీతాదేవి సంతోషంతో పరవశించింది. స్త్రీ సహజమైన సిగ్గు ముంచుకురాగా ప్రియమైన మాటలతో ఆ హనుమంతుని కొనియాడింది.

6

ఓ వానరోత్తమా! నిజంగానే నువ్వు పరాక్రమశాలివి, సర్వసమర్థుడవు, అన్నిటికీ మించి గొప్ప వివేకవంతుడవు. కాబట్టే దుర్భేద్యమైన ఈ లంకలో ఎవరి తోడ్పాటూ లేకుండా ఒంటరిగా ప్రవేశించగలిగావు.

7

శతయోజనవిస్తీర్ణః సాగరో మకరాలయః,
విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః.

8

న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ,
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః.

9

అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్,
యద్యసి ప్రేషితస్తేన రామేణ విదితాత్మనా.

10

ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యపరీక్షితమ్,
పరాక్రమమవిజ్ఞాయ మత్సకాశం విశేషతః.

11

దిష్ట్యా స కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః,
లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానన్దవర్ధనః.

12

నూరు యోజనాల విస్తీర్ణమైన, మొసళ్ళకు నివాసస్థానమైన ఈ సముద్రాన్ని శ్లాఘనీయమైన పరాక్రమంగల నువ్వు అవలీలగా ఆవు పాదం మోపినంత మేరను (గోష్పాదం) దాటినట్లు లంఘించావు.

8

ఓ వానరశ్రేష్ఠా! రాక్షసరాజైన రావణుడంటే భయంగాని, తొట్రుపాటుగాని, కంగారుగాని నీలో కనిపించడంలేదు. కాబట్టి నువ్వు సామాన్యుడవైన వానరుడవని నేను ఎంతమాత్రమూ భావించడంలేదు.

9

ఓ వానరోత్తమా! సర్వుల మనోభావాలూ, స్వభావమూ చక్కగా తెలిసిన రాముడు నిన్ను పంపించాడంటే, నేను మాట్లాడడానికి కచ్చితంగా యోగ్యుడవైన వ్యక్తివి నువ్వేనని తెలుస్తోంది.

10

అజేయ పరాక్రమవంతుడైన రాముడు తన దూతగా ఎవరినీ క్షుణ్ణంగా పరీక్షించకుండా, బలపరాక్రమాలు తెలుసుకోకుండా పంపించడు. అందులోనూ నా వద్దకు అసలే పంపించడు.

11

ధర్మాత్ముడూ, సత్యసంధుడూ అయిన రాముడు కుశలంగా ఉండడం నా అదృష్టమే. మహాతేజశ్శాలీ, సుమిత్రాదేవి సంతోషాన్ని పెంపొందించేవాడు అయిన లక్ష్మణుడు కూడా క్షేమంగా ఉన్నాడని తెలియడం మరింత ఆనందంగా ఉంది.

12

కుశలీ యది కాకుత్థ్సః కిం న సాగరమేఖలామ్,
మహీం దహతి కోపేన యుగాన్తాగ్నిరివోత్థితః.

13

అథవా శక్తిమన్తౌ తౌ సురాణామపి నిగ్రహే,
మమైవ తు న దుఃఖానామస్తి మన్యే విపర్యయః.

14

కచ్చిన్న వ్యథితో రామః కచ్చిన్న పరితప్యతే,
ఉత్తరాణి చ కార్యాణి కురుతే పురుషోత్తమః.

15

కచ్చిన్న దీనః సంభ్రాన్తః కార్యేషు చ న ముహ్యతి,
కచ్చిత్ పురుషకార్యాణి కురుతే నృపతేః సుతః.

16

ద్వివిధం త్రివిధోపాయముపాయమపి సేవతే,
విజిగీషుః సుహృత్కచ్చిన్మిత్రేషు చ పరంతపః.

17

రాముడు క్షేమంగా ఉండి ఉన్న పక్షంలో ప్రజ్వలిస్తున్న ప్రళయకాలాగ్నిలా చెలరేగి సముద్ర పర్యంతం వ్యాపించిన ఈ భూమిని తన కోపంతో దహించివేయకుండా ఎందుకు ఊరకుంటున్నాడు?

13

ఆ రామలక్ష్మణులు దేవతలను సైతం శిక్షించగల సమర్థులు. కాని నా దుఃఖాలకు అంతం లేనందుకే వాళ్ళు ఉపేక్షిస్తున్నారేమో!

14

రాముడు నా ఎడబాటు వల్ల వ్యధకు గురికావడం లేదు కదా? దుఃఖించడం లేదు కదా? ఆ పురుషోత్తముడు నన్ను తిరిగి పొందడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడా?

15

రాకుమారుడైన రాముడు నిరాశానిస్పృహలకు, భ్రాంతికి గురై అన్యమనస్కతకు లోనై పనుల్లో పొరపడడం లేదుకదా! ప్రయత్నశీలుడై సాధించవలసిన కార్యాలలో నిమగ్నుడై ఉన్నాడు కదా?

16

శత్రువులకు సింహస్వప్నమైన రాముడు మిత్రుల పట్ల ఆదరంతో సామదాన ఉపాయాలను, శత్రువుల విషయంలో జయ కాంక్షతో దాన భేద దండో పాయాలను పాటిస్తున్నాడా?

17

కచ్చిన్మిత్రాణి లభతే మిత్రైశ్చాప్యభిగమ్యతే,
కచ్చిత్కల్యాణమిత్రశ్చ మిత్రైశ్చాపి పురస్కృతః.

18

కచ్చిదాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః,
కచ్చిత్పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే.

19

కచ్చిన్న విగతస్నేహః ప్రవాసాన్మయి రాఘవః,
కచ్చిన్మాం వ్యసనాదస్మాన్మోక్షయిష్యతి వానర.

20

సుఖనాముచితో నిత్యమసుఖానామనౌచితః,
దుఃఖముత్తరమాసాద్య కచ్చిద్రామో న సీదతి.

21

కౌసల్యాయాస్తథా కచ్చిత్ సుమిత్రాయాస్తథైవ చ,
అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్ కుశలం భరతస్య చ.

22

రాముడు కొత్త మిత్రులను సంపాదించుకొంటున్నాడు గదా! ఆ మిత్రులు ఆతడి చెలిమిని అభిలషిస్తున్నారు కదా! అతడి మిత్రులంతా సజ్జనులే కదా! వారు అతణ్ణి గౌరవించే వారే కదా!

18

రాజకుమారుడైన రాముడు దైవానుగ్రహం కోసం దేవతలను ప్రార్థిస్తున్నాడు కదా! దైవానుగ్రహానికీ, పురుషప్రయత్నానికీ రాముడు సమానంగా ప్రాధాన్యం ఇచ్చి తదనుగుణంగా వ్యవహరిస్తున్నాడు కదా!

19

ఓ హనుమా! చిరకాల ఎడబాటు కారణంగా రామునికి నా పట్ల అనురాగం తగ్గిపోలేదు కదా? ఈ కష్టాల నుండి నాకు విముక్తి కలిగిస్తాడు కదా?

20

రాముడు ఎప్పుడూ సుఖాలనే పొందిన వాడు, పొందదగినవాడు; ఎన్నడూ కష్టం అనే మాటే ఎరుగడు. అట్టి రాముడు ఇప్పుడు ఆకస్మికంగా దాపురించిన దుఃఖానికి కుంగిపోవడం లేదు కదా?

21

కౌసల్యాదేవి, సుమిత్రాదేవి, భరతుడు కుశలంగా ఉన్నట్లు క్షేమ సమాచారాలు అప్పుడప్పుడు అందుతున్నాయని భావిస్తున్నాను.

22

మన్నిమిత్తేన మానార్హః కచ్చిచ్ఛోకేన రాఘవః,
కచ్చిన్నాన్యమనా రామః కచ్చిన్మాం తారయిష్యతి.

23

కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః,
ధ్వజినీం మన్త్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే.

24

వానరాధిపతిః శ్రీమాన్ సుగ్రీవః కచ్చిదేష్యతి,
మత్కృతే హరిభిర్వీరైర్వృతో దన్తనఖాయుధైః.

25

కచ్చిచ్చ లక్ష్మణః శూరః సుమిత్రానన్దవర్ధనః,
అస్త్రవిచ్చరజాలేన రాక్షసాన్విధమిష్యతి.

26

రౌద్రేణ కచ్చిదస్త్రేణ జ్వలతా నిహతం రణే,
ద్రక్ష్యామ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్.

27

గౌరవార్హుడైన రాముడు నా మూలంగా తటస్థించిన శోకంతో పరితపిస్తున్నాడా? ఈ దుఃఖసాగరం నుండి నన్ను ఉద్ధరించే కార్యాచరణలో నిమగ్నుడై ఉన్నాడనే ఆశిస్తున్నాను.

23

అన్నగారైన రాముని పట్ల అత్యంత అనురాగం గల భరతుడు, మంత్రుల పర్యవేక్షణలోని శత్రుభీకరమైన అక్షౌహిణి పరిమాణంగల సైన్యాన్ని నన్ను కాపాడే ప్రయత్నంలో బాసటగా పంపుతాడా?

24

శ్రీమంతుడూ, వానరాధిపతీ అయిన సుగ్రీవుడు దంతాలు, గోళ్ళు ఆయుధాలుగాగల వానరవీరులతో కలసి నన్ను రక్షించే కార్యభారంలో పాల్గొనడానికి ఇక్కడకు వస్తాడు గదా!

25

సుమిత్రాదేవికి ఆనందం చేకూర్చే వాడూ, శూరుడూ, గొప్ప అస్త్రవేత్తా

అయిన లక్ష్మణుడు అవిచ్ఛిన్న బాణప్రయోగంతో ఈ రాక్షసులను నేల కూలుస్తాడు గదా!

26

జరుగబోయే యుద్ధమందు రాముని ప్రజ్వలించే భయంకర అస్త్రశస్త్రాల ధాటికి బంధుమిత్ర పరివారసహితంగా ఆ రావణుడు నేలకూలడం అతిత్వరలోనే నేను చూడగలనా?

27

కచ్చిన్న తద్ధేమసమానవర్ణం
తస్యాననం పద్మసమానగన్ధి,
మయా వినా శుష్యతి శోకదీనం
జలక్షయే పద్మమివాతపేన.

28

ధర్మాపదేశాత్త్యజతశ్చ రాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతిమ్,
నాసీద్వ్యథా యస్య న భీర్న శోకః
కచ్చిత్స ధైర్యం హృదయే కరోతి.

29

న చాస్య మాతా న పితా చ నాన్యః
స్నేహాద్విశిష్టోఽస్తి మయా సమో వా,
తావత్త్వహం దూత జిజీవిషేయం
యావత్ప్రవృత్తిం శృణుయాం ప్రియస్య.

30

బంగారువన్నెగల, పద్మపరిమళభరితమై అలరారే ఆహ్లాదకరమైన రాముని ముఖారవిందం నా వియోగం వలన, నీరంతా ఎండిపోయినప్పుడు

ఎండ తీవ్రతచే కమలిన తామరలా శోకంతో దైన్యమంది వాడిపోలేదు గదా!

28

తండ్రి వాగ్దానాన్ని నెరవేర్చే ధర్మాన్ని పాటిస్తూ రాజ్యాన్ని త్యజించినప్పుడుగాని, కాలినడకన తనతోపాటు నన్ను అరణ్యాలకు తోడ్కొని వెళుతున్నప్పుడుగాని రాముడు బాధపడలేదు, భయపడలేదు, దుఃఖించలేదు. అటువంటి మహనీయుడైన రాముడిలో నా ఎడబాటు కారణంగా ఇప్పుడు ధైర్యం సన్నగిల్లలేదు గదా?

29

ఓ దూతవైన హనుమా! రాముని పట్ల నాకు గల ప్రేమానురాగాలు చెప్పతరం గానివి. ఈ విషయంలో మాన్యుడైన నా తండ్రి లేదా నా తల్లి లేదా మరెవ్వరూ రామునికి సాటిరారని నేను భావిస్తున్నాను. అటువంటి రాముని వృత్తాంతాన్ని వింటున్నంతసేపు మాత్రమే జీవించాలని అభిలషిస్తున్నాను.

30

ఇతీవ దేవీ వచనం మహార్థం
తం వానరేన్ద్రం మధురార్థముక్త్వా,
శ్రోతుం పునస్తస్య వచోఽభిరామం
రామార్థయుక్తం విరరామ రామా.

31

సీతాయా వచనం శ్రుత్వా మారుతిర్భీమవిక్రమః,
శిరస్యఞ్జలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్.

32

న త్వామిహస్థాం జానీతే రామః కమలలోచనే,
తేన త్వాం నానయత్యాశు శచీమివ పురన్దరః.

33

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్.

34

సీతాదేవి ఆ వానరశ్రేష్ఠుడైన హనుమంతునితో అర్థవంతమూ, మధురమూ అయిన మాటలు ఆ విధంగా పలికిన తరువాత రాముని గురించిన మనోహరమైన విషయాలను ఆతడి ముఖతా వినగోరి మౌనం వహించింది.

31

అపరిమిత పరాక్రమశాలియైన హనుమంతుడు, సీతాదేవి మృదుమధుర వచనాలు ఆలకించి, శిరస్సున చేతులు జోడించి వినమ్రుడై ఇలా మాట్లాడసాగాడు.

32

కమలముల వంటి కన్నులుగల ఓ సీతాదేవీ! నువ్వు ఇక్కడ లంకలో ఉన్న విషయం రాముడికి అసలు తెలియదు. కాబట్టే ఇంద్రుడు శచీదేవిని (అనుహ్లాదుని వద్ద నుండి) తీసుకునిపోయినట్లు నిన్ను రాముడు సత్వరమే తీసుకునిపోలేదు.

33

నువ్వు ఇక్కడ ఉన్నావనే సమాచారం నేను తెలుపగానే రాముడు వెంటనే వానర భల్లూక గణాలతో నిండిన గొప్ప సైన్యంతో బయలుదేరి ఇక్కడకు వస్తాడు.

34

విష్టమ్భయిత్వా బాణౌఘైరక్షోభ్యం వరుణాలయమ్,
కరిష్యతి పురీం లఙ్కాం కాకుత్థ్సః శాన్తరాక్షసమ్.

35

తత్ర యద్యన్తరా మృత్యుర్యది దేవాః సహాసురాః,
స్థాస్యన్తి పథి రామస్య స తానపి వధిష్యతి.

36

తవాదర్శనజేనార్యే శోకేన స పరిప్లుతః,
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః.

37

మలయేన చ విన్ధ్యేన మేరుణా మన్దరేణ చ,
దర్దురేణ చ తే దేవి శపే మూలఫలేన చ.

38

యథా సునయనం వల్గు బిమ్బోష్ఠం చారుకుండలమ్,
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచన్ద్రమివోదితమ్.

39

సముద్రంలోని నీటి మట్టాన్ని పెంచడమూ లేదా తగ్గించడమూ సాధ్యం కాకపోయినప్పటికీ, రాముడు తన శరపరంపరచే సముద్రాన్ని స్తంభింపజేసి, దానిని దాటి వచ్చి ఈ లంకానగరాన్ని రాక్షసరహితం చేస్తాడు.

35

ఆ సమయంలో రాముని మార్గంలో దేవాసురులలో ఎవరు అడ్డుతగిలినా, చివరికి మృత్యువే అడ్డుపడ్డా వాళ్ళను సైతం అతడు మట్టుబెట్టి ముందుకు పోతాడు.

36

ఓ పూజ్యురాలవైన సీతాదేవీ! నువ్వు కనబడకపోవడంతో కలిగిన దుఃఖంలో కొట్టుమిట్టాడుతున్న రాముడు, సింహం బారిన పడిన ఏనుగులా మానసికంగా క్షోభకు లోనయ్యాడు.

37

ఓ సీతాదేవీ! చక్కని ఆకర్షణీయమైన నేత్రాలతో, ఎర్రని మనోహరమైన పెదవులతో, రమ్యమైన కుండలాలు దాల్చి ఉదయించిన పూర్ణచంద్రునికి దీటై అలరారుతూ ఉన్న రాముని ముఖారవిందాన్ని నువ్వు త్వరలోనే తప్పక చూడగలవు. మలయ వింధ్య పర్వతాల మీదా, మేరు మందర పర్వతాల మీదా, మేము భుజించే కందమూలాల మీదా ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇది ముమ్మాటికీ నిజం.

38–39

క్షిప్రం ద్రక్ష్యపి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ,
శతక్రతుమివాసీనం నాగరాజస్య మూర్ధని.

40

న మాంసం రాఘవో భుఙ్క్తే న చాపి మధు సేవతే,
వన్యం సువిహితం నిత్యం భక్తమశ్నాతి పఞ్చమమ్.

41

నైవ దంశాన్న మశకాన్న కీటాన్న సరీసృపాన్,
రాఘవోఽపనయేద్గాత్రాత్ త్వద్గతేనాన్తరాత్మనా.

42

నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః,
నాన్యచ్చిన్తయతే కించిత్ సతు కామవశం గతః.

43

అనిద్రః సతతం రామః సుప్తోఽపి చ నరోత్తమః,
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే.

44

ఓ వైదేహీ! స్వర్గంలో ఐరావతం మీద ఆసీనుడై ఉన్న అమరేంద్రుని మల్లే ప్రస్రవణ పర్వతం మీద ఆసీనుడై విరాజిల్లుతున్న రాముణ్ణి అతిత్వరలోనే

నువ్వు చూస్తావు.

40

ఓ దేవీ! నీ వియోగ దుఃఖంతో రాముడు మాంసం తినడం లేదు, మధువు సేవించడం లేదు. ప్రతి రోజు శరీరధారణార్థం మాత్రమే సాయంకాలం వానప్రస్థులకు ఉచితమైన కందమూల ఫలాదులనే స్వీకరిస్తున్నాడు.

41

నీ ధ్యాసలోనే సదా మునిగి ఉన్న రాముడు శరీరం పట్ల ఏమాత్రం శ్రద్ధ వహించడంలేదు. శరీరం మీద అడవి ఈగలు, దోమలు వ్రాలినా వాటిని తోలడంలేదు; పురుగులు, పాములు శరీరం మీద ప్రాకుతున్నా కించిత్తు కూడా పట్టించుకోవడంలేదు.

42

రాముడు నీ పట్ల గల అత్యంత ప్రేమానురాగాల కారణం వలన సదా సర్వవేళలా విచారగ్రస్తుడై, నీ ధ్యాసలోనే ఉంటూ మరి దేనిని గురించీ ఆలోచించడం లేదు.

43

పురుషులలో శ్రేష్ఠుడైన రామునికి నిద్ర పూర్తిగా కరువయింది. ఎప్పుడైనా కాస్త కునుకు పట్టబోతున్నా 'సీతా! సీతా!' అంటూ కలవరిస్తూ వెంటనే ఉలికిపడి లేస్తున్నాడు.

44

దృష్ట్వా ఫలం వా పుష్పం వా యద్వాఽన్యత్సుమనోహరమ్,
బహుశో హా ప్రియేత్యేవం శ్వసంస్త్వామభిభాషతే.

45

స దేవి నిత్యం పరితప్యమాన

స్త్వామేవ సీతేత్యభిభాషమాణః,
ధృతవ్రతో రాజసుతో మహాత్మా
తవైవ లాభాయ కృతప్రయత్నః.

46

సా రామసంకీర్తనవీతశోకా
రామస్య శోకేన సమానశోకా,
శరన్ముఖే సాంబుదశేషచన్ద్రా
నిశేవ వైదేహసుతా బభూవ.

47

మంచి పండుగాని, అందమైన పువ్వుగాని, మరేదైనా మనోహరమైన వస్తువుగాని చూస్తే 'హా ప్రియే!' అంటూ నిన్నే తలచుకొని నిట్టూర్పులు విడుస్తుంటాడు.

45

ఓ దేవీ! వానప్రస్థ నియమాలను తు.చ. తప్పక పాటిస్తున్న వాడూ, మహాత్ముడూ, రాజకుమారుడూ అయిన ఆ రాముడు సదా సర్వవేళలా 'సీతా!' అంటూ నిన్నే తలచుకొంటూ, పరితపిస్తూ నిన్ను తిరిగి పొందేటందుకే శతథా ప్రయత్నిస్తున్నాడు.

46

ఎడబాటు కారణంగా రాముడు ఎంత శోకమగ్నుడై ఉన్నాడో సీతాదేవి కూడా అంతే శోకం అనుభవిస్తున్నది. కాని ఇప్పుడు రాముని గుణ కీర్తన వినడంతో ఆమె దుఃఖం కొంత ఉపశమించింది. కాని రాముడు దుఃఖార్తుడై ఉన్నాడని తెలియగానే ఆమెలో కూడా దుఃఖం గూడుకట్టుకుంది. ఈ రీతిలో సంతోష దుఃఖాల మధ్య ఆమె ముఖారవిందం, శరత్కాల ప్రారంభాన రాత్రి ఆకాశంలో పలుచని మేఘాల మధ్య ప్రకాశించీ ప్రకాశించని చంద్రుని మల్లే

ప్రకాశించింది.

47

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 36వ సర్గ
సమాప్తం

37వ సర్గ

హనుమంతుని బృహద్రూప ప్రదర్శన

సా సీతా వచనం శ్రుత్వా పూర్ణచన్ద్రనిభాననా,
హనూమన్తమువాచేదం ధర్మార్థసహితం వచః.

1

అమృతం విషసంసృష్టం త్వయా వానర భాషితమ్,
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః.

2

ఐశ్వర్యే వా సువీస్తీర్ణే వ్యసనే వా సుదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి.

3

పున్నమి చంద్రుని పోలిన వదనం గల ఆ సీతాదేవి, హనుమంతుని పలుకులు విని ధర్మయుక్తంగా ఇలా వచించింది.

1

ఓ వానరశ్రేష్ఠా! నువ్వు చెప్పిన మాటలు విషం కలిపిన అమృతంలా ఉన్నాయి. రాముడు సదాసర్వవేళలా నా ధ్యాసలోనే ఉన్నాడన్న నీ మాట నాకు అమృతంలా ఉంది. ఆయన శోకమగ్నుడై ఉన్నాడని నువ్వు చెప్పిన మాట నాకు విషతుల్యంగా ఉంది.

2

దైవం అపరిమిత ఐశ్వర్యంలోకి గాని లేదా దారుణమైన దుఃఖ పరంపరంలోకిగాని మనిషిని తాడు కట్టి లాక్కుపోతున్నట్లు ఈడ్చుకుపోతుంది. విధి

ఎంత బలీయమో కదా!

3

విధిర్నూనమసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ,
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య మోహితాన్.

4

శోకస్యాస్య కదా పారం రాఘవోఽధిగమిష్యతి,
ప్లవమానః పరిశ్రాంతో హతనౌస్సాగరే యథా.

5

రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్,
లఙ్కామున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః.

6

స వాచ్యః సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే,
అయం సంవత్సరః కాలస్తావద్ధి మమ జీవితమ్.

7

వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ,
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ.

8

వానరోత్తముడవైన ఓ హనుమా! మనిషికి విధిని ఉల్లంఘించడం సాధ్యం కాదనడం నిశ్చయం. రాముడు, లక్ష్మణుడు, నేను అష్టకష్టాలూపడుతూ దుఃఖీస్తుండడమే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

4

సముద్ర మధ్యంలో నౌకాభంగం సంభవించినప్పుడు తీరాన్ని చేరుకోవాలని ఈది ఈది అలసిపోయిన వ్యక్తిలా ఉన్న రాముడు ఈ దుఃఖసాగర అంతాన్ని ఎప్పుడు చేరతాడో?

5

నా భర్తయైన రాముడు రాక్షసులను సంహరించి, రావణుని వధించి, ఈ లంకానగరాన్ని రూపుమాపి నన్ను ఎప్పుడు చేరతాడో కదా?

6

రావణుడు గడువుపెట్టిన సంవత్సర కాలం ముగియకముందే నన్ను కాపాడడానికి త్వరపడమని ఓ హనుమా, రామునికి విన్నవించు. ఎందుకంటే నేను అప్పటి వరకు మాత్రమే జీవించి ఉంటాను.

7

ఓ వానరోత్తమా! దురాత్ముడైన రావణుడు పెట్టిన గడువు వ్యవధిలో ఇప్పుడు పదవ మాసం గడుస్తోంది. ఇక కేవలం రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్నాయి.

8

విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి,
అనునీతః ప్రయత్నేన న చ తత్కురుతే మతిమ్.

9

మమ ప్రతిప్రదానం హి రావణస్య న రోచతే,
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశం గతమ్.

10

జ్యేష్ఠా కన్యాఽనలా నామ విభీషణసుతా కపే,
తయా మమేదమాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్.

11

అశంసేయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః,
అన్తరాత్మా చ మే శుద్ధస్తస్మింశ్చ బహవో గుణాః.

12

ఉత్సాహః పౌరుషం సత్త్వమానృశంస్యం కృతజ్ఞతా,
విక్రమశ్చ ప్రభావశ్చ సన్తి వానర రాఘవే.

13

నన్ను తిరిగి రామునికి అప్పగించమని తమ్ముడైన విభీషణుడు శతవిధాల బ్రతిమాలి ఉపదేశించినప్పటికీ రావణుడు తమ్ముని హితోపదేశాన్ని ఏమాత్రం లక్షించడంలేదు.

9

నన్ను తిరిగి రామునికి అప్పగించడం రావణుడికి ససేమిరా ఇష్టం లేదు. అతడికి కాలం మూడింది. రణరంగంలో అతణ్ణి కబళించడానికి మృత్యువు నిరీక్షిస్తోంది.

10

ఓ వానరోత్తమా! విభీషణుని పెద్ద కుమార్తె పేరు అనల. తల్లి పంపించగా ఆ అనల వచ్చి స్వయంగా ఈ విషయాలన్నీ నాకు చెప్పింది.

11

ఓ కపివరా! నా అంతరాత్మ పవిత్రమైనది, రామునిలో ఉన్నవన్నీ సద్గుణాలే! అందుచేత అతిత్వరలోనే రాముడు నన్ను చేరుకుంటాడనే అచంచల నమ్మకం నాకు ఉంది.

12

ఓ హనుమా! రామునిలో చొరవ, ధైర్యసాహసాలు, బలం, కరుణ, కృతజ్ఞత, పరాక్రమం, సౌజన్యం అనే సుగుణాలు కలగలసి ఉన్నాయి.

13

చతుర్దశసహస్రాణి రాక్షసానాం జఘాన యః,
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః కస్తస్య నోద్విజేత్.

14

న స శక్త్యస్తులయితుం వ్యసనైః పురుషర్షభః,
అహం తస్య ప్రభావజ్ఞా శక్రస్యేవ పులోమజా.

15

శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః,

శత్రురక్షోమయం తోయముపశోషం నయిష్యతి.

16

ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్,
అశ్రుసంపూర్ణనయనామువాచ వచనం కపిః.

17

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్.

18

సోదరుడైన లక్ష్మణుని సహాయం లేకుండానే జనస్థానంలో పద్నాలుగు వేల మంది రాక్షసులను ఒంటరిగా ఎదుర్కొని సంహరించిన రాముని చూసి ఏ శత్రువుకు నిలువెల్లా దడపుట్టకుండా ఉంటుంది?

14

పురుషోత్తముడైన ఆ రాముడు ఎన్ని కష్టాలు, దుఃఖాలు వాటిల్లినా కించిత్తు కూడా చలించడు. శచీదేవికి దేవేంద్రుని శక్తి ఏపాటిదో తెలిసినట్లు నాకు రాముని ప్రభావం గూర్చి బాగా తెలుసు.

15

ఓ హనుమా! శరపరంపరలనే కిరణాలను సంతరించుకొన్న శూరుడైన రాముడనే సూర్యుడు, శత్రువులైన రాక్షస సమూహాలనే జలరాశిని ఎండింప జేస్తాడు.

16

రాముని ఎడబాటుతో బాగా దిగులుపడి కృశించి, ధారగా కన్నీరు కారుస్తూ ఈ విధంగా పలికిన సీతాదేవితో కపివరుడైన హనుమంతుడు ఇలా అన్నాడు.

17

అమ్మా! నువ్వు ఇక్కడ ఉన్నావనే వార్తను నేను తెలియజేయగానే రాముడు వెంటనే వానర భల్లూక గణాలతో కూడిన గొప్ప సైన్యంతో బయలుదేరి ఇక్కడకు

వస్తాడు.

18

అథవా మోచయిష్యామి త్వామద్యైవ వరాననే,
అస్మాద్దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిన్దితే.

19

త్వాం హి పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్,
శక్తిరస్తి హి మే వోఢుం లఙ్కామపి సరావణామ్.

20

అహం ప్రస్రవణస్థాయ రాఘవాయాద్య మైథిలి,
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుతమివానలః.

21

ద్రక్ష్యస్యద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్,
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా.

22

త్వద్దర్శనకృతోత్సాహమాశ్రమస్థం మహాబలమ్,
పురందరమివాసీనం నాగరాజస్య మూర్ధని.

23

సుందర ముఖారవిందమా, పూజ్యురాలమా అయిన ఓ సీతాదేవీ! అంతవరకు ఎందుకు? ఇప్పుడే ఈ దుఃఖం నుండి నిన్ను విముక్తను చేయగలను. నా వీపును అధిరోహించు. వెంటనే నిన్ను రాముని వద్దకు చేర్చగలను.

19

తల్లీ! నిన్ను నా వీపు మీద కూర్చోపెట్టుకుని సముద్రాన్ని అలవోకగా దాటగలను. రావణునితో సహా ఈ లంకానగరాన్ని పెకలించి మోసుకుపోగల శక్తి నాకు ఉంది.

20

అగ్నిదేవుడు హోమం చేసిన హోమద్రవ్యాన్ని ఇంద్రునికి అందచేసినట్లు, నేను ప్రస్రవణ పర్వతం మీద బసచేసి ఉన్న రాముని వద్దకు ఓ సీతాదేవీ! నిన్ను ఇప్పుడే చేర్చగలను.

21

దైత్య సంహారానికి సంసిద్ధుడైన విష్ణువులా, లక్ష్మణ సమేతుడై రాక్షస సంహారానికి సన్నద్ధుడై ఉన్న రాముని, ఓ సీతాదేవీ! నువ్వు ఇప్పుడే చూడగలవు.

22

ఐరావతాన్ని అధిరోహించి ఉన్న ఇంద్రుని మల్లే, నిన్ను చూడాలనే సమధికోత్సాహంతో మహా పరాక్రమవంతుడైన రాముడు ప్రస్రవణ పర్వతాశ్రమంలో ఆసీనుడై ఉన్నాడు. అటువంటి రాముణ్ణి, ఓ దేవీ! నువ్వు ఇప్పుడే చూడగలవు.

23

పృష్ఠమారోహ మే దేవి మా వికాంక్షస్య శోభనే,
యోగమన్విచ్ఛ రామేణ శశాఙ్కేనేవ రోహిణీ.

24

కథయన్తీవ చన్ద్రేణ సూర్యేణ చ మహార్చిషా,
మత్పృష్ఠమధిరుహ్య త్వం తరాకాశమహార్ణవౌ.

25

న హి మే సంప్రయాతస్య త్వామితో నయతోఽఙ్గనే,
అనుగన్తుం గతిం శక్తాః సర్వే లఙ్కానివాసినః.

26

యథైవాహమిహ ప్రాప్తస్తథైవాహమసంశయః,
యాస్యామి పశ్య వైదేహి త్వాముద్యమ్య విహాయసమ్.

27

మైథిలీ తు హరిశ్రేష్ఠాచ్ఛ్రుత్వా వచనమద్భుతమ్,
హర్షవిస్మితసర్వాఙ్గీ హనుమన్తమథాబ్రవీత్.

28

మంగళదాయినివైన ఓ దేవీ! నా వీపు మీద ఆసీనవవు. సంకోచించకు. రోహిణి చంద్రుని చేరినట్లు రాముని చేరడానికి కృతనిశ్చయురాలవుగా.

24

నా వీపు మీద ఆసీనవై చంద్రుని, తేజోవిరాజమానుడైన సూర్యుని పలకరిస్తూన్న చందాన ఆకాశమార్గంలో పయనిస్తూ ఓ దేవీ! మహాసముద్రాన్ని దాటు.

25

ఓ సీతాదేవీ! ఆకాశమార్గంలో నిన్ను తోడ్కొని వెళుతున్నప్పుడు నన్ను అనుసరించిరాగల వేగగతి ఈ లంకలో ముమ్మాటికీ ఎవరికీ లేదు.

26

ఓ విదేహరాజపుత్రీ! నే నెలా ఇక్కడకు అవలీలగా రాగలిగానో అదే విధంగా సునాయాసంగా నిన్ను కూడా తోడ్కొని పోగలను. నువ్వే చూడగలవు. ఇందులో ఎటువంటి సంశయానికీ తావులేదు.

27

కపివరుడైన ఆ హనుమంతుని ఆశ్చర్యం గొలిపే మాటలను విని, ఆనందాశ్చర్యాలతో పులకాంకితురాలైన ఆ సీతాదేవి ఇలా వచించింది.

28

హనుమన్ దూరమధ్వానం కథం మాం వోఢుమిచ్ఛసి,
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప.

29

కథం వాల్పశరీరస్త్వం మామితో నేతుమిచ్ఛసి,
సకాశం మానవేంద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ.

30

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,

చిన్తయామాస లక్ష్మీవాన్ నవం పరిభవం కృతమ్.

31

న మే జానాతి సత్త్వం వా ప్రభావం వాసితేక్షణా,
తస్మాత్ పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః.

32

ఇతి సంచిన్త్య హనుమాంస్తదా ప్లవగసత్తమః,
దర్శయామాస వైదేహ్యాః స్వరూపమరిమర్దనః.

33

ఓ హనుమా! అంత దూరం, పైగా ఆకాశమార్గంలో నన్ను మోసికొని వెళ్ళగోరుతున్నావు. ఓ వానర సేనానీ! ఈ నీ ఆలోచనే నీ వానర లక్షణాన్ని చెప్పక చెబుతోంది.

29

వానరశ్రేష్ఠుడవైన ఓ హనుమా! ఇంత చిన్న శరీర ప్రమాణం గల నువ్వు ఇక్కడనుండి నన్ను పురుషశ్రేష్ఠుడైన నా భర్త రాముని వద్దకు మోసుకు పోతానంటున్నావు. అదెలా సాధ్యం?

30

తనను తక్కువ అంచనాగట్టి మాట్లాడిన సీతాదేవి పలుకులు విన్న వాయుపుత్రుడూ, అపరిమిత బలసంపన్నుడూ అయిన ఆ హనుమంతుడు తనకు ఇదొక కొత్త పరాభవంగా భావించాడు.

31

నల్లని కన్నులు గల సీతాదేవికి సహజసిద్ధమైన నా బలప్రభావాలు బొత్తిగా తెలియవు. కనుక ఇచ్ఛమేరకు రూపం మార్చుకోగల నేను సందర్భానుసారంగా నా బృహద్రూపాన్ని ఈమె ముందు ప్రదర్శిస్తాను.

32

వానరోత్తముడూ, అంతశ్శత్రువులైన అరిషడ్వర్గాలను (కామ, క్రోధ, లోభ,

మోహ, మద, మాత్సర్యాదులు) జయించిన వాడూ అయిన హనుమంతుడు ఆ విధంగా సంకల్పించి మహోన్నత ప్రమాణం గల తన స్వరూపాన్ని సీతాదేవికి చూపించాడు.

33

స తస్మాత్ పాదపాద్ధీమానాప్లుత్య ప్లవగర్షభః,
తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్.

34

మేరుమన్దరసంకాశో బభౌ దీప్తానలప్రభః,
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః.

35

హరిః పర్వతసంకాశస్తామ్రవక్త్రో మహాబలః,
వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీమిదమబ్రవీత్.

36

సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్,
లఙ్కామిమాం సనాథాం వా నయితుం శక్తిరస్తి మే.

37

తదవస్థాప్యతాం బుద్ధిరలం దేవి వికాంక్షయా,
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్.

38

ధీశాలీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు వృక్షమూలం నుండి కాస్త దూరం జరిగి సీతాదేవికి నమ్మకం కలిగించడానికై తన శరీర పరిమాణాన్ని అంచెలంచెలుగా పెంచనారంభించాడు.

34

అప్పుడు ఆ హనుమంతుడు మేరు మందర పర్వతాలంత ప్రమాణానికి తన శరీరాన్ని పెంచి, ప్రజ్వలిస్తున్న అగ్నిలాంటి తేజస్సుతో ప్రకాశిస్తూ సీతాదేవి ముందు

నిలబడ్డాడు.

35

ఎర్రని ముఖంతోనూ, వజ్రాయుధం వంటి కోరలు, గోళ్ళతోనూ భీతిగొల్పుతూ పర్వతంలా సమున్నతుడైన, మహాబలాఢ్యుడైన ఆ హనుమంతుడు అప్పుడు సీతాదేవితో ఇలా అన్నాడు.

36

ఓ దేవీ! పర్వతాలతోనూ, వనప్రాంతాలతోనూ, కోటబురుజులతోనూ, ప్రాకారాలతోనూ, సింహద్వారాలతోనూ విరాజిల్లుతున్న ఈ లంకానగరాన్ని రావణునితో సహా పెకలించి తీసుకొనిపోగల శక్తి నాకు ఉంది.

37

అందువలన ఓ దేవీ! నా సామర్థ్యం పట్ల గల సంశయాన్ని వీడి మనస్సును కుదుటపరచుకో. నాతోపాటు వచ్చి రామలక్ష్మణుల శోకాన్ని తొలగించు.

38

తం దృష్ట్వాఽచలసంకాశమువాచ జనకాత్మజా,
పద్మపత్రవిశాలాక్షీ మారుతస్యౌరసం సుతమ్.

39

తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే,
వాయోరివ గతిం చైవ తేజశ్చాగ్నేరివాద్భుతమ్.

40

ప్రాకృతోఽన్యః కథం చేమాం భూమిమాగన్తుమర్హతి,
ఉదధేరప్రమేయస్య పారం వానరపుఙ్గవ.

41

జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ,
అవశ్యం సంప్రధార్యాఽఽశు కార్యసిద్ధిర్మహాత్మనః.

42

అయుక్తం తు కపిశ్రేష్ఠ మమ గన్తుం త్వయాఽనఘ,
వాయువేగసవేగస్య వేగో మాం మోహయేత్తవ.

43

అప్పుడు తామర రేకులలా విశాలములైన కన్నులు గల ఆ సీతాదేవి పర్వత ఆకృతిలో ఉన్న వాయునందనుడైన ఆ హనుమంతుని చూసి ఇలా అంది.

39

ఓ వానరశ్రేష్ఠా! స్వతస్సిద్ధమైన నీ ధైర్యాన్ని, బలాన్ని, ఎవరూ అడ్డుకోలేని వాయువేగ గమనాన్ని, అగ్నితో సమానమైన అద్భుత తేజస్సును ఇప్పుడు ప్రత్యక్షంగా నేను తెలుసుకొన్నాను.

40

ఓ వానరోత్తమా! ఊహకు కూడా అందని ఈ మహాసముద్రాన్ని లంఘించి సామాన్యుడు ఎవరైనా ఈ ప్రదేశానికి రాగలడా?

41

నువ్వు నన్ను అలవోకగా తోడ్కొని వెళ్ళగలవనే విషయంలో ఇప్పుడు నాకు ఎటువంటి సంశయమూ లేదు. అయినప్పటికీ మహాత్ముడైన రాముని కార్యం సానుకూలమయ్యేటట్లు మనం యోచించి నిర్ణయించాలి.

42

దోషరహితుడవైన ఓ కపివరా! నేను నీతో పయనించడం యుక్తమైన పనిగా తోచడంలేదు. నీ వాయువేగ గమనాన్ని తట్టుకోలేక నేను స్పృహ కోల్పోవచ్చు.

43

అహమాకాశమాపన్నా హ్యుపర్యుపరి సాగరమ్,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయాద్వేగేన గచ్ఛతః.

44

పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే,
భవేయమాశు వివశా యాదసామన్నముత్తమమ్.

45

న చ శక్ష్యే త్వయా సార్ధం గన్తుం శత్రువినాశన,
కళత్రవతి సన్దేహస్త్వయ్యపి స్యాదసంశయః.

46

హ్రియమాణాం తు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః,
అనుగచ్ఛేయురాదిష్టా రావణేన దురాత్మనా.

47

తైస్త్వం పరివృతః శూరైః శూలముద్గరపాణిభిః,
భవేస్త్వం సంశయం ప్రాప్తో మయా వీర కళత్రవాన్.

48

నువ్వు సముద్రం మీదుగా ఎంతో ఎత్తులో ఆకాశ మార్గాన వాయువేగంతో పోతున్నప్పుడు, నీ వీపు మీద ఉన్న నేను భయపడి క్రింద పడిపోతానేమో!

44

ఇలా నేను తిమింగలాలతో, మొసళ్ళతో, పెద్ద చేపలతో నిండి ఉన్న సముద్రంలో పడిపోతే, ఆ జలచరాలు వెంటనే నన్ను పట్టి భక్షించడం తథ్యం.

45

శత్రువినాశకుడవైన ఓ కపివర్యా! మరో కారణంగా కూడా నేను నీతో రావడం మంచిది కాదు. నన్ను కాపాడే ప్రయత్నంలో స్వయంగా నీకే ముప్పు వాటిల్లే ఆస్కారం లేకపోలేదుగదా!

46

చెరనుండి నీ సాయంతో తప్పించుకుపోతున్న నన్ను చూసి దురాత్ముడైన రావణుని ఆదేశం మేరకు భయంకరులైన రాక్షస వీరులు మనలను తప్పక వెంబడిస్తారు.

47

శూలములను, ముద్గరములను (ఇనుపగుదియలు) చేత ధరించినట్టి ఆ

రాక్షసయోధులు, ఓ వీరుడా! నిన్ను చుట్టుముట్టుతారు. ఆ సమయంలో ఆత్మరక్షణే నీకు కష్టమవుతుంది. నన్ను రక్షించవలసిన కర్తవ్య భారం కారణంగా నీ పరిస్థితి ప్రమాదంలో పడుతుంది.

48

సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసాస్త్వం నిరాయుధః,
కథం శక్ష్యసి సంయాతుం మాం చైవ పరిరక్షితుమ్.

49

యుధ్యమానస్య రక్షోభిస్తవ తైః క్రూరకర్మభిః,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయార్తా కపిసత్తమ.

50

అథ రక్షాంసి భీమాని మహాన్తి బలవన్తి చ,
కథం చిత్సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ.

51

అథవా యుధ్యమానస్య పతేయం విముఖస్య తే,
పతితాం చ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః.

52

మాం వా హరేయుస్త్వద్ధస్తాద్విశసేయురథాపి వా,
అవ్యవస్థా హి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ.

53

చూడబోతే రాక్షసులేమో అనేకులు, పైగా వారంతా ఆయుధధారులు. కాని నువ్వేమో ఒంటరివి, నిరాయుధుడవు. అటువంటి సందర్భంలో ఆకాశంలో వారితో యుద్ధం చేస్తూ అదే సమయంలో నన్ను కాపాడడం నీకెలా సాధ్యమౌతుంది?

49

ఓ వానరోత్తమా! దుష్కృత్యాలు చేసే ఆ రాక్షసులతో నువ్వు యుద్ధం చేస్తున్న సమయంలో నేను భయకంపితురాలనై నీ వీపు మీద నుండి జారి క్రింద

పడిపోవచ్చు గదా!

50

ఓ కపివర్యా! అధికసంఖ్యాకులు, స్థూలకాయులు, బలాఢ్యులు అయిన రాక్షసులు చుట్టుముట్టి ఏదో విధంగా నిన్ను జయించవచ్చు గదా!

51

ఒకవేళ నువ్వు యుద్ధంలో నిమగ్నుడవై నా విషయంలో కించిత్తు అలసత్వం వహించిన సమయంలో నేను క్రింద పడిపోవచ్చు. అప్పుడు దురాత్ములైన ఆ రాక్షసులు నన్ను అపహరించుకుపోవచ్చు.

52

లేదా యుద్ధంలో ఎవరు గెలుస్తారో ఎవరు ఓడిపోతారో చెప్పలేంగదా! ఒకవేళ నువ్వు పరాజితుడవైతే ఆ రాక్షసులు నీ వద్దనుండి నన్ను లాక్కొని పోవచ్చు లేదా చంపినా చంపవచ్చుకూడా.

53

అహం వాపి విపద్యేయం రక్షోభిరభితర్జితా,
త్వత్ప్రయత్నో హరిశ్రేష్ఠ భవేన్నిష్ఫల ఏవ తు.

54

కామం త్వమసి పర్యాప్తో నిహన్తుం సర్వరాక్షసాన్,
రాఘవస్య యశో హీయేత్త్వయా శస్తైస్తు రాక్షసైఃం.

55

అథవాఽఽదాయ రక్షాంసి న్యసేయుఃం సంవృతే హి మామ్,
యత్ర తే నాభిజానీయుర్హరయో నాపి రాఘవౌ.

56

ఆరమ్భస్తు మదర్థోఽయం తతస్తవ నిరర్థకఃం,
త్వయా హి సహ రామస్య మహానాగమనే గుణఃం.

57

మయి జీవితమాయత్తం రాఘవస్య మహాత్మనః,
భ్రాతౄణాం చ మహాబాహో తవ రాజకులస్య చ.

58

రాక్షసులచే అవమానానికి గురై ఒకవేళ నేనే ప్రాణత్యాగానికి పాల్పడతానేమో! అదే సంభవిస్తే ఓ వానరోత్తమా! నీ కృషి, ప్రయత్నాలు అన్నీ వ్యర్థమైపోతాయి గదా!

54

ఈ సమస్త రాక్షసులనూ సంహరించగల సామర్థ్యం నీకు ఉందనడం సత్యదూరం కాదు. నువ్వు అలా చేస్తే ఆ కార్యాన్ని సాధించాల్సిన రాముని కీర్తికి భంగం కలుగుతుంది.

55

లేదా ఆ రాక్షసులు ఏదోవిధంగా నన్ను పట్టుకుని వానరులుగాని, రామలక్ష్మణులుగాని తెలుసుకోలేని రహస్య ప్రదేశంలో మళ్ళీ దాచి ఉంచవచ్చునేమో!

56

ఇలా జరిగితే నీ ప్రయత్నాలన్నీ వృథా అవుతాయిగదా! కాబట్టి రాముడు నీతో కలసి వచ్చి నన్ను విడిపించడమే సరైన పద్ధతి.

57

మహావీరుడవైన ఓ హనుమా! మహాత్ముడైన రాముడు, ఆయన సోదరులు, నువ్వు, నీ రాజైన సుగ్రీవుడు, తదితరులందరికీ నా సమస్య జీవన్మరణ సమస్యగా పరిణమించింది.

58

తౌ నిరాశౌ మదర్థం తు శోకసంతాపకర్శితౌ,
సహ సర్వర్షహరిభిస్త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్.

59

భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర,
నాహం స్పృష్టుం స్వతో గాత్రమిచ్ఛేయం వానరోత్తమ.

60

యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా,
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ.

61

యది రామో దశగ్రీవమిహ హత్వా సబాన్ధవమ్,
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సిదృశం భవేత్.

62

నన్ను వెతికి కనుగొనడమనే కార్యసాధనలో సఫలీకృతులు కాకపోతే రామలక్ష్మణులు నిరాశనిస్పృహలకు గురై తీరని శోకసంతాపాలతో క్రుంగి కృశించి సమస్త భల్లూక వానర సమూహాలతో సహా ప్రాణాలు విడుస్తారు.

59

ఓ వానరపుంగవా! నా భర్త పట్ల నాకున్న భక్తిప్రపత్తులను పురస్కరించుకొని, పాతివ్రత్య ధర్మాన్ని అనుసరించి రాముని తప్ప పరాయి పురుషుని శరీరాన్ని కంఠంలో ప్రాణం ఉండగా నా అంతట నేను తాకను.

60

అయితే రావణుని స్పర్శ కాలేదా అంటావేమో? ఆ సమయంలో దిక్కూ మొక్కూ లేని దాననై, రక్షించే వారెవరూ లేక, రక్షించుకొనే స్వీయశక్తి లేక, పరాధీనయై ఉన్న నేను ఏం చేయగలను?

61

రాముడు ఇక్కడకు వచ్చి నన్ను అపహరించి తెచ్చిన రావణుణ్ణి బంధుమిత్ర సపరివార సమేతంగా వధించి నన్ను తీసుకు వెళ్ళడమే ఆ మహావీరుని ప్రతిష్ఠకు సముచితంగా ఉంటుంది.

62

శ్రుతా హి దృష్టాశ్చ మయా పరాక్రమా
మహాత్మనస్తస్య రణావమర్దినః,
న దేవగన్ధర్వభుజంగరాక్షసా
భవన్తి రామేణ సమా హి సంయుగే.

63

సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకమ్,
మహాబలం వాసవతుల్యవిక్రమమ్,
సలక్ష్మణం కో విషహేత రాఘవం
హుతాశనం దీప్తమివానిలేరితమ్.

64

సలక్ష్మణం రాఘవమాజిమర్దనం
దిశాగజం మత్తమివ వ్యవస్థితమ్,
సహేత కో వానరముఖ్య సంయుగే
యుగాన్తసూర్యప్రతిమం శరార్చిషమ్.

65

రణరంగంలో శత్రువులను రూపుమాపే మహాత్ముడైన ఆ రాముని శౌర్యపరాక్రమాలను గురించి వినడమే కాక ప్రత్యక్షంగా కూడా నేను చూశాను. దేవతలలోగాని, గంధర్వులలోగాని, నాగులలోగాని, రాక్షసులలోగాని రామునికి సాటి వచ్చేవారెవరూ లేరు.

63

అద్భుతమైన ధనుస్సు ధరించిన, బలంలో పరాక్రమంలో దేవేంద్రునికి సాటియైన రాముడు, లక్ష్మణ సమేతుడై వాయువుతోడై ప్రజ్వలిస్తున్న అగ్నిలా యుద్ధరంగంలో నిలబడితే, ఎవరైనా ఆయన ముందుకు రాగలరా?

64

ఓ వానరోత్తమా! రణరంగంలో శత్రుసమూహాలను నుగ్గునుగ్గు గావించే లక్ష్మణసహితుడైన రాముడు శరపరంపరలనే కిరణాలతో ప్రళయకాల సూర్యునిలా

తేజరిల్లుతూ, మదించిన దిగ్గజంలా (ఏనుగు) నిలబడి ఉంటే ఆ మహావీరుని యుద్ధరంగంలో ఏ యోధుడు ఎదుర్కొనగలడు?

65

స మే హరిశ్రేష్ఠ సలక్ష్మణం పతిం
సయూథపం క్షిప్రమిహోపపాదయ,
చిరాయ రామం ప్రతి శోకకర్శితాం
కురుష్వ మాం వానరముఖ్య హర్షితామ్.

66

కాబట్టి ఓ వానరోత్తమా! వానరసేనాసమూహాలతోపాటు లక్ష్మణ సమేతుడైన రాముని వెంటనే ఇక్కడకు తీసుకువచ్చే యత్నానికి శ్రీకారంచుట్టు. రాముని ఎడబాటు శోకంతో కృశించిపోయి ఉన్న నా దుఃఖం ఈ ఒక్క కార్యం వల్లనే ఉపశమిస్తుంది.

66

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 37వ సర్గ సమాప్తం

38వ సర్గ

చూడామణి ప్రదానం

తతః స కపిశార్దూలస్తేన వాక్యేన హర్షితః,
సీతామువాచ తచ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః.

1

యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే,
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ.

2

స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుమ్,
మామధిష్థాయ విస్తీర్ణం శతయోజనమాయతమ్.

3

ధర్మయుక్తంగా సీతాదేవి పలికిన మాటల్లోని యథార్థ ప్రాధాన్యాన్ని అవగతం చేసుకొన్న వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు ఆనందభరితుడై ఆమెతో ఇలా పలికాడు.

1

మంగళస్వరూపిణివైన ఓ సీతాదేవీ! నీ వచనాలు ఎంతో యుక్తియుక్తంగా ఉన్నాయి. స్త్రీ నైజానికీ, పతివ్రతాశిరోమణుల నమ్రతకూ అవి ఎంతో అనుగుణంగా ఉన్నాయి.

2

నా వీపు మీద కూర్చుని నూరు యోజనాల విస్తీర్ణం గల సముద్రాన్ని దాటడం సహజంగా భయస్థులైన స్త్రీలకు సాధ్యం కాదు.

3

ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే,
రామాదన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి.

4

ఏతత్తే సదృశం దేవి పత్న్యాస్తస్య మహాత్మనః,
కా హ్యన్యా త్వామృతే దేవి బ్రూయాద్వచనమీదృశమ్.

5

శ్రోష్యతే చైవ కాకుత్స్థః సర్వం నిరవశేషతః,
చేష్టితం యత్త్వయా దేవి భాషితం మమ చాగ్రతః.

6

కారణైర్బహుభిర్దేవి రామప్రియచికీర్షయా,
స్నేహప్రస్కన్నమనసా మయైతత్ సముదీరితమ్.

7

లజ్జాయా దుష్ప్రవేశత్వాద్దుస్తరత్వాన్మహోదధేః,
సామర్థ్యాదాత్మనశ్చైవ మయైతత్సముదీరితమ్.

8

మూర్తీభవించిన వినయమే అయిన ఓ సీతాదేవీ! రెండవ కారణంగా రాముని తప్ప ఏ పరాయి పురుషుని స్పృశించనని నువ్వు చెప్పడం మహాత్ముడైన రాముని ధర్మపత్నివైన నీకే చెల్లుతుంది. దేవీ! నువ్వు తప్ప మరే స్త్రీ అలా పలుకగలదు?

4–5

ఓ జానకీదేవీ! ఇక్కడ నేను చూసిన నీ ప్రతి చర్యను, నాతో పలికిన ప్రతి మాటను రామునికి పూసగుచ్చినట్లు నివేదిస్తాను.

6

ఓ దేవీ! రాముని పట్ల నాకు గల అచంచల భక్తిప్రపత్తుల కారణాన, ఆయనకు ప్రీతిని కలిగించాలనే కోరిక వలన మనస్సు కరిగి నిన్ను నాతోపాటు తోడ్కొనిపోతానని చెప్పాను. ఇందుకు ప్రత్యేకించి మరో కారణం ఏదీ లేదు.

7

లంకలో ప్రవేశించడం అసాధ్యం కనుక, సముద్రం దాట శక్యం కానిదవడం చేత, నిన్ను తోడ్కొని వెళ్ళగల సామర్థ్యం నాకు ఉందనుకోవడం వల్లా నేను ఇలా పలికాను. అంతకన్నా మరో కారణం లేదు.

8

ఇచ్ఛామి త్వాం సమానేతుమద్యైవ రఘుబన్ధునా,

గురుస్నేహేన భక్త్యా చ నాన్యథైతదుదాహృతమ్.

9

యది నోత్సహసే యాతుం మయా సార్ధమనిన్దితే,
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయాద్రాఘవో హి తత్.

10

ఏవముక్తా హనుమతా సీతా సురసుతోపమా,
ఉవాచ వచనం మన్దం బాష్పప్రగ్రథితాక్షరమ్.

11

ఇదం శ్రేష్ఠమభిజ్ఞానం బ్రూయాస్త్వం తు మమ ప్రియమ్,
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా.

12

తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే,
తస్మిన్ సిద్ధాశ్రమే దేశే మన్దాకిన్యా హ్యదూరతః.

13

తస్యోపవనషణ్డేషు నానాపుష్పసుగన్ధిషు,
విహృత్య సలిలే క్లిన్నో మమాఙ్కే సముపావిశః.

14

అమ్మా! నిన్ను రాముని సన్నిధికి సత్వరమే చేరుద్దామనే బలీయమైన కోరికచేత, రాముని పట్ల నాకున్న విశేష భక్తిప్రపత్తులు, అభిమానం కారణంగానే నేను అలా పలికానుగాని మరో కారణం ఏదీ లేదు.

9

పూజనీయురాలైన ఓ సీతాదేవీ! నాతోపాటు రాముని వద్దకు నువ్వు రావడం సబబు కానందున, నేను ఇక్కడకు వచ్చి నిన్ను చూసి మాట్లాడినట్లు రామునికి నమ్మకం కలిగేలా ఏదైనా ఆనవాలు నా కివ్వు.

10

దేవకాంతను పోలిన ఆ సీతాదేవి, హనుమంతుని పలుకులు విని కళ్ళు చెమ్మగిల్లగా, దుఃఖంతో తడబడుతున్న స్వరంలో మెల్లగా ఇలా పలికింది.

11

ఓ హనుమా! నేనిప్పుడు చెప్పబోయే ఉదంతాన్ని నీ పట్ల గట్టి నమ్మకాన్ని కలిగించే గుర్తుగా యథాతథంగా రామునితో చెప్పు: చిత్రకూట పర్వత ఈశాన్య పాద ప్రాంతంలో సిద్ధులు నివసించే ఒక ఆశ్రమం ఉంది. అక్కడ ఫల మూలాలు, జలం సమృద్ధిగా లభిస్తాయి. అది గంగాతీరానికి ప్రక్కనే ఉన్నది. ఆ ఆశ్రమంలో మనం నివసించినప్పుడు ఒక రోజు నీవు (రాముడు) నానా పుష్ప పరిమళాలతో నిండిన ఉపవన ప్రాంతాలలో విహారం చేసి, జలకాలాటలు ఆడి బాగా అలసిపోయి నా తొడ మీద తలను ఉంచుకొని పడుకున్నావు.

12–14

తతో మాంససమాయుక్తో వాయసః పర్యతుణ్డయత్,
తమహం లోష్టముద్యమ్య వారయామి స్మ వాయసమ్.

15

దారయన్ స చ మాం కాకస్తత్రైవ పరిలీయతే,
న చాప్యుపారమన్మాంసాద్భక్షార్థీ బలిభోజనః.

16

ఉత్కర్షన్త్యాం చ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణి,
స్రస్యమానే చ వసనే తతో దృష్టా త్వయాహ్యహమ్.

17

త్వయాపహసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా,
భక్షగృధ్నేన కాకేన దారితా త్వాముపాగతా.

18

ఇంతలో ఒక కాకి అక్కడ ఎండబెట్టబడిన మాంస ఖండాన్ని తినాలనే అత్యాశచే మాటిమాటికీ తన వాడియైన ముక్కుతో దాన్ని పొడవసాగింది. ఆ కాకిని భయపెట్టి తోలడానికి నేను మట్టిబెడ్డలు దానిపై విసిరాను. తిండిపోతైన ఆ కాకి అక్కణ్ణుండి ఎగిరిపోకుండా, ఆ మాంసఖండాన్ని వదలిపెట్టి నా చుట్టూ తిరుగుతూ తన ముక్కుతో నన్ను పొడవడానికి ప్రయత్నించింది.

15–16

దాంతో నాకు పట్టరాని కోపం వచ్చి నా ఒడ్డాణాన్ని విప్పి ఆ కాకిని అదలించబోతుండగా నా చీర పమిట తొలగిపోయింది. నేను పమిటను సర్దుకుంటూ ఇబ్బందిపడుతున్న సమయంలో నువ్వు నిద్రనుండి లేచి నన్ను చూశావు.

17

నా అవస్థను చూసి నువ్వు పరిహాసంగా నవ్వావు. అందుకు నాకు ముందు కాస్త కోపం వచ్చినా పిదప సిగ్గు చెందాను. ఇంతలో ఆహారం పట్ల ఆసక్తి గల ఆ కాకి నన్ను గీరింది. వెంటనే నేను నీ వద్దకు వచ్చేశాను.

18

ఆసీనస్య చ తే శ్రాన్తా పునరుత్సఙ్గమావిశమ్,
క్రుధ్యన్తీ చ ప్రహృష్టేన త్వయాహం పరిసాన్త్వితా.

19

బాష్పపూర్ణముఖీ మన్దం చక్షుషీ పరిమార్జతీ,
లక్షితాహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా.

20

పరిశ్రమాత్ ప్రసుప్తా చ రాఘవాఙ్కేఽస్యహం చిరమ్,
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాఙ్కే భరతాగ్రజః.

21

స తత్ర పునరేవాథ వాయసః సముపాగమత్,
తతః సుప్తప్రబుద్ధాం మాం రామస్యాంకాత్సముత్థితామ్.

22

వాయసః సహసాగమ్య విదదార స్తనాన్తరే,
పునః పునరథోత్పత్య విదదార స మాం భృశమ్.

23

కాకి గొడవతో అలసిపోయిన నేను అక్కడ కూర్చుని ఉన్న నీ ఒడిలో తలపెట్టి పడుకున్నాను. కోపంతో ఉన్న నన్ను చూసి నవ్వుతూ నువ్వు ఊరడించావు.

19

ఓ ప్రభూ! అశ్రువులు స్రవిస్తున్న నా కళ్ళను వస్త్రంతో మెల్లగా తుడుచుకొంటున్నప్పుడు, ఆ కాకి దాడి కారణంగా నేనెంత చిరాకు, విసుకు చెందానో నువ్వు అవగతం చేసుకొన్నావు.

20

బాగా అలసిపోయి ఉండడంతో నేను, నీ (రాముని) ఒడిలో తల ఉంచుకొని

చాలాసేపు నిద్రపోయాను. నేను మేల్కొన్న తరువాత నువ్వు నా ఒడిలో నిద్రించావు.

21

ఆ సమయంలో మళ్ళీ ఆ కాకి అక్కడికి వచ్చింది. అప్పుడే నీ ఒడిలో నిద్రించి మేల్కొని లేచిన నా వద్దకు ఆ కాకి హఠాత్తుగా వచ్చి నా స్తనాంతరాన ముక్కుతో గీరింది. అంతటితో ఊరకోక పదే పదే ఎగురుకుంటూ వచ్చి పలుమార్లు పొడుస్తూ నన్ను బాగా గాయపరిచింది.

22–23

తతః సముక్షితో రామో ముక్తైః శోణితబిన్దుభిః,
వాయసేన తతస్తేన బలవత్ క్లిశ్యమానయా,
స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః.

24

స మాం దృష్ట్వా మహాబాహుర్వితున్నాం స్తనయోస్తదా,
ఆశీవిష ఇవ క్రుద్ధః శ్వసన్ వాక్యమభాషత.

25

కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాన్తరమ్,
కః క్రీడతి సరోషేణ పఞ్చవక్త్రేణ భోగినా.

26

వీక్షమానస్తతస్తం వై వాయసం సముదైక్షత,
నఖైః సరుధిరైస్తీక్ష్ణైర్మామేవాభిముఖం స్థితమ్.

27

పుత్రః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాన్తరగతః శీఘ్రం పవనస్య గతౌ సమః.

28

నా గాయాలనుండి స్రవించిన రక్తబిందువులచే నీ దేహం తడిసింది. ఆ విధంగా కాకి వల్ల అమిత బాధకు గురైన నేను, సుఖంగా నిద్రపోతున్న, శత్రువులకు సింహస్వప్నమైన నిన్ను నిద్రలేపాను.

24

మహాబాహువులు గల ఓ రామా! స్తనాల మధ్య కాకిచే గాయపడి బాధపడుతున్న నా దురవస్థను చూసి నువ్వు తోక తొక్కిన త్రాచుపాములా రెచ్చిపోయి నిట్టూర్పులు విడుస్తూ ఇలా

పలికావు.

25

ఏనుగు తొండం వంటి ఊరువులు గల ఓ సీతా! నీ స్తన మధ్యభాగాన గాయపరచిన వాడెవడు? కోపించిన ఐదు తలల మహాసర్పంతో ఆడుకోగోరుతున్న వాడెవడు?

26

ఇలా పలికి నువ్వు అటూ ఇటూ పరికించి రక్తసిక్తమైన ముక్కు, వాడియైన గోళ్ళతో నాకు ఎదురుగా నిలబడ్డ ఆ కాకిని చూశావు.

27

ఆ కాకి ఇంద్రుని కుమారుడట, పక్షులలో శ్రేష్ఠుడట. వాయువేగంతో సంచరించగల అతడు హఠాత్తుగా శరవేగంతో భూమ్మీదికి దిగి వచ్చాడట.

28

తతస్తస్మిన్ మహాబాహుః కోపసంవర్తితేక్షణః,
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాం వరః.

29

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్,
స దీప్త ఇవ కాలాగ్నిర్జజ్వలాభిముఖో ద్విజమ్.

30

స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి,
తతస్తం వాయసం దర్భః సోఽమ్బరేఽనుజగామ హ.

31

అనుసృష్టస్తదా కాకో జగామ వివిధాం గతిమ్,
త్రాణకామ ఇమం లోకం సర్వం వై విచచార హ.

32

స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః.

33

తరువాత బుద్ధిమంతులలో సర్వశ్రేష్ఠుడవు, మహాబాహువులు గలవాడమా అయిన

రామా! నువ్వు కోపంతో కళ్ళు ఎర్రజేసి ఆ కాకిని కఠినంగా శిక్షింప సంకల్పించావు.

29

వెంటనే నువ్వు దర్భాసనం నుండి ఒక దర్భను తీసి దానిని బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించావు. అప్పుడు బ్రహ్మాస్త్రాన్ని సంతరించుకొన్న ఆ దర్భ ప్రళయకాలాగ్నిలా ఆ కాకికి అభిముఖమై ప్రజ్వలించసాగింది.

30

ప్రజ్వలిస్తున్న బ్రహ్మాస్త్ర రూపంలోని ఆ దర్భను నువ్వు ఆ కాకి మీద ప్రయోగించావు. అంతే! ఆ మహాస్త్రం ఆకాశంలో వాయువేగంతో ఎగిరిపోతున్న ఆ కాకిని వెంటాడింది.

31

ఆ విధంగా దర్భ రూపంలోని ఆ మహాస్త్రం వెంటాడుతూంటే ఆ కాకి దాని బారి నుండి తప్పించుకోవడానికి ఎన్ని చోట్లకు ఎగిరిపోగలదో అన్ని చోట్లకూ వెళ్ళింది. తనను ఆ మహాస్త్రం నుండి రక్షించే వారికై ఈ లోకం యావత్తూ గాలిస్తూ సంచరించింది.

32

తనను రక్షించమని ప్రార్థిస్తూ ఆ కాకి ముల్లోకాలు తిరిగింది. దేవతలుగాని, మహర్షులుగాని, చివరికి తండ్రియైన దేవేంద్రుడుగాని రక్షించలేమని తమ అశక్తతను వ్యక్తం చేయగా, ఇక చేసేదిలేక చివరికి నిన్నే శరణుజొచ్చింది.

33

స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్,
వధార్హమపి కాకుత్థ్సః కృపయా పర్యపాలయత్.

34

పరిద్యూనం విషణ్ణం చ స తమాయాన్తమబ్రవీత్,
మోఘం కర్తుం న శక్యం తు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్.

35

హినస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్,
తతస్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్,
దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః.

36

స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయ చ,

విసృష్టస్తేన వీరేణ ప్రతిపేదే స్వమాలయమ్.

37

మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితమ్,
కస్మాద్యో మాఽహరత్త్వత్తః క్షమసే తం మహీపతే.

38

నిన్ను శరణుగోరి నేల మీద సాగిలపడిన ఆ కాకి చంపదగినదే అయినప్పటికీ శరణాగతవత్సలుడవైన ఓ రామా! నువ్వు దానిని దయతో కాపాడావు.

34

అలసిసొలసి గంపెడు దిగులుతో వచ్చిన ఆ కాకిని చూసి ఓ రామా! నువ్వు 'నేను ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వ్యర్థం కారాదు. కనుక ఏం చేయమంటావో చెప్పు' అన్నావు.

35

'నీ అస్త్రంతో నా కుడికన్ను పోగొట్టు' అని ఆ కాకి కోరగా, నువ్వు ప్రయోగించిన ఆ అస్త్రం ఆ కాకి కుడికంటిని నిర్మూలించింది. ఆ రకంగా ఆ కాకి తన కుడికంటిని సమర్పించి ప్రాణాలు దక్కించుకొంది.

36

ప్రాణాలు దక్కించుకున్న ఆ కాకి నీకు, దశరథ మహారాజుకు ప్రణమిల్లి, మహావీరుడవైన ఓ రామా! నీ వద్ద అనుజ్ఞ పొంది తన నివాసానికి తరలి వెళ్ళిపోయింది.

37

మహారాజైన ఓ రామా! నీ సమక్షంలో ఉండగా నన్ను బాధించినందుకు అల్పప్రాణియైన ఈ కాకి మీదనే బ్రహ్మాస్త్రం ప్రయోగించావు. అటువంటి నువ్వు ఏకంగా నన్ను అపహరించుకుపోయిన వాణ్ణి ఎందుకు ఉపేక్షిస్తున్నావు?

38

స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ,
త్వయా నాథవతీ నాథ హ్యనాథా ఇవ దృశ్యతే.

39

ఆనృశంస్యం పరో ధర్మస్త్వత్త ఏవ మయా శ్రుతః,
జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలమ్.

40

అపారపారమక్షోభ్యం గామ్భీర్యాత్సాగరోపమమ్,
భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమమ్.

41

ఏవమస్త్రవిదాం శ్రేష్ఠః సత్యవాన్ బలవానపి,
కిమర్థమస్త్రం రక్షస్సు న యోజయసి రాఘవ.

42

న నాగా నాపి గన్ధర్వా నాసురా న మరుద్గణాః,
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమాధితుమ్.

43

పురుషశ్రేష్ఠుడవైన ఓ రామా! నువ్వు సమధికోత్సాహం వహించి, నా పట్ల దయ చూపు. నువ్వు నాకు నాథుడవై ఉండగా నేనిప్పుడు దిక్కులేని అనాథవలె ఉన్నాను.

39

ఇతరుల శోకాన్ని ఉపశమింపజేయడం, వారిని కష్టాలనుండి అధిగమింప జేయడానికి దోహదపడడం—ఇవి అత్యుత్తమమైన ధర్మాలనే విషయం ఓ రామా! నేను నీ ముఖతానే విన్నాను. నువ్వు మహాపరాక్రమవంతుడవని, ఉత్సాహంతో పాటు మహాబలం గలవాడవని నే నెరుగుదును. నువ్వు అసాధ్యాలను సుసాధ్యం చేయగలవాడివి. గాంభీర్యంలో సముద్రం అంతటి వాడివి. ఏదీ నిన్ను ఆందోళనకు గురిచెయ్యదు. సముద్ర పర్యంతం వ్యాపించిన ఈ విశాల భూమండలానికి నువ్వు ప్రభువ్వు. దేవేంద్రునికి సాటియైన వాడివి. ఈ విషయాలన్నీ నాకు తెలియనివి కావు.

40—41

అస్త్రవేత్తలలో సర్వశ్రేష్ఠుడూ, సత్యసంధుడూ, మహాశక్తిమంతుడూ అయిన రాముడు రాక్షసుల మీద అస్త్ర ప్రయోగంచేయకుండా ఎందుకు ఉపేక్షిస్తున్నాడు?

42

నాగులుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, మరుద్గణాలుగాని యుద్ధంలో రాముని శస్త్రాస్త్రాల ధాటిని ముమ్మాటికీ తమాయించుకోలేరు.

43

తస్య వీర్యవతః కశ్చిద్యద్యస్తి మయి సంభ్రమః,
కిమర్థం స శరైస్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్.

44

భ్రాతురాదేశమాదాయ లక్ష్మణో నా పరంతపః,
కస్య హేతోర్న మాం వీరః పరిత్రాతి మహాబలః.

45

యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః.

46

మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః,
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ.

47

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః.

48

అటువంటి మహాపరాక్రమశాలియైన రామునకు నా సంక్షేమం పట్ల కించిత్తు అయినా అక్కర ఉంటే తన తీక్ష్ణ శస్త్రాస్త్రాలచే రాక్షసులను ఎందుకు రూపుమాపటంలేదు?

44

మహాపరాక్రమశాలి, మహావీరుడు, శత్రువుల పాలిటి సింహస్వప్నంగా పరిణమించినవాడు అయిన లక్ష్మణుడైనా అన్నగారి అనుజ్ఞ తీసుకుని నన్నీ దురవస్థనుండి కాపాడడానికి ఎందుకు నడుం బిగించడం లేదు?

45

అగ్ని వాయుదేవులకు దీటైన శక్తి తేజస్సులను సంతరించుకొన్న పురుష శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులను దేవతలుకూడా ఎదుర్కోలేరు. అంతటి శౌర్యప్రతాపాలు ఉండికూడా వారెందుకు నా పట్ల తాత్సారమూ, ఉపేక్షా వహిస్తున్నారు?

46

నేనేదో మహాపాపానికి ఒడిగట్టి ఉంటాను. అందులో ఎలాటి సందేహమూ లేదు. కాబట్టే శత్రువులను అలవోకగా పరిమార్చడంలో సమర్థులైనప్పటికీ రామలక్ష్మణులు నా దుస్థితిని పట్టించుకోకున్నారు.

47

ఈ విధంగా సీతాదేవి కన్నీరుమున్నీరై వచించిన దయనీయమైన పలుకులు విని, మహాతేజశ్శాలి, వాయునందనుడు అయిన హనుమంతుడు ఇలా స్పందించాడు.

48

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే.

49

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్షస్యన్తమనిన్దితే.

50

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ,
త్వద్దర్శన కృతోత్సాహౌ లఙ్కాం భస్మీకరిష్యతః.

51

హత్వా చ సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవస్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి.

52

బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః,
సుగ్రీవో వాపి తేజస్వీ హరయోఽపి సమాగతాః.

53

తల్లీ, ఓ సీతాదేవీ! నీ వియోగ శోకాన్ని భరించలేని రాముడు ఏ ఇతర విషయంలోనూ గూడుకట్టుకున్న నిరుత్సాహాన్ని వ్యక్తంచేస్తున్నాడు. సత్యం మీద శపథం చేసి చెబుతున్నాను. రాముని దుఃఖం చూసి లక్ష్మణుడు కూడా దుఃఖిస్తున్నాడు.

49

పూజ్యురాలైన ఓ సీతాదేవీ! మా అదృష్టం వలన చివరికి నువ్వు కనబడ్డావు. ఇది దుఃఖించాల్సిన సమయం కాదు. నీ దుఃఖాల అంతం కనుచూపు మేరలోనే ఉంది.

50

మహాబలసంపన్నులూ, రాజపుత్రులూ, పురుషులలో సర్వశ్రేష్ఠులూ, నిన్ను ఎప్పుడు చూడగలమా అని ఆతురతపడుతున్న వారూ అయిన ఆ రామలక్ష్మణులు ఈ లంకను భస్మం చేసివేయడం తథ్యం.

51

విశాలములైన నేత్రాలుగల ఓ సీతాదేవీ! క్రూరాత్ముడైన ఆ రావణుణ్ణి రణరంగంలో సమిత్రబాంధవంగా సంహరించి రాముడు నిన్ను అయోధ్యకు తోడ్కొనిపోతాడు.

52

అమ్మా! నా స్వామియైన రామునకు, శక్తిమంతుడైన లక్ష్మణునకు, తేజస్వియైన సుగ్రీవునకు, సముద్రం ఆవలి తీరంలో ఎదురుచూస్తున్న వానరులకు నీ సందేశం ఏమని చెప్పమంటావు?

53

ఇత్యుక్తవతి తస్మింశ్చ సీతా సురసుతోపమా,
ఉవాచ శోకసంతప్తా హనుమన్తం ప్లవంగమమ్.

54

కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ,
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ.

55

సృజశ్చ సర్వరత్నాని ప్రియా యాశ్చ వరాఙ్గనాః,
ఐశ్వర్యం చ విశాలాయాం పృథివ్యామపి దుర్లభమ్.

56

పితరం మాతరం చైవ సంమాన్యాభిప్రసాద్య చ,
అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః.

57

అనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖమనుత్తమమ్,
అనుగచ్ఛతి కాకుత్థ్సం భ్రాతరం పాలయన్వనే.

58

హనుమంతుని సాంత్వన వచనాలు విన్నప్పటికీ దేవతాస్త్రీ మల్లే ఒప్పుతున్న ఆ సీతాదేవి ఇంకా శోకంలో మునిగి ఉన్నదై, ఆ వానరశ్రేష్ఠునికి ఇలా జవాబిచ్చింది.

54

కౌసల్యాదేవి లోక రక్షణార్థం జన్మనిచ్చిన ఔదార్యవంతుడైన రామునకు నా తరఫున

శిరసా నమస్కరించి కుశలం విచారించు.

55

సుమిత్రాదేవి తనయుడైన లక్ష్మణుడు పుష్పమాలికలను, సమస్త రత్నములను, అనురాగవతులైన స్త్రీలను, అపార ఐశ్వర్యాన్ని, సకల భోగాలను త్యజించి, తల్లితండ్రులకు ప్రణమిల్లి వారి అనుజ్ఞతో రాముని అనుసరించి వనవాసానికి వెళ్ళాడు.

56–57

ధర్మపరాయణుడైన లక్ష్మణుడు సుఖమయ జీవితాన్ని త్యజించి సోదరుడైన రామునకు తోడునీడగా మసలుకొంటూ ఆయన సంరక్షణను చూసుకొంటూ అరణ్యవాసం చేస్తున్నాడు.

58

సింహస్కంధో మహాబాహుర్మనస్వీ ప్రియదర్శనః,
పితృవద్వర్తతే రామే మాతృవన్మాం సమాచరన్.

59

హ్రియమాణాం తదా వీరో న తు మాం వేద లక్ష్మణః,
వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా,
రాజపుత్రః ప్రియః శ్రేష్ఠః సదృశః శ్వశురస్య మే.

60

మమ ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః,
నియుక్తో ధురి యస్యాం తు తాముద్వహతి వీర్యవాన్.

61

యం దృష్ట్వా రాఘవో నైవ వృత్తమార్యమనుస్మరేత్,
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనాన్మమ.

62

సింహం వంటి మూపు, దీర్ఘబాహువులతో, చూపరులకు ప్రీతి కలిగించేవాడు, ఔదార్యవంతుడు అయిన లక్ష్మణుడు, రాముని కన్నతండ్రిలా, నన్ను తల్లిలా చూసుకొంటుండే వాడు.

59

నేను అపహరింపబడుతున్నప్పుడు మహావీరుడైన లక్ష్మణుడు నా చెంత లేడు. పెద్దలను సేవించడంలో అతడు ఆనందం చెందుతాడు. అమిత వివేకవంతుడు, సమర్థుడు

అయినప్పటికీ లక్ష్మణుడు మితభాషి. అతడు ఎల్లరకు ప్రీతిపాత్రుడైన రాజకుమారుడు, పైగా నా మామగారైన దశరథ మహారాజుకు సాటియైన వాడు.

60

రామునికి సోదరుడైన లక్ష్మణుడు సదా నాకు ప్రీతిని చేకూర్చడానికి తాపత్రయం చెందేవాడు. అప్పగించిన ఎంతటి కార్యభారాన్నైనా నిర్దుష్టంగా పూర్తిచేయగల సమర్థుడు లక్ష్మణుడు.

61

ఎవరి సాహచర్యం వలన రాముడు స్వర్గస్థుడైన తండ్రి గురించి బెంగ పెట్టుకోకుండా ఉన్నాడో ఆ లక్ష్మణుని కుశలం విచారించానని నా మాటగా చెప్పు.

62

మృదుర్నిత్యం శుచిర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః,
యథా హి వానరశ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్,
త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ.

63

రాఘవస్త్వత్సమారమ్భాన్మయి యత్నపరో భవేత్,
ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః.

64

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ,
ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమి తే.

65

రావణేనోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా,
త్రాతుమర్హసి వీర త్వం పాతాలాదివ కౌశికీమ్.

66

తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్,
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ.

67

ఓ వానరశ్రేష్ఠా! హనుమా! మృదుస్వభావి, పావనుడు, సర్వసమర్థుడు, రామునకు అత్యంత ఇష్టుడు అయిన లక్ష్మణుని, నా దుఃఖాన్ని రూపుమాపేకార్యసాధన నీ మూలంగానే

సానుకూలం అవ్వాలి.

63

నువ్వు చూపే చొరవా, చేసే ప్రయత్నాన్ని బట్టే రాముడు నన్ను రక్షించేకార్యభారానికి సత్వరమే ఉద్యమిస్తాడు. నా నాథుడూ, శూరుడూ అయిన రామునకు ఈ మాట పదేపదే చెప్పు.

64

'ఓ రామా! ఒక్క మాసం వరకే నేను ప్రాణాలతో ఉంటాను. మాసం దాటితే క్షణం కూడా జీవించి ఉండను. ఇది ముమ్మాటికీ సత్యం.'

65

దురాత్ముడైన రావణుడు నన్ను అవమానకరంగా నిర్బంధంలో ఉంచాడు. అటువంటి నన్ను ఓ మహావీరా! పాతాళం నుండి ఇంద్రుని లక్ష్మిని (ఐశ్వర్యాన్ని)విష్ణువు రక్షించినట్లు* నువ్వే రక్షించాలి.

66

ఇలా పలికి సీతాదేవి తన చీర కొంగులో ముడిపెట్టి ఉంచిన చూడామణిని తీసి, రామునికి ఇవ్వమని హనుమంతునికి ఇచ్చింది.

67

ప్రతిగృహ్య తతో వీరో మణిరత్నమనుత్తమమ్,
అఙ్గుల్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్భుజః.

68

మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ,
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః.

69

హర్షేణ మహతా యుక్తః సీతాదర్శనజేన సః,
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః.

70

మణివరముపగృహ్య తం మహార్హం
జనక నృపాత్మజయా ధృతం ప్రభావాత్,

గిరిరివ పవనావధూతముక్తః
సుఖీతమనాః ప్రతిసంక్రమం ప్రపేదే.

71

మహావీరుడైన హనుమంతుడు సాటిలేని ఆ చూడామణిని వినమ్రంగా స్వీకరించి, అది భుజమున ఇమడనందున పదిలపరచుకొనే నిమిత్తం దానిని తన వేలికి పెట్టుకొన్నాడు.

68

కపివరుడైన హనుమంతుడు ఆ మహత్త్వపూర్ణమైన మణిని స్వీకరించి, సీతాదేవికి ప్రదక్షిణచేసి, ప్రణమిల్లి వినమ్రుడై ఆమె పక్కకు వెళ్ళి నిలబడ్డాడు.

69

ఎట్టకేలకు సీతాదేవిని కనుగొని ఆమె దర్శనం పొందడంతో ఆ హనుమంతుని ఆనందం మేరమీరింది. శారీరకంగా అతడు లంకలోనే ఉన్నప్పటికీ మానసికంగా అతడు రాముని సన్నిధికి వెళ్ళిపోయాడు.

70

ఎవరి కంటా పడకుండా సీతాదేవి ధరించి ఉన్న అసాధారణమైన ఆ చూడామణిని భక్తిపూర్వకంగా హనుమంతుడు స్వీకరించాడు. దాని ప్రభావంతో ప్రచండ వాయువుచే కంపించి తమాయించుకొన్న పర్వతం మళ్లే అంతవరకూ డోలాయమాన స్థితిలో ఉన్న హనుమంతుని మనస్సు నిలకడను సంతరించుకొని తిరుగు ప్రయాణానికి సంసిద్ధమైంది.

71

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 38వ సర్గ సమాప్తం

39వ సర్గ
సీతాదేవిని ఊరడించడం

మణిం దత్త్వా తతః సీతా హనూమన్తమథాబ్రవీత్,
అభిజ్ఞానమభిజ్ఞాతమేతద్రామస్య తత్త్వతః.

1

మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి,
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ.

2

స భూయస్త్వం సముత్సాహే చోదితో హరిసత్తమ,
అస్మిన్ కార్యసమారమ్భే ప్రచిన్తయ యదుత్తరమ్.

3

సీతాదేవి చూడామణిని హనుమంతునికి అందించి ఇలా అంది: 'నీకు ఆనవాలుగా ఇచ్చిన ఈ చూడామణిని గురించి రామునికి బాగా తెలుసు.

1

ఆనవాలుగా పంపుతున్న ఈ చూడామణిని చూడగానే రాముడు నన్నూ, తన తల్లినీ, తన తండ్రియైన దశరథ మహారాజునూ గుర్తు చేసుకుంటాడు.

2

ఓ వానరోత్తమా! నువ్వు సమధికోత్సాహాన్ని సంతరించుకొని ఈ

కార్యసాఫల్యానికై ఇకపై ఏం చేస్తే బాగుంటుందో బాగా ఆలోచించు.

3

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
హనుమన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ,
తస్య చిన్తయతో యత్నో దుఃఖక్షయకరో భవేత్.

4

స తథేతి ప్రతిజ్ఞాయ మారుతిర్భీమవిక్రమః,
శిరసాఽఽవన్ద్య వైదేహీం గమనాయోపచక్రమే.

5

జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్,
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్యమబ్రవీత్.

6

కుశలం హనుమన్ బ్రూయాఃసహితౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం చ సహామాత్యం వృద్ధాన్ సర్వాంశ్చ వానరాన్,
బ్రూయాస్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్.

7

ఓ వానరశ్రేష్ఠా! ఈ కార్యం నెరవేరడంలో కీలకపాత్ర వహించవలసిన వాడివి నువ్వే. కార్యనిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గూర్చి ముందే బాగా యోచించి తదనుగుణంగా వ్యవహరిస్తావు కనుక నీ ప్రయత్నాలు సదా విజయాలుగానే పరిణమిస్తాయి. ఓ హనుమా! నా దుఃఖాలను రూపుమాపడానికి తీవ్రంగా కృషిచెయ్యి.

4

భీతినిగొల్పే పరాక్రమం గల హనుమంతుడు అట్లే చేస్తానని ప్రతిజ్ఞ చేసి, శిరస్సు వంచి సీతాదేవికి నమస్కరించి, ఇక బయలుదేరడానికి ఆమె

అనుజ్ఞకై నిలబడ్డాడు.

5

వాయునందనుడైన హనుమంతుడు తిరుగు ప్రయాణానికి సిద్ధమైనట్లు గ్రహించి సీతాదేవి, దుఃఖం ముంచుకురాగా కళ్ళ వెంట అశ్రువులు ధారకట్టగా గద్గదస్వరంతో ఇలా పలికింది.

6

వానరోత్తముడవైన ఓ హనుమంతుడా! రామలక్ష్మణులిద్దరికి, సుగ్రీవునికి ఆతడి మంత్రులకు వారి క్షేమం నేను మరీమరీ అడిగినట్లు చెప్పు. పెద్దలయిన ఇతర వానరులకు కూడా వారి క్షేమాన్ని కూడా నేను తగురీతిలో విచారించినట్లు తెలుపు.

7

యథా స చ మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాంబ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి.

8

జీవన్తీం మాం యథా రామః సంభావయతి కీర్తిమాన్,
తత్తథా హనుమన్ వాచ్యం వాచా ధర్మమవాప్నుహి.

9

నిత్యముత్సాహయుక్తాశ్చ వాచః శ్రుత్వా త్వయేరితాః,
వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే.

10

మత్సన్దేశయుతా వాచస్త్వత్తః శ్రుత్వై వ రాఘవః,
పరాక్రమవిధిం వీరో విధివత్ సంవిధాస్యతి.

11

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
శిరస్యఞ్జలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్.

12

మహాబాహువైన రాముడు నన్ను ఈ దుఃఖసముద్రం నుండి ఉద్ధరించడానికి చేపట్టవలసిన చర్యల పథక రచన విషయం నువ్వు చూడు.

8

ఓ హనుమా! నేను ప్రాణాలతో ఉండగానే కీర్తిమంతుడైన రాముడు ఇక్కడకు వచ్చి నన్ను ఆదుకుని, సాంత్వనపరిచేలా నా దుస్థితి చెప్పి ఆయనను ప్రోత్సహించి ఈ పనిచేసి పుణ్యం కట్టుకో.

9

అనుక్షణం నువ్వు ఉత్తేజభరితమైన పలుకులు చెబుతూ ఉంటే, వాటిని విన్న రామునిలో నన్ను ఈ విపత్తునుండి చప్పున ఉద్ధరించాలనే తపన, ఆరాటమూ ఇనుమడిస్తాయి.

10

నా సందేశాన్ని రాముడు నీ ముఖతా వినీవినగానే, వెంటనే చేపట్ట వలసిన వీరోచిత కార్యకలాపాలకు ఆదేశాలిస్తాడని ఆశిస్తున్నాను.

11

సీతాదేవి పలికిన మాటలు వినగానే వాయుపుత్రుడైన ఆ హనుమంతుడు ఆమెకు శిరసా నమస్కరించి ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు.

12

క్షప్రమేష్యతి కాకుత్థ్సో హర్యృక్షప్రవరైర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి.

13

న హి పశ్యామి మర్త్యేషు నాసురేషు సురేషు వా,
యస్తస్య క్షిపతో బాణాన్ స్థాతు ముత్సహతేఽగ్రతః.

14

అప్యర్కమపి పర్జన్యమపి వైవస్వతం యమమ్,
స హి సోఢుం రణే శక్తస్తవ హేతోర్విశేషతః.

15

స హి సాగరపర్యన్తాం మహీం శాసితుమీహతే,
త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనన్దిని.

16

తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్సత్యం సుభాషితమ్,
జానకీ బహుమేనేఽథ వచనం చేదమబ్రవీత్.

17

తల్లీ! త్వరలోనే వీరులైన వానర భల్లూక సేనాసమేతుడై రాముడు వచ్చి యుద్ధంలో శత్రుమూకలను సంహరించి నీ దుఃఖాన్ని తొలగించి వేస్తాడు.

13

రణరంగంలో రాముని శరపరంపరల ముందు నిలబడి బ్రతికి బట్టగట్టే వాడు నరులలోగాని, దేవతలలోగాని, అసురులలోగాని మచ్చుకి ఒక్కరు కూడా నాకు కానరావడం లేదు.

14

మిత్రుల తోడ్పాటు పొందకుండానే రాముడు ఒక్కడే, తల్లీ! అవసరమైతే సూర్యుణ్ణి, ఇంద్రుణ్ణి, అగ్నిని, ఆ యముణ్ణి సైతం యుద్ధంలో జయించి నిన్ను రక్షించుకోగల సమర్థుడు.

15

జనక మహారాజు కుమార్తెవైన ఓ సీతాదేవీ! సముద్ర పర్యంతం విస్తరించి ఉన్న ఈ యావత్తు భూమండలాన్ని పరిపాలింపగోరుతున్నాడు రాముడు. ఆ రాముడు గడించనున్న ఈ విజయం కూడా నీ నిమిత్తమే కదా!

16

హనుమంతుడు పొందికగా, ప్రోత్సాహజనితంగా, మృధుమధురంగా పలికిన వచనాలను గౌరవభావంతో విన్న సీతాదేవి ఇలా స్పందించింది.

17

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దాదనుమానయత్.

18

యది వా మన్యసే వీర వసైకాహమరిన్దమ,
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాన్తః శ్వో గమిష్యసి.

19

మమ చేదల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్తవ వానర,
అస్య శోకస్య మహతో ముహూర్తం మోక్షణం భవేత్.

20

గతే హి హరిశార్దూల పునరాగమనాయ తు,
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః.

21

తవాదర్శనజః శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర.

22

తిరుగు ప్రయాణానికి సిద్ధమై ఉన్న హనుమంతుని పదేపదే చూస్తూ,

రామునిపట్ల అతనికి గల అచంచల భక్తిప్రపత్తులను వెల్లడించే పలుకులకు పులకించినదైన ఆ సీతాదేవి ఇలా అన్నది.

18

శత్రువులను అంతంచేసే మహావీరుడా! నీకు అభ్యంతరం లేకపోతే ఒక రోజు ఇక్కడే ఉండి ఏదైనా రహస్య ప్రదేశంలో విశ్రాంతి తీసుకుని రేపు బయలుదేరు.

19

ఓ వానరోత్తమా! నువ్వు సమీపంలో ఉన్నావనే భావన మాత్రాన మంద భాగ్యురాలనై నా అంతులేని శోకానికి కొద్దిసేపైనా ఉపశమనం లభించగలదు.

20

ఓ వానరపుంగవా! నువ్వు ఇప్పుడు వెళ్ళి తిరిగి వచ్చేలోగా ఈ దుఃఖాన్ని భరిస్తూ నేను బ్రతికి ఉంటానో లేదో సంశయమే. ఈ విషయంలో ఎలాంటి సందేహానికీ తావులేదు.

21

ఓ వానరశ్రేష్ఠా! ఇంతవరకు దుఃఖపరంపరలతో కుమిలిపోతున్న నన్ను, నువ్వు కానరాకపోవడంతో కలిగే దుఃఖం ఇంకా మరింత తపింపజేసి దహించివేస్తుంది.

22

అయం చ వీర సందేహస్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర.

23

కథం ను ఖలు దుష్పారం తరిష్యన్తి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ.

24

త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే,
శక్తిః స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా.

25

తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిదాం వరః.

26

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే ఫలోదయః.

27

మహావీరుడవైన ఓ కపివర్యా! నీకు సహాయకులైన వానర భల్లూక సమూహాల విషయంలో ఒక ముఖ్యమైన సందేహం నా మనస్సులో తచ్చాడు తున్నది.

23

నువ్వు ప్రస్తావించిన వానర భల్లూక సైన్యాలు దాటడానికి సాధ్యంగాని అపారమైన ఆ మహాసముద్రాన్ని ఎలా దాటివస్తాయి? రాజపుత్రులైన ఆ రామ లక్ష్మణులు మాత్రం ఎలా దాటిరాగలరు?

24

గరుత్మంతుడు, నువ్వు, వాయుదేవుడు—కేవలం ఈ ముగ్గురు మాత్రమే, దాటశక్యంగాని ఆ మహాసముద్రాన్ని దాటగల సమర్థులు.

25

ఓ వీరాగ్రేసరా! కష్టసాధ్యమైన ఈ కార్యాన్ని సఫలీకృతం గావించడానికి ఏదైనా ఉపాయం ఆలోచించావా? ఎందుకంటే

కార్యసాధకులలో నీదే కదా అగ్రతాంబూలం!

26

ఓ శత్రు సంహారకా! ఈ మహత్కార్యాన్ని సాధించడానికి నువ్వొక్కడవే చాలుననడం నిర్వివాదాంశం. ఈ కార్యసాధన వలన నీ యశస్సు ఇనుమడిస్తుంది.

27

బలైః సమగ్రైర్యది మాం రావణం జిత్య సంయుగే,
విజయీ స్వపురం యాయాత్తత్తు మే స్యా ద్యశస్కరమ్.

28

శరైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సః తత్తస్య సదృశం భవేత్.

29

తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ.

30

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాన్ శేషం వాక్యముత్తరమబ్రవీత్.

31

దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవః సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః.

32

అలాకాక, రాముడు సైన్యసమేతంగా ఇక్కడకు వచ్చి యుద్ధంలో రావణుని స్వయంగా తానే సంహరించి నన్ను తన రాజ్యానికి తోడ్కొని

వెళ్ళడం ఆయనకూ, నాకూ గౌరవప్రదంగా ఉంటుంది.

28

శత్రుసేనలను అంతమొందించే రాముడు శరపరంపరలతో లంకను ముంచెత్తి నన్ను తనతో తీసుకుని వెళ్ళడమనే కార్యకలాపం ఆయన స్థాయికి సముచితమై ఒప్పారుతుంది, ఆయన పరాక్రమానికి వన్నె తెస్తుంది.

29

కనుక మహాత్ముడు, శూరాగ్రేసరుడు అయిన రాముని సాటిలేని పరాక్రమం అభివ్యక్తం అయ్యే రీతిలో కార్యాచరణ జరిగేటట్లు చూడు.

30

అర్థయుక్తమూ, యుక్తియుక్తమూ, సందర్భోచితమూ అయిన సీతాదేవి పలుకులు విని, హనుమంతుడు ఇంకా ఆమెకు తెలియజేయని విషయాలను గూర్చి ఇలా చెప్పాడు.

31

వానర భల్లూక సైన్యాలకు నాయకుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన సుగ్రీవుడు ఓ దేవీ! ఎలాగైనా నిన్ను ఆదుకోవాలని కృతనిశ్చయుడై ఉన్నాడు.

32

స వానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః,
క్షిప్రమేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః.

33

తస్య విక్రమసంపన్నాః సత్త్వవన్తో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః.

34

యేషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,

న చ కర్మసు సీదన్తి మహత్త్వమితతేజసః.

35

అసకృత్తైర్మహోత్సాహైః ససాగరధరాధరా,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః.

36

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాప్తి సుగ్రీవసన్నిధౌ.

37

అమ్మా, సీతాదేవీ! తన ఆదేశాలను తు.చ.తప్పక పాటించే కోట్లాది వానర వీరులతో కలసి సుగ్రీవుడు రాక్షస సంహారార్థం త్వరలోనే ఇక్కడకు రాగలడు.

33

పరాక్రమ సంపన్నులు, శ్రమను ఖాతరు చేయనివారు, మహాబలశాలురు, ఇచ్ఛామాత్రాన ఇట్టే ఎక్కడకైనా వెళ్ళిరాగల వారు, దృఢనిర్ణయమూ–పట్టుదలా గల కోకొల్లలైన వానరులు సుగ్రీవుని ఆజ్ఞానువర్తులై ఉన్నారు.

34

వారి గమనానికి భూమ్యాకాశాలలో అడ్డు అదుపూ లేదు. అమిత తేజస్సంపన్నులైన ఆ వానరవీరులు ఎంతటి కష్టసాధ్యమైన కార్యాన్ని అయినా అనాయాసంగా చెయ్యగలరు.

35

సమధికోత్సాహవంతులైన ఆ భల్లూక వానరులు ఆకాశమార్గంలో సంచరిస్తూ మహాసముద్రాలతో, మహాపర్వతాలతో కూడుకున్న ఈ భూమిని పలుమార్లు చుట్టి వచ్చిన సాహసవంతులు.

36

సుగ్రీవుని వద్ద ఉన్న వానరభల్లూక వీరులలో నాకన్నా ఘనులైన వారు అనేకులున్నారు; నాతో సమానులైన వారు చాలామంది ఉన్నారు. కాని నాకన్నా తక్కువ సామర్థ్యం గలవారు మచ్చుకి ఒక్కడు కూడా లేడు.

37

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరే జవాః.

38

తదలం పరితాపేన దేవి శోకో వ్యపైతు తే,
ఏకోత్పాతేన తే లఙ్కామేష్యన్తి హరియూథపాః.

39

మమ పృష్ఠగతౌ తౌ చ చన్ద్రసూర్యావివోదితౌ,
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహావాగమిష్యతః.

40

తౌ హి వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ,
ఆగమ్య నగరీం లఙ్కాం సాయకైర్విధమిష్యతః.

41

సగణం రావణం హత్వా రాఘవో రఘునన్దనః,
త్వామాదాయ వారారోహే స్వపురీం ప్రతియాస్యతి.

42

ఏ పని మీదనైనా ముందుగా సామాన్యులనే పంపడం లోక రివాజు. అటువంటి సామాన్యుడనైన నేనే ఇక్కడకు రాగలిగానంటే నాకన్నా ఘనులైన వానరవీరుల సంగతి వేరేగా చెప్పాలా?

38

అమ్మా, సీతాదేవీ! అందువల్ల అనుమానం పెట్టుకొని పరితాపం చెందకు. దుఃఖానికి స్వస్తి పలుకు. మహావీరులైన వానరులు ఒక్క గెంతులో సముద్రాన్ని దాటి లంకను చేరుకోగలరు.

39

మహాశక్తిమంతులూ, పురుషశ్రేష్ఠులూ అయిన రామలక్ష్మణులు నా భుజాల మీద ఆసీనులై, ఉదయించిన సూర్యచంద్రుల చందాన ప్రకాశిస్తూ నీ వద్దకు రాగలరు.

40

ఒకరిని విడిచి మరొకరు ఉండలేని వీరులు, మహాపురుషులు అయిన ఆ రామలక్ష్మణులు ఇక్కడకు వచ్చి తమ శరపరంపరలతో ఈ లంకా నగరాన్ని ఛిన్నాభిన్నం చేసివేస్తారు.

41

ఓ సీతాదేవీ! రఘువంశానికి ఆనందప్రదుడైన రాముడు యుద్ధంలో రావణుని సపరివారసమేతంగా సంహరించి నిన్ను తన నగరానికి తోడ్కొని వెళతాడు.

42

తదాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
నచిరాద్ద్రక్ష్యసే రామం ప్రజ్వలన్తమివానలమ్.

43

నిహతే రాక్షసేన్ద్రేఽస్మిన్ సపుత్రామాత్యబాన్ధవే,
త్వం సమేష్యసి రామేణ శశాఙ్కేనేవ రోహిణీ.

44

క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి,
రావణం చైవ రామేణ నిహతం ద్రక్ష్యసేఽచిరాత్.

45

ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీం పునరబ్రవీత్.

46

తమరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లఙ్కాద్వారముపస్థితమ్.

47

కనుక ఓ దేవీ! ఊరడిల్లు. నీకు శుభం కలుగుతుంది. సముచిత సమయం కోసం ఓపికతో వేచివుండు. జ్వాలలతో ప్రజ్వలిస్తున్న అగ్నిలా తేజోవిరాజమానుడైన రాముని త్వరలోనే చూడగలవు.

43

రాక్షసరాజైన రావణుడు పుత్రుల, మంత్రుల, బంధుగణ సమేతంగా మట్టికరచిన తరువాత, రోహిణి చంద్రుని చేరినట్లు నువ్వు తప్పక రాముని చేరుకుంటావు.

44

మిథిల రాజకుమారివైన ఓ సీతాదేవీ! త్వరలోనే దుఃఖసాగరపు ఆవలి తీరాన్ని చేరుకొంటావు. రాముని చేతిలో రావణుడు హతమవడం నువ్వు అతిత్వరలోనే చూడగలవు.

45

వాయునందనుడైన హనుమంతుడు ఈ విధంగా ఓదార్పు మాటలతో సీతాదేవిని ఊరడించి, తిరుగు ప్రయాణానికి ఉద్యుక్తుడౌతూ మళ్ళీ ఆమెతో ఇలా అన్నాడు.

46

అమ్మా! శత్రుసంహారానికి కృతనిశ్చయుడైన రాముని, ధనుర్ధారియైన లక్ష్మణుని లంకానగర సింహద్వారం వద్ద త్వరలోనే చూడగలవు.

47

నఖదంష్ట్రాయుధాన్వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్వారణేన్ద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్.

48

శైలామ్బుదనికాశానాం లఙ్కామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామార్యే యూథాన్యనేకశః.

49

స తు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా,
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః.

50

మా రుదో దేవి శోకేన మా భూత్తే మనసోఽప్రియమ్,
శచీవ పత్యా శక్రేణ భర్త్రా నాథవతీ హ్యసి.

51

పరిమాణంలో అతిపెద్ద ఏనుగలంతటి వారు, పరాక్రమంలో సింహాలను, పులులను మించిన వారు, గోళ్ళు, కోరలే ఆయుధాలుగా గలవారు అయిన వానరవీరులు తండోపతండాలుగా ఇక్కడకు రావడం ఓ సీతాదేవీ! నువ్వు త్వరలోనే చూడగలవు.

48

ఓ పూజనీయురాలా! పరిమాణంలో పర్వతాలవంటివారు, మేఘ సముదాయాలను పోలిన వారు అయిన అసంఖ్యాక వానరయోధాగ్రేసరులు

లంకలోను, మలయపర్వత చరియలందు భీషణఘోషలు చేస్తూ సంచరించడాన్ని త్వరలోనే నువ్వు చూడనున్నావు.

49

మహావీరుడైన రాముని హృదయాంతరంగం తీక్ష్ణమైన మన్మథ బాణాల తాకిడికి గురై సింహం బారిన పడిన ఏనుగు చందాన ఆతడు జాడమాత్రంగానన్నా సుఖానికి నోచుకోవడం లేదు.

50

ఓ సీతాదేవీ! నువ్విక దుఃఖించకు. శోకంతో నీ మనస్సు కలతచెందకుండు గాక! శచీదేవి ఇంద్రుని పరిరక్షణలో ఉన్నట్లు, పరిస్థితుల సానుకూల పరిణామాలను బట్టి చూస్తుంటే త్వరలోనే నువ్వు రాముని రక్షణలో ఉండబోతున్నావు.

51

రామాద్విశిష్టః కోఽన్యోఽస్తి కశ్చిత్సౌమిత్రిణా సమః,
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ.

52

నాస్మింశ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణైరధ్యుషితేఽతిరౌద్రే,
న తే చిరాదాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్.

53

రామునికన్నా ఘనుడెవ్వడు? సుమిత్రానందనుడైన లక్ష్మణునికి సాటివచ్చే వాడెవ్వడు? అగ్నికి వాయువు తోడైనట్లు లక్ష్మణుడు రాముడికి తోడుగా ఉన్నాడు. అటువంటి సోదరులిద్దరూ నీకు అండగా ఉండగా ఇంకా నీకెందుకమ్మా భయం?

52

ఓ సీతాదేవీ! రాక్షసులకు నివాసమైన భయంకరమైన ఈ ప్రదేశంలో నువ్వు ఇక అట్టే కాలం ఉండనక్కర్లేదు. నీ భర్తయైన రాముడు ఇక్కడకు రావడంలో ఎలాంటి జాప్యమూ ఉండదు. నేను తిరిగి వెళ్ళి రామునికి నీ సందేశం చెప్పేటంత వరకు కాస్త ఓపికపట్టు.

53

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 39వ సర్గ

సమాప్తం

40వ సర్గ

హనుమంతునకు సీత సెలవివ్వడం

శ్రుత్వా తు వచనం తస్య వాయుసూనోర్మహాత్మనః,
ఉవాచాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా.

1

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర,
అర్ధసంజాతసస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా.

2

యథా తం పురుషవ్యాఘ్రం గాత్రైః శోకాభికర్శితైః,
సంస్పృశేయం సకామాహం తథా కురు దయాం మయి.

3

దేవకాంతను పోలిన ఆ సీతాదేవి, మహాత్ముడైన హనుమంతుని పలుకులు ఆలకించి తన శోకం అంతరించడాన్ని ఉద్దేశిస్తూ ఇలా స్పందించింది.

1

ఓ వానరోత్తమా! సగం మొలకెత్తిన విత్తనం వర్షపు జల్లు పడగానే వికసించి పూర్తిగా మొలకెత్తే రీతిలో, నైరాశ్యంతో ఉన్న నా మనస్సును నీ ప్రసన్నమైన వచనాలు ఆనందంతో పులకింపజేశాయి.

2

ఎడబాటు కలిగించిన దుఃఖంతో కృశించిపోయిన నేను పురుషశ్రేష్ఠుడైన రాముని స్పర్శానందాన్ని పొందగోరుతున్నాను. దయతో ఆ నా ఆకాంక్ష సఫలీకృతం చెయ్యి.

3

అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ,
క్షిప్తా మిషీకాం కాకస్య కోపాదేకాక్షిశాతనీమ్.

4

మనః శిలాయాస్తిలకో గణ్డపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి.

5

స వీర్యవాన్ కథం సీతాం హృతాం సమనుమన్యసే,
వసన్తీం రక్షసాం మధ్యే మహేన్ద్రవరుణోపమః.

6

ఏష చూడామణిర్దివ్యో మయా సుపరిరక్షితః,
ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వామివానఘ.

7

ఏష నిర్యాతితః శ్రీమాన్మయా తే వారిసమ్భవః,
అతః పరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా.

8

ఓ వానరోత్తమా! ఆగ్రహోదగ్రుడై 'ఇషీక' మనే తృణాన్ని మంత్రపూర్వకంగా ప్రయోగించి కాకి ఒక కన్నును హరించిన వైనాన్ని రామునకు ఆనవాలుగా చెప్పు.

4

ఒక రోజు చమటపట్టి నా నుదుట తిలకం చెరిగిపోయింది. అది చూసి రాముడు వెంటనే మణిశిలను అరగదీసి బొట్టుగా పెట్టబోయి, అంతలో వేడుకగా నా చెక్కిలి మీద దిద్దాడు. ఆ విషయాన్ని కూడా నా ప్రభువును గుర్తుచేసుకోమను.

5

ఇంద్ర వరుణులతో సమానమైన పరాక్రమం గల నువ్వు (రాముడు), నీ భార్యనైన నేను అపహరింపబడి రాక్షసుల మధ్య భారంగా కాలం వెళ్ళబుచ్చడాన్ని ఎలా ఉపేక్షింపగలుగుతున్నావు?

6

ఓ దోషరహితుడా! దివ్యమైన ఈ చూడామణిని ఇప్పటి వరకూ బహుజాగ్రత్తగా పదిలపరచుకొంటూ వచ్చాను. ఈ కష్టకాలంలో దీనిని చూసుకొంటూ నిన్ను చూసినట్లే సంతోషపడుతున్నాను.

7

ఆనందాన్ని కలిగించే ప్రభావంగల జలనిధిలో జన్మించిన ఈ చూడామణిని ఆనవాలుగా నీకు పంపిస్తున్నాను. ఇకపై ఈ చూడామణి నుండి లభించే ఒకింత సాంత్వనకూడా కరువై నేను శోకంతో తల్లడిల్లి జీవించడం కష్టం.

8

అసహ్యాని చ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః,
రాక్షసీనాం సుఘోరాణాం త్వత్కృతే మర్షయామ్యహమ్.

9

ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన,
ఊర్ధ్వం మాసాన్న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ.

10

ఘోరో రాక్షసరాజోఽయం దృష్టిశ్చ న సుఖా మయి,
త్వాం చ శ్రుత్వా విషజ్జన్తం న జీవేయమహం క్షణమ్.

11

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః.

12

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే.

13

ఏదో ఒక రోజు నువ్వు వచ్చి రక్షిస్తావనే చిరు ఆశతో దుర్భరమైన దుఃఖాన్నీ, గుండెను నిలువునా చీల్చివేసే ఈ భయంకర రాక్షసస్త్రీల దుర్భాషణలనూ సహిస్తూ, భరిస్తూ ప్రాణాలు నిలుపుకొంటున్నాను.

9

శత్రుసంహారకుడవైన ఓ రామా! ఇక నేను నీకై నిరీక్షిస్తూ కేవలం ఒక్క నెల మాత్రమే జీవించి ఉంటాను. ఆ తర్వాత నీ ఎడబాటుతో క్షణంకూడా జీవించి ఉండను.

10

రాక్షసరాజైన ఈ రావణుడు క్రూరాతిక్రూరుడు. నా విషయంలో అతడి వైఖరి ఎంతమాత్రమూ యోగ్యంగా లేదు. నీ రాకలో జాప్యం జరుగుతున్నదని తెలిసిన మరుక్షణం నేను ప్రాణాలతో ఉండను.

11

మహాతేజశ్శాలీ, వాయునందనుడూ అయిన హనుమంతుడు, సీతాదేవి అలా కంటతడిపెట్టుకొని పలికిన దైన్య వచనాలను విని, ఓదారుస్తున్న ధోరణిలో ఆమెతో ఇలా పలికాడు.

12

ఓ సీతాదేవీ! నీ వియోగ దుఃఖాన్ని భరించలేని రాముడు ఏ విషయంలోనూ కించిత్తు ఆసక్తికూడా కనబరచడంలేదు. ఇది సత్యమని శపథం చేస్తున్నాను. రాముడు దుఃఖంలో మునిగి ఉండడం చూసి లక్ష్మణుడు కూడా దుఃఖీస్తున్నాడు.

13

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానామన్తం ద్రక్ష్యసి భామిని.

14

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రావరిందమౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లఙ్కాం భస్మీకరిష్యతః.

15

హత్వా తు సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాం పురీం ప్రాపయిష్యతః.

16

యత్తు రామో విజానీయాదభిజ్ఞానమనిన్దితే,
ప్రీతిసంజననం తస్య భూయస్త్వం దాతుమర్హసి.

17

సాఽబ్రవీద్దత్తమేవేతి మయాఽభిజ్ఞానముత్తమమ్,
ఏతదేవ హి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్,
శ్రద్ధేయం హనుమన్వాక్యం తవ వీర భవిష్యతి.

18

ఓ సీతాదేవీ! మా అదృష్టంకొద్దీ ఎట్టకేలకు నువ్వు కనిపించావు. ఇది

దుఃఖించవలసిన సమయం కాదు. నీ దుఃఖాల అంతం కనుచూపుమేరలోనే ఉంది.

14

శత్రుసంహారకులూ, రాజపుత్రులూ, పురుషులలో సర్వశ్రేష్ఠులూ, నిన్ను చూడాలని ఆరాటపడుతున్న వారూ అయిన ఆ రామలక్ష్మణులు ఈ లంకను భస్మం చేయడం తథ్యం.

15

విశాలనేత్రయైన ఓ సీతాదేవీ! క్రూరాత్ముడైన ఆ రావణుణ్ణి బంధుమిత్రులతో సహా రణరంగంలో సంహరించి రామలక్ష్మణులు నిన్ను తమ నగరానికి తోడ్కొని వెళతారు.

16

ఓ పూజనీయురాలా! రామునికి సంతోషం కలిగించే, ఆయన ఇట్టే గుర్తించ గలిగిన మరొక ఆనవాలు ఏదైనా ఉంటే అది కూడా ఇస్తే తీసుకువెళతాను.

17

అందుకు సీతాదేవి, "ఓ మహావీరా! ఉత్తమమైన ఆనవాలును నీకు ఇంతకు మునుపే ఇచ్చేశాను గదా! నా కేశభూషణమైన ఆ చూడామణిని చూడగానే రాముడు నీ మాటలు తప్పక నమ్ముతాడు" అని ప్రత్యుత్తరమిచ్చింది.

18

స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః,
ప్రణమ్య శిరసా దేవీం గమనాయోపచక్రమే.

19

తముత్పాతకృతోత్సాహమవేక్ష్య హరిపుఙ్గవమ్,

వర్ధమానం మహావేగమువాచ జనకాత్మజా,
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా.

20

హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్.

21

యథా చ స మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖామ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి.

22

శుభలక్షణాలతో విరాజిల్లుతున్న వానరోత్తముడైన హనుమంతుడు ఆ చూడామణిని స్వీకరించి, సీతాదేవికి శిరస్సువంచి నమస్కరించి బయలుదేరడానికి ఉద్యుక్తుడయ్యాడు.

19

వానరోత్తముడైన ఆ హనుమంతుడు ఎగరడానికి సమధికోత్సాహంతో దేహ పరిమాణాన్ని పెంచసాగాడు. మహావేగవంతుడైన ఆతణ్ణి తేరిపార చూసి సీతాదేవి కన్నుల్లో అశ్రువులు నిండగా, దైన్యంతో కూడిన గద్గదస్వరంలో ఇలా పలికింది.

20

ఓ హనుమా! పరాక్రమంలో సింహాలవంటి వారూ, సోదరులూ అయిన రామలక్ష్మణులతోనూ, అమాత్య సమేతుడైన వానరరాజు సుగ్రీవునితోను, తక్కిన అందరితోనూ నేను క్షేమం అడిగినట్లు చెప్పు.

21

మహాబాహువైన రాముడు ఈ దుఃఖసాగరంనుండి నన్ను ఉద్ధరించడానికి చేపట్టవలసిన చర్యల ప్రణాళికను గురించి నువ్వు బాగా

యోచించు.

22

ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గతః సమీపమ్
శివశ్చ తేఽధ్యాస్తు హరిప్రవీర.

23

స రాజపుత్ర్యా ప్రతివేదితార్థం
కపిః కృతార్థః పరిహృష్టచేతాః,
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం
దిశం హ్యుదీచీం మనసా జగామ.

24

ఓ వానరోత్తమా! రాముని వద్దకు వెళ్ళగానే నేను ఇక్కడ అనుభవిస్తున్న అంతులేని దుఃఖాన్ని, ఈ రాక్షసస్త్రీలు బెదిరిస్తూ నన్ను బాధిస్తున్న వైనాన్ని గురించి నువ్వు ఆయనతో చెప్పు. నీ ప్రయాణం సుఖప్రదంగా జరుగుగాక!

23

సీతాదేవి సందేశాన్ని గైకొని రామకార్యం సాధించానన్న సంతోషమనస్కుడైన ఆ హనుమంతుడు, ఇంకా మిగిలి ఉన్న కొంచెం పనిని గూర్చి యోచిస్తూ, తాను ఉత్తర దిక్కుకు పోయినట్లే భావించాడు.

24

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 40వ సర్గ
సమాప్తం

41వ సర్గ

అశోకవన విధ్వంసం

స చ వాగ్భిః ప్రశస్తాభిర్గమిష్యన్ పూజితస్తయా,
తస్మాద్దేశాదపక్రమ్య చిన్తయామాస వానరః.

1

అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా,
త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే.

2

న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దానమర్థోపచితేషు యుజ్యతే,
న భేదసాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే.

3

ప్రశంసాపూర్వకమైన వచనాలతో సీతాదేవి వద్ద సెలవు పుచ్చుకొన్న ఆ వానరోత్తముడు బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అతడు శింశుపా వృక్షం నుండి కొంతదూరం వెళ్ళి ఇలా తలపోశాడు.

1

సీతాదేవిని దర్శించడంతో వచ్చిన పని ఒక రకంగా పూర్తయింది. ఇంకా చేయవలసిన పని కొంచెం మిగిలి ఉంది. ఇప్పుడు

సామదానభేదోపాయాలను ప్రక్కనపెట్టి దండోపాయాన్నే అమలుపరచవలసి ఉంది.

2

రాక్షసుల పట్ల సామోపాయం (మంచి మాట) పనిచెయ్యదు. ధనమదాంధులు కనుక వారి పట్ల దానోపాయం కూడా పొసగదు. బలగర్వితులు కావడం వలన వారి పట్ల భేదోపాయానికి ఆస్కారం లేదు. కాబట్టి నా పరాక్రమం ప్రదర్శించడమే వారి విషయంలో సమంజసం.

3

న చాస్య కార్యస్య పరాక్రమాదృతే
వినిశ్చయః కశ్చిదిహోపపద్యతే,
హతప్రవీరా హి రణే హి రాక్షసాః,
కథం చిదీయుర్యదిహాద్య మార్దవమ్.

4

కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్,
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి.

5

న హ్యేకః సాధకో హేతుః స్వల్పస్యాపీహ కర్మణః,
యో హ్యర్థం బహుధా వేద స సమర్థోఽర్థసాధనే.

6

ఇహైవ తావత్ కృతనిశ్చయో హ్యహం
యది వ్రజేయం ప్లవగేశ్వరాలయమ్,
పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవి
త్తతః కృతం స్యాన్మమ భర్తృశాసనమ్.

7

ఇప్పుడు నెలకొని ఉన్న పరిస్థితిలో పరాక్రమం ప్రదర్శించడం తప్ప మరో మార్గం ఏదీ ఫలప్రదం కాబోదు. ఎందుకంటే ఇప్పుడు నా పరాక్రమ విజృంభణ ముందు శక్తిమంతులైన అనేక రాక్షసయోధులు నేలకొరిగితే తక్కిన వాళ్ళు కొంతవరకు మెత్తబడతారు.

4

తనకు అప్పగించిన కార్యాన్ని నిర్దుష్టంగా సాధించడంతో పాటు, అసలు పనికి భంగం కాకుండా తత్సంబంధితమైన మరికొన్ని చిన్న పనులు కూడా చక్కబెట్టుకు వచ్చే వాడే నిజమైన కార్యదక్షుడు.

5

లోకంలో ఎంత స్వల్పమైన కార్యాన్నైనా ఏకైక ఉపాయంతో లేదా ఎత్తుగడతో సాధించలేము. తన కార్యం తప్పక సఫలం చేయడానికి పలు ఎత్తుగడలు లేదా ఉపాయాలు అమలుపరచగలవాడే కార్యదక్షులలో మిన్నయైన వాడు.

6

నేను ఇక్కడ ఉన్నప్పుడే, శత్రువులైన ఈ రాక్షసుల బలాబలాలను, వారి యుద్ధతంత్రాలను నిర్ధారించుకోవడం యుక్తమైన పని. ఈ విషయాలు క్షుణ్ణంగా తెలుసుకొన్నాననే తృప్తితో సుగ్రీవుని వద్దకు వెళితే, ప్రభువు ఆదేశాన్ని ఆసాంతం పాటించిన వాడినౌతాను.

7

కథం ను ఖల్వద్య భవేత్సుఖాగతం
ప్రసహ్య యుద్ధం మమ రాక్షసైః సహ,
తథైవ ఖల్వాత్మబలం చ సారవత్
సమానయేన్మాం చ రణే దశాననః.

8

తతః సమాసాద్య రణే దశాననం
సమన్త్రివర్గం సబలప్రయాయినమ్,
హృది స్థితం తస్య మతం బలం చ వై
సుఖేన మత్వాహమితః పునర్వ్రజే.

9

ఇదమస్య నృశంసస్య నన్దనోపమముత్తమమ్,
వనం నేత్రమనఃకాన్తం నానాద్రుమలతాయుతమ్.

10

ఈ రాక్షసులను నాతో ప్రచండ యుద్ధానికి ఇట్టే పురిగొల్పడానికి ఇప్పుడు నేను ఏం చేయాలి? అదే కనుక సంభవిస్తే, దశకంఠుడైన ఆ రావణుడు నన్ను ఎదుర్కొనడానికి సునిశిత శిక్షణ పొందిన సేనను పంపడం తథ్యం.

8

అలా జరిగే పక్షంలో మంత్రులు, సేనానాయకులతో సహా రావణుని ముఖాముఖీ ఎదుర్కోగలుగుతాను. అప్పుడు ప్రత్యక్షంగా వారి శక్తిసామర్థ్యాలను, మ్యాహరచనలను (పథకాలను) నిర్ధారణ చేసుకోగలుగుతాను. ఆ తరువాత ఇక్కణ్ణుండి తృప్తిగా తిరిగి వెళతాను.

9

దురాత్ముడైన రావణుని ఈ అశోకవనం బహువిధాలైన చక్కని వృక్షాలతోనూ, లతలతోనూ కనులపండువుగా మనోహరంగా అలరారుతూ దేవేంద్రుని నందనవనాన్ని తలపింపజేస్తోంది.

10

ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వనమివానలః,
అస్మిన్ భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః.

11

తతో మహత్యాశ్వమహారథద్విపం
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః,
త్రిశూలకాలాయసపట్టిసాయుధం
తతో మహద్యుద్ధమిదం భవిష్యతి.

12

అహం తు తైః సంయతి చణ్డవిక్రమైః
సమేత్య రక్షోభిరసహ్యవిక్రమః,
నిహత్య తద్రావణచోదితం బలం
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్.

13

అధికంగా ఎండిపోయిన వృక్షాలున్న అడవిని అగ్ని ఇట్టే దగ్ధం చేసే తీరులో నేను ఈ అశోకవనాన్ని రూపురేఖలు లేకుండా ధ్వంసం చేస్తాను. ఆ విధంగా ఈ వనం ధ్వంసం కావడంతో దశకంఠుడైన రావణుడు ఆగ్రహోదగ్రుడౌతాడు.

11

దాంతో రాక్షసరాజైన రావణుడు రథ గజ తురగ పదాతిదళాలతో కూడిన గొప్ప సైన్యాన్ని మహారథులతో సహా ఇక్కడకు పంపుతాడు. ఆ యోధులు త్రిశూలాలు, నల్లని ఇనుపపట్టిసాలు మొదలైన ఆయుధాలు ధరించి నన్ను ఎదుర్కొంటారు. అప్పుడు ఆ ప్రతిఘటన నేను ఆశించిన రీతిలో ఒక గొప్ప యుద్ధంగా పరిణమిస్తుంది.

12

అప్పుడు నేను గొప్ప పరాక్రమవంతులైన ఆ రాక్షసులను తిరుగులేని నా బలపరాక్రమాలతో ఢీకొని, ఆ రావణుని బలగాలను సమూలంగా

మట్టుబెట్టి సంతోష మనస్కుడనై వానరరాజైన సుగ్రీవుని వద్దకు వెళతాను.

13

తతో మారుతవత్ క్రుద్ధో మారుతిర్భీమవిక్రమః,
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్.

14

తతస్తు హనుమాన్ వీరో బభఞ్జ ప్రమదావనమ్,
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్.

15

తద్వనం మథితైర్వృక్షైర్భిన్నైశ్చ సలిలాశయైః,
చూర్ణితైః పర్వతాగ్రైశ్చ బభూవాప్రియదర్శనమ్.

16

నానాశకున్తవిరుతైః ప్రభిన్నైః సలిలాశయైః,
తామ్రైః కిసలయైః క్లాన్తైః క్లాన్తద్రుమలతాయుతమ్.

17

న బభౌ తద్వనం తత్ర దావానలహతం యథా,
వ్యాకులావరణా రేజుర్విహ్వలా ఇవ తా లతాః.

18

ఇలా ఆలోచించి ప్రచండపరాక్రమశాలియైన ఆ హనుమంతుడు కృతనిశ్చయుడై రాక్షసుల మీద బాగా కోపం పెంచుకొన్నాడు. పిదప సుడిగాలి చందాన వాయువేగంతో తన తొడలతో, పాదాలతో ఆ వనంలోని వృక్షాలను కూకటివేళ్ళతో సహా నేలమట్టం చేయనారంభించాడు.

14

మహావీరుడైన ఆ హనుమంతుడు మదించిన పక్షుల

కిలకిలారావాలతోనూ, అనేక రకాలైన వృక్షలతాదులతో విస్తరించి విరాజిల్లుతున్నదీ అయిన ఆ ఉద్యానాన్ని రూపురేఖలు కనిపించకుండా ధ్వంసం చేశాడు.

15

నేలమట్టమైన వృక్షాలతో, కట్టలు తెగిన సరస్సులతో, నుగ్గునుగ్గయిన క్రీడాపర్వతాలతో ఆ వనం అప్పుడు అస్తవ్యస్తమై, శోభావిహీనమై వికృత ఆకృతిని సంతరించుకొన్నది.

16

భీతి చెందిన పక్షుల వికృత ధ్వనులతో, కట్టలు తెగిన కాసారాలతో, చిగుళ్ళతో కూడుకొన్న విరిగి వాడిపోయిన చెట్ల కొమ్మలతో ఆ అశోకవనం అప్పుడు దావాగ్నిచే దగ్ధమైన అరణ్యాన్ని తోపింపజేస్తున్నది. ఆధారంగా ఉన్న కంచెలు, దడులు నేలకూలడంతో లతలు భయంతో గడగడ వణకుచున్న స్త్రీల మల్లే కానవచ్చాయి.

17–18

లతాగృహైశ్చిత్రగృహైశ్చ నాశితై
ర్మహోరగైర్వ్యాళమృగైశ్చ నిర్ధుతైః,
శిలాగృహైరున్మథితైస్తథా గృహైః
ప్రణష్టరూపం తదభూన్మహద్వనమ్.

19

సా విహ్వలాఽశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా,
జాతా దశాస్యప్రమదావనస్య
కపేర్బలాద్ధి ప్రమదావనస్య.

20

స తస్య కృత్వార్థపతేర్మహాకపి
ర్మహద్వ్యళీకం మనసో మహాత్మనః,
యుయుత్సురేకో బహుభిర్మహాబలైః
శ్రియా జ్వలంస్తోరణమాస్థితః కపిః.

21

హనుమంతుని విజృంభణ ధాటికి ఆ వనంలోని లతాగృహాలు, చిత్రగృహాలు నామరూపాలు లేకుండా ధ్వంసమయ్యాయి. అందలి జంతువులు, సర్పాలు చితకగొట్టబడ్డాయి. శిలాగృహాలు, ఇతర గృహాలు తుత్తునియలయ్యాయి. ఈ బీభత్సంతో ఆ అశోకవనం తన గత శోభనంతా కోల్పోయింది.

19

రావణుని అంతఃపురకాంతల విలాసార్థమూ, విహారార్థమూ కనుల పండువుగా విస్తరించిన అశోకలతా సముదాయాలతో తీర్చిదిద్దిన ఆ అశోకవనం హనుమంతుని ధాటికి అతలాకుతలమయింది. ఇప్పుడు ఆ వనంలోని లతలు తమ విధిని తలచుకొని దుఃఖిస్తున్నవా అన్నట్లుగా నిరాధారంగా వ్రేలాడుతున్నాయి.

20

రావణుని మనస్సు క్షోభించి రెచ్చగొట్టే రీతిలో ఆ అశోకవనాన్ని హనుమంతుడు ఛిన్నాభిన్నం చేసి, మహాబలశాలురైన అనేకమంది రాక్షసవీరులతో ఒంటరిగా పోరాడ సంకల్పించినవాడై సమధికోత్సాహంతో తేజరిల్లుతూ ఆ వన ముఖద్వారం మీదికెక్కి నిలబడ్డాడు.

21

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 41వ సర్గ

సమాప్తం

42వ సర్గ

కింకరుల వధ

తతః పక్షినినాదేన వృక్షభఙ్గస్వనేన చ,
బభూవుస్త్రాససంభ్రాన్తాః సర్వే లఙ్కానివాసినః.

1

విద్రుతాశ్చ భయత్రస్తా వినేదుర్మృగపక్షిణః,
రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే.

2

తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః,
తద్వనం దదృశుర్భగ్నం తం చ వీరం మహాకపిమ్.

3

పక్షుల వికృత ధ్వనులూ, ఫెళఫెళా వృక్షాలు విరిగిపడుతున్న చప్పుళ్ళూ విని లంకా నివాసులందరూ భయభ్రాంతులయ్యారు.

1

అప్పుడు ఆ అశోకవనంలోని మృగాలు, పక్షులు భయపడి బొబ్బలు పెడుతూ నలువైపులా పరుగెత్తిపోసాగాయి. రాక్షసులకు భయసూచకాలైన దుశ్శకునాలు కానవచ్చాయి.

2

అంతదాకా నిద్రలోకి జారుకొన్న వికృతరూపిణులైన రాక్షస

స్త్రీలందరూ ఆ చప్పుళ్ళకు మేల్కొని చుట్టూ విధ్వంసమైన వనాన్నీ, ఎదురుగా పర్వతప్రమాణంలో ఉన్న హనుమంతుణ్ణీ చూశారు.

3

స తా దృష్ట్వా మహాబాహుర్మహాసత్త్వో మహాబలః,
చకార సుమహద్రూపం రాక్షసీనాం భయావహమ్.

4

తతస్తం గిరిసంకాశమతికాయం మహాబలమ్,
రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్.

5

కోఽయం కస్య కుతో వాయం కిం నిమిత్తమిహాగతః,
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత.

6

ఆచక్ష్వ నో విశాలాక్షి మా భూత్తే సుభగే భయమ్,
సంవాదమసితాపాఙ్గే త్వయా కిం కృతవానయమ్.

7

అథాబ్రవీత్తదా సాధ్వీ సీతా సర్వాఙ్గసున్దరీ,
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః.

8

గొప్ప బాహువులు గలవాడు, మహాశక్తిమంతుడూ, గొప్పధైర్యసాహసాలు గలవాడు అయిన హనుమంతుడు ఆ రాక్షసస్త్రీలు తనను భయంగా చూడడం గుర్తించి వారిని మరింత భయానికి లోనుచేయడానికై తన శరీర పరిమాణాన్ని ఇంకా పెంచాడు.

పర్వతప్రమాణంలో తమ ఎదుట నిలబడి ఉన్న మహాబలశాలియైన ఆ వానరుని చూసి ఆ రాక్షసస్త్రీలు కంగారు చెందుతూ సీతను ఇలా ప్రశ్నించారు.

5

ఇతడెవడు? ఎవరి వాడు? ఎక్కణ్ణుండి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? నీతో అతడు ఏ విషయం గూర్చి మాట్లాడాడు?

6

నల్లని విశాలమైన కన్నులు గల ఓ సీతా! సౌభాగ్యవంతురాలా! భయపడకు, నిన్ను మేము ఏమీ కోపగించుకోము. అతడు నీతో ఏం మాట్లాడాడో మాత్రం చెప్పు.

7

అందుకు మహాసాధ్వీ, సర్వాంగసుందరీమణీ అయిన సీతాదేవి ఇలా ప్రత్యుత్తరమిచ్చింది: భీతిగొల్పే మాయరూపాలను ధరించగల కామరూపులైన రాక్షసులను గురించి నాకెలా తెలుస్తుంది?

8

యూయమేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి,
అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః.

9

అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కో న్వహమ్,
వేద్మి రాక్షసమేవైనం కామరూపిణమాగతమ్.

10

వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః,
స్థితాః కాశ్చిద్గతాః కాశ్చిద్రావణాయ నివేదితుమ్.

11

రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః,
విరూపం వానరం భీమమాఖ్యాతుముపచక్రముః.

12

అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః,
సీతయా కృతసంవాదస్తిష్ఠత్యమితవిక్రమః.

13

ఇతడెవరో? ఎందుకు వచ్చాడో? ఏం చేయగోరుతున్నాడో? మీకే తెలియాలి. పాము జాడ పాముకే తెలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

9

ఇతణ్ణి చూస్తే నాకూ భయంగానే ఉంది. ఇతడెవరో నాకు తెలియదు. బహుశా కామరూపుడైన రాక్షసుడెవడో ఇలా వచ్చాడని భావిస్తున్నాను.

10

సీతాదేవి ప్రత్యుత్తరం విన్న ఆ రాక్షసస్త్రీలలో కొందరు భయంతో పలాయనం చిత్తగించారు. కొందరు కావలిగా ఆమె చుట్టూ నిలబడ్డారు. కొందరు ఈ ఉదంతాన్ని నివేదించడానికి రావణుని వద్దకు పరుగున వెళ్ళారు.

11

వికృత ముఖాలుగల ఆ రాక్షసస్త్రీలు రావణుని ముందుకు జంకుతూ వెళ్ళి భీతిగొల్పే రూపంలో పర్వతప్రమాణంలో ఉన్న వానరుని గూర్చి ఇలా చెప్పసాగారు.

12

ఓ మహారాజా! భీకరాకారం దాల్చిన మహాబలవంతుడైన ఒక వానరుడు అశోకవనంలో ప్రవేశించాడు. అతడు సీతతో ఏదో మాట్లాడాడు.

13

న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా,
అస్మాభిర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి.

14

వాసవస్య భవేద్దూతో దూతో వైశ్రవణస్య వా,
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాఙ్క్షయా.

15

తేన త్వద్భుతరూపేణ యత్తత్తవ మనోహరమ్,
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్.

16

న తత్ర కశ్చిదుద్దేశో యస్తేన న వినాశితః,
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః.

17

జానకీరక్షణార్థం వా శ్రమాద్వా నోపలభ్యతే,
అథవా కః శ్రమస్తస్య సైవ తేనాభిరక్షితా.

18

మేం ఎన్నిసార్లు గుచ్చిగుచ్చి అడిగినా జనకమహారాజు కుమార్తె, లేడి కన్నుల వంటి కన్నులు గల సీత ఆ వానరుణ్ణి గురించిన వివరాలు ససేమిరా చెప్పడంలేదు.

14

ఆ వానరుడు బహుశా కుబేరుని దూతగాని లేదా ఇంద్రుని దూతగాని అయివుంటాడు. కాకుంటే సీతాన్వేషణార్థం రాముడు పంపించిన రహస్యదూత అయి ఉండవచ్చు.

15

ఆశ్చర్యంగొలిపే రూపంగల ఆ వానరుడు ఆహ్లాదజనితమూ, అనేక రకాలైన జంతుజాలంతో కూడినదీ, అన్నింటికీ మించి నీకు అత్యంత ప్రియమైనదీ అయిన అశోకవనాన్ని నామరూపాలు లేకుండా ధ్వంసం చేశాడు.

16

ఆ వనంలో అతడు ధ్వంసం చేయని చోటు మచ్చుకి ఒక్కటంటే ఒక్కటికూడా లేదు. కాని ఆశ్చర్యం ఏమంటే సీత కూర్చున్న స్థలాన్ని మాత్రం అతడు తాకనైనా తాకలేదు.

17

సీతకు ఎటువంటి ప్రమాదమూ వాటిల్లకూడదని ఆమె కూర్చున్న చోటును ధ్వంసం చెయ్యకుండా వదలిపెట్టాడో లేదా అలసిపోయినందున అలా వదలివేశాడో తెలియడంలేదు. కాని అంతటి బలశాలికి శ్రమ ఏమిటి? కనుక ఆమె రక్షణ నిమిత్తమే అతడలా చేసివుంటాడు.

18

చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయమాస్థితా,
ప్రవృద్ధః శింశుపావృక్షః స చ తేనాభిరక్షితః.

19

తస్యోగ్రరూపస్యోగ్రం త్వం దణ్డమాజ్ఞాతుమర్హసి,
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్.

20

మనఃపరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర,
కః సీతామభిభాషేత యో న స్యాత్త్యక్తజీవితః.

21

రాక్షసీనాం వచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,

హుతాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః.

22

తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నప్రబిన్దవః,
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిన్దవః.

23

అందమైన చిగుళ్ళతో, విరగబూసిన పుష్పాలతో అలరారుతున్న సీత ఆశ్రయించి ఉన్న ఆ శింశుపావృక్షాన్ని మాత్రం ఆ వానరుడు చెక్కుచెదరకుండా అట్లే వదలిపెట్టాడు.

19

సీతతో మాట్లాడిన తరువాత అశోకవనాన్ని ధ్వంసం చేసిన భయంకరాకారుడైన ఆ పొగరుబోతు వానరుడికి కఠోర దండన విధించు మహారాజా!

20

ఓ రాక్షసేంద్రా! నువ్వు మనసుపడుతున్న సీతాదేవితో ప్రాణాల మీద ఆశ ఉన్నవాడెవడైనా సంభాషించడానికి సాహసిస్తాడా?

21

రాక్షసరాజైన రావణుడు ఆ రాక్షసస్త్రీల మాటలు విని పట్టరాని కోపంతో గుడ్లురుముతూ హోమం చేసిన అగ్నిలా మండిపడ్డాడు.

22

ప్రజ్వరిల్లుతున్న రెండు దీపాలనుండి మంటతో కూడిన తైలబిందువులు నేల రాలినట్లు, కోపోద్రిక్తుడైన ఆ రావణుని రెండు కళ్ళనుండి అశ్రు కణాలు రాలాయి.

23

ఆత్మనః సదృశాన్ శూరాన్ కింకరాన్నామ రాక్షసాన్,
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః.

24

తేషామశీతిసాహస్రం కింకరాణాం తరస్వినామ్,
నిర్యయుర్భవనాత్తస్మాత్ కూటముద్గరపాణయః.

25

మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః,
యుద్ధాభిమనసః సర్వే హనుమద్గ్రహణోద్యతాః.

26

తే కపీన్ద్రం సమాసాద్య తోరణస్థమవస్థితమ్,
అభిపేతుర్మహావేగాః పతఙ్గా ఇవ పావకమ్.

27

తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాఞ్చనాఙ్గదైః,
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం శరైశ్చాదిత్యసన్నిభైః.

28

అప్పుడు మహాతేజశ్శాలియైన ఆ రావణుడు బలపరాక్రమాలలో తనకు దీటైన కింకరులనే రాక్షసయోధులకు హనుమంతుని పట్టి బంధించమని ఆదేశమిచ్చాడు.

24

రావణుని ఆదేశాన్ని శిరసావహిస్తూ వెంటనే ఎనభైవేలమంది కింకరులనే రాక్షసులు కూటములు, ముద్గరాలు (ఇనుపగుదియలు) అనే ఆయుధాలు చేతపట్టి ఆ భవనం నుండి హుటాహుటిన బయలుదేరారు. పెద్దపెద్ద పొట్టలు, కోరలతో, భయంకర ఆకృతి గల మహాబలశారులైన ఆ కింకరులు రణోత్సాహులై హనుమంతుని బంధించడానికి ఉద్యుక్తులయ్యారు.

25–26

యుద్ధసన్నద్ధుడై అశోకవన సింహద్వారం మీద సుస్థిరంగా నిలబడి ఉన్న హనుమంతుని సమీపించిన ఆ కింకరులు, ప్రజ్వలిస్తున్న అగ్ని మీదికి మిడుతలదండు ఎగిరిన చందాన ఆ కపివరుని పైకి మహావేగంతో దూసుకువెళ్ళారు.

27

ఆ కింకరులనే రాక్షసయోధులు నానారకాల గదలను, బంగారు పిడులున్న ఇనుప గుదియలను, సూర్యకిరణాల మల్లే తీక్షణాలైన బాణాలను వానరశ్రేష్ఠుడైన హనుమంతునిపై ప్రయోగించారు.

28

ముద్గరైః పట్టిసైః శూలైః ప్రాసతోమరశక్తిభిః,
పరివార్య హనూమన్తం సహసా తస్థురగ్రతః.

29

హనుమానపి తేజస్వీ శ్రీమాన్ పర్వతసన్నిభః,
క్షితావావిధ్య లాఙ్గూలం ననాద చ మహాస్వనమ్.

30

స భూత్వా సుమహాకాయో హనుమాన్ మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లఙ్కాం శబ్దేన పూరయన్.

31

తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా,
పేతుర్విహఙ్గా గగనాదుచ్చైశ్చేదమఘోషయత్.

32

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,

రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః.

33

రాక్షసవీరులైన ఆ కింకరులు ఇనుపగుదియలు, అడ్డకత్తులు, శూలాలు, ఈటెలు, తోమరాలు, చిల్లకోలలు అనే ఆయుధాలను చేతపట్టుకుని హనుమంతుని చుట్టుముట్టి నిలబడ్డారు.

29

మహాతేజశ్శాలీ, పర్వత ప్రమాణంలో ఉన్నవాడూ అయిన హనుమంతుడు వాళ్ళను చూసి సమధికోత్సాహంతో తన తోకను నేలపై కొట్టి సింహనాదం చేశాడు.

30

వాయునందనుడైన హనుమంతుడు తన దేహ పరిమాణాన్ని విపరీతంగా పెంచి లంకానగరమంతా ప్రతిధ్వనించేటట్లు తన జబ్బలను చరిచాడు.

31

లంకానగరం మార్మోగేటట్లు హనుమంతుడు జబ్బలు చరచి చేసిన ఆ మహాధ్వనికి ఆకాశంలో ఎగురుతున్న పక్షులు భయపడి నేలరాలాయి. పిదప ఆ కపివరుడు బిగ్గరగా ఇలా జయఘోష చేశాడు.

32

అజేయ బలసంపన్నుడైన రామునికి జయం! మహాశక్తిమంతుడైన లక్ష్మణునకు జయం! రాముని రక్షణలో పరిపాలిస్తున్న రాజైన సుగ్రీవునకు జయం!

33

దాసోఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః.

34

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః.

35

అర్దయిత్వా పురీం లఙ్కామభివాద్య చ మైథిలీమ్,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్.

36

తస్య సన్నాదశబ్దేన తేఽభవన్ భయశఙ్కితాః,
దదృశుశ్చ హనూమన్తం సన్ధ్యామేఘమివోన్నతమ్.

37

స్వామిసందేశనిశ్శఙ్కా స్తతస్తే రాక్షసాః కపిమ్,
చిత్రైః ప్రహరణైర్భీమైరభిపేతుస్తతస్తతః.

38

కోసల దేశాధిపతియైన రాముని దాసుణ్ణి నేను. వాయుపుత్రుడనైన నా పేరు హనుమంతుడు. శత్రు సైన్యాలను నామరూపాలు లేకుండా చేయగల నేను అనాయాసంగా ఏ కార్యాన్నైనా సాధించే సమర్థుణ్ణి.

34

బండరాళ్ళనూ, మహావృక్షాలనూ ఆయుధాలుగా చేసుకొని నేను వేయి విధాలుగా యుద్ధం చేస్తూంటే వేయిమంది రావణులకైనా నన్ను ప్రతిఘటించడం సాధ్యంకాదు.

35

రాక్షసులందరూ కళ్ళు తెరచుకుని చూస్తూండగానే నేను ఈ లంకా నగరాన్ని అతలాకుతలం చేసి, సీతాదేవికి నమస్కరించి వచ్చిన పనిలో

కృతకృత్యుడనై నిరాటంకంగా తిరిగి వెళతాను.

36

హనుమంతుడు చేసిన భీషణ గర్జనలను విని, సంధ్యాకాల మేఘమల్లే సమున్నతమైన ఆతడి ఆకృతిని చూసి ఆ కింకరులు భయభ్రాంతికి లోనయ్యారు.

37

కాని తమ ప్రభువైన రావణుని ఆజ్ఞకు బద్ధులవడంతో ధైర్యం తెచ్చుకొని ముందువెనుకలు యోచించకుండా ఆ కింకరులు చిత్రవిచిత్రమైన ఆయుధాలతో హనుమంతునిపై దాడి చేశారు.

38

స తైః పరివృతః శూరైః సర్వతః సమహాబలః,
ఆససాదాయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్.

39

స తం పరిఘ మాదాయ జఘాన రజనీచరాన్.

40

స పన్నగ మివాదాయ స్ఫురంతం వినతాసుతః,
విచచారామ్బరే వీరః పరిగృహ్య చ మారుతిః.

41

స హత్వా రాక్షసా న్వీరాన్ కింకరాన్ మారుతాత్మజః,
యుద్ధకాంక్షీ పునర్వీరః తోరణం సముపాశ్రితః.

42

తతస్తస్మాద్భయాన్ముక్తాః కతిచిత్తత్ర రాక్షసాః,
నిహతాన్ కింకరాన్ సర్వాన్రావణాయ న్యవేదయన్.

43

స రాక్షసానాం నిహతం మహద్బలం
నిశమ్య రాజా పరివృత్తలోచనః,
సమాదిదేశాప్రతిమం పరాక్రమే
ప్రహస్తపుత్రం సమరే సుదుర్జయమ్.

44

ఆ విధంగా వీరులైన ఆ కింకరులు చుట్టుముట్టి తనపై దాడిచేయగా, మహాబలశాలియైన హనుమంతుడు అటూ ఇటూ చూసి సింహద్వారానికి ఉన్న అతిపెద్ద ఇనుప గడియను లాగి చేత పుచ్చుకున్నాడు.

39

ఒక మహాసర్పాన్ని గరుత్మంతుడు తన కాలిగోళ్ళతో పట్టి ఆకాశంలోతిరిగే రీతిలో మహావీరుడైన ఆ హనుమంతుడు ఆ ఇనుప గుదియను చేతపట్టి గిరగిరా తిరుగుతూ ఈ కింకరులను దానితో చావమోదసాగాడు. ఆ విధంగాకింకరులందరినీ వధించి సమధికోత్సాహంతో ఇంకా యుద్ధం చేయదలచిన వాడైన ఆ హనుమంతుడు మళ్ళీ ఆ సింహద్వారం మీద నిలబడ్డాడు.

40–42

హనుమంతుణ్ణి చూసి భయపడి తప్పించుకు పారిపోయిన కొందరురాక్షసులు రావణుని వద్దకెళ్ళి కింకరులు యావన్మందీ వధింపబడ్డారనే చావుకబురుచల్లగా తెలియజేశారు.

43

కింకరుల సేనాబలగమంతా మట్టిగరచిన వార్త వినగానే రావణుడుకోపోద్రిక్తుడై కళ్ళు తిప్పుతూ సాటిలేని పరాక్రమవంతుడూ, యుద్ధంలో అజేయుడనిపేరుగాంచిన వాడూ అయిన ప్రహస్తుని (మంత్రి)

కుమారుణ్ణి యుద్ధానికి వెళ్ళమని ఆదేశించాడు.

44

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 42వ సర్గ
సమాప్తం

43వ సర్గ

చైత్యప్రాసాద విధ్వంసం

తతః స కింకరాన్ హత్వా హనుమాన్ ధ్యానమాస్థితః,
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః.

1

తస్మాత్ ప్రాసాదమద్యైవమిమం విధ్వంసయామ్యహమ్,
ఇతి సంచిన్త్య మనసా హనుమాన్ దర్శయన్ బలమ్.

2

చైత్యప్రాసాదమాప్లుత్య మేరుశృఙ్గమివోన్నతమ్,
ఆరురోహ హరిశ్రేష్ఠో హనుమాన్ మారుతాత్మజః.

3

ఆరుహ్య గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః,
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః.

4

కింకర సమూహాన్ని ఆ విధంగా రూపుమాపిన తరువాత హనుమంతుని మనస్సులో ఈ ఆలోచన మెదలింది: 'ఈ అశోకవనాన్ని నామరూపాలు లేకుండా ధ్వంసం చేశాను. కాని ఈ చైత్యప్రాసాదం మీద ఎందుకో నా దృష్టి పడలేదు. ఇప్పుడు దీన్ని నేలమట్టం చేస్తాను.' వాయుపుత్రుడు, వానరశ్రేష్ఠుడు అయిన హనుమంతుడు మనస్సులో అలా

నిశ్చయించుకొని తన సాటిలేని బలాన్ని ప్రదర్శిస్తూ మేరుపర్వత శిఖర చందాన సమున్నతంగా ఉన్న ఆ చైత్యప్రాసాదం మీదికి ఒక్క గెంతులో ఎక్కి నిలబడ్డాడు.

1–3

గొప్ప తేజశ్శాలీ, వానర సేనానాయకుడూ అయిన హనుమంతుడు పర్వత సదృశమైన ఆ చైత్యప్రాసాదాన్ని అధిరోహించి ఉదయిస్తున్న రెండవ సూర్యునిలా భాసించాడు.

4

సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాదముత్తమమ్,
హనుమాన్ ప్రజ్వలన్ లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్.

5

స భూత్వా సుమహాకాయః ప్రభావాన్మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లఙ్కాం శబ్దేన పూరయన్.

6

తస్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా,
పేతుర్విహఙ్గమాస్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః.

7

అస్త్రవిజ్ఞయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః.

8

దాసోఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః.

9

ఇతరులెవరికీ చేర శక్యంగాని ఆ సమున్నత చైత్యప్రాసాదాన్ని ఆక్రమించిన హనుమంతుడు పారియాత్ర మనే కులపర్వతమంత పెరిగి, శోభిల్లాడు.

5

వాయునందనుడైన హనుమంతుడు స్వతస్సిద్ధమైన శక్తిచే తన దేహాన్ని అమేయ ప్రమాణంలో పెంచి లంకానగరమంతా మార్మోగేటట్లు జబ్బలు చరిచాడు.

6

చెవులు చిల్లులుపడేటట్లు వినవచ్చిన ఆ భీషణ ధ్వనికి ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షులు భీతిల్లి నేలమీదపడ్డాయి; ఆ చైత్య రక్షకులు మూర్ఛిల్లారు.

7

అప్పుడు హనుమంతుడు ఇలా జయఘోష చేశాడు: 'అస్త్రవిద్యలో సర్వశ్రేష్ఠుడైన రామునికి జయం! మహాశక్తిమంతుడైన లక్ష్మణునికి జయం! రాముని రక్షణలో పరిపాలిస్తున్న రాజైన సుగ్రీవునికి జయం.'

8

నేను కోసల దేశాధిపతియైన రాముని దాసుణ్ణి. వాయుపుత్రుడనైన నా పేరు హనుమంతుడు. శత్రుసైన్యాలను నామరూపాలు లేకుండా చేయగల నేను అనాయాసంగా ఏ కార్యాన్నైనా సాధించే సమర్థుణ్ణి.

9

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః.

10

అర్దయిత్వా పురీం లఙ్కామభివాద్య చ మైథిలీమ్,

సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్.

11

ఏవముక్త్వా విమానస్థశ్చైత్యస్థాన్ హరియూథపః,
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్.

12

తేన శబ్దేన మహతా చైత్యపాలాః శతం యయుః,
గృహీత్వా వివిధానస్త్రాన్ ప్రాసాన్ ఖడ్గాన్ పరశ్వథాన్,
విసృజన్తో మహాకాయా మారుతిం పర్యవారయన్.

13

విచిత్రాభిర్గదాభిస్తే పరిఘైః కాఞ్చనాఙ్గదైః,
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం బాణైశ్చాదిత్య సన్నిభైః.

14

బండరాళ్ళనూ, మహావృక్షాలనూ ఆయుధాలుగా చేసుకొని నేను వేయి విధాలుగా యుద్ధం చేస్తూంటే వేయిమంది రావణులైనా నన్ను ప్రతిఘటించలేరు.

10

రాక్షసులందరూ కళ్ళు తెరచుకుని చూస్తూండగానే నేను ఈ లంకానగరాన్ని అతలాకుతలం చేసి, సీతాదేవికి ప్రణమిల్లి, వచ్చిన పనిలో కృతకృత్యుడనై నిరాటంకంగా తిరిగి వెళతాను.

11

వానర సేనానియైన హనుమంతుడు చైత్యప్రాసాదం మీద నిలబడి పై విధంగా జయఘోషలు చేసిన పిదప రాక్షసులు భయంతో వణకిపోయేటట్లు భీకరంగా సింహనాదం చేశాడు.

12

ఆ భీకర నాదం విని మహాకాయులైన నూరుమంది చైత్య రక్షకులు వెలుపలకు వచ్చారు. వారు హనుమంతుని చుట్టుముట్టి రకరకాల అస్త్రాలతో, ఈటెలతో, ఖడ్గాలతో, గండ్రగొడ్డళ్ళతో అతణ్ణి ఎదుర్కొన్నారు.

13

ఆ చైత్యరక్షకులు నానారకాల గదలను, బంగారు పిడులుగల ఇనుప గుదియలను, సూర్యకిరణాలవంటి తీక్ష్ణములైన బాణాలను ఆ వానర శ్రేష్ఠుడైన హనుమంతునిపై ప్రయోగించారు.

14

ఆవర్త ఇవ గఙ్గాయాస్తోయస్య విపులో మహాన్,
పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః.

15

తతో వాతాత్మజః క్రుద్ధో భీమం రూపం సమాస్థితః.

16

ప్రాసాదస్య మహాంస్తస్య స్తమ్భం హేమపరిష్కృతమ్,
ఉత్పాటయిత్వా వేగేన హనుమాన్ పవనాత్మజః.

17

తతస్తం భ్రామయామాస శతధారం మహాబలః,
తత్ర చాగ్నిః సమభవత్ప్రాసాదశ్చాప్య దహ్యత.

18

దహ్యమానం తతో దృష్ట్వా ప్రాసాదం హరియూథపః,
స రాక్షసశతం హత్వా వజ్రేణేన్ద్ర ఇవాసురాన్,
అన్తరిక్షే స్థితః శ్రీమానిదం వచనమబ్రవీత్.

19

మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్.

20

బలినాం వానరేన్ద్రాణాం సుగ్రీవవశవర్తినామ్,
అటన్తి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః.

21

గంగానదిలో ఏర్పడే విస్తృతమైన సుడిగుండం మళ్లే ఆ రాక్షస గణం వానరశ్రేష్ఠుడైన హనుమంతుని చుట్టుముట్టింది.

15

దాంతో హనుమంతుడు ఆగ్రహోదగ్రుడై భయానక రూపం దాల్చి, స్వర్ణాలంకృతమైన చైత్యప్రాసాద మూలస్తంభాన్ని సమూలంగా పెకలించాడు. పిదప మహాశక్తిమంతుడైన హనుమంతుడు నూరు అంచులు గల ఆ మహాస్తంభాన్ని వేగంగా గిరగిరా తిప్పసాగాడు. దాని రాపిడికి అగ్ని వెలువడి, ఆ ప్రాసాదాన్ని దహించివేయసాగింది.

16–18

ఆ చైత్యప్రాసాదం దగ్ధమవుతూండడం చూసి హనుమంతుడు ఆ స్తంభాన్ని మరింత వేగంగా తిప్పుతూ, ఇంద్రుడు వజ్రాయుధంతో అసురులను వధించినట్లు, ఆ వందమంది చైత్యరక్షకులైన రాక్షసులను హతమార్చాడు. ఆ తరువాత ఎగిరి ఆకాశంలో నిలబడి అందరికీ వినిపించేలా బిగ్గరగా ఇలా ప్రకటన చేశాడు.

19

వానరరాజైన సుగ్రీవుని ఆజ్ఞలను శిరసావహించే నా వంటి అమిత బలసంపన్నులు, మహాత్ములు అయిన వానరశ్రేష్ఠులు వేలాదిమంది ఈ భూమండలమంతా సంచరిస్తున్నారు.

20–21

దశనాగబలాః కేచిత్ కేచిద్దశగుణోత్తరాః,
కేచిన్నాగసహస్రస్య బభూవుస్తుల్యవిక్రమాః.

22

సన్తి చౌఘబలాః కేచిత్ కేచిద్వాయుబలోపమాః,
అప్రమేయబలాశ్చాన్యే తత్రాసన్ హరియూథపాః.

23

ఈదృగ్విధైస్తు హరిభిర్వృతో దన్తనఖాయుధైః,
శతైః శతసహస్రైశ్చ కోటీభిరయుతైరపి,
ఆగమిష్యతి సుగ్రీవః సర్వేషాం వో నిషూదనః.

24

నేయమస్తి పురీ లఙ్కా న యూయం న చ రావణః,
యస్మాదిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా.

25

ఆ వానరులలో కొందరు పది ఏనుగుల బలం సంతరించుకున్న వారు. మరికొందరు వంద ఏనుగుల బలసంపన్నులు. ఇంకా కొందరికి వెయ్యి ఏనుగుల బలం ఉంది.

22

ఆ వానరవీరులలో కొందరికి ఉద్ధృతమైన వరదలతో ప్రవహించే నదీప్రవాహానికి ఉన్నంత బలం ఉంది. వారిలో కొందరు వాయువేగ బలసంపన్నులు. ఇక కొందరు వానర సేనానాయకుల బలసంపత్తి అనూహ్యం.

23

దంతాలను, గోళ్ళను ఆయుధాలుగా చేసుకొన్న ఇటువంటి వందల, లక్షల, కోట్ల సంఖ్యలోని వానరయోధులను వెంటబెట్టుకొని సుగ్రీవుడు మీ

యావన్మందినీ అంతమొందించడానికి ఇక్కడకు రానున్నాడు.

24

మీరు మహాత్ముడూ, ఇక్ష్వాకువంశ ప్రభుమా అయిన రామునితో విరోధం తెచ్చుకున్నారు. ఆ కారణ ఫలితంగా ఇక ఈ లంకానగరం నామరూపాలతో ఉండదు. మీరు ఉండరు, రావణుడు కూడా మిగిలి ఉండడు.

25

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 43వ సర్గ

సమాప్తం

44వ సర్గ

జంబుమాలి సంహారం

సందిష్టో రాక్షసేన్ద్రేణ ప్రహస్తస్య సుతో బలీ,
జమ్బుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః.

1

రక్తమాల్యామ్బరధరః ప్రగ్వీ రుచిరకుణ్డలః,
మహాన్వివృత్తనయనశ్చణ్డః సమరదుర్జయః.

2

ధనుః శక్రధనుఃప్రఖ్యం మహద్రుచిరసాయకమ్,
విస్ఫారయానో వేగేన వజ్రాశనిసమస్వసనమ్.

3

రాక్షసరాజైన రావణుని ఆదేశాన్ని శిరసావహిస్తూ పెద్దపెద్ద కోరలు గలవాడూ, ప్రహస్తుని కుమారుడూ, మహాబలపరాక్రమవంతుడూ అయిన జంబుమాలి ధనుస్సు చేతపుచ్చుకొని యుద్ధానికి బయలుదేరాడు.

1

యుద్ధంలో జయింప శక్యం కానివాడైన ఆ జంబుమాలి ఎర్రని పువ్వుల మాలలు, వస్త్రాలు ధరించి ఉన్నాడు. అంతేకాక అతడు చెవులకు అందమైన కుండలాలు, మెడయందు హారాలు కూడా అలంకరించుకొని ఉన్నాడు. మహాకాయుడైన అతడు కోపంతో కళ్ళు గిరగిర తిప్పుతున్నాడు.

2

ఆ జంబుమాలి శక్తిమంతమైన బాణాలను ప్రయోగించగల ఇంద్రధనుస్సును పోలిన పెద్ద ధనుస్సుతో వజ్రాయుధం మల్లే, పిడుగుపాటుతో సమానమైన భయంకర ధనుష్టంకారాలు చేస్తూ హడావుడిగా యుద్ధానికి వెళ్ళాడు.

3

తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః,
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత.

4

రథేన ఖరయుక్తేన తమాగతముదీక్ష్య సః,
హనుమాన్వేగసంపన్నో జహర్ష చ ననాద చ.

5

తం తోరణవిటజ్కస్థం హనుమన్తం మహాకపిమ్,
జమ్బుమాలీ మహాబాహుర్విన్యాధ నిశితైః శరైః.

6

అర్ధచన్ద్రేణ వదనే శిరస్యేకేన కర్ణినా,
బాహ్వోర్విన్యాధ నారాచైర్ధశభిస్తం కపీశ్వరమ్.

7

తస్య తచ్ఛుభే తామ్రం శరేణాభిహతం ముఖమ్,
శరదీవామ్బుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా.

8

ఆ ధనుష్టంకార భీషణ ధ్వనులు తక్షణమే దిక్కులనూ, విదిక్కులనూ, ఆకాశాన్నీ నింపివేశాయి.

4

గాడిదలు పూన్చిన రథం మీద ఆ జంబుమాలి రావడం చూసి, సంతోషాతిశయంతో హనుమంతుడు సింహనాదం చేశాడు.

5

ఆ సింహనాదానికి ప్రతిస్పందనగా మహాబాహువులు గల ఆ జంబుమాలి అశోకవన సింహద్వారం మీద నిలబడి ఉన్న హనుమంతునిపై వాడియైన బాణాలను ప్రయోగించాడు.

6

హనుమంతుని ముఖమండలం మీద ఒక అర్ధచంద్రాకార బాణాన్ని, శిరస్సుపై ఒక కర్ణి (వంకరములికి) బాణాన్ని, బాహువుల మీద పది నారాచ (ఇనుప) బాణాలను జంబుమాలి ప్రయోగించి, బాధించాడు.

7

జంబుమాలి బాణ ప్రయోగానికి గురైన ఆ కపివరేణ్యుని ఎర్రని ముఖం శరత్కాల సూర్యకిరణ ప్రసరణచే చక్కగా వికసించిన ఎర్రతామర మల్లే భాసించింది.

8

తత్తస్య రక్తం రక్తేన రఞ్జితం శుశుభే ముఖమ్,
యథాకాశే మహాపద్మం సిక్తం చన్దనబిన్దుభిః.

9

చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః,
తతః పార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్.

10

తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవద్బలీ,

తాం శరైర్దశభిః క్రుద్ధస్తాడయామాస రాక్షసః.

11

విపన్నం కర్మ తద్దృష్ట్వా హనుమాంశ్చణ్డవిక్రమః,
సాలం విపులముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్.

12

భ్రామయన్తం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలమ్,
చిక్షేప సుబహూన్ బాణాన్ జమ్బుమాలీ మహాబలః.

13

అసలే ఎర్రగా ఉన్న హనుమంతుని ముఖారవిందం బాణం చేసిన గాయంతో రక్తరంజితమై ఆకాశాన రక్తచందన బిందువులు పడ్డ మహాపద్మంలా శోభిల్లింది.

9

జంబుమాలి బాణాఘాతంచే గాయపడిన హనుమంతుడు కోపోద్రిక్తుడయ్యాడు. అటూ ఇటూ చూడగా ప్రక్కనే ఉన్న అతిపెద్ద బండరాయి ఒకటి కనిపించింది.

10

అంతే, ఆ పెద్దబండరాయిని హనుమంతుడు అవలీలగా పెకలించి ఆ రాక్షసుడి పైకి బలంకొద్దీ రువ్వాడు. దాంతో కుపితుడైన ఆ జంబుమాలి పది బాణాలు ప్రయోగించి ఆ బండరాయిని ఛిన్నాభిన్నం చేశాడు.

11

తన ప్రయత్నం వమ్మవడం చూసి మహాబలపరాక్రమాలు గల ఆ హనుమంతుడు ఒక పెద్ద మద్దిచెట్టును అనాయాసంగా పెకలించి, దానిని గిరగిరా త్రిప్పసాగాడు.

12

అలా మహాబలవంతుడైన హనుమంతుడు సాలవృక్షాన్ని త్రిప్పుతూండడం చూసిన మహా పరాక్రమవంతుడైన ఆ జంబుమాలి అందుకు ప్రతిస్పందిస్తూ ఆతడిపై అనేక బాణాలు ప్రయోగించాడు.

13

సాలం చతుర్భిశ్చిచ్ఛేద వానరం పఞ్చభిర్భుజే,
ఉరస్యేకేన బాణేన దశభిస్తు స్తనాంతరే.

14

స శరైః పూరితతనుః క్రోధేన మహతా వృతః,
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగతః.

15

అతివేగోఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః,
పరిఘం పాతయామాస జమ్బుమాలేర్మహోరసి.

16

తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ,
న ధనుర్న రథో నాశ్వాస్తత్రాదృశ్యన్త నేషవః.

17

స హతస్తరసా తేన జమ్బుమాలీ మహాబలః,
పపాత నిహతో భూమౌ చూర్ణితాఙ్గవిభూషణః.

18

ఆ రాక్షసుడు నాలుగు బాణాలు ప్రయోగించి ఆ సాలవృక్షాన్ని ఛేదించాడు; ఐదు బాణాలను హనుమంతుని భుజాలపై, ఒక బాణాన్ని రొమ్ముపై, పది బాణాలను వక్షస్థలంపై ప్రయోగించి బాధించాడు.

14

శరీరమంతా బాణాలు గుచ్చుకొని గాయాలవడంతో ఆగ్రహోదగ్రుడైన ఆ హనుమంతుడు, కింకరులను వధించిన అదే పరిఘను పుచ్చుకొని చండప్రచండంగా తిప్పసాగాడు.

15

సాటిలేని బలపరాక్రమాలు గల ఆ హనుమంతుడు కోపోద్రేకంతో ఆ పరిఘను మహావేగంతో తిప్పి గురిచూసి జంబుమాలి విశాలమైన వక్షస్థలం మీద సూటిగా దానిని విసిరాడు.

16

ఆ పరిఘ వేగ ఘాటికి జంబుమాలి తల, బాహువులు, మోకాళ్ళు, ధనుర్బాణాలు, రథం, రథానికి పూన్చిన గాడిదలు నామరూపాలు లేకుండా ఒకే పెద్ద ముద్దగా అయిపోయాయి.

17

ఆ విధంగా హనుమంతుని పరిఘ ఘాతానికి అవయవాలు, ధరించిన భూషణాలు నుగ్గునుగ్గై మహాబలవంతుడైన జంబుమాలి నేలకొరిగాడు.

18

జమ్బుమాలిం చ నిహంత కింకరాంశ్చ మహాబలాన్,
చుక్రోధ రావణః శ్రుత్వా కోపసంరక్తలోచనః.

19

స రోష సంవర్తితతామ్రలోచనః
ప్రహస్తపుత్రే నిహతే మహాబలే,
అమాత్యపుత్రానతివీర్యవిక్రమాన్
సమాదిదేశాశు నిశాచరేశ్వరః.

20

ఇంతకుక్రితం మహాపరాక్రమవంతులైన కింకరులు హతమవడమూ,

ఇప్పుడు సాటిలేని బలపరాక్రమాలుగల జంబుమాలి నేలకొరగడమూ తెలిసి రావణుని కళ్ళు కోపోద్రేకంతో ఎర్రబడ్డాయి.

19

ప్రహస్తుని కుమారుడూ, సాటిలేని పరాక్రమవంతుడూ అయిన జంబుమాలి నేలకొరగడంతో రావణుడు రోషంతో గ్రుడ్లురుముతూ విశేష బలపరాక్రమ సంపన్నులూ, మంత్రుల పుత్రులూ అయిన మహావీరులను వెంటనే యుద్ధానికి వెళ్ళమని ఆదేశించాడు.

20

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 44వ సర్గ

సమాప్తం

45వ సర్గ

మంత్రుల ఏడుగురు పుత్రుల వధ

తతస్తే రాక్షసేన్ద్రేణ చోదితా మన్త్రిణః సుతాః,
నిర్యయుర్భవనాత్తస్మాత్సప్త సప్తార్చివర్చసః.

1

మహాబలపరీవారా ధనుష్మన్తో మహాబలాః,
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః.

2

హేమజాల పరిక్షిప్తైర్ధ్వజవద్భిః పతాకిభిః,
తోయదస్వననిర్ఘోషై ర్వాజియుక్తైర్మహారథైః.

3

రావణుని ఆదేశాన్ని శిరసావహిస్తూ అగ్నికి దీటైన తేజస్సుతో విరాజిల్లుతున్న మంత్రుల కుమారులైన ఆ ఏడుగురు యోధులు రాజభవనం నుండి బయలుదేరారు.

1

ఆ మంత్రుల కుమారులు అత్యంత బలసంపన్నులు, అస్త్ర విద్యాపారంగతులు, అస్త్రవేత్తలలో సర్వశ్రేష్ఠులు. శత్రువును జయించాలనే సమధికోత్సాహంతో వారు ఉబలాటం చెందుతున్నారు. వారి వెంట పెద్ద సేనకూడా బయలుదేరింది.

2

జాతి గుర్రాలు పూన్చిన వారి మహారథాల చుట్టూ బంగారు జాలీలు కట్టబడి ఉన్నాయి. మహాయోధుల చిహ్నాలుగా విరాజిల్లే ధ్వజాలు, అలంకార యుతమైన పతాకాలు ఆ రథాల మీద ఎగురుతున్నాయి. వారి రథాలు కదలుతున్నప్పుడు మేఘధ్వనులను పోలిన రణధ్వనులు చేస్తున్నాయి.

3

తప్తకాఞ్చనచిత్రాణి చాపాన్యమితవిక్రమాః,
విస్ఫారయన్తః సంహృష్టాస్తటిత్వన్త ఇవామ్బుదాః.

4

జనన్యస్తు తతస్తేషాం విదిత్వా కింకరాన్ హతాన్,
బభూవుః శోకసంభ్రాన్తాః సబాన్ధవసుహృజ్జనాః.

5

తే పరస్పరసంఘర్షాత్తప్తకాఞ్చన భూషణాః,
అభిపేతుర్ఘనూమన్తం తోరణస్థమవస్థితమ్.

6

సృజన్తో బాణవృష్టిం తే రథగర్జితనిస్స్వనాః,
వృష్టిమన్త ఇవామ్భోదా విచేరుర్వైరృతామ్బుదాః.

7

అవకీర్ణస్తతస్తాభిర్ఘనుమాన్ శరవృష్టిభిః,
అభవత్ సంవృతాకారః శైలరాడివ వృష్టిభిః.

8

అమిత పరాక్రమవంతులైన ఆ మంత్రుల కుమారులు మేలిమి బంగారంతో అలంకరించిన ధనుస్సులను టంకారం చేస్తూ, మెరపులతో

కూడుకొన్న మేఘాలమల్లే భాసిస్తూ, సమధికోత్సాహులై ఉన్నారు.

4

ఎనభైవేలమంది కింకరులను ఒంటిచేత్తో అవలీలగా వధించిన ఆ వానరునితో తలపడడానికి తమ కుమారులు వెళుతున్నారని తెలిసి ఆ మంత్రుల పుత్రుల తల్లులు, బంధువులు, మిత్రులు దుఃఖంలో మునిగిపోయారు.

5

మేలిమి బంగారు భూషణాలు ధరించిన ఆ మంత్రుల పుత్రులు ఏడుగురూ, వన సింహద్వారం మీద యుద్ధసన్నద్ధుడై ఉన్న హనుమంతుని మీదికి పరస్పరం పోటీపడుతూ దూసుకువెళ్ళారు.

6

వర్షాకాల కారుమేఘాలవంటి ఆ రాక్షస కుమారులు తమ రథాల కదలికతో ఒక వంక ఉరుములు పోలిన ధ్వనులను కల్పిస్తూ, మరోవంక తమ ధనుస్సుల నుండి బాణవర్షం కురిపిస్తూ వర్షిస్తూన్న మేఘాల చందాన విరాజిల్లుతూ సంచరించారు.

7

వారి బాణవృష్టిచే ఆవృతమైన హనుమంతుడు వర్షపాత జలాలచే కప్పివేయబడిన పర్వతరాజంలా అప్పుడు కానవచ్చాడు.

8

స శరాన్ మోఘయామాస తేషామాశుచరః కపిః,
రథవేగం చ వీరాణాం విచరన్ విమలేఽమ్బరే.

9

స తైః క్రీడన్ధనుష్మద్భిర్వ్యోమ్ని వీరః ప్రకాశతే,
ధనుష్మద్భిర్యథా మేఘైర్మారుతః ప్రభురమ్బరే.

10

స కృత్వా నినదం ఘోరం త్రాసయస్తాం మహాచమూమ్,
చకార హనుమాన్ వేగం తేషు రక్షస్సు వీర్యవాన్.

11

తలేనాభ్యహనత్ కాంశ్చిత్ పాదైః కాంశ్చిత్ పరన్తపః,
ముష్టినాఽభ్యహనత్ కాంశ్చిన్నఖైః కాంశ్చిద్వ్యదారయత్.

12

ప్రమమాథోరసా కాంశ్చిదూరుభ్యామపరాన్ కపిః,
కేచిత్తస్య నినాదేన తత్రైవ పతితా భువి.

13

ప్రచండ వేగంతో సంచరించే శక్తిగల హనుమంతుడు ఆ రాక్షసులు ప్రయోగించిన శరపరంపర దాడిని, వారి రథాల వేగ ఉద్ధృతిని నిర్వీర్యంచేస్తూ నిర్మలమైన ఆకాశంలో తిరుగాడాడు.

9

ధనుర్ధారులైన ఆ మంత్రుల కుమారులతో అంతరిక్షంలో క్రీడిస్తూన్న హనుమంతుడు, ఇంద్రధనుస్సులతో శోభితమైన మేఘాలచే విలసిల్లుతున్న వాయుదేవునిలా భాసించాడు.

10

సాటిలేని పరాక్రమవంతుడైన హనుమంతుడు ఆ రాక్షససేనకు వణకుపుట్టే రీతిలో సింహనాదం చేసి, వారిపై తన అపరిమిత బలాన్ని ప్రదర్శించ నారంభించాడు.

11

శత్రువులకు సింహస్వప్నమైన ఆ హనుమంతుడు అప్పుడు కొందరిని

అరచేతులతో చరచి చంపాడు, మరికొందరిని పాదాలతో తొక్కి మట్టిగరిపించాడు, ఇంకా కొందరిని పిడిగుద్దులతోనూ, గోళ్ళతో చీల్చిచండాడి సంహరించాడు.

12

ఆ రాక్షసయోధులలో కొందరిని హనుమంతుడు తన రొమ్ము తాకిడిచే, కొందరిని తన తొడల మధ్య మథించి వధించాడు. మరికొందరు ఆ హనుమంతుని సింహనాదాలకే గుండె పగిలి నేలకూలారు.

13

తతస్తేష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ,
తత్సైన్యమగమత్సర్వం దిశో దశ భయార్దితమ్.

14

వినేదుర్విస్వరం నాగా నిపేతుర్భువి వాజినః,
భగ్ననీడధ్వజచ్ఛత్రైర్భూశ్చ కీర్ణాభవద్రథైః.

15

స్రవతా రుధిరేణాథ స్రవన్త్యో దర్శితాః పథి,
వివిధైశ్చ స్వరైర్నద్యా ననాద వికృతం తదా.

16

స తాన్ ప్రవృద్ధాన్వినిహత్య రాక్షసాన్
మహాబలశ్చణ్డపరాక్రమః కపిః,
యుయుత్సురన్యైః పునరేవ రాక్షసై
స్తమేవ వీరోఽభిజగామ తోరణమ్.

17

మంత్రుల పుత్రులతో సహా ఆ సైన్యంలోని అనేకానేకులను హనుమంతుడు బీభత్సంగా వధించడం చూసి, మిగిలిన వారు హాహాకారాలు

చేస్తూ భయంతో దశదిశలకూ పరుగులెత్తారు.

14

ఏనుగులు వికృతంగా ఘీంకరించాయి, గుర్రాలు నేలకొరిగాయి. రథాల పైకప్పులు, ధ్వజాలు, ఛత్రాలు నుగ్గునుగ్గై, చెల్లాచెదరుగా పడి ఆ ప్రదేశం బీభత్సంగా తయారయింది.

15

అప్పుడు అశోకవన ముఖద్వారానికి దారి తీసే మార్గాలన్నింటా రక్తం ఏరులు కట్టి ప్రవహించింది. లంకానగరం నానావిధాలైన వికార ధ్వనులతో మార్మోగింది.

16

అమేయ బలసంపన్నుడూ, సాటిలేని పరాక్రమశాలీ అయిన ఆ హనుమంతుడు వీరాగ్రేసరులైన ఆ రాక్షసులను బీభత్సంగొల్పే రీతిలో మట్టుబెట్టి, ఇంకా రాబోయే రాక్షసవీరులతో యుద్ధంచేయాలనే సమధికోత్సాహంతో మళ్ళీ ఆ అశోకవన ముఖద్వారం మీదకు వెళ్ళి ఠీవిగా నిలబడ్డాడు.

17

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 45వ సర్గ

సమాప్తం

46వ సర్గ
ఐదుగురు ప్రధాన సేనాపతుల సంహారం

హతాన్ మన్త్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా,
రావణః సంవృతాకారశ్చకార మతిముత్తమామ్.

1

స విరూపాక్షయూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసమ్,
ప్రఘసం భాసకర్ణం చ పఞ్చ సేనాగ్రనాయకాన్.

2

సందిదేశ దశగ్రీవో వీరాన్నయవిశారదాన్,
హనుమద్గ్రహణే వ్యగ్రాన్ వాయువేగసమాన్ యుధి.

3

అత్యంత పరాక్రమవంతుడైన ఆ వానరుని చేతుల్లో మంత్రుల కుమారులు ఏడుగురూ మరణించారనే వార్త తెలిసి రావణుడు తన మనస్సులో కలిగిన విచారాన్నీ, దిగులునూ వెలుపలకు వ్యక్తంచెయ్యకుండా సందర్భోచితంగా ఇలా తీర్మానించాడు.

1

విరూపాక్షుడు, యుపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అనే ఐదుగురూ రావణుని ప్రధాన సేనానాయకులు. వారు మహావీరులు

రణనీతికోవిదులు, వాయువేగంతో యుద్ధం చేయగలవారు; పైపెచ్చు హనుమంతుని బంధించడానికి సమధికోత్సాహులై ఉన్నవారు. వారిని రావణుడు ఇలా ఆదేశించాడు.

2–3

యాత సేనాగ్రగాః సర్వే మహాబలపరిగ్రహాః,
సవాజిరథమాతఙ్గాః స కపిః శాస్యతామితి.

4

యత్తైశ్చ ఖలు భావ్యం స్యాత్తమాసాద్య వనాలయమ్,
కర్మ చాపి సమాధేయం దేశకాలవిరోధినమ్.

5

న హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్,
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్.

6

భవేదిన్ద్రేణ వా సృష్టమస్మదర్థం తపోబలాత్,
సనాగయక్షగన్ధర్వా దేవాసురమహర్షయః.

7

యుష్మాభిః సహితైః సర్వైర్మయా సహ వినిర్జితాః,
తైరవశ్యం విధాతవ్యం వ్యళీకం కించిదేవ నః.

8

సేనానాయకులారా! చతురంగ బలాలతో కూడిన సైన్యాన్ని వెంటబెట్టుకొని వెళ్ళండి. ఆ వానరుణ్ణి తగిన రీతిలో శిక్షించి రండి.

4

మీరు ఆ వానరుని విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

దేశకాలపరిస్థితులకు అనుగుణమైన చర్యలు చేపట్టండి.

5

ఇప్పటి వరకు అతడు చేసిన అఘాయిత్యాలను పరికిస్తే అతణ్ణి ఒక సామాన్య వానరునిగా నేను పరిగణించడం లేదు. చూడబోతే ఏదో అపరిమిత బలపరాక్రమాలు సంతరించుకున్న ఏదో మహాప్రాణిగా కానవస్తున్నాడు.

6

మనలను ప్రతిఘటించడానికి ఆ ఇంద్రుడే తన తపోబలంచే ఈ మహాప్రాణిని సృష్టించి ఉండవచ్చు. గతంలో మీ తోడ్పాటుతో దేవతలనూ, అసురులనూ, నాగులనూ, యక్షులనూ, గంధర్వులనూ, మహర్షులనూ నేను జయించాను కదా! కనుక వారే బహుశా ఇప్పుడు మనకు ఈ ఉపద్రవం కల్పించి ఉండవచ్చు.

7–8

తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్,
నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీరపరాక్రమః.

9

దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః,
వాలీ చ సహసుగ్రీవో జామ్బవాంశ్చ మహాబలః.

10

నీలః సేనాపతిశ్చైవ యే చాన్యే ద్వివిదాదయః,
నైవం తేషాం గతిర్భీమా న తేజో న పరాక్రమః.

11

న మతిర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్,
మహత్ సత్త్వమిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్.

12

ప్రయత్నం మహదాస్థాయ క్రియతామస్య నిగ్రహః,
కామం లోకాస్త్రయః సేన్ద్రాః ససురాసురమానవాః.

13

భవతామగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే,
తథాపి తు నయజ్ఞేన జయమాకాంక్షతా రణే,
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చఞ్చలా.

14

కనుక ఆ వానరుడు ఇంద్రుడు సృష్టించి పంపిన మహాప్రాణియే అనడంలో ఇసుమంతైనా సందేహంలేదు. అతగాణ్ణి బలప్రయోగంతోనైనా సరే పట్టుకుని బంధించండి. మహాపరాక్రమవంతుడుగా కానవస్తున్న ఆ వానరుని విషయంలో మీరు చిన్నచూపుతో మెలగకండి.

9

అమిత బలపరాక్రమసంపన్నులైన వాలి, సుగ్రీవుడు, మహాబలుడైన జాంబవంతుడు, సేనాపతియైన నీలుడు, ద్వివిదుడు మొదలైన వానరశ్రేష్ఠులను నేను పూర్వం స్వయంగా చూశాను. కాని వారెవరిలోనూ ఇంతటి వేగం, ఇంతటి తేజస్సు, పరాక్రమం, తెలివి, ఉత్సాహం, కోరినట్లు శరీర ప్రమాణాన్ని పెంచే శక్తిగాని లేవు. కాబట్టి ఇతణ్ణి వానరరూపంలో ఉన్న ఒక మహాప్రాణిగానే పరిగణించాలి.

10–12

కనుక గట్టి ప్రయత్నంతోనే ఇతణ్ణి అదుపులోకి తెచ్చుకోవాలి. ఈ ముల్లోకాలలో ఇంద్రునితో సహా సురలు, అసురులు, మానవులు ఎవరూ రణరంగంలో మీ ముందు నిలబడలేరనే విషయం యథార్థం. ఏది ఏమైనప్పటికీ యుద్ధంలో జయాన్ని ఆశించే రణనీతికోవిదుడు ప్రయత్న లోపం లేకుండా ఆత్మరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే

యుద్ధంలో జయం ఎప్పుడూ మనలనే వరిస్తుందని భావించడం పొరపాటు.

13–14

తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః,
సముత్పేతుర్మహావేగా హుతాశ సమతేజసః.

15

రథైర్మత్తైశ్చ మాతఙ్గైర్వాజిభిశ్చ మహాజవైః,
శస్త్రైశ్చ వివిధై స్తీక్ష్ణైః సర్వైశ్చోపచితా బలైః.

16

తతస్తం దదృశుర్వీరా దీప్యమానం మహాకపిమ్,
రశ్మిమన్తమివోద్యన్తం స్వతేజోరశ్మిమాలినమ్.

17

తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్,
మహామతిం మహావేగం మహాకాయం మహాబలమ్.

18

ఆ ఐదుగురు సేనాపతులు మహాబలపరాక్రమవంతులు, అగ్నితో సమానమైన తేజస్సంపన్నులు. వారు తమ ప్రభువు ఆదేశాన్ని శిరసావహిస్తూ రథాలు, మదగజాలు, వాయువేగం గల అశ్వాలు, తీక్షణాలైన వివిధ శస్త్రాస్త్రాలతో కూడిన సైన్యంతో మహావేగంగా హనుమంతుని ప్రతిఘటించడానికి బయలుదేరారు.

15–16

ఆ సమయంలో గొప్ప శక్త్యుత్సాహాలు గలవాడు, మహాబలపరాక్రమ సంపన్నుడు, సాటిలేని వేగంగలవాడు, బుద్ధిశాలీ, మహాకాయాన్ని సంతరించుకొన్న వాడు అయిన హనుమంతుడు అశోకవన సింహద్వారం మీద నిలబడి ఉన్నాడు. తేజోవిరాజమానుడైన ఆతడు ఉదయిస్తున్న

సూర్యునిలా వెలుగొందుతున్నాడు. అటువంటి హనుమంతుని రాక్షస సేనాపతులు చూశారు.

17–18

తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వాస్వవస్థితాః,
తై స్తైః ప్రహరణైర్భీమైరభిపేతుస్తతస్తతః.

19

తస్య పఞ్చాయసా స్తీక్ష్ణాః శితాః పీతముఖాః శరాః,
శిరస్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః.

20

స తైః పఞ్చభిరావిద్ధః శరైః శిరసి వానరః,
ఉత్పపాత నదన్ వ్యోమ్ని దిశో దశ వినాదయన్.

21

తతస్తు దుర్ధరో వీరః సరథః సజ్యకార్ముకః,
కిరన్ శరశతైస్తీక్ష్ణైరభిపేదే మహాబలః.

22

స కపిర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్,
వృష్టిమన్తం పయోదాన్తే పయోదమివ మారుతః.

23

అలా హనుమంతుణ్ణి చూడగానే ఆ రాక్షస సేనాపతులు ఐదుగురూ నాలుగు వైపుల నుండి చుట్టుముట్టి భయంకరాలైన వివిధాయుధాలతో హనుమంతునిపై దాడిచేశారు.

19

ముందుగా దుర్ధరుడు వాడియైన, తీక్ష్ణమైన, నల్లని కలువరేకులను

పోలిన రంగులోని, అగ్రభాగాన పచ్చగా ఉన్న ఐదు ఇనుప బాణాలను గురి చూసి హనుమంతుని తలపై ప్రయోగించాడు.

20

దుర్ధరుడు ప్రయోగించిన ఆ ఐదు బాణాలు తన శిరస్సును తాకగానే హనుమంతుడు దశదిశలూ మార్మోగేటట్లు సింహనాదం చేస్తూ ఆకాశంలోకి ఎగిరాడు.

21

అది చూసి మహావీరుడూ, పరాక్రమవంతుడూ అయిన దుర్ధరుడు తను కూడా రథంతో సహా ఆకాశంలోకి ఎగిరాడు. అక్కడనుండే విల్లును ఎక్కుపెట్టి ఎడతెరపి లేకుండా హనుమంతుని మీద శరవర్షం కురిపించాడు.

22

శరత్కాల ప్రారంభంలో వర్షించే మేఘాన్ని వాయువు అడ్డగించిన రీతిలో తనపై దుర్ధరుడు ప్రయోగిస్తున్న శరపరంపరలను ఆకాశంలోనే హనుమంతుడు అడ్డగించి వాటిని చెల్లాచెదరు గావించాడు.

23

అర్ద్యమానస్తతస్తేన దుర్ధరేణానిలాత్మజః,
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్.

24

స దూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః,
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ.

25

తతః స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్,
విహాయ న్యపతద్భూమౌ దుర్ధరస్త్యక్తజీవితః.

26

తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి,
సంజాతరోషౌ దుర్ధర్షావుత్పేతతురరిన్దమౌ.

27

స తాభ్యాం సహసోత్పత్య విష్ఠతో విమలేఽమ్బరే,
ముద్గరాభ్యాం మహాబాహుర్వక్షస్యభిహతః కపిః.

28

బాణవర్షంతో దుర్ధరుడు ప్రచండంగా తనను ప్రతిఘటిస్తూండగా వాయునందనుడైన ఆ హనుమంతుడు ఒక వంక అతడితో పోరాడుతూనే మరోవంక మళ్ళీ తన శరీర పరిమాణాన్ని మరింతగా పెంచాడు.

24

అలా శరీరాన్ని పెంచిన ఆ వానరోత్తముడు ఆకాశంలో మరింత ఎత్తుకు ఎగిరి ఊహించని వేగంతో, పర్వతం మీద పిడుగుపడ్డట్లు హఠాత్తుగా దుర్ధరుని రథం మీద దభీమని పడ్డాడు.

25

హనుమంతుని వేగగతి తాకిడికి దుర్ధరుని రథపు ఇరుసు, నొగలు విరిగిపోయాయి. రథానికి పూన్చిన ఎనిమిది గుర్రాలు నలిగి ఒక ముద్దగా అయిపోయాయి. కళ్ళుమూసి తెరిచేలోగా దుర్ధరుడు రథం నుండి క్రిందపడి విగతజీవుడయ్యాడు.

26

ఆ విధంగా దుర్ధరుడు నేలకూలడం చూసి ఎదిరింప శక్యంకాని వారు, శత్రువులను రూపమాపగల వారు అయిన విరూపాక్ష యూపాక్షులిద్దరూ పట్టరాని కోపంతో హనుమంతుని పైకి ఉరికారు.

27

అలా వేగంగా ఆకాశంలోకి ఎగిరిన ఆ రాక్షస సేనానులిద్దరూ,

నిర్మలమైన ఆకాశంలో నిలబడి ఉన్న మహాబాహువైన హనుమంతుని వక్షస్థలంపై ముద్గరాలతో మోదారు.

28

తయోర్వేగవతోర్వేగం వినిహత్య మహాబలః,
నిపపాత పునర్భూమౌ సుపర్ణసమవిక్రమః.

29

స సాలవృక్షమాసాద్య తముత్పాట్య చ వానరః,
తావుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః.

30

తతస్తాంస్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా,
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్.

31

భాసకర్ణశ్చ సంక్రుద్ధః శూలమాదాయ వీర్యవాన్,
ఏకతః కపిశార్దూలం యశస్వినమవస్థితమ్.

32

పట్టిసేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్,
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమమ్.

33

అపరిమిత బలశాలి, గరుత్మంతునికి దీటైన పరాక్రమం గలవాడు అయిన హనుమంతుడు కోపోద్రేకంలో ఉన్న ఆ రాక్షసయోధుల ఉద్ధృతిని నిరోధించి మళ్ళీ రివ్వున నేలపై దిగాడు.

29

దిగుతూ ఉండగానే దాపులనున్న ఒక సాలవృక్షాన్ని కూకటివేళ్ళతో

సహా అలవోకగా పెకలించి, దాంతో హనుమంతుడు ఆ ఇద్దరు రాక్షసవీరులను ఎడాపెడా బాది హతమార్చాడు.

30

అమిత బలసంపన్నుడైన హనుమంతుడు ఆ ముగ్గురు రాక్షస సేనాపతులనూ బీభత్సంగా వధించడం చూసి ప్రఘసుడు కోపోద్రిక్తుడై ముందుకు ఉరికి ఆ వానరేంద్రుణ్ణి ప్రచండంగా ఎదుర్కొన్నాడు.

31

అదేసమయంలో పరాక్రమవంతుడైన భాసకర్ణుడు కూడా కోపోద్రేకంతో ఒక శూలాన్ని చేతబట్టి మరో వైపునుండి మహాబలసంపన్నుడుగా ఖ్యాతిగాంచిన హనుమంతునిపై దాడికి దిగాడు.

32

ప్రఘసుడు బాగా పదునుతేలిన పట్టిసంతోను (అడ్డకత్తి), భాసకర్ణుడు మొనదేలిన శూలంతోను హనుమంతుణ్ణి ఎదుర్కొని, గాయపరిచారు.

33

స తాభ్యాం విక్షతైర్గాత్రైరసృగ్దిగ్ధతనూరుహః,
అభవద్వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః.

34

సముత్పాట్య గిరేః శృఙ్గం సమృగవ్యాళపాదపమ్,
జఘాన హనుమాన్ వీరో రాక్షసౌ కపికుఞ్జరః.

35

తతస్తేష్వవసన్నేషు సేనాపతిషు పఞ్చసు,
బలం తదవశేషం చ నాశయామాస వానరః.

36

అశ్వైరశ్వాన్ గజైర్నాగాన్ యోధైర్యోధాన్ రథై రథాన్,
స కపిర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్.

37

హతైర్నాగైశ్చ తురగైర్భగ్నాక్షైశ్చ మహారథైః,
హతైశ్చ రాక్షసైర్భూమీ రుద్ధమార్గా సమన్తతః.

38

ప్రఘస భాసకర్ణుల ఆయుధాల తాకిడికి గాయపడ్డ హనుమంతుని శరీరం రక్తసిక్తమైంది. ఆ స్థితిలో బాలసూర్యునికి దీటుగా తేజరిల్లుతున్న ఆ కపివరేణ్యుడు అగ్గిమీద గుగ్గిలమే అయ్యాడు.

34

అప్పుడు వానరశ్రేష్ఠుడు, మహావీరుడు అయిన ఆ హనుమంతుడు మృగాలతోనూ, సర్పాలతోనూ, వృక్షాలతోనూ కూడుకున్న ఒక పర్వత శిఖరాన్ని అమాంతం పెకలించి ఆ రాక్షసుల మీద విసిరి, వారిని వధించాడు.

35

ఐదుగురు ప్రధాన సేనాపతులను ఆ రీతిలో హతమార్చిన తదనంతరం హనుమంతుడు వారితో వచ్చిన యావత్తు సైన్యాన్ని అంతం చేశాడు.

36

దేవేంద్రుడు అసురులను విధ్వంసమొనర్చినట్లు ఆ కపీంద్రుడు గుర్రాలతో గుర్రాలను, ఏనుగులతో ఏనుగులను, రథాలతో రథాలను, యోధులతో యోధులను మోదించి ఆ సైన్యాన్ని రూపుమాపాడు.

37

రాక్షసుల మృతదేహాలతో, చచ్చిపడి ఉన్న గుర్రాల ఏనుగుల కళేబరాలతో, తుత్తునియలై చెల్లాచెదరుగా పడి ఉన్న రథాలతో

అడుగుపెట్టడానికి కూడా సందులేనంతగా ఆ ప్రదేశమంతా నిండిపోయింది.

38

తతః కపిస్తాన్ ధ్వజనీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్ సవాహనాన్,
తదేవ వీరః పరిగృహ్య తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే.

39

వీరాధివీరుడైన ఆ హనుమంతుడు ఆ ఐదుగురు సేనాపతులను, వారి చతురంగబలాలతో సహా మట్టుబెట్టి యథాప్రకారం మళ్ళీ వెళ్ళి అశోకవన సింహద్వారం మీద జనులను కబళించడానికి నిరీక్షిస్తున్న కాలయముడిలా నిలబడ్డాడు.

39

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 46వ సర్గ
సమాప్తం

47వ సర్గ

అక్షకుమారుని సంహారం

సేనాపతీన్ పఞ్చ స తు ప్రమాపితాన్
హనుమతా సానుచరాన్ సవాహనాన్,
సమీక్ష్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమారమక్షం ప్రసమైక్షతాగ్రతః.

1

స తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః
ప్రతాపవాన్ కాఞ్చనచిత్రకార్ముకః,
సముత్పపాతాథ సదస్యుదీరితో
ద్విజాతిముఖ్యైర్హవివేష పావకః.

2

తన ప్రధాన సేనాపతులు ఐదుగురూ, వారి సైన్యంతో వాహనాలతో సహా నేలకొరిగారనే విషయం రావణుడికి తెలిసింది. ఆ సమయంలో ఎదురుగా కూర్చున్న సమరోన్మత్తుడు, సదా యుద్ధోన్ముఖుడు, తన కుమారుడు అయిన అక్షకుమారుని వైపు రావణుడు తన దృక్కులను సారించాడు.

1

రావణుని కనుసైగనే ఆదేశంగా గ్రహించిన మహాపరాక్రమవంతుడూ, అనుపమానమైన బంగారు ధనుస్సును దాల్చిన వాడూ అయిన అక్షకుమారుడు సమధికోత్సాహంతో, బ్రాహ్మణోత్తములచే యాగసదస్సున

హవిస్సు వ్రేల్చి పెంపొందిన అగ్ని చందాన సభలో ఠక్కున లేచి నిలబడ్డాడు.

2

తతో మహద్బాలదివాకరప్రభం
ప్రతప్తజామ్బూనదజాలసంతతమ్,
రథం సమాస్థాయ యయౌ స వీర్యవాన్
మహాహరిం తం ప్రతి నైర్ఋతర్షభః.

3

తతస్తపః సంగ్రహసంచయార్జితం
ప్రతప్తజామ్బూనదజాలశోభితమ్,
పతాకినం రత్నవిభూషితధ్వజం
మనోజవాష్టాశ్వవరైః సుయోజితమ్.

4

సురాసురాధృష్య మసంగచారిణం
రవిప్రభం వ్యోమచరం సమాహితమ్,
సతూణమష్టాసి నిబద్ధబన్ధురం
యథాక్రమావేశిత శక్తితోమరమ్.

5

తరువాత మహాపరాక్రమశాలీ, రాక్షసోత్తముడూ అయిన ఆ అక్షకుమారుడు మేలిమి బంగారపు అల్లికలతో విలసిల్లుతున్నదీ, బాలసూర్యుని కాంతులతో ప్రకాశిస్తున్నదీ అయిన రథాన్ని అధిరోహించి హనుమంతునితో యుద్ధానికి బయలుదేరాడు.

3

కఠోర తపశ్చర్యలతో అక్షకుమారుడు ఆ దివ్యరథాన్ని పొందాడు. పుటం పెట్టిన బంగారంతో రూపొందిన జాలములతో ఆ రథం

శోభిల్లుతూన్నది. దాని మీద అలంకారాలుగా పతాకలు, రత్నాలు పొదిగిన ధ్వజం అమరి ఉన్నాయి. మనోవేగం గల ఎనిమిది ఉత్తమాశ్వాలను ఆ రథానికి పూన్చారు.

4

సురాసురులలో ఎవరూ ఆ రథాన్ని ఎదుర్కోలేరు. అడ్డు లేకుండా ఎక్కడైనా నిరాటంకంగా అది సాగిపోతుంది. సూర్యకాంతులతో భాసిస్తున్న ఆ రథం అంతరిక్షంలో కూడా సంచరించగలదు. ఆ రథంలో సముచిత స్థానాల్లో అమ్ములపొదులు, ఎనిమిది ఖడ్గాలు, శక్తులు, తోమరాలు మొదలైన ఆయుధాలు అమర్చి ఉన్నాయి.

5

విరాజమానం ప్రతిపూర్ణవస్తునా
సహేమదామ్నా శశిసూర్యవర్చసా,
దివాకరాభం రథమాస్థితస్తతః
స నిర్జగామామరతుల్యవిక్రమః.

6

స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం
తురఙ్గమాతఙ్గమహారథస్వనైః,
బలైః సమేతైః సహి తోరణస్థితమ్
సమర్థమాసీనముపాగమత్ కపిమ్.

7

స తం సమాసాద్య హరిం హరీక్షణో
యుగాన్తకాలాగ్నిమివ ప్రజాక్షయే,
అవస్థితం విస్మితజాత సంభ్రమః
సమైక్షతాక్షో బహుమానచక్షుషా.

8

ఆయుధ సమృద్ధమైనదీ, బంగారు మాలలచే అలంకరింపబడినదీ, సూర్య చంద్రుల కాంతులతో ఒప్పారుతున్నదీ అయిన ఆ దివ్యరథాన్ని పరాక్రమంలో దేవతలకు దీటైన ఆ అక్షకుమారుడు అధిరోహించి బయలుదేరాడు.

6

అక్షకుమారుని సైన్యంలోని గుర్రాలు, ఏనుగులు, రథాలు చేస్తున్న ధ్వనులతో ఆకాశమూ, పర్వత సమేతమైన భూమి ప్రతిధ్వనించాయి. అటువంటి మహాసేనను వెంటబెట్టుకుని రావణపుత్రుడైన ఆ అక్షకుమారుడు అశోకవన సింహద్వారం మీద తాపీగా కూర్చున్న రణకోవిదుడైన హనుమంతుణ్ణి సమీపించాడు.

7

సింహం వంటి దృష్టిగల అక్షకుమారుడు శత్రుసేనలను ధ్వంసం చేయడంలో ప్రళయకాలాగ్నిని తోపింపచేసే ఆ హనుమంతుని సమీపించాడు; అలా సమీపించిన అక్షకుమారుడు హనుమంతుని అద్భుత రీవిని చూడగానే గౌరవభావం వ్యక్తం చేస్తూ, ఆ కపిశ్రేష్ఠుని తేరిపార చూడసాగాడు.

8

స తస్య వేగం చ కపేర్మహాత్మనః
పరాక్రమం చారిషు పార్థివాత్మజః,
విధారయన్ స్వం చ బలం మహాబలో
హిమక్షయే సూర్య ఇవాభివర్ధతే.

9

స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం
స్థిరం స్థితః సంయతి దుర్నివారణమ్,

సమాహితాత్మా హనుమన్తమాహవే
ప్రచోదయామాస శరైస్త్రిభిః శితైః.

10

తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం
జితశ్రమం శత్రుపరాజయోర్జితమ్,
అవైక్షతాక్షః సముదీర్ణమానసః
సబాణపాణిః ప్రగృహీతకార్ముకః.

11

బలసంపన్నుడైన ఆ అక్షకుమారుడు శత్రువుపై దాడి చేయడంలో హనుమంతుడు ప్రదర్శించే బలనైపుణ్యాలను, తన స్వకీయ బలపరాక్రమాలను బేరీజు వేసుకుని శీతాకాలానంతరం సూర్యతాపంలా సమధికోత్సాహంతో తేజరిల్లాడు.

9

యుద్ధంలో నివారింప శక్యంగాని స్థిరపరాక్రమవంతుడైన ఆ హనుమంతుని నిశితంగా పరికించి అక్షకుమారుడు కుపితుడయ్యాడు. పిదప స్థిరచిత్తుడై సమరానికి సన్నద్ధుడై వాడియైన మూడు బాణాలు ప్రయోగించి ఆ కపీంద్రుని యుద్ధానికి రెచ్చగొట్టాడు.

10

హనుమంతుడు శత్రుసంహారంతో విజృంభించి ఉన్నాడనీ, అంతమంది రాక్షసవీరులతో యుద్ధం చేసినా కించిత్తుకూడా అలుపు లేకుండా ఉన్నాడనీ, పైపెచ్చు బలగర్వితుడై ఉన్నాడనీ అక్షకుమారుడు అవగతం చేసుకున్నాడు. పిదప అతడు ధనుస్సును బాణాలను చేతబట్టి రణోత్సాహంతో ఆ కపిశ్రేష్ఠుని స్పందనకై నిరీక్షించాడు.

11

స హేమనిష్కాఙ్గదచారుకుణ్డలః
సమాససాదాశుపరాక్రమః కపిమ్,
తయోర్బభూవాప్రతిమః సమాగమః
సురాసురాణామపి సంభ్రమప్రదః.

12

రరాస భూమిర్న తతాప భానుమాన్
వవౌ న వాయుః ప్రచచాల చాచలః,
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం
ననాద చ ద్యౌరుదధిశ్చ చుక్షుభే.

13

తతః స వీరః సుముఖాన్ పతత్రిణః
సువర్ణపుంఖాన్ సవిషానివోరగాన్,
సమాధిసంయోగవిమోక్షతత్త్వవి
చ్ఛరానథ త్రీన్ కపిమూర్ధ్న్యపాతయత్.

14

బంగారు కంఠాలంకారాలు, బాహుపురులు, మనోహరమైన కుండలాలు ధరించి శోభిల్లుతూన్న ఆ అక్షకుమారుడు ప్రచండ పరాక్రమంతో హనుమంతుని ఎదుర్కొన్నాడు. సాటిలేని వారి ద్వంద్వయుద్ధం కాసేపట్లో ఉగ్రరూపం దాల్చి దేవాసురులకు సైతం ఆందోళన కారకంగా పరిణమించింది.

12

అలా హనుమంతుడు, అక్షకుమారుడు సాగిస్తున్న భీషణ యుద్ధం చూసి భూమి దద్దరిల్లింది, సూర్యుడు ప్రకాశహీనుడయ్యాడు, వాయువు వీచడం మానేసింది, పర్వతాలు చలించాయి, ఆకాశం ప్రతిధ్వనులకు

లోనైంది, సముద్రం క్షోభించింది.

13

బాణాలను సంధించి గురి చూసి లక్ష్యాన్ని ఛేదించడంలో నిష్ణాతుడైన ఆ అక్షకుమారుడు అప్పుడు బాగా మొనదేలి రెక్కలతో కూడుకున్న బంగారపు పిడులుగల విషసర్పాల మల్లే ఒప్పారుతున్న మూడు బాణాలను హనుమంతుని శిరస్సును గురి చూసి ప్రయోగించాడు.

14

స తైః శరైర్మూర్ధ్ని సమం నిపాతితైః
క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః,
నవోదితాదిత్యనిభః శరాంశుమాన్
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలికః.

15

తతః స పిఙ్గాధిపమన్త్రిసత్తమః
సమీక్ష్య తం రాజవరాత్మజం రణే,
ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం
జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః.

16

స మన్దరాగ్రస్థ ఇవాంశుమాలికో
వివృద్ధకోపో బలవీర్య సంయుతః,
కుమారమక్షం సబలం సవాహనం
దదాహ నేత్రాగ్ని మరీచిభిస్తదా.

17

మూడు బాణాలు ఏకకాలంలో వచ్చి తలను గాయపరిచినప్పటికీ హనుమంతునికి ఏమాత్రం బాధ కలుగలేదు. పైపెచ్చు గాయాలనుండి

స్రవించిన రక్తధారతో తడిసిన కళ్ళు ఎరుపు వర్ణాన్ని సంతరించుకోగా, నాటుకున్న బాణాలే కిరణాల వలె ఒప్పారగా అప్పుడు ఆ హనుమంతుడు ఉదయిస్తున్న సూర్యుని చందాన విరాజిల్లాడు.

15

వివిధమైన ఆయుధాలతోను, చిత్రమైన ధనుస్సుతోను తనతో యుద్ధం చేయడానికి వచ్చిన అక్షకుమారుణ్ణి చూసి సుగ్రీవుని సచివులలో శ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు పరాక్రమ సంపన్నుడైన ప్రత్యర్థే ఈసారి వచ్చాడని అనుకొని సంతోషించాడు. అంతే, సమరోత్సాహంతో ఆ కపివరుడు తన దేహపరిమాణాన్ని మరింత పెంచాడు.

16

పిదప మందరపర్వత శిఖరాగ్రం మీద తీక్షణంగా ప్రకాశిస్తూన్న సూర్యుని చందాన కోపోద్రిక్తుడైన ఆ హనుమంతుడు బలపరాక్రమాలను ప్రదర్శిస్తూ తన నేత్రాగ్ని కిరణపుంజాలతో అక్షకుమారుని, అతడి సేనను దహించివేస్తున్నట్లు చూశాడు.

17

తతః స బాణాసనచిత్రకార్ముకః
శరప్రవర్షో యుధి రాక్షసామ్బుదః,
శరాన్ ముమోచాశు హరీశ్వరాచలే
వలాహకో వృష్టిమివాచలోత్తమే.

18

తతః కపిస్తం రణచణ్డవిక్రమం
వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్,
కుమారమక్షం ప్రసమీక్ష్య సంయుగే
ననాద హర్షాద్ధనతుల్య విక్రమః.

19

స బాలభావాద్యుధి వీర్యదర్పితః
ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః,
సమాససాదాప్రతిమం కపిం రణే
గజోమహాకూపమివావృతం తృణైః.

20

అప్పుడు తన చిత్రవర్ణమైన ధనుస్సునే ఇంద్రధనుస్సుగా ధరించినట్లున్న అక్షకుమారుడనే మేఘం, సమున్నత పర్వతం మీద మేఘం వర్షం కురిపించే రీతిలో, హనుమంతుని మీద బాణవర్షం కురిపించాడు.

18

యుద్ధంలో అవధుల్లేని పరాక్రమం ప్రదర్శించేవాడు, అమిత బలవీర్య సంపన్నుడు, మేఘంలా ఆకాశ గమనం సంతరించుకొన్న వాడు అయిన అక్షకుమారుని రణరంగంలో చూసి హనుమంతుడు ఆనందోత్సాహాలతో కేకపెట్టాడు.

19

తన పరాక్రమాన్ని చూసుకొని కుత్రతనపు గర్వంతో, పిచ్చికోపంపూని కళ్ళు ఎర్రజేస్తూ, గడ్డితో కప్పబడిన ఒక మహాకూపాన్ని (గోతిని) ఏనుగు చేరనున్నట్లు ఆ అక్షకుమారుడు అజేయ పరాక్రమవంతుడైన హనుమంతుణ్ణి ఎదుర్కొన్నాడు.

20

స తేన బాణైః ప్రసభం నిపాతితై
శ్చకార నాదం ఘననాద నిస్స్వనః,
సముత్పపాతాశు నభః స మారుతి
ర్ఋజోరువిక్షేపణ ఘోరదర్శనః.

21

సముత్పతన్తం సమభిద్రవద్బలీ
స రాక్షసానాం ప్రవరః ప్రతాపవాన్,
రథీ రథిశ్రేష్ఠతమః కిరన్ శరైః
పయోధరః శైలమివాశ్మవృష్టిభిః.

22

స తాన్ శరాంస్తస్య హరిర్విమోక్షయం
శ్చచార వీరః పథి వాయుసేవితే,
శరాన్తరే మారుతవద్వినిష్పత
న్మనోజవః సంయతి చణ్డవిక్రమః.

23

అక్షకుమారుడు ప్రయోగిస్తున్న బాణాలు శరవేగంతో వచ్చి తనను దెబ్బతీస్తుండగా మండిపడ్డ ఆ హనుమంతుడు సింహనాదం చేశాడు. పిదప భుజాలు, తొడలు వేగంగా చరుస్తూ చూపరులకు భీతిగొల్పే భీకరరూపంతో రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు.

21

బలసంపన్నుడు, రాక్షసశ్రేష్ఠుడు, సాటిలేని ప్రతాపశాలి, రథికుడు, రథికులలో అగ్రగణ్యుడు అయిన ఆ అక్షకుమారుడు, మేఘం పర్వతం మీద వడగళ్ళ వాన కురిపించినట్లు పైకి ఎగురుతున్న హనుమంతుని మీద శరవర్షం కురిపిస్తూ అతణ్ణి వెన్నాడాడు.

22

మనోవేగ గమనం గలవాడు, యుద్ధంలో చండ ప్రచండంగా పరాక్రమించే వాడు, మహావీరుడు అయిన ఆ హనుమంతుడు తన మీద ప్రయోగింపబడ్డ బాణాల మధ్య వాయువులా అమిత లాఘవంతో తిరుగుతూ,

వాటి బారినుండి తప్పించుకొంటూ ఆకాశమార్గంలో సంచరించసాగాడు.

23

తమాత్తబాణా సనమాహవోన్ముఖం
ఖమాస్తృణన్తం విశిఖైః శరోత్తమైః,
అవైక్షతాక్షం బహుమానచక్షుషా
జగామ చిన్తాం చ స మారుతాత్మజః.

24

తతః శరైర్భిన్నభుజాన్తరః కపిః
కుమారవీరేణ మహాత్మనా నదన్,
మహాభుజః కర్మవిశేషతత్త్వవి
ద్విచిన్తయామాస రణే పరాక్రమమ్.

25

అబాలవద్బాలదివాకరప్రభః
కరోత్యయం కర్మ మహన్మహాబలః,
న చాస్య సర్వాహవకర్మశోభినః
ప్రమాపణే మే మతిరత్ర జాయతే.

26

రణోన్ముఖుడై ఎత్తిన విల్లును దించకుండా తీక్ష్ణమైన బాణాలతో ఆకాశాన్నంతా కప్పివేస్తున్న ఆ అక్షకుమారుని ధనుర్విద్యా కౌశలాన్ని మెచ్చుకొంటూ హనుమంతుడు తీవ్ర ఆలోచనకు లోనయ్యాడు.

24

మహావీరుడైన అక్షకుమారుని బాణప్రయోగంతో తన వక్షస్థలం గాయపడగా, సమయానుకూలంగా కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడంలో అగ్రగణ్యుడైన ఆ హనుమంతుడు బిగ్గరగా కేకపెట్టి, ఆ రాక్షసయోధుడి యుద్ధ

ఉద్ధతిని ఎలా నిరోధించాలో అనే యోచనలో పడ్డాడు.

25

బాలసూర్యునిలా తేజరిల్లుతూన్న బలసంపన్నుడైన ఈ అక్షకుమారుడు యుద్ధాలలో ఆరితేరిన వాడిలా గొప్ప నేర్పుతో యుద్ధంచేస్తున్నాడు. యుద్ధ విధానాలను అన్నింటినీ ఆపోసన పట్టినట్లున్న ఈతణ్ణి చంపడానికి నాకు మనస్కరించడంలేదు.

26

అయం మహాత్మా చ మహాంశ్చ వీర్యతః
సమాహితశ్చాతిసహశ్చ సంయుగే,
అసంశయం కర్మగుణోదయాదయం
సనాగయక్షైర్మునిభిశ్చ పూజితః.

27

పరాక్రమోత్సాహవివృద్ధమానసః
సమీక్షతే మాం ప్రముఖాగతః స్థితః,
పరాక్రమో హ్యస్య మనాంసి కంపయే
త్సురాసురాణామపి శీఘ్రగామినః.

28

న ఖల్వయం నాభిభవేదుపేక్షితః
పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే,
ప్రమాపణం త్వేవ మమాస్య రోచతే
న వర్ధమానోఽగ్నిరుపేక్షితుం క్షమః.

29

ఈ అక్షకుమారుని సావధాన చిత్తం, వివేకం, పరాక్రమం, శ్రమకోర్చే లక్షణం, కార్యదక్షతలను చూస్తూంటే నిస్సంశయంగా నాగులు, యక్షులు,

మునులు మొదలైన వారి ప్రశంసలకు కూడా కచ్చితంగా ఇతడు నోచుకొని ఉంటాడని అనిపిస్తోంది.

27

పరాక్రమోత్సాహాలతో ఉత్తేజితుడైన ఈ అక్షకుమారుడు నా ముందు నిలబడి నిర్భయంగా ఎదుర్కొంటూ నన్ను రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. అమిత వేగవంతమైన కదలికలతో కూడుకున్న ఈతడి యుద్ధవిధానం సురాసురుల మనస్సులలో సైతం వెరపు పుట్టిస్తుందనడంలో సందేహంలేదు.

28

ఇతడి విషయంలో ఇక ఉపేక్షించడం తగదు. యుద్ధంలో ఈతడి పరాక్రమం క్షణక్షణానికీ పెరిగిపోతోంది. కనుక ఇప్పుడే ఇతణ్ణి సంహరించడమే యుక్తమని అనిపిస్తోంది. పెరిగి వ్యాపించబోతున్న అగ్నిని ఉపేక్షించకూడదు కదా!

29

ఇతి ప్రవేగం తు పరస్య చిన్తయన్
స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్,
చకార వేగం తు మహాబలస్తదా
మతిం చ చక్రేఽస్య వధే మహాకపిః.

30

స తస్య తానష్టహయాన్ మహాజవాన్
సమాహితాన్ భారసహాన్విచర్తనే,
జఘాన వీరః పథి వాయుసేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః.

31

తతస్తలేనాభిహతో మహారథః

స తస్య పిఙ్గాధిపమన్త్రినిర్జితః,
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః
పపాత భూమౌ హతవాజిరమ్బరాత్.

32

మహాపరాక్రమవంతుడూ, అమిత బలసంపన్నుడూ అయిన హనుమంతుడు తన ప్రత్యర్థి బలపరాక్రమాలను నిర్దుష్టంగా ఈ విధంగా అంచనా కట్టి, తన కర్తవ్యాన్ని నిశ్చయించుకొని, అక్షకుమారుణ్ణి సంహరించడానికి సంకల్పించి వేగంగా ముందుకు సాగాడు.

30

అలుపు ఎరుగనివి, కుదుపులకు మలుపులు తిరిగే సమయంలోను రథ భారాన్ని సమర్థవంతంగా మోయగలవి అయిన అక్షకుమారుని రథాలకు పూన్చిన ఎనిమిది గుర్రాలను ఆకాశంలోనే తన అరచేతులతో కొట్టి వాయుపుత్రుడూ, మహావీరుడూ అయిన హనుమంతుడు చంపాడు.

31

సుగ్రీవుని సచివుడైన హనుమంతుని బలిష్ఠమైన అరచేతి దెబ్బలకు అక్షకుమారుని రథ చక్రాలు విరిగాయి; నొగ తొలగిపోయింది. అప్పటికే గుర్రాలు చావడంతో ఆ రథం ముక్కలుముక్కలై ఆకాశంనుండి దభీమని నేల మీద పడింది.

32

స తం పరిత్యజ్య మహారథో రథం
సకార్ముకః ఖడ్గధరః ఖముత్పతన్,
తపోఽభియోగాదృషిరుగ్రవీర్యవాన్
విహాయ దేహం మరుతామివాలయమ్.

33

తతః కపిస్తం విచరన్తమమ్బరే
పతత్రిరాజానిలసిద్ధసేవితే,
సమేత్య తం మారుతతుల్యవిక్రమః
క్రమేణ జగ్రాహ స పాదయోర్దృఢమ్.

34

స తం సమావిధ్య సహస్రశః కపి
ర్మహోరగం గృహ్య ఇవాణ్డజేశ్వరః,
ముమోచ వేగాత్ పితృతుల్యవిక్రమో
మహీతలే సంయతి వానరోత్తమః.

35

అప్పుడు మహారథుడైన అక్షకుమారుడు తక్షణమే తన రథాన్ని విడిచి, ధనుస్సును, ఖడ్గాన్ని చేత పుచ్చుకొని ఆకాశంలోకి ఎగిరాడు. గొప్ప తపశ్శక్తి సంపన్నుడైన ఋషి తన తపోబలంచే భౌతిక దేహాన్ని విడిచి స్వర్గానికి ఆకాశమార్గంలో ఎగిరిపోతున్నట్లు కానవచ్చాడు అతడు.

33

వాయువుతో సమానమైన పరాక్రమం గల ఆ హనుమంతుడు, గరుత్మంతునికి, వాయువునకు, సిద్ధులకు సంచారయోగ్యమైన ఆకాశమార్గంలో సంచరిస్తున్న అక్షకుమారుణ్ణి క్రమంగా సమీపించి, ఆతడి రెండు పాదాలను గట్టిగా ఒడిసి పట్టుకొన్నాడు.

34

వానరులలో అగ్రగణ్యుడు, పరాక్రమంలో తండ్రియైన వాయుదేవునికి సమానుడు అయిన ఆ హనుమంతుడు, మహాసర్పాన్ని గరుత్మంతుడు చేజిక్కించుకొన్నట్లు అక్షకుమారుణ్ణి పట్టుకొని అనేకసార్లు గిరగిర తిప్పి నేలమీద వేసి కొట్టాడు.

35

స భగ్నబాహూరుకటీశిరోధరః
క్షరన్నసృఙ్నిర్మథితాస్థిలోచనః,
స భగ్నసంధిః ప్రవికీర్ణబన్ధనో
హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః.

36

మహాకపిర్భూమితలే నిపీడ్య తం
చకార రక్షోఽధిపతేర్మహద్భయమ్.

37

మహర్షిభిశ్చక్రచరైర్మహావ్రతైః
సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః,
సురైశ్చ సేన్దైర్బ్రుశజాతవిస్మయై
ర్హతే కుమారే స కపిర్నిరీక్షితః.

38

హనుమంతుడు ఆ రీతిలో నేలపై వేసి ఎడాపెడా కొట్టగా అక్షకుమారుడి భుజాలు, తొడలు, కటిప్రదేశం విరిగిపోయాయి. అతడి శరీరంలోని ఎముకలు నుగ్గునుగ్గె, కీళ్ళు ఊడిపోయాయి. శరీరమంతా శిథిలమైన స్థితిలో అతడు ప్రాణాలు కోల్పోయాడు.

36

కపివరేణ్యుడైన ఆ హనుమంతుడు నేలపై చితకగొట్టి అక్షకుమారుణ్ణి ఆ విధంగా సంహరించి రాక్షసరాజైన రావణునికి భీతిని కలిగించాడు.

37

అలా అక్షకుమారుణ్ణి, కపిశ్రేష్ఠుడు సంహరిస్తున్న సమయంలో జ్యోతిశ్చక్రంలో సంచరించే నియమనిష్ఠాగరిష్ఠులైన మహర్షులు, భూతములు,

యక్షులు, పన్నగులు, దేవతలతో సహా దేవేంద్రుడు ఎంతో ఆశ్చర్యచకితులై ఆతణ్ణి చూశారు.

38

నిహత్య తం వజ్రసుతోపమప్రభం
కుమారమక్షం క్షతజోపమేక్షణమ్,
తమేవ వీరోఽభిజగామ తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే.

39

తేజస్సులో దేవేంద్రుని కుమారునికి దీటైన వాడూ, రక్తవర్ణ నేత్రాలు సంతరించుకొన్న వాడూ అయిన ఆ అక్షకుమారుణ్ణి వీరాధివీరుడైన హనుమంతుడు మట్టుబెట్టిన తరువాత ప్రళయకాలంలో జీవుల ప్రాణాలను హరించివేయడానికి తీరికగా కూర్చున్న యముడిలా మళ్ళీ ఆ అశోకవన ముఖద్వారం మీద ఆసీనుడయ్యాడు.

39

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 47వ సర్గ
సమాప్తం

48

వ సర్గ

హనుమంతుడు బ్రహ్మాస్త్రానికి బద్ధుడవడం

తతః స రక్షోఽధిపతిర్మహాత్మా
హనూమతాక్షే నిహతే కుమారే,
మనః సమాధాయ తదేంద్రకల్పం
సమాదిదేశేంద్రజితం సరోషమ్.

1

త్యమస్త్రవిచ్ఛస్త్రవిదాం వరిష్ఠః
సురాసురాణామపి శోకదాతా,
సురేషు సేంద్రేషు చ దృష్టకర్మా
పితామహారాధనసంచితాస్త్రః.

2

హనుమంతుడి చేతిలో అక్షకుమారుడు హృదయవిదారకంగా మరణించాడనే వార్త రావణుడు విన్నాడు. అతడు దుఃఖాన్ని దిగమ్రింగి, మనస్సును దిటవుచేసుకొని క్రుద్ధుడై, దేవేంద్రునితో సమానపరాక్రమవంతుడైన ఇంద్రజిత్తుని చూస్తు ఇలా ఆదేశమిచ్చాడు.

1

కుమారా! శస్త్రాస్త్ర ప్రయోగంలో నువ్వు సర్వశ్రేష్ఠుడవు, సురులకు అసురులకు కూడా దుఃఖాన్ని వాటిల్లజేసిన మేటివి. బ్రహ్మదేవుని తపస్సుచే మెప్పించి పెక్కు దివ్యాస్త్రాలను సముపార్జించావు. నీ రణకౌశలాన్ని ఇంద్రాది దేవతలు సైతం చవి చూసే ఉన్నారు.

2

తవాస్త్రబలమాసాద్య ససురా న మరుద్గణాః,

న శేకుః సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః.

3

న కశ్చిత్త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః,
భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః,
దేశకాలవిభాగజ్ఞస్త్వమేవ మతిసత్తమః.

4

న తేఽస్త్యశక్యం సమరేషు కర్మణా
న తేఽస్త్యకార్యం మతిపూర్వమన్యణే,
న సోఽస్తి కశ్చిత్త్రిషు సంగ్రహేషు వై న
వేద యస్తేఽస్త్రబలం బలం చ తే.

5

మమానురూపం తపసో బలం చ తే
పరాక్రమశ్చాస్త్రబలం చ సంయుగే,
న త్వాం సమాసాద్య రణావమర్దే
మనః శ్రమం గచ్ఛతి నిశ్చితార్థమ్.

6

అసురులు, దేవేంద్రుని అండలో ఉన్న సురులు, మరుద్గణాలు సైతం నీ అస్త్రసంపత్తి ముందు యుద్ధరంగంలో నిలబడలేక పరుగులెత్తారు గదా!

3

ముల్లోకాలలోనూ నీ చేతుల్లో పరాజితుడు కానివాడు మచ్చుకి ఒక్కడుకూడా లేడు. నీ భుజబలపరాక్రమాలూ, అపారమైన తపోబలమూ నీకు సదా రక్షాకవచాలుగా విరాజిల్లుతున్నాయి. సమయ సందర్భాలకు అనుగుణంగా కార్యాన్ని సాధించడంలో నువ్వు ప్రజ్ఞాశాలివి.

4

యుద్ధంలో నువ్వు ప్రదర్శించే పరాక్రమానికి సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. బుద్ధి కౌశలంతో వివేచించి నువ్వు సాధించలేని కార్యం కూడా ఏదీ లేదు. నీ శస్త్రాస్త్ర పాటవం, బలపరాక్రమాల గురించి తెలియని వాడు ముల్లోకాలలో ఎవడూ లేడు.

5

తపోబల సంపత్తిలోను, బలపరాక్రమాలలోను, శస్త్రాస్త్ర ప్రయోగ కౌశలంలోను నువ్వు నాకు సమానుడవు. యుద్ధరంగంలో నువ్వు నిలబడితేనే చాలు, విజయం తథ్యమని గట్టి నమ్మకం కలిగి నిశ్చింతగా ఉంటాను.

6

నిహతాः కింకరాः సర్వే జమ్బుమాలీ చ రాక్షసः,
అమాత్యపుత్రా వీరాశ్చ పఞ్చ సేనాగ్రయాయినः.

7

బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ,
సహోదరస్తే దయితः కుమారోఽక్షశ్చ సూదితः,
న హి తేష్వేవ మే సారో యస్త్వయ్యరినిషూదన.

8

ఇదం హి దృష్ట్వా మతిమన్ మహద్బలం
కపేः ప్రభావం చ పరాక్రమం చ,
త్వమాత్మనశ్చాపి సమీక్ష్య సారం
కురుష్వ వేగం స్వబలానురూపమ్.

9

బలావమర్దస్త్వయి సన్నికృష్టే
యథా గతే శామ్యతి శాన్తశత్రౌ,
తథా సమీక్ష్యాత్మబలం పరం చ
సమారభస్వాస్త్రవిదాం వరిష్ఠ.

10

కింకరులు యావన్మంది, జంబుమాలి, మహావీరులైన అమాత్యుల పుత్రులు ఏడుగురు, ప్రధాన సేనానులు ఐదుగురు రథగజతురగ పదాతులతో సహా రణరంగంలో మృత్యువాతపడ్డారు. నీకు సోదరుడు, మనందరికీ ప్రీతిపాత్రుడు అయిన అక్షకుమారుడు కూడా మరణించాడు. ఓ శత్రుసంహారకా! నీ బలశౌర్యాల పట్ల నాకు ఉన్నంత నమ్మకం ఎన్నడూ వారిలో ఉన్నది లేదు.

7–8

ఓ వివేకవంతుడా! ముందుగా ఆ వానరుని బలపరాక్రమాలను పరిశీలించు. పిదప

నీ బలాన్ని పరిగణించుకుని ఈ పరిస్థితిలో ఏం చేయాలో అందుకు అనుగుణంగా నీ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించు.

9

అస్త్రవేత్తలలో అగ్రగణ్యుడా! శత్రువులను అణగదొక్కే సామర్థ్యంగల నువ్వు మన సేనలు నశించని తీరులో ఎత్తుగడలను పన్ని, నీ బలాన్ని, శత్రువు బలపరాక్రమాలను సమీక్షించుకొని కర్తవ్యం నిర్వహించు.

10

న వీర సేనా గణశోచ్యవన్తి
న వజ్రమాదాయ విశాలసారమ్,
న మారుతస్యాస్య గతేః ప్రమాణం
న చాగ్నికల్పాః కరణేన హన్తుమ్.

11

తమేవమర్థం ప్రసమీక్ష్య సమ్యక్
స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా,
స్మరంశ్చ దివ్యం ధనుషోఽస్త్రవీర్యం
వ్రజాక్షతం కర్మ సమారభస్వ.

12

న ఖల్వియం మతిః శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహమ్,
ఇయం చ రాజధర్మాణాం క్షత్రస్య చ మతిర్మతా.

13

ఓ వీరాధివీరుడా! ఏకకాలంలో విస్తారమైన సేనాసమూహాన్ని ఇట్టే ధ్వంసం చేయగల సామర్థ్యం ఆ ప్రత్యర్థి వానరునికి ఉంది. కనుక సైన్యంతో పోవడం ప్రయోజనకరం కాదు. వజ్రాయుధం కూడా అతడి మీద పనిచెయ్యదు. వాయువు వేగం కూడా అతడి ముందు దిగదుడుపే. అతడు ప్రజ్వలిస్తున్న అగ్ని. సాధారణ యుద్ధ పద్ధతులు అతడి విషయంలో వ్యర్థం.

11

నేను చెప్పిన విషయాలను గురించి బాగా యోచించి ఆత్మస్థైర్యంతో ఏం చేయాలో తీర్మానించుకో. కఠోర తపశ్చర్యలతో నువ్వు సముపార్జించుకొన్న దివ్యాస్త్రాలను

స్మరించుకొని పోరాటానికి ఉద్యమించు. నిర్దుష్టంగా కార్యసాధనను పూర్తిచెయ్యి.

12

నీ పట్ల గల ప్రేమానురాగాల దృష్ట్యా నిన్ను యుద్ధానికి పంపడం నాకు సముచితంగా తోచడం లేదు. కాని రాజుగా నా కర్తవ్య పాలనను అనుసరించి ఇలా చేయడం ధర్మవిరుద్ధం కాదు.

13

నానాశస్త్రేషు సంగ్రామే వైశారద్యమరిందమ,
అవశ్యమేవ బోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే.

14

తతః పితుస్తద్వచనం నిశమ్య
ప్రదక్షిణం దక్షసుతప్రభావః,
చకార భర్తారమదీనసత్త్వో
రణాయ వీరః ప్రతిపన్నబుద్ధిః.

15

తతస్తైః స్వగణైరిష్టైరింద్రజిత్ ప్రతిపూజితః,
యుద్ధోద్ధతః కృతోత్సాహః సంగ్రామం ప్రత్యపద్యత.

16

శ్రీమాన్ పద్మపలాశాక్షో రాక్షసాధిపతేః సుతః,
నిర్జగామ మహాతేజాః సముద్ర ఇవ పర్వసు.

17

ఓ శత్రుసంహారకా! యుద్ధరంగంలో వివిధ శస్త్రాస్త్ర ప్రయోగంలో కోవిదుడై ఉండాలి. అంతేకాదు యుద్ధంలో విజయాన్నే ఆకాంక్షిస్తూ దానినే అంతిమ లక్ష్యంగా పరిగణించాలి.

14

మహావీరుడు, దేవతలకు దీటైన దివ్యప్రభావం గలవాడు అయిన ఇంద్రజిత్తు, తండ్రి హితవచనాలను సావధానంగా ఆలకించి యుద్ధం చేయడానికి కృతనిశ్చయుడై తండ్రియైన రావణునికి ప్రదక్షిణ చేశాడు.

15

తరువాత తన ఆత్మీయులందరూ ప్రశంసిస్తూండగా ఇంద్రజిత్తు సమధికోత్సాహంతో రణోన్మత్తుడై రణరంగానికి బయలుదేరాడు.

16

శోభాయుక్తుడు, తామర రేకులవంటి కన్నులు గలవాడు, మహాతేజశ్శాలి, రావణుని కుమారుడు అయిన ఇంద్రజిత్తు పర్వకాలంలో సముద్రంలా ఉప్పొంగుతూ యుద్ధానికి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు.

17

స పక్షిరాజోపమతుల్యవేగై
ర్వ్యాళైశ్చతుర్భిః సితతీక్ష్ణదంష్ట్రైః,
రథం సమాయుక్తమసంగవేగం
సమారురోహేన్ద్రజిదిన్ద్రకల్పః.

18

స రథీ ధన్వినాం శ్రేష్ఠః శస్త్రజ్ఞోఽస్త్రవిదాం వరః,
రథేనాభియయౌ క్షిప్రం హనుమాన్యత్ర సోఽభవత్.

19

స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ,
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్.

20

సుమహచ్చాపమాదాయ శితల్యాంశ్చ సాయకాన్,
హనుమన్తమభిప్రేత్య జగామ రణపణ్డితః.

21

ఇంద్రునితో సమాన పరాక్రమంగల ఇంద్రజిత్తు గమనానికి అడ్డులేని రథాన్ని అధిరోహించాడు. ఆ రథానికి గరుత్మంతునికి దీటైన వేగంగల, తెల్లని వాడియైన కోరలున్న నాలుగు సింహాలు పూన్చబడ్డాయి.

18

రథికుడు, ధనుర్ధారులలో సర్వశ్రేష్ఠుడు, శస్త్రాల ప్రయోగంలో కోవిదుడు, అస్త్రవిద్యలో

పారంగతుడు అయిన ఇంద్రజిత్తు తన రథం మీద అమితవేగంగా హనుమంతుడు ఉన్న అశోకవన ముఖద్వారం వద్దకు వెళ్ళాడు.

19

ఇంద్రజిత్తు రథ చక్రాల చప్పుళ్ళు, అతడి ధనుష్టంకారము విని తనకు దీటైన మహావీరుడు ఇప్పటికన్నా యుద్ధానికి వస్తున్నాడని హనుమంతుడు సంతోషపడ్డాడు.

20

యుద్ధవిద్యలో పారంగతుడైన ఇంద్రజిత్తు మహత్తరమైన ధనుస్సును, వాడియైన ములుకులు గల బాణాలను చేతబట్టి హనుమంతుని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు.

21

తస్మింస్తతః సంయతి జాతహర్షే
రణాయ నిర్గచ్ఛతి చాపపాణౌ,
దిశశ్చ సర్వాః కలుషా బభూవు
ర్మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః.

22

సమాగతాస్తత్ర తు నాగయక్షా
మహర్షయశ్చక్రచరాశ్చ సిద్ధాః,
నభః సమావృత్య చ పక్షిసంఘా
వినేదురుచ్చైః పరమప్రహృష్టాః.

23

ఆయాన్తం సరథం దృష్ట్వా తూర్ణమిన్ద్రజితం కపిః,
విననాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్.

24

ఇన్ద్రజిత్తు రథం దివ్యమాస్థిత శ్చిత్రకార్ముకః,
ధనుర్విష్ఫారయామాస తటిదూర్జితనిస్స్వనమ్.

25

సమరోత్సాహభరితుడై ధనుర్బాణాలు ధరించి ఇంద్రజిత్తు యుద్ధానికి ఉద్యుక్తుడవుతుండగా దిక్కులు పిక్కటిల్లాయి, క్రూరమృగాలు పెక్కువిధాలుగా

అరవసాగాయి.

22

ఆ సమయంలో నాగులు, యక్షులు, జ్యోతిశ్చక్రంలో సంచరించే మహర్షులు, సిద్ధులు అక్కడ గుమిగూడారు. వీరేకాక పక్షిసముదాయాలు పెద్దసంఖ్యలో ఆకాశంలో గుంపులుకట్టి బిగ్గరగా గీపెట్టి సంతోషంతో అరవసాగాయి.

23

అమిత వేగంగా రథం మీద తనను సమీపిస్తున్న ఇంద్రజిత్తును చూసి, హనుమంతుడు ఉత్సాహంతో సింహనాదం చేసి తన శరీర పరిమాణాన్ని మరింతగా పెంచాడు.

24

ఇంద్రజిత్తు తన దివ్యరథంలో సుస్థిరుడై కూర్చుని అద్భుతమైన తన ధనుస్సును చేతపట్టి, హనుమంతుని సింహనాదానికి ప్రతిస్పందనగా పిడుగుపాటు ధ్వని వెలువడేలా ధనుష్టంకారం చేశాడు.

25

తతః సమేతావతితీక్ష్ణవేగౌ
మహాబలౌ తౌ రణనిర్విశఙ్కౌ,
కపిశ్చ రక్షోధిపతేపతేశ్చ పుత్రః
సురాసురేన్ద్రావివ బద్ధవైరౌ.

26

స తస్య వీరస్య మహారథస్య
ధనుష్మతః సంయతి సంమతస్య,
శరప్రవేగం వ్యహనత్ప్రవృద్ధ
శ్చచార మార్గే పితురప్రమేయః.

27

తతః శరానాయతతీక్ష్ణశల్యాన్
సుపత్రిణః కాఞ్చనచిత్రపుంఖాన్,
ముమోచ వీరః పరవీరహన్తా
సుసన్నతాన్ వజ్రనిపాతవేగాన్.

28

మహాపరాక్రమవంతులు, యుద్ధోద్ధతిలో ఊహించని వేగంగలవారు, రణభయం లేనివారు అయిన ఆ హనుమంతుడు, ఇంద్రజిత్తు ఇద్దరూ బద్ధశత్రువులైన దేవేంద్ర, రాక్షసేంద్రుల చందాన చండప్రచండంగా పోరుకు తలపడ్డారు.

26

అమేయ బలపరాక్రమాలు సంతరించుకున్న వాడు, తన దేహాన్ని బాగా పెంచిన వాడు అయిన హనుమంతుడు, మహారథుడు, ధనుర్ధారి, రణకోవిదుడు అయిన ఆ ఇంద్రజిత్తు ప్రయోగిస్తున్న శరపరంపరలను వృథాగావిస్తూ ఆకాశంలో సంచరించసాగాడు.

27

అదిచూసి శత్రుసంహారకుడుగా ఖ్యాతిగాంచిన ఇంద్రజిత్తు వాడిమొనగల పొడవైనవి, మేలైన రెక్కలతో ఉన్నవి, బంగారంతో చేయబడి చిత్రంగా ఉన్న పొన్నులు గలవి, కొంచెం వంగిన అగ్రభాగం గలవి, వజ్రపాతం వంటి వేగం గలవి అయిన బాణాలను హనుమంతునిపై ప్రయోగించాడు.

28

తతస్తు తత్స్యన్దననిః స్వనం చ
మృదఙ్గభేరీపటహస్వనం చ,
వికృష్యమాణస్య చ కార్ముకస్య
నిశమ్య ఘోషం పునరుత్పపాత.

29

శరణామన్తరేష్వాశు వ్యవర్తత మహాకపిః,
హరిస్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్.

30

శరణామగ్రతస్తస్య పునః సమభివర్తత,
ప్రసార్య హస్తౌ హనుమానుత్పపాతానిలాత్మజః.

31

తావుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ,
సర్వభూతమనోగ్రాహి చక్రతుర్యుద్ధముత్తమమ్.

32

అప్పుడు ఇంద్రజిత్తు రథ చక్రాల సవ్వడిని, మృదంగ భేరీ పటహములనే వాద్యాల నాదాలను, ధనుష్టంకార శబ్దాన్ని విని హనుమంతుడు మళ్ళీ ఆకాశంలో మరింత ఎత్తుకు వెళ్ళి ఎగరసాగాడు.

29

లక్ష్యాన్ని ఛేదిస్తూ బాణప్రయోగం చేయడంలో నిష్ణాతుడైన ఇంద్రజిత్తు లక్ష్యాన్ని నిష్ఫలం గావిస్తూ ఆ వానరశ్రేష్ఠుడు బాణాలు తనకు తగలకుండా వాటి మధ్య వాయువేగంతో సంచరించసాగాడు.

30

వాయునందనుడైన హనుమంతుడు అలా బాణాలకు అందకుండా కొంతసేపు సంచరించి మళ్ళీ ఇంద్రజిత్తు ముందుకు వచ్చి నిలబడ్డాడు. అతడు బాణప్రయోగం చేసేటంతలో హనుమంతుడు తన చేతులు చాచి మళ్ళీ రివ్వున పైకి దాగుడుమూతలు ఆడే చందాన ఎగిరిపోసాగాడు.

31

యుద్ధరంగంలో ఊహించని గమనవేగం గలవారు, రణకోవిదులు అయిన ఆ ఇద్దరూ సమస్త ప్రాణులకు విస్మయం కలిగించే తీరులో యుద్ధం చేయసాగారు.

32

హనూమతో వేద న రాక్షసోఽన్తరం
న మారుతిస్తస్య మహాత్మనోఽన్తరమ్,
పరస్పరం నిర్విషహౌ బభూవతుః
సమేత్య తౌ దేవసమానవిక్రమౌ.

33

తతస్తు లక్ష్యే స విహన్యమానే
శరేష్వమోఘేషు చ సంపతత్సు,
జగామ చిన్తాం మహతీం మహాత్మా
సమాధిసంయోగ సమాహితాత్మా.

34

తతో మతిం రాక్షసరాజసూను
శ్చకార తస్మిన్ హరివీరముఖ్యే,
అవధ్యతాం తస్య కపేః సమీక్ష్య
కథం నిగచ్ఛేదితి నిగ్రహార్థమ్.

35

ఎంతసేపు గడచినా హనుమంతుడి బలహీనత ఇంద్రజిత్తుకు అంతుబట్టలేదు; ఇంద్రజిత్తులోని దౌర్బల్యాంశం హనుమంతునికి తెలియరాలేదు. దేవతలకు దీటైన పరాక్రమవంతులైన ఆ ఇద్దరూ ఒకరికొకరు ఏమాత్రం లొంగని రీతిలో యుద్ధం చేయసాగారు.

33

లక్ష్యాన్ని ఛేదించడంలో ఎన్నడూ గురి తప్పని అమోఘమైన తన బాణాలు ఆ విధంగా వైఫల్యాన్ని చవిచూస్తుండడంతో బాణాలను సంధించి ప్రయోగించడంలో ఏకాగ్రచిత్తుడైన ఆ ఇంద్రజిత్తుకు ఏం చేయాలో పాలుబోక యోచనలోపడ్డాడు.

34

హనుమంతుని చంపడం అసాధ్యమైన కార్యంగా గుర్తించిన ఆ రాక్షసరాజ కుమారుడు ఇంద్రజిత్తు కనీసం అతణ్ణి అదుపులో తెచ్చుకొని బంధించడం ఎలా అనే విషయం గూర్చి తీవ్రంగా యోచించసాగాడు.

35

తతః పైతామహం వీరః సోఽస్త్రమస్త్రవిదాం వరః,
సందధే సుమహాతేజాస్తం హరిప్రవరం ప్రతి.

36

అవధ్యోఽయమితి జ్ఞాత్వా తమస్త్రేణాస్త్రతత్త్వవిత్,
నిజగ్రాహ మహాబాహుర్మారుతాత్మజమిన్ద్రజిత్.

37

తేన బద్ధస్తతోఽస్త్రేణ రాక్షసేన స వానరః,
అభవన్నిర్విచేష్టశ్చ పపాత చ మహీతలే.

38

తతోఽథ బుద్ధ్వా స తదస్త్రబన్ధం
ప్రభోః ప్రభావాద్విగతాత్మవేగః,
పితామహానుగ్రహమాత్మనశ్చ
విచిన్తయామాస హరిప్రవీరః.

39

తతః స్వాయంభువైర్మంత్రైర్బ్రహ్మాస్త్ర మభిమన్త్రితమ్,
హనుమాం శ్చింతయామాస వరదానం పితామహాత్.

40

అస్త్రవిదులలో సర్వశ్రేష్ఠుడు, మహావీరుడు, గొప్ప తేజశ్శాలి అయిన ఆ ఇంద్రజిత్తు ఆలోచనలోనుండి తేరుకొని హనుమంతునిపై బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు.

36

అస్త్ర శక్తులను గురించి క్షుణ్ణంగా తెలిసిన భుజబలుడైన ఇంద్రజిత్తు, ఆ వానరుని చంపడం అసంభవమని గ్రహించి, హనుమంతుణ్ణి బ్రహ్మాస్త్రంచే బంధించాడు.

37

ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడి, చేష్టలుదక్కి హనుమంతుడు దబ్బున నేల మీద పడిపోయాడు.

38

బ్రహ్మాస్త్ర ప్రభావంచే తాను బంధింపబడ్డట్లు హనుమంతుడు గ్రహించాడు. బ్రహ్మాస్త్ర ప్రభావం మూలంగా తన ఉద్ధృతిని కోల్పోయిన వాడైనప్పటికీ పూర్వం బ్రహ్మదేవుడు తనను అనుగ్రహించిన వైనం గూర్చి తలచుకొన్నాడు.

39

బ్రహ్మపరమైన మంత్రాలచే అభిమంత్రింపబడిన బ్రహ్మాస్త్రాన్ని ఇంద్రజిత్తు ప్రయోగించాడని హనుమంతుడు తెలుసుకొన్నాడు. వెంటనే పూర్వం బ్రహ్మదేవుడు తనకు ప్రసాదించిన వరాన్ని గుర్తు చేసుకొన్నాడు.

40

న మేఽస్త్రబన్ధస్య చ శక్తిరస్తి
విమోక్షణే లోకగురోః ప్రభావాత్,

ఇత్యేవ మత్వా విహితోఽస్త్రబన్ధో
మయాత్మయోనేరనువర్తితవ్యః.

41

స వీర్యమస్త్రస్య కపిర్విచార్య
పితామహానుగ్రహమాత్మనశ్చ,
విమోక్షశక్తిం పరిచిన్తయిత్వా
పితామహాజ్ఞామనువర్తతే స్మ.

42

అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే,
పితామహమహేన్ద్రాభ్యాం రక్షితస్యానిలేన చ.

43

గ్రహణే చాపి రక్షోభిర్మహన్మే గుణదర్శనః,
రాక్షసేన్ద్రేణ సంవాదస్తస్మాద్గృహ్ణన్తు మాం పరే.

44

హనుమంతుడు తనలో ఇలా అనుకొన్నాడు: బ్రహ్మ ప్రభావితమైన ఈ బ్రహ్మాస్త్రబంధాన్ని అతిక్రమించే శక్తి నాకు లేదని భావించి ఇంద్రజిత్తు ఈ అస్త్రాన్ని నాపై సంధించాడు. అయినప్పటికీ కొంతసేపు ఈ అస్త్రానికి కట్టుబడి ఉండడం ఆ బ్రహ్మదేవుని గౌరవించినట్లవుతుంది.

41

బ్రహ్మాస్త్ర ప్రభావాన్ని, బ్రహ్మదేవుని అనుగ్రహంతో ఆ అస్త్రబంధం నుండి తనకు తప్పించుకోగల సామర్థ్యం ఉందనే విషయాన్ని బాగా తెలిసిన ఆ హనుమంతుడు తాత్కాలికంగా బ్రహ్మదేవుని ఆదేశానుసారం ఆ అస్త్రానికి కట్టుబడ్డాడు.

42

మళ్ళీ హనుమంతుడు ఇలా అనుకొన్నాడు: బ్రహ్మదేవుడు, దేవేంద్రుడు, వాయుదేవుడు నాకు రక్షగా ఉన్నారు. కనుక అస్త్ర బంధంలో ఉన్నప్పటికీ నేను ఎంతమాత్రమూ భయపడనక్కర్లేదు.

43

ఈ రాక్షసులకు బందీనై ఉండడంలో రాక్షసరాజైన రావణుని కలుసుకుని ఆతడితో మాట్లాడే గొప్ప అవకాశం నాకు కలుగుతుంది. కాబట్టి వీళ్ళు బంధిస్తారుగాక!

44

స నిశ్చితార్థః పరవీరహన్తా
సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః,
పరైః ప్రసహ్యాభిగతైర్నిగృహ్య
ననాద తైస్తైః పరిభర్త్స్యమానః.

45

తతస్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్టమరిందమమ్,
బబన్ధుః శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః.

46

స రోచయామాస పరైశ్చ బన్ధనం
ప్రసహ్య వీరైరభినిగ్రహం చ,
కౌతూహలాన్మాం యది రాక్షసేన్ద్రో
ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః.

47

స బద్ధస్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్,
అస్త్రబన్ధః స చాన్యం హి న బన్ధమనువర్తతే.

48

శత్రువుల బలపరాక్రమాలను నిర్వీర్యం గావించే వాడు, ముందు వెనుకలు బాగా యోచించి పనులు చక్కబెట్టేవాడు అయిన ఆ హనుమంతుడు కృతనిశ్చయుడై చేష్టలుడిగిన స్థితిలోనే ఉండిపోయాడు. ఇదే అదనుగా రాక్షసులు దగ్గరకు వచ్చి బలప్రయోగంతో బంధించి భయపెడుతూ ఉంటే, హనుమంతుడు బిగ్గరగా కేకపెట్టాడు.

45

శత్రువులకు సింహస్వప్నమైన హనుమంతుడు అలా కదలామెదలక ఉండడంతో ఆ రాక్షసులు గట్టివైన జనపనారలతోను, పేనిన చెట్లనార చీరలతోను అతణ్ణి బంధించారు.

46

కనీసం కుతూహలంకొద్దీ అయినా రాక్షసరాజైన రావణుడు తనను చూసే ఉద్దేశంతో రావచ్చునని, ఆతణ్ణి ముఖాముఖీ కలుసుకోవడానికి అది చక్కని అవకాశమని హనుమంతుడు భావించాడు. ఆ కారణంగా శత్రువులు తనను బెదిరిస్తూ బంధిస్తూంటే కిమ్మనకుండా ఊరకున్నాడు.

47

మహాపరాక్రమవంతుడైన హనుమంతుణ్ణి, రాక్షసులు నారచీరలచే బంధించగానే బ్రహ్మాస్త్రబంధం తొలగిపోయింది. ఇతర సాధనాలచే మళ్ళీ బంధించినప్పుడు బ్రహ్మాస్త్రబంధం వీడిపోతుంది.

48

అథేన్ద్రజిత్తు ద్రుమచీరబద్ధం
విచార్యవీరః కపిసత్తమం తమ్,
విముక్తమస్త్రేణ జగామ చిన్తాం
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్.

49

అహో మహత్కర్మ కృతం నిరర్థకం
న రాక్షసైర్మన్త్రగతిర్విమృష్టా,
పునశ్చ మన్యే విహతేఽస్త్రమన్య
త్ప్రవర్తతే సంశయితాఃస్మ సర్వే.

50

అస్త్రేణ హనుమాన్ ముక్తో నాత్మానమవబుధ్యత,
కృష్యమాణస్తు రక్షోభిః తైశ్చ బన్ధైర్నిపీడితః.

51

హన్యమానస్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః,
సమీపం రాక్షసేన్ద్రస్య ప్రాకృష్యత స వానరః.

52

నారచీరలతో బంధించిన హనుమంతుణ్ణి బ్రహ్మాస్త్రం తన బంధం నుండి విముక్తుని చేయడం ఇంద్రజిత్తు గుర్తించి, చింతిస్తూ ఇలా తలపోశాడు: ఇతర సాధనాలతో బంధితుడైన వాడిని బ్రహ్మాస్త్రబంధం విడిచిపుచ్చుతుంది కదా! అయ్యో! బ్రహ్మాస్త్ర మంత్ర విధానం ఎరుగని

మూర్ఖులైన ఈ రాక్షసులు యోచించకుండా ఈ మహత్కార్యాన్ని వ్యర్థం చేశారు. ఒకసారి బ్రహ్మాస్త్రం నిష్ఫలమైన తరువాత మరో అస్త్రం ఏదీ పనిచెయ్యదు. ఇప్పుడు అందరమూ పెద్ద చిక్కులో పడ్డాం గదా!

49–50

బ్రహ్మాస్త్రబంధం నుండి తాను విడివడినట్లు హనుమంతుడు రాక్షసులకు తెలియనివ్వలేదు. కనుక తనను రాక్షసులు బాధిస్తూ, బంధించి ఈడ్చుకొని పోతుంటే యథాలాపంగా ఉండిపోయాడు.

51

క్రూరులైన రాక్షసులు పిడికిళ్ళతో పొడుస్తూ, కర్రలతో బాదుతూ ఆ వానరవీరుడైన హనుమంతుణ్ణి రాక్షసరాజైన రావణుని సమక్షానికి ఈడ్చుకుపోయారు.

52

అథేన్ద్రజిత్తం ప్రసమీక్ష్య ముక్త
మస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః,
వ్యదర్శయత్తత్ర మహాబలం తం
హరిప్రవీరం సగణాయ రాజ్ఞే.

53

తం మత్తమివ మాతఙ్గం బద్ధం కపివరోత్తమమ్,
రాక్షసా రాక్షసేన్ద్రాయ రావణాయ న్యవేదయన్.

54

కోఽయం కస్య కుతో వాత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః,
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః.

55

హన్యతాం దహ్యతాం వాపి భక్ష్యతామితి చాపరే,
రాక్షసాస్తత్ర సంక్రుద్ధాః సరస్పరమథాబ్రువన్.

56

వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు బ్రహ్మాస్త్రబంధం నుండి విడివడ్డాడనీ, కేవలం నారచీరల జనపనారలచే మాత్రమే అతడు కట్టుబడి ఉన్నాడనీ ఇంద్రజిత్తుకు బాగా తెలుసు.

అయినప్పటికీ రాక్షసులు హనుమంతుణ్ణి ఈడ్చుకుపోతూ ఉండగా, ఇంద్రజిత్తు కూడా రావణుని సమక్షంలోకి వెళ్ళాడు.

53

నానాప్రయాసలకోర్చి చివరికి బంధింపబడిన మదపుటేనుగు చందాన ఉన్న ఆ హనుమంతుణ్ణి రాక్షసులు తమ రాజైన రావణుని ముందు నిలబెట్టారు.

54

సభలో కొలువుదీరిన రాక్షసవీరులు తమలో తాము ఇలా అనుకొన్నారు: ఇతడెవడు? ఎవరి వాడు? ఎక్కణ్ణుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? లంకలో ఇతడికి ఏం పని? ఇతడి వెనుక ఎవరున్నారు?

55

కోపోద్రేకాలతో ఊగిపోతున్న కొందరు రాక్షసులు, "ఇతగాణ్ణి చంపండి! సజీవదహనం చెయ్యండి! భక్షించండి" అంటూ ఒకరికొకరు చెప్పుకోసాగారు.

56

అతీత్య మార్గం సహసా మహాత్మా
స తత్ర రక్షోధిపసాదమూలే,
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్
గృహం మహారత్న విభూషితం చ.

57

స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమమ్,
రక్షోభిర్వికృతాకారైః కృష్యమాణమితస్తతః.

58

రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః,
తేజోబలసమాయుక్తం తపంత మివ భాస్కరమ్.

59

స రోషసంవర్తిత తామ్రదృష్టి
ర్దశాననస్తం కపిమన్వవేక్ష్య,
అథోపవిష్టాన్ కులశీలవృద్ధాన్

సమాదిశత్తం ప్రతి మన్త్రిముఖ్యాన్.

60

మహాత్ముడైన హనుమంతుడు వడిగా రాజమార్గాన్ని దాటి, అమూల్య రత్నాలచే అలంకృతమై శోభాయమానంగా ఉన్న రావణుని సభాభవనాన్ని, రావణుని పాదాల సమీపంలో ఆసీనులై ఉన్న వృద్ధులైన అమాత్యులను చూశాడు.

57

అప్పుడు తేజోవిరాజమానుడైన రావణుడు సింహాసనం మీద నుండి వికృతరూపులైన రాక్షసులు ఈడ్చుకువస్తున్న వానరశ్రేష్ఠుడైన హనుమంతుణ్ణి చూశాడు.

58

తేజోబలసమన్వితుడై సూర్యునిలా భాసిస్తున్న రాక్షసరాజైన ఆ రావణుని, కపివరేణ్యుడైన హనుమంతుడు కూడా తేరిపార చూశాడు.

59

రోషావేశాలతో కళ్ళు ఎర్రబడగా రావణుడు గుడ్లురుముతూ హనుమంతుణ్ణి నఖశిఖపర్యంతం పరికించి సభలో కొలువుదీరి ఉన్న అనుభవశీలురైన, గుణవంతులైన తన మంత్రివర్యులకు "ఇతణ్ణి గూర్చి ఆరా తియ్యండి" అని ఆదేశమిచ్చాడు.

60

యథాక్రమం తైః స కపిర్విపృష్టః
కార్యార్థమర్థస్య చ మూలమాదౌ,
నివేదయామాస హరీశ్వరస్య
దూతః సకాశాదహమాగతోఽస్మి.

61

రావణుని ఆదేశాన్ని శిరసావహిస్తూ ఆ మంత్రిపుంగవులు అతడి రాకలోని ఉద్దేశం ఏమిటని ప్రశ్నించగా అందుకు హనుమంతుడు ఇలా జవాబిచ్చాడు: "నేను వానరరాజైన సుగ్రీవుడు పంపగా వచ్చిన దూతను."

61

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 48వ సర్గ సమాప్తం

49

వ సర్గ

రావణుని అపురూప రాజసం

తతః స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః,
హనుమాన్ రోషతామ్రాక్షో రక్షోధిపమవైక్షత.

1

భ్రాజమానం మహార్హేణ కాఞ్చనేన విరాజతా,
ముక్తాజాలావృతేనాథ మకుటేన మహాద్యుతిమ్.

2

వజ్రసంయోగసంయుక్తై ర్మహార్హ మణివిగ్రహైః,
హైమైరాభరణైశ్చిత్రైర్మనసేవ ప్రకల్పితైః.

3

తనను బందీని చేసి సభకు రప్పించుకొన్న రావణుని చర్యకు మహాపరాక్రమవంతుడైన హనుమంతుడు విస్మితుడై, పిదప రోషంతో కళ్ళు ఎర్రబారగా ఆతణ్ణి తేరిపార చూశాడు.

1

మేలిమి బంగారంతో నిర్మితమై అమూల్య ముత్యాలచే పొదుగబడిన కిరీటం ధరించి ఉన్నాడు రావణుడు. ఆ కిరీట కాంతులతో సహజమైన ఆతడి

తేజస్సు ద్విగుణీకృతమౌతోంది.

2

రాక్షసరాజైన రావణుడు వజ్రాలతోను, అమూల్య మణులతోను పొదుగబడి, తలచిన మాత్రానే సృజింపబడ్డవా అన్నట్లున్న చిత్రవిచిత్రమైన స్వర్ణాభరణాలను ధరించి భాసిస్తున్నాడు.

3

మహార్హక్షౌమసంవీతం రక్తచన్దనరూషితమ్,
స్వనులిప్తం విచిత్రాభిర్విధాభిశ్చ భక్తిభిః.

4

వివృతైదర్శనీయైశ్చ రక్తాక్షైర్భీమదర్శనైః,
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలమ్బదశనచ్ఛదైః.

5

శిరోభిర్దశభిర్వీరం భ్రాజమానం మహౌజసమ్,
నానావ్యాళసమాకీర్ణైః శిఖరైరివ మన్దరమ్.

6

నీలాఞ్జనచయప్రఖ్యం హారేణోరసి రాజతా,
పూర్ణచన్ద్రాభవక్త్రేణ సబలాకమివామ్బుదమ్.

7

బాహుభిర్బద్ధకేయూరై శ్చన్దనోత్తమరూషితైః,
భ్రాజమానాఙ్గదైః పీనైః పఞ్చశీర్షైరివోరగైః.

8

రావణుడు వెలకట్టలేని తెల్లని పట్టువస్త్రాలు ధరించి, శరీరానికి శ్రేష్ఠమైన ఎర్రనిచందనం అలదుకొని ఉన్నాడు. అతడి శరీరం మీద

విచిత్రాలైన అనేక రకాల బొమ్మలు చిత్రింపబడి ఉన్నాయి.

4

మహావీరుడూ, తేజోవిరాజమానుడూ అయిన ఆ రావణుడు భీతినిగొల్పు ఎర్రబారిన కన్నులు గల, వాడియైన కోరలు గల, వేలాడుతూన్న పెదవులు గల తన పది తలలతో క్రూరమృగాలతో కూడిన శిఖరాలతో అలరారుతున్న మందరపర్వత చందాన ఒప్పారుతున్నాడు.

5–6

నల్లని కాటుక కొండలా ఉన్న ఆ రావణుని వక్షస్థ్సలం మీద చంద్రుని చందాన ముత్యాలహారాలు ప్రకాశిస్తున్నాయి. అప్పుడతడు ఎగిరిపోతున్న కొంగలబారు నేపథ్యంలోని విస్తృత మేఘంలా కానవచ్చాడు.

7

ఆతడి బలిష్ఠమైన, గుండ్రటి బాహువులు భుజకీర్తులతో, దండకడియాలతో ఒప్పారుతూ మేలిమి చందన పూతలతో శోభిల్లుతూ ఐదు పడగల సర్పాలను పోలినట్లు కానవస్తున్నాయి.

8

మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే,
ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే.

9

అలంకృతాభిరత్యర్థం ప్రమదాభిః సమన్తతః,
వాలవ్యజనహస్తాభిరా త్సముపసేవితమ్.

10

దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా,
మన్త్రిభిర్మన్త్రతత్త్వజ్ఞైర్నికుమ్భేన చ మన్త్రిణా.

11

సుఖోపవిష్టం రక్షోభిశ్చతుర్భి ర్బలదర్పితైః,
కృత్స్నం పరివృతం లోకం చతుర్భిరివ సాగరైః.

12

మన్త్రిభిర్మన్త్రతత్త్వజ్ఞైరన్యైశ్చ శుభబుద్ధిభిః,
అన్వాస్యమానం రక్షోభిః సురైరివ సురేశ్వరమ్.

13

స్ఫటిక నిర్మితమై చిత్రవర్ణాలు వెదజల్లుతున్న రత్నాలు పొదిగిన, రత్నకంబళం పరచి ఉన్న సింహాసనం మీద ఆ రావణుడు అపురూపమైన రాజసంతో ఆసీనుడై ఉన్నాడు.

9

చక్కగా అలంకరించుకొన్న సుందరీమణులు సింహాసనం మీద రాజసంతో ఆసీనుడై ఉన్న రావణునికి రెండు వైపులా నిలబడి వింజామరలు వీస్తూ ఆతణ్ణి సేవిస్తున్నారు.

10

మంత్రాంగంలో సిద్ధహస్తులు, బలదర్పితులు అయిన దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అనే నలుగురు రాక్షసమంత్రులు రావణుని చుట్టూ, సమీపంలో కూర్చుని ఉన్నారు. నలుగురు సచివులచే పరివృతుడైన ఆ రావణుడు అప్పుడు నాలుగు సముద్రాలచే ఆవృతమై ఉన్న భూమండల చందాన భాసిస్తున్నాడు.

11–12

తన హితాన్ని కోరేవారు, రాజ్యతంత్రం బాగా ఎరిగిన వారు, సమయానుకూలమైన సూచనలు ఇవ్వడంలో సమర్థులు అయిన మరికొందరు రాక్షసమంత్రులు తనను పరివేష్టించి ఉండగా ఆ రావణుడు దేవతలు సేవిస్తున్న ఇంద్రునిలా కానవచ్చాడు.

13

అపశ్యద్రాక్షసపతిం హనుమానతితేజసమ్,
విష్ఠితం మేరుశిఖరే సతోయమివ తోయదమ్.

14

స తైః సంపీడ్యమానోఽపి రక్షోభిర్భీమవిక్రమైః,
విస్మయం పరమం గత్వా రక్షోఽధిపమవైక్షత.

15

భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్ రాక్షసేశ్వరమ్,
మనసా చిన్తయామాస తేజసా తస్య మోహితః.

16

అహో రూపమహో ధైర్యమహో సత్త్వమహో ద్యుతిః,
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా.

17

యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః,
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా.

18

సమున్నత సింహాసనం మీద ఆసీనుడై, మేరుపర్వత శిఖరం మీద నిలచిన సజల మేఘం వలె రాచఠీవితో, తేజస్సుతో తేజరిల్లుతున్న రాక్షసేంద్రుడైన ఆ రావణుని హనుమంతుడు చూశాడు.

14

తనను పరాక్రమవంతులైన రాక్షసులు ఒక వంక పీడిస్తూ బాధిస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోక హనుమంతుడు ఆశ్చర్యచకితుడై రావణునే రెప్పవాల్చకుండా చూస్తూండిపోయాడు.

15

అలా తదేకంగా కాసేపు చూసిన తరువాత రావణుని తేజోప్రకాశానికి మైమరచిన వాడైన ఆ హనుమంతుడు తనలో ఇలా అనుకొన్నాడు.

16

అహా! ఏమా రూపం! ఏమా శౌర్యం! ఏమా బలం! ఏమా తేజస్సు! నిజానికి ఈ రాక్షసరాజైన రావణుడు సకల ప్రశస్త లక్షణాలతో విరాజిల్లుతున్నాడే!

17

ఇతడిలో అధర్మవర్తనం అనే అవలక్షణం ఇంత బలీయంగా లేకపోయి ఉంటే ఈ రావణుడు, దేవేంద్ర సహితమైన స్వర్గలోకాన్ని సైతం పరిపాలిస్తూ ఉండేవాడు.

18

అస్య క్రూరైర్నృశంసైశ్చ కర్మభిర్లోకకుత్సితైః,
సర్వే బిభ్యతి ఖల్వస్మాల్లోకాః సామరదానవాః.

19

అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తుమేకార్ణవం జగత్,
ఇతి చిన్తాం బహువిధామకరోన్మతిమాన్ హరిః,
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావమమితౌజసః.

20

లోకనింద్యములైన, క్రూరములైన, హింసాత్మకాలైన అధర్మానికి అద్దంపట్టే కార్యాలు చేస్తూండడం వలన దేవ దానవ లోకాలన్నీ ఈ రావణునికి భయపడుతున్నాయి.

ఇతడికి కనుక ఆగ్రహం వస్తే లోకాన్ని జలప్రళయంలో ముంచెత్తగలడు– అనుకొంటూ హనుమంతుడు రాక్షసేంద్రుడైన ఆ రావణుని ప్రభావాన్ని విభిన్న కోణాలలో చింతన చేశాడు.

20

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 49వ సర్గ

సమాప్తం

50

వ సర్గ

రాముని దూతనని హనుమంతుడు ప్రకటించడం

తముద్వీక్ష్య మహాబాహుః పిఙ్గాక్షం పురతః స్థితమ్,
కోపేన మహతావిష్టో రావణో లోకరావణః.

1

శఙ్కాహతాత్మా దధ్యౌ స కపీన్ద్రం తేజసావృతమ్,
కిమేష భగవాన్నన్దీ భవేత్సాక్షాదిహాగతః.

2

యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా,
సోఽయం వానరమూర్తిస్స్యాత్ కిం స్విద్బాణోఽపి వాఽసురః.

3

మహాబాహువు, లోకకంటకుడు అయిన రావణుడు తన ముందు నిలబడి ఉన్న గోరోచనపు కన్నులుగల హనుమంతుని తేరిపార చూసి, ఆగ్రహోదగ్రుడయ్యాడు.

1

తేజోవిరాజమానుడై భాసిస్తున్న ఆ వానరశ్రేష్ఠుని పరికించిన రావణుని

మనస్సులో ఏవో సంశయాలు తలెత్తగా, అతడు ఇలా ఆలోచనలో పడ్డాడు. పూర్వం కైలాసపర్వతాన్ని నేను కదిలించినప్పుడు కుపితుడై నన్ను శపించిన సాక్షాత్తు ఆ నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చాడా! కాకుంటే వానరరూపం దాల్చి వచ్చిన బాణాసురుడా ఇతడు?

2–3

స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మన్త్రిసత్తమమ్,
కాలయుక్తమువాచేదం వచో విపులమర్థవత్.

4

దురాత్మా పృచ్ఛ్యతామేష కుతః కిం వాఽస్య కారణమ్,
వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే.

5

మత్పురీమపృధృష్యాం వాఽఽగమనే కిం ప్రయోజనమ్,
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్య తామేష దుర్మతిః.

6

రావణస్య వచః శ్రుత్వా ప్రహస్తో వాక్యమబ్రవీత్,
సమాశ్వసిహి భద్రం తే న భీః కార్యా త్వయా కపే.

7

యది తావత్త్వమిన్ద్రేణ ప్రేషితో రావణాలయమ్,
తత్త్వమాఖ్యాహి మా భూత్తే భయం వానర మోక్ష్యసే.

8

ఇలా ఆలోచించిన రావణుడు కుపితుడై కళ్ళు ఎర్రబారగా మంత్రి సత్తముడైన ప్రహస్తునితో గంభీరంగా, సమయోచితంగా, అర్థవంతంగా, క్లుప్తంగా ఇలా పలికాడు.

4

ఈ దురాత్ముడు ఎక్కణ్ణుంచి వచ్చాడో, ఎందుకు వచ్చాడో అడుగు. అశోకవనాన్ని ధ్వంసం చేసి రాక్షసస్త్రీలను భయపెట్టడంలో ఇతడి ఉద్దేశం ఏమిటో కూడా అడిగి తెలుసుకో.

5

దుర్భేద్యమైన నా నగరంలోనికి ఏ ప్రయోజనం ఆశించి వచ్చాడో, యుద్ధం చేసి బీభత్సపరచడంలో ఆంతర్యం ఏమిటో ఈ దుష్ట వానరుణ్ణి నిలదీసి అడుగు.

6

రావణుని ఆదేశానుసారం ప్రహస్తుడు, హనుమంతునితో ఇలా అన్నాడు: ఓ వానరుడా! కంగారుపడకు, భయపడకు.

7

ఓ వానరుడా! నువ్వు దేవేంద్రుడు పంపగా ఈ లంకానగరానికి వచ్చావా ఏమిటి? ఏదీ దాచకుండా నిర్భయంగా నిజం చెప్పు. నిన్ను బంధవిముక్తుని చేసి విడుదలచేస్తాం.

8

యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య చ,
చారరూపమిదం కృత్వా ప్రవిష్టో నః పురీమిమామ్,
విష్ణునా ప్రేషితో వాపి దూతో విజయకాంక్షిణా.

9

న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్,
తత్త్వతః కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే.

10

అనృతం వదతశ్చాపి దుర్లభం తవ జీవితమ్,
అథవా యన్నిమిత్తస్తే ప్రవేశో రావణాలయే.

11

ఏవముక్తో హరిశ్రేష్ఠస్తదా రక్షోగణేశ్వరమ్,
అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా.

12

ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదితః,
జాతిరేవ మమ త్వేషా వానరోఽహమిహాగతః.

13

గూఢచారిలా మా నగరంలోనికి రహస్యంగా ప్రవేశించావు. నిన్ను ఇక్కడకు పంపించింది కుబేరుడా? యమ వరుణులలో ఎవరైనా పంపించారా? లేకపోతే మమ్మల్ని అదుపులోకి తెచ్చుకోవాలని ఆతురతపడుతున్న సాక్షాత్తు ఆ విష్ణువే నిన్ను దూతగా పంపించాడా?

9

నువ్వు రూపంలో మాత్రమే వానరుడవు; వానరులకు ససేమిరా ఇంతటతేజస్సు ఉండడం అసంభవం. నువ్వు నిజం చెబితే, తక్షణమే విడిచిపెడతాం.

10

కాని అబద్ధం చెబితే మాత్రం ప్రాణాలతో ఉండవు. ఒకవేళ ఎవరూ పంపకున్నా నువ్వంతట నువ్వే వచ్చావా? అలా అయితే ఎందుకు వచ్చావు?

11

ప్రహస్తుడు అడిగిన ప్రశ్నలు విన్న ఆ హనుమంతుడు తిన్నగా రావణునికే ఇలా జవాబిచ్చాడు: "నేను దేవేంద్రుని నుండిగాని, యమునినుండిగాని వచ్చిన దూతను కాను. వరుణుడు పంపితే వచ్చిన వాణ్ణీ కాను. నాకూ కుబేరునికీ ఎటువంటి సంబంధమూ లేదు. నన్ను విష్ణువు కూడా పంపలేదు. నేను వానరరూపం దాల్చి వచ్చిన వాడిని కాను. నేను

వానరుడిగానే జన్మించిన వాణ్ణి. ఈ లంకానగరానికి రావాలనుకొనే వచ్చాను.

12–13

దర్శనే రాక్షసేన్ద్రస్య దుర్లభే తదిదం మయా,
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్.

14

తతస్తే రాక్షసాः ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణः,
రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే.

15

అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి,
పితామహాదేవ వరో మామాప్యేషోఽభ్యుపాగతः.

16

రాజానాం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్,
విముక్తో హ్యహమస్త్రేణ రాక్షసైస్త్వభిపీడితः.

17

కేనచిద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాన్తికమ్.

18

దూతోఽహమితి విజ్ఞేయో రాఘవస్యామితౌజసः,
శ్రూయతాం చాపి వచనం మమ పథ్యమిదం ప్రభో.

19

రాక్షసేంద్రుని దర్శనం లభించడం అసాధ్యం. కనుక నిన్ను కలుసుకొనే అవకాశం లభిస్తుందనే ఉద్దేశంతోనే అశోకవనాన్ని ధ్వంసం చేశాను.

14

నేను అలా చేస్తున్నప్పుడు పరాక్రమవంతులైన రాక్షసవీరులు నాతో యుద్ధానికి దిగారు. అప్పుడు ఆత్మరక్షణ కోసమే వాళ్ళను ఎదుర్కొని యుద్ధం చేయవలసి వచ్చింది.

15

దేవతలుగాని, అసురులుగాని నన్ను అస్త్రాలతో బంధించలేరు. అట్టి వరం బ్రహ్మదేవుడు నాకు అనుగ్రహించాడు.

16

నిన్ను కలుసుకోవాలనే కోర్కెతోనే ఈ బ్రహ్మాస్త్ర బంధానికి కట్టుపడ్డాను. రాక్షసులు నన్ను బంధించగానే బ్రహ్మాస్త్ర ప్రభావం తొలగిపోయింది. నేను ఒకానొక ముఖ్యమైన రాజకార్య నిమిత్తంగా ఇక్కడకు వచ్చాను.

17–18

అపరిమిత బలపరాక్రమాలు సంతరించుకొన్న రాముని దూతను నేను. ఓ రాక్షసేంద్రా! నీ క్షేమం గూర్చి నేను చెప్పే హితవచనాలు ఆలకించు.”

19

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 50వ సర్గ సమాప్తం

51

వ సర్గ

హనుమంతుని హితోపదేశం

తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః,
వాక్యమర్థవదవ్యగ్రస్తమువాచ దశాననమ్.

1

అహం సుగ్రీవసందేశాదిహ ప్రాప్తస్తవాలయమ్,
రాక్షసేన్ద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్.

2

భ్రాతుః శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః,
ధర్మార్థోపహితం వాక్యమిహ చాముత్ర చ క్షమమ్.

3

మహాబల సమన్వితుడు, కపిశ్రేష్ఠుడు అయిన ఆ హనుమంతుడు, మహాబలపరాక్రమ సంపన్నుడైన రావణుని చూస్తూ ఎటువంటి తొట్రుపాటు లేకుండా అర్థవంతంగా ఇలా పలుకసాగాడు.

1

ఓ రాక్షసేంద్రా! నేను వానరరాజైన సుగ్రీవుని ఆదేశం మేరకు ఇక్కడకు వచ్చాను. నీకు సోదర సమానుడైన సుగ్రీవుడు నీ క్షేమం విచారించమన్నాడు.

2

మహాత్ముడూ, నీకు సోదరప్రాయుడూ అయిన సుగ్రీవుని నుండి ఒక సందేశం తెచ్చాను. ఆ సందేశం నీకు ఇహపరాల్లో శ్రేయస్సును చేకూర్చే ధర్మార్థసహితమైనది.

3

రాజా దశరథో నామ రథకుఞ్జరవాజిమాన్,
పితేవ బన్ధుర్లోకస్య సురేశ్వరసమద్యుతిః.

4

జ్యేష్ఠస్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః,
పితుర్నిదేశాన్నిష్క్రాన్తః ప్రవిష్టో దణ్డకావనమ్.

5

లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా,
రామో నామ మహాతేజా ధర్మ్యం పన్థానమాశ్రితః.

6

తస్య భార్యా వనే నష్టా సీతా పతిమనువ్రతా,
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః.

7

స మార్గమాణస్తాం దేవీం రాజపుత్రః సహానుజః,
ఋశ్యమూకమనుప్రాప్తః సుగ్రీవేణ సమాగతః.

8

దశరథుడనే మహారాజు చతురంగబల సమృద్ధుడై రాజ్యపాలన చేశాడు. దేవేంద్రునికి దీటైన తేజస్సంపన్నుడైన ఆ మహారాజు ప్రజలను కన్నబిడ్డల్లా పాలించాడు.

4

ఆ దశరథ మహారాజు పెద్దకుమారుడైన రాముడు ఆజానుబాహువు, మహాతేజశ్శాలి, తండ్రికి ప్రీతి చేకూర్చేవాడు. మా ప్రభువైన ఆ రాముడు ధర్మవర్తనుడై తండ్రి ఆజ్ఞానుసారం సోదరుడైన లక్ష్మణునితో, భార్య సీతతో రాజ్యం వీడి అరణ్యవాసం చేయడానికి దండకారణ్యంలో ప్రవేశించాడు.

5–6

మహాత్ముడు, విదేహాధిపతి అయిన జనకమహారాజు కుమార్తె, భర్తకు సదా తోడునీడలా మెలగుతూ ఉండేదీ, రాముని భార్యా అయిన సీతాదేవి దండకారణ్యంలో హఠాత్తుగా అనూహ్యంగా కనిపించకుండాపోయింది.

7

రాజపుత్రుడైన రాముడు, తమ్ముడు లక్ష్మణునితో కలసి సీతాదేవిని అన్వేషిస్తూ ఋశ్యమూకపర్వతం చేరుకున్నాడు. అక్కడ సుగ్రీవుణ్ణి కలుసుకున్నాడు.

8

తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణమ్,
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్.

9

తతస్తేన మృధే హత్వా రాజపుత్రేణ వాలినమ్,
సుగ్రీవః స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః.

10

త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుఙ్గవః,
రామేణ నిహతః సంఖ్యే శరేణైకేన వానరః.

11

స సీతామార్గణే వ్యగ్రః సుగ్రీవః సత్యసంగరః,
హరీన్ సంప్రేషయామాస దిశః సర్వా హరీశ్వరః.

12

తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ,
దిక్షు సర్వాసు మార్గన్తే హ్యధశ్చోపరి చామ్బరే.

13

సీతాదేవిని వెదికిస్తానని సుగ్రీవుడు, సుగ్రీవుడికి వానరరాజ్యం కట్టబెడతానని రాముడు పరస్పరం ప్రతిజ్ఞలు చేసుకున్నారు.

9

తదనంతరం ప్రతిజ్ఞానుసారం రాముడు యుద్ధంలో వాలిని వధించి సమస్త వానరభల్లూక గణాలకు ఏకైక నాయకునిగా, కిష్కింధా రాజ్యానికి రాజుగా సుగ్రీవుని అభిషిక్తుణ్ణి చేశాడు.

10

వానరపుంగవుడైన వాలి మహోన్నత బలపరాక్రమాలు నీకు తెలియనివి కావు. అటువంటి వాలిని ఒకే ఒక్క బాణంతో రాముడు నేలకూల్చాడు.

11

ఇచ్చిన మాట తప్పని వానరరాజైన సుగ్రీవుడు సీతాన్వేషణార్థం నాలుగు దిక్కులకు వానరులను పంపించాడు.

12

లక్షలాదిమంది వానరవీరులు సీతాదేవికోసం అన్ని దిక్కులలోను, సమస్త భూమండలంలోను, పాతాళంలోను, ఆకాశంలోను కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని వెదకుతున్నారు.

13

వైనతేయసమాః కేచిత్ కేచిత్తత్రానిలోపమాః,
అసంగగతయః శీఘ్రా హరివీరా మహాబలాః.

14

అహం తు హనుమాన్నామ మారుతస్యౌరసః సుతః,
సీతాయాస్తు కృతే తూర్ణం శతయోజనమాయతమ్.

15

సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షురిహాగతః,
భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా.

16

తద్భవాన్ దృష్టధర్మార్థస్తపఃకృతపరిగ్రహః,
పరదారాన్ మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వమర్హసి.

17

న హి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు,
మూలఘాతిషు సజ్జన్తే బుద్ధిమన్తో భవద్విధాః.

18

అలా అన్వేషిస్తున్న వానరవీరులలో కొందరు గరుత్మంతునకు దీటైన బలపరాక్రమ సంపన్నులు. వారిలో మరికొందరు ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా వాయువేగంతో ఎక్కడికైనా అత్యంత శీఘ్రంగా వెళ్ళగల సమర్థులు.

14

నా పేరు హనుమంతుడు, సాక్షాత్తు వాయుదేవుని పుత్రుణ్ణి. సీతాదేవిని అన్వేషిస్తూ నూరు యోజనాల విస్తీర్ణమైన సముద్రాన్ని అలవోకగా లంఘించి లంకకు వచ్చాను. లంకలో అన్ని చోట్ల వెతకుతూండగా నాకు ఆమె నీ భవనంలో కనిపించింది.

15–16

నీకు ధర్మసూక్ష్మాలు కరతలామలకం. పైగా నువ్వు గొప్ప తపస్సంపన్నుడివి. ఓ మహాబుద్ధిశాలీ! పర భార్యను నీ ఇంట్లో నిర్బంధంగా ఉంచడం నీవంటి వాడు చేయాల్సిన పని కాదు.

17

నీ లాంటి వివేకవంతులు ధర్మవిరుద్ధమైన కార్యాలకు ఎన్నటికీ ఒడిగట్టరు. ఎందుకంటే అట్టి కార్యాచరణ అనేక ప్రమాదాలకు దారితీస్తుంది, చివరికి సర్వనాశనంగా పరిణమిస్తుంది.

18

కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్,
శరాణామగ్రతః స్థాతుం శక్తో దేవాసురేష్వపి.

19

న చాపి త్రిషు లోకేషు రాజన్ విద్యేత కశ్చన,
రాఘవస్య వ్యళీకం యః కృత్వా సుఖమవాప్నుయాత్.

20

తత్త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబన్ధి చ,
మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్.

21

దృష్టా హీయం మయా దేవీ లబ్ధం యదిహ దుర్లభమ్,
ఉత్తరం కర్మ యచ్ఛేషం నిమిత్తం తత్ర రాఘవః.

22

లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా,
గృహ్య యాం నాభిజానాసి పఞ్చాస్యామివ పన్నగీమ్.

23

రాముని ఆగ్రహం చూసి రెచ్చిపోయే లక్ష్మణుడు ప్రయోగించే శరపరంపరల ధాటికి దేవతల్లోగాని, రాక్షసుల్లోగాని నిలబడగలిగేవాడు మచ్చుకి ఒక్కడు కూడా లేడు.

19

ఓ రాక్షసేంద్రా! బుద్ధిపూర్వకంగా రామునికి అపకారం తలపెట్టిన వాడెవడూ ఈ ముల్లోకాల్లో సుఖశాంతులతో జీవించడం అసంభవం.

20

కాబట్టి భూతవర్తమానభవిష్యత్ కాలాలలో శ్రేయస్సును ఒనగూర్చే ధర్మ సమ్మతమైన నా మాట దయచేసి విను. పురుషోత్తముడైన రామునికి సగౌరవంగా సీతాదేవిని అప్పగించు.

21

సీతాదేవిని కనుగొనడమనే అసాధ్య కార్యాన్ని నేను విజయవంతంగా సాధించాను. ఇకపై ఏం చేయాలో రాముడే నిర్ణయిస్తాడు.

22

వర్ణనాతీతమైన శోకంలో మునిగి ఉన్న సీతాదేవిని చూశాను. నీ భవనంలో ఆమెను నిర్బంధించి ఉంచడం మహాప్రమాదకరమైన ఐదు తలల మహాసర్పాన్ని ఉంచుకోవడం వంటిదని నువ్వు గ్రహించకున్నావు.

23

నేయం జరయితుం శక్యా సాసురైరమరైరపి,
విషసంసృష్టమత్యర్థం భుక్తమన్నమివౌజసా.

24

తపస్సంతాపలబ్ధస్తే యోఽయం ధర్మపరిగ్రహః,
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః.

25

అవధ్యతాం తపోభిర్యాం భవాన్ సమనుపశ్యతి,
ఆత్మనః సాసురైర్దేవైర్హేతుస్తత్రాప్యయం మహాన్.

26

సుగ్రీవో న హి దేవోఽయం నాసురో న చ రాక్షసః,
న దానవో న గన్ధర్వో న యక్షో న చ పన్నగః,
హరిశ్చరో హి సుగ్రీవో రాఘవః స తు మానుషః.

27

విషపూరితమైన అన్నాన్ని తిని జీర్ణం చేసుకోవడం ఎంతటి వాడికైనా సాధ్యం కాదో, అట్లే సీతాదేవిని అధీనం చేసుకోవడం సురాసురులలో ఎవరికీ ముమ్మాటికీ సాధ్యం కాదు.

24

ఓ రావణా! నువ్వు కఠోర తపశ్చర్యల మూలంగా, ఇతర ధర్మాలు పాటించిన ఫలంగా దీర్ఘాయుర్దాయం వరంగా పొందావు. దాన్ని ఇప్పుడు చేతులారా నాశనం చేసుకోవడం భావ్యం కాదు.

25

తపస్సు ఫలంగా దేవతలనుండి, రాక్షసులనుండి మరణం లేకుండా వరం పొందానని భావిస్తూ ధైర్యంగా ఉన్నట్లున్నావు. నేను చెప్పే కారణం వింటే ఆ భావన కూడా సరైనది కాదని నీకే తెలుస్తుంది.

26

సుగ్రీవుడు దేవగణానికి చెందిన వాడు కాడు, అసురుడూ కాదు. అతడు దానవ, గంధర్వ, యక్ష, నాగులలో ఏ తెగకూ చెందడు. సుగ్రీవుడు వానర రాజు, రాముడు మానవుడు.

27

తస్మాత్ప్రాణపరిత్రాణం కథం రాజన్ కరిష్యసి,

న తు ధర్మోపసంహారమధర్మఫల సంహితమ్,
తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాధర్మనాశనః.

28

ప్రాప్తం ధర్మఫలం తావద్భవతా నాత్ర సంశయః,
ఫలమస్యాప్య ధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే.

29

జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా,
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హితమాత్మనః.

30

కామం ఖల్వహమేకేః సవాజిరథకుఞ్జరామ్,
లఙ్కాం నాశయితుం శక్తస్తస్యైష తు న నిశ్చయః.

31

రామేణ హి ప్రతిజ్ఞాతం హర్యృక్షగణసన్నిధౌ,
ఉత్సాదనమమిత్రాణాం సీతా యైస్తు ప్రధర్షితా.

32

ఓ రాజా! ఇట్టి పరిస్థితుల్లో నీ ప్రాణాన్ని ఎలా కాపాడుకోగలవు? ధర్మ కార్యాచరణ ఫలంతో అధర్మకార్య ఫలాన్ని నశింపజేసుకోవడం అసాధ్యం. ధర్మాధర్మ కార్యాచరణ ఫలాలను అనుభవించే తీరాలి. అధర్మ కార్యాచరణ ఫలాన్ని ఒక్క ప్రాయశ్చిత్తం మూలంగానే నిరర్థకం చేసుకోగలం. నువ్వు సముపార్జించుకొన్న ధర్మకార్య ఫలాన్ని పూర్తిగా అనుభవించేశావు. ఆ విషయంలో నాకు ఎటువంటసందేహమూ లేదు. ప్రస్తుతం నువ్వు చేస్తున్న అధర్మకార్యాచరణ ఫలాన్ని త్వరలోనే చవిచూస్తావు.

28–29

జనస్థానంలో రాక్షస సంహారం, కిష్కింధలో వాలి వధ, రామసుగ్రీవుల

మైత్రీబంధాలు వీటిని పరిగణనలోకి తీసుకుని, ఓ రావణా! నీకేది హితమో నిర్ణయించుకో.

30

రథ గజ తురగ బలగాలతో పరిరక్షితమై ఉన్న ఈ లంకానగరాన్ని సర్వనాశనం చేయడానికి నేనొక్కణ్ణే చాలు. కాని అందుకు రాముని ఆనతి లేదు.

31

ఎందుకంటే, సీతాదేవిని అపహరించిన శత్రువులను తానే స్వయంగా రూపుమాపుతానని రాముడు వానర భల్లూక గణాల ముందు ప్రతిజ్ఞ చేశాడు.

32

అపకుర్వన్హి రామస్య సాక్షాదపి పురందరః,
న సుఖం ప్రాప్నుయాదన్యః కిం పునస్త్వద్విధో జనః.

33

యాం సీతేత్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే,
కాలరాత్రీతి తాం విద్ధి సర్వలఙ్కావినాశినీమ్.

34

తదలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా,
స్వయం స్కన్ధావసక్తేన క్షమమాత్మని చిన్త్యతామ్.

35

సీతాయాస్తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్,
దహ్యమానామిమాం పశ్య పురీం సాట్టప్రతోళికామ్.

36

స్వాని మిత్రాణి మన్త్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్ సుతాన్ హితాన్,

భోగాన్ దారాంశ్చ లఙ్కాం చ మా వినాశ ముపానయ.

37

రామునికి కీడు తలపెట్టి ఎవరూ బ్రతికిబట్టకట్టలేరు. రాముని మనస్సు నొప్పించి సాక్షాత్తూ ఆ దేవేంద్రుడే అయినా సుఖశాంతులతో జీవించలేడు. అటువంటప్పుడు ఇక నీ వంటి వారి విషయం గూర్చి విడిగా చెప్పాలా?

33

ఏ స్త్రీని సీతగా భావించి అపహరించి నిర్బంధించి ఉంచావో, ఆమెను నిజానికి నీ లంకను నాశనం చేసే కాలరాత్రి అనే శక్తిగా తెలుసుకో.

34

కాబట్టి సీత రూపంలో ఉన్న యమపాశాన్ని స్వయంగా నువ్వే మెడకు బిగించుకోకు, బాగా యోచించి నీకు హితం ఒనగూరే తీరులో వ్యవహరించు.

35

సీతాదేవి తేజస్సుతో ఇప్పటికే రగిలింపబడి సమున్నత బురుజులతో, విశాలమైన వీథులతో అందంగా అలరారుతున్న ఈ లంకానగరం రాముని క్రోధాగ్ని జ్వాలలతో దగ్ధం కావడం చూడబోతావు.

36

ఆత్మీయులైన మిత్రులను, మంత్రులను, బంధువులను, సోదరులను, పుత్రులను, హితులను, భోగాలను, భార్యలను, ఈ నీ లంకానగరాన్ని చేతులారా వినాశం గావించే పనికి పూనుకోవద్దు.

37

సత్యం రాక్షసరాజేంద్ర శృణుష్వ వచనం మమ,
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః.

38

సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్,
పునరేవ తథా స్రస్టుం శక్తో రామో మహాయశాః.

39

దేవాసురనరేన్ద్రేషు యక్షరక్షోగణేషు చ,
విద్యాధరేషు సర్వేషు గన్ధర్వేషూరగేషు చ.

40

సిద్ధేషు కిన్నరేన్ద్రేషు పతత్రిషు చ సర్వతః,
సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః,
యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్.

41

సర్వలోకేశ్వరస్యైవం కృత్వా విప్రియముత్తమమ్,
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్.

42

ఓ రాక్షసేంద్రా! నేను రాముని దూతను, దాసుడను పైగా వానరుణ్ణి. రాక్షసుడవైన నీ పక్షంగాను, మానవుడైన రాముని పక్షంగాను మాట్లాడకుండా పక్షపాతరహితంగా మాట్లాడుతున్నాను. నా సత్యవచనాన్ని ప్రశాంత చిత్తంతో ఆలకించు.

38

యశస్సంపన్నుడైన రాముడు పంచభూతాలతో, చరాచరాలతో కూడుకొన్న సకల లోకాలనూ క్షణంలో రూపుమాపి మరుక్షణంలో వాటిని యథాతథంగా సృజించగల సమర్థుడు.

39

దేవతల్లో, అసురుల్లో, నరుల్లో, యక్షుల్లో, రాక్షసుల్లో, విద్యాధరుల్లో, గంధర్వుల్లో, నాగుల్లో, సిద్ధుల్లో, కిన్నరుల్లో, పక్షుల్లో, సమస్త ప్రాణుల్లో ఏ

ఒక్కరూ సర్వకాలాల్లో సకల ప్రదేశాల్లో విష్ణువుకు సాటియైన పరాక్రమం గల రాముని ముందు నిలబడి యుద్ధం చెయ్యగలవారు లేరు.

40–41

సకల లోకాలకూ ప్రభుమా, రాజశ్రేష్ఠుడూ అయిన రామునికి ఇంతటి అపకారం తలపెట్టిన నువ్వు ఇక బ్రతికి బట్టకట్టడం అసాధ్యం.

42

దైవాశ్చ దైత్యాశ్చ నిశాచరేన్ద్ర
గన్ధర్వవిద్యాధరనాగయక్షాః,
రామస్య లోకత్రయనాయకస్య
స్థాతుం న శక్తాః సమరేషు సర్వే.

43

బ్రహ్మా స్వయమ్భూశ్చతురాననో వా
రుద్ర స్త్రినేత్రస్త్రిపురాన్తకో వా,
ఇన్ద్రో మహేన్ద్రః సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్.

44

స సౌష్ఠవోపేతమదీనవాదినః
కపేర్నిశమ్యాప్రతిమోఽప్రియం వచః,
దశాననః కోపవివృత్తలోచనః
సమాదిశత్తస్య వధం మహాకపేః.

45

ఓ రాక్షసేంద్రా! దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు కలసికట్టుగా వచ్చినా యుద్ధరంగంలో ముల్లోక నాయకుడైన రాముని ముందు నిలబడలేరు.

43

రణరంగంలో రాముడు సంహరింప సంకల్పించుకొన్న వాణ్ణి స్వయం భుమా చతుర్ముఖుడూ అయిన బ్రహ్మదేవుడుగాని, ముక్కంటీ త్రిపురాంతకుడూ అయిన రుద్రుడుగాని, దేవతల నాయకుడైన దేవేంద్రుడుగాని రక్షింపలేరు.

44

సహేతుకాలూ, తనకు అప్రియమైనవీ అయిన హితవచనాలను నిర్భయంగా ఆ విధంగా పలుకుతున్న హనుమంతుణ్ణి చూసి సాటిలేని దశకంఠుడైన ఆ రావణుడు ఆగ్రహోదగ్రుడై గుడ్లురుముతూ ఆ వానరోత్తముని వధింపమని ఆదేశమిచ్చాడు.

45

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 51వ సర్గ సమాప్తం

52

వ సర్గ

దూతవధ నిలుపుదల

తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః,
ఆజ్ఞాపయద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః.

1

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా,
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః.

2

తం రక్షోధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితమ్,
విదిత్వా చిన్తయామాస కార్యం కార్యవిధౌ స్థితః.

3

నిశ్చితార్థస్తతః సామ్నా పూజ్యం శత్రుజిదగ్రజమ్,
ఉవాచ హితమత్యర్థం వాక్యం వాక్యవిశారదః.

4

మహాత్ముడైన హనుమంతుని హితోక్తులు విని పట్టరాని కోపంతో అతణ్ణి సంహరించమని రావణుడు ఆజ్ఞాపించాడు.

1

దురాత్ముడైన రావణుడు దూత ధర్మాన్ని నిర్వర్తింప వచ్చిన హనుమంతునికి మరణదండన విధించడం విభీషణునికి కరడుగట్టిన అధర్మంగా తోచింది.

2

యుక్తాయుక్త విచక్షణాశీలుడైన విభీషణుడు, కుపితుడై రావణుడు తలపెట్టిన దుష్కృత్యాన్ని నివారించడానికి ఏం చేయాలోనని ఆలోచించసాగాడు.

3

తన మృదుమధుర భాషణలతో శత్రువుల మనస్సులను సైతం గెలుచుకోగల దక్షత ఉన్న విభీషణుడు తన కార్యాచరణను నిశ్చయించుకొన్నాడు. పిదప పూజ్యుడైన అన్నగారితో ఆతడి ఆదేశంలోని అనౌచిత్యాన్ని సుతిమెత్తగా ఇలా విన్నవించసాగాడు.

4

క్షమస్వ రోషం త్యజ రాక్షసేన్ద్ర
ప్రసీద మద్వాక్యమిదం శృణుష్వ,
వధం న కుర్యన్తి పరావరజ్ఞా
దూతస్య సన్తో వసుధాధిపేన్ద్రాః.

5

రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితమ్,
తవ చాసదృశం వీర కపేరస్య ప్రమాపణమ్.

6

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః,
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్.

7

గృహ్యన్తే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః,
తతః శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్.

8

రాక్షసేంద్రా! చొరవ చేసుకొని మాట్లాడుతున్నందుకు నన్ను మన్నించు. కోపాన్ని విడిచిపెట్టు. నా విజ్ఞాపనను ఆలకించు. ఉచితానుచితాలను ఎరిగిన రాజశ్రేష్ఠులు దూతను ఎన్నటికీ వధించరు.

5

ఓ సాటిలేని మహావీరుడా! దూతగా వచ్చిన ఈ వానరుణ్ణి చంపడం రాజధర్మానికి విరుద్ధం. లోకమర్యాద ప్రకారం కూడా ఆక్షేపణీయమైన నింద్యము. కోపంలో ఇటువంటి దుష్కార్యానికి పాల్పడడం నీ అంతటి వాడికి తగదు.

6

నువ్వు ధర్మాలు కూలంకషంగా ఎరిగిన వాడివి, కృతజ్ఞత అంటే ఏమిటో బాగా తెలిసినవాడివి; రాజధర్మ కోవిదుడవు. ప్రాణుల పట్ల వ్యవహరించవలసిన తీరుతెన్నులు క్షుణ్ణంగా తెలిసిన వాడివి. నీకు తెలియని పరమార్థం లేదంటే అతిశయోక్తి కాదు.

7

నీ వంటి మహత్తర పరిజ్ఞాన సంపన్నులు కూడా కోపానికి వశవర్తులైతే, ఇక శాస్త్రపాండిత్యం గడించడం వలన ప్రయోజనం ఏమిటి? అలా సంపాదించడం వృథాశ్రమగానే పరిణమిస్తుంది గదా!

8

తస్మాత్ ప్రసీద శత్రుఘ్న రాక్షసేన్ద్ర దురాసద,
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదణ్డో విధీయతామ్.

9

విభీషణవచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
రోషేణ మహతావిష్టో వాక్యముత్తరమబ్రవీత్.

10

న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన,
తస్మాదేనం వధిష్యామి వానరం పాపచారిణమ్.

11

అధర్మమూలం బహుదోషయుక్త
మనార్యజుష్టం వచనం నిశమ్య,
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః.

12

కాబట్టి ఓ శత్రుసంహారకా! ప్రతిఘటింప శక్యం కానివాడా! ఓ రాక్షసేంద్రా! కోపాన్ని నిగ్రహించి, ప్రసన్నుడవై ఉచితానుచితాలను పరిగణించి దూతకు విధింపదగిన శిక్షను మాత్రం విధించు.

9

రాక్షసేంద్రుడైన ఆ రావణుడు, తమ్ముడైన విభీషణుని మాటలు విని క్రోధావేశపరుడై ఇలా స్పందించాడు.

10

శత్రుసంహారకుడవైన ఓ విభీషణా! పాపులకు మరణదండన విధించడం అనుచితం ఎంతమాత్రమూ కాదు. కనుక దుష్కృత్యాలకు ఒడిగట్టిన ఈ వానరుణ్ణి తప్పక వధించాల్సిందే.

11

అధర్మానికి మూలమైనదీ, దోషభూయిష్ఠమైనదీ, కేవలం కోపంలో జనించినదీ, దుర్జనులు మాత్రమే సమ్మతించేదీ అయిన ఆ రావణుని వచనాన్ని

విని, వివేకవంతుడైన విభీషణుడు పరమార్థయుక్తమైన మాటలతో ఇలా ప్రతిస్పందించాడు.

12

ప్రసీద లఙ్కేశ్వర రాక్షసేన్ద్ర
ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ,
దూతా న వధ్యాః సమయేషు రాజన్
సర్వేషు సర్వత్ర వదన్తి సన్తః.

13

అసంశయం శత్రురయం ప్రవృద్ధః
కృతం హ్యనేనాప్రియమప్రమేయమ్,
న దూతవధ్యాం ప్రవదన్తి సన్తో
దూతస్య దృష్టా బహవో హి దణ్డాః.

14

వైరూప్యమఙ్గేషు కశాభిఘాతో
మౌణ్డ్యం తథా లక్షణసన్నిపాతః,
ఏతాన్ హి దూతే ప్రవదన్తి దణ్డాన్
వధస్తు దూతస్య న నః శ్రుతోఽపి.

15

ఓ లంకేశ్వరా! దయచేసి శాంతించి, ప్రసన్నుడవవు. ధర్మార్థాలతో కూడిన నా అభిప్రాయాన్ని ఆలకించు. ఏ కాలంలోగాని, ఏ దేశంలోగాని ఎటువంటి పరిస్థితుల్లోనైనా దూతలను వధించడం ససేమిరా తగదని మహాత్ములు వచిస్తున్నారు.

13

నిస్సందేహంగా ఈ వానరుడు మనకు శత్రువే. పైగా హద్దుమీరి

మనకు చెప్పలేనంత అపకారం చేశాడనడంలోనూ ఎటువంటి సందేహమూ లేదు. అయినప్పటికీ దూతవధను మహాత్ములు ముమ్మాటికీ సమ్మతించరు. శిక్షార్హుడైన దూతకు విధించ తగిన అనేక ఇతర దండనలున్నాయి గదా!

14

అంగవైరూప్యం కలిగించడం, కొరడాలతో కొట్టడం, తల గొరిగి పంపడం, శరీరం మీద కాల్చి ముద్రలు వేయడం – ఇటువంటి శిక్షలు దూతలకు విధించవచ్చునని చెబుతారు. కాని దూతవధను కనీవినీ ఎరుగం.

15

కథం చ ధర్మార్థవినీతబుద్ధిః
పరావరప్రత్యయనిశ్చితార్థః,
భవద్విధః కోపవశే హి తిష్ఠేత్
కోపం నియచ్ఛన్తి హి సత్త్వవన్తః.

16

న ధర్మవాదే న చ లోకవృత్తే
న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి,
విద్యేత కశ్చిత్తవ వీరతుల్య
స్త్వం హ్యుత్తమః సర్వసురాసురాణామ్.

17

న చాప్యస్య కపేర్భాతే కంచిత్పశ్యామ్యహం గుణమ్,
తేష్వయం పాత్యతాం దణ్డో యైరయం ప్రేషితః కపిః.

18

సాధుర్వా యది వాసాధుః పరైరేష సమర్పితః,
బ్రువన్ పరార్థం పరవాన్న దూతో వధమర్హతి.

19

ధర్మార్థాలందు సుశిక్షితమైన బుద్ధిగల, యుక్తాయుక్త విచక్షణతో సముచిత నిర్ణయం తీసుకోగల నీవంటి వివేకి ఇట్టే కోపానికి లోనైతే ఎలా? జ్ఞానసంపన్నులు కోపాన్ని నిగ్రహించుకొనే ఉంటారు కదా!

16

ఓ మహావీరా! విమర్శాత్మక ధర్మాధ్యయనంలోను, లోకవ్యవహార జ్ఞానంలోను, శాస్త్రార్థాలను ఆకళింపు చేసుకోవడంలోను, ఇతరుల మనస్సు నెరిగి వ్యవహరించడంలోను నీకు సమానుడైన వాడు ఎవరూ లేరు. సురాసురులలో ఈ విషయాల్లో నీదే ప్రథమ తాంబూలం.

17

ఈ వానరుని వధించడం వల్ల మనకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు. మరణదండనే విధించాల్సి వస్తే అది ఇతడికి కాదు, ఇతణ్ణి పంపిన వ్యక్తికి విధించాలి.

18

ఈ వానరుడు సజ్జనుడా దుర్జనుడా అన్న విషయం చర్చనీయాంశం కాదు. ఎవరి ఆదేశాన్నో పాటించి వారు చెప్పమన్న సందేశం చెప్పిపోవడానికి వచ్చిన దూత; ఇతడు స్వతంత్రుడు కాడు. కనుక ఇతనికి మరణదండన విధించడం ఎంతమాత్రమూ సబబు కాదు.

19

అపి చాస్మిన్ హతే రాజన్నాన్యం పశ్యామి ఖేచరమ్,
ఇహ యః పునరాగచ్ఛేత్పరం పారం మహోదధేః.

20

తస్మాన్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ,
భవాన్ సేన్దేషు దేవేషు యత్నమాస్థాతు మర్హతి.

21

అస్మిన్ వినష్టే న హి దూతమన్యం
పశ్యామి యస్తౌ నరరాజపుత్రౌ,
యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా
వుద్యోజయేద్దీర్ఘపథావరుద్ధౌ.

22

పరాక్రమోత్సాహమనస్వినాం చ
సురాసురాణామపి దుర్జయేన,
త్వయా మనోనన్దన నైర్ఋతానాం
యుద్ధాయతిర్నాశయితుం న యుక్తా.

23

అంతేకాక, ఓ రాక్షసేంద్రా! ఇతణ్ణి వధిస్తే, గగన మార్గంలో మహా సముద్రాన్ని దాటి ఇక్కడికి రాగలిగే సామర్థ్యం గలవాడు మరొకడెవడూ ఉంటాడని నేను అనుకోవడం లేదు.

20

శత్రు నగరాలను అవలీలగా జయించేవాడా! కాబట్టి ఈ వానరుణ్ణి వధించే ప్రయత్నం విడిచిపుచ్చు. అందుకు మారుగా నీ శౌర్యప్రతాపాలను ఇంద్రాది దేవతల మీద ప్రదర్శించడం నీ హోదాకు తగ్గట్లు ఉంటుంది.

21

యుద్ధప్రియుడవైన ఓ రాజా! ఈ వానరుణ్ణి వధిస్తే, సుదూరంలో ఉన్న బలగర్వితులైన ఆ రాజకుమారులను ప్రేరేపించి యుద్ధానికి తోడ్కొని వచ్చి నీకు యుద్ధానందం కలిగించే మరొక దూత ఎవరూ నాకు అగపడడం లేదు.

22

రాక్షసుల మనస్సులను రంజింపచేసే వాడా! పరాక్రమమూ, ఉత్సాహమూ, మనోస్థైర్యమూ సంతరించుకున్న సురాసురులు కూడా,

జయించడం మాట అటుంచి యుద్ధంలో నీ ముందు నిలబడలేరు. అట్టి నువ్వు ఈ యుద్ధావకాశాన్ని చేజేతులా జారవిడువకు.

23

హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ
కులేషు జాతాశ్చ మహాగుణేషు,
మనస్వినః శస్త్రభృతాం వరిష్ఠాః
కోట్యగ్రతస్తే సుభృతాశ్చ యోధాః.

24

తదేకదేశేన బలస్య తావ
త్కేచిత్తవాదేశకృతోఽభియాన్తు,
తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ
పరేషు తే భావయితుం ప్రభావమ్.

25

నిశాచరాణామధిపోఽనుజస్య
విభీషణస్యోత్తమవాక్యమిష్టమ్,
జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రు
ర్మహాబలో రాక్షసరాజముఖ్యః.

26

శూరులు, అప్రమత్తులు, మానధనులు, ఉత్తమ వంశజులు, శస్త్రధారులలో శ్రేష్ఠులు, నీ హితం కోసమే యుద్ధసన్నద్ధులై నీ పోషణలో కోట్లాదిమంది యోధులు ఉన్నారు.

24

ఆ మహాసైన్యంలో కొంతభాగం తీసుకొని వెళ్ళి మూఢులైన ఆ రాజకుమారులను ఇద్దరినీ జయించి, తద్ద్వారా నీ పరాక్రమమూ ప్రభావమూ

ఎంతటివో చూపడానికి నీ ఆజ్ఞానువర్తులైన కొందరికి ఇప్పుడే యుద్ధానికి వెళ్ళడానికి ఆనతి ఇవ్వు.

25

రాక్షసేంద్రుడు, మహాబలసంపన్నుడు, దేవతల శత్రువు అయిన రావణుడు తన తమ్ముడైన విభీషణుని పలుకుల్లోని ఔచిత్యాన్ని గ్రహించి ఆతడి సూచనలను పాటించాలని నిర్ణయించాడు.

26

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 52వ సర్గ

సమాప్తం

53

వ సర్గ

హనుమంతుని తోకకు నిప్పంటించడం

తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాత్మనః,
దేశకాలహితం వాక్యం భ్రాతురుత్తర మబ్రవీత్.

1

సమ్యగుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా,
అవశ్యన్తు వధాదన్యః క్రియతామస్య నిగ్రహః.

2

కపీనాం కిల లాఙ్గూలమిష్టం భవతి భూషణమ్,
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు.

3

మహాత్ముడూ తన సోదరుడూ అయిన విభీషణుని దేశకాలాలకు అనుగుణమైన పలుకులు విని, దశకంఠుడైన రావణుడు ఇలా ప్రతిస్పందించాడు.

1

విభీషణా! నువ్వు చెప్పింది సబబే! దూతవధ నింద్యమే. కనుక ఇతడికి మరణదండనకు బదులు మరొక దండన విధించే తీరాలి.

2

వానరులకు వాలం అంటే ఎంతో ఇష్టమూ, అలంకారయుతమైనది. కనుక ఇతడి తోకకు నిప్పంటించండి. కాలిపోయిన తోకతో ఇతడు తిరిగి వెళ్లేటట్లు చేయండి.

3

తతః పశ్యన్త్విమం దీనమజ్ఞవైరూప్యకర్శితమ్,
సమిత్రజ్ఞాతయః సర్వే బాంధవాః ససుహృజ్జనాః.

4

ఆజ్ఞాపయద్రాక్షసేన్ద్రఃి పురం సర్వం సచత్వరమ్,
లాఙ్గూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్.

5

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్శితాః,
వేష్టయన్తిస్మ లాఙ్గూలం జీర్ణైః కార్పాసకైః పటైః.

6

సంవేష్ట్యమానే లాఙ్గూలే వ్యవర్ధత మహాకపిః,
శుష్కమిన్ధనమాసాద్య వనేష్విన హుతాశనః.

7

తైలేన పరిషిచ్యాథ తేఒగ్నిం తత్రాభ్యపాతయన్,
లాఙ్గూలేన ప్రదీప్తేన రాక్షసాంస్తానపాతయత్,
రోషమర్షపరీతాత్మా బాలసూర్యసమాననః.

8

అలా అంగవైకల్యంతో తిరిగి వెళ్ళిన ఈ వానరుణ్ణి బంధుమిత్రులు, ఆప్తులు చిన్నచూపుతో చూడడంతో ఇతడు తలెత్తుకోలేని దయనీయ స్థితిలో

ఉంటాడు.

4

'తోకకు నిప్పంటించి, మండుతున్న తోకతో ఈ వానరుణ్ణి నాలుగు కూడళ్ళలో జనులు చూసేలా నిలబెట్టండి, ప్రధాన రహదారుల్లో తిప్పండి' అని రావణుడు ఆజ్ఞాపించాడు.

5

సహజంగానే క్రూరులు, పైగా హనుమంతుడంటే కోపంతో మండిపోతున్న వారు అయిన రాక్షసులు ఇదే అదనుగా రావణుని ఆదేశం వినీవినగానే చినిగిపోయిన పాత నూలుబట్టలు తెచ్చి హనుమంతుని తోకకు చుట్టారు.

6

రాక్షసులు తన తోకకు గుడ్డపేలికలు చుట్టుతున్నప్పుడు కపివరుడైన హనుమంతుడు అడవుల్లో మోడువారి ఎండిన చెట్లకు అగ్ని రాజుకొని వ్యాపించిన చందాన తన దేహ పరిమాణాన్ని విపరీతంగా పెంచాడు.

7

తోకకు చుట్టిన గుడ్డలన్నింటిని నూనెతో బాగా తడిపి ఆ రాక్షసులు నిప్పంటించారు. అప్పుడు బాలసూర్యునిలా భాసిస్తూన్న ముఖమండలం గల ఆ హనుమంతుడు ఆగ్రహోదగ్రుడై మండుతున్న తన తోకతో ఆ రాక్షసులందరిని బాది కిందపడగొట్టాడు.

8

లాఙ్గూలం సంప్రదీప్తం తు ద్రష్టుం తస్య హనూమతః,
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః.

9

స భూయః సంగతైః క్రూరై రాక్షసైర్హరిసత్తమః,

నిబద్ధః కృతవాన్ వీరస్తత్కాలసదృశీం మతిమ్.

10

కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః,
ఛిత్త్వా పాశాన్ సముత్పత్య హన్యామహమిమాన్ పునః.

11

యది భర్తుర్హితార్థాయ చరన్తం భర్తృశాసనాత్,
బధ్నన్త్యేతే దురాత్మానో న తు మే నిష్కృతిః కృతా.

12

సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానామహం యుధి,
కిం తు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽహమీదృశమ్.

13

లఙ్కా చారయితవ్యా వై పునరేవ భవేదితి,
రాత్రౌ న హి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః,
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లఙ్కా నిశాక్షయే.

14

బాగా ప్రజ్వరిల్లి మండుతున్న హనుమంతుని తోకను ఒక వినోదంగా చూడాలనే సంబరంతో స్త్రీ బాలవృద్ధులతో సహా రాక్షసులంతా ఆనందంగా అక్కడికి వచ్చారు.

9

క్రూరులైన రాక్షసులందరూ కలసి వానరోత్తముడైన ఆ హనుమంతుని మళ్ళీ బంధించారు. అప్పుడు ఆతడు సమయోచితంగా ఇలా యోచించాడు.

10

ఈ బంధనాలను ఇట్టే తెంచుకొని ఆకాశంలోకి రివ్వున ఎగిరి

వీరందరినీ మట్టుపెట్టగలను. కనుక ఈ బంధనంలో ఉన్నప్పటికీ రాక్షసులు నాకు దీటైనవారు కారు, నన్నేమీ చెయ్యలేరు.

11

నేను అలా చేసే పక్షంలో, నా స్వామియైన రాముని హితార్థం కార్య నిర్వహణ చేయవలసిన నేను, నా విధిని నిర్వర్తించడంలో బహుశా వైఫల్యం చెందవచ్చు. రాముని కార్యసిద్ధి కోసం తిరుగుతున్న నన్ను ఈ దుర్మార్గులు రావణుని ఆదేశంతో బంధించారు.

12

యుద్ధంలో ఈ రాక్షసులందరినీ సంహరించడానికి నేనొక్కణ్ణే చాలు. కాని రాముని ప్రీతికై ఈ రాక్షసుల ఆగడాలను సహిస్తాను. ఈ అవకాశాన్ని వినియోగించుకొని లంకానగరాన్ని నిశితంగా పరిశీలిస్తూ చూడవచ్చు. ఈ లంకను నేను సీతాదేవిని అన్వేషించే ధ్యాసతోనే రాత్రివేళ చూశాను. అప్పుడు కోట రక్షణ ఏర్పాట్లను స్పష్టంగా పరికించలేదు. ఇప్పుడు వీళ్ళు నన్ను నగరమంతా వినోదార్థం తిప్పుతూంటే ఆ ఏర్పాట్లను బాగా చూడగలుగుతాను.

13–14

కామం బద్ధస్య మే భూయః పుచ్ఛస్యోద్దీపనేన చ,
పీడాం కుర్వన్తు రక్షాంసి న మేఽస్తి మనసః శ్రమః.

15

తతస్తే సంవృతాకారం సత్త్వవన్తం మహాకపిమ్,
పరిగృహ్య యయుర్హృష్టా రాక్షసాః కపికుఞ్జరమ్.

16

శంఖభేరీనినాదైస్తం ఘోషయన్తః స్వకర్మభిః,
రాక్షసాః క్రూరకర్మాణశ్చారయన్తి స్మ తాం పురీమ్.

17

అన్వీయమానో రక్షోభిర్యయౌ సుఖమరిందమః,
హనుమాంశ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్.

18

ఈ రాక్షసులు మళ్ళీ నన్ను బంధించి తోకకు నిప్పంటించినా, తమ ఇష్టం వచ్చినట్లు హింసపెట్టినా నా మనస్సుకు ఎంతమాత్రం క్లేశం కలుగదు.

15

మహాబలసంపన్నుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు తన మనస్సులో మెదలే భావాలేవీ పైకి తెలియనివ్వకుండా రాక్షసులకు వశుడైనట్లు ప్రవర్తిస్తూంటే, వాళ్ళు ఆనందోత్సాహాలతో అతణ్ణి పట్టుకొనివెళ్ళారు.

16

క్రూరమైన కార్యాలనే చేయడానికి అలవాటుపడ్డ ఆ రాక్షసులు శంఖాలు పూరిస్తూ, భేరీలు మోగిస్తూ హనుమంతుడు చేసిన అపరాధాలను ఎలుగెత్తి చాటుతూ అతణ్ణి నగరమంతటా తిప్పనారంభించారు.

17

శత్రుమర్దనుడైన ఆ హనుమంతుడు రాక్షసులు తన వెంట నడుస్తూంటే తాపీగా లంకానగర నిర్మాణ అమరికను, స్థలాకృతిని నిశితంగా గమనించి గుర్తుపెట్టుకోసాగాడు.

18

అథాపశ్యద్విమానాని విచిత్రాణి మహాకపిః,
సంవృతాన్ భూమిభాగాంశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్.

19

వీథీశ్చ గృహసంబాధాః కపిః శృఙ్గాటకాని చ,
తథా రథ్యోపరథ్యాశ్చ తథైవ గృహకాన్తరాన్,
గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః.

20

చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ,
ఘోషయన్తి కపిం సర్వే చారఇత్యేవ రాక్షసాః.

21

స్త్రీబాలవృద్ధా నిర్జగ్ముస్తత్ర తత్ర కుతూహలాత్,
తం ప్రదీపితలాఙ్గూలం హనుమన్తం దిదృక్షవః.

22

అలా తిరుగుతున్న వానరోత్తమునికి వైభవోపేతమైన రాజప్రాసాదాలు, గోప్యమైన భూగృహాలు, చక్కగా తీర్చిదిద్దిన కూడలి వీథులు మార్గమధ్యంలో తారసపడ్డాయి.

19

గృహాలతో క్రిక్కిరిసిన ఇరుకుగా ఉన్న వీథులను, కూడళ్ళను, విశాలమైన రాజమార్గాలను, సందుగొందులను, చిన్న ఇళ్ళను, మేఘాలవలె ఆకాశాన్ని తాకుతున్న ఎత్తైన భవనాలను వాయునందనుడైన హనుమంతుడు చూశాడు.

20

ఆ రాక్షసులు వీథుల కూడళ్ళ వద్ద, నాలుగు స్తంభాల మంటపాల వద్ద, రాజమార్గాల వద్ద హనుమంతుణ్ణి నిలబెట్టి చూపుతూ 'లంకలో ప్రవేశించిన గూఢచారిని చూడండి' అంటూ బిగ్గరగా చాటింపు వేయసాగారు.

21

ఆ చాటింపు విని మండుతున్న తోకతో ఉన్న హనుమంతుని చూసి

వినోదించాలనే కుతూహలంతో ప్రతి ఇంటి నుండి స్త్రీలు, బాలురు, వృద్ధులు గుంపులు గుంపులుగా బయటికి వచ్చారు.

22

దీప్యమానే తతస్తస్య లాఙ్గూలాగ్రే హనూమతః,
రాక్షస్యస్తా విరూపాక్ష్యః శంసుర్దేవ్యాస్తదప్రియమ్.

23

యస్త్వయా కృతసంవాదః సీతే తామ్రముఖః కపిః,
లాఙ్గూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే.

24

శ్రుత్వా తద్వచనం క్రూరమాత్మాపహరణోపమమ్,
వైదేహీ శోకసంతప్తా హుతాశనముపాగతమ్.

25

మఙ్గళాభిముఖీ తస్య సా తదాసీన్మహాకపేః,
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్.

26

యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః,
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః.

27

వికృతమైన కన్నులుగల రాక్షసాంగనలు, హనుమంతుని వాలాగ్రానికి రాక్షసులు నిప్పంటించిన అప్రియమైన విషయాన్ని సీతాదేవికి తెలియచేశారు.

23

ఓ సీతా! ఇంతకు క్రితం నీతో మాట్లాడి వెళ్ళిన ఎర్రనిముఖంగల ఆ వానరుణ్ణి పట్టుకొని, ఆతడి తోకకు నిప్పంటించి నగరమంతా తిప్పుతున్నారు.

24

ఆ రాక్షసస్త్రీల మాటలు వినగానే సీతాదేవికి, రావణుడు తనను అపహరించినప్పుడు కలిగినంత దుఃఖం వచ్చింది. ఆమె విలవిల్లాడుతూ అగ్నిదేవుని ధ్యానించింది.

25

అప్పుడు విశాలనేత్రాలుగల ఆ సీతాదేవి నిర్మలమైన మనస్సుతో హనుమంతునికి ఎటువంటి హానీ వాటిల్లరాదని ఆకాంక్షిస్తూ అగ్నిని ప్రజ్వలింపజేసి ప్రార్థించింది.

26

నేను పతిసేవాపరాయణురాలనే అయితే, ఏదైనా తపస్సు చేసి ఉన్నట్లయితే, పతివ్రతనే అయితే ఓ అగ్నిదేవా! హనుమంతుని బాధింపక, చల్లగా ఉండు.

27

యది కించిదనుక్రోశస్తస్య మయ్యస్తి ధీమతః,
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః.

28

యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్,
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః.

29

యది మాం తారయేదార్యః సుగ్రీవః సత్యసంగరః,
అస్మాద్దుఃఖాంబుసంరోధాచ్ఛీతో భవ హనూమతః.

30

తతస్తీక్ష్ణార్చిరవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః,

జజ్వాల మృగశాబాక్ష్యాః శంసన్నివ శివం కపేః.

31

హనుమజ్జనకశ్చాపి పుచ్ఛానలయుతోఽనిలః,
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః.

32

ఓ అగ్నిదేవా! ధీమంతుడైన రాముని దయకు నేను ఇంకా నోచుకొని ఉన్నట్లయితే, నా పుణ్యఫలం ఇంకా ఏమైనా మిగిలి ఉంటే హనుమంతుడి పట్ల చల్లగా వ్యవహరించు.

28

నేను పాతివ్రత్య ధర్మాన్ని తు.చ. తప్పక పాటిస్తున్నాననీ, తన సమాగమానికై పరితపిస్తున్నాననీ ధర్మాత్ముడైన రాముడు ఏమాత్రమైనా భావిస్తే, ఓ అగ్నిదేవా! నువ్వు హనుమంతునిపై నీ ప్రభావం చూపక, చల్లగా మసలుకో.

29

సత్యసంధుడూ, పూజ్యుడూ అయిన సుగ్రీవుడు నన్ను ఈ దుఃఖసాగరం నుండి గట్టెక్కించడమే జరుగబోయేటట్లయితే, ఓ అగ్నిదేవా! హనుమంతుని పట్ల చల్లగా వ్యవహరించు.

30

సీతాదేవి ఇలా ప్రార్థించగా, హనుమంతుడు క్షేమంగానే ఉన్నాడని ఆమెకు తెలియజేస్తున్నాడా అన్నట్లుగా అగ్ని ప్రదక్షిణపూర్వక జ్వాలలతో ప్రజ్వలించింది.

31

హనుమంతుని తోకకు రాజుకొన్న అగ్ని జ్వలించేటందుకు సహాయకారిగా ఉన్న వాయుదేవుడు కూడా సీతాదేవి ఆకాంక్షను ఎరిగినాడా

అన్నట్లుగా అమిత చల్లగా, చలిగాలిలా వీచసాగాడు.

32

దహ్యమానే చ లఙ్కాలే చిన్తయామాస వానరః,
ప్రదీప్తోఽగ్నిరయం కస్మాన్న మాం దహతి సర్వతః.

33

దృశ్యతే చ మహాజ్వాలః కరోతి న చ మే రుజమ్,
శిశిరస్యేవ సంపాతో లాఙ్గూలాగ్రే ప్రతిష్ఠితః.

34

అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా,
రామ ప్రభావాదాశ్చర్యం పర్వతః సరితాం పతౌ.

35

యది తావత్సముద్రస్య మైనాకస్య చ ధీమతః,
రామార్థం సంభ్రమస్తాదృక్కిమగ్నిర్న కరిష్యతి.

36

సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ,
పితుశ్చ మమ సఖ్యేన మాం దహతి పావకః.

37

తోక అంతటా మంటలు ప్రజ్వలిస్తూ లేస్తున్నప్పటికీ ఎందువలన ఈ అగ్ని తనను కించిత్తుకూడా కాల్చడంలేదన్న ఆలోచన హనుమంతుడి మదిలో మెదలింది.

33

చెలరేగిన జ్వాలలతో ఈ అగ్ని నా తోకను దహిస్తూన్నప్పటికీ నాకు ఎటువంటి బాధ కలగడం లేదు. పైపెచ్చు నా తోక చివర ముంచుముద్ద

పెట్టినట్లున్నది.

34

ఇందుకు కారణం నిస్సందేహంగా ఇదే అయివుండాలి: సముద్ర లంఘనమప్పుడు అనూహ్యంగా సముద్రంలోనుండి లేచి పైకి వచ్చిన పర్వతం నన్ను ఆదరించినట్లు ఈ అద్భుత అనుభవం కూడా రాముని ప్రభావం వల్లనే జరిగి ఉంటుంది. సముద్రుడూ, మైనాక పర్వతమూ రామకార్యంలో ఆసక్తిపరులై ఉన్నప్పుడు ఈ అగ్నిదేవుడు మాత్రం ఎందుకు దోహదం చెయ్యకుండా ఉంటాడు?

35–36

సీతాదేవి అనుగ్రహం వల్లా, రాముని తేజస్సు వలనా, నా తండ్రి వాయుదేవునితో ఉన్న చెలిమి చేతా దహించే స్వభావం గలవాడైనప్పటికీ అగ్నిదేవుడు నన్ను దహించకుండా ఉన్నాడు.

37

భూయః స చిన్తయామాస ముహూర్తం కపికుఞ్జరః,
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః.

38

పురద్వారం తతః శ్రీమాన్ శైలశృఙ్గమివోన్నతమ్,
విభక్తరక్షస్సంబాధమాససాదానిలాత్మజః.

39

స భూత్వా శైలసంకాశః క్షణేన పునరాత్మవాన్,
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బన్ధనాన్యవశాతయత్.

40

విముక్తశ్చాభవచ్ఛ్రీమాన్ పునః పర్వతసన్నిభః,
వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితమ్.

41

స తం గృహ్య మహాబాహుః కాలాయసపరిష్కృతమ్,
రక్షిణస్తాన్ పునః సర్వాన్సూదయామాస మారుతిః.

42

వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు తన తదుపరి కార్యాచరణ గూర్చి మళ్ళీ ఒక్క క్షణం యోచించి, శరవేగంతో పైకి ఆకాశంలోకి ఎగిరి దిక్కులు పిక్కటిల్లేలా గర్జించాడు.

38

అలా పైకి ఎగిరిన ఆ హనుమంతుడు, పర్వత శిఖరం మల్లే రాక్షస సమూహానికి దూరంగా ఉన్న సమున్నత నగరద్వారం మీదికి వెళ్ళి నిలబడ్డాడు.

39

ప్రతిభావంతుడైన హనుమంతుడు అప్పుడు పర్వత ప్రమాణంలో ఉన్న తన ఆకృతిని వీడి క్షణంలో చిన్నరూపం పొందాడు. దాంతో కట్టిన తాళ్ళు జారిపోయాయి. వాటిని విదిలించి వేశాడు.

40

ఇలా బంధవిముక్తుడైన వెంటనే ధీశాలియైన ఆ హనుమంతుడు మళ్ళీ తన శరీరాన్ని పర్వతమంత ప్రమాణానికి పెంచాడు. తరువాత అటూ ఇటూ చూడగా ఆతడి చూపు తోరణద్వారం వద్ద ఉన్న పెద్ద ఇనుపగుదియ మీద పడింది.

41

వాయునందనుడూ, మహాబాహుమా అయిన ఆ హనుమంతుడు ఆ ఇనుప గుదియను చేతపుచ్చుకుని అక్కడ ఉన్న ద్వార రక్షకులనందరినీ క్షణంలో మట్టుపెట్టాడు.

42

స తాన్నిహత్వా రణచణ్డవిక్రమః
సమీక్షమాణః పునరేవ లఙ్కామ్,
ప్రదీప్తలాఙ్గూల కృతార్చిమాలీ
ప్రకాశతాదిత్య ఇవార్చిమాలీ.

43

యుద్ధంలో ప్రచండపరాక్రమంతో స్వైరవిహారం చేసి రాక్షసులను నేలకూల్చిన ఆ హనుమంతుడు అక్కడే నిలబడి నిదానంగా లంకానగరాన్ని పరికించసాగాడు. తోక మీద మండుతున్న అగ్నిజ్వాలలతో భాసిస్తున్న ఆతడు ఆ సమయంలో సహస్ర కిరణసమన్వితుడైన సూర్యుని చందాన ప్రకాశించాడు.

43

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 53వ సర్గ
సమాప్తం

54

వ సర్గ

లంకాదహనం

వీక్షమాణస్తతో లఙ్కాం కపిః కృతమనోరథః,
వర్ధమానసముత్సాహః కార్యశేషమచిన్తయత్.

1

కిన్ను ఖల్వవశిష్టం మే కర్తవ్యమిహ సాంప్రతమ్,
యదేషాం రక్షసాం భూయః సంతాపజననం భవేత్.

2

వనం తావత్ ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః,
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్.

3

తను తలపెట్టిన కార్యాలలో కృతకృత్యుడైన హనుమంతుడు లంకానగరాన్ని సునిశితంగా పరికిస్తూ సమధికోత్సాహంతో తదుపరి కర్తవ్యాన్ని గూర్చి యోచించసాగాడు.

1

ఇక నేను చెయ్యవలసిన పని ఏం మిగిలి ఉంది? ఈ రాక్షసులకు ఇంకా తీవ్రమనస్తాపం, దుఃఖం కలిగించడానికి ఏం చెయ్యాలి?

2

అశోకవనం ధ్వంసమైంది, కొందరు యోధాగ్రేసరులైన రాక్షసులు నిహతులయ్యారు; రాక్షససైన్యంలో కొంతభాగం నశించింది. ఇక నగర దుర్గాన్ని ధ్వంసమొనర్చడం ఒక్కటే మిగిలి ఉంది.

3

దుర్గే వినాశితే కర్మ భవేత్సుఖపరిశ్రమమ్,
అల్పయత్నేన కార్యేఽస్మిన్ మమ స్యాత్సఫలః శ్రమః.

4

యో హ్యయం మమ లాఙ్గూలే దీప్యతే హవ్యవాహనః,
అస్య సంతర్పణం న్యాయ్యం కర్తుమేభిర్గృహోత్తమైః.

5

తతః ప్రదీప్తలాఙ్గూలః సవిద్యుదివ తోయదః,
భవనాగ్రేషు లఙ్కాయా విచచార మహాకపిః.

6

గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః.

7

అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
అగ్నిం తత్ర స నిక్షిప్య శ్వసనేన సమో బలీ.

8

తతోఽన్యత్ప్లవే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్,
ముమోచ హనుమానగ్నిం కాలానలశిఖోపమమ్.

9

ఇప్పుడు పెద్దగా శ్రమపడకుండా లంకానగర దుర్గాన్ని ధ్వసం చేసినట్లయితే, ఇప్పటి దాకా నేను నెరవేర్చిన కార్యాలకు సార్థకత చేకూరుతుంది.

4

నా తోక మీద ప్రజ్వలిస్తూ మండుతున్న అగ్నికి కృతజ్ఞతాసూచకంగా రాక్షసుల భవంతులను సంతర్పణ చెయ్యడం న్యాయసమ్మతం.

5

ఇలా యోచించిన ఆ హనుమంతుడు ఉవ్వెత్తున లేస్తున్న అగ్నిజ్వాలలు సంతరించుకొన్న తోకతో, మెరపులతో కూడిన మేఘం చందాన విరాజిల్లుతూ లంకానగరంలోని భవనాగ్రాల మీద సంచరించ నారంభించాడు.

6

ఆ కపీంద్రుడు ఉద్యానాలను, ప్రాసాదాలను పరికిస్తూ నిర్భయంగా ఒక రాక్షసుని గృహం మీదనుండి మరో రాక్షసుని గృహం మీదకు పోతూ సంచరించసాగాడు.

7

మహాపరాక్రమవంతుడూ, బలశాలీ అయిన హనుమంతుడు వాయువేగంతో మొట్టమొదట ప్రహస్తుని భవంతి మీదకు దూకి దానికి చిచ్చుపెట్టాడు. అక్కణ్ణుండి ఒక్క గెంతుతో మహాపార్శ్వుని భవనం మీదకు దూకి దానికి నిప్పు అంటించాడు. అప్పుడు చెలరేగిన అగ్నిజ్వాలలు ప్రళయకాలాగ్ని జ్వాలలను తోపింపజేశాయి.

8–9

వజ్రదంష్ట్రస్య చ తదా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః.

10

తథా చేన్ద్రజితో వేశ్మ దదాహ హరియూథపః,
జమ్బుమాలేః సుమాలేశ్చ దదాహ భవనం తతః.

11

రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రోస్తథైవ చ,
హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః.

12

యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః,
విద్యుజ్జిహ్వస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ.

13

కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,
కుమ్భకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి.

14

యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రో స్తథైవ చ,
నరాన్తకస్య కుమ్భస్య నికుమ్భస్య దురాత్మనః.

15

వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి,
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుఙ్గవః.

16

తదనంతరం తేజోవిరాజమానుడైన ఆ హనుమంతుడు వరుసగా రాక్షసప్రముఖులైన వజ్రదంష్ట్రుని, శుకుని, సారణుని భవనాలను అగ్నికి ఆహుతి గావించాడు.

10

తదుపరి హనుమంతుడు రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు

భవనాన్ని, ఆ ఊపులోనే రాక్షసశ్రేష్ఠులైన జంబుమాలి, సుమాలుల గృహాలను అగ్నికి సంతర్పణ చేశాడు.

11

తేజోవిరాజమానుడైన ఆ వానరోత్తముడు తరువాత వరుసక్రమంలో రశ్మికేతుడు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్టుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడైన మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, ఘోరుడు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, నికుంభుడు, దురాత్ముడు మొదలైన రాక్షసప్రముఖుల భవనాలకు మండుతున్న తన తోకతో అగ్ని ముట్టించి అగ్నిదేవుని ప్రీత్యర్థం ఆహుతిగా సమర్పించాడు. అయితే ఒక్క విభీషణుని భవనం జోలికి మాత్రం పోలేదు.

12–16

తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
గృహేష్వృద్ధిమతామృద్ధిం దదాహ స మహాకపిః.

17

సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేన్ద్రస్య వీర్యవాన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్.

18

గొప్ప కీర్తిశాలియైన ఆ హనుమంతుడు ప్రముఖులూ, సుసంపన్నులూ అయిన రాక్షసుల భవనాలను, వాటిలోని అమూల్య సంపదలతో సహా దగ్ధం గావించాడు.

17

విశేష సంపదలతో తులతూగుతున్న భవంతులను ఆ విధంగా అగ్నికి ఆహుతి చేసి మహాపరాక్రమశాలీ, శుభలక్షణ సంపన్నుడూ అయిన ఆ

హనుమంతుడు రాక్షసేంద్రుడైన రావణుని రాజప్రాసాదాన్ని చేరాడు.

18

తతస్తస్మిన్ గృహే ముఖ్యే నానారత్నవిభూషితే,
మేరుమన్దరసంకాశే సర్వమఙ్గళశోభితే.

19

ప్రదీప్తమగ్నిముత్సృజ్య లాఙ్గూలాగ్రే ప్రతిష్ఠితమ్,
ననాద హనుమాన్ వీరో యుగాన్తజలదో యథా.

20

శ్వసనేన చ సంయోగాదతివేగో మహాబలః,
కాలాగ్నిరవ జజ్వాల ప్రావర్ధత హుతాశనః.

21

ప్రదీప్తమగ్నిం పవనస్తేషు వేశ్మస్వచారయత్,
అభూచ్ఛ్వసనసంయోగాదతివోగో హుతాశనః.

22

తాని కాఞ్చనజాలాని ముక్తామణిమయాని చ,
భవనాన్యవశీర్యన్త రత్నవన్తి మహాన్తి చ.

23

నానావిధ రత్నాలతో అలంకృతమైనదీ, సర్వమంగళశోభితమైనదీ, మేరుమందర పర్వతాల చందాన మహోన్నతమైనదీ అయిన ఆ రావణ రాజసౌధానికి మహావీరుడైన హనుమంతుడు తన తోక చివర ప్రజ్వలిస్తున్న అగ్నిని అంటించి ప్రళయకాల మేఘంలా గర్జించాడు.

19–20

వాయువు కూడా తోడవడంతో అగ్ని మరింత ఉద్ధృతను

సంతరించుకొని ప్రళయకాలాగ్ని చందాన పెనుమంటలతో ప్రచండంగా ప్రజ్వలించసాగింది.

21

వాయువు దోహదం చేస్తూండడంతో అగ్ని వేగం ఉద్ధృతమై ప్రజ్వలిస్తున్న మంటలు నాలుకలు చాపి పయనిస్తున్నట్లు ఒక ఇంటి నుండి మరొక ఇంటికి క్షణాలలో వ్యాపించాయి.

22

బంగారు కిటికీలు గల, ముత్యాలతో మణులతో రత్నాలతో అలంకరింపబడిన మహాభవనాలు ప్రజ్వలిస్తున్న మంటలకు కాలి, కూలిపో సాగాయి.

23

తాని భగ్నవిమానాని నిపేతుర్వసుధాతలే,
భవనానీవ సిద్ధానామమ్బరాత్ పుణ్యసంక్షయే.

24

సంజజ్ఞే తుములః శబ్దో రాక్షసానాం ప్రధావతామ్,
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్,
నూనమేషోఽగ్నిరాయాతః కపిరూపేణ హా ఇతి.

25

క్రన్దన్త్యః సహసా పేతుః స్తనంధయధరాః స్త్రియః,
కాశ్చిదగ్నిపరీతేభ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః.

26

పతన్త్యో రేజిరేఽభ్రేభ్యః సౌదామిన్య ఇవామ్బరాత్.

27

వజ్రవిద్రుమవైదూర్య ముక్తారజతసంహితాన్,
విచిత్రాన్ భవనాద్ధాతూన్ స్యన్దమానాన్ దదర్శ సః.

28

చేసుకున్న పుణ్యం తరిగిపోగా ఆకాశంనుండి కిందపడుతున్న సిద్ధుల భవనాల చందాన ఆ ప్రాసాదాలు నేలమట్టం కాసాగాయి.

24

ఉత్సాహం నీరుకారగా, వీరత్వమూ సంపత్తీ కోల్పోయిన రాక్షసులు తమ ఇళ్ళను మంటలనుండి కాపాడుకోవడానికి పరుగులెత్తుతూ, 'అయ్యో! ఈ వానరుడి రూపంలో సాక్షాత్తు ఆ అగ్నిదేవుడే వచ్చిపడ్డాడు' అంటూ గగ్గోలుపెట్టసాగారు.

25

ఆ సమయంలో కొందరు చంటిబిడ్డల తల్లులు బిడ్డలను చంకన వేసుకొని, జుట్టుముడి వీడిపోతున్నా పట్టించుకోకుండా మంటలు ఆవరించిన భవంతులనుండి కిందికి దూకసాగారు. అలా దూకుతున్న ఆ స్త్రీలు ఆకాశంలోని మేఘాలనుంచి పడుతున్న మెరుపు తీగల్లా కానవచ్చారు.

26–27

మహోజ్వల అగ్నికీలలకు దగ్ధమౌతున్న భవనాలనుండి వజ్రాలు, పగడాలు, వైదూర్యాలు, ముత్యాలు, వెండి మొదలైన ధాతువులు కలగలసి కరిగి ద్రవరూపం సంతరించుకొని వింతరంగుల్లో ప్రవహించడం హనుమంతుడు చూశాడు.

28

నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం చ యథా తథా,
హనుమాన్ రాక్షసేన్ద్రాణాం వధే కించిన్న తృప్యతి.

29

న హనూమద్విశస్తానాం రాక్షసానాం వసున్ధరా.

30

క్వచిత్కంశుకసంకాశాః క్వచిచ్ఛాల్మలిసన్నిభాః,
క్వచిత్కుఙ్కుమసంకాశాః శిఖా వహ్నేశ్చకాశిరే.

31

హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా,
లఙ్కాపురం ప్రదగ్ధం తద్రుద్రేణ త్రిపురం యథా.

32

తతస్తు లఙ్కాపురపర్వతాగ్రే
సముత్థితో భీమపరాక్రమోఽగ్నిః,
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో
హనూమతా వేగవతా విసృష్టః.

33

ఎన్ని కట్టెలు, ఎంత గడ్డి వేసినా అగ్ని తృప్తిచెంది చల్లబడకపోగా మరింత ఉద్ధృతంగా మండుతుంది. అదేవిధంగా ఎంతమంది రాక్షసులను హతమార్చినా హనుమంతుడికి తృప్తి కలుగలేదు. హనుమంతుడు ఎందరు రాక్షసులను నేలకూల్చినప్పటికీ భూమికూడా తృప్తి చెందలేదు.

29–30

నగరంలో ఉవ్వెత్తున లేస్తున్న అగ్నిజ్వాలలు కొన్ని చోట్ల కింశుక (మోదుగ) పుష్పాల రంగులోను, మరికొన్ని చోట్ల బూరుగపువ్వుల వర్ణంలోను, ఇంకా కొన్నిచోట్ల కుంకుమపువ్వు రంగును సంతరించుకొని విభిన్నంగా ప్రకాశిస్తూ కానవచ్చాయి.

31

రుద్రుడు త్రిపురాలను దగ్ధం చేసిన చందాన మహాత్ముడూ,

వాయువేగం గలవాడూ అయిన హనుమంతుడు లంకానగరాన్ని దగ్ధం చేశాడు.

32

మహాశక్తిమంతుడైన హనుమంతుడు ముట్టించిన అగ్ని బాగా రాజుకొని లంగానగరమంతా ఒక్క చోటుకూడా విడవకుండా వ్యాపించింది; ఆ తరువాత అగ్నిజ్వాలలు లంక నెలకొని ఉన్న త్రికూటపర్వతాగ్రం పైదాకా ఎగిసాయి.

33

యుగాన్తకాలానలతుల్యవేగః
సమారుతోఽగ్నిర్వవృధే దివిస్పృక్
విధూమరశ్మిర్భవనేషు సక్తో
రక్షః శరీరాజ్యసమర్పితార్చిః.

34

ఆదిత్యకోటీసదృశః సుతేజా
లఙ్కాం సమస్తాం పరివార్య తిష్ఠన్,
శబ్దైరనేకైరశనిప్రరూఢై
ర్భిన్దన్నివాణ్డం ప్రబభౌ మహాగ్నిః.

35

తత్రామ్బరాదగ్నిరతిప్రవృద్ధో
రూక్షప్రభః కింశుకపుష్పచూడః,
నిర్వాణధూమాకులరాజయశ్చ
నీలోత్పలాభాః ప్రచకాశిరేఽభ్రాః.

36

వాయువు తోడవడంతో ఆ అగ్ని పొగలేని మంటలుగలదై

ప్రళయకాలాగ్ని చందాన మహావేగంతో ఆకాశమంత ఎత్తుకు వ్యాపించింది. రాక్షసుల శరీరాలనే ఆజ్యంతో అగ్నిజ్వాలలు మరింతగా విజృంభించాయి.

34

కోటి సూర్యుల ప్రకాశంతో సమానమైన తేజస్సుతో ఆ మహాగ్ని జ్వాలలు లంకానగరాన్ని ఆవరించాయి. ఆ అగ్నిజ్వాలలే కాక ఆ అగ్ని వేడిమికి నివాస గృహాలు పెళేల్‌మంటూ బద్దలవుతూంటే పిడుగుల వంటి శబ్దాలు జనించి నగరం యావత్తు వ్యాపించసాగాయి. బ్రహ్మాండమే బద్దలైపోతోందా అన్నట్లు ఆ ఫెళఫెళారావాలు వినవచ్చాయి.

35

మోదుగ పువ్వువంటి ఎర్రని వర్ణాన్ని సంతరించుకొన్న అగ్నిజ్వాలలు మిరిమిట్లుగొల్పే కాంతులతో పైకెగసి ఆకాశపర్యంతం వ్యాపించాయి. తమ దారిలో తారసపడ్డ సమస్తాన్నీ దగ్ధం చేసిన తరువాత ఆరిన మంటల నుండి బయలుదేరిన పొగచే ఆవృతమైన మేఘాలు నల్లకలువల చందాన ఒప్పారుతూ ప్రకాశించాయి.

36

వజ్రీ మహేన్ద్రస్త్రిదశేశ్వరో వా
సాక్షాద్యమో వా వరుణోఽనిలో వా,
రుద్రోఽగ్నిరర్కో ధనదశ్చ సోమో
న వానరోఽయం స్వయమేవ కాలః.

37

కిం బ్రహ్మణః సర్వపితామహస్య
సర్వస్య ధాతుశ్చతురాననస్య,
ఇహాగతో వానరరూపధారీ
రక్షోపసంహారకరః ప్రతాపః.

38

కిం వైష్ణవం వా కపిరూపమేత్య
రక్షోవినాశాయ పరం సుతేజః,
అనన్తమవ్యక్తమచిన్త్యమేకం
స్వమాయయా సాంప్రతమాగతం వా.

39

తమ కళ్ళముందే జరుగుతున్న బీభత్సం చూసి రాక్షసులు తమలో తాము ఇలా అనుకోసాగారు: ఈ వచ్చిన వాడు వానరరూపంలో ఉన్నాడేగాని వానరుడు మాత్రం కాడు. వజ్రాయుధధారీ, దేవతల ప్రభువు అయిన ఇంద్రుడైనా కావచ్చు. లేదా సాక్షాత్తు యముడో, వరుణుడో, వాయుదేవుడో అయి ఉంటాడేమో! అదీకాకపోతే రుద్రుడుగాని, అగ్నిగాని, కుబేరుడుగాని, సూర్యుడుగాని, చంద్రుడుగాని అయివుండవచ్చు. ఏదీ కాకపోతే ఇతడు సాక్షాత్తు ఆ కాలపురుషుడే అయి ఉండాలి.

37

లేకపోతే సకలజీవకోటి సృష్టికర్త, పోషకుడు అయిన ఆ బ్రహ్మదేవుని ఆగ్రహావేశం రాక్షససంహారార్థం ఈ వానరరూపం దాల్చి ఇక్కడకు వచ్చిందా ఏమిటి?

38

లేకుంటే అనంతమూ, అవ్యక్తమూ, ఊహాతీతమూ, అఖండమూ, అద్వితీయమూ అయిన వైష్ణవతేజం తన మాయచే రాక్షసవినాశనానికి వానర రూపం దాల్చి వచ్చిందా?

39

ఇత్యేవమూచుర్బహవో విశిష్టా
రక్షోగణాస్తత్ర సమేత్య సర్వే,

సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం
దగ్ధాం పురీం తాం సహసా సమీక్ష్య.

40

తతస్తు లఙ్కా సహసా ప్రదగ్ధా
సరాక్షసా సాశ్వరథా సనాగా,
సపక్షిసంఘా సమృగా సవృక్షా
రురోద దీనా తుములం సశబ్దమ్.

41

హా తాత హా పుత్రక కాన్త మిత్ర
హా జీవితం భోగయుతం సుపుష్పమ్,
రక్షోభిరేవం బహుధా బ్రువద్భిః
శబ్దః కృతో ఘోరతరః సుభీమః.

42

ప్రాణి సమూహాలతో, గృహాలతో, వృక్షాలతో సహా ఆ లంకానగరం క్షణాల్లో దగ్ధమౌతూండడం చూసి పలువురు రాక్షసనాయకులు ఒక చోట గుమిగూడి పై విధంగా అనుకోసాగారు.

40

ఈ రీతిలో సత్వరమే రాక్షసులు, అశ్వాలు, రథాలు, ఏనుగులు, మృగాలు, పక్షిసముదాయాలు, వృక్షాలు – వీటితో కూడుకున్న లంకానగరం దగ్ధం అవుతూండడంతో, నగరంలో ఎల్లెడలా ఎలుగెత్తుతున్న రోదన ధ్వనులు మిన్నుముట్టాయి.

41

"అయ్యో తండ్రీ! హా కుమారా! హా ప్రియా! అయ్యో మిత్రమా! పుణ్యఫలంగా లభించే ఓ భోగమయ జీవితమా!" అంటూ విలవిల్లాడుతూ

రాక్షసులు రోదించ సాగారు. వారి హృదయవిదారక దీనారావాలతో వాతావరణం పూర్తిగా నిండిపోయింది.

42

హుతాశనజ్వాలసమావృతా సా
హతప్రవీరా పరివృత్తయోధా,
హనూమతః క్రోధబలాభిభూతా
బభూవ శాపోపహతేవ లఙ్కా.

43

స సంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం
సముజ్జ్వలజ్జ్వలహుతాశనాఙ్కితామ్,
దదర్శ లఙ్కాం హనుమాన్ మహామనాః
స్వయంభుకోపోపహతామివావనిమ్.

44

భంక్త్వా వనం పాదపరత్నసంకులం
హత్వా తు రక్షాంసి మహాన్తి సంయుగే,
దగ్ధ్వా పురీం తాం గృహరత్నమాలినీమ్
తస్థౌ హనూమాన్ పవనాత్మజః కపిః.

45

హనుమంతుని క్రోధాగ్ని ప్రభావంతో సర్వత్రా వ్యాపించిన పెనుమంటలతో, మరణించిన మహావీరులతో, తిరోగమించిన సైనికులతో ఆ లంకానగరం అప్పుడు శాపానికి గురై ధ్వంసమైన నగరాన్ని పోలి ఉంది.

43

దిక్కుతోచక భయంతో విలవిల్లాడుతున్న రాక్షసులతో, సర్వత్రా మిన్నంటే అగ్నిజ్వాలలు వ్యాపించిన ఆ లంకానగరం బ్రహ్మదేవుని

కోపాహుతికి గురై నాశనం కాబడిన భూభాగంలా కానరావడాన్ని మహత్ముడైన హనుమంతుడు చూశాడు.

44

గొప్ప వృక్షాలతో అలరారుతున్న అశోకవనాన్ని ధ్వంసం చేసి, తదనంతరం జరిగిన యుద్ధంలో మహావీరులైన అనేకమంది రాక్షసులను మట్టుబెట్టి, లంకానగరంలో బారులుదీరివున్న అసంఖ్యాక భవనాలను అగ్నికి ఆహుతి గావించి ఆ వాయునందనుడైన హనుమంతుడు ఇప్పుడు ప్రశాంతంగా నిలబడ్డాడు.

45

త్రికూటశృఙ్గాగ్రతలే విచిత్రే
ప్రతిష్ఠితో వానరరాజసింహః,
ప్రదీప్తలాఙ్గూల కృతార్చిమాలీ
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలీ.

46

స రాక్షసాంస్తాన్ సుబహూంశ్చ హత్వా
వనం చ భఙ్క్త్వా బహుపాదపం తత్,
విసృజ్య రక్షోభవనేషు చాగ్నిం
జగామ రామం మనసా మహాత్మా.

47

తతస్తు తం వానరవీరముఖ్యం
మహాబలం మారుతతుల్యవేగమ్,
మహామతిం వాయుసుతం వరిష్ఠం
ప్రతుష్టువుర్దేవగణాశ్చ సర్వే.

48

తన వాలాగ్రాన ప్రజ్వలిస్తున్న మంటలు జ్వాలల మాలగా తోపిస్తూండగా విచిత్రమైన త్రికూటపర్వతం మీద నిలబడ్డ వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు కిరణ పుంజాలతో ప్రకాశిస్తున్న సూర్యుని చందాన భాసించాడు.

46

పేరెన్నికగన్న అనేకమంది రాక్షసయోధులను సంహరించిన, గొప్ప వృక్షసముదాయాలతో అలరారుతున్న అశోకవనాన్ని ఛిన్నాభిన్నంచేసిన, పంక్తులుదీరిన రాక్షసుల భవనాలను అగ్నికి సంతర్పణచేసిన మహాత్ముడైన ఆ హనుమంతుడు ఇప్పుడు మనస్సులో రామున్ణి తలచుకొన్నాడు.

47

అదే సమయంలో వానరవీరులలో ప్రధానుడు, అపరిమిత బలసంపన్నుడు, వాయువేగం గలవాడు, గొప్ప బుద్ధిశాలి, సర్వశ్రేష్ఠుడు అయిన ఆ హనుమంతుని దేవతలందరూ వేనోళ్ళ ప్రశంసించారు.

48

భఙ్క్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే,
దగ్ధ్వా లఙ్కాపురీం రమ్యాం రరాజ స మహాకపిః.

49

తత్ర దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
దృష్ట్వా లఙ్కాం ప్రదగ్ధాంతాం విస్మయం పరమం గతాః.

50

తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనుమన్తం మహాకపిమ్,
కాలాగ్నిరితి సంచిన్త్య సర్వభూతాని తత్రసుః.

51

దేవాశ్చ సర్వే మునిపుఙ్గవాశ్చ

గన్ధర్వవిద్యాధరనాగయక్షాః,
భూతాని సర్వాణి మహాన్తి తత్ర
జగ్ముః పరాం ప్రీతిమతుల్యరూపామ్.

52

మహాతేజోవంతుడైన ఆ హనుమంతుడు అశోకవనాన్ని ధ్వంసం చేసి, రణరంగంలో రాక్షసవీరులను పరిమార్చి, రమ్యమైన లంకానగరాన్ని దహనం గావించి ఉజ్జ్వల వదనారవిందుడై తేజరిల్లాడు.

49

అప్పుడు ఆ లంకానగరం అగ్నిజ్వాలల్లో దగ్ధమవుతూండడం చూసి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఎంతో ఆశ్చర్యం చెందారు.

50

వానరోత్తముడైన ఆ హనుమంతుణ్ణి చూసి సమస్త ప్రాణులు అతణ్ణి సాక్షాత్తు ప్రళయకాలాగ్నిగా భావించి, భయభ్రాంతాలైనవి.

51

లంకానగరంలో హనుమంతుడు సృష్టించిన బీభత్సాన్ని తిలకించి సకల దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు, సమస్త భూతాలు మేరమీరిన ఆనందం పొందారు.

52

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 54వ సర్గ
సమాప్తం

55

వ సర్గ

హనుమంతుని సంకటం

లఙ్కాం సమస్తాం సందీప్య లాఙ్గూలాగ్నిం మహాబలః,
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః.

1

సందీప్యమానాం విధ్వస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్,
అవేక్ష్య హనుమాన్ లఙ్కాం చిన్తయామాస వానరః.

2

తస్యాభూత్సుమహాంస్త్రాసః కుత్సా చాత్మన్యజాయత,
లఙ్కాం ప్రదహత కర్మ కిం స్విత్ కృతమిదం మయా.

3

వానరోత్తముడూ, మహాబలాన్వితుడూ అయిన ఆ హనుమంతుడు లంకాదహన కార్యకలాపాన్ని ఆ విధంగా సంతృప్తికరంగా ముగించి, తన తోకను సముద్రంలో ముంచి తోకకున్న అగ్నిజ్వాలలను చల్లార్చాడు.

1

భయభ్రాంతులైన రాక్షసగణాలతో కూడుకొని ఉన్న, ప్రజ్వలిస్తున్న మంటల్లో ధ్వంసంమైపోతున్న ఆ లంకానగరాన్ని పరికించి వానరోత్తముడైన

హనుమంతుడు ఆలోచనలో పడ్డాడు.

2

లంకానగరం మంటల్లో దగ్ధమయింది. అందువల్ల ఏ ప్రయోజనం సిద్ధించింది? ఈ వైఖరిలో ఆలోచిస్తున్న హనుమంతునికి భయం వేసింది; తన పట్ల తనకు ఏవగింపు కూడా కలిగింది కూడా.

3

ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితమ్,
నిరున్ధన్తి మహాత్మానో దీప్తమగ్నిమివామ్భసా.

4

క్రుద్ధః పాపం న కుర్యాత్ కః క్రుద్ధో హన్యాద్గురూనపి,
క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూనధిక్షిపేత్.

5

వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్,
నాకార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్.

6

యః సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి,
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే.

7

ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్,
అచిన్తయిత్వా తాం సీతామగ్నిదం స్వామిఘాతకమ్.

8

ప్రజ్వరిల్లుతున్న మంటలను నీళ్ళు పోసి చల్లార్చినట్లు, తమ కోపోద్రేకాన్ని నిశ్చయాత్మకబుద్ధితో నిగ్రహించుకొనేవారు మహాత్ములైన

పురుషశ్రేష్ఠులు, ధన్యాత్ములు.

4

కోప ప్రభావంలో పాపానికి ఒడిగట్టని వాడెవడు? కోపావేశంలో పెద్దలను కూడా చంపుతారు; పరుష వచనాలతో సజ్జనులను సైతం అధిక్షేపిస్తారు.

5

కోపోద్రిక్తుడైన వాడు ఏది మాట్లాడవచ్చో, ఏది మాట్లాడకూడదో అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడు. అటువంటి వాడికి చేయరాని పని ఉండదు, అనరాని మాట ఉండదు.

6

సర్పం తన కుబుసాన్ని విసర్జించినట్లు, ఓరిమితో క్షణికోద్రేకంలో పెల్లుబికిన కోపం నుండి ఎవడు విడివడతాడో అతడే పురుషోత్తముడు.

7

ఛీ! సీతాదేవి సంగతినే పూర్తిగా మరిచిపోయి అనాలోచితంగా లంకను అగ్నికి ఆహుతి చేశాను. ఎంతటి మూర్ఖుణ్ణి, పాపిని, సిగ్గులేని వాణ్ణి? స్వామి ద్రోహానికి పాల్పడిన వాణ్ణి.

8

యది దగ్ధా త్వియం లఙ్కా మానమార్యాపి జానకీ,
దగ్ధా తేన మయా భర్తుర్హితం కార్యమజానతా.

9

యదర్థమయమారమ్భ స్తత్కార్యమవసాదితమ్,
మయా హి దహతా లఙ్కాం న సీతా పరిరక్షితా.

10

ఈషత్కార్యమిదం కార్యం కృతమాసీన్న సంశయః,
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః.

11

వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లఙ్కాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ.

12

యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్,
ఇహైవ ప్రాణసంన్యాసో మమాపి హ్యద్య రోచతే.

13

లంకానగరం దగ్ధమైపోయినప్పుడు పూజ్యురాలైన సీతాదేవి కూడా తప్పక ఆ అగ్నిజ్వాలలకు ఆహుతి అయిపోయే ఉంటుంది. అటువంటప్పుడు నేను సాధించినదేమిటి? స్వామి కార్యాన్ని పూర్తిగా పాడుచేసినవాణ్ణి అయ్యాను.

9

లంకాదహన సమయంలో సీతాదేవిని రక్షించాలనే స్ఫురణ లేకపోవడంతో అందునిమిత్తం ఎటువంటి ప్రయత్నమూ చెయ్యలేదు. ఏ మహత్కార్య సాధనకై ఇంతవరకు పడ్డ శ్రమ, చేసిన ప్రయత్నమూ అంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది.

10

నేను ఏ కార్యం సాధించగోరి వచ్చానో ఆ కార్యసాధనలో దాదాపు కృతకృత్యుడనయ్యే దశకు వచ్చాను. కాని క్షణిక కోపావేశంలో ఇప్పుడు ఆ అసలు కార్యానికే ముప్పు తెచ్చాను. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు.

11

ఈ లంకానగరమంతా భస్మమైపోయింది. దగ్ధం కాని ప్రాంతం

మచ్చుకి ఒక్కటికూడా లేదు. కనుక సీతాదేవి మరణించి ఉండడానికే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

12

నా అవివేకపు పని వలన నా ప్రభువు కార్యం చెడిపోయిన పక్షంలో అందుకు నిష్కృతిగా ఇక్కడే, ఇప్పుడే నేను ప్రాణత్యాగం చేయడం ఉత్తమం.

13

కిమగ్నౌ నిపతామ్యద్య ఆహోస్విద్బడబాముఖే,
శరీరమాహో సత్త్వానాం దద్మి సాగరవాసినామ్.

14

కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః,
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా.

15

మయా ఖలు తదేవేదం రోషదోషాత్ప్రదర్శితమ్,
ప్రథితం త్రిషు లోకేషు కపిత్వమనవస్థితమ్.

16

ధిగస్తు రాజసం భావమనీశమనవస్థితమ్,
ఈశ్వరేణాపి యద్రాగాన్మయా సీతా న రక్షితా.

17

వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః,
తయోర్వినాశే సుగ్రీవః సబన్ధుర్వినశిష్యతి.

18

నేను అగ్నిలో దూకి ప్రాణత్యాగం చెయ్యనా? లేక బడబాగ్నిలో పడిపోనా? లేకుంటే సముద్రంలో జలచరాలకు నా శరీరాన్ని ఆహారంగా

సమర్పించి ప్రాణత్యాగం చెయ్యనా?

14

అప్పగించిన కార్యాన్ని నా దుందుడుకు చేతల వలన సమూలంగా పాడుచేసి ఏ ముఖంపెట్టుకొని ప్రాణాలతో వానరరాజైన సుగ్రీవుని ముందుకు వెళ్ళగలను? పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులకు ఎలా నా ముఖం చూపగలను?

15

వానరులు చపలచిత్తం గలవారనే ముల్లోక ప్రసిద్ధమైన నానుడిని నా పిచ్చికోపంతో ప్రదర్శించి బుజువు చేశాను గదా!

16

రజోగుణం ఎంత ప్రమాదకారి! ఇది అదుపు తప్పి బుద్ధికి చంచలత్వం కల్పిస్తుంది. దీని ప్రభావంలో పడి ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేక, సమర్థుడనై ఉండీ సీతాదేవిని రక్షించుకోలేకపోయానే!

17

సీతాదేవి మరణించినదనే వార్త వినీవినగానే రామలక్ష్మణులిద్దరూ మరణిస్తారు; వారి మరణం చూసి సుగ్రీవుడు బంధువులతో సహా ప్రాణత్యాగం చేయడం తథ్యం.

18

ఏతదేవ వచః శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః,
ధర్మాత్మా సహశత్రుఘ్నుః కథం శక్ష్యతి జీవితుమ్.

19

ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశమసంశయమ్,
భవిష్యన్తి ప్రజాః సర్వాః శోకసన్తాపపీడితాః.

20

తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః,
రోగదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః.

21

ఇతి చిన్తయతస్తస్య నిమిత్తాన్యుపపేదిరే,
పూర్వమప్యుపలబ్ధాని సాక్షాత్పునరచిన్తయత్.

22

అథవా చారుసర్వాఙ్గీ రక్షితా స్వేన తేజసా,
న నశిష్యతి కల్యాణీ నాగ్నిరగ్నౌ ప్రవర్తతే.

23

ఈ విషాదవార్త వినగానే సోదరప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా విరాజిల్లుతున్నవాడూ, ధర్మాత్ముడూ అయిన భరతుడు, శత్రుఘ్నునితో సహా ప్రాణాలు విడువక ఎలా బ్రతికి ఉంటాడు?

19

ఈ విధంగా ధర్మనిష్ఠకు ఆలవాలంగా విరాజిల్లుతున్న ఇక్ష్వాకువంశం అంతరిస్తే యావత్తు ప్రజానీకం శోకమనే అగ్నిలో దహించుకుపోతారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

20

కాబట్టి, రోషం అనే దోషంలో కూరుకుపోవడంతో నేను భాగ్యహీనుడనై ధర్మార్థఫలాలను కోల్పోయి ఇంతటి లోకవినాశానికి కారణభూతుడనయ్యా నన్న విషయం నిర్వివాదాంశం.

21

హనుమంతుడు ఈ విధంగా యోచిస్తూ విచారమగ్నుడై ఉండగా, గతంలో మాదిరే అతడికి ప్రత్యక్షంగా శుభశకునాలు కానవచ్చాయి. దాంతో మనస్సు కాస్త కుదుటపడగా మళ్ళీ అతడు ఆలోచనల్లో మునిగిపోయాడు.

22

మంగళప్రదురాలూ, సర్వాంగసుందరీ అయిన సీతాదేవికి ఆమె తేజస్సే రక్షణ కవచం. అగ్నిని అగ్ని దహించదు కదా! కనుక ఆమె సురక్షితంగానే ఉండి ఉంటుంది.

23

న హి ధర్మాత్మనస్తస్య భార్యామమితతేజసః,
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టుమర్హతి పావకః.

24

నూనం రామప్రభావేణ వైదేహ్యాః సుకృతేన చ,
యన్మాం దహనకర్మాఽయం నాదహద్ధవ్యవాహనః.

25

త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా,
రామస్య చ మనఃకాన్తా సా కథం వినశిష్యతి.

26

యద్వా దహనకర్మాయం సర్వత్ర ప్రభురవ్యయః,
న మే దహతి లాఙ్గూలం కథమార్యాం ప్రధక్ష్యతి.

27

పునశ్చాచిన్తయత్తత్ర హనుమాన్ విస్మితస్తదా,
హిరణ్యనాభస్య గిరేర్జలమధ్యే ప్రదర్శనమ్.

28

ధర్మస్వరూపుడూ, అమిత తేజశ్శాలీ అయిన ఆ రాముని పత్ని, పాతివ్రత్యమనే రక్షాకవచంచే పరిరక్షిత అయిన ఆ సీతాదేవిని స్పృశించే శక్తి అగ్నికి ముమ్మాటికీ లేదు.

24

మినహాయింపు అంటూ లేకుండా దేనినైనా దహించివేసే అగ్ని ప్రజ్వలిస్తూ కూడా నన్ను కాల్చలేదు. రాముని ప్రభావంచేత, సీతాదేవి పుణ్యం వలన అలా జరిగిందనడం నిశ్చయం.

25

సోదరులైన భరతలక్ష్మణశత్రుఘ్నులకు సీతాదేవి అత్యంత పూజ్యురాలు; రామునికి ఆమె ప్రాణేశ్వరి. అటువంటి సీతాదేవి అగ్నిలో దగ్ధం కావడం అసంభవం.

26

దహించడం అగ్ని నైజం. అగ్ని నాశరహితమైనది, ఎటువంటి ప్రతిబంధకమూ లేనిది. అటువంటి సర్వసమర్థత గల ఆ అగ్ని నా తోకనే కాల్చలేదు కదా! ఇక పూజ్యురాలైన సీతాదేవిని ఎలా దహిస్తుంది?

27

అప్పుడు సముద్ర లంఘన సమయంలో సముద్రజలాల మధ్యనుండి మైనాకపర్వతం లేచి పైకి వచ్చిన సంఘటనను హనుమంతుడు ఆశ్చర్యపోతూ గుర్తుకు తెచ్చుకున్నాడు.

28

తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి,
అపి సా నిర్దహేదగ్నిం న తామగ్నిః ప్రధక్ష్యతి.

29

స తథా చిన్తయంస్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్,
శుశ్రావ హనుమాన్వాక్యం చారణానాం మహాత్మనామ్.

30

అహో ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా,
అగ్నిం విసృజతాఽభీక్ష్ణం భీమం రాక్షసవేశ్మని.

31

ప్రపలాయితరక్షఃస్త్రీ బాలవృద్ధ సమాకులా,
జనకోలాహలాధ్మాతా క్రన్దన్తీవాద్రికన్దరే.

32

దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా,
జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః.

33

తపోబలం వలన, సత్యనిష్ఠ వలన, భర్త పట్లగల అచంచల భక్తి వలన పరమ పావనురాలైన ఆ సీతాదేవి సాక్షాత్తు అగ్నినే దహించివెయ్యగల సమర్థురాలు. అటువంటి ఆమెను అగ్ని ఏం చెయ్యగలదు?

29

ఈ రీతిలో సీతాదేవి మహోన్నత ధార్మికవర్తన ప్రభావాన్ని గూర్చి హనుమంతుడు తలపోస్తుండగా ఆకాశంలో సంచరిస్తున్న చారణుల మాటలు వినవచ్చాయి.

30

రాక్షసుల ఆవాసాలలో భయంకరమూ, దుస్సమూ అయిన అగ్నిని రగిల్చి హనుమంతుడు అనితరసాధ్యమైన కార్యాన్ని నిర్వర్తించాడు. ఆహా! ఏం ఆశ్చర్యం!

31

స్త్రీబాలవృద్ధులతో సహా రాక్షసులు భీతితో దిక్కుతోచక అటూ ఇటూ పరుగులు తీస్తూంటే, వారి కోలాహల ధ్వనులు త్రికూట పర్వత గుహల్లో ప్రతిధ్వనించాయి. అప్పుడు సాక్షాత్తు లంకానగరమే గుహలనే నోళ్ళను

తెరచుకొని ఏడుస్తున్నట్లు ఆ ప్రతిధ్వనులు తోపింపజేశాయి. కోట బురుజులతో, ప్రాకారాలతో తోరణద్వారాలతో కూడిన ఈ లంకానగరం యావత్తు మంటల్లో దగ్ధమైపోయింది. కాని సీతాదేవి మాత్రం చెక్కుచెదరకుండా సురక్షితంగా ఉంది. ఎంత అద్భుతం, ఏం ఆశ్చర్యం!

32–33

స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ హనుమానభవత్ ప్రీతమానసః.

34

తతః కపిః ప్రాప్తమనోరథార్థ
స్తామక్షతాం రాజసుతాం విదిత్వా,
ప్రత్యక్షతస్తాం పునరేవ దృష్ట్వా
ప్రతిప్రయాణాయ మతిం చకార.

35

గతంలో కానవచ్చిన శుభ శకునాలు సఫలం కావడం మూలాన, రాముని ప్రభావం సీతాదేవి పాతివ్రత్య మహిమల వలన, ఇప్పుడు చారణులు పలికిన వచనాల వలన హనుమంతుని మనస్సు సంతోషంతో పొంగిపోయింది.

34

అప్పుడు మనోరథం ఈడేరినవాడైన ఆ హనుమంతునికి సీతాదేవి క్షేమంగా ఉందన్న గట్టి నమ్మకం కలిగింది. అయినప్పటికీ కళ్ళారా ఒకసారి ఆమెను చూసి ఆ తరువాత తిరుగు ప్రయాణం చేయడానికి నిర్ణయించుకొన్నాడు.

35

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 55వ సర్గ

సమాప్తం

56

వ సర్గ

సీతా పునర్దర్శనం – తిరుగు పయనం

తతస్తు శింశుపామూలే జానకీం పర్యవస్థితామ్,
అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వామిహాక్షతామ్.

1

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం హనూమన్తమభాషత.

2

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే ఫలోదయః.

3

తరువాత హనుమంతుడు శింశుపావృక్షం కింద ఆసీనురాలై ఉన్న సీతాదేవి వద్దకు వెళ్లి ఆమెకు నమస్కరించి, "తల్లీ! దైవానుగ్రహంచే ఏ ప్రమాదం జరుగకుండా సురక్షితంగా నిన్ను చూడగలిగాను" అని అన్నాడు ఆనందంగా.

1

అప్పుడు సీతాదేవి తిరుగు ప్రయాణానికి సంసిద్ధుడై ఉన్న

హనుమంతుని పదేపదే చూస్తూ, భర్త పట్ల తనకు గల భక్తిప్రేమలు ఉట్టిపడే తీరులో ఇలా వచించింది.

2

శత్రుసంహారకుడవైన ఓ హనుమా! ఈ కార్యసాధనకు (రాక్షసులందరినీ సంహరించి, నన్ను రాముని వద్దకు చేర్చడం) నిజానికి నువ్వొక్కడివే చాలు. నీ బలపరాక్రమాలు శ్లాఘనీయాలు.

3

శరైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సస్తత్తస్య సదృశం భవేత్.

4

తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవత్యాహవశూరస్య తథా త్వముపపాదయ.

5

తదర్థోపహతం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాంస్తస్యా వాక్యముత్తరమబ్రవీత్.

6

క్షిప్రమేష్యతి కాకుత్థ్సో హర్యృక్షప్రవరైర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి.

7

ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీమభ్యవాదయత్.

8

అయినప్పటికీ శత్రుసేనలను ఒంటిచేత్తో చీల్చిచండాడగల రాముడు

తన శరపరంపరతో లంకను అతలాకుతలం చేసి నన్ను తోడ్కొని వెళ్ళడం ఆయన ఘనతకు సముచితంగా ఉంటుంది.

4

కాబట్టి శూరాగ్రేసరుడూ, మహాత్ముడూ అయిన రాముడు తన స్వకీయ పరాక్రమంచే శత్రువులను జయించే ప్రయత్నాలకు అనుగుణమైన సూచనలు నువ్వు ఇవ్వు.

5

సీతాదేవి పలికిన అర్థయుక్తమైన, సహేతుకాలైన, ప్రేమాస్పదమైన వచనాలు విని హనుమంతుడు ఇలా స్పందించాడు.

6

తల్లీ! వానర భల్లూక సేనలతో అతిత్వరలోనే రాముడు ఇక్కడకు వస్తాడు. యుద్ధంలో శత్రువులను జయించి నీ శోకానికి అంతం కడతాడు.

7

వాయునందనుడైన ఆ హనుమంతుడు అనునయవాక్యాలతో సీతాదేవికి ధైర్యం చెప్పి, ఆమెకు ప్రణమిల్లి బయలుదేరడానికి సన్నద్ధుడయ్యాడు.

8

తతః స కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః,
ఆరురోహ గిరిశ్రేష్ఠమరిష్టమరిమర్దనః.

9

తుఙ్గపద్మకజుష్టాభిః నీలాభిర్వన రాజిభిః,
సోత్తరీయమివామ్భోదైః శృఙ్గాన్తరవిలమ్బిభిః.

10

బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరైః శుభైః,
ఉన్మిషన్తమివోద్ధూతైర్లోచనైరివ ధాతుభిః.

11

తోయౌఘనిస్వనైర్మన్దైః ప్రాధీతమివ పర్వతమ్,
ప్రగీతమివ విస్పష్టైర్నానాప్రస్రవణస్వనైః.

12

దేవదారుభిరత్యుచ్చైరూర్ధ్వబాహుమివ స్థితమ్,
ప్రపాతజలనిర్ఘోషైః ప్రాకృష్టమివ సర్వతః.

13

తదనంతరం శత్రుసంహారకుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు తన ప్రభువైన రాముని దర్శించాలనే ఆతురతతో అరిష్టమనే పర్వతరాజాన్ని అధిరోహించాడు.

9

ఎత్తైన పద్మక వృక్షాలున్న నల్లని వనాలతో కూడినదవటం వలన నల్లని వస్త్రం ధరించినట్లు, శిఖరాల మధ్య వ్యాపించిన మేఘాలచే ఉత్తరీయం ధరించినట్లు ఆ పర్వతం కానవచ్చింది.

10

పైకి అక్కడక్కడ స్పష్టంగా కానవస్తున్న గైరికాది ధాతువులు కన్నుల మల్లే ఉండడం వలన, మంగళకరాలైన సూర్యకిరణాలు ప్రేమాస్పదంగా మేల్కొల్పగా ఆ పర్వతం కళ్ళు తెరచి లోకాన్ని చూస్తున్న చందాన ద్యోతకమవుతోంది.

11

పర్వతం మీద గల కఠినశిలలపై పారుతున్న జలప్రవాహ ధ్వనులు ఆ పర్వతం వేదాధ్యయనం చేస్తున్నట్లుగా, గలగలా పారే సెలయేళ్ళ ధ్వనులు

గానం చేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

12

ఆ పర్వతం మీది దేవదారు వృక్షాలు అత్యంత ఎత్తైనవి అవడం వలన ఆ పర్వతరాజం చేతులెత్తి తపస్సు చేస్తున్న మునిలాగాను, చరియలపై నుండి పడుతున్న జలపాతాల ధ్వనుల వలన గొంతెత్తి అరుస్తున్నట్లుగాను కానవస్తోంది.

13

వేపమానమివ శ్యామైః కమ్పమానైః శరద్ఘనైః,
వేణుభిర్మారుతోద్ధూతైః కూజన్తమివ కీచకైః.

14

నిశ్శ్వసన్తమివామర్షాద్ ఘోరైరాశీవిషోత్తమైః,
నీహారకృతగమ్భీరైర్ధ్యాయన్తమివ గహ్వరైః.

15

మేఘపాదనిభైః పాదైః ప్రకాన్తమివ సర్వతః,
జృమ్భమాణమివాకాశే శిఖరైరభ్రమాలిభిః.

16

కూటైశ్చ బహుధా కీర్ణైః శోభితం బహుకన్దరైః,
సాలతాలాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభిర్వృతమ్.

17

కదలుచున్న నల్లని శరత్కాల మేఘాలు ఆ పర్వతాన్ని గడగడ వణకుచున్న ఒక వ్యక్తి తీరును గుర్తుకు తెస్తోంది; వెదురుపొదల గుండా గాలి దూసుకుపోతుంటే ఆ ధ్వని పర్వతం వేణువు ఊదుచున్నట్లుగా ఉంది.

ఆ పర్వతం మీద ఆవాసమున్న భయంకర విషసర్పాల బుసల సవ్వడి ఆ పర్వతం నిట్టూర్పులు విడుస్తున్న భావనను కల్పిస్తూన్నది. ఆ పర్వత గుహలు మంచుచే కప్పబడి ఉండడం వలన, ఇంద్రియాలను నిరోధించి ధ్యానంలో లీనమైన ముని చందాన ఆ పర్వతం భాసిస్తోంది.

15

ఆ అరిష్టపర్వత ప్రత్యంత పర్వతాలు (పాదపర్వతాలు) పర్వతం మీద సంచరించే మేఘాల పాదాలమల్లే ఉండడంతో సాక్షాత్తు ఆ పర్వతమే నడుస్తున్నట్లుంది. మేఘావృతమైన శిఖరాలను చూస్తూంటే, ఆ పర్వతరాజం ముఖాన్ని పైకెత్తి ఆవలిస్తున్నట్లు ద్యోతకమౌతోంది.

16

పర్వతం మీద వెలసి ఉన్న అనేక శిఖరాలు, గుహలు ఆ పర్వత శోభను మరింత ఇనుమడింపజేస్తున్నాయి. వాటి చుట్టూ సాల, తాళ, అశ్వకర్ణ వృక్షాలు, వెదురు పొదలు దట్టంగా వ్యాపించి ఉన్నాయి.

17

లతావితానైర్వితతైః పుష్పవద్భిరలంకృతమ్,
నానామృగగణాకీర్ణం ధాతునిష్యన్దభూషితమ్.

18

బహుప్రస్రవణోపేతం శిలాసంచయ సంకటమ్,
మహర్షియక్షగన్ధర్వ కిన్నరోరగసేవితమ్.

19

లతాపాదపసంఘాతం సింహాధ్యుషితకన్దరమ్,
వ్యాఘ్రసంఘ సమాకీర్ణం స్వాదుమూలఫలద్రుమమ్.

20

తమారురోహ హనుమాన్ పర్వతం పవనాత్మజః,

రామదర్శనశీఘ్రేణ ప్రహర్షేణాభిచోదితః.

21

తేన పాదతలాక్రాన్తా రమ్యేషు గిరిసానుషు,
సఘోషాః సమశీర్యన్త శిలాశ్చూర్ణీకృతాస్తతః.

22

ఆ పర్వతరాజం విరగబూసిన విస్తారాలైన లతా సమూహాలతోను, నానారకాల మృగసమూహాలతోనూ పరివ్యాప్తమై, ధాతుస్రావాలచే అలంకృతమై ఒప్పారుతోంది.

18

అనేక సెలయేళ్ళు ఆ పర్వతం మీద నిరాటంకంగా ప్రవహిస్తున్నాయి. సంచారానికి ఆటంకంగా అక్కడ సర్వత్రా ఎగుడుదిగుడు శిలలు గుట్టలుగుట్టలుగా పడి ఉన్నాయి. ఆ పర్వతం మహర్షులకు, యక్షులకు, గంధర్వులకు, కిన్నరులకు, నాగులకు ఆవాసంగా అలరారుతోంది.

19

అనేక లతల, వృక్షాల సముదాయాలతో ఆ పర్వతం కనులపండువ చేస్తోంది. ఆ పర్వత గుహలను సింహాలు తమ ఆవాసం చేసుకొన్నాయి. ఆ పర్వతం మీద పెద్దపులులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మధురమైన కందమూలాలు, ఫలవృక్షాలు అక్కడ కోకొల్లలు.

20

అటువంటి పర్వతాన్ని వాయునందనుడైన హనుమంతుడు రామదర్శనానికి ఆతురతపడుతూ సమధికోత్సాహంతో అధిరోహించాడు.

21

అప్పుడు సుందరమైన పర్వత సానువులందున్న గండశిలలు హనుమంతుని పాదాల కింద నలిగి పెద్ద చప్పుళ్ళతో చూర్ణమైపోయాయి.

22

స తమారుహ్య శైలేన్ద్రం వ్యవర్ధత మహాకపిః,
దక్షిణాదుత్తరం పారం ప్రార్థయన్ లవణామ్భసః.

23

అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః,
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్.

24

స మారుత ఇవాకాశం మారుతస్యాత్మసంభవః,
ప్రపేదే హరిశార్దూలో దక్షిణాదుత్తరాం దిశమ్.

25

స తదా పీడితస్తేన కపినా పర్వతోత్తమః,
రరాస సహ తైర్భూతైః ప్రవిశన్వసుధాతలమ్,
కమ్పమానైశ్చ శిఖరైః పతద్భిరపి చ ద్రుమైః.

26

వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు లవణ సముద్రం దక్షిణ తీరం నుండి ఉత్తరతీరం చేరగోరి పర్వతశిఖరం ఎక్కి, తన శరీర పరిమాణాన్ని మరింతగా పెంచాడు.

23

మహావీరుడైన ఆ హనుమంతుడు పర్వతం మీద నిలబడి ఎదురుగా మీనములతోను, సర్పాలతోను నిండి భయాన్ని గొల్పుతున్న సముద్రాన్ని పరికించాడు.

24

వాయుపుత్రుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు దక్షిణ

దిక్కు నుండి ఉత్తర దిశగా పయనించడానికి వాయువేగంతో ఆకాశంలో ఎగిరాడు.

25

హనుమంతుడు పైకి ఎగిరినప్పుడు ఏర్పడ్డ ఒత్తిడికి ఆ పర్వతం, అక్కడి ప్రాణులతో సహా భూమిలోకి క్రుంగిపోసాగింది. అప్పుడు పర్వత శిఖరాలన్నీ కంపించడంతో, చెట్లన్నీ కూకటివ్రేళ్ళతో సహా నేలకూలిపోతూండడంతో అందుండి బ్రహ్మాండమైన ధ్వని వెలువడింది.

26

తస్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః,
నిపేతుర్భూతలే రుగ్ణాః శక్రాయుధహతా ఇవ.

27

కన్దరాన్తరసంస్థానాం పీడితానాం మహౌజసామ్,
సింహానాం నినదో భీమో నభో భిన్దన్ స శుశ్రువే.

28

స్రస్తవ్యావిద్ధవసనా వ్యాకులీకృత భూషణాః,
విద్యాధర్యః సముత్పేతుః సహసా ధరణీధరాత్.

29

అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః,
నిపీడితశిరోగ్రీవా వ్యవేష్టన్త మహాహయః.

30

కిన్నరోరగగన్ధర్వయక్షవిద్యాధరా స్తదా,
పీడితం తం నగవరం త్యక్త్వా గగనమాస్థితాః.

31

హనుమంతుని ఊరువుల వేగధాటికి విరగబూసిన పువ్వులతో అలరారుతున్న వృక్షాలన్నీ, ఇంద్రుని వజ్రాయుధ ప్రయోగానికి గురైన వాటిమల్లే ఛిన్నాభిన్నాలై నేలకొరిగాయి.

27

హనుమంతుని పాదఘట్టన ఒత్తిడికి శిథిలమౌతున్న గుహలలో చిక్కువడి పోయిన శక్తిమంతమైన సింహాలు భయంకరంగా గర్జించసాగాయి. ఆ గర్జనలు మిన్నుముట్టాయి.

28

ఈ హఠాత్పరిణామానికి అక్కడి విద్యాధరస్త్రీలు ఎంతో భీతిల్లి తమ వలువలు వదులై జారిపోతుండగా, ధరించిన ఆభరణాలు అస్తవ్యస్తమవుతుండగా ఆ పర్వతాన్ని వదలి ఆకాశంలోకి ఎగిరారు.

29

అతిపెద్ద, శక్తిమంతమైన సర్పాలు తమ మెడలు, పడగలు ఒత్తిడికి నలిగిపోగా, తమ కలుగుల నుండి బయటకు వచ్చి నాలుకలు చాపి విషం విరజిమ్ముతూ భయంతో చుట్టలుచుట్టుకుపోసాగాయి.

30

హనుమంతుడు పైకి ఎగిరినప్పుడు జనించిన ఒత్తిడికి ఆ పర్వతం అతలాకుతలమౌతూంటే అక్కడ వసిస్తున్న కిన్నరులు, నాగులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు ముంచుకువస్తున్న ప్రమాదాన్ని పసిగట్టి రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయారు.

31

స చ భూమిధరః శ్రీమాన్ బలినా తేన పీడితః,
సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్.

32

దశయోజనవిస్తారస్త్రింశద్యోజనముచ్ఛ్రితః,
ధరణ్యాం నమతాం యాతః స బభూవ ధరాధరః.

33

స లిలఙ్ఘయిషుర్భీమం సలీలం లవణార్ణవమ్,
కల్లోలాస్ఫాలవేలాన్తముత్పపాత నభో హరిః.

34

రమ్యమైన శిఖరాలతో, వృక్షసంపత్తితో శోభాయమానంగా విరాజిల్లుతున్న అరిష్టమనే ఆ పర్వతరాజం మహాబలసంపన్నుడైన ఆ హనుమంతుని పాదాలధాటి ఒత్తిడికి క్రమంగా పాతాళంలోకి కుంగిపోసాగింది.

32

పది యోజనాల విస్తీర్ణమూ, ముప్పై యోజనాల ఎత్తూ గల ఆ అరిష్ట పర్వతం పాతాళానికి కుంగిపోయి నేలమట్టమయింది.

33

తన ఉద్ధృత తరంగాలచే తీరాలను ప్రచండంగా తాకుతూ భయంకరంగా ఉన్న ఆ లవణ సముద్రాన్ని అలవోకగా దాటగోరి ఆ హనుమంతుడు ఆకాశంలోకి రివ్వున ఎగిరాడు.

34

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 56వ సర్గ సమాప్తం.

57

వ సర్గ

హనుమంతుడు సముద్ర ఉత్తర తీరాన్ని చేరుకోవడం

సచన్ద్రకుముదం రమ్యం సార్కకారణ్డవం శుభమ్,
తిష్యశ్రవణకాదమ్బ మభ్రశైవాలశాద్వలమ్.

1

పునర్వసుమహామీనం లోహితాఙ్గమహాగ్రహమ్,
ఐరావతమహాద్వీపం స్వాతీహంసవిలోళితమ్.

2

వాతసంఘాతజాతోర్మి చన్ద్రాంశుశిశిరామ్బుమత్,
భుజఙ్గయక్షగన్ధర్వప్రబుద్ధకమలోత్పలమ్.

3

హనుమాన్ మారుతగతిర్మహానౌరివ సాగరమ్,
అపారమపరిశ్రాన్తః పుప్లువే గగనార్ణవమ్.

4

ఒక పెద్ద ఓడ సముద్రాన్ని దాటినట్లు, వాయువేగంగల ఆ హనుమంతుడు ఆకాశం అనే అవధుల్లేని సముద్రాన్ని అనాయాసంగా

దాటుతున్నాడు. ఆ ఆకాశ సముద్రంలో చంద్రుడు తెల్లకలువగా, సూర్యుడు కారండవపక్షిగా, మేఘాలు పచ్చికబీళ్ళ నాచుగా, పుష్యశ్రవణ నక్షత్రాలు కలహంసలుగా, పునర్వసూ నక్షత్రం మహామీనంగా, కుజగ్రహమే పెద్ద మొసలిగా, ఐరావతమే ఒక మహాద్వీపంగా, స్వాతీ నక్షత్రం హంసగా, వాయుతరంగాలు జలతరంగాలుగా, చంద్రకిరణాలే చల్లని ఉదకంగా, యక్ష గంధర్వ ఉరగలే కలువలూ, తామరలుగా విరాజిల్లుతున్నారు.

1–4

గ్రసమాన ఇవాకాశం తారాధిపమివోల్లిఖన్,
హరిన్నివ సనక్షత్రం గగనం సార్కమణ్డలమ్.

5

మారుతస్యాత్మజః శ్రీమాన్ కపిర్వ్యామచరో మహాన్,
హనుమాన్ మేఘజాలాని విరర్షన్నివ గచ్ఛతి.

6

పాణ్డరారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ,
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే.

7

ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే.

8

వివిధాభ్రఘనాపన్నగోచరో ధవళామ్బరః,
దృశ్యాదృశ్యతనుర్వీరస్తదా చన్ద్రాయతేఽమ్బరె.

9

వాయునందనుడు, శోభాయుక్తుడు, వానరశ్రేష్ఠుడు అయిన ఆ హనుమంతుడు వినువీథిలో నిరాటంకంగా దూసుకుపోతున్నాడు. అప్పుడు

అతడు ఆకాశాన్ని మ్రింగివేస్తున్నట్లు, చంద్రుని స్పర్శిస్తూ పోతున్నాడా అన్నట్లు, నక్షత్ర సూర్యమండలాలతో కూడిన ఆకాశాన్ని హరిస్తున్నట్లు కానవచ్చాడు. మేఘసమూహాలను తనతో ఈడ్చుకుపోతున్నట్లు కూడా అగపడ్డాడు.

5–6

హనుమంతుని సంసర్గం వలన ఆ మేఘాలు తెలుపు, ఎరుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ వన్నెలను సంతరించుకొన్న తీరులో వ్యక్తంకాసాగాయి.

7

మేఘ సమూహాల్లోకి పదేపదే ప్రవేశిస్తూ బయటికి వస్తూన్న ఆ హనుమంతుడు మబ్బుల మరుగునపడి మళ్ళీ అగపడే చంద్రుని చందాన భాసించాడు.

8

ధవళవస్త్రధారియైన ఆ హనుమంతుడు దట్టమైన మేఘాల వెంట గగనతలంలో ఎగిరిపోతూండడం వలన కొంతసేపు కనబడీ, కొంతసేపు కనిపించక మబ్బుల చాటు చంద్రుని మల్లే ప్రకాశించసాగాడు.

9

తార్క్ష్యయమాణో గగనే బభాసే వాయునన్దనః,
దారయన్ మేఘబృన్దాని నిష్పతంశ్చ పునః పునః.

10

నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః,
ప్రవరాన్ రాక్షసాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః.

11

ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణమ్,
అర్దయిత్వా బలం ఘోరం వైదేహీమభివాద్య చ,
ఆజగామ మహాతేజాః పునర్మధ్యేన సాగరమ్.

12

పర్వతేన్ద్రం సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్,
జ్యాముక్త ఇవ నారాచో మహావేగోఽభ్యుపాగతః.

13

స కించిదనుసంప్రాప్తః సమాలోక్య మహాగిరిమ్,
మహేన్ద్రం మేఘసంకాశం ననాద హరిపుఙ్గవః.

14

వాయునందనుడైన ఆ హనుమంతుడు పదే పదే మేఘసమూహాలను చీల్చుకొని లోనికిపోతూ, వెలుపలకు వస్తూ ఆకాశంలో గరుత్మంతుని చందాన తేజరిల్లాడు.

10

మహాతేజశ్శాలీ, అజేయ పరాక్రమవంతుడు అయిన హనుమంతుడు మహావీరులైన పలువురు రాక్షసులను మట్టుబెట్టి, సేనాసమూహాలను ధ్వంసంచేసి, లంకానగరాన్ని అతలాకుతలం చేసి, రావణుని మనస్సులో వెరపును పుట్టించాడు. సీతాదేవిని దర్శించి, ఆమెతో సంభాషించి తన పేరును చాటి ప్రస్తుతం ఉరుముల మల్లే గర్జిస్తూ గగన మార్గంలో పయనిస్తున్నాడు.

11–12

పరాక్రమవంతుడైన ఆ హనుమంతుడు మార్గమధ్యంలో మైనాక పర్వతాన్ని ఆప్యాయంగా స్పృశించి ధనుస్సునుండి ప్రయోగింపబడిన బాణంలా మహావేగంగా ముందుకు సాగిపోయాడు.

13

వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు మేఘసదృశమైన మహోన్నత మహేంద్రపర్వతాన్ని సమీపిస్తుండగా, దాన్ని చూసి ఆనందం పట్టలేక సింహనాదం చేశాడు.

14

స పూరయామాస కపిర్దిశో దశ సమన్తతః,
నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః.

15

స తం దేశమనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః,
ననాద హరిశార్దూలో లాంగూలం చాప్యకమ్పయత్.

16

తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి,
ఫలతీవాస్య ఘోషేణ గగనం సార్కమణ్డలమ్.

17

యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః,
పూర్వం సంవిష్ఠితాః శూరా వాయుపుత్రదిదృక్షవః.

18

మహతో వాయునున్నస్య తోయదస్యేవ గర్జితమ్,
శుశ్రువుస్తే తదా ఘోషమూరువేగం హమామతః.

19

ఉరుమును పోలిన ధ్వనిగల హనుమంతుడు చేసిన సింహనాదం దశదిశలను నింపివేసింది.

15

అనుంగు మిత్రులను ఎప్పుడెప్పుడు చూస్తానా అనే ఉబలాటపడుతున్న వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు సముద్ర ఉత్తరతీరం చేరుకొంటూ బిగ్గరగా గర్జన చేస్తూ తోకను అటూ ఇటూ వేగంగా తిప్పాడు.

16

గరుత్మంతుడు సంచారం చేసే ఆ గగన మార్గంలో అలా హనుమంతుడు చేస్తున్న గర్జన ధ్వనికి సూర్యమండలసహితమైన ఆకాశం బ్రద్దలవుతున్నట్లు అనిపించింది.

17

అప్పటికే సముద్ర ఉత్తర తీరాన హనుమంతుడు ఎప్పుడు తిరిగి వస్తాడా అని నిరీక్షిస్తూ మహాపరాక్రమవంతులైన అంగదాది వానరశ్రేష్ఠులు ఎదురుచూస్తున్నారు. వారికి అప్పుడు వాయుప్రేరితమైన మేఘగర్జనలా ఉన్న హనుమంతుని సింహనాదం, ఆతడి ఊరువుల తాకిడికి గాలిలో జనించిన శబ్దం వినిపించాయి.

18–19

తే దీనమనసః సర్వే శుశ్రువుః కాననౌకసః,
వానరేన్ద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమమ్.

20

నిశమ్య నదతో నాదం వానరాస్తే సమన్తతః,
బభూవురుత్సుకాః సర్వే సుహృద్దర్శనకాంక్షణః.

21

జామ్బవాన్ స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః,
ఉపామన్త్ర్య హరీన్ సర్వానిదం వచనమబ్రవీత్.

22

సర్వథా కృతకార్యోఽసౌ హనుమాన్నాత్ర సంశయః,
న హ్యస్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్.

23

తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః,
నిశమ్య హరయో హృష్టాః సముత్పేతుస్తతస్తతః.

24

అంతదాకా సీతాదేవి గురించిన సమాచారం ఏదీ తెలియనందున దైన్యంతో ఉన్న ఆ వానరులందరూ హనుమంతుడు చేసిన మహానాదాన్ని స్పష్టంగా విన్నారు.

20

హనుమంతుడు చేసిన సింహనాదాన్ని విని అక్కడ గుమిగూడి ఉన్న వానరులందరూ తమ మిత్రుణ్ణి చూసి ఘనస్వాగతం పలుక ఉత్సాహభరితు లయ్యారు.

21

అప్పుడు వానరులందరికీ ప్రీతిపాత్రుడైన జాంబవంతుడు సంతోషంతో ఉప్పొంగిన వాడై వానరులందరినీ దగ్గరకు పిలిచి, వారితో ఇలా అన్నాడు.

22

హనుమంతుడు స్వామికార్యంలో సమగ్ర విజయం సాధించి తిరిగి వస్తున్నాడు. దాన్లో ఎటువంటి సందేహమూ లేదు. లేకపోతే అతడు అలా సింహనాదం చేసి ఉండడు.

23

మహోత్ముడైన హనుమంతుని బాహువేగమూ ఊరువేగమూ జనింపచేసిన శబ్దం వినీ, ఆతడి సింహనాదం వినీ వానరులందరూ అమిత సంతోషంతో గంతులు వెయ్యసాగారు.

24

తే నగాగ్రాన్నగాగ్రాణి శిఖరాచ్ఛిఖరాణి చ,
ప్రహృష్టాః సమపద్యన్త హనూమన్తం దిదృక్షవః.

25

తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాః సునిష్ఠితాః,
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యన్త వానరాః.

26

గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః,
ఏవం జగర్జ బలవాన్ హనుమాన్మారుతాత్మజః.

27

తమభ్రఘనసంకాశమాపతన్తం మహాకపిమ్,
దృష్ట్వా తే వానరాః సర్వే తస్థుః ప్రాఞ్జలయస్తదా.

28

తతస్తు వేగవాంస్తస్య గిరేర్గిరినిభః కపిః,
నిపపాత మహేన్ద్రస్య శిఖరే పాదపాకులే.

29

ఆ వానరులు హనుమంతుణ్ణి చూడాలనే తహతహతో ఒక చెట్టు చివరినుంచీ మరో చెట్టు చివరికీ, ఒక శిఖరంనుంచీ మరో శిఖరం మీదికి పట్టలేని ఆనందంతో దూకసాగారు.

25

ఉత్సాహభరితులైన ఆ వానరులు వృక్షాగ్రాల మీద నిలబడి లేత ఆకులూ, పువ్వులూ గల కొమ్మలను విరిచి, జనులు విలువైన వస్త్రాలను ఊపి తమ సంతోషాన్ని వ్యక్తంచేసే తీరులో విరిచిన కొమ్మలను హనుమంతుని ఆహ్వానిస్తున్నట్లుగా సంతోషంగా ఊపసాగారు.

26

పర్వత గుహల్లో ప్రవేశించిన వాయువు గర్జించిన రీతిలో మహాబలవంతుడూ, వాయుపుత్రుడూ అయిన ఆ హనుమంతుడు తన గర్జనలతో ఆకాశాన్ని నింపివేశాడు.

27

ఇంతలో ఆకాశం నుండి భూమ్మీద దిగుతున్న మేఘసమానుడైన ఆ హనుమంతుని చూసి వానరులందరూ కేలుమోడ్చి నిలబడ్డారు.

28

అలా వానరులందరూ చూస్తుండగా పర్వతం వంటి మహోన్నత రూపంలో ఉన్న ఆ హనుమంతుడు మహావేగంగా వచ్చి వృక్షాలతో ఆవృతమై ఉన్న ఆ మహేంద్రపర్వత శిఖరం మీద దిగాడు.

29

హర్షేణాపూర్యమాణోఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే,
ఛిన్నపక్ష ఇవాకాశాత్పపాత ధరణీధరః.

30

తతస్తే ప్రీతమనసః సర్వే వానరపుఙ్గవాః,
హనుమన్తం మహాత్మానాం పరివార్యోపతస్థిరే.

31

పరివార్య చ తే సర్వే పరాం ప్రీతిముపాగతాః,
ప్రహృష్టవదనాః సర్వే తమరోగముపాగతమ్.

32

ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ,
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్.

33

హనుమాంస్తు గురూన్ వృద్ధాన్ జామ్బవత్ప్రముఖాంస్తదా,
కుమారమఙ్గదం చైవ సోఽవన్దత మహాకపిః.

34

సహచరులను కలుసుకొంటున్న సంతోషంతో ఉప్పొంగిపోతున్న ఆ హనుమంతుడు రెక్కలు తెగిన పర్వతం పడ్డట్లు ఆకాశం నుండి మహేంద్ర పర్వతం మీదిగల ఒక రమ్యమైన సెలయేటి జలాల్లో దిగాడు.

30

హనుమంతుని రాకతో పరమానందభరితులైన వానరోత్తములందరూ మహాత్ముడైన ఆతడి చుట్టూ చేరారు.

31

ఆ విధంగా హనుమంతుని చుట్టూ గుమిగూడిన ఆ వానరులు మేరమీరిన ఆనందంలో మునిగిపోయారు. క్షేమంగా తిరిగి వచ్చిన ఆతణ్ణి దగ్గర నుండి చూసిన వారి ముఖాలు వికసించాయి.

32

వెంటనే వానరులలో కొందరు ఒక్కపరుగున వెళ్ళి మధురమైన పండ్లు, రుచికరమైన కందమూలాలు తీసుకువచ్చి వానరశ్రేష్ఠుడైన హనుమంతునికి సమర్పించారు.

33

కపివరేణ్యుడైన హనుమంతుడు అప్పుడు వందనీయులైన జాంబవంతాది వృద్ధులకూ, యువరాజైన అంగదునికి ప్రణామం చేశాడు.

34

స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః,
దృష్ట్వా సీతేతి విక్రాన్తః సంక్షేపేణ న్యవేదయత్.

35

నిషసాద చ హస్తేన గృహీత్వా వాలినః సుతమ్,
రమణీయే వనోద్దేశే మహేన్ద్రస్య గిరేస్తదా.

36

హనుమానబ్రవీద్ధృష్టస్తదా తాన్ వానరర్షభాన్.

37

అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా,
రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభిరనిన్దితా.

38

ఏకవేణీధరా బాలా రామదర్శనలాలసా,
ఉపవాసపరిశ్రాన్తా జటిలా మలినా కృశా.

39

పరాక్రమవంతుడూ, అత్యంత సమర్థుడూ అయిన ఆ హనుమంతుని అంగద జాంబవంతులు సముచిత రీతిలో గౌరవించారు. ఇతర సహచరులు ఆప్యాయంగా స్వాగతం పలికారు. వానరులందరూ ఏ వార్తను వినాలని తహతహలాడుతున్నారో ఆ వార్తను హనుమంతుడు 'సీతాదేవిని చూశాను' అంటూ క్లుప్తంగా చెప్పాడు.

35

అలా పలికి ఆ హనుమంతుడు, వాలి కుమారుడైన అంగదుని చేయి పుచ్చుకొని మహేంద్ర పర్వతం మీదనున్న ఒక రమణీయమైన వనప్రాంతంలో కూర్చున్నాడు.

36

తన చుట్టూ చేరిన వానర వీరులతో హనుమంతుడు అప్పుడు ఇలా చెప్పాడు: అశోకవనంలో ఉన్న సీతాదేవిని నేను చూశాను. ఆమె లంకలో ఎటువంటి దోషం అంటకుండా ఉంది. ఒంటి జడతో ఉన్న ఆమెకు భయంకరులైన రాక్షసస్త్రీలు కాపలాగా ఉన్నారు. స్నానాది సంస్కారాలు కరువై ఆమె దేహం దుమ్ముకొట్టుకుపోయి ఉంది. ఉపవాసాలచే ఆమె కృశించి ఉంది. రామ దర్శనానికి ఆమె పరితపిస్తోంది.

తతో దృష్టేతి వచనం మహార్థమమృతోపమమ్,
నిశమ్య మారుతేః సర్వే ముదితా వానరాభవన్.

40

క్ష్వేళన్త్యన్యే నదన్త్యన్యే గర్జన్త్యన్యే మహాబలాః,
చక్రుః కిలకిలామన్యే ప్రతిగర్జన్తి చాపరే.

41

కీచిదుచ్ఛ్రితలాఙ్గూలాః ప్రహృష్టాః కపికుఞ్జరాః,
అంచితాయతదీర్ఘాణి లాఙ్గూలాని ప్రవివ్యధుః.

42

అపరే చ హనూమన్తం వానరా వారణోపమమ్,
ఆప్లుత్య గిరిశృఙ్గేభ్యః సంస్పృశన్తి స్మ హర్షితాః.

43

ఉక్తవాక్యం హనుమన్తమబ్రదస్తమథాబ్రవీత్,
సర్వేషాం హరివిరాణాం మధ్యే వచనముత్తమమ్.

44

అర్థవంతమైన, మధురామృతమైన ఆ హనుమంతుని 'చూశాను' అనే మాట వినగానే వానరులందరూ సంతోషంతో ఉప్పొంగిపోయారు.

40

అప్పుడు మహాబలసంపన్నులైన వానరులలో కొందరు సింహనాదం చేశారు. మరికొందరు కేకలుపెట్టారు. ఇంకా కొందరు గర్జించారు. కొందరు తమ జాతి స్వభావమైన కిచకిచ ధ్వనులు చేశారు. మరికొంతమంది ప్రతిగర్జనలు చేశారు.

41

వానరులలో కొందరు పట్టలేని సంతోషంతో సొగసైన, పొడవైన తమ తోకలను నిటారుగా పైకెత్తి విలాసంగా నేలకేసి కొట్టారు.

42

ఆ వానరులలో కొందరు ఆనందోత్సాహాలతో పర్వతశిఖరాల మీదకు ఎక్కి అక్కణ్ణుంచి అమాంతం కిందికి దూకి భద్రగజంలా విరాజిల్లుతున్న ఆ హనుమంతుని కౌగిలించుకొన్నారు.

43

సీతాదేవి కనిపించింది అనే శుభవార్తను తెచ్చిన హనుమంతుని ఉద్దేశించి వానరవీరుల మధ్యన ఆసీనుడైన అంగదుడు, ఆదరాభిమానాలు ఉట్టిపడే రీతిలో శ్లాఘిస్తూ ఇలా పలికాడు.

44

సత్త్వే వీర్యే న తే కశ్చిత్సమో వానర విద్యతే,
యదవప్లుత్య విస్తీర్ణం సాగరం పునరాగతః.

45

అహో స్వామిని తే భక్తిరహో వీర్యమహో ధృతిః.

46

దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ,
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్థ్సః శోకం సీతావియోగజమ్.

47

తతోఽబ్రదం హనూమన్తం జామ్బవన్తం చ వానరాః,
పరివార్య ప్రముదితా భేజిరే విపులాః శిలాః.

48

శ్రోతుకామాః సముద్రస్య లఙ్ఘనం వానరోత్తమాః.

49

దర్శనం చాపి లఙ్కాయాః సీతాయా రావణస్య చ,
తస్థుః ప్రాఞ్జలయః సర్వే హనుమద్వదచనోన్ముఖాః.

50

ఓ హనుమా! అతి విస్తీర్ణమైన సముద్రాన్ని లంఘించి కార్యసాధనలో కృతకృత్యుడవై తిరిగి వచ్చావు. సాహస పరాక్రమాల్లో నీకు సమానులు ఎవరూ లేరు.

45

ఆహా! ఏమి నీ స్వామి భక్తి! నీ సాహస పరాక్రమాలు ఆశ్చర్యకరాలు! మన అదృష్టవశాన కీర్తిమంతురాలూ, రాముని పత్నీ అయిన సీతాదేవిని చూశావు. ఇక సీతా వియోగం వలన రామునికి కలిగిన దుఃఖం తొలగిపోతుంది. ఇది మనందరి అదృష్టం.

46–47

అప్పుడు సంతోషంలో ఓలలాడుతున్న వానరులందరూ అంగదుని, హనుమంతుని, జాంబవంతుని చుట్టూ చేరి పెద్ద పెద్ద శిలల మీద కూర్చున్నారు.

48

ఆ వానరోత్తములందరూ హనుమంతుడు సముద్రాన్ని లంఘించిన తీరును, లంకను, లంకలో సీతాదేవిని చూసిన, రావణుని ముఖాముఖీ కలుసుకున్న వైనాన్ని వినగోరే కుతూహలంతో హనుమంతుని వచనాలకు ఎదురుచూస్తూ చేతులు జోడించి మౌనంగా ఉండిపోయారు.

49–50

తస్థౌ తత్రాఙ్గదః శ్రీమాన్ వానరైర్బహుభిర్వృతః,

ఉపాస్యమానో విబుధైర్దివి దేవపతిర్యథా.

51

హనూమతా కీర్తిమతా యశస్వినా
తథాఙ్గదేనాఙ్గదబద్ధబాహునా,
ముదా తదాధ్యాసితమున్నతం మహ
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాభవత్.

52

వానరులచే పరివేష్టితుడై వారి సేవలు అందుకుంటున్న శ్రీమంతుడైన ఆ అంగదుడు ఆ సమయంలో స్వర్గంలో దేవతల సేవలందుకుంటున్న సాక్షాత్తు దేవేంద్రునిలా విరాజిల్లుతున్నాడు.

51

మహత్కార్య సాధనతో ఇనుమడించిన కీర్తిమంతుడైన హనుమంతుడు, భుజకీర్తులు దాల్చి శోభిస్తున్న అంగదుడు ఆనందంతో ఆసీనులై ఉన్న కారణాన ఆ మహాపర్వత శిఖరాగ్రం శోభాయమానంగా భాసిస్తూ అలరారుతోంది.

52

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 57వ సర్గ

సమాప్తం

58

వ సర్గ

హనుమంతుడు లంకా అనుభవాలను వానరులకు వివరించడం

తతస్తస్య గిరేః శృఙ్గే మహేన్ద్రస్య మహాబలాః,
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్మురుత్తమామ్.

1

ప్రీతిమత్సూపవిష్టేషు వానరేషు మహాత్మసు,
తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమన్తం మహాకపిమ్,
జామ్బవాన్ కార్యవృత్తాన్తమపృచ్ఛదనిలాత్మజమ్.

2

కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే,
తస్యాం వా స కథంవృత్తః క్రూరకర్మా దశాననః.

3

మహాబలసంపన్నులైన హనుమంతుడు, తదితర వానరశ్రేష్ఠులు ఆ విధంగా మహేంద్రశిఖరాగ్రాన ఆసీనులై అనిర్వచనీయ ఆనందంలో ఓలలాడారు.

1

అమిత సంతోషం కారణంగా మహాత్ములైన వానరశ్రేష్ఠుల శరీరాలు పులకరింతకు లోనవగా, జాంబవంతుడు, మానసికంగా సంతృప్తి పొంది ఉన్న హనుమంతుని ఆతడి లంకా అనుభవాలను గూర్చి ఇలా ప్రశ్నించాడు.

2

నువ్వు సీతాదేవిని ఎలా కనుగొన్నావు? ఆమె ఏ స్థితిలో ఉంది? క్రూరాత్ముడైన రావణుడు ఆమె పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడు?

3

తత్త్వతః సర్వమేతన్నః ప్రబ్రూహి త్వం మహాకపే,
శ్రుతార్థాశ్చిన్తయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్.

4

యశ్చార్థస్తత్ర వక్తవ్యో గత్వైరస్మాభిరాత్మవాన్,
రక్షితవ్యం చ యత్తత్ర తద్భవాన్ వ్యాకరోతు నః.

5

స నియుక్తస్తతస్తేన సంప్రహృష్టతనూరుహః,

ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత.

6

ప్రత్యక్షమేవ భవతాం మహేన్ద్రాగ్రాత్ ఖమాప్లుతః,
ఉదధేర్దక్షిణం పారం కాంక్షమాణః సమాహితః.

7

గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూపమివాభవత్,
కాఞ్చనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్.

8

ఓ కపివరేణ్యా! అక్కడ జరిగినవి జరిగినట్లు, ఉన్నవి ఉన్నట్లు మాకు చెప్పు. అక్కడి వ్యవహారాల గూర్చి తెలుసుకున్నాక మన తదుపరి కర్తవ్యం గురించి నిర్ణయిద్దాం.

4

అంతేకాదు, మనం రాముని సన్నిధిలో ఏ విషయాలు చెప్పవచ్చో, ఏవి చెప్పకూడదో కూడా వివేకవంతుడవైన నువ్వే నిర్ణయించి మాకు స్పష్టంగా చెప్పు.

5

ఇలా జాంబవంతుడు ప్రశ్నించగా, పులకితాంతరంగుడైన ఆ హనుమంతుడు సీతాదేవిని తలచుకొని, ఆమెకు శిరసా నమస్కరించి ఇలా చెప్పసాగాడు.

6

సముద్రపు దక్షిణ తీరం చేరగోరి ఏకాగ్రచిత్తుడనై నేను మహేంద్రపర్వతం మీదనుండి ఆకాశంలోకి పైకి ఎగరడం మీరందరూ చూశారు గదా!

7

అలా ఆకాశంలో నిరాటంకంగా పయనిస్తూండగా నాకొక భయంకరమైన విఘ్నం ఎదురయింది. దివ్యమూ, మనోహరమూ అయిన ఒక బంగారమయ పర్వత శిఖరం సముద్ర జలాలనుంచి హఠాత్తుగా పైకి లేచి నా మార్గానికి అడ్డంగా నిలిచింది.

8

స్థితం పన్థానమావృత్య మేనే విఘ్నం చ తం నగమ్.

9

ఉపసంగమ్య తం దివ్యం కాఞ్చనం నగసత్తమమ్,
కృతా మే మనసా బుద్ధిర్భేత్తవ్యోఽయం మయేతి చ.

10

ప్రహతం చ మయా తస్య లాఙ్గూలేన మహాగిరేః,
శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రధా.

11

వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః,
పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ.

12

పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః,
మైనాకమితి విఖ్యాతం నివసన్తం మహోదధౌ.

13

పక్షవన్తః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః,
ఛన్దతః పృథివీం చేరుర్బాధమానాః సమన్తతః.

14

నా మార్గానికి అవరోధంగా నిలబడ్డ ఆ పర్వతాన్ని ఒక పెద్ద విఘ్నంగా భావించాను. ఆ దివ్యమయ సువర్ణగిరిని సమీపించగానే దాన్ని తుత్తునియలు చేసి ముందుకు వెళ్ళాలనుకున్నాను.

9–10

అంతే, సూర్యుడి మల్లే ప్రకాశిస్తున్న ఆ మహాపర్వత శిఖరాన్ని నా తోకతో కొట్టాను. ఆ శిఖరం వెయ్యి ముక్కలుగా బద్దలైపోయింది.

11

కాని ఏం అద్భుతం! ఆ పర్వతరాజం నే చేగొన్న కార్యోద్దేశ ప్రాధాన్యాన్ని అవగతం చేసుకొన్నట్లు అమిత వాత్సల్యపూర్వకంగా నన్ను 'కుమారా!' అంటూ సంబోధించింది. ఆ ప్రేమాస్పదమైన పలుకు నా హృదయాన్ని ద్రవింపజేసింది.

12

ఆ పర్వతం ఇలా పలికింది: నేను ఈ సముద్రజలాల్లో నివసిస్తున్నాను. నా పేరు మైనాకుడు. నేను నీ తండ్రి వాయుదేవుని మిత్రుడవడంచే నీకు పినతండ్రి వంటి వాణ్ణి. కుమారా! పూర్వం మహాపర్వతాలకు రెక్కలు ఉండేవి. అవి ఆకాశంలో స్వేచ్ఛగా సంచరిస్తూ అనుకున్న చోట భూమ్మీద వాలి భారీగా ప్రాణనష్టం కలిగిస్తూండేవి.

13–14

శ్రుత్వా నగానాం చరితం మహేన్ద్రః పాకశాసనః,
చిచ్ఛేద భగవాన్ పక్షాన్ వజ్రేణైషాం సహస్రశః.

15

అహం తు మోక్షితస్తస్మాత్తవ పిత్రా మహాత్మనా,
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే.

16

రామస్య చ మయా సాహ్యే వర్తితవ్యమరిందమ,
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేన్ద్రసమవిక్రమః.

17

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మైనాకస్య మహాత్మనః,
కార్యమావేద్య తు గిరేరుద్యతం చ మనో మమ.

18

తేన చాహమనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా,
స చాప్యస్పర్శితః శైలో మానుషేణ వపుష్మతా,
శరీరేణ మహాశైలః శైలేన చ మహోదధౌ.

19

పాకాసురుని సంహరించిన దేవేంద్రుడు ఆ పర్వతాల దుష్ట ప్రవర్తనను తెలుసుకొని తన వజ్రాయుధంతో వాటి రెక్కలను ముక్కలు ముక్కలుగా ఖండించి వేశాడు.

15

నాయనా! సరైన సమయంలో మహాత్ముడైన నీ తండ్రి వాయుదేవుడు చేసిన సహాయం వలన ఒక్క నేను మాత్రమే దేవేంద్రుని ఆగ్రహానికి బలికాలేదు. నీ తండ్రి ప్రచండ వాయువులను సృజించి అమాంతం ఈ సముద్రజలాలలో మునిగిపోయేటట్లు ఎగురగొట్టి నన్ను రక్షించాడు.

16

శత్రువులను రూపుమాపే ఓ హనుమా! ధర్మాన్ని రక్షించే వారిలో శ్రేష్ఠుడు, దేవేంద్రునితో సమానమైన పరాక్రమం గలవాడు రాముడు. అటువంటి రామునికి సహాయపడడం నా విధిగా భావిస్తున్నాను.

17

మహాత్ముడైన ఆ మైనాకుని పలుకులు విని, నేను తక్షణమే నిర్వర్తించవలసిన రామకార్యం గూర్చి తెలిపి, అక్కడ కాసేపుకూడా విశ్రమించే అవకాశం లేదని విన్నవించి, ఆతడి అనుజ్ఞ పొంది ముందుకు సాగిపోవడానికి ఉద్యుక్తుడనయ్యాను. అప్పటి దాకా మానవరూపం దాల్చి ఉన్న ఆ మైనాకుడు, తన ఆ మానవరూపం ఉపసంహరించుకొని మళ్ళీ యథాప్రకారం పర్వతరూపంలో సముద్రజలాల్లోకి వెళ్ళి కనుమరుగయ్యాడు.

18–19

ఉత్తమం జవమాస్థాయ శేషం పన్థానమాస్థితః,
తతోఽహం సుచిరం కాలం వేగేనాభ్యాగమం పథి.

20

తతః పశ్యామ్యహం దేవీం సురసాం నాగమాతరమ్,
సముద్రమధ్యే సా దేవీ వచసం మామభాషత.

21

మమ భక్షః ప్రదిష్టస్త్వమమరైర్హరిసత్తమ,
అతస్త్వాం భక్షయిష్యామి విహితస్త్వం చిరస్య మే.

22

ఏవముక్తం సురసయా ప్రాఞ్జలిః ప్రణతః స్థితః,
వివర్ణవదనో భూత్వా వాక్యం చేదముదీరయమ్.

23

రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దణ్డకావనమ్,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరంతపః.

24

అప్పుడు ఇక ఎంత దూరం పయనించవలసి ఉంటుందోనని యోచించి, తదనుగుణంగా వేగాన్ని పెంచి చాలాసేపు ముందుకు సాగుతూపోయాను.

20

ఆ తరువాత నాకు సురస అనే నాగమాత సముద్రమధ్యంలో తారసపడింది. ఆ దేవి నాతో ఇలా పలికింది: ఓ

వానరోత్తమా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా కేటాయించారు. చాలాకాలానికి నీవంటి వాడు లభించాడు. ఇప్పుడు నిన్ను తినబోతున్నాను.

21–22

నాగమాత సురస మాటలు వినగానే నా ముఖం వెలవెలబోయింది. చప్పున తేరుకొని, చేతులు జోడించి ఆమెకు నమస్కరించి ఇలా అన్నాను.

23

దశరథ కుమారుడు, శ్రీమంతుడు, శత్రువినాశకుడు అయిన రాముడు, తమ్ముడు లక్ష్మణుడితో, భార్య సీతతో వనవాసం నిమిత్తం దండకారణ్యంలో ఉంటున్నాడు.

24

తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా,
తస్యాఃసకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్.

25

కర్తుమర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ.

26

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్,
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే.

27

ఏసముక్తా మయా సా తు సురసా కామరూపిణీ,
అబ్రవీన్నాతివర్తేత కశ్చిదేష వరో మమ.

28

ఏవముక్తఃసురసయా దశయోజనమాయతః,
తతోర్ధగుణవిస్తారో బభూవాహం క్షణేన తు.

29

ఇలా ఉండగా ఒక రోజు దురాత్ముడైన రావణుడు, సీతాదేవిని అపహరించుకొని పోయాడు. నేను రాముని ఆజ్ఞానుసారం సీతాదేవి వద్దకు ఇప్పుడు దూతగా వెళుతున్నాను.

25

రాముని రాజ్యంలో నివసిస్తున్న నీకు, ఈ రామకార్యంలో నాకు సహాయం ఒనగూర్చడం ఎంతో యుక్తమై ఉంటుంది. కాదు కూడదంటే నేను సీతాదేవిని చూసి, ఆమె గురించిన సమాచారం రాముడికి తెలియజేసి ఆ తరువాత ఇక్కడకు వచ్చి నీకు ఆహారం అవుతాను. ఆడిన మాట తప్పను, ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను.

26–27

నా విన్నపాన్ని విని, ఇచ్ఛానుసారం రూపాలు ధరించగల ఆ సురస, 'నన్నెవరూ నా అనుమతి లేకుండా దాటి పోలేరు. ఇది నాకున్న వరం' అని ప్రత్యుత్తరమిచ్చింది.

28

ఆమె జవాబుకు స్పందనగా, నేను క్షణంలో నా శరీర పరిమాణాన్ని పది యోజనాల పొడవుకు, నా చుట్టుకొలతను ఐదు యోజనాల మేరకు పెంచాను.

29

మత్ప్రమాణానురూపం చ వ్యాదితం చ ముఖం తయా,
తద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః.

30

తస్మిన్ ముహూర్తే చ పునర్బభూవాఙ్గుష్ఠ మాత్రకః,
అభిపత్యాశు తద్వక్త్రం నిర్గతోఽహం తతః క్షణాత్.

31

అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః,
అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్.

32

సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా,
సుఖా భవ మహాబాహో ప్రీతాస్మి తవ వానర.

33

తతోఽహం సాధు సాధ్వీతి సర్వభూతైః ప్రశంసితః,
తతోఽన్తరిక్షం విపులం ప్లుతోఽహం గరుడో యథా.

34

నా చర్యకు ప్రతిస్పందనగా ఆ సురస, పెంచిన నా శరీరం ఇమిడిపోయేటంత వెడల్పుకు తన నోటిని తెరిచింది. ఆమె అలా నోటిని విస్తారం చేయడం చూసి నేను నా శరీర పరిమాణాన్ని మళ్ళీ చిన్నదిగా తగ్గించి వేశాను.

30

క్షణకాలంలో నేను బొటనవ్రేలంత పరిమాణం గలవాడిని అయ్యాను. తక్షణమే ఆమె నోట్లో ప్రవేశించి మరుక్షణమే నోట్లోనుంచి బయటకు వచ్చేశాను.

31

అప్పుడు ఆ సురస తన దివ్యమైన తన నిజరూపం దాల్చి నాతో ఇలా అంది: సౌమ్యుడవైన ఓ కపివరేణ్యా! నీ కార్యం సిద్ధిస్తుంది, సుఖంగా వెళ్ళిరా. మహాత్ముడైన రామునితో సీతాదేవిని చేర్చు. మహాబాహువైన ఓ వానరోత్తమా! నీ పట్ల నేను అమిత సంతుష్టురాలనయ్యాను. సుఖంగా ఉండు.

32–33

ఇదంతా చూసి సమస్త ప్రాణులూ 'బాగు, బాగు' అంటూ నన్ను ప్రశంసిస్తూండగా నేను గరుత్మంతుని వేగంతో ఆకాశంలో సునాయాసంగా ముందుకు పయనించాను.

34

ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన.

35

సోఽహం విహతవేగస్తు దిశో దశ విలోకయన్, న కించిత్తత్ర పశ్యామి యేన మేఽపహృతా గతిః.

36

తతో మే బుద్ధిరుత్పన్నా కిం నామ గమనే మమ,
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే.

37

అధోభాగేన మే దృష్టిః శోచతా పాతితా మయా,
తతోఽద్రాక్షమహం భీమాం రాక్షసీం సలిలేశయామ్.

38

ప్రహస్య చ మహానాదముక్తోఽహం భీమయా తయా,
అవస్థితమసంభ్రాన్తమిదం వాక్యమశోభనమ్.

39

అలా గగనవీథిలో మహావేగంతో పోతున్న నా నీడను ఎవరో హఠాత్తుగా అడ్డుకొని, లాగుతున్నట్లనిపించింది. అన్ని వైపులా పరికించి చూసినప్పటికీ నా గమనాన్ని తగ్గించిన వారెవరూ కనిపించలేదు. కాని నా వేగం బాగా తగ్గిపోయింది.

35–36

'ఆకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ నాకెవరూ కనిపించడం లేదే! కాని గమనానికి గట్టి ఆటంకం ఏర్పడిందని కచ్చితంగా తెలుస్తోంది. ఇందుకు కారణం ఏమై ఉంటుందబ్బా!' అనే ఆలోచన నాకు కలిగింది.

37

ఇలా ఆలోచిస్తున్న నేను యథాలాపంగా కిందికి చూశాను. అప్పుడు సముద్ర జలాల మీద తేలుతూ ఒక భయంకర రాక్షసి కనిపించింది.

38

భయంకరాకారం గల ఆ రాక్షసి వికటాట్టహాసం చేస్తూ, ఎటువంటి తొట్రుపాటు కనిపించని స్వరంలో కఠోరంగా నాతో ఇలా పలికింది.

39

క్వాసి గన్తా మహాకాయ క్షుధితాయా మమేప్సితః,
భక్షః ప్రీణయ మే దేహం చిరమాహారవర్జితమ్.

40

బాఢమిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణామహం తతః,
అస్యప్రమాణాదధికం తస్యాః కాయమపూరయమ్.

41

తస్యాశ్చాస్యం మహద్భీమం వర్ధతే మమ భక్షణే,
న చ మాం సాధు బుబుధే మమ వా వికృతం కృతమ్.

42

తతోఽహం విపులం రూపం సంక్షిప్య నిమిషాన్తరాత్,
తస్యా హృదయమాదాయ ప్రపతామి నభఃస్థలమ్.

43

సా విసృష్టభుజా భీమా పపాత లవణాంభసి,
మయా పర్వతసంకాశా నికృత్తహృదయా సతీ.

44

ఓ బలిసిన శరీరంగలవాడా! ఎక్కడకు పోతావు? చాలాకాలంగా ఆహారం లేకుండా ఆకలితో నా శరీరం

అలమటిస్తోంది. కనుక వచ్చి ఆహారంగా అయి నాకు సంతృప్తి కలిగించు.

40

అందుకు నేను 'అలాగే' అంటూ నా దేహ పరిమాణాన్ని ఆమె నోట్లో పట్టనంతగా పెంచాను.

41

నన్ను అమాంతం భక్షించే ఉద్దేశంతో ఆ భయంకర రాక్షసి కూడా తన నోటిని విపరీత పరిమాణాల్లో విస్తరించసాగింది. ఆమెకు నా గురించిగాని, నా పన్నుగడ గూర్చిగాని ఏమీ తెలియదు.

42

అప్పుడు నేను క్షణంలో నా మహాకాయాన్ని బాగా చిన్నదిగా కుదించివేసి, ఆమె నోట్లో రక్కున ప్రవేశించి కళ్ళుమూసి తెరిచేటంతలో ఆమె గుండెను పెకలించి వేసి మళ్ళీ ఆకాశంలోకి ఎగిరాను.

43

అలా హృదయం ఛేదించబడడంతో పర్వత పరిమాణంలో ఉన్న భయంకరురాలైన ఆ రాక్షసి చేతులు వ్రేలాడవేసుకొని ఆ లవణసముద్ర జలాల్లో విగతజీవురాలై పడి మునిగిపోయింది.

44

శృణోమి ఖగతానాం చ సిద్ధానాం చారణైః సహ,
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా.

45

తాం హత్వా పునరేవాహం కృత్యమాత్యయికం స్మరన్,
గత్వా చాహం మహాధ్వానం పశ్యామి నగమణ్డితమ్,
దక్షిణం తీరముదధేర్లఙ్కా యత్ర చ సా పురీ.

46

అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్,
ప్రవిష్టోఽహమవిజ్ఞాతో రక్షోభిర్భీమవిక్రమైః.

47

తత్ర ప్రవిశతశ్చాపి కల్పాస్తఘనసన్నిభా,
అట్టహాసం విముఞ్చన్తీ నారీ కాప్యుత్థితా పురః.

48

అప్పుడు ఆకాశంలో సంచరించే సిద్ధులు, చారణులు, 'హనుమంతుడు, భయంకరమైన సింహిక అనే ఈ రాక్షసిని సునాయాసంగా హతమార్చి గొప్పపని చేశాడు' అని చెప్పుకోవడం నాకు వినవచ్చింది.

45

ఆ సింహికను అంతం చేసిన తరువాత ప్రాణాపాయకరమైన ఆ రాక్షసి ఉదంత వైనాన్నే పదేపదే తలచుకొంటూ ఆకాశమార్గంలో చాలాదూరం పయనించాను. అలా చాలాసేపు గగనంలో ప్రయాణం చేశాక చివరికి వృక్షాలతో రమ్యంగా అలరారుతున్న సముద్ర దక్షిణ తీరమూ, ఆ తీరంలో కొలువై ఉన్న లంకానగరమూ కనిపించాయి.

46

సూర్యాస్తమయం అయ్యాక అమిత పరాక్రమవంతులైన రాక్షసులకు కంటపడని రూపంలో, నిశాచరులకు ఆవాసమై విరాజిల్లుతున్న ఆ లంకానగరంలోకి అడుగుపెట్టాను.

47

అలా లంకానగరంలో నేను ప్రవేశించబోతుండగా ప్రళయకాల మేఘాన్ని పోలిన ఒక స్త్రీ వికటాట్టహాసం చేస్తూ నా ముందుకొచ్చి నిలబడింది.

48

జిఘాంసన్తీం తతస్తాం తు జ్వలదగ్నిశిరోరుహామ్,
సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవామ్,
ప్రదోషకాలే ప్రవిశం భీతయాఽహం తమోదితః.

49

అహం లఙ్కాపురీ వీర నిర్జితా విక్రమేణ తే,
యస్మాత్తస్మాద్విజేతాసి సర్వరక్షాంస్యశేషతః.

50

తత్రాహం సర్వరాత్రం తు విచిన్వన్ జనకాత్మజామ్,
రావణాన్తఃపురగతో న చాపశ్యం సుమధ్యమామ్.

51

తతః సీతామపశ్యంస్తు రావణస్య నివేశనే,
శోకసాగరమాసాద్య న పారముపలక్షయే.

52

మండుతున్న అగ్నివంటి ఎర్రని కేశాలుగల ఆ భయంకరురాలు నన్ను చంపాలని ప్రయత్నించింది. అందుకు నేను ప్రతిస్పందిస్తూ నా ఎడమచేతి పిడికిలితో ఒక్క గుద్దు గుద్ది ఆమెను పరాజితురాలను చేసి ప్రదోష సమయంలో (రాత్రి ప్రారంభ సమయం) లంకలో ప్రవేశించాను. అప్పుడు ఆ స్త్రీ భయపడుతూ నాతో ఇలా అంది.

49

ఓ మహావీరా! నేను రూపుదాల్చిన లంకాపురాధిదేవతను. ఇంతవరకు అజేయురాలనైన నన్ను నేడు నీ పరాక్రమంతో జయించావు. కాబట్టి లంకలోని రాక్షసులు యావన్మందీ నీ చేతిలో అపజయం పాలుకాక తప్పదు.

50

తదనంతరం రాత్రంతా లంకానగరాన్ని గాలించి ఆపైన రావణాంతఃపురానికి వెళ్ళి అక్కడ కూడా సీతాదేవి కోసం అన్వేషించాను. కాని ఆమె జాడ తెలియరాలేదు.

51

రావణుని అంతఃపురంలో కూడా సీతాదేవి కనిపించకపోవడంతో నేను అంతులేని శోకసాగరంలో మునిగిపోయాను.

52

శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతమ్,
కాఞ్చనేన వికృష్టేన గృహోపవనముత్తమమ్.

53

స ప్రాకారమవప్లుత్య పశ్యామి బహుపాదపమ్.

54

అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్,

తమారుహ్య చ పశ్యామి కాఞ్చనం కదలీవనమ్.

55

అదూరే శింశుపావృక్షాత్పశ్యామి వరవర్ణినీమ్,
శ్యామాం కమలపత్రాక్షీముపవాసకృశాననామ్.

56

తదేకవాసస్సంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్,
శోకసన్తాపదీనాఙ్గీం సీతాం భర్తృహితే స్థితామ్.

57

అలా దుఃఖమగ్నుడనై ఏం చేయాలో పాలుబోక కూర్చున్న నాకు రావణుని అంతఃపురానికి సమీపంలో బంగారు ప్రాకారంతో పరివృతమై ఉన్న ఒక గృహోద్యానం కనిపించింది.

53

ఆ బంగారు ప్రాకారాన్ని దూకి అనేక వృక్షసముదాయాలతో అలరారుతున్న ఆ ఉద్యానంలో నేను ప్రవేశించాను. ఆ అశోకవన మధ్యంలో ఎత్తైన అతిపెద్ద శింశుపావృక్షాన్ని ఒకదాన్ని చూశాను. వెంటనే ఆ వృక్షాన్ని ఠక్కున ఎక్కి బంగారు రంగులో ఉన్న ఒక అరటితోటను చూశాను.

54–55

ఆ శింశుపావృక్షానికి అతిసమీపంలో అత్యంత ఆకర్షణీయమైన మేనిఛాయగల, నడియౌవనంలోని, తామరరేకులవంటి నేత్రాలుగల, ఉపవాసాలచే ముఖం వాడి ఉన్న ఆ సీతాదేవిని చూశాను.

56

రావణుడు అపహరించిన సమయంలో ధరించి ఉన్న వస్త్రాన్నే ఆమె ధరించి ఉంది. తైలసంస్కారంలేని ఆమె శిరోజాలు ధూళిధూసరితాలై ఉన్నాయి. ఆమె మానసిక, శారీరక సంతాపాలచే దీనవదనయై సతతం పతి హితాన్ని గూర్చే యోచిస్తునట్లు కానవచ్చింది.

57

రాక్షసీభిర్విరూపాభిః క్రూరాభిరభిసంవృతామ్,
మాంస శోణితభక్షాభిర్వ్యాఘ్రీభిర్హరిణీమివ.

58

సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా.

59

భూమిశయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే,
రావణాద్వివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథం చిన్మృగశాబాక్షి తూర్ణమాసాదితా మయా.

60

తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీమ్,
తత్రైవ శింశుపావృక్షే పశ్యన్నహమవస్థితః.

61

ఆడలేడిని ఆడపులులు చుట్టుముట్టిన చందాన, ఆమె చుట్టూ భయంకర రూపులు, రక్తమాంసభక్షకులు అయిన క్రూరరాక్షసస్త్రీలు కాపలా ఉన్నారు.

58

దుఃఖంలో క్రుంగిపోయి ఉన్న ఆమెను ఆ రాక్షసస్త్రీలు పదేపదే బెదరిస్తూ భయపెట్టుతున్నారు. తైలసంస్కారంలేని ఆమె శిరోజాలు ఒకే జడగా రూపుదాల్చాయి. ఆమె కటికనేల మీదనే శయనిస్తూ, హేమంతంలోని కళతప్పిన పద్మంలా వివర్ణమై ఉంది. రావణుని పట్ల పరమ ఏహ్యభావంతో ఉన్న ఆమె ఏ క్షణంలోనన్నా ప్రాణత్యాగం చేయడానికి నిశ్చయించుకొన్న దానిలా కనిపిస్తోంది. అట్టి లేడిలాంటి చూపులు గల అటువంటి స్థితిలో ఉన్న సీతాదేవిని చిట్టచివరికి నేను చూడగలిగాను.

59–60

అటువంటి దైన్యమైన స్థితిలో కూడా తన కీర్తికి అణువంతకూడా కళంకం అంటకుండా రాముని ధ్యాసలోనే గడుపుతున్న ఆ సీతాదేవిని నేను శింశుపావృక్షం మీద కూర్చునే చూస్తూండిపోయాను.

61

తతో హలహలాశబ్దం కాఞ్చీనూపురమిశ్రితమ్,
శృణోమ్యధికగమ్భీరం రావణస్య నివేశనే.

62

తతోఽహం పరమోద్విగ్నః స్వం రూపం ప్రత్యసంహరమ్,
అహం తు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః.

63

తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః,
తం దేశం సమనుప్రాప్తా యత్ర సీతాభవత్ స్థితా.

64

తం దృష్ట్వాథ వరారోహా సీతా రక్షోగణేశ్వరమ్,
సంకుచ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ.

65

విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణామితస్తతః,
త్రాణం కించిదపశ్యన్తీం వేపమానాం తపస్వినీమ్.

66

తామువాచ దశగ్రీవః సీతాం పరమదుఃఖితామ్,
అవాక్ఛిరాః ప్రపతితో బహుమన్యస్వ మామితి.

67

యది చేత్త్వం తు దర్పాన్మాం నాభినన్దసి గర్వితే,
ద్యౌ మాసావన్తరం సీతే పాస్యామి రుధిరం తవ.

68

ఇంతలో వడ్డాణాలకున్న మువ్వల కాలి అందెల సవ్వడులతో కలగలసిన గంభీరమైన కోలాహలం రావణుని రాజప్రాసాదం నుండి వినవచ్చింది.

62

దాంతో కలపరపాటుకు లోనై నా రూపాన్ని మరీ చిన్నదిగా చేసుకొని శింశుపావృక్షం మీద ఆకుల చాటున పక్షిలా దాక్కుని కూర్చున్నాను.

63

ఇంతలో మహాబలసంపన్నుడైన రావణుడు తన భార్యలతో కలిసి సీత ఉన్న చోటుకు వచ్చాడు.

64

శ్రేష్ఠమైన కటి ప్రదేశంగల సీతాదేవి, ఆ రావణుని చూడగానే తన ఊరువులు భుజాలు దగ్గరగా ముడుచుకొని బాహువులతో తన స్తనాలను మరుగుపరచుకొంది.

65

తలను వంచుకొని దిగులుతో, భీతితో రక్షించే వారు కరువయ్యారే అనుకొంటూ అటూ ఇటూ చూస్తూ, వణకిపోతూ దయనీయ స్థితిలో ఉన్న ఆ సీతాదేవిని సంబోధిస్తూ దశకంఠుడైన ఆ రావణుడు ఇలా పలికాడు: 'ఓ సీతా! నన్ను అంగీకరించు. ఒకవేళ ఓ గర్విష్ఠురాలా! తలబిరుసుతో నన్ను నిరాకరిస్తే రెండు నెలల గడుపు దాటగానే నీ రక్తం తాగుతాను.'

66–68

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య రావణస్య దురాత్మనః,
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచనముత్తమమ్.

69

రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః,
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ,
అవాచ్యం వదతో జిహ్వా కథం న పతితా తవ.

70

కిం చిద్వీర్యం తవానార్య యో మాం భర్తురసన్నిధౌ,
అపహృత్యాగతః పాప తేనాదృష్టో మహాత్మనా.

71

దురాత్ముడైన ఆ రావణుని మాటలు విని సీతాదేవి కోపోద్రిక్తురాలై పరుషంగా ఇలా ప్రత్యుత్తరమిచ్చింది.

69

ఓ రాక్షసాధమా! ఇక్ష్వాకువంశ ప్రభువైన దశరథ మహారాజుకి కోడలిని, అపరిమిత పరాక్రమవంతుడైన రామునికి భార్యను అయిన నాతో ఈ విధంగా అసరాని మాటలు పలుకుతున్నందుకు నీ నాలుక ఇంకా ఎందుకు తెగి పడడం లేదు?

70

అనార్యుడా, పాపాత్ముడా! మహాత్ముడైన నా భర్త నా సమీపంలో లేనప్పుడు, ఆయన కంట పడే ధైర్యంలేక దొంగలా నన్ను అపహరించిన నీ పరాక్రమం ఏపాటిది?

71

న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే,
యజ్జీయః సత్యవాదీ చ రణశ్లాఘీ చరాఘవః.

72

జానక్యా పరుషం వాక్యమేవముక్తో దశాననః,
జజ్వాల సహసా కోపాచ్చితాస్థ ఇవ పావకః.

73

వివృత్య నయనే క్రూరే ముష్టిముద్యమ్య దక్షిణమ్,
మైథిలీం హస్తుమారబ్ధః స్త్రీభిర్హాహాకృతం తదా.

74

స్త్రీణాం మధ్యాత్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః,
వరా మండోదరీ నామ తయా స ప్రతిషేధితః.

75

ఉక్తశ్చ మధురాం వాణీం తయా స మదనార్దితః,
సీతయా తవ కిం కార్యం మహేన్ద్రసమవిక్రమ.

76

నీకూ రామునికీ పోలిక ఎక్కడ? రామునికి దాసుడవు అవడానికి కూడా నీకు అర్హత లేదు. రాముడు యాగాలు చేసేవాడు, సత్యనిష్ఠ గలవాడు. యుద్ధరంగంలో జయింప శక్యంకానివాడు.

72

సీతాదేవి కటువుగా ఇచ్చిన ప్రత్యుత్తరం విని రావణుడు ఆగ్రహోదగ్రుడై చితిలోని అగ్నిలా భగ్గున మండిపడ్డాడు.

73

అప్పుడు భయంగొల్పే తీరులో కనుగ్రుడ్లను తిప్పుతూ, కుడిచేతి పిడికిలి బిగించి రావణుడు సీతాదేవిని చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు. అది చూసి అక్కడున్న స్త్రీలంతా హాహాకారాలు చేశారు.

74

అప్పుడు దురాత్ముడైన ఆ రావణుని పట్టమహిషి, ఉత్తమురాలు అయిన మండోదరి వడివడిగా ఆ స్త్రీల మధ్యనుండి ముందుకు వచ్చి అతణ్ణి నివారించింది.

75

కామాతురుడైన రావణునితో మధురంగా ఇలా అంది: పరాక్రమంలో దేవేంద్రునికి దీటైన ఓ ప్రభూ! ఈ సీత కోసం ఎందుకు ఇంత ఆరాటం చెందుతావు?

76

దేవగన్ధర్వకన్యాభి ర్యక్షకన్యాభిరేవ చ,
సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి.

77

తతస్తాభిః సమేతాభిర్నారీభిః స మహాబలః,
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః.

78

యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః,
సీతాం నిర్భర్త్సయామా సుర్వాక్యైః క్రూరైః సుదారుణైః.

79

తృణవద్భాషితం తాసాం గణయామాస జానకీ,
గర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకమ్.

80

వృథాగర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః,
రావణాయ శశంసుస్తాః సీతాధ్యవసితం మహత్.

81

నాథా! దేవ గంధర్వయక్ష కన్యలతో యథేచ్ఛగా క్రీడించు. నిన్ను కోరుకొంటున్న వీరు ఇందరుండగా, ఆ సీత కోసం ఎందుకు తపిస్తావు?

77

తరువాత మండోదరితో సహా ఆ స్త్రీలందరూ మహాబలవంతుడైన ఆ రావణుని శాంతింపజేసి, ప్రసన్నుని చేసుకుని తమతో అంతఃపురానికి తోడ్కొనిపోయారు.

78

దశకంఠుడైన రావణుడు అక్కణ్ణుండి వెళ్ళిపోగానే, సీతాదేవికి కాపలాగా ఉన్న వికృతమైన ముఖాలుగల రాక్షసస్త్రీలు కర్ణకఠోరమైన మాటలతో ఆమెను భయపెట్టి బెదిరించారు.

79

సీతాదేవి ఆ రాక్షసాంగనల బెదిరింపు మాటలను గడ్డిపోచతో సమానంగా పరిగణించింది. వారి బెదరింపు గర్జనలు ఆమె మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపలేకపోయాయి.

80

పచ్చిమాంసాన్ని తినే ఆ రాక్షసస్త్రీలు తమ బెదిరింపులు అలా వ్యర్థం కావడంతో ఏం చేయాలో పాలుబోక చివరికి సీతాదేవి దృఢ నిర్ణయాన్ని రావణునికి తెలియజేశారు.

81

తతస్తాః సహితాః సర్వా విహతాశా నిరుద్యమాః,
పరిక్షిప్య సమన్తాత్తాం నిద్రావశముపాగతాః.

82

తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా,
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖీతా.

83

తాసాం మధ్యాత్సముత్థాయ త్రిజటా వాక్యమబ్రవీత్,
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి,
జనకస్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ.

84

స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రక్షసాం చ వినాశాయ భర్తురస్యా జయాయ చ.

85

తదనంతరం సీతాదేవి మనస్సును మార్చగలమనే ఆశ అడుగంటిపోగా ఆ రాక్షసస్త్రీలు నిస్పృహచెంది,

మాట్లాడకుండా ఆమె చుట్టూచేరి పడుకొని, నిద్రపోయారు.

82

ఆ రాక్షసమూక నిద్రలోకి జారుకోగానే, భర్త క్షేమాన్నే కోరుకొనే సీతాదేవి దీనురాలై దుఃఖిస్తూ, జాలి గొలిపే తీరులో కంటికీ మంటికీ ఏకధారగా విలపించింది.

83

ఆ సమయంలో నిద్రిస్తున్న ఆ రాక్షసాంగనల మధ్యనుండి హఠాత్తుగా త్రిజట అనే రాక్షసస్త్రీ లేచి ఇలా పలికింది: మీ ఆకలి తీర్చుకోవడానికి ఒకరి నొకరు చంపుకు తినండి. జనక మహారాజు కుమార్తె, దశరథ మహారాజు కోడలు, మహా పతివ్రత అయిన సీతకు మాత్రం ఏ హానీ వాటిల్లదు.

84

ఇప్పుడు నాకు ఒళ్ళు కంపించే భయంకరమైన ఒక కల వచ్చింది. ఆ కల రాక్షసుల వినాశనాన్ని, ఈ సీత భర్త విజయాన్ని సూచిస్తోంది.

85

అలమస్మాత్పరిత్రాతుం రాఘవాద్రాక్షసీగణమ్,
అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచత్.

86

యస్యా హ్యేవంవిధః స్వప్నో దుఃఖీతాయాః ప్రదృశ్యతే,
సా దుఃఖైర్వివిధైర్ముక్తా సుఖమాప్నోత్యనుత్తమమ్.

87

ప్రణిపాత ప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా.

88

తతః సా ప్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా,
అవోచద్యతి తత్తథ్యం భవేయం శరణం హి వః.

89

తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్,
చిన్తయామాస విక్రాన్తో న చ మే నిర్వృతం మనః.

90

రాముని శస్త్రాస్త్రాల వాతపడకుండా రాక్షసాంగనలను యావన్మందినీ రక్షించగల ఏకైక వ్యక్తి ఈమే. కనుక ఇప్పుడు సీతాదేవిని ప్రార్థించడమే సముచితమని నాకు అనిపిస్తోంది.

86

దుఃఖంలో ఉన్న వ్యక్తి విషయంగా ఎవరికైనా ఇటువంటి కల కనుక వస్తే, ఆ దుఃఖీతుని క్లేశాలు తొలగి గొప్ప సుఖసౌఖ్యాలు ప్రాప్తిస్తాయి అంటారు. జనకనందన అయిన సీతకు నమస్కరించిన మాత్రానే ఆమె ప్రసన్నురా లవుతుంది.

87–88

తన 'భర్తకు విజయం కలుగుతుంది' అన్న త్రిజట స్వప్న సూచనకు సంతోషించి, స్త్రీకి సహజమైన సిగ్గుపొందిన సీత 'ఈమె మాట అక్షరసత్యమైతే మిమ్మల్నిందరినీ తప్పక రక్షిస్తాను' అంది.

89

సీతాదేవికి సంభవించిన ఆ దారుణావస్థను చూసి నేను చలించిపోయి కాసేపు ఇప్పుడు ఏం చెయ్యాలా అని ఆలోచించాను, ఏమీ పాలుబోలేదు; మనస్సు కుదుటపడలేదు.

90

సంభాషణార్థం చ మయా జానక్యాశ్చిన్తితో విధిః,
ఇక్ష్వాకూణాం హి వంశస్తు తతో మమ పురస్కృతః.

91

శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్,
ప్రత్యభాషత మాం దేవీ బాష్పేణ పిహితలోచనా.

92

కస్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుఙ్గవ,
కా చ రామేణ తే ప్రీతిస్తన్మే శంసితుమర్హసి.

93

తస్యాస్తద్వచనం శ్రుత్వా హ్యహమప్యబ్రువం వచః.

94

దేవి రామస్య భర్తుస్తే సహాయో భీమవిక్రమః,
సుగ్రీవో నామ విక్రాన్తో వానరేన్ద్రో మహాబలః.

95

తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమన్త మిహాగతమ్,
భర్త్రాహం ప్రేషితస్తుభ్యం రామేణాక్లిష్టకర్మణా.

96

ఆ సమయంలో సీతాదేవితో మాట్లాడడానికి ఒక చక్కని ఉపాయం నా మనస్సులో తక్కున మెదలింది. తదనుసారం ఇక్ష్వాకువంశాన్ని కీర్తించడం ప్రారంభించాను.

91

లంకానగరంలో ఇక్ష్వాకువంశ కీర్తిగానం ఏమిటా అని ఆశ్చర్యపోతూ, ఆనందపారవశ్యంలో కళ్ళు చెమ్మగిల్లగా నా వంక చూస్తూ ఇలా ప్రశ్నించింది.

92

ఓ వానరోత్తమా! నువ్వెవరివి? నువ్వు లంకలోకి ఎందుకు, ఎలా వచ్చావు? నీకు రాముని పట్ల ఆదరాభిమానాలు ఎలా కలిగాయి? నాకు వివరంగా అన్నీ చెప్పు. ఆమె ప్రశ్నలకు నేను ఇలా ప్రత్యుత్తరమిచ్చాను:

93–94

"దేవీ! నీ భర్తకు సహాయార్థం సుగ్రీవుడనే మిత్రుడు లభించాడు. ఆ సుగ్రీవుడు మహాబలపరాక్రమ సంపన్నుడు, పైగా వానరులందరికీ రాజు.

95

నేను ఆ సుగ్రీవునకు భృత్యుడను, పేరు హనుమంతుడు. అనాయాసంగా మహత్కార్యాలు సాధించే నీ భర్తయైన రాముడు పంపగా ఇక్కడకు వచ్చాను.

96

ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథిః స్వయమ్,
అంగుళీయమభిజ్ఞానమదాత్తుభ్యం యశస్విని.

97

తదిచ్ఛామి త్వయాఽఽజ్ఞప్తం దేవి కిం కరవాణ్యహమ్,
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కిముత్తరమ్.

98

ఏతచ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనందినీ,
ఆహ రావణముత్సాద్య రాఘవో మాం నయత్వితి.

99

ప్రణమ్య శిరసా దేవీ మహామార్యామనిన్దితామ్,
రాఘవస్య మనోహ్లాదమభిజ్ఞానమయాచిషమ్.

100

అథ మామబ్రవీత్సీతా గృహ్యతామయముత్తమః,
మణిర్యేన మహాబాహూ రామస్త్వాం బహుమన్యతే.

101

ఓ కీర్తిశాలినీ! పురుషోత్తముడు, శ్రీమంతుడు, దశరథ మహారాజు తనయుడు అయిన రాముడు ఈ ఉంగరాన్ని నీకు నా పట్ల నమ్మకం కలగడానికి గుర్తుగా ఇచ్చి పంపించాడు.

97

కాబట్టి ఇప్పుడు నేను ఏం చెయ్యాలో ఆదేశించు దేవీ! నిన్ను రామలక్ష్మణుల వద్దకు నీ ఆజ్ఞ అయితే ఇప్పుడే తీసుకువెళ్ళగలను.

98

జనకపుత్రి అయిన సీతాదేవి నా మాటలు విని, పర్యాలోచించి, 'రాముడు స్వయంగా ఇక్కడకు వచ్చి రావణుణ్ణి సంహరించి నన్ను తనతో తీసుకువెళ్ళడం సముచితం' అన్నది.

99

అప్పుడు నేను పూజనీయురాలు, పరమ పావని అయిన సీతాదేవికి శిరస్సు వంచి నమస్కరించి, రాముని మనస్సుకు ఆహ్లాదం కలిగించేదీ, ఆయన వెంటనే గుర్తుపట్టగలిగేదీ అయిన ఏదైనా ఆనవాలును ఇవ్వమని ఆమెను అర్థించాను.

100

నా అభ్యర్థనకు సానుకూలంగా స్పందిస్తూ ఆమె ఇలా అంది: "ఉత్కృష్టమైన ఈ చూడామణిని ఆనవాలుగా తీసుకొని వెళ్ళు. మహాబాహువైన రాముడికి దీనిని చూడగానే నీ పట్ల ఉన్న ఆదరాభిమానాలు ఎన్నోరెట్లు పెంపొందుతాయి."

101

ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవరమద్భుతమ్,
ప్రాయచ్ఛత్పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ.

102

తతస్తస్యై ప్రణమ్యాహం రాజపుత్ర్యై సమాహితః,
ప్రదక్షిణం పరిక్రామమిహాభ్యుద్గతమానసః.

103

ఉక్తోఽహం పునరేవేదం నిశ్చిత్య మనసా తయా,
హనుమన్ మమ వృత్తాన్తం వక్తుమర్హసి రాఘవే.

104

యథా శ్రుత్వైవ నచిరాత్తావుభౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవసహితౌ వీరావుపేయాతాం తథా కురు.

105

యద్యన్యథా భవేదేతద్ధ్రువో మాసౌ జీవితం మమ,
న మాం ద్రక్ష్యతి కాకుత్థ్సో మ్రియే సాహమనాథవత్.

106

ఇలా పలుకుతూ ఆమె అద్భుతమైన ఆ మణిశ్రేష్ఠాన్ని నాకు ఇచ్చింది. పిదప దిగులు ధ్వనిస్తున్న పలుకులతో అక్కడి వృత్తాంతాన్ని యావత్తు రామునికి నివేదించమని నాతో చెప్పింది.

102

తదుపరి నాకు అప్పగించిన కార్యం సాధించగలిగానన్న సంతృప్తితో తిరుగు ప్రయాణానికి సంసిద్ధుడనై, సీతాదేవికి ప్రదక్షిణ పూర్వకంగా ప్రణమిల్లాను.

103

ఇంతలో అన్ని విషయాలు కూలంకషంగా యోచించి ఆమె నాతో మళ్ళీ ఇలా అంది: ఓ హనుమా! ఇక్కడి నా దుస్థితినంతా రామునికి విపులంగా చెప్పు.

104

మహావీరులైన రామలక్ష్మణులు, సుగ్రీవునితో కలసి వెంటనే ఇక్కడకు బయలుదేరే విధంగా ఉత్తేజంతో మాట్లాడు.

105

నేను ఇంకా కేవలం రెండు నెలలు మాత్రమే జీవించి ఉంటాను. ఈ లోపు వారు ఇక్కడకు రాలేకపోతే, రక్షణలేని నేను మరణించడం తథ్యం. కాకుత్థ్స వంశజుడైన రాముడు ఇక ఎన్నటికీ నన్ను చూడలేడు.

106

తద్బ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మామభ్యవర్తత,
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేషమనంతరమ్.

107

తతోఽవర్ధత మే కాయస్తదా పర్వత సన్నిభః,
యుద్ధకాంక్షీ వనం తచ్చ వినాశయితుమారభే.

108

తద్భగ్నం వనషణ్డం తు భ్రాన్తత్రస్తమృగద్విజమ్,
ప్రతిబుద్ధా నిరీక్షన్తే రాక్షస్యో వికృతాననాః.

109

మాం చ దృష్ట్వా వనే తస్మిన్ సమాగమ్య తతస్తతః,
తాః సమభ్యాగతాః క్షిప్రం రావణాయాచచక్షిరే.

110

రాజన్ వనమిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా,
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల.

111

జాలి పుట్టించే ఆ దయనీయమైన పలుకులు వినగానే నాలో కోపం పెల్లుబికింది. వెంటనే తరువాత ఏం చెయ్యాలో తక్కున నిశ్చయించు కున్నాను.

107

అంతే, నా దేహాన్ని పర్వత ప్రమాణానికి పెంచి, యుద్ధకాంక్ష చెలరేగడంతో అశోకవనాన్ని ధ్వంసం చేయనారంభించాను.

108

అలా అశోకవనం విధ్వంసం చేయబడుతూ ఉండడంతో అందలి పక్షులు, మృగాలు బెదరి పారిపోతున్న అలికిడి విని వికృత ముఖాలుగల రాక్షస స్త్రీలు నిద్రనుండి మేల్కొని విస్తుబోతూ అక్కడి అస్తవ్యస్త పరిస్థితిని చూశారు.

109

ఆ వనంలో చెదురుమదురుగా ఉన్న రాక్షసస్త్రీలందరూ ఒక చోట గుమిగూడినవారై నన్ను చూసి, వెంటనే ఒక్క పరుగున వెళ్ళి రావణునికి సమాచారం అందజేశారు.

110

మహాబలసంపన్నుడవైన ఓ రాజా! నీ పరాక్రమం గూర్చి ఏ మాత్రం తెలియని దురాత్ముడైన ఒక వానరుడు ప్రవేశింప అలవిగాని నీ అశోకవనాన్ని ధ్వంసం చేశాడు.

111

దుర్బుద్ధేస్తస్య రాజేన్ద్ర తవ విప్రియకారిణః,
వధమాజ్ఞాపయ క్షిప్రం యథాసౌ విలయం వ్రజేత్.

112

తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రేణ విసృష్టా భ్రశదుర్జయాః,
రాక్షసాః కింకరా నామ రావణస్య మనోఽనుగాః.

113

తేషామశీతిసాహస్రం శూలముద్గరపాణినామ్,
మయా తస్మిన్ వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్.

114

తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః,
నిహతం చ మహత్ సైన్యం రావణాయాచచక్షిరే.

115

ఓ రాజోత్తమా! నీకు అపకారం తలపెట్టిన దుర్బుద్ధియైన ఈ వానరుని హతమార్చాలి. కనుక తక్షణమే ఇతడి వధకు ఆజ్ఞాపించు.

112

ఆ రాక్షస స్త్రీల మాటలకు తక్షణమే స్పందించిన రావణుడు, తన మనస్సు గ్రహించి మెలగే వారూ, యుద్ధంలో

జయింప శక్యంకాని వారూ అయిన 'కింకరులు' అనే రాక్షసులను నా మీదికి పంపించాడు.

113

శూలాలు, ముద్గరాలు చేతపుచ్చుకొని నాతో యుద్ధానికి వచ్చిన ఆ ఎనభై వేలమంది కింకరులను, ఆ వన ముఖద్వారానికి ఉన్న ఇనుపగుదియను ఊడపీకి దానితో మట్టుబెట్టాను.

114

ఆ యుద్ధంలో బ్రతికిబట్టకట్టిన అతికొద్దిమంది కింకరులు, రావణుని వద్దకు పరుగున వెళ్ళి ఆ మహాసైన్యం మట్టిగరిచిందనే దుర్వార్త చెప్పారు.

115

తతో మే బుద్ధిమత్పన్నా చైత్యప్రాసాదమాక్రమమ్,
తత్రస్థాన్ రాక్షసాన్ హత్వా శతం స్తమ్భేన వై పునః,
లలామభూతో లఙ్కాయాః స వై విధ్వంసితో మయా.

116

తతః ప్రహస్తస్య సుతం జమ్బుమాలినమాదిశత్,
రాక్షసైర్బహుభిః సార్ధం ఘోరరూపైర్భయానకైః.

117

తం మహాబలసంపన్నం రాక్షసం రణకోవిదమ్,
పరిఘేణాతిఘోరేణ సూదయామి సహానుగమ్.

118

తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రస్తు మన్తిపుత్రాన్ మహాబలాన్,
పదాతిబలసంపన్నాన్ ప్రేషయామాస రావణః,
పరిఘేణైవ తాన్ సర్వాన్ నయామి యమసాదనమ్.

119

ఇంతలో వనానికి ప్రక్కనే ఉన్న రమ్యమైన చైత్యప్రాసాదాన్ని చూడగానే నాలో ఒక ఆలోచన మెదలింది. తదనుసారం వెంటనే ఆ చైత్యప్రాసాదాన్ని ఆక్రమించి, దాని రక్షకులైన వందమంది రాక్షసులను ఒక స్తంభంతో మోది సంహరించి, లంకానగరానికే అలంకారప్రాయమైన ఆ చైత్యప్రాసాదాన్ని కూల్చి, నేలమట్టం చేశాను.

116

తరువాత ఘోరరూపాలతో భయంకరులైన రాక్షసులతోపాటు ప్రహస్తుని (మంత్రి) కుమారుడైన జంబుమాలిని రావణుడు నాపై యుద్ధానికి పంపించాడు.

117

మహాబలసమన్వితుడూ, రణకోవిదుడూ అయిన ఆ జంబుమాలిని పరివారసైతంగా భయంకరమైన పరిఘుతో మోది కడతేర్చాను.

118

పరివారసైతంగా జంబుమాలి నేలకూలిన వార్త వినగానే, రావణుడు మహాబలశాలురైన మంత్రి కుమారులను పదాతి సైన్యంతో నాపైకి సమరానికి పంపాడు. వారినందరినీ కూడా ఆ పరిఘుతోనే మోది యమపురికి పంపించాను.

119

మన్త్రిపుత్రాన్ హతాఞ్చ్ఛృత్వా సమరే లఘువిక్రమాన్,
పఞ్చ సేనాగ్రగాన్ శూరాన్ ప్రేషయామాస రావణః.

120

తానహం సహసైన్యాన్ వై సర్వానేవాభ్యసూదయమ్,
తతః పునర్దశగ్రీవః పుత్రమక్షం మహాబలమ్,
బహుభీ రాక్షసైః సార్ధం ప్రేషయామాస రావణః.

121

తం తు మన్దోదరీపుత్రం కుమారం రణపణ్డితమ్,
సహసా ఖం సముత్క్రాన్తం పాదయోశ్చ గృహీతవాన్,
చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్.

122

తమక్షమాగతం భగ్నం నిశమ్య స దశాననః,
తత ఇన్ద్రజితం నామ ద్వితీయం రావణః సుతమ్,
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినమ్ యుద్ధదుర్మదమ్.

123

మహాపరాక్రమవంతులైన మంత్రి కుమారులు యుద్ధంలో నేలకూలిన వృత్తాంతం విని, రావణుడు మహాశూరులైన ఐదుగురు అగ్రసేనా నాయకులను ససైన్యంగా నా పైకి పంపించాడు. సేనతోసహా ఆ ఐదుగురు సేనాధిపతులను నామరూపాలు లేకుండా చేశాను. అప్పుడు దశకంఠుడైన రావణుడు, తన కుమారుడూ అమిత బలశాలీ అయిన అక్షకుమారుని అనేకమంది రాక్షసులతో నా మీదికి పంపించాడు.

120–121

మండోదరీ కుమారుడూ, రణశూరుడూ అయిన ఆ అక్షకుమారుడు కరవాలమూ, డాలూ చేగొని ఆకాశంలోకి ఎగిరాడు. అప్పుడు నేను హఠాత్తుగా అతడి పాదాలు ఒడిసి పట్టుకొని నూరుసార్లు గాలిలో గిరగిరా తిప్పి నేలకు వేసి కొట్టాను. అంతే, అతడు ముద్ద అయిపోయి విగతజీవుడయ్యాడు.

122

యుద్ధంలో అక్షకుమారుడు మరణించిన వృత్తాంతం విన్న దశకంఠుడైన రావణుడు కోపోద్రిక్తుడై మహాశక్తిమంతుడూ, సమరోత్సాహీ అయిన తన మరో కుమారుడు ఇంద్రజిత్తును నా మీదకు పంపించాడు.

123

తచ్చాప్యహం బలం సర్వం తం చ రాక్షసపుఙ్గవమ్,
నష్టౌజసం రణే కృత్వా పరం హర్షముపాగమమ్.

124

మహతాపి మహాబాహుః ప్రత్యయేన మహాబలః,
ప్రేషితో రావణేనైవ సహ వీరైర్మదోత్కటైః.

125

సోఽవిషహ్యం హి మాం బుద్ధ్వా స్వం బలం చావమర్దితమ్,
బ్రాహ్మేణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నాచ్ఛాతివేగితః.

126

రజ్జుభిశ్చాబధ్నన్తి తతో మాం తత్ర రాక్షసాఃl
రావణస్య సమీపం చ గృహీత్వా మాముపానయన్l
దృష్ట్వా సంభాషితశ్చాహం రావణేన దురాత్మనాl

127

అప్పుడు జరిగిన యుద్ధంలో రాక్షస సైన్యాన్ని యావత్తు మట్టుబెట్టి, నేను రాక్షసశ్రేష్ఠుడైన ఆ ఇంద్రజిత్తు రణోత్సాహాన్ని నీరుగార్చి, హర్షమొందాను.

124

మహాబాహుమా, మహాబలపరాక్రమవంతుడూ అయిన ఆ ఇంద్రజిత్తును అచంచల విశ్వాసంతో మదోద్ధతులైన వీరులతో సహా నాపైకి రావణుడు పంపించాడు.

125

తన సైన్యం ఒక వంక నశించిపోతుండడాన్ని, మరోవంక నేను అజేయుడనుగా ఉండడాన్ని గ్రహించి ఆ ఇంద్రజిత్తు ఆలస్యం చేయకుండా నన్ను బ్రహ్మాస్త్రంతో బద్ధుణ్ణి చేశాడు.

126

తరువాత రాక్షసులు నన్ను సామాన్యమైన తాళ్ళతో బంధించి రావణుని సమక్షంలోకి ఈడ్చుకొని వెళ్ళారు. నన్ను చూసి దురాత్ముడైన రావణుడు ఇలా ప్రశ్నించాడు.

127

పృష్టశ్చ లఙ్కాగమనం రాక్షసానాం చ తం వధం,
తత్సర్వం చ మయా తత్ర సీతార్థమితి జల్పితమ్.

128

అస్యాఃదర్శనాకాంక్షీ ప్రాప్తస్త్వద్భవనం విభో,
మారుతస్యారసఃపుత్రో వానరో హనుమానహమ్.

129

రామదూతం చ మాం విద్ధి సుగ్రీవసచివం కపిమ్,
సోఽహం దూత్యేన రామస్య త్వత్సకాశమిహాగతఃl

130

సుగ్రీవశ్చ మహాతేజాఃస త్వాం కుశలమబ్రవీత్,
ధర్మార్థకామసహితం హితం పథ్యమువాచ చ.

131

వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే,
రాఘవో రణవిక్రాన్తో మిత్రత్వం సముపాగతఃl

132

లంకకు నేను ఎందుకు వచ్చానో, ఎందుకు అంతమంది రాక్షసులను అకారణంగా వధించానో చెప్పమని అడిగాడు. అదంతా సీతాదేవి నిమిత్తమే చేశానని చెప్పాను.

128

ఓ రాక్షసరాజా! సీతాదేవి దర్శనార్థమే ఇక్కడకు వచ్చాను. నేను వాయుదేవుని పుత్రుణ్ణి, వానరుణ్ణి. నా పేరు

హనుమంతుడు.

129

వానరుడనైన నేను రాముని దూతను, సుగ్రీవుని మంత్రిని. రాముని దూతగా నీ వద్దకు వచ్చాను.

130

మహాతేజశ్శాలీ, వానరరాజూ అయిన సుగ్రీవుడు నీ కుశలం అడిగాడు. ధర్మార్థకామములతో కూడినదీ, నీకు మేలు ఒనగూర్చేదీ అయిన హితవాక్యం సందేశంగా నా ద్వారా పంపించాడు.

131

విస్తారములైన వృక్షాలతో కూడుకున్న ఋశ్యమూక పర్వతం మీద నివసిస్తుండగా మహాపరాక్రమవంతుడైన రామునితో నాకు (సుగ్రీవునికి) మైత్రి ఒనగూరింది.

132

తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా,
తత్ర సాహాయ్యమస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా.

133

మయా చ కథితం తస్మై వాలినశ్చ వధం ప్రతి,
తత్ర సాహాయ్యహేతోర్మే సమయం కర్తుమర్హసి.

134

వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ మహాప్రభుః,
చక్రేఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవః సహ లక్షణః.

135

తేన వాలినముత్పాట్య శరేణైకేన సంయుగే,
వానరాణాం మహారాజః కృతః స ప్లవతాం ప్రభుః.

136

తస్య సాహాయ్యమస్మాభిః కార్యం సర్వాత్మనా త్విహ,
తేన ప్రస్థాపితస్తుభ్యం సమీపమిహ ధర్మతః.

137

'రాక్షసుడొకడు నా భార్యను అపహరించాడు. ఈ విషయంలో నువ్వు శాయశక్తులా నాకు సాయం అందించాలి' అని ఆ రాముడు నన్ను అడిగాడు.

133

అప్పుడు నేను (సుగ్రీవుడు) వాలిని వధించవలసిన అగత్యాన్ని తెలిపి 'ఆ విషయంలో నాకు ప్రతి సహాయం చేస్తానని వాగ్దానం చేయండి' అని కోరినాను.

134

అప్పుడు వాలి వలన రాజ్యాన్ని కోల్పోయిన నాతో (సుగ్రీవునితో) మహాప్రభుమా, లక్ష్మణ సమేతుడూ అయిన రాముడు అగ్నిసాక్షిగా స్నేహం చేశాడు.

135

తరువాత ఆ రాముడు యుద్ధంలో ఒకే ఒక్క బాణంతో వాలిని సంహరించి వానర నాయకుడనైన నన్ను (సుగ్రీవుని)

వానరులకు మహారాజును చేశాడు.

136

కనుక రామునికి అన్ని విధాల సహాయపడడం మా విధి. అందుచేత మైత్రీధర్మాన్ని పాటించి ఈతణ్ణి (హనుమంతుని) నీ వద్దకు పంపాను.

137

క్షిప్రమానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ,
యావన్న హరయో వీరా విధమన్తి బలం తవ.

138

వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా,
దేవతానాం సకాశం చ యే గచ్ఛన్తి నిమన్త్రితాః.

139

ఇతి వానరాజస్త్వామాహేత్యభిహితో మయా,
మామైక్షత తతః క్రుద్ధశ్చక్షుషా ప్రదహన్నివ.

140

తేన వధ్యోఽహమాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా,
మత్ప్రభావమవిజ్ఞాయ రావణేన దురాత్మనా.

141

తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః,
తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్.

142

వానరవీరుల చేతిలో నీ సేనలు రూపుమాపబడక మునుపే నువ్వు సీతాదేవిని శ్రీరామునికి అప్పగించు.

138

లోకంలో వానరవీరుల బలపరాక్రమాల ప్రభావం మున్నెవ్వరూ ఎరుగనిది కాదు. దేవతల ఆహ్వానంపై యుద్ధంలో వారికి సైతం సహాయంగా వానరులు వెళ్ళడం కద్దు.

139

వానరరాజైన సుగ్రీవుడు ఈ సందేశాన్ని నీకు పంపించాడు అని నేను రావణునితో చెప్పాను. వెంటనే అతడు పట్టరాని కోపంతో దహించివేస్తున్నట్లు చురచుర నా వైపు చూశాడు.

140

దురాత్ముడూ, క్రూరకర్మలు ఆచరించేవాడూ అయిన ఆ రావణుడు నా శక్తిసామర్థ్యాలు అంచనా వేయలేక నన్ను వధింప ఆజ్ఞాపించాడు.

141

అప్పుడు స్వయానా రావణుని సోదరుడూ, ధర్మాత్ముడూ అయిన విభీషణుడు నా విషయంగా ఆ రాక్షసరాజును ఇలా ప్రార్థించాడు.

142

నైవం రాక్షసశార్దూల త్యజ్యతామేష నిశ్చయః,

రాజశాస్త్రవ్యపేతో హి మార్గః సంసేవ్యతే త్వయా.

143

దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస,
దూతేన వేదితవ్యం చ యథార్థం హితవాదినా.

144

సుమహత్యపరాధేఽపి దూతస్యాతులవిక్రమ,
విరూపకరణం దృష్టం న వధోఽస్తీతి శాస్త్రతః.

145

విభీషణేనైవముక్తో రావణః సందిదేశ తాన్,
రాక్షసానేతదేవాస్య లాఙ్గూలం దహ్యతామితి.

146

తతస్తస్య వచః శ్రుత్వా మమ పుచ్ఛం సమస్తతః,
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః.

147

ఓ రాక్షసోత్తమా! అలా చేయడం ససేమిరా తగదు. నీ నిర్ణయాన్ని మార్చుకో. నీ పద్ధతి రాజనీతికి విరుద్ధంగా ఉన్నది.

143

ఓ రాక్షసేంద్రా! దూతవధ రాజనీతి శాస్త్రాలలో ఎక్కడా కానరాదు. హితవాది అయిన దూత తన ప్రభువు సందేశాన్ని ఉన్నది ఉన్నట్లు చెప్పవలసి ఉంది. అతడి నుండి శత్రుపక్ష సమాచారాన్ని మాత్రమే తెలుసుకోవాలి.

144

సాటిలేని పరాక్రమవంతుడా! ఒకవేళ దూత ఘోరాపరాధం చేసినప్పటికీ అతడికి అంగవైరూప్యం కలిగించవచ్చునేగాని, ఎక్కడా శాస్త్రాలలో దూతవధ విధింపబడలేదు.

145

విభీషణుని విన్నపంలోని యుక్తతను గ్రహించిన రావణుడు నా తోకకు నిప్పంటించమని రాక్షసులను ఆదేశించాడు.

146

రావణుడు అలా ఆజ్ఞాపించినదే తడవుగా రాక్షసులు జనుపనార గుడ్డలను, గుడ్డపీలికలను తెచ్చి నా తోకకు గట్టిగా చుట్టారు.

147

రాక్షసాః సిద్ధసన్నాహాస్తతస్తే చణ్డవిక్రమాః,
తదాదహ్యన్త మే పుచ్ఛం నిఘ్నన్తః కాష్టముష్టిభిః.

148

బద్ధస్య బహుభిః పాశైర్యన్త్రితస్య చ రాక్షసైః,
న మే పీడా భవేత్ కాచిద్దివృక్షోర్నగరీం దివా.

149

తతస్తే రాక్షసాః శూరా బద్ధం మామగ్నిసంవృతమ్,
అఘోషయన్ రాజమార్గే నగరద్వారమాగతాః.

150

తతోఽహం సుమహద్రూపం సంక్షిప్య పునరాత్మనః,
విమోచయిత్వా తం బద్ధం ప్రకృతిస్థః స్థితః పునః.

151

ఆయసం పరిఘం గృహ్య తాని రక్షాంస్యసూదయమ్,
తతస్తన్నగర ద్వారం వేగేనాప్లుతవానహమ్.

152

క్రూరస్వభావులైన ఆ రాక్షసులు ఓర్పులేని వారై నన్ను కర్రలతో కొడుతూ, పిడికిళ్ళతో పొడుస్తూ నా తోకకు నూనెపోసి నిప్పంటించారు.

148

ఆ రాక్షసులు నన్ను కదలకుండా అనేక తాళ్ళతో బంధించినప్పటికీ, పగటిపూట లంకానగరాన్ని చూడ ఆతురతతో ఉన్న నాకు కించిత్తు కూడా బాధ అనిపించలేదు.

149

తరువాత ఆ రాక్షస యోధులు బద్ధుణ్ణీ, మండుతున్న తోకగల వాణ్ణీ అయిన నన్ను నగర ద్వారం వద్దకు తోడ్కొని వచ్చి నా గురించి రాజమార్గంలో పెద్దగా చాటింపు వేశారు.

150

తరువాత నేను నా పెనురూపాన్ని చిన్నదిగా చేసుకొని కట్టిన తాళ్ళను విడిపించుకొని మళ్ళీ యథారూపాన్ని దాల్చాను.

151

ప్రక్కనే ఉన్న ఒక ఇనుప పరిఘను (గుదియను) పుచ్చుకొని దానితో మోది ఆ రాక్షసులందరినీ సంహరించాను. పిదప ఒక్క గెంతుతో నగర ద్వారం మీదికి ఎగిరినాను.

152

పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్,
దహామ్యహమసంభ్రాన్తో యుగాన్తాగ్నిరివ ప్రజాః.

153

వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లఙ్కాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ.

154

దహతా చ మయా లఙ్కాం దగ్ధా సీతా న సంశయః,
రామస్య హి మహత్కార్యం మయేదం వితథీకృతమ్,
ఇతి శోకసమావిష్టశ్చిన్తామహముపాగతః.

155

అథాహం వాచమశ్రౌషం చారణానాం శుభాక్షరామ్,
జానకీ న చ దగ్ధేతి విస్మయోదన్తభాషిణామ్.

156

ప్రళయాగ్ని జనులను దహించివేసే తీరులో నా వాలాగ్నిజ్వాలలతో బురుజులతోను, ప్రాకారాలతోను, గోపురాలతోను అలరారుతున్న ఆ లంకానగరాన్ని సునాయాసంగా దహించివేశాను.

153

ఈ లంకానగరమంతా భస్మమైపోయింది. దగ్ధం కాని ప్రదేశం మచ్చుకి ఒక్కటి కూడా లేదు. కనుక సీతాదేవి మరణించి ఉండడానికే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

154

లంకానగరం యావత్తు నాచే దగ్ధం అయింది కనుక సీతాదేవి కూడా దహింపబడే ఉంటుందనడంలో సందేహం లేదు. రాముడు సంకల్పించిన మహత్కార్యాన్ని నేనిలా నిష్ఫలం గావించానే అని శోకమగ్నుడనై చింతన చేయసాగాను.

155

ఇంతలో 'జానకి దహింపబడలేదు' అన్న ఆశ్చర్యకరములైన, మంగళప్రదములైన చారణుల పలుకులను నేను విన్నాను.

156

తతో మే బుద్ధిరుత్పన్నా శ్రుత్వా తామద్భుతాం గిరమ్,
అదగ్ధా జానకీత్యేవం నిమిత్తైశ్చోపలక్షితా.

157

దీప్యమానే తు లాఙ్గూలే న మాం దహతి పావకః,
హృదయం చ ప్రహృష్టం మే వాతాః సురభిగన్ధినః.

158

తైర్నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ సిద్ధార్థైరభవం హృష్టమానసః,
పునర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః.

159

తతః పర్వతమాసాద్య తత్రారిష్టమహం పునః,
ప్రతిప్లవనమారేభే యుష్మదర్శన కాంక్షయా.

160

అద్భుతావహమైన ఆ పలుకులు వినగానే 'సీతాదేవి దహింపబడలేదు' అనే నిశ్చయానికి వచ్చాను. ఆ నా నిశ్చయాన్ని ఈ శుభశకునాలు రూఢి పరిచాయి.

157

నా తోక జ్వాలలు రేపుతూ మండుతున్నప్పటికీ అగ్ని నన్ను దహించలేదు. నా హృదయం ఉత్సాహభరితమై ఉన్నది. వాయువులు సువాసనాభరితములై వీచుచున్నవి.

158

ఇంతకు ముసుపు కార్య సాఫల్యాన్ని సూచించిన అదే శకునములచేత, సఫలములైన కారణములచేత, అక్షర సత్యాలైన ఋషుల వచనాలచేత నా మనస్సు ఆనందంలో తేలిపోయింది. మళ్ళీ వెంటనే సీతాదేవి వద్దకు వెళ్ళి ఆమె వద్ద సెలవు పుచ్చుకొన్నాను.

159

ఆపైన అరిష్ట పర్వతాన్ని అధిరోహించి మిమ్మల్నందరినీ చూడాలనే మిక్కుటమైన కోర్కెతో సముద్ర లంఘనం ప్రారంభించాను.

160

తతః పవనచన్ద్రార్క సిద్ధగన్ధర్వసేవితమ్,
పన్థానమహమాక్రమ్య భవతో దృష్టవానిహ.

161

రాఘవస్య ప్రభావేన భవతాం చైవ తేజసా,
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వమనుష్ఠితమ్.

162

ఏతత్సర్వం మయా తత్ర యథావదుపపాదితమ్,
అత్రయన్న కృతం శేషం తత్సర్వం క్రియతామితి.

163

వాయువు, సూర్యచంద్రులు, సిద్ధులు, గంధర్వులు సంచరించే గగన మార్గంలో పయనించి, ఈ తీరం చేరుకుని మిమ్మలసందరినీ కలుసుకున్నాను.

161

రాముని ప్రభావం వలనా, మీ సమధికోత్సాహం మూలాన సుగ్రీవుడు మనకు అప్పగించిన కార్యాన్ని సాధించగలిగాను.

162

అక్కడ లంకలో ఏం జరిగిందో క్లుప్తంగా, యథాతథంగా మీకు తెలియజేశాను. ఇక మనం చేయవలసిన కార్యశేషం విషయం చూద్దాము.

163

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 58వ సర్గ సమాప్తం

59

వ సర్గ

భవిష్యత్ కార్యాచరణ

ఏతదాఖ్యాయ తత్సర్వం హనుమాన్ మారుతాత్మజః,
భూయః సముపచక్రామ వచనం వక్తుముత్తరమ్.

1

సఫలో రాఘవోద్యోగః సుగ్రీవస్య చ సంభ్రమః,
శీలమాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః.

2

తపసా ధారయేల్లోకాన్ క్రుద్ధో వా నిర్దహేదపి,
సర్వథాఽతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః,
తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్.

3

వాయుపుత్రుడైన హనుమంతుడు తాను బయలుదేరినది మొదలు తిరిగి రావడం వరకు జరిగినదంతా పై రీతిలో చెప్పి మళ్ళీ ఇలా చెప్పసాగాడు.

1

రాముని లక్ష్యం సఫలమైనది, సుగ్రీవుని ఉత్సాహపూరిత ప్రయత్నాలు ఫలించాయి, సీతాదేవి సాటిలేని పాతివ్రత్యాన్ని కళ్ళారా చూసి ఆమె పట్ల

భక్తితో నా మనస్సు పులకించిపోయింది

2

రాక్షసరాజైన రావణుడు మహాతపస్సంపన్నుడు. ఆ తపశ్శక్తిచే అతడు లోకాలను ఉద్ధరించనూగలడు, కోపిస్తే లోకాలను దహించివేయనూగలడు. అపహరణ సమయంలో సీతాదేవిని స్పృశించినప్పటికీ అతడి శరీరం దగ్ధం కాకపోవడానికి కారణం ఆ తపశ్శక్తే!

3

న తదగ్నిశిఖా కుర్యాత్సంస్పృష్టా పాణినా సతీ,
జనకస్యాత్మజా కుర్యాద్యత్క్రోధకలుషీకృతా.

4

జామ్బవత్ప్రముఖాన్ సర్వాననుజ్ఞాప్య మహాహరీన్,
అస్మిన్నేవం గతే కార్యే భవతాం చ నివేదితే,
న్యాయ్యం స్మ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ.

5

అహమేకోఽపి పర్యాప్తః సరాక్షసగణాం పురీమ్,
తాం లఙ్కాం తరసా హన్తుం రావణం చ మహాబలమ్.

6

కిం పునః సహితో వీరైర్బలవద్భిః కృతాత్మభిః,
కృతాస్త్రైః ప్లవగైః శూరైర్భవద్భిర్విజయైషిభిః.

7

అహం తు రావణం యుద్ధే ససైన్య సపురస్సరమ్,
సహపుత్రం వధిష్యామి సహోదరయుతం యుధి.

8

జనకనందనయైన ఆ సీతాదేవికి ఎవరి పట్ల అయినా కోపంగాని దుర్భావంగాని తలెత్తినప్పుడు ఆమె తన పాతివ్రత్యశక్తిచే వారిని భస్మం చేయగలదు. ఆ విధంగా అగ్నిజ్వాల కూడా చెయ్యలేదు.

4

జాంబవంతాది వానర ప్రముఖుల అనుమతి పొంది ఇప్పటి వరకు జరిగినదంతా మీకు నివేదించాను. ఇప్పుడు మనం సీతాదేవిని తోడ్కొని వచ్చి ఆమెతో కూడా రామలక్ష్మణుల దర్శనానికి వెళ్ళడం మంచిదని భావిస్తున్నాను.

5

రాక్షస సమూహాలతో కూడిన ఆ లంకానగరాన్ని నాశనం చెయ్యడానికీ, మహాబలవంతుడైన ఆ రావణుని సంహరించడానికీ నేనొక్కడినే చాలు.

6

వీరులు, మహాబలశాలురు, నిశ్చయ మనస్కులు, శస్త్రాస్త్ర ప్రయోగ కుశలురు, విజయాభిలాషులు అయిన మీ అందరితో కలిసి యుద్ధానికి వెళితే ఇక చెప్పేదేముంది!

7

సైన్యసమేతంగా వచ్చిన రావణుని, పుత్రమిత్ర బంధువర్గాలతో సహా యుద్ధంలో నే నొక్కణ్ణే మట్టుపెట్టగలను.

8

బ్రాహ్మమైన్ద్రం చ రౌద్రం చ వాయవ్యం వారుణం తథా,
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్షాణి సంయుగే.

9

తాన్యహం విధమిష్యామి హనిష్యామి చ రావణమ్,
భవతామభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్.

10

మయాతులా విసృష్టా హి శైలవృష్టిర్నిరన్తరా,
దేవానపి రణే హన్యాత్కిం పునస్తాన్నిశాచరాన్.

11

సాగరోఽప్యతియాద్వేలాం మన్దరః ప్రచలేదపి,
న జామ్బవన్తం సమరే కమ్పయేదరివాహినీ.

12

సర్వరాక్షస సంఘానాం రాక్షసా యే చ పూర్వకాః,
అలమేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః.

13

యుద్ధంలో ఇంద్రజిత్తు ప్రయోగించే బ్రహ్మాస్త్రం, ఐంద్రాస్త్రం, రౌద్రాస్త్రం, వాయవ్యాస్త్రం, వారుణాస్త్రం మొదలైన తేరి చూడరాని మహాస్త్రాలను అన్నింటినీ నేను వమ్ము చేయగలను; రాక్షస వీరులను సంహరించగలను. మీ అనుమతి లభిస్తే విజృంభించిన పరాక్రమంతో ఆ రావణుని బంధించగలను.

9–10

యుద్ధంలో నేను ఎడతెరపి లేకుండా కురిపించే శిలావర్షానికి దేవతలే హతులవుతారంటే ఇక రాక్షసుల సంగతి విడిగా చెప్పాలా?

11

సముద్రం తీరాన్ని దాటితే దాటవచ్చు, మందర పర్వతం ఒకవేళ చలించవచ్చునేమోగాని యుద్ధంలో శత్రుసేనలు జాంబవంతుణ్ణి ఎదురొడ్డి మాత్రం నిలబడలేవు.

12

సమస్త రాక్షస సమూహాలలో పేరుగాంచిన మహావీరులను

సంహరించి రావడానికి వాలి సుతుడూ, మహావీరుడూ అయిన అంగదుడొక్కడే చాలు.

13

పనసస్యోరువేగేన నీలస్య చ మహాత్మనః,
మన్దరోఽప్యవశీర్యేత కింపునర్యుధి రాక్షసాః.

14

సదేవాసురయక్షేషు గన్ధర్వోరగపక్షిషు,
మైన్దస్య ప్రతియోద్ధారం శంసత ద్వివిదస్య వా.

15

అశ్విపుత్రౌ మహాభాగావేతౌ ప్లవగసత్తమౌ,
ఏతయోః ప్రతియోద్ధారం న పశ్యామి రణాజిరే.

16

పితామహవరోత్సేకాత్పరమం దర్పమాస్థితౌ,
అమృతప్రాశనావేతౌ సర్వవానరసత్తమౌ.

17

అశ్వినోర్మాననార్థం హి సర్వలోకపితామహః,
సర్వావధ్యత్వమతులమ్ అనయోర్దత్తవాన్ పురా.

18

మహాప్రతాపశాలురైన పనసుని, నీలుని వేగ విజృంభణకు మందర పర్వతం సైతం చూర్ణమైపోతుంది. ఇక ఆ రాక్షసుల విషయం వేరేగా చెప్పాలా?

14

దేవ అసుర గంధర్వ ఉరగ పక్షి జాతులలో ఎవరైనా మైందునకుగాని

ద్వివిదునకుగాని ఎదురుగా నిలబడి యుద్ధం చెయ్యగలరా? చెప్పండి.

15

వానర శ్రేష్ఠులూ, మహాబలశాలురూ అయిన ఈ మైంద ద్వివిదులు అశ్వనీ దేవతల పుత్రులు. రణరంగంలో వీరిని ఎదుర్కొని నిలబడగల శత్రువీరుడు ఎవడూ కానరావడం లేదు.

16

ఈ మైందద్వివిదులిద్దరూ బ్రహ్మ వరం పొంది రణోత్సాహులై ఉన్నారు. వీరు అమృతం గ్రోలినవారు. సమస్త వానరులలో శ్రేష్ఠులై విరాజిల్లుతున్నారు.

17

పూర్వం బ్రహ్మదేవుడు అశ్వనీదేవతలను సంతృప్తిపరచడానికై మైందద్వివిదులకు ఎవరి చేతిలోనూ చావు లేకుండేట్లు (సర్వావధ్యత్వం) అమోఘమైన వరాన్ని ప్రసాదించాడు.

18

వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్,
సురాణా మమృతం వీరౌ పీతవన్తౌ ప్లవంగమౌ.

19

ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుంజరామ్,
లఙ్కాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠన్తు వానరాః.

20

మయైవ నిహతా లఙ్కా దగ్ధా భస్మీకృతా పునః,
రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా.

21

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః.

22

అహం కోసలరాజస్య దాసః పవనసంభవః,
హనుమానితి సర్వత్ర నామ విశ్రావితం మయా.

23

బ్రహ్మ వరంతో అతిశయించినవారైన ఈ మైందద్వివిదులు సమధికోత్సాహంతో గొప్ప దేవతా సైన్యాన్ని జయించి, అమృతం పానం చేశారు.

19

తక్కిన వారనరవీరుల సంగతి అలా ఉంచండి. ఈ మైందద్వివిదులకే ఆగ్రహం వస్తే గుర్రాలు, రథాలు, ఏనుగులతో సహా ఆ లంకానగరాన్ని నేలమట్టం చేసివేయగలరు.

20

స్వయంగా నేనే లంకానగరాన్ని ధ్వంసంచేసి, కాల్చి బూడిదచేశాను. రాజమార్గాలలో నేనెవరో బిగ్గరగా చెబుతూ ఇలా చాటాను.

21

సాటిలేని పరాక్రమవంతుడైన రామునికి జయం! మహాబలసంపన్నుడైన లక్ష్మణునికి జయం! రాముని అనుగ్రహానికి నోచుకొన్న వానరరాజు సుగ్రీవునికి జయం! నేను కోసలాధిపతియైన రాముని దాసుణ్ణి, వాయుపుత్రుణ్ణి, హనుమంతుణ్ణి అని రామాదుల నామధేయాలను అక్కడ సర్వత్రా ప్రకటించాను.

22–23

అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః,

అధస్తాచ్ఛింశుపావృక్షే సాధ్వీ కరుణమాస్థితా.

24

రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా,
మేఘులేఖాపరివృతా చన్ద్రలేఖేవ నిష్ప్రభా.

25

అచిన్తయన్తీ వైదేహీ రావణం బలదర్పితమ్,
పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా జానకీ.

26

అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా,
అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురన్దరే.

27

తదేకవాసః సంవీతా రాజోధ్వస్తా తథైవ చ,
శోకసంతాపదీనాంగీ సీతా భర్తృహితే రతా.

28

దురాత్ముడైన రావణుని అశోకవన మధ్యంలో ఉన్న శింశుపావృక్షం క్రింద మహాపతివ్రతయైన సీతాదేవి దయనీయ స్థితిలో ఉంది.

24

కాపలాగా ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు ఉన్నారు. ఆమె శోకంతో, మనోవేదనతో కృశించి ఉంది. మేఘసమూహంచే కప్పబడిన చంద్రరేఖ మల్లే ఆమె కాంతివిహీనయై కానవచ్చింది.

25

సుందరమైన కటిప్రదేశం గలదీ, మహాపతివ్రతా శిరోమణీ అయిన ఆ సీతాదేవి బలగర్వితుడైన రావణుని కనీసం మనస్సులోకి సైతం రానివ్వకుండా

లంకలో నిర్బంధంలో ఉండీ, రాముని ధ్యాసలోనే ఉంది.

26

ఇంద్రుని యందు శచీదేవి వలె, మంగళప్రదురాలైన ఆ సీతాదేవి త్రికరణశుద్ధిగా రాముని యందే అనురాగం గలదై, ఆయన మీదనే మనస్సును లగ్నం చేసి ఉన్నది.

27

సీతాదేవి అదే వస్త్రాన్నే (అపహరణ సమయంలో ధరించిన) ధరించి ఉన్నది. ఆమె దేహమంతా దుమ్ము కొట్టుకుపోయి ఉంది. శోకసంతాపములచే దీనయై ఉన్న ఆమె సర్వవిధాల పతి హితాన్నే కోరుకొంటున్నది.

28

సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీర్విరూపాభిర్దృష్టా హి ప్రమదావనే.

29

ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా,
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే.

30

రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథం చిన్మృగశాబాక్షీ విశ్వాసముపపాదితా.

31

తతః సంభాషితా చైవ సర్వమర్థం చ దర్శితా,
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా.

32

ఆ అశోకవనంలో వికృతరూపిణులైన రాక్షసస్త్రీల మధ్య, వారిచే

మాటిమాటికీ భయపెట్టబడుతుండగా ఉన్న సీతాదేవిని నేను చూశాను.

29

తైల సంస్కారం లేనందున ఆమె కేశములు జడకట్టి ఉన్నవి. అహర్నిశలూ భర్త ధ్యానంలోనే ఉండి, కటిక నేలమీద శయనిస్తూ శిశిర ఋతువులోని పద్మలతవలె ఆమె కాంతివిహీనయై కానవచ్చింది.

30

రావణుని పట్ల పరాఙ్ముఖయై దేహత్యాగం చేయ నిశ్చయించిన లేడిపిల్ల కన్నుల వంటి కళ్ళుగల ఆ సీతాదేవికి ఎట్టకేలకు నా పట్ల నమ్మకం కలిగించగలిగాను.

31

ఆ తరువాత ఆమెతో మాట్లాడి సమస్త విషయాలను విశదంగా తెలియజేశాను. రామ సుగ్రీవుల మధ్య గాఢస్నేహం కలిగిందనే విషయం విని సీతాదేవి ఎంతో సంతోషించింది.

32

నియతః సముదాచారో భక్తిర్భర్తరి చోత్తమా,
యన్న హన్తి దశగ్రీవం స మహాత్మా కృతాగసమ్,
నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి.

33

సా ప్రకృత్యైవ తన్వంగీ తద్వియోగాచ్చ కర్శితా,
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా.

34

ఏవమాస్తే మహాభాగా సీతా శోకపరాయణా,
యదత్ర ప్రతికర్తవ్యం తత్సర్వముపపద్యతామ్.

35

మహానుభావురాలైన ఆ సీతాదేవి తన పట్ల అంత ఘోర అపరాధం చేసిన ఆ రావణుని తన ప్రభావంతో ఇంకా చంపలేదంటే అందుకు కారణం ఆమె పాటిస్తున్న నియమపాలనా, భర్తపట్ల ఆమెకున్న అచంచల భక్తే! రావణుని సంహరించడానికి రాముడు ఇక కేవలం నిమిత్తమాత్రుడే!

33

శరీరతత్వ రీత్యా సన్నని శరీరాకృతిగల ఆ సీతాదేవి రాముని ఎడబాటుతో మరింత కృశించిపోయి, పాడ్యమినాడు★ వేదాధ్యయనం చేసేవాడి విద్యమల్లే ఇంకా సన్నబడిపోయి ఉంది.

34

మహానుభావురాలైన సీతాదేవి ఆ లంకానగరంలో ఈ విధంగా శోకంలో మునిగి ఉంది. కాబట్టి ప్రస్తుతం ఇందుకు చేయవలసిన ప్రతిక్రియ గురించి మనం యోచించాలి.

35

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 59వ సర్గ

సమాప్తం

60

వ సర్గ

అంగదుని సంకల్పం

తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూనురభాషత,
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః,
సమీపం గన్తుమస్మాభీ రాఘవస్య మహాత్మనః.

1

దృష్టా దేవీ చానీతా ఇతి తత్ర నివేదనమ్,
అయుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతవిక్రమైః.

2

న హి నః ప్లవనే కశ్చిన్నాపి కశ్చిత్పరాక్రమే,
తుల్యః సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః.

3

హనుమంతుని మాటలు విని వాలిపుత్రుడైన అంగదుడు ఇలా అన్నాడు: ఓ వానరవీరులారా! సీతాదేవి జాడ తెలుసుకొన్న తరువాత ఆమెను మనతో తోడ్కొని పోకుండా మహాత్ముడైన రాముని వద్దకు మనం వెళ్ళడం సబబు కాదని భావిస్తున్నాను.

1

సీతాదేవిని చూశాము, కాని ఆమెను వెంటబెట్టుకొని రాలేదని రామునికి నివేదించడం పరాక్రమవంతులుగా ఖ్యాతిగాంచిన మీ అందరికీ సముచితం కాదని నాకు తోచుచున్నది.

2

ఓ వానరోత్తములారా! ఆకాశ సంచారంలోగాని, పరాక్రమంలోగాని దేవతల, దైత్యులతో కూడుకొన్న లోకాలన్నిటిలోనూ మనకు సాటి వచ్చేవారు ఎవ్వరూ లేరు.

3

జిత్వా లంకాం సరక్షౌఘాం హత్వా తం రావణం రణే,
సీతామాదాయ గచ్ఛామః సిద్ధార్థా హృష్టమానసాః.

4

తేష్వేవం హతవీరేషు రాక్షసేషు హనుమతా,
కిమన్యదత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీమ్.

5

రామలక్ష్మణ యోర్మధ్యే న్యస్యామ జనకాత్మజామ్,
కిం వ్యలీకైస్తు తాన్ సర్వాన్ వానరాన్ వానరర్షభాన్.

6

వయమేవ హి గత్వా తాన్ హత్వా రాక్షసపుంగవాన్,
రాఘవం ద్రష్టుమర్హామః సుగ్రీవం సహలక్ష్మణమ్.

7

తమేవం కృతసంకల్పం జాంబవాన్ హరిసత్తమః,
ఉవాచ పరమప్రీతో వాక్యమర్థవదర్థవిత్.

8

లంకలోని యావన్మంది రాక్షసులనూ జయించి, యుద్ధరంగంలో ఆ రావణుని సంహరించి, సీతాదేవిని తోడ్కొని, కార్యసాఫల్యం పొంది ఆనందోత్సాహాలతో రాముని వద్దకు వెళదాము.

4

లంకలోని రాక్షసవీరులను ఎందరినో ఇంతకు ముందే హనుమంతుడు ఒక్కడే సంహరించి వచ్చాడు గదా! ఇక సీతాదేవిని తోడ్కొని రావడం తప్పితే మనం చెయ్యవలసిన పని మాత్రం ఏముంది?

5

జనకాత్మజయైన సీతాదేవిని తోడ్కొని రామలక్ష్మణుల చెంతన చేర్చుదాము. ఇన్ని మాటలు ఎందుకు? ఇతర వానరోత్తములు రావలసిన అవసరం లేదు. మనమే వెళ్ళి రాక్షసవీరులను సంహరించి రామలక్ష్మణ సుగ్రీవులను దర్శించడం సబబుగా ఉంటుంది.

6–7

వానరశ్రేష్ఠుడూ, వివేచనాశక్తిసంపన్నుడూ అయిన జాంబవంతుడు, సీతను తోడ్కొనియే రాముని దర్శించాలని సంకల్పించిన అంగదునితో సలహా ఇస్తున్న ధోరణిలో ఇలా చెప్పాడు.

8

నైషా బుద్ధిర్మహాబుద్ధే యద్ర్భవీషి మహాకపే,
విచేతుం వయమాజ్ఞప్తా దక్షిణాం దిశముత్తమామ్.

9

నానేతుం కపిరాజేన నైవ రామేణ ధీమతా,
కథంచిన్నిర్జితాం సీతాం అస్మాభిర్నాభిరోచయేత్.

10

రాఘవో నృపశార్దూలః కులం వ్యపదిశన్ స్వకమ్,

ప్రతిజ్ఞాయ స్వయం రాజా సీతావిజయమగ్రతః.

11

సర్వేషాం కపిముఖ్యానాం కథం మిథ్యా కరిష్యతి,
విఫలం కర్మ చ కృతం భవేత్ తుష్టిర్న తస్య చ,
వృథా చ దర్శితం వీర్యం భవేద్వానరపుంగవాః.

12

తస్మాద్గచ్ఛామ వై సర్వే యత్ర రామః సలక్ష్మణః,
సుగ్రీవశ్చ మహాతేజాః కార్యస్యాస్య నివేదనే.

13

ఓ అంగదా! నీ మాటలు సముచితంగా కనిపించడం లేదు. వానరరాజైన సుగ్రీవుడు, ధీమంతుడైన రాముడు దక్షిణ దిక్కులో సీతాదేవిని అన్వేషించడానికి మనలను పంపించారుగాని, ఆమెను తోడ్కొని రమ్మనలేదు. సీతాదేవిని స్వయంగా మనమే తోడ్కొని వెళ్ళడం రామునికి నచ్చకపోవచ్చునేమో!

9–10

రాజసింహుడైన రాముడు, 'శత్రువును సంహరించి సీతాదేవిని తీసుకొని రాకపోతే నేను రఘువంశంలో జన్మించిన వాడనే కాను' అని వానరశ్రేష్ఠుల సమక్షంలో ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు కదా! కనుక మనమే సీతాదేవిని స్వయంగా తీసుకుని వెళితే, ఆ ప్రతిజ్ఞకు భంగం వాటిల్లుతుంది గదా! కనుక వానరపుంగవులారా! మీరు మీ పరాక్రమాలను చూపడం వ్యర్థమే అవుతుంది.

11–12

కనుక మనం అందరమూ రామలక్ష్మణులు, మహాతేజశ్శాలియైన సుగ్రీవుడు ఉన్న చోటుకు వెళ్ళి సీతాదేవి సమాచారం వారికి నివేదిద్దాం.

13

న తావదేషా మతిరక్షమా నో
యథా భవాన్ పశ్యతి రాజపుత్ర,
యథా తు రామస్య మతిర్నివిష్టా
తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్.

14

ఓ రాకుమారా! నీ సూచన సముచితమైనదే! మనం రాక్షసులను జయింప సమర్థులమే! కాని రాముని మనస్సు నెరిగి తదనుగుణంగా కార్యసిద్ధికి మనం పూనుకోవడం యుక్తం.

14

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 60వ సర్గ
సమాప్తం

61

వ సర్గ

మధువన విధ్వంసం

తతో జామ్బవతో వాక్యమగృహ్ణన్త వనౌకసః,
అంగదప్రముఖా వీరా హనుమాంశ్చ మహాకపిః.

1

ప్రీతిమన్తస్తతః సర్వే వాయుపుత్ర పురస్సరాః,
మహేన్ద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః.

2

మేరుమన్దరసంకాశా మత్తా ఇవ మహాగజాః,
ఛాదయన్త ఇవాకాశం మహాకాయా మహాబలాః.

3

సభాజ్యమానం భూతైస్తమాత్మవన్తం మహాబలమ్,
హనుమన్తం మహావేగం వహన్త ఇవ దృష్టిభిః.

4

రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః,
సమాధాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభిరున్నతాః.

5

ప్రియాఖ్యానోన్ముఖాః సర్వే సర్వే యుద్ధాభినన్దినః,
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః.

6

తరువాత ప్రముఖులైన అంగదాది వానరవీరులూ, వానర శ్రేష్ఠుడైన హనుమంతుడూ జాంబవంతుని సూచనకు సమ్మతించారు.

1

తరువాత వానరశ్రేష్ఠులందరూ వాయునందనుడైన హనుమంతుని తమ ముందు ఉంచుకుని సంతుష్టహృదయులై ఆ మందరపర్వతాన్ని విడిచి ఆకాశంలోకి రివ్వున ఎగిరారు. మేరు మందరపర్వతాల వలె మహాకాయం గలవారూ, మదించిన ఏనుగుల వలె ఉన్నవారూ అయిన ఆ వానరులు ఆకాశాన్నంతా కప్పివేస్తున్నట్లు ఎగురసాగారు. గొప్ప ప్రజ్ఞాశాలీ, అమిత బలసంపన్నుడూ, మహావేగవంతుడూ, సకల ప్రాణుల గౌరవాదరణలు చూరగొన్న వాడూ అయిన హనుమంతుని వారు తమ చూపులతో మోస్తున్నట్లు రెప్పపాటులేని దృష్టితో చూస్తూ సాగిపోతున్నారు. రామకార్యం సిద్ధించినందున ఆ వానరులందరూ గొప్పకీర్తిని గడించి కృతార్థులయ్యారు. రామునికి ఈ ప్రియమైన వార్తను తెలియజేయడానికి వారందరూ తహతహపడుచున్నారు. ఆ వానరులందరూ రణోత్సాహంతో ఉప్పొంగిపోతూ రాముని విషయంలో ఆ రావణుడు చేసిన మహా అపకారానికి ప్రతీకారం తీర్చుకోవాలని కంకణబద్ధులై ఉన్నారు.

2–6

ప్లవమానాః ఖమాప్లత్య తతస్తే కాననౌకసః,
నన్దనోపమమాసేదుర్వనం ద్రుమలతాయుతమ్.

7

యత్తన్మధువనం నామ సుగ్రీవస్యాభిరక్షితమ్,

అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్.

8

ఆ వానరులు అలా ఆకాశంలో ఎగురుతూ తేలిపోతూ వృక్షాలతోనూ, లతలతోనూ అలరారుతూ దేవేంద్రుని నందనోద్యానానికి సాటియైన మధువనాన్ని చేరుకొన్నారు.

7

సకల ప్రాణులకు ఆహ్లాదాన్ని చేకూర్చగల మధువనం సుగ్రీవుని రక్షణలో ఉంది. దానిలోకి ప్రవేశించడానికి ఎవరికీ సాధ్యంకాదు.

8

యద్రక్షతి మహావీర్యః సదా దధిముఖః కపిః,
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః.

9

తే తద్వనముపాగమ్య బభూవుః పరమోత్కటాః,
వానరా వానరేన్ద్రస్య మనఃకాన్తతమం మహత్.

10

తతస్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్,
కుమారమభ్యయాచన్త మధూని మధుపిఙ్గలాః.

11

తతః కుమారస్తాన్ వృద్ధాన్ జామ్బవత్ప్రముఖాన్ కపీన్,
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే.

12

తతశ్చానుమతాః సర్వే సంప్రహృష్టా వనౌకసః,
ముదితాః ప్రేరితాశ్చాపి ప్రనృత్యన్తోఽభవం స్తతః.

13

దధిముఖుడనే వానర వీరుడు వానరరాజు, మహాత్ముడూ అయిన సుగ్రీవుని మేనమామ. అతడు తన పరివారంతో ఆ మధువనాన్ని రక్షిస్తూ ఉంటాడు.

9

వానరరాజైన సుగ్రీవునికి ఎంతో మానసోల్లాసాన్ని చేకూర్చే ఆ మధువనం వద్దకు రాగానే వానరులందరికి అందులోని మధువును త్రాగాలనే బలీయమైన కోర్కె కలిగింది.

10

అంతే, తేనె మల్లే పింగళవర్ణులైన ఆ వానరులు గొప్పదైన ఆ మధువనాన్ని చూసి సంతోషించి అందులోని మధువులను గ్రోల అంగదుని అనుమతిమ్మని అభ్యర్థించారు.

11

అంత యువరాజైన అంగదుడు జాంబవంతాది పెద్దలను సంప్రతించి వారి ఆమోదంతో మధుభక్షణకై వానరులకు అనుమతి ఇచ్చాడు.

12

అప్పటికే ఉల్లాసభరితంగా ఉన్న వానరులు అంగదుని అనుమతి లభించడంతో ఆనందపరవశులై నృత్యం చేయసాగారు.

13

గాయన్తి కేచిత్ప్రణమన్తి కేచి
న్నృత్యన్తి కేచిత్ప్రహసన్తి కేచిత్,
పతన్తి కేచిద్విచరన్తి కేచిత్
ప్లవన్తి కేచిత్ప్రలపన్తి కేచిత్.

14

పరస్పరం కేచిదుపాశ్రయన్తే
పరస్పరం కేచిదుపాగ్రమన్తే,
పరస్పరం కేచిదుపబ్రువన్తే
పరస్పరం కేచిదుపారమన్తే.

15

ద్రుమాద్రుమం కేచిదభిద్రవన్తే
క్షితౌ నగాగ్రాన్నిపతన్తి కేచిత్,
మహీతలాత్ కేచిదుదీర్ణవేగా
మహాద్రుమాగ్రాణ్యభిసంపతన్తి.

16

మధువు మత్తతలో కొందరు వానరులు పాడుతున్నారు. కొందరు వంగి దండాలు పెడుతున్నారు, మరికొందరు ఆడుతున్నారు. కొంతమంది వానరులు విరగబడి నవ్వుతున్నారు. కొందరు పచార్లు చేస్తున్నారు, కొందరు క్రింద పడుతున్నారు. కొందరు వానరులు పైకి ఎగురుతున్నారు. కొందరు ప్రేలాపన చేస్తున్నారు.

14

కొందరు వానరులు చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారు. మరికొందరు ఒకరి వీపుల మీదికి ఒకరుగా ఎక్కుతున్నారు. ఇంకొందరు వానరులు ఎడతెరపి లేకుండా మాటల్లో పడి ఉన్నారు. కొందరు రకరకాల ఆటల్లో మునిగి ఉన్నారు.

15

కొందరు ఒక చెట్టునుండి మరొక చెట్టు వైపుకు పరుగెత్తుతున్నారు. కొందరు చెట్లపైనుండి నేలమీదికి దూకుతున్నారు. కొందరు అత్యంత వేగంతో నేలమీద నుండి వృక్షాగ్రాలకు ఎగురుతున్నారు.

16

గాయన్తమన్యః ప్రహసన్నుపైతి
హసన్తమన్యః ప్రరుదన్నుపైతి,
రుదన్తమన్యః ప్రణుదన్నుపైతి
నుదన్తమన్యః ప్రణదన్నుపైతి.

17

సమాకులం తత్కపిసైన్యమాసీ
న్మధు ప్రపానోత్కటసత్త్వచేష్టమ్,
న చాత్రకశ్చిన్న బభూవ మత్తో
న చాత్రకశ్చిన్న బభూవ తృప్తః.

18

తతో వనం తత్పరిభక్ష్యమాణం
ద్రుమాంశ్చ విధ్వంసితపత్రపుష్పాన్,
సమీక్ష్య కోపాద్దధివక్త్రనామా
నివారయామాస కపిః కపీంస్తాన్.

19

ఒకడు పాడుతుండగా మరొకడు నవ్వుతూ అతడి వద్దకు పోతున్నాడు. ఆ నవ్వుతున్న వాడి వద్దకు మరొకడు ఏడుస్తూ వస్తున్నాడు. ఆ ఏడుస్తున్న వాణ్ణి ఇంకొకడు తోసివేస్తున్నాడు. ఆ తోసివేస్తున్న వాణ్ణి చూసి అరుస్తూ మరొకడు అతడిపైకి వస్తున్నాడు.

17

అతిగా మధుపానం చేయడంతో ఆ వానరుల మనస్సులు అదుపు తప్పి వారు నానావిధ వికార చేష్టలు చేయనారంభించారు. ఆ వానర సేనలో మధువుతో మత్తెక్కని వాడుగాని, మధువుతో తృప్తి చెందని వాడుగాని మచ్చుకి

ఒక్కడు కూడా లేడు.

18

ఆ వానరులు అడ్డూ అదుపు లేకుండా మధువులను గ్రోలుతూ, పండ్లను భక్షిస్తూ ఆకులతో పువ్వులతో శోభస్కరంగా ఉన్న చెట్లను ధ్వంసం చేస్తూ ఉంటే వన పాలకుడైన దదిముఖుడు కోపంతో వారిని వారించడానికి ప్రయత్నించాడు.

19

స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో
వనస్య గోప్తా హరివీరవృద్ధః,
చకార భూయో మతిముగ్రతేజా
వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః.

20

ఉవాచ కాంశ్చిత్పరుషాణి ధృష్ట
మసక్తమాన్యాంశ్చ తలైర్జఘాన,
సమేత్య కైశ్చిత్కలహం చకార
తథైవ సామ్నోపజగామ కాంశ్చిత్.

21

స తైర్మదాత్ సంపరివార్య వాక్యై
ర్బలాచ్చ తేన ప్రతివార్యమాణైః,
ప్రధర్షితస్త్యక్తభయైః సమేత్య
ప్రకృష్యతే చాప్యనవేక్ష్య దోషమ్.

22

మధువన రక్షకుడూ, వానరవీరులలో వృద్ధుడూ, తేజోవంతుడూ అయిన ఆ దదిముఖుని ఖాతరు చేయక ఆ వానరులు మితిమీరి ప్రవర్తిస్తూ

అతణ్ణే బెదిరించసాగారు. అప్పుడతడు ఆ వనాన్ని రక్షింప ఇతర మార్గాలను గూర్చి యోచించసాగాడు.

20

సౌమ్యత ప్రయోజనంలేదనుకొని దదిముఖుడు కొందరు వానరులను చెడామడా తిట్టాడు, కొందరిని అరచేతులతో చరచాడు, మరికొందరితో తగువు పెట్టుకొన్నాడు. ఇక కొందరిని సామోపాయంతో బతిమాలాడు.

21

సాధికారకపూర్వకమైన పదజాలంతోనూ, బలప్రయోగంతోనూ ఆ వనపాలకుడు తమను అధిక్షేపించాడని చిత్తుగా మత్తులో ఉన్న ఆ వానరులు తాము చేస్తున్నది తప్పు అని కూడా భావించక ఆ దదిముఖుణ్ణి బలవంతంగా అటూ ఇటూ ఈడ్వడం మొదలుపెట్టారు.

22

నఖైస్తుదన్తో దశనైర్దశన్త
స్తలైశ్చ పాదైశ్చ సమాపయన్తః,
మదాత్కపిం తం కపయః సమగ్రా
మహావనం నిర్విషయం చ చక్రుః.

23

పూర్తిగా మత్తు ప్రభావంలో ఉన్న ఆ వానరులు ఆ దదిముఖుని గోళ్ళతో రక్కి, దంతాలతో కొరికి బాగా గాయపరిచారు. అంతటితో ఆగక తమ కాళ్ళతో, చేతులతో యావత్తు మధువనాన్ని ధ్వంసం చేయడం ప్రారంభించారు.

23

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 61వ సర్గ

సమాప్తం

62

వ సర్గ

మధువన రక్షకులపై దాడి

తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్వానరర్షభః,
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః,
అహమావారయిష్యామి యుష్మాకం పరిపన్థినః.

1

శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽఙ్గదః,
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబన్తు హరయో మధు.

2

అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా,
అకార్యమపి కర్తవ్యం కిమఙ్గ పునరీదృశమ్.

3

వానరులలో వృషభము వంటి వాడూ, శ్రేష్ఠుడు అయిన హనుమంతుడు తోటి వానరులను ఉద్దేశించి భరోసాగా ఇలా అన్నాడు: "ఓ వానరులారా! మీరేమీ సంకోచపడకుండా, భయపడకుండా కావలసినంత మధువును గ్రోలండి. మిమ్మల్ని అడ్డగించే వారి విషయం నేను చూసుకొంటాను."

1

హనుమంతుని పలుకులు విని వానరులలో శ్రేష్ఠుడైన అంగదుడు ప్రసన్న చిత్తుడై ఇలా స్పందించాడు: “ఓ వానరులారా! మీరు మధువులను మీ ఇచ్ఛమేరకు గ్రోలండి. రామకార్యం సాధించుకు వచ్చిన హనుమంతుడు చెబితే చెయ్యకూడని పనినైనా విధిగా చెయ్యవలసిందే! ఇక స్వల్పమైన ఈ మధువు విషయం గూర్చి విడిగా చెప్పాలా?”

2–3

అంగదస్య ముఖాచ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః,
సాధుసాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్.

4

పూజయిత్వాంగదం సర్వే వానరా వానరర్షభమ్,
జగ్ముర్మధువనం యత్ర నదీవేగ ఇవ ద్రుతమ్.

5

తే ప్రవిష్టా మధువనం పాలానాక్రమ్య వీర్యతః,
అతిసర్గాచ్చ పటవో దృష్ట్యా శ్రుత్వా చ మైథిలీమ్,
పపుః సర్వే మధు తదా రసవత్ఫలమాదదుః.

6

ఉత్పత్య చ తతః సర్వే వనపాలాన్ సమాగతాన్,
తాడయన్తి స్మ శతశః సక్తాన్మధువనే తదా.

7

అంగదుని ముఖతా వెలువడ్డ ఆ పలుకులు విని వానరులలో వృషభములవంటి వానరులు పట్టరాని సంతోషంతో ‘బాగుబాగు’ అంటూ అతణ్ణి ప్రశంసించారు.

4

అంగదుని సానుకూల స్పందనను అభినందించిన ఆ వానరులందరూ

కట్టలు త్రెంచుకుని ప్రవహించే నదీప్రవాహం లాగ మధువనంలోకి చొచ్చుకుపోయారు.

5

సీతాదేవి జాడ కనుగొన్నామనే ఆనందంతోనూ, అంగదుని అనుమతి లభించడంతోనూ వానరులు ధీమాతో వనపాలకులను అలక్ష్యం చేస్తూ ఎడాపెడా మధువులను త్రాగారు, వనమంతా కలయ తిరిగి మధురమైన ఫలాలను భక్షించారు.

6

అప్పుడు ఆ వానరులను అదుపు చేయడానికి వందల సంఖ్యలో వచ్చిన వనపాలకుల మీదపడి వాళ్ళను విచక్షణారహితంగా బాదసాగారు.

7

మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్య తే,
పిబన్తి సహితాః సర్వే నిఘ్నన్తి స్మ తథాపరే.

8

కేచిత్ పీత్వాఽపవిధ్యంతి మధూని మధుపిఙ్గలాః,
మధూచ్ఛిష్టేన కేచిచ్చ జఘ్ను రన్యోన్యముత్కటాః.

9

అపరే వృక్షమూలే తు శాఖాం గృహ్య వ్యవస్థితాః,
అత్యర్థం చ మదగ్లానాః పర్ణాన్యాస్తీర్య శేరతే.

10

ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్,
క్షిపన్తి చ తదాన్యోఽన్యం స్థలంతి చ తథాపరే.

11

కేచిత్ క్ష్వేలాం ప్రకుర్వన్తి కేచిత్ కూజన్తి హృష్టవత్,
హరయో మధునా మత్తాః కేచిత్ప్లుప్తా మహీతలే.

12

ఆ వానరులలో కొందరు తూమెడు తేనెపట్టులను చేతులలోకి తీసుకొని తేనెను త్రాగసాగిరి. మరికొందరు త్రాగగా మిగిలిన తుట్టెలను నేలకేసి కొట్టి ఛిన్నాభిన్నం చేయసాగారు.

8

తేనె వంటి పింగళవర్ణంలో ఉన్న కొందరు వానరులు కడుపు పట్టినంత గ్రోలి తక్కిన మధువులను నేలపై పారపోస్తూ వృథాచెయ్యసాగారు. మధుపాన మత్తులైన కొందరు తేనెపట్టులను ఒకరిపై ఒకరు విసురుకోసాగారు.

9

మత్తులో ఉన్న కొందరు వానరులు పడిపోకుండా చెట్ల కొమ్మలు పట్టుకొని చెట్ల మొదళ్ళ వద్ద కూలబడ్డారు. మరీ మత్తులో ఉన్న కొందరు చెట్ల ఆకులు పరచుకొని వాటిపై పవ్వళించారు.

10

మధుపానంతో బాగా మత్తెక్కి ఉన్మత్తులైన కొందరు వానరులు ఒకరినొకరు సంతోషంతో త్రోసుకోసాగారు. కొందరు తూలుతూ నడుస్తున్నారు.

11

కొందరు వానరులు ఆనందంతో సింహనాదాలు చేస్తున్నారు, మరికొందరు పక్షులమల్లే కూతలు కూస్తున్నారు. ఇంకా కొందరు నేలమీద పడుకొని నిద్రలోకి జారుకొంటున్నారు.

12

కృత్వా కేచిద్ధసన్త్యన్యే కేచిత్కుర్వన్తి చేతరత్,
కృత్వా కేచి ద్వదన్త్యన్యే కేచిద్బుధ్యన్తి చేతరత్.

13

యేఽప్యత్ర మధుపాలాః స్యుః ప్రేష్యా దదిముఖస్య తు,
తేఽపి తైర్వానరైర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః.

14

జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం ప్రదర్శితాః,
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దదిముఖం వచః.

15

హనూమతా దత్తవరైర్హతం మధువనం బలాత్,
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః.

16

తతో దదిముఖః క్రుద్ధో వనపస్తత్ర వానరః,
హతం మధువనం శ్రుత్వా సాన్త్వయామాస తాన్ హరీన్.

17

కొందరు ఏవో వికృత చేష్టలు చేసి నవ్వుతుండగా మరికొందరు మరేవో చిలిపి పనులు చేయసాగారు. కొందరు తమ చేష్టల గూర్చి చెప్పుకొనుచుండగా ఇంకా కొందరు మత్తు దిగిపోగా మెల్లగా లేచి నిలబడసాగారు.

13

వానరుల అఘాయిత్యాలకు భయపడిపోయిన ఆ దదిముఖుని అనుచరులైన వనరక్షకులు వనంలో నలుదిక్కులకూ పలాయనం చిత్తగించారు.

14

మోకాళ్ళతో పొడిచి నేలమీద ఈడ్చి హింసిస్తూ అసభ్యకర అంగవిన్యాసాలు చూపుతున్న ఆ వానరుల ధాటికి పారిపోయిన వనపాలకులు దదిముఖుని వద్దకు వెళ్ళి ఫిర్యాదుపూర్వకంగా ఇలా చెప్పారు.

15

హనుమంతుని అనుమతితో ఆ వానరులు మధువనాన్ని నామరూపాలు లేకుండా ధ్వంసం చేశారు. మమ్మల్ని మోకాళ్ళతో పొడిచి, ఈడ్చి తమ అపాన ద్వారాలు చూపుతూ పరిహసించారు.

16

వానరులు మధువనాన్ని పూర్తిగా ధ్వంసం చేశారన్న వార్త విన్న వనపాలకుడైన దదిముఖుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. తరువాత గాయపడి వచ్చిన తన అనుచరులను ఓదార్చాడు.

17

ఇహాగచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్,
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్.

18

శ్రుత్వా దదిముఖస్యేదం వచనం వానరర్షభాః,
పునర్వీరా మధువనం తేనైవ సహసా యయుః.

19

మధ్యే చైషాం దదిముఖః ప్రగృహ్య తరసా తరుమ్,
సమభ్యధావద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః.

20

తే శిలాః పాదపాంశ్చాపి పర్వతాంశ్చాపి వానరాః,
గృహీత్వాఽభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుంజరాః.

21

తే స్వామివచనం వీరా హృదయేష్వవసజ్య తత్,
త్వరయా హ్యభ్యధావన్త సాలతాలశిలాయుధాః.

22

రండి, మనం వెళదాం. మధువుతోనూ, బలగర్వంతోనూ మత్తులై ఉన్న ఆ వానరులను బలప్రయోగంతో తరిమికొడదాం.

18

దదిముఖుని మాటలు విన్న ధైర్యవంతులైన ఆ వనరక్షకులు వెంటనే అతడితో కలసి వేగంగా మధువనంలోకి మళ్ళీ వెళ్ళారు.

19

మధ్య దారిలో దదిముఖుడు ఒక వృక్షాన్ని పెకలించి దాన్ని జళిపిస్తూ పరుగెత్తాడు. అతడి అనుచరగణం అతని వెంట పరుగెత్తారు.

20

కోపోద్రిక్తులై ఉన్న దదిముఖుని అనుచరులు తమ చేతుల్లో రాళ్ళు, చెట్లు, కొండలు పట్టుకొని వానరశ్రేష్ఠులున్న చోటును సమీపించారు.

21

వీరులైన వనపాలకులు తమ నాయకుడైన దదిముఖుని ఆదేశాన్ని శిరసావహిస్తూ మద్దిచెట్లను, తాటిచెట్లను, శిలలను ఆయుధాలుగా చేతబట్టి పరుగుతీశారు.

22

వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్,
అభ్యక్రామంస్తతో వీరాః పాలాస్తత్ర సహస్రశః.

23

అథ దృష్ట్వా దదిముఖం క్రుద్ధం వానరపుఙ్గవాః,

అభ్యధావన్త వేగేన హనుమత్ప్రముఖాస్తదా.

24

తం సవృక్షం మహాబాహుమాపతన్తం మహాబలమ్,
ఆర్యకం ప్రాహరత్తత్ర బాహుభ్యాం కుపితోఽంగదః.

25

మదాన్ధశ్చ న వేదైన మార్యకోఽయం మమేతి సః,
అథైనం నిష్పిపేషాశు వేగవద్యసుధాతలే.

26

స భగ్నబాహూరుభుజో విహ్వలః శోణితోక్షితః,
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుంజరః.

27

పరాక్రమవంతులైన మధువన రక్షకులు కలసికట్టుగా చెట్ల మీద, చెట్ల క్రిందా ఉన్న వానరులను చుట్టుముట్టి వారిని ఎదుర్కొన్నారు.

23

అప్పుడు దదిముఖుడు కోపోద్రిక్తుడై రావడం చూసి హనుమదాది వానరశ్రేష్ఠులు వేగంగా అతడి వైపు దూసుకు వెళ్ళారు.

24

మహాబలిష్ఠుడూ, బాహుపరాక్రమవంతుడూ అయిన దదిముఖుడు వృక్షం చేతబట్టి ముందుకు వేగంగా రావడం చూసి, అంగదుడు పట్టరాని ఆగ్రహంతో అతణ్ణి తన రెండు చేతులతో బలంగా కొట్టాడు.

25

మత్తులో పరాకాష్ఠను చేరుకొన్న అంగదుడు వయస్సులో పెద్దవాడని కూడా గుర్తించకుండా ఆ దదిముఖుణ్ణి నేలమీద పడద్రోసి కాళ్ళతో తన్నాడు.

26

వానరశ్రేష్ఠుడూ, వీరుడూ అయిన ఆ దదిముఖుని బాహువులు, తొడలు, భుజాలు విరిగి, దేహం రక్తసిక్తంకాగా అతడు క్షణంసేపు మూర్ఛపోయాడు.

27

స సమాశ్వస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః,
వానరాన్వారయామాస దణ్డేన మధుమోహితాన్.

28

స కథంచిద్విముక్తస్తైః వానరైర్వానరర్షభః,
ఉవాచైకాన్తమాశ్రిత్య భృత్యాన్ స్వాన్ సముపాగతాన్.

29

ఏతే తిష్ఠన్తు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః,
సుగ్రీవో విపులగ్రీవః సహ రామేణ తిష్ఠతి.

30

సర్వం చైవాజ్ఞదే దోషం శ్రావయిష్యామి పార్థివే,
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యతి వానరాన్.

31

ఇష్టం మధువనం హ్యేతత్పార్థివస్య మహాత్మనః,
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్.

32

సుగ్రీవుని మేనమామ అయిన ఆ దదిముఖుడు వెంటనే మూర్ఛనుండి తేరుకొని, కోపంతో ఉగ్రుడై దండం చేతపట్టుకొని మధుపానంతో మత్తెక్కి ఉన్న వారులను చెదరగొట్ట యత్నించాడు.

28

వానరశ్రేష్ఠుడైన ఆ దదిముఖుడు మధుపానమత్తులైన ఆ వానర మూకనుండి ఎలాగో తప్పించుకొని, ఒక ఏకాంతమైన చోటుకు పారిపోయి అక్కడికి వచ్చిన తన అనుచరులతో ఇలా చెప్పాడు.

29

ఇక వీరి విషయం మనం పట్టించుకోవద్దు. రాముని వద్ద ఉన్న మన ప్రభుమా, వానరోత్తముడూ అయిన సుగ్రీవుని సన్నిధికి పోదాము.

30

అంగదుడు చేసిన అపరాధం యావత్తు రాజుకు పూసగుచ్చినట్లు తెలుపుతాను. నా మాటలు వినగానే కోపోద్రిక్తుడై అతడు ఈ వానరులందరినీ కఠినంగా శిక్షిస్తాడు.

31

ఈ మధువనం మహాత్ముడైన సుగ్రీవుడికి అమిత ఇష్టమైనది. దేవతలకు సైతం చొరరానిదైన ఈ వనం అతడికి తండ్రితాతలనుండి సంక్రమించింది.

32

స వానరానిమాన్ సర్వాన్ మధులుబ్ధాన్ గతాయుషః,
ఘాతయిష్యతి దణ్డేన సుగ్రీవః ససుహృజ్జనాన్.

33

వధ్యా హ్యేతే దురాత్మనో నృపాజ్ఞాపరిభావినః,
అమర్షప్రభవో రోషః సఫలో నో భవిష్యతి.

34

ఏవముక్త్వా దదిముఖో వనపాలాన్ మహాబలః,

జగామ సహసోత్పత్య వనపాలైః సమన్వితః.

35

నిమేషాన్తరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః,
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః.

36

రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ,
సమప్రతిష్ఠాం జగతీమాకాశాన్నిపపాత హ.

37

ఆ వానరులకు ఆయువుమూడి మధువు మీద దురాశ కలిగింది. మిత్రులతో సైతం ఈ వానరులందరికీ సుగ్రీవుడు తప్పక మరణదండన విధిస్తాడు.

33

రాజాజ్ఞను ఉల్లంఘించిన దురాత్ములైన ఈ వానరులు కచ్చితంగా వధార్హులే. సహించలేని మన కోపానికి తప్పక సార్థకత చేకూరుతుంది.

34

మహాబలశాలియైన ఆ దదిముఖుడు తన అనుచరులతో ఇలా చెప్పి, వారితో కలసి రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు.

35

రెండవ నిమిషంలో ఆ దదిముఖుడు సూర్యతనయుడూ, ధీమంతుడూ అయిన సుగ్రీవుడు ఉన్న చోటుకు చేరుకొన్నాడు.

36

రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, సుగ్రీవుణ్ణి చూసి ఆ దదిముఖుడు ఆకాశం నుండి సూటిగా ఒక సమతలమైన చోట అనుచరులతో దిగాడు.

37

సన్నిపత్య మహావీర్యః సర్వైస్తైః పరివారితః,
హరిర్దరిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః.

38

స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాంజలిమ్,
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ ప్రత్యపీడయత్.

39

మధువనపాలకుడూ, పరాక్రమశాలీ అయిన దదిముఖుడు అనుచరగణం తన చుట్టూ ఉండగా దీనవదనుడై, శిరమున చేతులు జోడించి, సుగ్రీవుని మంగళకరములైన పాదాలకు తన శిరస్సు తగిలేలా నమస్కరించాడు.

38–39

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 62వ సర్గ
సమాప్తం

63

వ సర్గ

కార్యసాఫల్యతను ఊహించిన సుగ్రీవుడు

తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః,
దృష్ట్వైవోద్విగ్నహృదయో వాక్యమేతదువాచ హ.

1

ఉత్తిష్ఠోత్తిష్ఠ కస్మాత్త్వం పాదయోః పతితో మమ,
అభయం తే భవేద్వీర సర్వమేవాభిధీయతామ్.

2

స తు విశ్వాసితస్తేన సుగ్రీవేణ మహాత్మనా,
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దదిముఖోఽబ్రవీత్.

3

తన పాదాల మీద శిరస్సు ఉంచి ప్రణమిల్లుతున్న దధిముఖుణ్ణి చూసి వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు ఆదుర్దాతో ఇలా పలికాడు.

1

ఓ వీరుడా లే! ఎందుకు ఇలా నా పాదాల మీద పడ్డావు? నీకు అభయమిస్తున్నాను. ఏం జరిగిందో నిర్మొహమాటంగా చెప్పు.

2

మహాత్ముడైన సుగ్రీవుని స్వాంతన వచనాలతో ఊరడిల్లిన వివేకవంతుడైన ఆ దదిముఖుడు లేచి నిలబడి వినమ్రంగా ఇలా విన్నవించాడు.

3

నైవర్క్షరజసా రాజన్న త్వయా నాపి వాలినా,
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః.

4

ఏభిః ప్రధర్షితాశ్చైవ వానరా వనరక్షిభిః,
మధూన్యచిన్తయిత్వేమాన్ భక్షయన్తి పిబన్తి చ.

5

శిష్టమత్రాపవిధ్యన్తి భక్షయన్తి తథాపరే,
నివార్యమాణాస్తే సర్వే భ్రువౌ వై దర్శయన్తి హి.

6

ఇమే హి సంరబ్ధతరాస్తథా త్రైః సంప్రధర్షితాః,
వారయన్తో వనాత్తస్మాత్ క్రుద్ధైర్వానరపుఙ్గవైః.

7

తతస్తైర్బహుభిర్వీర్వానరై ర్వానరర్షభః,
సంరక్తనయనైః క్రోధార్ధరయః ప్రవిచాలితాః.

8

ఓ రాజా! మధువనంలో ప్రవేశించడానికి కూడా వానర రాజులు ఎవ్వరికీ ఎన్నడూ అనుమతి ఒసగింది లేదు. నీ తండ్రి అయిన ఋక్షరజస్సుగాని, నువ్వుగాని, వాలిగాని స్వేచ్ఛగా మధువనాన్ని

అనుభవించడానికి అనుజ్ఞ ఇచ్చిందీ లేదు. అయినప్పటికీ వానరసేన ఇప్పుడు మధువనంలో ప్రవేశించి మధుభక్షణం చేసి దానిని ధ్వంసం చేసివేశారు.

4

వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఈ వనరక్షకులను కించిత్తుకూడా ఖాతరు చేయక మధుర ఫలములను ఎడాపెడా తింటూ, మధువులను యథేచ్ఛగా త్రాగివేస్తున్నారు.

5

కొందరు త్రాగినంత త్రాగి తక్కింది పారపోస్తున్నారు. మొత్తానికి అందరూ సమధికోత్సాహంతో విధ్వంసక చర్యలో పోటీపడుతున్నారు. వారించబోయిన మమ్మల్ని కనుబొమలు ఎగురవేసి బెదిరించారు.

6

ఈ వనరక్షకులు వారిని తరిమికొట్టడానికి ప్రయత్నించగా ఆ వానరవీరులు ఆగ్రహోదగ్రులై మన వనపాలురనే చావగొట్టి తరిమిగొట్టారు.

7

ఓ వానరరాజేంద్రా! అధిక సంఖ్యలో ఉన్న ఆ వానరవీరులు క్రోధావేశంతో కన్నులెర్రజేసి మన వనపాలురను విపరీతంగా బెదరగొట్టి భయపెట్టారు.

8

పాణిభిర్నిహతాః కేచిత్కేచిజ్జానుభిరాహతాః,
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః.

9

ఏవమేతే హతాః శూరాస్త్వయి తిష్ఠతి భర్తరి,
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే.

10

ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభం,
అపృచ్ఛత్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా.

11

కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః,
కం చార్థమభినిర్దిశ్య దుఃఖీతో వాక్యమబ్రవీత్.

12

ఏవముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా,
లక్ష్మణం ప్రత్యువాచేదం వాక్యం వాక్యవిశారదః.

13

ఆ వానరులు మన వనరక్షకులలో కొందరిని చేతులతో కొట్టారు, మరికొందరిని మోకాళ్ళతో కుమ్మి, నేల మీద బరబరా ఈడ్చి హింసించడమే కాక తమ అపాన ద్వారాలు చూపి అవమానపరిచారు.

9

సమస్త వానరులకూ నువ్వు రాజువు; అయినప్పటికీ ఆ వానరులు సాహసించి శూరులైన వనరక్షకులను చావబాది, విశృంఖలంగా మధువనాన్ని యావత్తు ధ్వంసం చేసివేశారు.

10

ఈ తీరులో దదిముఖుడు సుగ్రీవునికి విజ్ఞప్తి చేస్తూండగా, శత్రువీరసంహారకుడూ, ప్రాజ్ఞుడూ అయిన లక్ష్మణుడు, సుగ్రీవుణ్ణి ఇలా ప్రశ్నించాడు.

11

ఓ రాజా! వనపాలకుడైన ఈ వానరుడు నీ వద్దకు ఎందుకు వచ్చాడు? ఏ విషయం గురించి దుఃఖిస్తూ నీకు విజ్ఞప్తి చేస్తున్నాడు?

12

మహాత్ముడై లక్ష్మణుడు ఇలా ప్రశ్నించగా నేర్పుగా మాట్లాడగల సుగ్రీవుడు అందుకు ఇలా జవాబిచ్చాడు.

13

ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దదిముఖః కపిః,
అంగదప్రముఖైర్వీరైర్భక్షితం మధు వానరైః,
వనం యదభిపన్నాస్తే సాధితం కర్మ వానరైః.

14

దృష్టా దేవీ న సన్దేహో న చాన్యేన హనూమతా,
న హ్యన్య సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః.

15

కార్యసిద్ధిర్మతిశ్చైవ తస్మిన్ వానరపుఙ్గవే,
వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితమ్.

16

జామ్బవాన్ యత్ర నేతా స్యాదఙ్గదశ్చ మహాబలః,
హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా.

17

అఙ్గదప్రముఖైర్వీరైర్హతం మధువనం కిల,
విచిత్య దక్షిణామాశామాగతైర్హరిపుఙ్గవైః.

18

పూజ్యుడవైన ఓ లక్ష్మణా! అంగదుడు తదితర వానరవీరులు మధువనాన్ని ధ్వంసం చేశారని ఈ దదిముఖుడు నాకు చెప్పగోరుతున్నాడు. మధువనాన్ని చేరుకొన్నారంటే వారు కార్యాన్ని సాధించుకొనే వచ్చి ఉంటారని భావించవచ్చు.

హనుమంతుడు తప్పక సీతాదేవి జాడను కనుగొని ఉంటాడు. అందులో ఎలాంటి సందేహమూలేదు. ఇంకెవ్వరు అలా చెయ్యగలరు? ఈ కార్యాన్ని హనుమంతుడు కాక వేరెవరు సాధించగలరు?

15

వానరశ్రేష్ఠుడైన హనుమంతునిలో కార్యదక్షత, వివేకం, ప్రయత్న సామర్థ్యం, పరాక్రమం, శాస్త్రజ్ఞానం అన్నీ కొలువై ఉన్నాయి.

16

జాంబవంతుని నేతృత్వం, గొప్ప బలశాలియైన అంగదుని నాయకత్వం, హనుమంతుని నిర్దేశకత్వం వహించిన ఏ కార్యమైనా తప్పక సిద్ధిస్తుందేగాని మరోలా జరగడం అసంభవం.

17

సీతాన్వేషణార్థం దక్షిణ దిశకు అంగదుని నాయకత్వంలో వెళ్ళిన వానరవీరులు మధువనాన్ని ధ్వంసం చేసివేశారు.

18

నైషామకృత్యానామీదృశః స్యాదుపక్రమః,
ఆగతైశ్చ ప్రమథితం యథా మధువనం హి తైః,
ధర్షితం చ వనం కృత్స్నముపయుక్తం చ వానరైః.

19

వారయన్తశ్చ సహితాస్తథా జానుభిరాహతాః,
ఏతదర్థమయం ప్రాప్తో వక్తుం మధురవాగిహ,
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః.

20

దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః,
అభిగమ్య తథా సర్వే పిబన్తి మధు వానరాః.

21

న చాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ,
వనం దత్తవరం దివ్యం ధర్షయేయుర్వానౌకసః.

22

తిరిగివస్తున్న వానరులు మధువనాన్ని ధ్వంసం చేయడమన్నది దౌర్జన్యపూరిత చర్య. మధువు యావత్తు ఎలా వృథా అయిందో, వనం ఎలా నామరూపాలు లేకుండా సర్వనాశం అయిందో గదా! తమ విహితకార్యంలో విఫలురైన వారు ఇట్టి దుష్కార్యానికి ససేమిరా పూనుకొనరు.

19

అంతేకాదు, వారిని నివారించడానికి కలిసికట్టుగా వెళ్ళిన వనరక్షకులందరినీ మోకాళ్ళతో బలంగా పొడిచి, కుమ్మి బాధించారట. మధురభాషిగానూ, పరాక్రమవంతుడుగాను పేరుగాంచిన దదిముఖుడనే ఈ వానరుడు ఈ జరిగిన విషయాలు తెలియజేయడానికే ఇక్కడకు ఇప్పుడు వచ్చాడు.

20

మహావీరుడవైన ఓ లక్ష్మణా! ఇది దేనిని సూచిస్తుందో యోచించు. తిరిగి వస్తున్న యావన్మంది వానరులూ ఉల్లాసంగా మధువును గ్రోలుతున్నారు. వారు సీతాదేవిని కనుగొన్నారనడానికి ఇది కచ్చితమైన సూచన.

21

ఓ పురుషశ్రేష్ఠా! అలా కాకపోతే బ్రహ్మ వరంచే మాకు లభించినదీ, ఇతరులెవ్వరూ ప్రవేశింపరానిదీ అయిన మధువనాన్ని ఖ్యాతిగాంచిన ఆ వానర ప్రముఖులు ఎన్నటికీ ధ్వంసం చేసి ఉండరు.

22

తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణః సహ రాఘవః,
శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనాచ్చ్యుతామ్,
ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః.

23

శ్రుత్వా దదిముఖస్యేదం సుగ్రీవః సంప్రహృష్య చ,
వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత.

24

ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః,
మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్.

25

ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్
శాఖామృగాంస్తాన్ మృగరాజదర్పాన్,
ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం,
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్.

26

ఆ మాటలు వింటూ రామసహితుడూ, ధర్మాత్ముడూ అయిన లక్ష్మణుడు సంతోషించాడు. సుగ్రీవుని ముఖతా వెలువడి వీనులకు విందు చేసిన ఆ పలుకులు విని రాముడూ, మహాబలశాలియైన లక్ష్మణుడూ ఆనందభరితులయ్యారు.

23

వనపాలకుడైన దదిముఖుని నివేదికను ఆసాంతం విని సంప్రీతి చెందిన వాడైన సుగ్రీవుడు అతడితో ఇలా అన్నాడు.

24

కార్యసాధకులై తిరిగి వచ్చిన ఆ వానరులు మధువనంలోని ఫలాలను,

మధువును తనివితీరా సేవించడం నాకు ఎంతో సంతోషదాయకంగా ఉంది. కృతకృత్యులై వచ్చిన వారి దుందుడుకు చర్యలు క్షమించదగినవే కనుక మనస్ఫూర్తిగా వారిని క్షమించాను.

25

సింహపరాక్రములు, కార్యసాధకులు అయిన, హనుమంతుడు నాయకుడై ఉన్న ఆ వానరవీరులందరినీ వెంటనే చూడాలనీ, సీతాన్వేషణ ప్రయత్న విశేషాలు వినాలనీ రామలక్ష్మణులూ, నేనూ ఆతురత చెందుతున్నాం.

26

ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ
దృష్ట్వా సిద్ధార్థౌ వానరాణాం చ రాజా,
అంగైస్సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వోరాసన్నాం సోఽతిమాత్రం ననన్ద.

27

సీతాన్వేషణ ఫలించడంతో రామలక్ష్మణులు ఆనందంతో వికసిత నేత్రాలు గలవారై పులకితాంతరంగులయ్యారు. వానరరాజైన సుగ్రీవుడు వారిని చూసి ఇక కార్యసిద్ధి చేరువలోనే ఉందని గ్రహించి పట్టరాని ఆనందంతో తనూ పులకించిపోయాడు.

27

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 63వ సర్గ

సమాప్తం

64

వ సర్గ

కిష్కింధకు హనుమదాదుల రాక

సుగ్రీవేణైవముక్తస్తు హృష్టో దదిముఖః కపిః,
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్.

1

స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ,
వానరైః సహితః శూరైర్దివమేవోత్పపాత హ.

2

స యథైవాగతః పూర్వం తథైవ త్వరితం గతః,
నిపత్య గగనాద్భూమౌ తద్వనం ప్రవివేశ హ.

3

సుగ్రీవుని పలుకులు విన్న దదిముఖుడు సంతోషించి, రామలక్ష్మణులకు, సుగ్రీవునికి ప్రణమిల్లాడు.

1

వానరరాజైన సుగ్రీవునకు, మహాబలశాలురైన రామలక్ష్మణులకు నమస్కరించిన పిదప ఆ దదిముఖుడు శూరులైన తన అనుచరులతో ఆకాశంలోకి ఎగిరాడు.

2

మునుపు సుగ్రీవుని వద్దకు ఎంత వేగంగా తరలి వచ్చాడో అంతే వేగంగా ఆకాశమార్గంలో పయనించి దదిముఖుడు మధువనం చేరుకొన్నాడు.

3

స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్,
విమదానుత్థితాన్ సర్వాన్ మేహమానాన్ మధుదకమ్.

4

స తానుపాగమద్వీరో బద్ధ్వా కరపుటాంజలిమ్,
ఉవాచ వచనం శ్లక్ష్ణమిదం హృష్టవదంగదమ్.

5

సౌమ్య రోషో న కర్తవ్యో యదేభిరభివారితః,
అజ్ఞానాద్రక్షిభిః క్రోధాద్భవన్తః ప్రతిషేధితాః.

6

యువరాజస్యమీశశ్చ వనస్యాస్య మహాబల,
మౌర్ఖ్యత్ పూర్వం కృతో దోషస్తం భవాన్ క్షన్తుమర్హతి.

7

ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య తవానఘ,
ఇహోపయాతం సర్వేషామేతేషాం వనచారిణామ్.

8

అప్పుడు అతడు మత్తు దిగిపోయిన, మధూదకములను (గ్రోలిన మధువులోని జల భాగములు) మూత్రరూపంలో విసర్జిస్తున్న వానరవీరులను అక్కడ చూశాడు.

వీరుడైన ఆ దదిముఖుడు ఆ వానరవీరుల వద్దకు వెళ్ళి సంతోషంతో చేతులు జోడించి అంగదుడితో మృదుమధురంగా ఇలా పలికాడు.

5

సౌమ్యుడవైన ఓ రాకుమారా! అజ్ఞానం వలన కోపానికి వశవర్తులై ఈ వనరక్షులు మిమ్మల్ని అడ్డగించడానికి ప్రయత్నించారు. వారి ఈ అనాలోచిత చర్యకు దయచేసి కోపింపకు.

6

నువ్వు యువరాజువు, ఈ వనానికి అధిపతివి. మూర్ఖత్వంతో నీ పట్ల చేసిన తప్పులను దయచేసి మన్నించి మమ్మల్ని క్షమించు.

7

దోషరహితుడవైన ఓ అంగదా! నేను వెళ్ళి మీ పినతండ్రి అయిన సుగ్రీవునకు వానరులందరూ తిరిగి వచ్చిన సమాచారం తెలియజేశాను.

8

స త్వదాగమనం శ్రుత్వా సహైభిర్హరియూథపైః,
ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్.

9

ప్రహృష్టో మాం పితృవ్యస్తే సుగ్రీవో వానరేశ్వరః,
శీఘ్రం ప్రేషయ సర్వాంస్తానితి హోవాచ పార్థివః.

10

శ్రుత్వా దదిముఖస్యేదం వచనం శ్లక్ష్ణమబ్రదః,
అబ్రవీత్తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః.

11

శజ్ఞే శ్రుతోఽయం వృత్తాన్తో రామేణ హరియూథపాః,

తత్ క్షమం నేహ నః స్థాతుం కృతే కార్యే పరంతపాః.

12

పీత్వా మధు యథాకామం విశ్రాన్తా వనచారిణః,
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః.

13

ఈ వీరులైన వానరులతో కలసి నువ్వు తిరిగి వచ్చావని తెలిసి ఆయన చాలా సంతోషించాడు. కనుక మధువనం ధ్వంసం అవడం పట్ల ఆయన కించిత్తు కూడా కోపగించుకోలేదు.

9

నీ పినతండ్రీ, వానరరాజూ అయిన సుగ్రీవుడు ఆనందపారవశ్యంలో మిమ్మల్నందరినీ తక్షణమే తన వద్దకు పంపించమని నాకు ఆదేశమిచ్చాడు.

10

ప్రసన్నత ఉట్టిపడే దదిముఖుని పలుకులు విని, ఆదేశాలను అవగతం చేసుకోవడంలో కుశలుడైన ఆ అంగదుడు తన అనుచరులతో ఇలా చెప్పాడు.

11

ఓ వానరనాయకులారా! మనం తిరిగి వచ్చిన వార్త రాముని చెవిన పడి ఉంటుందని భావిస్తున్నాను. ఓ విజేతలైన యోధులారా! అనవసరమైన వినోదాలలో పాల్గొని కాలయాపన చెయ్యడం సబబు కాదు.

12

ఓ వానరులారా! అందరూ తనివితీరా మధువు గ్రోలి తగినంత విశ్రాంతి పొందారు. ఇక ఇక్కడ మనకు ఏం పని? ఎంతమాత్రం ఆలస్యం లేకుండా వెంటనే మనం నా పినతండ్రి సుగ్రీవుని వద్దకు వెళ్ళాలి.

13

సర్వే యథా మాం వక్ష్యన్తి సమేత్య హరియూథపాః,
తథాస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవానహమ్.

14

నాజ్ఞాపయితుమీశోఽహం యువరాజోఽస్మి యద్యపి,
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా.

15

బ్రువతశ్చాంగదస్యైవం శ్రుత్వా వచనమవ్యయమ్,
ప్రహృష్టమనసో వాక్యమిదమూచుర్వనౌకసః.

16

ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభుః సన్ వానరర్షభ,
ఐశ్వర్యమదమత్తో హి సర్వోఽహమితి మన్యత్.

17

తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్,
సన్నిధిర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్.

18

ఓ వానరనాయకులారా! మీ నిర్ణయానికి అధీనుణ్ణి, అందరూ కలసి పర్యాలోచన చేసి కర్తవ్యం నిర్ణయించండి. అట్లే చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

14

దుస్సాధ్యమైన కార్యంలో విజయులైన మిమ్మల్ని ఆదేశించడం నాకు భావ్యం కాదు. నేను యువరాజునే అయినప్పటికీ మిమ్మల్ని శాసించే హక్కు నాకు లేదని భావిస్తున్నాను.

15

అంగదుడు నమ్రతతో పలికిన మాటలు విని వానరులందరూ సంతోషించి ఇలా బదులిచ్చారు.

16

వానరశ్రేష్ఠుడవైన ఓ యువరాజా! ప్రభువు అయిన వాడు నువ్వు తప్ప ఎవరు ఇలా వినమ్రతతో మాట్లాడతాడు? సామాన్యంగా ఐశ్వర్య మత్తతలో అహంకరించే ఉంటాడు గదా!

17

ఇంత వినయంగా మాట్లాడడం నీకే చెల్లుతుంది. మరొకరెవరూ ఇలా మాట్లాడలేరు. నీ ఈ వినమ్రత భవిష్యత్తులో నీకు చేకూరబోయే అభ్యుదయాన్ని సూచిస్తోంది.

18

సర్వే వయమపి ప్రాప్తాస్తత్ర గన్తుం కృతక్షణాఃా,
స యత్ర హరివీరాణాం సుగ్రీవం పతిరవ్యయఃా.

19

త్వయా హ్యనుక్తైర్హరిభిర్నైవ శక్యం పదాత్పదమ్,
క్వచిద్గన్తుం హరిశ్రేష్ఠ బ్రూమఃా సత్యమిదం తు తే.

20

ఏవం తు వదతాం తేషామఙ్గదఃా ప్రత్యభాషత,
బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతుర్మహాబలాఃా.

21

ఉత్పతన్తమనూత్పేతుఃా సర్వే తే హరియూథపాా,
కృత్వాకాశం నిరాకాశం యన్త్రోత్క్షిప్తా ఇవాచలాఃా.

22

తేఽమ్బరం సహసోత్పత్య వేగవన్తః ప్లవఙ్గమాఃׁ,
వినదన్తో మహానాదం ఘనా వాతేరితా యథా.

23

గొప్ప కార్యనిర్వాహక సమర్థతగల వానరరాజైన సుగ్రీవుని సన్నిధికి వెళ్ళడానికి మేమందరమూ నీ ఆదేశం నిమిత్తం వేచి ఉన్నాం.

19

ఓ వానరోత్తమా! నీ ఆదేశం లేకుండా ఇక్కడి వానరులెవ్వరూ ఒక్క అడుగు కూడా ఏ దిశలోనూ ముందుకు వెయ్యరు. ఇది ముమ్మాటికీ సత్యం.

20

వానరులు అలా పలుకగానే అంగదుడు వెంటనే బయలుదేరమని వారితో చెప్పాడు. తక్షణమే మహాబలవంతులైన ఆ వానరులందరూ ఒక్కుమ్మడిగా ఆకాశంలోకి ఎగిరారు.

21

ఒడిసెల నుండి రువ్వబడిన రాళ్ళ మల్లే ఆ వానర యోధులు ఒకరి వెంట ఒకరుగా ఆకాశానికి అడ్డంగా పయనిస్తూ, ఆకాశాన్ని పూర్తిగా కనబడకుండా క్రమ్మివేశారు.

22

అత్యంత వేగంతో ఆకాశంలో పయనిస్తున్న ఆ వానరుల కదలికల వలన జనించిన గొప్ప ధ్వని మేఘాల కదలికల వలన ఏర్పడే ఉరుమువంటి ధ్వనిని పోలి ఉన్నది.

23

అఙ్గదే సమనుప్రాప్తే సుగ్రీవో వానరాధిపఃׁ,
ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్.

24

సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః,
నాగన్తుమిహ శక్యం తై రతీతే సమయే హి నః.

25

న మత్సకాశమాగచ్ఛేత్ కృత్యే హి వినిపాతితే,
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరోఽఙ్గదః.

26

యద్యపక్కృతకృత్యానామీదృశః స్యాదుపక్రమః,
భవేత్ స దీనవదనో భ్రాన్తవిప్లుతమానసః.

27

పితృపైతామహం చైతత్ పూర్వకైరభిరక్షితమ్,
న మే మధువనం హన్యదహృష్టః ప్లవగేశ్వరః,
కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత.

28

అంగదుడు అతడి బృందం తమను సమీపిస్తుండగా, వానర రాజైన సుగ్రీవుడు దుఃఖమగ్నుడైన పద్మాలవంటి కన్నులు గల రామునితో ఇలా అన్నాడు.

24

ఓ రామా! దుఃఖం నుంచి తేరుకో. శుభ ఘడియలు ఆసన్నమయ్యాయి. సీతాదేవి కనిపించింది. దాన్లో ఎటువంటి సందేహమూ లేదు. అలా కాకుంటే తిరిగి రావడానికి వారికి విధించిన కాల గడవును ససేమిరా మీరి ఉండేవారు కాదు.

25

మహాబాహుమా, వానరశ్రేష్ఠుడూ, యువరాజూ అయిన అంగదుడు కార్యసాఫల్యత ఒనగూరుకుంటే నా వద్దకు అసలు రానేరాడు.

26

ఒకవేళ వానరులు కార్య సాధనలో విఫలురై తిరిగి వచ్చి ఉండే పక్షంలో అంగదుడు దీనవదనుడై భ్రాంతిచే కలతచెందినవాడై ఉండేవాడు.

27

అంగదుడు ఆనందంతోనూ, సమధికోత్సాహంతోనూ ఉండి ఉండనట్లయితే, మా తాతముత్తాతల కాలం నుండి చక్కగా పెంచి పోషిస్తున్న ఆ మధువనాన్ని ధ్వంసం చేసి ఉండేవాడు కాడు. కౌసల్యాదేవికి ఆనందం చేకూర్చే నియమనిష్ఠలు పాటించే ఓ రామా! ఊరడిల్లు.

28

దృష్టా దేవీ న సన్దేహో న చాన్యేన హనూమతా,
న హ్యన్యః కర్మణో హేతుః సాధనేఽస్య హనూమతః.

29

హనూమతి హి సిద్ధిశ్చ మతిశ్చ మతిసత్తమ,
వ్యవసాయశ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువమ్.

30

జామ్బవాన్ యత్ర నేతా స్యాదఙ్గదశ్చ బలేశ్వరః,
హనుమాంశ్చప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా,
మా భూశ్చిన్తాసమాయుక్తః సంప్రత్యమితవిక్రమ.

31

తతః కిలకిలాశబ్దం శుశ్రావాసన్నమమ్బరే,
హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్,
కిష్కిన్ధాముపయాతానాం సిద్ధిం కథయతామివ.

32

హనుమంతుడు తప్పక సీతాదేవి జాడను కనుగొని ఉంటాడు. అందులో ఎలాంటి సందేహమూ లేదు. ఇంకెవ్వరు అలా చెయ్యగలరు? ఈ కార్యాన్ని హనుమంతుడు కాక వేరెవరు సాధించగలరు?

29

ప్రజ్ఞాశీలివైన ఓ రామా! సూర్యునిలో తేజస్సు కొలువుదీరినట్లు హనుమంతునిలో కార్యదక్షత, వివేకమూ, నిరంతర ప్రయత్నమూ, పరాక్రమమూ అనే లక్షణాలు పుష్కలంగా వెల్లివిరిసి ఉన్నాయి.

30

జాంబవంతుని నేతృత్వం, గొప్ప బలశాలియైన అంగదుని సేనానాయకత్వం, హనుమంతుని నిర్దేశకత్వం వహించిన కార్యం ఏదైనా తప్పక సిద్ధిస్తుందేగాని మరోలా జరగడం అసంభవం. కాబట్టి పరాక్రమానికి మారుపేరైన ఓ రామా! ఇక నువ్వు చింతింపనక్కర్లేదు.

31

ఇంతలో హనుమంతుడు సాధించిన దుస్సాధ్య కార్యానికి గర్వించి అతిశయంతో ఎలుగెత్తి అరుస్తూ తమ కార్యసిద్ధిని ప్రకటిస్తున్న చందాన కిష్కింధకు చేరువ అవుతున్న వానరుల కిలకిలా శబ్దం ఆకాశంలో మార్మోగుతూ వినవచ్చింది.

32

తతః శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః,
ఆయతాఞ్చితలాఙ్గూలః సోఽభవద్ధృష్టమానసః.

33

ఆజగ్ముస్తేఽపి హరయో రామదర్శనకాంక్షిణః,
అఙ్గదం పురతః కృత్వా హనూమన్తం చ వానరమ్.

34

తేఽఙ్గదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః,
నిపేతుర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ.

35

హనుమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః,
నియతామక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్.

36

దృష్టా దేవీతి హనుమద్వదనాదమృతోపమమ్,
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః.

37

వానరులు చేస్తున్న ఆ కోలాహలం విని వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు పరమానందంతో తన తోకను వీపు మీద నిటారుగా నిలబెట్టాడు.

33

వానరోత్రములైన అంగదుడు, హనుమంతుడు ముందుండగా రాముని దర్శించాలనే ఆతురతతో ఉన్న వానరవీరులు నేల మీద దిగారు.

34

అంగదాది మహా వానరవీరులు ఆనందపారవశ్యంలో తేలిపోతూ ఆకాశం నుండి సుగ్రీవుని, శ్రీరాముని ముందు దిగారు.

35

వెంటనే గొప్ప భుజస్కంధములు గల హనుమంతుడు, రామునికి శిరసా ప్రణామం చేసి, 'ప్రాతివ్రత్య నియమాన్ని రక్షించుకొంటూ సీతాదేవి క్షేమంగా ఉంది' అని తెలిపాడు.

36

హనుమంతుని నోట జాలువారిన సీతాదేవి కనిపించినది అనే

అమృతంలాంటి మాట విని రామలక్ష్మణులు ఆనందభరితులయ్యారు.

37

నిశ్చితార్థస్తతస్తస్మిన్ సుగ్రీవః పవనాత్మజే,
లక్షణః ప్రీతిమాన్ ప్రీతం బహుమానాదవైక్షత.

38

ప్రీత్యా చ రమమాణోఽథ రాఘవః పరవీరహా,
బహుమానేన మహతా హనుమంతమవైక్షత.

39

మొదటినుండి హనుమంతుడే కార్యాన్ని సాధించి ఉంటాడని గట్టి నమ్మకం వ్యక్తం చేసిన సుగ్రీవుని, లక్ష్మణుడు గౌరవాదరాలతో చూశాడు.

38

అప్పుడు శత్రువీరసంహారకుడైన రాముడు మేరమీరిన ఆనందంలో ఓలలాడుతూ అత్యంత ఆదరభావంతో హనుమంతుణ్ణి సాదరంగా చూశాడు.

39

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 64వ సర్గ
సమాప్తం

65

వ సర్గ

చూడామణి సమర్పణ

తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననమ్,
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్.

1

యువరాజం పురస్కృత్య సుగ్రీవమభివాద్య చ,
ప్రవృత్తిమథ సీతాయాః ప్రవక్తుముపచక్రముః.

2

రావణాన్తఃపురే రోదం రాక్షసీభిశ్చ తర్జనమ్,
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః,
ఏతదాఖ్యాన్తి తే సర్వే హరయో రామసన్నిధౌ.

3

దట్టమైన అరణ్యాలతో కూడుకొన్న ప్రస్రవణ పర్వతం మీదకు వెళ్ళి, యువరాజైన అంగదుణ్ణి ముందు ఉంచుకొని ఆ వానరులు రామునకు, మహాపరాక్రమవంతుడైన లక్ష్మణునకు సాష్టాంగంగా నమస్కరించి, సుగ్రీవునికి ప్రణమిల్లారు. తరువాత సీతాదేవి వృత్తాంతాన్ని తెలియజేయ నారంభించారు.

1–2

రావణాంతఃపురంలో సీతాదేవి నిర్బంధింపబడిన వైనాన్ని, రాక్షసస్త్రీలు సదా ఆమెను భయపెట్టి బెదిరిస్తూ ఉండడాన్ని, రాముడి పట్ల ఆమె చెక్కుచెదరని భక్త్యానురాగాలతో ఉండడాన్ని, రావణుడు ఇచ్చిన రెండు నెలల గడువు గురించీ ఆ వానరులందరూ ముక్తకంఠంతో రామునికి తెలియజేశారు.

3

వైదేహిమక్షతాం శ్రుత్వా రామస్తూత్తరమబ్రవీత్,
క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే,
ఏతన్మే సర్వమాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః.

4

రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ,
చోదయన్తి హనూమన్తం సీతావృత్తాన్తకోవిదమ్.

5

శ్రుత్వా తు వచనం తేషాం హనుమాన్ మారుతాత్మజః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి,
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా.

6

సముద్రం లంఘయిత్వాహం శతయోజనమాయతమ్,
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా.

7

సీతాదేవి క్షేమసమాచారం వినగానే రాముడు 'ఓ వానరులారా! సీత ప్రస్తుతం ఎక్కడ ఉంది? నా పట్ల ఆమె వైఖరి ఏమిటి? సీతకు సంబంధించిన సంగతులన్నీ విపులంగా చెప్పండి?' అని వారిని అడిగాడు.

4

రాముడు అడిగిన ప్రశ్నలు విని సీతా వృత్తాంతాన్ని ప్రత్యక్షంగా

తెలుసుకున్న హనుమంతుణ్ణి, రాముని ముందుకు వచ్చి వివరాలు చెప్పమని వానరులు ప్రోత్సహించారు.

5

వానరుల ప్రోత్సాహానికి స్పందించిన వాయునందనుడైన ఆ హనుమంతుడు, ముందుగా సీత ఉన్న దక్షిణ దిక్కు వైపుకు తిరిగి, శిరస్సు వంచి ఆమెకు నమస్కరించాడు. తరువాత వాక్చతురుడైన ఆ వానరశ్రేష్ఠుడు తాను సీతాదేవి దర్శించిన వైనాన్ని ఇలా చెప్ప నారంభించాడు.

6

సీతాదేవిని ఎలాగైనా దర్శించాలనే ఆకాంక్షతో నా అన్వేషణలో నూరు యోజనాల వెడల్పు ఉన్న సముద్రాన్ని లంఘించాను.

7

తత్ర లంకేతి నగరీ రావణస్య దురాత్మనః,
దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే.

8

తత్ర దృష్టా మయా సీతా రావణాన్తఃపురే సతీ,
సన్న్యస్య త్వయి జీవన్తీ రామా రామ మనోరథమ్.

9

దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీభిర్విరూపాభీ రక్షితా ప్రమదావనే.

10

దుఃఖమాసాద్యతే దేవీ తథాఽదుఃఖోచితా సతీ,
రావణాన్తఃపురే రుద్ధా రాక్షసీభిః సురక్షితా,
ఏకవేణీధరా దీనా త్వయి చిన్తాపరాయణా.

11

అథఃశయ్య వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే,
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
దేవీ కథంచిత్ కాకుత్థ్స త్వన్మనా మార్గితా మయా.

12

అక్కడ దక్షిణ సముద్రపు దక్షిణ తీరంలో దురాత్ముడైన రావణుని లంకానగరం వెలసి ఉంది.

8

అక్కడ రావణుని అంతఃపురంలో పతివ్రతాశిరోమణి అయిన సీతాదేవిని చూశాను. ఓ రామా! ఆ సాధ్వి తన మనస్సంతా నీ మీదనే లగ్నంచేసి జీవిస్తోంది.

9

రావణుని ఉద్యానంలో వికృతరూపిణులైన రాక్షసస్త్రీల కావలిలో, వారిచే పదేపదే భయపెట్టబడుతూ, బెదిరింపబడుతూ ఉన్న సీతాదేవిని నేను చూశాను.

10

కించిత్తు దుఃఖంకూడా అనుభవించదగని ఆ పతివ్రత ఇప్పుడు పూర్తిగా దుఃఖంలో మునిగిపోయి ఉంది. రావణాంతఃపురంలో ఆమె నిర్బంధంలో ఉంది. తైల సంస్కారం లేనందున ఆమె కేశాలు జడకట్టి ఉన్నవి. అహర్నిశలూ ఆమె నీ ధ్యానంలోనే ఉన్నది. కటిక నేల మీద శయనిస్తూ, శిశిర ఋతువులోని పద్మలత మల్లే కాంతివిహీనయై ఆమె కానవచ్చింది. రావణుని పట్ల పరాఙ్ముఖయై దేహత్యాగం చేయడానికి కూడా నిశ్చయించుకొన్నది. ఇంతటి విషమ పరిస్థితిలో సైతం ఓ రామా! నీ మీదనే మనస్సును నిలిపి నిన్నే ధ్యానిస్తూ ఉన్న ఆ సీతాదేవిని అతికష్టం మీద అన్వేషించి చూడగలిగాను.

11–12

ఇక్ష్వాకుకుల విఖ్యాతిం శనైః కీర్తియతాఽనఘ,
సా మయా నరశార్దూల విశ్వాసముపపాదితా.

13

తతః సంభాషితా దేవీ సర్వమర్థం చ దర్శితా,
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా,
నియతః సముదాచారో భక్తిశ్చాస్యాస్తథా త్వయి.

14

ఏవం మయా మహాభాగా దృష్టా జనకనన్దినీ,
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ.

15

దోషరహితుడమా, నరులలో ఉత్తమోత్తముడమా అయిన ఓ రామా! ఇక్ష్వాకు వంశ ఖ్యాతిని మెల్లగా కీర్తిస్తూ ఆమెకు నా పట్ల నమ్మకం కలిగించ గలిగాను.

13

తరువాత ఆమెతో మాట్లాడి సమస్త విషయాలు విశదంగా తెలియజేశాను. రామసుగ్రీవుల మధ్య గాఢస్నేహం కలిగిందనే విషయం విని ఆమె ఎంతగానో సంతోషించింది. పాతివ్రత్య నియమపాలన, నీ పట్ల భక్త్యనురాగాలు చెక్కుచెదరక ఆమెలో స్థిరంగా నెలకొని ఉన్నవి.

14

ఓ పురుషశ్రేష్ఠా! నీ పట్ల అచంచల భక్తి అనే కఠోర తపస్సులో లీనమై ఉన్న మహాభాగ్యవంతురాలూ, జనకమహారాజు కుమార్తె అయిన సీతాదేవిని నేను చూశాను.

15

అభిజ్ఞానం చ మే దత్తం యథా వృత్తం తవాన్తికే,

చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ.

16

విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా,
అఖీలేనేహ యద్దృష్టమితి మామాహ జానకీ.

17

అయం చాస్మై ప్రదాతవ్యో యత్నాత్ సుపరిరక్షితః,
బ్రువతా వచనాన్నేవం సుగ్రీవస్యోపశృణ్వతః.

18

ఏష చూడామణిః శ్రీమాన్ మయా సుపరిరక్షితః,
మనఃశిలాయాస్తిలకో గణ్డపార్శ్వే వివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి.

19

సర్వజ్ఞుడవైన ఓ రామా! చిత్రకూటంలో మీరు ఉంటున్నప్పుడు జరిగిన కాక వృత్తాంతాన్ని నేనామెను చూసినట్లు గుర్తుగా నీకు జ్ఞాపకం చెయ్యమన్నది.

16

ఓ వాయునందనా! నువ్వు ఇక్కడ చూసింది యావత్తు పురుషశ్రేష్ఠుడైన రామునకు నివేదించు – అని జానకీదేవి నాతో చెప్పింది.

17

సుగ్రీవుని సమక్షంలో ఈ మాటలన్నీ చెప్పి నేను ఎంతో పదిలంగా కాపాడుకొంటున్న ఈ చూడామణిని రామునకు అందించి నా మాటగా ఇలా చెప్పు.

18

శ్రీమంతమైన ఈ చూడామణిని ఇప్పటి వరకు చాలా జాగ్రత్తగా సంరక్షించాను. గతంలో ఒక రోజు చమటపట్టి నా నుదుట తిలకం చెదిరిపోయింది. అది చూసి నువ్వు వెంటనే మణిశిలను అరగదీసి బొట్టుగా పెట్టబోయి, అంతలో వేడుకగా నా చెక్కిలి మీద దిద్దావు. ఈ విషయం గుర్తుచేసుకో.

19

ఏష నిర్యాతితిః శ్రీమాన్ మయా తే వారిసంభవః,
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వామివానఘ.

20

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ,
ఊర్ధ్వం మాసాన్న జీవేయం రక్షసాం వశమాగతా.

21

ఇతి మామబ్రవీత్ సీతా కృశాంగీ ధర్మచారిణీ,
రావణాన్తఃపురే రుద్ధా మృగీవోత్ఫుల్లలోచనా.

22

ఏతదేవ మయాఖ్యాతం సర్వం రాఘవ యద్యథా,
సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్.

23

ఆనందాన్ని కలిగించే ప్రభావంగల జలనిధిలో జన్మించిన ఈ చూడామణిని ఆనవాలుగా నీకు పంపిస్తున్నాను. ఓ దోషరహితుడా! దుఃఖ సమయాలలో దీనిని చూసుకొంటూ నిన్ను చూసినట్లే సంతోషపడుతూ వచ్చాను.

20

ఓ రామా! నేను ఇంకొక్క మాసం కాలం మాత్రమే జీవించి ఉంటాను.

రాక్షసుల అధీనంలో ఉన్న నేను మాసం గడచిన తరువాత జీవించి ఉండను.

21

రావణాంతఃపురంలో బందీయై, పతివ్రతాధర్మాన్ని తు.చ. తప్పక పాటిస్తూ, కృశించిపోయిన, ఆడలేడి వలె వికసించిన నేత్రాలు గల సీతాదేవి నాతో ఈ విధంగా చెప్పింది.

22

ఓ రామా! జరిగినదంతా యథాతథంగా నీకు విన్నవించాను. సముద్రం మీద వారధి నిర్మింప నువ్వు ఆదేశమివ్వాలని భావిస్తున్నాను.

23

తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా
తచ్ఛాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ,
దేవ్యా చాఖ్యాతం సర్వమేవానుపూర్వ్యా
ద్వాచా సంపూర్ణం వాయుపుత్రః శశంస.

24

తన మాటలతో రామలక్ష్మణులు స్వాంతన చెందారని గ్రహించిన హనుమంతుడు, సీతాదేవి ఆనవాలుగా తనకు ఇచ్చిన చూడామణిని రామునకు సమర్పించాడు. తరువాత మొదట నుండి జరిగినది యావత్తు క్రమం తప్పకుండా పూసగుచ్చినట్లు రామునికి తెలిపాడు.

24

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 65వ సర్గ

సమాప్తం

66

వ సర్గ

రాముని విలాపం

ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః,
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః.

1

తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవః శోకకర్శితః,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవమిదమబ్రవీత్.

2

యథైవ ధేనుః స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా,
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్.

3

లక్ష్మణ సమేతుడైన రాముడు, హనుమంతుని మాటలన్నీ ఆసాంతం విని ఆ చూడామణిని తన హృదయానికి హత్తుకుని రోదించాడు.

1

అద్భుతమైన ఆ మణిని చూడగానే రాముని నేత్రాలు సజలపూరితం కాగా, దాచుకోలేని మానసిక వ్యధతో సుగ్రీవునితో ఇలా అన్నాడు.

2

లేగదూడ పట్ల వాత్సల్యం గల ఆవు, దూడను చూడగానే క్షీరమును చేపు విధంగా ఈ ఉత్కృష్టమైన మణిని చూడగానే నా హృదయం ద్రవిస్తూన్నది.

3

మణిరత్నమిదం దత్తం వైదేహ్యాః శ్వశురేణ మే,
వధూకాలే యథాబద్ధమధికం మూర్ధ్ని శోభతే.

4

అయం హి జలసంభూతో మణిః సజ్జనపూజితః,
యజ్ఞే పరమతుష్టేన దత్తః శక్రేణ ధీమతా.

5

ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్,
అద్యాస్మ్యవగతః సౌమ్య వైదేహస్య తథా విభోః.

6

అయం హి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్నిమే మణిః,
అస్యాద్య దర్శనేనాహం ప్రాప్తాం తామివ చిన్తయే.

7

కిమాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునః పునః,
పిపాసుమివ తోయేన సించంతీ వాక్యవారిణా.

8

మా మామగారైన జనకమహారాజు ఈ అద్భుత మణిని సీతకు కానుకగా ఇచ్చారు. మా వివాహసమయంలో ఆమె ఈ మణిని తన శిరస్సున ధరించినప్పుడు దాని అందమూ ఆకర్షణా ఎన్నోరెట్లు ఇనుమడించాయి.

జలం నుండి ఉద్భవించినదీ, సజ్జనుల పూజలు అందుకొన్నదీ అయిన ఈ మణిని జనకమహారాజు చేసిన ఒక యజ్ఞానికి ఆనందభరితుడై దేవేంద్రుడు ఆయనకు దీనిని బహూకరించాడు.

5

సౌమ్యుడవైన ఓ సుగ్రీవా! ఈ మణి శ్రేష్ఠాన్ని చూడగానే నా తండ్రిగారిని, పూజ్యుడైన జనకమహారాజును చూసినట్లు నాకు అనిపిస్తోంది.

6

నా ప్రియురాలైన సీత శిరస్సున ధరించినప్పుడే ఈ మణి శోభలు ద్విగుణీకృతమౌతాయి. దీనిని చూడగానే ఆమె లభించినట్లే భావిస్తున్నాను.

7

ఓ హనుమా! సీత ఏమన్నదో మరోసారి నాకు చెప్పు. దప్పికగొన్న వానికి నీరులా ఆమె పలుకులు నాకు సేదతీరుస్తాయి.

8

ఇతస్తు కిం దుఃఖతరం యదిమం వారిసంభవమ్,
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీమాగతాం వినా.

9

చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి,
క్షణం సౌమ్య న జీవేయం వినా తామసితేక్షణామ్.

10

నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా,
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తిముపలభ్య చ.

11

కథం సా మమ సుశ్రోణీ భీరుభీరుః సతీ సదా,

భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్.

12

శారదస్తిమిరోన్ముక్తో నూనం చన్ద్ర ఇవామ్బుదైఃr,
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైఃr.

13

లక్ష్మణా! సీతను చూడక ఆమె ధరించిన ఈ మణిని మాత్రమే చూడవలసి రావడంకన్నా దుఃఖం కలిగించేది ఏముంటుంది?

9

సీత ఇక ఒక మాసం మాత్రమే జీవించగలదు అంటే నిజానికి ఆమె చిరకాలం జీవించినట్లుగా భావించాలి. సౌమ్యుడివైన ఓ లక్ష్మణా! నల్లని కన్నులు గల ఆ సీతను ఎడబాసి ఇక నేను క్షణం కూడా జీవించి ఉండలేను.

10

ఓ హనుమా! నాకు అత్యంత ప్రీతిపాత్రురాలైన సీతను ఎక్కడ చూశావో అక్కడకు నన్ను తోడ్కొని వెళ్ళు. ఆమె ప్రస్తుత పరిస్థితి, ఉనికి తెలిశాక ఇక క్షణం కూడా ఇక్కడ నిలువలేను.

11

సహజంగా భయస్థురాలూ, సుందరాంగీ అయిన నా ప్రియమైన సీత భయంకరులూ క్రూరులూ అయిన ఆ రాక్షసుల మధ్య ఎలా ఉండగలుగుతోందో గదా!

12

శరత్కాల చంద్రబింబం వంటి ఆమె వదనం నా గురించిన వార్త విన్నప్పుడు ప్రకాశించి ఉంటుంది; మళ్ళీ ఆమె చుట్టూ ఉన్న రాక్షసులనే మేఘాలచే ఆవృతమైనప్పుడు మసగబారి ఉంటుంది.

13

కిమాహ సీతా హనుమంస్తత్త్వతః కథయాద్య మే,
ఏతేన ఖలు జీవిష్యే భేషజేనాతురో యథా.

14

మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ,
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే.

15

ఓ హనుమంతుడా! సీత ఇంకా ఏం చెప్పిందో, ఏదీ దాచక యథాతథంగా చెప్పు. ఔషధ సేవనం వలన రోగి బ్రతికి బట్టకట్టే విధంగా ఆమె పలికిన మాటలు విని నా ప్రాణాలు నిలబెట్టుకొంటాను.

14

మధురస్వభావీ, మధురభాషీ, సౌందర్యవతీ, నా వియోగ దుఃఖంలో ఉన్నదీ అయిన సీత ఇంకా ఏమన్నదో ఓ హనుమంతుడా! నాకు ఉన్నది ఉన్నట్లు చెప్పు.

15

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 66వ సర్గ
సమాప్తం

67

వ సర్గ

సీతా సందేశ నివేదన

ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా,
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే.

1

ఇదముక్తవతీ దేవీ జానకీ పురషర్షభ,
పూర్వవృత్తమభిజ్ఞానం చిత్రకూటే యథాతథమ్.

2

సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వముత్థితా,
వాయసః సహసోత్పత్య విదదార స్తనాన్తరే.

3

మహాత్ముడైన రాముడు అలా పలుకగానే హనుమంతుడు, సీతాదేవి సందేశాన్ని యావత్తు విపులంగా ఇలా ఆయనకు తెలియజేశాడు.

1

ఓ పురుషోత్తమా! పూర్వం చిత్రకూటంలో జరిగిన ఒక సంఘటనను సీతాదేవి, ఒక గుర్తుగా నాకు విపులంగా చెప్పింది.

2

ఒక రోజు నీ చెంత సుఖంగా నిద్రపోయి ఆమె నీ కన్నా ముందు మేల్కొన్నది. అప్పుడు ఒక పొగరుబోతు కాకి హఠాత్తుగా ఆమె స్తనముల మధ్య గోళ్ళతో గీరిందట.

3

పర్యాయేణ చ సుప్తస్త్వం దేవ్యంకే భరతాగ్రజ,
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్.

4

పునః పునరుపాగమ్య విదదార భృశం కిల,
తతస్త్వం బోధితస్తస్యాః శోణితేన సముక్షితః.

5

వాయసేన చ తేనైవ సతతం బాధ్యమానయా,
బోధితః కిల దేవ్యా త్వం సుఖసుప్తః పరంతప.

6

తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాన్తరే,
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్శ్వసన్నభ్యభాషథాః.

7

నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాన్తరమ్,
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా.

8

భరతాగ్రజుడవైన ఓ రామా! తరువాత నీవు ఆమె ఒడిలో తల ఉంచి నిద్రించావట. ఇంతలో మళ్ళీ ఆ కాకి వచ్చి అదే చోట గీరి ఆమెకు బాధ కలిగించిందట.

ఆ కాకి పదేపదే వచ్చి ఆమెను గాయపరచడంతో, గాయం నుండి స్రవించిన రక్తం నీ మీద పడి నువ్వు మేల్కొన్నావట.

5

శత్రుసంహారకుడవైన ఓ రామా! ఆ కాకి ఎడతెరపి లేకుండా గాయపరచి బాధిస్తూ ఉంటే, ఇక సహించలేక సుఖంగా నిద్రిస్తున్న నిన్ను సీతాదేవి నిద్రలేపిందట.

6

ఓ మహాబాహూ! స్తనముల మధ్య గాయంతో ఉన్న ఆమెని చూడగానే నువ్వు ఆగ్రహోదగ్రుడవై, రెచ్చిపోయిన సర్పంలా బుసకొట్టుతూ ఇలా అన్నావట.

7

భయస్థురాలైన ఓ సీతా! నీ స్తనాల మధ్యప్రదేశంలో గోళ్ళతో గాయపరచింది ఎవడు? తారాస్థాయి కోపంతో రగిలిపోతున్న ఐదు పడగల మహాసర్పంతో ఈ విధంగా ఆడుకోవడానికి సాహసించిన వాడెవడు?

8

నిరీక్షమాణః సహసా వాయసం సమవైక్షథాః,
నఖైః సరుధిరైస్తీక్ష్ణైస్తామేవాభిముఖం స్థితమ్.

9

సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాన్తరచరః శీఘ్రం పవనస్య గతౌ సమః.

10

తతస్తస్మిన్ మహాబాహో కోపసంవర్తితేక్షణః,
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర.

11

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రహ్మాస్త్రేణ హ్యయోజయః,
స దీప్త ఇవ కాలాగ్నిర్జజ్వాలాభిముఖః ఖగమ్.

12

క్షిప్తవాంస్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి,
తతస్తు వాయసం దీప్తః స దర్భోఽనుజగామ హ.

13

నువ్వు వెంటనే ఇటు అటూ కలయచూడగా, రక్తసిక్తమైన వాడి గోళ్ళుతో ఆమెకు ఎదురుగా కాస్తదూరంలో నిలబడి ఉన్న ఆ కాకి కంటపడిందట.

9

ఆ కాకి ఇంద్రుని కుమారుడట. పక్షులలో శ్రేష్ఠుడట. వాయువేగంతో సంచరించగలడట. అతడు వెంటనే భూగర్భంలో దాక్కొన్నాడట.

10

శౌర్య వివేకాలకు ఆలవాలమైన ఓ రామా! అప్పుడు నువ్వు ఆ కాకి పట్ల ఆగ్రహోదగ్రుడవై దానిని శిక్షింప ప్రచండమైన తీర్మానం చేశావట.

11

వెంటనే నువ్వు దర్భాసనం నుండి ఒక దర్భను తీసి దానిని బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించావట. అప్పుడు బ్రహ్మాస్త్రాన్ని సంతరించుకొన్న ఆ దర్భ ప్రళయకాలాగ్నిలా కాకికి అభిముఖమై చండప్రచండంగా ప్రజ్వలించ సాగిందట.

12

ప్రజ్వలిస్తున్న బ్రహ్మాస్త్రాన్ని సంతరించుకొన్న ఆ దర్భను నువ్వు ఆ కాకిమీద ప్రయోగించగా, ఆ మహాస్త్రం పెనుమంటలను సృష్టిస్తూ ఆ కాకిని వెంటనంటి తరిమిందట.

13

స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి.

14

పునరేవాగతస్త్రస్తస్త్వత్సకాశమరిందమ,
స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్,
వధార్హమపి కామత్థ్స కృపయా పర్యపాలయః.

15

మోఘమస్త్రం నశక్యం తు కర్తుమిత్యేవ రాఘవ,
భవాంస్తస్యాక్షి కాకస్య హనస్తి స్మ స దక్షిణమ్.

16

రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ,
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వమాలయమ్.

17

మూడు లోకాలూ చుట్టు తిరిగినప్పటికీ ఆ కాకిని దేవతలుగాని, మహర్షులు కాని చివరికి ఆ కాకి తండ్రి అయిన దేవేంద్రుడు సైతం ఆ మహాస్త్రం బారినుండి రక్షించలేకపోయారట. ముల్లోకాలలో దానికి రక్షకులు ఎవ్వరూ లభించలేదట.

14

కాకుత్థ్స వంశజుడమా, శత్రుసంహారకుడమా అయిన ఓ రామా! ఆ కాకి ప్రాణరక్షణకై నీ వద్దకే తిరిగి వచ్చినదట. అప్పుడు శరణాగత వత్సలుడవైన నువ్వు, శరణుకోరి నేలపై పడి మ్రొక్కిన ఆ కాకి వధింపదగినదే అయినప్పటికీ దానిని కనికరించి రక్షించావట.

15

రామా! తిరుగులేని ఆ బ్రహ్మాస్త్రం వ్యర్థం కారాదని భావించిన నువ్వు ఆ కాకి కుడికంటిని నిర్మూలించితివట.

16

ఓ రామా! అలా చావు తప్పి కన్నులొట్టపోయిన ఆ కాకి నీకూ, దశరథ మహారాజుకూ కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించి, తన నివాసానికి వెళ్ళి పోయిందట.

17

ఏవమస్త్ర విదాం శ్రేష్ఠః సత్త్వవాన్ శీలవానపి,
కిమర్థమస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః.

18

నా నాగా నాపి గన్ధర్వా నాసురా న మరుద్గణాః,
న చ సర్వే రణే శక్తా రామం ప్రతి సమాసితుమ్.

19

తస్య వీర్యవతః కశ్చిద్యద్యస్తి మయి సంభ్రమః,
క్షిప్రం సునిశితైర్బాణైర్హన్యతాం యుధి రావణః.

20

భ్రాతురాదేశమాజ్ఞాయ లక్ష్మణో వా పరంతపః,
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః.

21

శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజశౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః.

22

సీతాదేవి పై వృత్తాంతం చెప్పి, ఇలా అంది: ఈ తీరులో అస్త్రవేత్తలలో

సర్వశ్రేష్ఠుడూ, మహాశక్తిమంతుడూ, శీలసంపన్నుడూ అయిన రాముడు ఈ రాక్షసుల మీద ఆస్త్రప్రయోగం చేయకుండా ఎందుకు ఉపేక్షిస్తున్నాడు?

18

నాగులు, గంధర్వులు, అసురులు, దేవతాగణాలు విడివిడిగా గాని లేదా యావన్మందీ కలసికట్టుగాగాని రణరంగంలో రాముని ఎదుర్కొని నిలబడలేరు.

19

మహాపరాక్రమవంతుడైన రామునకు నా పట్ల ఇసుమంత అయినా అక్కర ఉంటే తన తీక్ష్ణమైన బాణాలచే రావణుని అంతమొందించాలి గదా!

20

శత్రుసంహారీ, నరోత్తముడూ, రఘువంశ సంజాతుడూ అయిన ఆ లక్ష్మణుడు ఏ కారణంచే అన్నగారి అనుజ్ఞ తీసుకొని నన్ను రక్షింప ప్రయత్నించడం లేదు?

21

అగ్ని వాయుదేవులకు దీటైన శక్తి, తేజస్సులను సంతరించుకొన్న పురుషశ్రేష్ఠులైన ఆ ఇద్దరినీ దేవతలు సైతం ఎదుర్కోలేరు. అంతటి శౌర్యప్రతాపాలు ఉండి కూడా వారెందుకు నా పట్ల తాత్సారమూ, ఉపేక్షా వహిస్తున్నారు?

22

మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః,
సమర్థౌ సహితౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ.

23

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్,
పునరప్యహమార్యాం తామిదం వచనమబ్రవమ్.

24

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే.

25

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
అస్మిన్ముహూర్తే దుఃఖానామన్తం ద్రక్ష్యసి భామిని.

26

తావుభౌ నరశార్దూలౌ రాజపుత్రావనిన్దితౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః.

27

నేనేదో మహాపాపానికి ఒడిగట్టి ఉంటాను. అందులో ఎటువంటి సందేహమూ లేదు. కాబట్టే శత్రువులను అలవోకగా పరిమార్చడంలో సమర్థులైనప్పటికీ వారు నా దుస్థితిని పట్టించుకోకున్నారు.

23

కన్నీరుమున్నీరై సీతాదేవి పలికిన ఆ దయనీయమైన మాటలు విని, నేను ఆ పూజ్యురాలితో మళ్ళీ ఇలా పలికాను.

24

ఓ దేవీ! నీ వియోగ శోకాన్ని భరించలేని రాముడు ఏ ఇతర విషయంలోనూ గూడుకట్టుకొన్న నిరుత్సాహాన్ని వ్యక్తంచేస్తున్నాడు. సత్యం మీద శపథం చేసి చెబుతున్నాను రాముని దుఃఖం చూసి లక్ష్మణుడు కూడా దుఃఖంలో మునిగి ఉన్నాడు.

25

పూజ్యురాలైన ఓ సీతాదేవీ! మా అదృష్టం వలన ఎట్టకేలకు నీవు

కనిపించావు. ఇది దుఃఖించాల్సిన సమయం కాదు. నీ దుఃఖాల అంతం కనుచూపుమేరలోనే ఉంది.

26

మహాబలసంపన్నులూ, రాజపుత్రులూ, పురుషులలో సర్వశ్రేష్ఠులూ, నిన్ను ఎప్పుడు చూడగలమా అని తహతహ చెందుతున్న వారూ అయిన ఆ రామలక్ష్మణులు ఈ లంకను దగ్ధం చేసివేయడం తథ్యం.

27

హత్వా చ సమరే రౌద్రం రావణం సహబాన్ధవమ్,
రాఘవస్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువమ్.

28

యత్తు రామో విజానీయాదభిజ్ఞానమనిన్దితే,
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వమిహార్హసి.

29

సాభివీక్ష్య దిశః సర్వా వేణ్యుద్గ్రథనముత్తమమ్,
ముక్త్వా వస్త్రాద్దదౌ మహ్యం మణిమేతం మహాబల.

30

ప్రతిగృహ్య మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ,
శిరసా తాం ప్రణమ్యార్యామహ మాగమనే త్వరే.

31

గమనే చ కృతోత్సాహమవేక్ష్య వరవర్ణినీ,
వివర్ధమానం చ హి మామువాచ జనకాత్మజ.

32

అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసందిగ్ధభాషిణీ,

మమోత్పతనసంభ్రాన్తా శోకవేగసమాహతా.

33

ఓ సీతాదేవీ! త్వరలోనే ఆగ్రహోదగ్రుడైన రాముడు రణరంగంలో పుత్ర మిత్ర బంధు వర్గాలతో సహా ఆ రావణుని వధించి నిన్ను ఆదరంతో అయోధ్యకు తోడ్కొని వెళతాడు. దీన్లో ఎలాంటి సందేహమూ లేదు.

28

పూజనీయురాలా! నేను నివేదించబోయే విషయాల్లోని నిజాన్ని రూఢిపరచుకొనే నిమిత్తమూ, దానితోపాటు రాముడు వెంటనే గుర్తించి ఆనందపడగల వస్తువును ఏదైనా ఆనవాలుగా నాకు ప్రసాదించు.

29

అపరిమిత పరాక్రమవంతుడైన ఓ రామా! ఆమె నలువంకలా పరికించి, ఎవరూ తనను చూడడం లేదని నిర్ధారించుకొని, జడలో ధరించే ఈ అమూల్యమైన చూడామణిని తన చీరకొంగు ముడివిప్పి నాకు ఇచ్చింది.

30

ఓ రఘురామా! ఆ దివ్యమణిని నీకు ఆనవాలుగా చూపడానికై తీసుకొని, పూజ్యురాలైన ఆమెకు శిరస్సు వంచి నమస్కరించి తిరిగి వెళ్ళే హడావిడిలో ఉన్నాను.

31

తిరుగు ప్రయాణానికి సన్నాహంగా శరీరాన్ని అంచెలంచెలుగా పెంచుతున్న నన్ను చూసి, తనను ఒంటరిని చేసి నేను పోతున్నాననే దిగులుతో దీనురాలైన సీతాదేవి కళ్ళనీళ్ళపర్యంతమైంది. డగ్గుత్తికతో మాటలు తడబడుతూండగా ఆమె నాతో ఇలా అంది.

32–33

హనుమన్ సింహసంకాశావుభౌ తౌ రామలక్ష్మణౌ,

సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్.

34

యథా చ స మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాంబ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి.

35

ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గతః సమీపమ్
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర.

36

ఓ హనుమా! సింహపరాక్రములైన రామలక్ష్మణుల, సుగ్రీవుని, ఆతని మంత్రిసత్తముల తదితరులందరి క్షేమం విచారించానని చెప్పు.

34

మహాబాహువైన రాముడు నన్ను దుఃఖసముద్రం నుండి ఉద్ధరించడానికి చేపట్టవలసిన చర్యల పథక రచన విషయం నువ్వు చూడు.

35

ఓ వానరోత్తమా! రాముని వద్దకు వెళ్ళగానే నేను ఇక్కడ అనుభవిస్తున్న అంతులేని దుఃఖాన్ని, ఈ రాక్షసస్త్రీలు బెదిరిస్తూ నన్ను బాధిస్తున్న వైనాన్ని గురించి నువ్వు ఆయనతో చెప్పు. నీ తిరుగు ప్రయాణం సుఖప్రదంగా జరుగుగాక!

36

ఏతత్తవార్యా నృపరాజసింహ
సీతా వచః ప్రాహ విషాదపూర్వమ్,
ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం

శ్రద్ధత్స్వ సీతాం కుశలాం సమగ్రామ్.

37

ఓ రాజాధిరాజా! పూజనీయురాలైన సీతాదేవి దుఃఖిస్తూ నీకు చెప్పమన్న మాటలన్నీ విన్నవించాను. ఈ మాటల మూలంగా సీతాదేవి క్షేమంగా ఉందని నీవు గ్రహించి ఉంటావు. ఈ వ్యవహారంలో తదుపరి కర్తవ్యం గూర్చి నీవే నిర్ణయించు.

37

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 67వ సర్గ
సమాప్తం

68

వ సర్గ

సీతకు సాంత్వన

అథాహముత్తరం దేవ్యా పునరుక్తం ససంభ్రమమ్,
తవ స్నేహాన్నరవ్యాఘ్ర సౌహార్దాదనుమాన్య వై.

1

ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథిస్త్వయా,
యథా మామాప్నుయాచ్ఛీఘ్రం హత్వా రావణమాహవే.

2

యది వా మన్యసే వీర వసైకాహమరిందమ,
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి.

3

హనుమంతుడు ఇలా కొనసాగించాడు: పురుషులలో సర్వశ్రేష్ఠుడవైన ఓ రామా! తరువాత సీతాదేవి నీ పట్లగల ప్రేమానురాగాల వలన, బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న నాకు తదుపరి ఏం చెయ్యాలో సూచించింది.

1

దశరథనందనుడైన రాముడు, రావణుని వధించి నన్ను తిరిగి తోడ్కొనిపోయే తక్షణ చర్యలు చేపట్టే రీతిలో నువ్వే ఆయనతో సకారాత్మకంగా

మాట్లాడు.

2

శత్రువులను అంతంచేసే మహావీరుడా! నీకు అభ్యంతరం లేకపోతే ఒక రోజు ఇక్కడే ఉండి ఏదైనా రహస్య ప్రదేశంలో విశ్రాంతి తీసుకొని రేపు బయలుదేరు.

3

మమ చాప్యల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్తవ వీర్యవన్,
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్.

4

గతే హి త్వయి విక్రాన్తే పునరాగమనాయ వై,
ప్రాణానామపి సన్దేహో మమ స్యాన్నాత్ర సంశయః.

5

తవాదర్శనజః శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్.

6

అయం చ వీర సన్దేహస్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర.

7

కథం ను ఖలు దుష్పారం తరిష్యన్తి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరనరాత్మజౌ.

8

ఓ శౌర్యవంతుడా! నువ్వు నా సమీపంలో ఉండడం వలన మందభాగ్యురాలనైన నాకు దుఃఖం నుండి కించిత్తు అయినా ఊరట

కలుగుతుంది.

4

పరాక్రమవంతుడవైన నువ్వు వెళ్ళి తిరిగి వచ్చేవరకు నా ప్రాణాలు నిలిచి ఉంటాయో లేదో అనే సంశయం ఉంది. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు.

5

దుఃఖం వెంట దుఃఖం అనుభవిస్తూ కేవలం దుఃఖాలు అనుభవించడానికే పుట్టినట్లున్న దీనురాలనైన నాకు, నువ్వు కనిపించకపోవడంతో దుఃఖం ఇంకా పెరిగిపోవడం తథ్యం.

6

మహావీరుడవైన ఓ కపివర్యా! నీకు సహాయకులైన వానర భల్లూక సమూహాల విషయంలో ఒక ముఖ్యమైన సందేహం నా మనస్సులో తచ్చాడుతున్నది.

7

నువ్వు ప్రస్తావించిన వానర భల్లూక సైన్యాలు దాటడానికి శక్యంగాని అపారమైన ఆ మహాసముద్రాన్ని ఎలా దాటి వస్తాయి? రాజపుత్రులైన ఆ రామలక్ష్మణులు మాత్రం ఎలా దాటిరాగలరు?

8

త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే,
శక్తి స్యాద్వైనతేయస్య తవ నా మారుతస్య వా.

9

తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాం వర.

10

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్ను యశస్యస్తే బలోదయః.

11

బలైః సమగ్రైర్యది మాం హత్వా రావణమాహవే,
విజయీ స్వాం పురీం రామో నయేత్తత్స్యాద్యశస్కరమ్.

12

యథాహం తస్య వీరస్య వనాదుపధినా హృతా,
రక్షసా తద్భయాదేవ తథా నార్హతి రాఘవః.

13

గరుత్మంతుడు, నువ్వు, వాయుదేవుడు – కేవలం ఈ ముగ్గురు మాత్రమే, దాటశక్యంగాని ఆ మహాసముద్రాన్ని దాటగల సమర్థులు.

9

ఓ వీరాగ్రేసరా! కష్టసాధ్యమైన ఈ కార్యాన్ని సఫలీకృతం గావించడానికి ఏం ఉపాయం యోచించావో చెప్పు. ఎందుకంటే కార్యసాధకులలో నీదే కదా అగ్రతాంబూలం!

10

శత్రుసంహారకుడవైన ఓ హనుమా! ఈ మహత్కార్యాన్ని సాధింప నువ్వొక్కడివే చాలుననడం నిర్వివాదాంశం. ఈ కార్యసాధన వలన నీ కీర్తి ఇనుమడిస్తుంది.

11

రాముడు సైన్యసమేతంగా ఇక్కడకు వచ్చి రణరంగంలో రావణుని స్వయంగా తానే సంహరించి, విజయుడై నన్ను తన నగరానికి తోడ్కొని వెళ్ళడం ఆయనకు యశస్కరం.

12

మహావీరుడైన రాముని ముఖాముఖీ ఎదుర్కోవడానికి భయపడి రాక్షసుడైన రావణుడు కపటోపాయంతో నన్ను అపహరించి తెచ్చాడు. ఇప్పుడు యుద్ధంలో శత్రువులను సంహరించకుండా నన్ను గోప్యంగా తోడ్కొని వెళితే రాముని వీరత్వానికి అది ఎంతమాత్రం సముచితంగా ఉండదు.

13

బలైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సస్తత్తస్య సదృశం భవేత్.

14

తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవత్యాహవశూరస్య తథా త్వముపసాదయ.

15

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్యాహం తతః శేషం వాక్యముత్తరమబ్రవమ్.

16

దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవః సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః.

17

తస్య విక్రమ సంపన్నాః సత్త్వవన్తో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః.

18

శత్రుసేనలను అంతమొందించే రాముడు తన సేనలతో లంకను అతలాకుతలం చేసి నన్ను తనతో తోడ్కొని వెళ్ళడమనే కార్యకలాపం ఆయన స్థాయికి సముచితమై ఒప్పారుతుంది.

కాబట్టి మహాత్ముడూ, శూరాగ్రేసరుడూ అయిన రాముని సాటిలేని పరాక్రమానికి తగ్గట్లు కార్యాచరణ జరిగేటట్లు చూడు.

15

అర్థవంతమైన, వినయం ఉట్టిపడే, యుక్తియుక్తమైన ఆమె ఆ పలుకులు విని నేను ఇలా ప్రత్యుత్తరమిచ్చాను.

16

వానర భల్లూక సైన్యాలకు నాయకుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన సుగ్రీవుడు ఓ దేవీ! ఎలాగైనా నిన్ను ఆదుకోవాలని కృతనిశ్చయుడై ఉన్నాడు.

17

పరాక్రమ సంపన్నులు, శ్రమను ఖాతరు చేయనివారు, మహాబలశాలురు, తలచిన మాత్రాన ఇట్టే ఎక్కడకైనా వెళ్ళగలవారు, దృఢనిర్ణయమూ పట్టుదలా గల కోకొల్లలైన వానరులు సుగ్రీవుని ఆజ్ఞానువర్తులై ఉన్నారు.

18

యేషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,
న చ కర్మసు సీదన్తి మహత్త్వమితతేజసః.

19

అసకృత్తైర్మహాభాగైర్వానరై ర్పలదర్పితైః,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః.

20

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకపః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ.

21

అహం తావదిహప్రాప్తః కిం పునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరే జనాః.

22

తదలం పరితాపేన దేవి మన్యుర్వ్యపైతు తే,
ఏకోత్పాతేన వై లంకామేష్యన్తి హరియూథపాః.

23

వారి గమనానికి నేల మీదగాని, ఆకాశంలోగాని అడ్డూ అదుపూ లేదు. అమిత తేజస్సంపన్నులైన వారు ఎంతటి కష్టసాధ్యమైన కార్యాన్ని అయినా అనాయాసంగా చెయ్యగలరు.

19

బలగర్వితులూ, వాయుమార్గాన సంచరించగలవారూ అయిన ఆ వానరులు అనేకమార్లు ఆకాశమార్గంలో భూప్రదక్షిణం చేసి వచ్చారు.

20

సుగ్రీవుని వద్ద ఉన్న వానరభల్లూక వీరులలో నా కన్నా ఘనులైన వారు అనేకులున్నారు; నాతో సమానులైన వారు చాలామంది ఉన్నారు. కాని నాకన్నా తక్కువ సామర్థ్యం గలవారు మచ్చుకి ఒక్కడు కూడా లేడు.

21

ఏ పని మీదనైనా ముందుగా సామాన్యులనే పంపడం లోక రివాజు. అటువంటి సామాన్యుడనైన నేనే ఇక్కడకు రాగలిగానంటే నాకన్నా ఘనులైన వానరవీరుల సంగతి వేరేగా చెప్పాలా?

22

అమ్మా, సీతాదేవీ! అందువల్ల అనుమానం పెట్టుకొని పరితాపం చెందకు. దుఃఖానికి స్వస్తి పలుకు. మహావీరులైన వానరులు ఒక్క గెంతులో సముద్రాన్ని దాటి లంకలో వాలగలరు.

23

మమ పృష్ఠగతౌ చ చన్ద్రసూర్యావివోదితౌ,
త్వత్సకాశం మహాభాగే నృసింహావాగమిష్యతః.

24

అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వారముపస్థితమ్.

25

నఖదంష్ట్రాయుధాన్వీరాన్ సింహశార్దూల విక్రమాన్,
వానరాన్వారణేన్ద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్.

26

శైలామ్బుదనికాశానాం లంకామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామచిరాచ్ఛ్రోష్యసి స్వనమ్.

27

నివృత్తవనవాసం చ త్వయా సార్ధమరిందమమ్,
అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్.

28

మహాభాగ్యశాలినివైన ఓ సీతాదేవీ! పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులు నా భుజాలమీద ఆసీనులై, ఉదయించిన సూర్యచంద్రుల చందాన ప్రకాశిస్తూ నీ వద్దకు రాగలరు.

24

శత్రుసంహారకుడూ, సింహపరాక్రముడూ అయిన రాముని, ధనుస్సును చేత దాల్చిన లక్ష్మణుని సత్వరమే లంకాద్వారం వద్ద నువ్వు చూడగలవు.

25

పరిమాణంలో అతిపెద్ద ఏనుగులంతటి వారు, పరాక్రమంలో సింహాలను పులులను మించిన వారు, గోళ్ళు కోరలే ఆయుధాలుగా గలవారు అయిన వానరవీరులు తండోపతండాలుగా ఇక్కడకు రావడం ఓ సీతాదేవీ! నువ్వు త్వరలోనే చూడగలవు.

26

కొండలంతటి, మేఘాలంతటి పరిమాణాలలో ఉన్న వానరవీరులు లంకానగరంలోనూ, మలయపర్వత చరియలలోనూ చేసే సింహనాదాలు నువ్వు త్వరలో విననున్నావు.

27

శత్రువులను రూపుమాపి, వనవాస దీక్ష పూర్తిచేసుకొని అయోధ్య చేరుకొని రాముడు నీతోకూడా పట్టాభిషిక్తుడు కావడం త్వరలోనే నువ్వు చూడడం తథ్యం.

28

తతో మయా వాగ్భిరదీనభాషిణా
శివాభిరిష్టాభిరభిప్రసాదితా,
జగామ శాన్తిం మమ మైథిలాత్మజా
తవాపి శోకేన తదాభిపీడితా.

29

ఆమె ఎడబాటు వలన కలిగిన శోకంలో నువ్వు ఉన్నావని వినడంతో ఆమె మరింతగా దుఃఖించింది. అప్పుడు నేను సముచితములైన, సంప్రీతికరములైన పలుకులతో ఆమెను ఊరడిల్లజేయగా ఆమె దుఃఖం ఒకింత ఉపశమించి కొంతమేరకు ఆమె సాంత్వన పొందింది.

29

శ్రీమద్వాల్మీకి రామాయణమున సుందరకాండలోని 68వ సర్గ

సమాప్తం సుందరకాండ సమాప్తం

శ్రీరామపట్టాభిషేక ఘట్టం

తత స్స ప్రయతో వృద్ధో వశిష్ఠో బ్రాహ్మణైస్సహ,
రామం రత్నమయే పీఠే సహసీతం న్యవేశయత్.

1

వశిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః,
కాత్యాయనస్సుయజ్ఞశ్చ గౌతమో విజయస్తథా.

2

అభ్యషిఞ్చన్నరవ్యాఘ్రం ప్రసన్నేన సుగన్ధినా,
సలిలేన సహప్రాక్షం వసవో వాసవం యథా.

3

ఋత్విగ్భిర్బ్రాహ్మణైః పూర్వం కన్యాభిర్మన్త్రిభిస్తథా,
యోధైశ్చైవాభ్యషిఞ్చంస్తే సంప్రహృష్టాస్సనైగమైః.

4

సర్వౌషధిరసైర్దివ్యైర్దివతైర్నభసి స్థితైః,
చతుర్భిర్లోకపాలైశ్చ సర్వైర్దేవైశ్చ సంగతైః.

5

ఛత్త్రం తు తస్య జగ్రాహ శత్రుఘ్నః పాణ్డురం శుభమ్,
శ్వేతం చ వాలవ్యజనం సుగ్రీవో వానరేశ్వరః.

6

అపరం చన్ద్రసంకాశం రాక్షసేన్ద్రో విభిషణః,
మాలాం జ్వలన్తీం వపుషా కాఞ్చనీం శతపుష్కరామ్.

7

రాఘవాయ దదౌ వాయుర్వాసవేన ప్రచోదితః,
సర్వరత్నసమాయుక్తం మణిరత్నవిభూషితమ్.

8

ముక్తాహారం నరేన్ద్రాయ దదౌ శక్రప్రచోదితః,
ప్రజగుర్దేవగన్ధర్వా ననృతుశ్చాప్సరోగణాః.

9

అభిషేకే తదర్హస్య తదా రామస్య ధీమతః,
భూమిస్సస్యవతీ చైవ ఫలవన్తశ్చ పాదపాః.

10

గన్ధవన్తి చ పుష్పాణి బభూమా రాఘవోత్సవే,
సహస్రశతమశ్వానాం ధేనూనాం చ గవాం తథా.

11

దదౌ శతం వృషాన్పూర్వం ద్విజోభ్యో మనుజర్షభః,
త్రింశత్కోటీర్హిరణ్యస్య బ్రాహ్మణేభ్యో దదౌ పునః.

12

నానాభరణవస్త్రాణి మహార్హాణి చ రాఘవః,
అర్కరశ్మిప్రతీకాశాం కాఞ్చనీం మణివిగ్రహామ్.

13

సుగ్రీవాయ స్రజం దివ్యాం ప్రాయచ్ఛన్మనుజర్షభః,
వైడూర్యమణిచిత్రే చ వజ్రరత్నవిభూషితే.

14

వాలిపుత్త్రాయ ధృతిమానఙ్గదాయాఙ్గదే దదౌ,
మణిప్రవరజుష్టం చ ముక్తాహారమనుత్తమమ్.

15

సీతాయై ప్రదదౌ రామశ్చన్ద్రరశ్మిసమప్రభమ్,
అరజే వాససీ దివ్యే శుభాన్యాభరణాని చ.

16

అవేక్షమాణా వైదేహీ ప్రదదౌ వాయుసూనవే,
అవముచ్యాత్మనః కణ్ఠాద్ధారం జనకనన్దినీ.

17

అవైక్షత హరీన్ సర్వాన్భర్తారం చ ముహూర్ముహుః,
తామిఙ్గితజ్ఞస్సంప్రేక్ష్య బభాషే జనకాత్మజామ్.

18

ప్రదేహి సుభగే! హారం యస్య తుష్టాసి భామిని!,
పౌరుషం విక్రమో బుద్ధిర్యస్మిన్నేతాని సర్వశః.

19

దదౌ సా వాయుపుత్త్రాయ తం హారమసితేక్షణా,
హనుమాంస్తేన హారేణ శుశుభే వానరర్షభః.

20

చన్ద్రాంశుచయగౌరేణ శ్వేతాభ్రేణ యథాఽచలః,
తతో ద్వివిదమైన్దాభ్యాం నీలాయ చ పరంతపః.

21

సర్వాన్కామగుణాన్వీక్ష్య ప్రదదౌ వసుధాధిపః,
సర్వవానరవృద్ధాశ్చ యే చాన్యే వానరేశ్వరాః.

22

వాసోభిర్భూషణైశ్చైవ యథార్ధం ప్రతిపూజితాః,
విభీషణోఽథ సుగ్రీవో హనుమాన్జామ్బవాంస్తథా.

23

సర్వవానరముఖ్యాశ్చ రామేణాక్లిష్టకర్మణా,
యథార్హం పూజితాస్సర్వైః కామై రత్నైశ్చ పుష్కలైః.

24

ప్రహృష్టమనసస్సర్వే జగ్ముర్దేవ యథాగతమ్,
దృష్ట్వా సర్వే మహాత్మానం తతస్తే ప్లవగర్షభాః.

25

విసృష్టాః పార్థివేన్ద్రేణ కిష్కిన్ధామభ్యుపాగమన్,

సుగ్రీవో వానరశ్రేష్ఠో దృష్వా రామాభిషేచనమ్.

26

లబ్ధ్వా కులధనం రాజా లఙ్కాం ప్రాయాద్విభీషణః,
స రాజ్యమఖీలం శాసన్నిహతారిర్మహాయశాః.

27

రాఘవః పరమోదారశ్శశాస పరయా ముదా,
ఉవాచ లక్ష్మణం రామో ధర్మజ్ఞం ధర్మవత్సలః.

28

ఆతిష్ఠ ధర్మజ్ఞ! మయా సహేమాం
గాం పూర్వరాజాధ్యుషితాం బలేన,
తుల్యం మయా త్వం పితృభిర్ధృతా యా
తాం యౌవరాజ్యే ధురముద్వహస్వ.

29

సర్వాత్మనా పర్యనునీయమానో
యదా న సౌమిత్రిరుపైతి యోగమ్,
నియుజ్యమానోఽపి చ యౌవరాజ్యే
తతోఽభ్యషిఞ్చద్భరతం మహాత్మా.

30

పౌణ్డరీకాశ్వమేధాభ్యాం వాజపేయేన చాసకృత్,
అన్యైశ్చ వివిధైర్యజ్ఞైరయజత్పార్థివర్షభః.

31

రాజ్యం దశసహస్రాణి ప్రాప్య వర్షాణి రాఘవః,
శతాశ్వమేధానాజహ్రే సదశ్వాన్భూరిదక్షిణాన్.

32

ఆజానులమ్బబాహుస్స మహాస్కన్ధః ప్రతాపవాన్,

లక్ష్మణానుచరో రామః పృథివీమన్వపాలయత్.

33

రాఘవశ్చాపి ధర్మాత్మా ప్రాప్య రాజ్యమనుత్తమమ్,
ఈజే బహువిధైర్యజ్ఞైస్సుహృద్జ్ఞాతిబాన్ధవః.

34

న పర్వదేవన్విధవా న చ వ్యాళకృతం భయమ్,
న వ్యాధి జం భయం వాపి రామే రాజ్యం ప్రశాసతి.

35

నిర్దస్యురభవల్లోకో నానర్థః కంచిదస్పృశత్,
న చ స్మ వృద్ధా బాలానాం ప్రేతకార్యాణి కుర్వతే.

36

సర్వం ముదితమేవసీత్సర్వో ధర్మపరోఽభవత్,
రామమేవానుపశ్యన్తో నాభ్యహింసన్పరస్పరమ్.

37

ఆసన్వర్షసహస్రాణి తథా పుత్రసహస్రిణః,
నిరామయా విశోకాశ్చ రామే రాజ్యం ప్రశాసతి.

38

రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః,
రామభూతం జగదభూద్రామే రాజ్యం ప్రశాసతి.

39

నిత్యపుష్పా నిత్యఫలాస్తరవస్స్కన్ధవిస్తృతాః,
కాలే వర్షీ చ పర్జన్యస్సుఖస్పర్శశ్చ మారుతః.

40

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రా లోభవివర్జితాః,
స్వకర్మసు ప్రవర్తన్తే తుష్టాస్స్వైరేవ కర్మభిః.

41

ఆసన్ప్రజా ధర్మరతా రామే శాసతి నానృతాః,
సర్వే లక్షణసంపన్నాస్సర్వే ధర్మపరాయణాః.

42

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ,
భ్రాతృభిస్సహితః శ్రీమాన్రామో రాజ్యమకారయత్.

43

ధన్యం యశస్యమాయుష్యం రాజ్ఞాం చ విజయావహమ్,
ఆదికావ్యమిదం త్వార్షం పురా వాల్మీకినా కృతమ్.

44

యః పఠేచ్ఛృణుయాల్లోకే నరః పాపాద్విముచ్యతే,
పుత్రకామస్తు పుత్రాన్వై ధనకామో ధనాని చ.

45

లభతే మనుజో లోకే శ్రుత్వా రామాభిషేవచనమ్,
మహీం విజయతే రాజా రిపూంశ్చాప్యధితిష్ఠతి.

46

రాఘవేణ యథా మాతా సుమిత్రా లక్ష్మణేన చ,
భరతేనేవ కైకేయీ జీవపుత్రాస్తథా స్త్రియః.

47

శ్రుత్వా రామాయణమిదం దీర్ఘమాయుశ్చ విన్దతి,
రామస్య విజయం చైవ సర్వమక్లిష్టకర్మణః.

48

శృణోతి య ఇదం కావ్యమార్షం వాల్మీకినా కృతమ్,
శ్రద్ధధానో జితక్రోధో దుర్గాణ్యతితరత్యసౌ.

49

సమాగమం ప్రవాసాన్తే లభతే చాపి బాన్ధవైః,
ప్రార్థితాంశ్చ వరాన్ సర్వనాప్నుయాదిహ రాఘువాత్.

50

శ్రవణేన సురాస్సర్వే ప్రీయన్తే సంప్రశృణ్వతామ్,
వినాయకాశ్చ శామ్యన్తి గృహే తిష్ఠన్తి యస్య వై.

51

విజయేత మహీం రాజా ప్రవాసీ స్వస్తిమాన్వ్రజేత్,
స్త్రీయో రజస్వలాః శ్రుత్వా పుత్రాన్సూయురనుత్తమాన్.

52

పూజయంశ్చ పరంశ్చేమమితిహాసం పురాతనమ్,
సర్వపాపాత్ప్రముచ్యేత దీర్ఘమాయురవాప్నుయాత్.

53

ప్రణమ్య శిరసా నిత్యం శ్రోతవ్యం క్షత్రియైర్ద్విజాత్,
ఐశ్వర్యం పుత్రలాభశ్చ భవిష్యతి న సంశయః.

54

రామాయణమిదం కృత్నం శృణ్వతః పఠతస్సదా,
ప్రీయతే సతతం రామస్స హి విష్ణుస్సనాతనః.

55

ఆదిదేవో మహాబాహుర్హరిర్నారాయణః ప్రభుః,
కుటుమ్బవృద్ధిం ధనధాన్యవృద్ధిం
స్త్రియశ్చ ముఖ్యాస్సుఖముత్తమం చ,
శ్రుత్వా శుభం కావ్యమిదం మహార్థం
ప్రాప్నోతి సర్వాం భువి చార్థసిద్ధిమ్.

56

ఆయుష్యమారోగ్యకరం యశస్యం

సౌభ్రాతృకం బుద్ధికరం సుఖం చ,
శ్రోతవ్యమేతన్నియమేన సద్భి
రాఖ్యానమోజస్కరమృద్ధికామైః.

57

ఏవమేతత్పురావృత్తమాఖ్యానం భద్రమస్తు వః,
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్.

58

దేవాశ్చ సర్వే తుష్యన్తి శ్రవణాద్గ్రహణాత్తథా,
రామాయణస్య శ్రవణాత్తుష్యన్తి పితరస్తథా.

59

భక్త్యా రామస్య యే చేమాం సంహితామృషిణా కృతామ్,
లేఖయన్తీహ చ నరాస్తేషాం వాసస్త్రివిష్టపే.

60

(యుద్ధకాండ 131వ సర్గలోని 59వ శ్లోకం నుండి పొందుపరచబడినది)

Footnotes

1. 158–166 వరకు గల శ్లోకాలు ప్రక్షిప్తాలు. హనుమంతుడు తొంభై యోజనాలు విస్తరించాడంటే సముద్రం ఈ తీరంనుండి ఆ తీరం వరకు వ్యాపించినట్లే అవుతుంది. అలాంటప్పుడు ఎగర వలసిన అవసరం లేదు. కనుక ఈ శ్లోకాలు అసంగతాలు.

1 వాహిని = 81 ఏనుగులు, 81 రథాలు, 243 గుర్రాలు, 405 కాలిబంట్లతో కూడుకొన్న ఒక సేనావిభాగం.

1 త్రేతాగ్నులు: దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆవహనీయాగ్ని.

1 పూర్వం ఒకప్పుడు వృత్రాసురుని హతమార్చి ఇంద్రుడు బ్రహ్మహత్యాపాపానికి గురి అయ్యాడు.దాంతో ఇంద్రుని ఐశ్వరం పాతాళానికి వెళ్ళిపోయింది. దేవతలు వైష్ణవ అశ్వమేధ యాగం నిర్వర్తించి ఇంద్రుణ్ణి మళ్ళీ పునీతుని గావించారు. తరువాత విష్ణువు పాతాళం నుండి ఇంద్రుని ఐశ్వర్యాన్ని తీసుకువచ్చి అతడికి అప్పగించాడు. (బ్రహ్మపురాణం)

1 అష్టమి, చతుర్దశి, పౌర్ణమి, అమావాస్య, పాడ్యమి దినములలో వేదాధ్యయనం నిషిద్ధం. కాదు కూడదని చేస్తే అధ్యయనం నిస్సారమైనదవుతుంది.